# అధ్యాయం 4 – అలాతశాంతి ప్రకరణం

మొదటి మూడు అధ్యాయాలలో, గౌడపాదాచార్యులవారి కారికల సహాయంతో మనం మాండూక్యోపనిషత్‌యొక్క తాత్పర్యాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాము. మాండూక్యోపనిషత్ సారాంశం –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

మూడవ అధ్యాయంలో బ్రహ్మ సత్యం ఎలాగో వివరించి, అద్వైతమే సత్యం అని చివరి కారికలో ముగించారు గౌడపాదాచార్యులవారు.

**ఏతత్తదుత్తమం సత్యం యత్ర కించిన్న జాయతే** – 3.48

ఈ కార్యకారణ విలక్షణ అద్వైత తురీయ ఆత్మ, ఏడవమంత్రంలో తురీయంగా పేర్కొనబడిన ఆత్మే పారమార్థిక సత్యం.

జగన్మిథ్యా అంశాన్ని రెండవ అధ్యాయంలో వివరించారు గౌడపాదాచార్యులవారు. ఆ అధ్యాయం పేరు వైతథ్య ప్రకరణం. దాని అర్థం మిథ్యాత్వం. జగత్ మిథ్య అన్నప్పుడు జగత్తును రెండు స్థాయిలలో చూస్తాము.

1. స్వప్నావస్థలో కనిపించే ద్వైతస్వప్నప్రపంచం
2. జాగ్రదావస్థలో కనిపించే ద్వైతజాగ్రత్‌ప్రపంచం

మనం స్వప్నం మిథ్య అని తేలికగా అంగీకరిస్తాము కాని, స్వప్నం కూడా సత్యం అంటారు కొందరు దార్శనికులు. అందువల్ల గౌడపాదాచార్యులవారు, రెండవ అధ్యాయంలో ముందు స్వప్నం మిథ్య అని నిరూపించాక, స్వప్నప్రపంచం లాగానే, జాగ్రత్‌ప్రపంచం కూడా మిథ్య అని నిరూపించారు. అసలు ఆ మాటకొస్తే, ద్వైతమే మిథ్య అని నిరూపించారు.

ఇదంతా విన్నాక, నేను సత్యమా, మిథ్యనా అనే సందేహం కలిగే అవకాశం ఉంది. దానికి గౌడపాదాచార్యులవారు వెంటనే జవాబు చెప్పకుండా, ఎదురు ప్రశ్నిస్తారు? 'నేను' అంటే మీ ఉద్దేశ్యంలో 'ఆ నేను ఎవరు?' నేను స్థూలశరీరం అన్నా, నేను సూక్ష్మశరీరం అన్నా కూడా, మీరు మిథ్యలోకి వస్తారు. నేను కారణశరీరం అని అనలేరు, ఎందుకంటే అప్పుడు మీరు గాఢనిద్రలో ఉంటారు. ఒకవేళ నేను కారణశరీరం అని అనుకున్నా కూడా మీరు మిథ్యలోకే వస్తారు.

నేను ఈ మూడు శరీరాలను కాదు, వీటికి విలక్షణంగా ఉన్న సాక్షి చైతన్యాన్ని లేదా తురీయాన్ని అని అంటే, మీరు సత్యంలోకి వస్తారు. లక్ష్యార్థంగా చూస్తే మీరు సాక్షిచైతన్యం. సాక్షిచైతన్యం అంటే బ్రహ్మ. బ్రహ్మ సత్యం కాబట్టి మీరు కూడా సత్యం.

అందువల్ల నేను శరీరాలను కాదు, నేను చైతన్యాన్ని అని అర్థం చేసుకోండి. చెతన్యపరంగా 'అహం బ్రహ్మ అస్మి' అని చెప్పగలగటం కూడా నేర్చుకోండి. అద్వైతచైతన్యం అయిన నాలోనే ఈ మిథ్యా జాగ్రద్‌ప్రపంచం, మిథ్యా స్వప్నప్రపంచం ఉన్నాయి. మిథ్యా ద్వైతప్రపంచం ఉన్నా, లయమయినా, నేను మాత్రం నిత్యంగా ఉంటాను.

**అసంగోఽహమ్ అసంగోఽహమ్ అసంగోఽహం పునః పునః**

నేను నిత్యం, అసంగం. మూడు అధ్యాయాల్లోనూ చెప్పిన ఈ బోధను జీర్ణించుకుంటే మీరు జీవన్ముక్తులు అవుతారు. దీనితో మాండూక్యోపనిషత్‌లోని ప్రాథమిక బోధ ముగిసింది. నిజానికి మూడవ అధ్యాయంతో ఈ ఉపనిషత్తును ముగించవచ్చు.

మూడవ అధ్యాయంతోనే బోధ ముగిస్తే, నాలుగవ అధ్యాయంయొక్క ప్రయోజనం ఏమిటి? దానికి జవాబు – శ్రవణం దశలోనే నిస్సంశయజ్ఞానం పొందితే, ఆ జ్ఞానమే మిమ్మల్ని జీవన్ముక్తులను చేస్తుంది. కాని, చాలామంది అంత త్వరగా, అంత తేలికగా ఈ జ్ఞానాన్ని జీర్ణించుకోలేరు. జ్ఞానాన్ని పూర్తిగా జీర్ణించుకోలేకపోతే, జ్ఞానఫలమైన జీవన్ముక్తినీ అనుభవించలేరు.

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా అహం బ్రహ్మైవ నాపరః**

ఇక్కడ కావాలనే జీవః అనకుండా అహం పదం వేశాము. నేనేంటి బ్రహ్మ ఏమిటి అనే సందేహం పట్టి పీడిస్తుంది చాలామందిని. ఈ వాక్యంలోని మూడు భాగాలూ సందేహమే కొందరికి. కంటికి ఎదురుగా కనిపిస్తున్న జగత్తేమో లేదంటారు, ఉన్నాడో లేదో తెలియని బ్రహ్మను సత్యం అంటారు. ఇదెలా సాధ్యం అంటారు కొందరు. కొందరు జగత్తును మిథ్యగా ఎలాగో నమ్మినా, వారు బ్రహ్మ ఉనికినే నమ్మరు. బ్రహ్మ ఉన్నాడంటేనే కదా సత్యమో, మిథ్యో అనగలిగేది. సరే బ్రహ్మను కూడా సత్యంగా ఒప్పుకున్నా, నేను బ్రహ్మ అనటం పెద్ద తప్పు అంటారు మరికొందరు.

ఇలా మూడూ నమ్మకపోయినా, ఏ ఒక్కటి నమ్మకపోయినా కూడా ఆ జ్ఞానం సంశయ జ్ఞానం కిందికి వస్తుంది. సంశయజ్ఞానానికి, అజ్ఞానానికీ మధ్య ఏమీ భేదం లేదు. అటువంటి జ్ఞానం ఉన్నా లేనట్టే అవుతుంది. అందువల్ల శాస్త్రమూ, గురువు కూడా ఇలా వచ్చే సందేహాలను కూకటివేళ్ళతో సహా పెకళించి వేయకపోతే, ఆ జ్ఞానాన్ని జీర్ణించుకోలేరు వారు. సంశయజ్ఞానం ఎన్నడూ మోక్షాన్నివ్వలేదు.

జ్ఞానానికి పెద్ద ప్రతిబంధకం, సందేహమే. ఈ సందేహాన్ని పారద్రోలటానికి శాస్త్రం నిర్దేశించిన మార్గం **మననం**. ఆ విధంగా శ్రవణం అజ్ఞాననివృత్తి చేస్తే, మననం సంశయ నివృత్తి చేస్తుంది. మాండూక్య కారికలలో మొదటి మూడు అధ్యాయాలు శ్రవణ ప్రధానంగా

ఉన్నాయి. మూడవ అధ్యాయం చివర్లో నిదిధ్యాసనం కూడా వచ్చింది. ఇప్పుడు ఈ నాలుగవ అధ్యాయం మనన ప్రధానంగా ఉంటుంది. మనకు రాగలిగే సందేహాలన్నింటినీ పారద్రోలి, నిస్సంశయజ్ఞానాన్ని కలగజేస్తుంది.

ఈ సందేహాలు బుద్ధిలో కలుగుతాయి. అది మీ బుద్ధిలో కావచ్చు, ఎదుటివారి బుద్ధిలో కావచ్చు. ఒక్కోసారి మీకే కొన్ని సందేహాలు వస్తాయి. ఒక్కోసారి మీకేమీ సందేహం రాకపోవచ్చు కాని మీరు వేదాంతం గురించి ఎవరితోనైనా మాట్లాడితే వారు కొన్ని సందేహాలను మీ మెదడులో ప్రవేశపెట్టవచ్చు. వాటికి మీకు జవాబులు తెలియకపోవచ్చు. ఇలాంటి సందర్భాలలో మీరు రెండు రకాలుగా స్పందించవచ్చు. మీకు జవాబు తెలియకపోతే, వారిని ఏదో తికమకపెట్టి కప్పదాటు వ్యవహారం చూపవచ్చు. లేదా ఏదో మీకు తోచిన జవాబు చెప్పి, అప్పటికి తప్పించుకోవచ్చు. దాన్ని మసి పూసి మారేడుకాయ చేయటం అంటారు. ఏదో అప్పటికి వారి బారినుంచి తప్పించుకుంటారు కాని, మీకే ఆ జవాబు తృప్తిగా ఉండకపోవచ్చు. వీటన్నిటి సారాంశం, ఎదుటివారి మాట పక్కనపెడితే, ముందు మీ బుద్ధి, బుద్ధిగా ఈ జ్ఞానాన్ని నిస్సంశయజ్ఞానంగా మలుచుకోవాలి.

మనకు అద్వైతం కాక పదకొండు దర్శనాలు ఉన్నాయి. తక్కిన దర్శనాలు అద్వైత వేదాంతాన్ని స్వీకరించవు. వారు అద్వైతంలో ఉన్న లొసుగులను ఎత్తిచూపుతూ ఉంటారు. అద్వైతాన్ని నిలబెట్టాలంటే, వారు చేసే వాదనలను ఖండించి, అద్వైతమే అంతిమ సత్యం అని నిరూపించాలి. ఈ అధ్యాయంలో కొన్ని దర్శనాలను తీసుకుని వాటిని ఖండించటం జరిగింది. మన బుద్ధి తక్కిన దర్శనాలను ఖండించగలగాలి. ఎదుటివారు వేసే ప్రశ్నలను ఎదుర్కోలేకపోతే, మన జ్ఞానం చెదిరిపోయే అవకాశం ఉంది. అది కూడా ప్రమాదమే.

అద్వైతం కాక మనకు ఉన్న పదకొండు దర్శనాలను రెండు తెగల కింద విభజించవచ్చు.

**1. తర్కమాత్ర దర్శనాని – వీరు తర్కాన్నే నమ్ముతారు, శాస్త్రాన్ని కాదు.**

**2. తర్కప్రధాన దర్శనాని – వీరు తర్కానికి పెద్దపీట వేస్తారు, శాస్త్రానికి కాదు.**

తర్కమాత్ర దర్శనానిలో, ఈ దార్శనికులను నాస్తికులు అంటారు. వీరు శాస్త్రాన్ని నమ్మరు. వీరి వాదన పూర్తిగా తర్కాన్ని ఆధారంగా చేసుకుని ఉంటుంది. ఈ దర్శనాలు ఆరు. అవి చార్వాక దర్శనం, జైనదర్శనం, నాలుగు బౌద్ధదర్శనాలు. చార్వాక దర్శనాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది చార్వాకుడు; జైనమతాన్ని దర్శించింది ఋషభదేవుడు; దాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది వర్ధమాన మహావీరుడు. బౌద్ధమతాన్ని దర్శించింది బుద్ధదేవుడు.

తర్క ప్రధాన దర్శనానిలో, ఈ దార్శనికులను ఆస్తికులు అంటారు. వీరు శాస్త్రాన్ని నమ్ముతారు. వీరి వాదన శాస్త్రాన్ని ఆధారంగా చేసుకునే ఉంటుంది కాని, వీరు తర్కానికే పెద్ద పీట వేస్తారు. శాస్త్రమా, తర్కమా అని సందేహం వచ్చినచోట శాస్త్రాన్ని పక్కనపెట్టేసి,

తర్కానికే పెద్దపీట వేస్తారు. నాస్తికులు అసలు వేదాన్నే నమ్మకపోతే, ఆస్తికులు వేదాన్ని నమ్ముతారు కాని, వారు వేదాన్ని వారి తర్కానికి అనువుగా ఉండేలాగా మలచుకుంటారు. ఈ దర్శనాలు నాలుగు. అవి సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక దర్శనాలు. వాటి దార్శనికులు వీరు.

**సాంఖ్య దర్శనం – కపిల ముని**

**యోగ దర్శనం – పతంజలి ముని**

**న్యాయ దర్శనం – గౌతమ ముని**

**వైశేషిక దర్శనం – కణాద ముని**

ఈ పదీ కాక, తక్కిన రెండూ వేదపూర్వ దర్శనం, అద్వైత సిద్ధాంతం. వేదపూర్వదర్శనాన్ని జైమిని ముని దర్శిస్తే, అద్వైత సిద్ధాంతాన్ని నిలబెట్టింది వ్యాసాచార్యులవారు.

ముందు చెప్పిన పది దార్శనికులూ, అద్వైతాన్ని తర్కపరంగా ఖండిస్తారు. వీరి వాదనలనుంచి అద్వైతాన్ని కాపాడకపోతే, మనం పొందిన జ్ఞానం చెదిరిపోతుంది. వీరి వాదనలను రెండు విధాలుగా ఎదుర్కొంటారు మన సిద్ధాంతులు.

1. డిఫెన్సివ్ మెథడ్ – అద్వైత వేదాన్ని సమర్థించటం
2. అఫెన్సివ్ మెథడ్ – ఎదుటివారి దర్శనాలలోని లొసుగులను ఎత్తిచూపటం

1. **డిఫెన్సివ్ మెథడ్** – తక్కిన దర్శనాలు అద్వైత వేదాంతాన్ని తర్కం ద్వారా మన సిద్ధాంతాన్ని ఖండిస్తే, మన చేతుల్లో ఉన్న ఆయుధమేమిటి? వేదాంతానికి తర్కంతో సంబంధం లేదు అంటాము. వేదాంతం తర్కం పరిధిలోకి రాదు. అందువల్ల వేదాంతాన్ని తర్కంతో నిరూపించలేము, ఖండించలేము, అసలు తర్కం ఉపయోగించారు అంటేనే వారు వేదాంతాన్ని అర్థం చేసుకోలేదని అర్థం అంటాము. ఎందుకంటే ఒక ప్రమాణం చెప్పిన జ్ఞానాన్ని ఇంకొక ప్రమాణం అవుననలేదు, కాదనలేదు.

ఉదాహరణకు కన్ను చూసినదాన్ని చెవితో నిరూపించలేము, ఖండించలేము. ఒక వస్తువును చూసి, కన్ను నీలిరంగులో ఉందని చెబితే, నాకు కన్నుకన్నా చెవులు బాగా పనిచేస్తాయి, నేను చెవులతో దాన్ని చూస్తాను అనటం హాస్యాస్పదంగా ఉంటుంది. ఒకవేళ కన్ను చూసిన రంగుమీద సందేహం ఉంటే, మళ్ళీ కళ్ళు నులుముకుని చూడటమో, కళ్ళజోడు పెట్టుకుని చూడటమో, కాంతి సరిగ్గా లేకపోతే ట్యూబ్‌లైట్ వేసి చూడటమో చేయాలి గాని, చెవులతో వింటాననకూడదు. అంటే కన్ను చూసినదాన్ని కన్నే అవుననో, కాదనో చెప్పాలి. దీని సూత్రం – ఒక ప్రమాణం చెప్పినదాన్ని ఇంకొక ప్రమాణం నిరూపించలేదు, ఖండించలేదు.

తర్కం ఒక ప్రమాణం, శాస్త్రం ఇంకొక ప్రమాణం. అవి రెండూ రెండు భిన్న రంగాల్లో పనిచేస్తాయి. అందువల్ల వేదాంతాన్ని తర్కంతో నిరూపించటం లేదా ఖండించటం అర్థంలేని పని.

వేదాంతం తర్క సమ్మతమూ కాదు, తర్కభిన్నమూ కాదు, తర్కానికి అతీతం. తర్కానికి అందేది తర్కసమ్మతం, తర్కానికి అందనిది తర్కభిన్నం. వేదాంతం తర్కానికి అతీతం.

**నైషా తర్కేణ మతిరాపనేయా** – కఠ

తర్కానికి అందని సత్యాన్ని తర్కం ద్వారా వాదిద్దామని చూసే ఈ పది దర్శనాలూ చేసే వాదనల్లో అర్థం లేదు. కన్ను చూసేదాన్ని చెవులతో విన్నట్టుగా ఉంటుంది ఇది.

మనం మనను ఎలా సమర్థించుకుంటాము? మీరు వాడే పరికరమే తప్పు అంటాము. ఒక వస్తువు బరువును కిలోల లెక్కలో చెబుతాము కాని స్కేలుతో కొలవము కదా!

2. **అఫెన్సివ్ మెథడ్** – వేదాన్ని తర్కంతో వాదించకూడదని మనం చెప్పినా కూడా తక్కిన దార్శనికులు ఒప్పుకోకపోగా, వారి వాదనలను మానరు కూడా. మనకు వారిని ఎదుర్కొనే సత్తా లేక, పలాయనవాదం చిత్తగిస్తున్నామంటారు. మనకు తర్కం రాదని మనను హేళన చేస్తారు. అలా మనను రెచ్చగొడుతూనే ఉంటారు.

అలాంటప్పుడు ఈ **అఫెన్సివ్ మెథడ్‌కు** దిగక తప్పదు. మనకు తర్కం తెలియక తర్కం వాడటం లేదు అనుకోవటం పొరపాటు. వేదాంతంలో తర్కం పనికిరాదు కాబట్టి వాడటం లేదు. నిజానికి బ్రహ్మసూత్రల్లో వ్యాసాచార్యులవారు ఒక అధికరణం మొత్తంలో అంతిమ సత్యాన్ని తెలుసుకోవటానికి తర్కం వాడకూడదు అని నిరూపించారు. బ్రహ్మసూత్రాల్లోని రెండవ అధ్యాయంలో వస్తుంది ఇది. అందులో వేదాంతికి తర్కం ఎంత బాగా వస్తుందో కూడా నిరూపిస్తారు. అంతేకాదు, తర్కంమీదే ఆధారపడిన తక్కిన దార్శనికులలో, వారి తర్కంలో ఎన్ని లొసుగులు ఉన్నాయో ఎత్తి చూపిస్తారు. వారి తర్కంలో అన్ని లొసుగులు పెట్టుకుని మన తర్కాన్ని విమర్శించే హక్కు వారికి లేదని నిరూపిస్తారు. ముందు మిమ్మల్ని మీరు దిద్దుకుని తర్వాత మా దగ్గరికి రండి అంటారు. అందువల్ల ఈ రెండవ పద్ధతిలో, తర్కం ఉపయోగించే తక్కిన దర్శనాలను ఖండించి, తర్కం ద్వారా అంతిమసత్యాన్ని పొందలేము అని నిరూపిస్తాము.

మాండూక్యోపనిషత్‌లో ఈ నాలుగవ అధ్యాయంలో గౌడపాదాచార్యులవారు, వీటిలో కొన్ని దర్శనాలను ఖండించుకు వస్తారు. అవి సాంఖ్య–యోగదర్శనం, న్యాయ–వైశేషిక దర్శనం, బౌద్ధదర్శనం.

వేదాంతం ప్రత్యేకత ఏమిటంటే – వేదాంతానికి ఉపనిషత్ ప్రాథమిక ప్రమాణం. తర్కం కూడా వాడతాము కాని, మనం శాస్త్రానికే పెద్దపీట వేస్తాము. తక్కిన ఆస్తిక దార్శనికులు తర్కానికి పెద్దపీట వేస్తే, మనం శాస్త్రానికి పెద్దపీట వేసి, తర్కాన్ని వేదాంతం అర్థం చేసుకోవటానికి వాడతాము. దాన్ని **శాస్త్రసమ్మత తర్కం** అంటారు. ఆస్తికులది తర్క ప్రధానం; నాస్తికులది తర్కమాత్ర వాదన.

నాలుగవ అధ్యాయం ఈ దార్శనికులను ఖండిస్తుంది కాబట్టి దీనిని మనన ప్రధాన అధ్యాయం అంటారు. ఇది ముందు అధ్యాయాలకన్నా పెద్దది. ఇందులో 100 కారికలు ఉన్నాయి.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా 9 అంశాలుగా విభజించవచ్చు. అవి –

| | |
|---|---|
| 1. మంగళాశాసనము | – కారికలు 1, 2 |
| 2. పరమత ఖండనలు | – కారికలు 3–28 |
| 3. వేదాంతసారం | – కారికలు 29–46 |
| 4. అలాత దృష్టాంతం | – కారికలు 47–56 |
| 5. వేదాంతసారం ఇంకొకసారి | – కారికలు 57–74 |
| 6. సంసార కారణం, సంసారనివృత్తి సాధనం | – కారికలు 75–86 |
| 7. మాండూక్యోనిషత్ సారం | – కారికలు 87–89 |
| 8. సాధనలు | – కారిక 90 |
| 9. ఉపసంహారం | – కారికలు 91–100 |

ఈ అధ్యాయంలో మొదటిభాగం ముఖ్యాంశం పరమత ఖండనలు. తర్వాత భాగంలో వేదాంతసారాన్ని రెండుసార్లు, మాండూక్యోపనిషత్ సారాన్ని కూడా చర్చిస్తారు. ఎందుకంటే పరమత ఖండనలో పడిపోయి, మన సిద్ధాంతం ఏమిటో మనం మర్చిపోయే ప్రమాదం ఉంది.

వేదాంతాన్ని వివరించటానికి ఇక్కడ అలాత దృష్టాంతం ఇస్తారు గౌడపాదాచార్యులవారు. అలాతం అంటే కాగడా లేదా దివిటీ. అలాతం వెలిగినప్పుడు వచ్చే ఆకారాలను, అది ఆగిపోయినప్పుడు (అలాతశాంతి) మాయమయిన ఆకారాలనూ ఉదాహరణగా తీసుకుని వివరించుకు వస్తున్నారు కాబట్టి ఈ అధ్యాయానికి **అలాతశాంతి ప్రకరణం** అనే పేరు వచ్చింది. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడదాము.

**కారిక 4.1**

**జ్ఞానేనాకాశకల్పేన ధర్మాన్ యో గగనోపమాన్ ।**
**జ్ఞేయాభిన్నేన సంబుద్ధస్తం వందే ద్విపదాం వరమ్ ॥**

1. **మంగళాచరణం - కారికలు 1, 2**

మంగళాచరణం అంటే ప్రార్థన. మొదటి రెండు కారికల్లో గౌడపాదాచార్యులవారు బ్రహ్మవిద్యను నేర్పించిన ఆదిగురువైన నారాయణునికీ, సాక్షాత్ బ్రహ్మవిద్యకూ నమస్కారం చేస్తున్నారు.

మొదటి కారికలో గురురూపనారాయణ నమస్కారం చేస్తున్నారు. నారాయణుడు సర్వజ్ఞుడు కాబట్టి ఆయనకు జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం కూడా ఉంటుంది. వేదాంతసారం ఈ ఐక్యజ్ఞానమే. అదే గురుశిష్యపరంపరగా నారాయణుణ్ణుంచి వచ్చింది.

జీవాత్మ అయిన నేను, జీవాత్మ-పరమాత్మ ఐక్యజ్ఞానం పొందినప్పుడు, జీవాత్మ అయిన నేను పరమాత్మతో ఐక్యం అనే జ్ఞానాన్ని పొందాను అంటాను. అదే పరమాత్మపరంగా చూస్తే పరమాత్మ ఏమంటాడు? పరమాత్మ అయిన నేను, జీవాత్మా ఒకటే అంటాడు. దీన్ని ఐక్యజ్ఞానం అంటారు. ఈ ఐక్యజ్ఞానం ఉన్న పరమాత్మకు నా నమస్కారములు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

ఇంకొక ప్రత్యేకతని వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. మనం నేర్చుకునే లౌకిక విద్యకు త్రిపుటి ఉంటుంది. త్రిపుటి అంటే మూడు అంశాలు కలిసివుంటాయి. ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం. ప్రమాతా అంటే నేర్చుకునే నేను, ప్రమేయం అంటే నేను నేర్చుకునే వస్తువు; ప్రమాణం అంటే ఆ వస్తువు గురించి నేను నేర్చుకోవటానికి వాడే పరికరం. ఉదాహరణకు ప్రమాత అయిన నేను ఒక పండు అనే ప్రమేయం గురించి, కన్ను అనే ప్రమాణాన్ని ఉపయోగించి నేర్చుకుంటాను. ఈ లౌకికజ్ఞానాన్ని అపరావిద్య అంటారు.

ఆత్మజ్ఞానాన్ని పరావిద్య అంటారు. పరావిద్య ప్రత్యేకత ఏమిటంటే - అందులో ఈ త్రిపుటి లేదు. ప్రమాతా, ప్రమేయం, ప్రమాణం మూడూ ఒకటే. జీవాత్మ పరమాత్మ గురించి తెలుసుకుంటుంది. ఏమని? చైతన్యపరంగా జీవాత్మ, పరమాత్మ ఒకటేనని. అందువల్ల జీవాత్మ చైతన్యస్వరూపం, పరమాత్మ చైతన్యస్వరూపం, ప్రమాణం కూడా చైతన్యస్వరూపమే. నారాయణునికి ఈ ఐక్యజ్ఞానం ఉంది. చైతన్యం స్వరూపం ఏమిటి?

**గగనోపమాన్** - ఆకాశంతో పోలుస్తున్నారు గౌడపాదాచార్యులవారు. గగనం అంటే ఆకాశం; ఉపమాన్ అంటే పోలిక.

**ద్విపదాం వరమ్** – నారాయణుడు. ద్విపద అంటే రెండు పాదాలు ఉన్న అంటే మనుష్యుడు. రెండు కాళ్ళు కాకికి కూడా ఉన్నాయి. కాని కాకిని తీసుకోకూడదు. ఇక్కడ మనుష్యుడు. పరమ్ అంటే శ్రేష్ఠం. అందువల్ల ద్విపదాం వరమ్ అంటే పురుషులలో ఉత్తముడైన పురుషోత్తమునికి నా నమస్కారములు. పురుషోత్తముడు అంటే విష్ణుమూర్తి, నారాయణుడు.

ఈ కారికలో సంస్కృతపదాలు కష్టంగా అనిపిస్తాయి కాబట్టి దీని తాత్పర్యం మాత్రమే చూద్దాము. ఆకాశంవంటి చైతన్యం, ఆకాశంవంటి చైతన్యం గురించి, ఆకాశంవంటి చైతన్యం అనే ప్రమాణంతో తెలుసుకుంటుంది. అటువంటి ఐక్యజ్ఞానం ఉన్న నారాయణునికి నా ప్రమాణాలు.

### కారిక 4.2

**అస్పర్శయోగో వై నామ సర్వసత్త్వసుఖో హితః ।**
**అవివాదోఽవిరుద్ధశ్చ దేశితస్తం నమామ్యహమ్ ॥**

ఈ కారికలో సాక్షాత్ ఆత్మవిద్యకే నమస్కారం చేస్తున్నారు గౌడపాదాచార్యులవారు. అందువల్ల ఆత్మజ్ఞానాన్ని స్తుతిస్తున్నారు. దానికి ఆరు గుణాలను పేర్కొంటున్నారు. అవి –

1. అస్పర్శయోగః – అసంగ ఆత్మ
2. సర్వసత్త్వసుఖః – దుఃఖం లేని పూర్ణత్వాన్ని ఇస్తుంది
3. హితః – ఆనందాన్ని, మేలును కలుగజేస్తుంది
4. అవివాదః – వాదనలకు అతీతంగా ఉంది
5. అవిరుద్ధః – విరోధాలు లేనిది
6. దేశితః – గురువు ద్వారా నేర్చుకోవలసినది

**నమామ్యహమ్** – అటువంటి ఆత్మజ్ఞానానికి నేను నమస్కారం చేస్తున్నాను.

ఇప్పుడా గుణాలను వివరంగా చూద్దాము.

1. **అస్పర్శయోగః** – ఆత్మజ్ఞానాన్ని అస్పర్శయోగం అంటారు. ఆత్మజ్ఞానాన్ని అస్పర్శయోగం అని ఎందుకంటారో, మనం మూడవ అధ్యాయంలోనే చూశాము.

**అస్పర్శయోగో వై నామ దుర్దర్శః సర్వయోగినామ్ ।**
**యోగినో బిభ్యతి హ్యస్మాదభయే భయదర్శినః ॥** – 3.39

అస్పర్శ అంటే దేనితోనూ సంగత్వం లేనిది. తురీయచైతన్యానికి దేనితోనూ సంబంధం ఎందుకు లేదంటే ఉన్నదొకటే ఆత్మ కాబట్టి. అద్వైత ఆత్మ అంటే రెండవది లేనిది అని అర్థం. సంబంధం ఉండాలంటే రెండు ఉండాలి. జగత్తు, మనుష్యులు ఉన్నారు కదా అంటే

తురీయస్థాయినుంచి చూస్తే, అవి లేనట్టే. జగత్తు, మనుష్యులు వ్యావహారిక స్థాయికి చెందితే, తురీయం పారమార్థిక స్థాయికి చెందుతుంది.

అందువల్ల తురీయానికి విశ్వ–విరాట్ జంటతోనూ; తైజస–హిరణ్యగర్భ జంటతోనూ; ప్రాజ్ఞ–ఈశ్వర జంటతోనూ సంబంధం లేదు. అవన్నీ మిథ్యలోకి వస్తాయి. జాగ్రత్ పురుషుడు స్వాప్నికునితో సంబంధం పెట్టుకోలేనట్టుగా, సత్యతురీయం మిథ్యాజగత్తుతో సంబంధం పెట్టుకోలేదు. అందువల్ల అసంగ ఆత్మ అనేది మొదటి గుణం.

**అసంగోఽహమ్ అసంగోఽహమ్, అసంగోఽహం పునః పునః**

ఒక్కముక్కలో చెప్పాలంటే నేను **అద్వైత ఆత్మను**.

**వై నామ** – అస్పర్శయోగం అనేది ఆత్మయొక్క ప్రసిద్ధి చెందిన నామం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. కాని మనం ఎక్కువగా వాడే పేరు అసంగ ఆత్మ.

2. **సర్వసత్త్వసుఖః** – ఈ ఆత్మజ్ఞానం సుఖాన్నిస్తుంది. సుఖం అంటే ఆనందం, పూర్ణత్వం. ఎవరికి ఇస్తుంది?

సర్వసత్త్వ – ప్రతి ఒక్క మనిషికీ. ఇక్కడ సత్త్వ అంటే సత్త్వగుణం కాదు, జీవం ఉన్న మనిషి. ప్రతి మనిషికీ ఆత్మ ఆనందాన్నిస్తుంది.

ఆత్మ ఆనందాన్నిస్తుందని అంత గొప్పగా చెప్పేందుకు ఏముంది? ప్రపంచంలో ఎన్నో వస్తువులు మనకు ఆనందాన్ని ఇస్తాయి. భార్య, పిల్లలు, దీపావళి పిండివంటలు – ఎన్నో ఉన్నాయి, చెప్పుకుంటూ పోతే, అనవచ్చు మీరు.

లౌకిక ప్రపంచంలో ఇలా ఎన్నో వస్తువులు ఆనందాన్నిస్తాయి నిజమే కాని, అక్కడ ఆనందాన్ని వెన్నంటే తలనొప్పి కూడా ఉంటుంది. ఎవరో అన్నారు, 'పిల్లలు దగ్గర లేకపోతే గుండెనొప్పి తెప్పిస్తారు; దగ్గర ఉంటే తలనొప్పి తెప్పిస్తారు.' అసలు ఈ పుత్రుడు పుట్టకుండా ఉంటే బాగుండేది అనిపించే సందర్భం ఎప్పుడైనా రావచ్చు. ఈ మాట కౌసల్యాదేవి కూడా అనుకుందిట. ఎప్పుడు? రాముని ఆటపాటలు చూసి ఎంతో మైమరచిపోతుండేది కౌసల్య. రామునికి పట్టాభిషేకం అనగానే ఎంతో మురిసిపోయింది. కాని కొన్ని గంటలు కూడా గడువకముందే రాముడు వనవాసం చేయటానికి వెళుతున్నానంటే ఆవిడ దుఃఖం చెప్పనలవికానిది. ఇంత కష్టపడి యాగం చేసి కన్నది, ఇలా పోగొట్టుకోవటానికా అని చాలా బాధపడింది ఆమె. రాముడు పుట్టకపోయి ఉంటే, ఈరోజు ఇలా దుఃఖం కలిగివుండేది కాదుకదా అని విలపించింది. కనీసం రాముడు మంచి బాలుడు కాకపోయినా, ఆ ఎడబాటు ఆవిడకు అంత దుఃఖాన్ని కలిగించేది కాదు. అంత సర్వగుణాభిరాముణ్ణి అన్ని సంవత్సరాలు వదులుకుని ఉండాలంటేనే ఆవిడ భరించలేకపోయింది.

ఆ విధంగా లౌకిక జీవనంలో ప్రతి వస్తువూ సుఖహేతువే కాదు, దుఃఖహేతువు కూడా. ప్రతి కర్మఫలం కూడా దుఃఖమిశ్రితం అంటుంది వేదాంతం. అందువల్ల ఎవరైనా మిమ్మల్ని, మీకు ఆనందం కలిగించేవి, మీకు దుఃఖం కలిగించేవి రాయండి అంటే, మీరు రెండు భిన్న పట్టికలుగా రాయనవసరం లేదు – **ఆనందహేతువు, దుఃఖహేతువు** అని ఒకటే పేరు కింద రాయవచ్చు అంటుంది వేదాంతం.

మీ దగ్గర ఉన్న వస్తువు ఇప్పుడు ఆనందం ఇస్తే, అది మీకు దూరమయితే దుఃఖహేతువు అవుతుంది. అలాగే మీకు ఒక వస్తువు దుఃఖాన్ని కలిగిస్తే, అది మీకు దూరమయితే, ఆనందహేతువు అవుతుంది.

ఈ విషయం, ఈ కథ వింటే బాగా అర్థమవుతుంది. నసీరుద్దీన్ ముల్లామీద అనేక కథలు ఉన్నాయి. అతను చాలా ఇరుకైన బూట్లు వేసుకుంటుండేవాడు. ఉదాహరణకు అతని బూటు నంబరు ఏడు అయితే, అతను ఆరో నంబరు తీసుకునేవాడు. ఆ బూట్లు అతని కాలును కరుచుకున్నట్టు ఉండేవి. అది చాలక అతను ఇంకా గట్టిగా లేసులు కట్టుకునేవాడు.

ఎవరో అడిగారు, 'ఓ ముల్లా! ఎందుకంత చిన్న బూట్లు కొనుక్కుని, అంత గట్టిగా కట్టుకుంటావు?' దానికి అతను చెప్పిన జవాబేమిటో తెలుసా? 'రోజంతా అవి వేసుకుని తిరిగి, అవస్థపడి, ఇంటికి తిరిగివచ్చాక, ఆ బూట్లు విప్పితే కలిగే ఆనందం ఉంటుందీ, అది నేను మాటల్లో చెప్పలేను.' అందువల్ల ఆనందం ఇవ్వని వస్తువంటూ ఏదీ లేదు. ఒక మేధావి అన్నాడు, 'కొందరు వచ్చి ఆనందాన్నిస్తే, కొందరు వెళ్ళి ఆనందాన్నిస్తారు.'

అలా అన్నీ ఆనందాన్నిస్తాయి కాని, అన్నివేళలా ఆనందాన్ని మాత్రమే ఇవ్వవు. ఆనందాన్ని వెన్నంటే దుఃఖాలను కూడా తీసుకువస్తాయి. అందువల్లనే దుఃఖమిశ్రితం అన్నారు. కాని ఆత్మ ఒక్కటే దుఃఖంలేని పూర్ణత్వాన్నిస్తుంది.

3. **హితః** – ఆత్మజ్ఞానం ఆనందాన్ని మాత్రమే కాదు, హితాన్ని కూడా చేకూరుస్తుంది. ఎందుకు ఈ విషయాన్ని ప్రత్యేకించి చెబుతున్నారు గౌడపాదాచార్యులవారు? ఎందుకంటే జీవితంలో మనకు ఆనందాన్ని ఇచ్చేవన్నీ మనకు శ్రేయస్కరమైనవి కాకపోవచ్చు. ఇంకా చెప్పాలంటే శ్రేయస్కరం కావు. స్వీట్లు, చాక్లెట్లు ఆనందాన్నిస్తాయి కాని ఆరోగ్యకరం కాదు; సిగరెట్ కాల్చే వ్యక్తి గుప్పున పొగవదలటంలో ఆనందాన్ని అనుభవిస్తాడు కాని, పొగతో పాటే అతని ఆరోగ్యం కూడా కొంచెం కొంచెం మాయమవుతూ ఉంటుంది. అది సుఖం అవుతుందే కాని, హితం కాదు. అలాగే మద్యం. స్వర్గద్వారాలను తెరుస్తుంది మద్యం అంటారు మద్యానికి బానిసలు. కాని ఆ తెరుచుకునే ద్వారాలు నరకద్వారాలని వారికి

తెలియదు పాపం. అలా ఎన్నైనా చెబుతూ పోవచ్చు. ఒక వస్తువు సుఖహేతువు అయినంత మాత్రాన అది హితం కావాలనే నియమమేమీ లేదు.

అలాగే దుఃఖాన్ని కలగజేసేవి హితమైనవి ఉంటాయి. కాకరకాయరసం ఆరోగ్యానికి మంచిది, కాని దాన్ని ఇష్టపడరు ఎవరూ; వ్యాయామం, నడక, యోగాసనాలు ఆరోగ్యానికి మంచివి, వాటినుంచి పారిపోవటానికి చూస్తారు చాలామంది. అలా ఎన్నో వస్తువులు మనకు ఇష్టం కాని అవి మంచివి కావు; మనకు మంచివయ్యేవి మనకు ఇష్టం కాదు. వేదాంతం ఒక్కటే ఆనందాన్ని, హితాన్ని కూడా ఇస్తుంది. అది ఆనందాన్ని ఇస్తుంది, మేలు చేస్తుంది, పూర్ణత్వాన్ని ఇస్తుంది, మోక్షాన్ని కూడా ఇస్తుంది. ఆ విధంగా ఆనందాన్ని, మేలును కలుగజేస్తుంది.

4. **అవివాదః** – వాదనలకతీతంగా ఉంటుంది. వాదనలు చేస్తే మెదడు వేడెక్కిపోతుంది కాని వేదాంతం వాదనలకతీతం. ఈ అవివాదః పదాన్నే రాబోయే కారికల్లో గౌడపాదాచార్యుల వారే వివరిస్తారు, అప్పుడు వివరంగా చూద్దాము. ఇప్పుడు అతర్క్యత్వాత్ అవివాదః అని అర్థం చేసుకుంటే చాలు. అంటే వాదనలకు అతీతంగా ఉంటుంది.

5. **అవిరుద్ధః** – విరుద్ధః అంటే ఇంకొకదాన్ని ఖండించటం. అవిరుద్ధః అంటే వేరే ఏ దర్శనాన్నీ ఖండించకపోవటం. గౌడపాదాచార్యులవారు అవిరుద్ధః పదం వాడటంలోని ఉద్దేశ్యం ఇది.

తక్కిన దర్శనాలు సృష్టి గురించి ఒక ప్రత్యేకకోణంలో చెబుతాయి. అవి వాటి వాదనను బలపరచుకోవాలంటే తక్కిన వాదనలను ఖండించాలి. ఎందుకంటే ఒక వాదనకూ, ఇంకొక వాదనకూ పొత్తు కుదరదు. వేదాంతం కూడ సృష్టి గురించి ఒక విధంగా చెబితే, అది కూడా ఖచ్చితంగా ఒక దర్శనానికి చేరువగా, ఇంకొక దర్శనానికి దూరంగా ఉండి వుండేది. కాని వేదాంతం ప్రత్యేకత ఏమిటంటే, అది ఏ దర్శనాన్ని ఖండించదు. ఎందుకంటే **వేదాంతానిది అజాతివాదము**. అసలు సృష్టే జరగలేదు అంటుంది వేదాంతం. సృష్టి జరిగింది అంటే కదా సమస్య. ఇలా జరిగింది అంటే, ఇంకొకలా జరగలేదు అని చెప్పకనే చెప్పినట్లు అవుతుంది.

**న కశ్చిజ్జాయతే జీవః సమ్భవోఽస్య న విద్యతే ।**
**ఏతత్తదుత్తమం సత్యం యత్ర కించిన్న జాయతే ॥** – 3.48

జీవుడు, జగత్తు పుట్టలేదు. బ్రహ్మ కార్యకారణ విలక్షణం అని గౌడపాదాచార్యులవారు శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా మూడవ అధ్యాయంలో నిరూపించారు.

మరయితే ఎదురుగా కనిపిస్తున్న ఈ జగత్తు మాటేమిటి? అది నిజంగా సృష్టించబడలేదు. అది అయోమయం తప్ప ఏమీకాదు; అజ్ఞానం నించి వచ్చిన పొరపాటు అంటారు

గౌడపాదాచార్యులవారు. శిష్యునికి అర్థం కావటంకోసం తాత్కాలికంగా సృష్టి గురించి చెప్పి, తర్వాత దాన్ని ఖండిస్తుంది ఉపనిషత్తు. ఎలాగూ తర్వాత కొట్టివేసేదాని గురించి ఏ సిద్ధాంతం తీసుకుంటే మాత్రం ఏమిటి?

అందువల్ల మనం ఏ సిద్ధాంతాన్నీ ఒప్పుకోము, ఒకవేళ ఒప్పుకున్నా, తాత్కాలికంగా ఒప్పుకుంటాము. ఎలా చూసినా, మనం ఇతర దర్శనాలను ఖండించము. మన దృష్టిలో తక్కిన దర్శనాలన్నీ వ్యావహారిక సత్యం గురించి చెబితే, మనం పారమార్థిక సత్యం గురించి బోధిస్తాము. అందువల్లనే మనం విశిష్టాద్వైతం, ద్వైతం, సాంఖ్య, యోగ, ఏది చెప్పినా దాన్ని కూడా స్వీకరిస్తాము.

శంకరాచార్యులవారు **జీవన్ముక్తానందలహరి** పేరిట అద్భుతమైన శ్లోకాలు రచించారు. అందులో జీవన్ముక్తుడు ఏ దర్శనాన్ని అయినా నవ్వుతూ స్వీకరిస్తాడు, ఆ మాటకొస్తే, తక్కిన మతాలను కూడా నవ్వుతూ స్వీకరిస్తాడు అంటారు. అందువల్ల అవిరుద్ధః అంటే విరోధాలు లేనిది.

6. **దేశితః** – ఇది చాలా ముఖ్యమైన అంశం. ఇది శాస్త్రాన్ని గురువు ద్వారానే పొందగలమని సూచిస్తుంది. స్వంతంగా శాస్త్రాన్ని అధ్యయనం చేసినా, స్వయంగా ధ్యానం చేసినా ఆత్మజ్ఞానాన్ని పొందలేరు. కొంతమంది ఆత్మజ్ఞానాన్ని ధ్యానం ద్వారా పొందవచ్చు అనుకుంటారు కాని అది పొరపాటు. ఆత్మజ్ఞానాన్ని గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే పొందాలి. ఎవరైనా ఒకవేళ నేను శాస్త్రం అధ్యయనం చేయకుండానే జ్ఞానం పొందాను అని చెబితే శాస్త్రం దాన్ని అంగీకరించదు. అతను పూర్వజన్మలో గురువు ద్వారా జ్ఞానాన్ని పొంది ఉంటాడనీ, ఏదో ప్రతిబంధకంవల్ల యోగభ్రష్టుడు అయ్యాడనీ అంటుంది.

ఇప్పుడు ఈ జన్మలో అతనికి అంతకుముందే పొందిన జ్ఞానం గుర్తు వచ్చి ఉంటుందని అంటుంది శాస్త్రం. అందువల్ల జ్ఞానాన్ని గురువు ద్వారానే పొందాలి. ఎవరంటున్నారు ఆ మాట? గౌడపాదాచార్యులవారు. దేశితః అంటే గురువు ద్వారా ఉపదేశం పొందబడినది అని అర్థం.

నమామ్యహమ్ – అటువంటి విద్యకు నేను నమస్కారములు చేస్తున్నాను.

ఆ విధంగా ఈశ్వర నమస్కారం, గురునమస్కారం, విద్యనమస్కారం అయ్యాయి. తమాషా ఏమిటంటే, గౌడపాదాచార్యులు ఎప్పుడూ అద్వైతాన్ని బోధిస్తారు, కాని ఇప్పుడేమో పరమాత్మకు నమస్కారాలు పెడుతున్నాడు. అంటే ఎవరు ఎవరికి నమస్కారం చేస్తున్నట్టు? గౌడపాదాచార్యులవారు నమస్కారం పెడుతున్నప్పుడు, వ్యావహారిక దృష్టినుంచి చేస్తున్నారు; అద్వైతం గురించి మాట్లాడేటప్పుడు పారమార్థిక దృష్టినుంచి చెబుతున్నారు. అంటే ఛానెల్ మారిందన్నమాట. ఈ భేదాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

**కారిక 4.3**

**భూతస్య జాతిమిచ్ఛంతి వాదినః కేచిదేవ హి ।**
**అభూతస్యాపరే ధీరా వివదంతః పరస్పరమ్ ॥**

2. **పరమత ఖండనలు – కారికలు 3–28**

ఈ భాగంలో అనేక చిన్న భాగాలు ఉన్నాయి.

2ఎ) **అవివాదము వివరణ – కారికలు 3–5**

ఈ మూడు కారికల్లో గౌడపాదాచార్యులవారు రెండవ కారికలో వాడిన అవివాదః పదాన్ని వివరిస్తున్నారు. అవివాదః అంటే వేదాంతం వాదనలకు అతీతంగా ఉందని అర్థమని చూశాము.

వేదాంతం వాదనలకు అతీతంగా ఉందని ఎలా చెప్పగలరు? దానికొక అద్భుతమైన కారణాన్ని చూపిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. గౌడపాదాచార్యులవారు, 'నేను ఎవరితోనూ వాదించి గెలవనవసరం లేదు' అంటున్నారు. ఎందుకు? తక్కిన దార్శనికులు ఒకరితో ఒకరు వాదించుకుంటూ ఒకరిని ఒకరు ఖండించుకుంటున్నారు. ఇది యాదవుల కలహంలా ఉంటుంది. యాదవులు వారిలో వారు యుద్ధం చేసుకుని, వారి కులాన్ని నాశనం చేసుకున్నారు. అలా ఈ దార్శనికులు ఒకరిని ఒకరు ఖండించుకుని, సృష్టివాదాన్ని ఖండిస్తున్నారు. అన్ని రకాల సృష్టిప్రక్రియలనూ ఖండిస్తే మిగిలేది ఏమిటి? దీన్నంతా సాక్షీభూతంగా చూస్తున్న, **అజాతివాదము** అయిన అద్వైతమే మిగులుతుంది. అదే మనం చెప్పటానికి ప్రయత్నిస్తున్న అంశం.

సృష్టిప్రక్రియ గురించి చెప్పే దర్శనాలు అనేకం ఉన్నాయి. వాటిలో రెండు వాదనలు చాలా శక్తివంతమైనవి. గౌడపాదాచార్యులవారే, ఈ రెండు వాదనలను మళ్ళీ తీసుకుని వాదిస్తారు. ఇక్కడ అవివాదః పదాన్ని వివరించటానికి టూకీగా చెబుతున్నారు. ఆ వాదనలు ఇవి –

| | | |
|---|---|---|
| 1. సత్కార్యవాదః – | సాంఖ్యదార్శనికులు | – కపిలముని |
| 2. అసత్కార్యవాదః – | న్యాయదార్శనికులు | – గౌతమముని |
| | వైశేషికదార్శనికులు | – కణాదముని |

సత్కార్యవాదాన్ని చాలామందే సమర్థిస్తారు కాని, వారిలో సాంఖ్యదార్శనికులైన కపిలముని ముఖ్యులు. అసత్కార్యవాదాన్ని న్యాయ, వైశేషికులు వాదిస్తారు.

వారు సృష్టిప్రక్రియ గురించి చెప్పేటప్పుడు, ఒక ఉదాహరణను తీసుకుంటారు. అది మనకు తెలిసిన ఉదాహరణే, కుండ–మట్టి. కుమ్మరి, మట్టినుంచి కుండను ఉత్పత్తి చేస్తాడు.

ఇప్పుడు కుండను మట్టినుంచి సృష్టించాడు అంటే అందరూ ఏకగ్రీవంగా ఈ ప్రాథమిక ప్రశ్న వేస్తారు.

కుండ పుట్టకముందు, కుండ మట్టిలో ఉందా, లేదా?

కుండ కార్యం, మట్టి కారణం. ఇప్పుడు ఇదే ప్రశ్నను కుండ–మట్టి పదాలు తీసివేసి, కార్యం–కారణం పదాలు వాడి, మళ్ళీ వేద్దాము.

**ఉత్పత్తేః పూర్వమ్ కార్యం కారణే సత్ వా అసత్ వా?**

కార్యం పుట్టకముందు, కారణంలో ఉందా, లేదా? సత్ అంటే ఉనికి ఉంది; అసత్ అంటే ఉనికి లేదు.

దీన్నే ఇంకో విధంగా అడగాలంటే, ఉనికి ఉన్న కుండ పుట్టిందా, ఉనికి లేని కుండ పుట్టిందా? ఇది చాలా పెద్ద చర్చనీయాంశం. శంకరాచార్యులవారు తన బృహదారణ్యకోపనిషత్ భాష్యంలో ఈ అంశాన్ని చాలా లోతుగా చర్చించారు. ఘటభాష్యం పేరిట, తక్కిన దార్శనికులందరినీ ఖండించుకుంటూ వచ్చారు. శంకరులవారే వివరంగా ఖండించారు అంటే ఉపభాష్యకారులు, వారికి ఉపభాష్యకారులు ఇంకా లోతుగా వివరించారు. ఘటం అంటే కుండ. కుండ గురించిన వాదోపవాదాలు కాబట్టి దీన్ని ఘటభాష్యం అన్నారు.

సాంఖ్యులు ఉనికి ఉన్న కుండ పుట్టింది అంటారు. ఉనికి ఉంటే సత్ అని చూశాము. అందువల్ల వీరిది సత్కార్యవాదము. న్యాయ, వైశేషికులు ఉనికిలేని కుండ పుట్టింది అంటారు. దాన్ని అసత్కార్యవాదము అంటారు. వీరిరువురూ తీవ్రంగా వాదించుకుంటారు బ్రహ్మసూత్రాలు రాకముందునుంచే. ఆధునిక విజ్ఞానశాస్త్రం పుట్టకముందే, మన హిందూమత దార్శనికులు, సృష్టిప్రక్రియను చీల్చి చెండాడేశారు.

ఇక్కడ, ఇరుపక్షాలవారు ఒకరిని ఒకరు తీవ్రంగా ఖండించుకునే జోరులో సృష్టినే కొట్టివేసినట్టయింది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. రెండు వాదనలూ వీగిపోతే, మిగిలింది అజాతివాదము మాత్రమే. అజాతివాదము అంటే అసలు సృష్టే జరగలేదు.

నిజానికి సృష్టి అనే పదాన్ని సృష్టించి పెద్ద పొరపాటు చేశాము. సృష్టి పదం అందరినీ గొప్ప అయోమయంలో పడవేసింది. సైన్సు ప్రకారం కూడా దేన్నీ కొత్తగా సృష్టించలేము. పదార్థాన్ని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము. వేదాంతమేమో చైతన్యాన్ని సృష్టించలేము, నాశనం చేయలేము అంటుంది. ఉన్నవి రెండే – పదార్థం, చైతన్యం. రెండింటినీ సృష్టించలేనప్పుడు, ఇంక కొత్తగా దేన్ని సృష్టిస్తాము? ఇంత సూక్ష్మవిషయం తెలుసుకోలేక, సృష్టి పదాన్ని సృష్టించి, వారు సృష్టించిన పదం అనే వలలో చిక్కుకుపోతున్నారు.

గౌడపాదాచార్యులవారు మనకీ సమస్య లేదు అంటున్నారు. మనం సృష్టి గురించిన ఏ వాదననూ సమర్థించము. మనం సత్కార్యవాదాన్ని సమర్థిస్తే, అసత్కార్యుల వాదనకి గురి అవుతాము. అసత్కార్యులను సమర్థిస్తే, సత్కార్యుల చేతికి చిక్కుతాము. ఏ ఒక్కరిని సమర్థించినా, రెండోవారికి చిక్కక తప్పదు. కాని మనం ఎవరినీ సమర్థించము. ఎందుకంటే మనం అసలు సృష్టే జరగలేదు అంటాము. సృష్టి జరిగిందంటే కదా, ఏదో ఒక ప్రక్రియను పట్టుకోవాలి.

మరి అయితే ఎదురుగా కనిపించే జగత్తు ఏమిటి? అది బ్రహ్మ తప్ప ఏమీ కాదు; సృష్టికి ముందూ, సృష్టిలోనూ, సృష్టి తర్వాతా ఉన్నది బ్రహ్మే. అందువల్ల సృష్టీలేదు, సృష్టి ప్రక్రియా లేదు, దాని గురించిన వాదనా లేదు.

ఇప్పుడు ఈ కారికను చూద్దాము.

**కేచితు వాదినః** – కొందరు దార్శనికులు అంటే సాంఖ్య దార్శనికులు,

**భూతస్య జాతిమ్ ఇచ్ఛంతి** – ఉనికి ఉన్న కుండ పుట్టింది అంటారు. జాతి అంటే బ్రాహ్మణ జాతి అలా కాదు. ఇక్కడ ఉత్పత్తి లేదా పుట్టుక. భూతస్య అంటే ఉనికి ఉన్నది; అన్నీ కలిపితే, సాంఖ్య దార్శనికులు ఉనికి ఉన్న కుండ పుట్టింది అంటారు. దీన్ని సత్కార్యవాదము అంటారు.

**అపరే ధీరాః** – తెలివైనవారిలా కనబడుతున్న తక్కిన దార్శనికులు. వారు న్యాయ, వైశేషికులు.

**అభూతస్య (జాతిమ్ ఇచ్ఛంతి)** – జాతిమ్ ఇచ్ఛంతి మనం కలుపుకోవాలి. అభూతస్య అంటే ఉనికి లేనిది. ఈ దార్శనికులు ఉనికిలేని కుండ పుట్టింది అంటారు. దీన్ని అసత్కార్య వాదము అంటారు. ఎవరికి వారే వారి సిద్ధాంతమే సరియైనది అంటారు.

**పరస్పరమ్ వివదంతః** – ఈ రెండు రకాల దార్శనికులు ఒకరితో ఒకరు విభేదిస్తూనే ఉంటారు.

ధీరాః – ఇద్దరూ బృహస్పతులే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఇది వ్యతిరేక అర్థాన్నిచ్చే సానుకూల పదం. అసలైతే ధీరః అంటే వివేకవంతులు. కాని ఇక్కడ వారి వివేకాన్ని సరిగ్గా ఉపయోగించటం లేదని అర్థం.

వీరి వాదనను టూకీగా చూస్తే –

ఉనికి ఉన్న కుండ పుట్టిందా? ఉనికి లేని కుండ పుట్టిందా? దీనికి జవాబుని తరువాత వచ్చే కారికలో చూస్తాము.

### కారిక 4.4

**భూతం న జాయతే కించిదభూతం నైవ జాయతే ।**

**వివదంతో ద్వయా హ్యేవమజాతిం ఖ్యాపయంతి తే ॥**

ఈ కారికలో ఒకరిని ఒకరు ఖండించుకుంటున్నారు.

**భూతం న జాయతే కించిద్** – ఇవి అసత్కార్యవాదులైన నైయాయికుల వాదన. ఈ వాక్యం ద్వారా వారు సాంఖ్యులను ఖండిస్తున్నారు. ఏమని? ఉనికి ఉన్న వస్తువు పుట్టదు.

భూతం – ఉనికి ఉన్న వస్తువు. ఉనికి ఉన్న వస్తువు కొత్తగా పుట్టనవసరం లేదు. ఎందుకు? అది ఉంటూనే ఉన్నది కాబట్టి కొత్తగా పుట్టేది లేదు.

**అభూతం న ఏవ జాయతే** – ఇవి సాంఖ్యవాదుల వాదన. వీరిది సత్కార్యవాదము. ఈ మాటలతో వీరు అసత్కార్యవాదులను ఖండిస్తున్నారు. ఎలా? ఉనికిలేని వస్తువు కొత్తగా పుట్టలేదు. 'మీరు ఉనికి ఉన్న వస్తువుకు ఉనికి ఉంది కాబట్టి కొత్తగా పుట్టనవసరం లేదు అంటే మేము ఉనికిలేని వస్తువు కొత్తగా పుట్టలేదు అంటాము,' అంటారు సాంఖ్యవాదులు.

అసత్కార్యుల వాదనను రెండు విధాలుగా ఖండించవచ్చు.

ఎ) **సైన్స్‌పరంగా పుట్టదు** – సైన్స్‌పరంగా పదార్థం కొత్తగా పుట్టదు, నాశనమవదు. ఈ సూత్రం ప్రకారం ఉనికిలేని వస్తువు పుట్టలేదు.

బి) **వ్యాకరణపరంగా కుదరదు** – నిజానికి దీనికోసం, సైన్స్‌దాకా పోనవసరం లేదు. కొంచెం వ్యాకరణసూత్రం తెలిస్తే చాలు.

**ఉనికి లేని కుండ పుట్టింది**

వ్యాకరణపరంగా ఈ వాక్యం తప్పు. వ్యాకరణంలో నేర్చుకునే మొట్టమొదటి సూత్రం ఒక వాక్యాన్ని చేయాలంటే దానికి సబ్జెక్టు + వర్బ్ ఉండాలి. సబ్జెక్ట్‌ని కర్త అనీ, వర్బ్‌ని క్రియ అనీ అంటాము. ఉదాహరణ –

కుండ పుట్టింది
కర్త క్రియ

పనిని తెలుపునది క్రియ. వచ్చాడు, తిన్నాడు, తాగాడు, ఇవన్నీ క్రియాపదాలు. క్రియకు ఎవరు, ఏది అనే ప్రశ్న వేస్తే వచ్చే జవాబు కర్త. ఎవరు వచ్చారు? రాముడు వచ్చాడు. ఎవరు తిన్నారు? రాముడు తిన్నాడు.

ఏది పుట్టింది? కుండ పుట్టింది.

అంటే క్రియ ఒక పనిని చూపిస్తుంది కాబట్టి దానంతట ఆ పని జరగదు. ఆ పనిని సూచించే ఒక కర్త ఉండాలి. కర్త లేకుండా వాక్యం రాదు.

'ఇక్కడ క్లాసు జరుగుతున్నది,' అని మీరంటే, 'ఎవరు క్లాసు తీసుకుంటున్నారు?' ప్రశ్న వెంటనే వస్తుంది. 'ఎవరూ తీసుకోవటం లేదు, దానంతట అదే అవుతున్నది,' అని మీరు అనగలరా? ఈ సూత్రం ప్రకారం –

**ఉనికి లేని కుండ పుట్టింది**

ఈ వాక్యాన్ని చెప్పలేరు. పుట్టింది సరే ఏది పుట్టింది అంటే అక్కడ జవాబు లేదు. ఉనికే లేని వస్తువు గురించి ఎలా మాట్లాడతారు? ఉనికి లేని కుండ ఈ పదాలను కర్తగా వాడలేరు – అంటే కర్త లేదు.

కుండ పుట్టిందిలో కర్త కుండ, ఉనికిలేని కుండ పుట్టిందిలో కర్త ఉనికిలేని కుండ కాదు. కర్తే లేదు. ఆ విధంగా నైయాయికులను ఖండిస్తారు సాంఖ్యులు.

మరి అయితే గెలుపు ఎవరిది?

**వివదంతో ద్వయా హి ఏవమ్** – ద్వయా అంటే ఆ ద్వైతులు. మనం అద్వైతులం. మననుంచి వారిని విభిన్నంగా చూపటానికి వారిని ద్వైతులు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

ఈ విధంగా వారిరువురు ఒకరిని ఒకరు ఖండించుకుంటున్నారు, సృష్టి విషయం గురించి.

ఒకరు ఉనికి ఉన్న కుండ పుట్టనవసరం లేదు అంటే ఇంకొకరు ఉనికిలేని కుండ పుట్టలేదు అంటున్నారు. మరి అయితే ఏం పుట్టింది? ఏదీ పుట్టలేదు.

**అజాతిం ఖ్యాపయంతి తే** – ఏదీ పుట్టలేదు కాబట్టి అజాతివాదాన్నే వారు, వారికి తెలియకుండా వెల్లడి చేస్తున్నారు.

కుండ పుట్టిందనుకోవటమే మానవ మేధస్సును పట్టి పీడిస్తున్న ఒక పెద్ద అయోమయం. కుండ అనేది పుట్టలేదు. ఎందుకంటే అసలు కుండ అనే పదార్థమే లేదు. మనం ఈ విషయాన్ని లోతుగా విశ్లేషిస్తే ఉన్నది ఒకటే పదార్థం, అది మట్టి అని తెలుస్తుంది. కుండ పుట్టకముందూ మట్టి ఉంది, కుండగానూ మట్టి ఉంది, కుండ పలిగిపోయాక కూడా మట్టి ఉంది.

మరి కుండ ఏమిటి? కుండ మట్టికి ఇవ్వబడిన నామరూపం మాత్రమే.

**వాచాఽఽరంభణం వికారో నామధేయమ్ మృత్తికేత్యేవ సత్యమ్** – ఛాందోగ్యమ్

కుండ ఆకారం ఏర్పడగానే వాక్కు దానికి ఒక పేరు ఇచ్చింది. అదే కుండ. కాని దానికి మట్టి లేకుండా విడిగా ఉనికి లేదు. మట్టి మాత్రమే సత్యం. ఈ సూత్రాన్ని జగత్తులో ఏ వస్తువుకైనా వాడవచ్చు.

జగత్తంతా అనేక వస్తువులు ఉన్నట్టుగా ఉన్నాయి కాని అవి నామరూపాలు మాత్రమే. అసలు సత్యం బ్రహ్మ మాత్రమే. అందువల్ల జగత్తు కొత్తగా పుట్టలేదు, నామరూపాలు కొత్తగా ఇవ్వబడ్డాయి.

అలాగే ఉన్నదొకటే నీరు. దానికి వచ్చిన ఆకారాన్నిబట్టి నది, సముద్రం, కొలను, బావి, కాలువ – ఇలా అనేక నామాలు ఇస్తున్నాము. అలాగే ఉన్నదొకటే బ్రహ్మ – అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు.

ఆ విధంగా జగత్తూ పుట్టలేదు, జీవాత్మా పుట్టలేదు. జీవాత్మ పుట్టనేలేదు అంటే పునర్జన్మకు ఆస్కారం ఎక్కడ ఉంది? గురువు చెప్పిన బోధ అంతా శ్రద్ధగా విని, 'గురువుగారూ, మీరు చెప్పింది నాకు బాగా అర్థమయింది, నేను ఇప్పుడు పుట్టనే లేదు అన్నారు, బాగుంది, కాని నాకు పునర్జన్మ లేకుండా దీవించండి,' అని ఎవరైనా శిష్యుడు అడిగితే, ఆ గురువుకు జీవితం మీద విరక్తి పుట్టకపోతే, అది వేదాంతజ్ఞానం ఆయనకు ఇచ్చిన శక్తి. ఎవరైనా కోరుకునేది ఒకటే – సంసారబంధంనుంచి విముక్తి.

అజాతిం ఖ్యాపయంతి తే – వారు, వారికి తెలియకుండానే మన అజాతివాదాన్ని బలపరుస్తున్నారు! నేను అంతకుముందూ పరమాత్మనే, ఇప్పుడూ పరమాత్మనే, తరువాతా పరమాత్మనే. నేను పరమాత్మనుంచి వచ్చిన జీవాత్మను కాదు, నేను మళ్ళీ వెళ్ళి పరమాత్మలో ఐక్యం అవనూ అవసరం లేదు. రాకపోకలు అయోమయం తప్ప నిజం కాదు. ఇదంతా మాయ చేసే గారడీ అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

### కారిక 4.5

**ఖ్యాప్యమానామజాతిం తైరనుమోదామహే వయమ్ ।**

**వివదామో న తైస్సార్ధమవివాదం నిబోధత ॥**

**తైః ఖ్యాప్యమానామ్ అజాతిమ్** – సృష్టి జరగలేదని మేము చెప్పే అజాతివాదాన్ని ఈ సాంఖ్యులు, నైయాయికులు కూడా సమర్థిస్తున్నారు. ఎలా సమర్థిస్తున్నారు? ఒకరినొకరు ఖండించుకోవటం ద్వారా.

ఖ్యాప్యమాన అంటే పరోక్షంగా సమర్థిస్తున్నారు. అందువల్ల మనకేమీ వారిమీద కోపం లేదు. పైగా 'శభాష్' అని మెచ్చుకుంటున్నాము వారిని.

**అనుమోదామహే** – వారు అద్వైతానికి చేసిన మేలును మెచ్చుకుంటున్నాము. వారి పరోక్ష సహాయానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

**న తైః సార్ధం వివదామః** - పైపెచ్చు వారితో ఎన్నడూ వాదించము. ఆ వాదనేదో వారే ఒకరితో ఒకరు చేసుకున్నారు. ఆ విధంగా అద్వైతం అవివాదం అయింది. వాదాలకు అతీతం అయింది.

వాదన చేస్తే రెండు రకాలుగా అహంకారంమీద దెబ్బ తీస్తుంది. గెలిస్తే అహంకారం పెరుగుతుంది; ఓడిపోతే అహం దెబ్బతింటుంది. అందువల్లనే వేదాంతం నేర్చుకునే శిష్యులు, ఎటువంటి వాదనలలోకీ దిగకూడదు.

వాదనల్లో కాంతి పుట్టేకన్నా వేడి ఎక్కువ పుడుతుంది. అంటే జ్ఞానం కలిగేకన్నా, కోపం పెరుగుతుంది. ఒక్కోసారి ఆ కోపాలు ఎంత తీవ్రస్థాయికి చేరుకుంటాయంటే, బంధుత్వాలు కూడా దెబ్బతింటాయి. కాని అద్వైత సిద్ధాంతి అదృష్టవశాత్తూ ఈ వాదనల్లోకి దిగడు. వాదనల్లో ముగింపు ఉండదు.

**అవివాదం నిబోధత** - వివాదం లేని అద్వైతం గురించి చక్కగా తెలుసుకోండి.

ఇక్కడితో అవివాదః పదం గురించి గౌడపాదాచార్యులవారు ఇచ్చిన విశ్లేషణ అయిపోయింది. ఈ విశ్లేషణ సారాన్ని టూకీగా ఈ క్రింది పట్టికలో చూద్దాము.

**2ఎ). అవివాదము వివరణ కారికలు 3-5**

| దార్శనికుడు | పేరు | సిద్ధాంతము | ఖండన |
|---|---|---|---|
| సాంఖ్య | సత్కార్యవాదము | ఉనికి ఉన్న కుండ పుట్టింది | ఉనికి ఉంటే కొత్తగా పుట్టనవసరము లేదు |
| న్యాయ/ వైశేషిక | అసత్కార్యవాదము | ఉనికి లేని కుండ పుట్టింది | ఉనికి లేని కుండ కొత్తగా పుట్టలేదు<br>ఎ) సైన్స్‌పరంగా పుట్టదు<br>బి) వ్యాకరణపరంగా కుదరదు |
| అద్వైతం | అజాతివాదము | అసలు సృష్టే జరగలేదు | పై ఇద్దరూ వారికి తెలియకుండానే అజాతివాదాన్ని సమర్థిస్తున్నారు |

ఈ దార్శనికులు సృష్టి జరిగిందని నిరూపించలేరు. **అజాతివాదము సత్యము.**

**కారిక 4.6**

**అజాతస్యైవ ధర్మస్య జాతిమిచ్ఛంతి వాదినః ।**
**అజాతో హ్యమృతో ధర్మో మర్త్యతాం కథమేష్యతి ॥**

**2బి). వేదాంతసారము – కారికలు 6-10**

అద్వైత సిద్ధాంతి తక్కిన దార్శనికులు చేసే పొరపాటునుంచి విడివడ్డాడు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. నిజానికి ఈ ప్రాథమిక పొరపాటునుంచి విడివడటమే మోక్షం.

6, 7, 8 కారికలు మూడవ అధ్యాయంలోని 20, 21, 22 కారికల పునశ్చరణే. ఆరవ కారికలో ఒక చిన్న మార్పు ఉంది తప్పితే మిగతా పదాలు అలాగే ఉన్నాయి.

**అజాతస్యైవ భావస్య జాతిమిచ్ఛంతి వాదినః ।**
**అజాతో హ్యమృతో భావో మర్త్యతాం కథమేష్యతి ॥** – 3.20

భావస్య–భావో పదాల బదులు ఇక్కడ ధర్మస్య–ధర్మో పదాలు వచ్చాయి అంతే. రెండింటి అర్థం ఒకటే – పరమాత్మ. ఈ కారిక అర్థం అంతకుముందు వివరంగానే చూశాము. తక్కిన దార్శనికులు పరమాత్మను సృష్టి కారణంగా అభివర్ణిస్తారు. వారు భగవంతునికి ఇచ్చే పేర్లు మారుతాయి – బ్రహ్మ, విష్ణు, దేవి. కాని అందరి వాదనా ఒకటే. వారు పరమాత్మ కారణం, జగత్తు కార్యం అంటారు.

జగత్తును రెండుగా విభజిస్తారు. జీవుడు, జగత్తు అంటారు. వారికి పరమాత్మ స్వరూపం గురించి సరియైన అవగాహన లేదు. పరమాత్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే, సాధకుడు అవస్థ పడటమే కాక, మోక్షాన్ని గురించి కూడా తప్పుగా అర్థం చేసుకుంటాడు. మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చే సాధ్యవస్తువు అనుకుంటాడు. వీరి వాదన తర్కవిరుద్ధంగా ఉంటుంది.

మోక్షాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, ముందు పరమాత్మను సరిగ్గా అర్థం చేసుకోవాలి. చాలామంది పరమాత్మ గురించి పొరపాటు పడతారు. ఆ పొరపాటును రెండు రకాలుగా విభజించవచ్చు.

1. కొంతమంది పరమాత్మ, మాయవల్ల జీవాత్మగా మారాడు అనుకుంటారు. జీవాత్మగా పరమాత్మ ఇప్పుడు సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడనీ, క్రమంగా సాధన చేసి మళ్ళీ పరమాత్మగా మారుతాడని ఆశిస్తారు. అందువల్ల పరమాత్మ జీవాత్మగా మారటం సంసారం అనీ, జీవాత్మ పరమాత్మగా మారటం మోక్షమనీ వారి నమ్మకం. అందువల్ల వారు పరమాత్మగా మారటానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు.

**జవాబు** – ఇది ఒక పెద్ద పొరపాటు అంటారు గౌడపాదాచార్యులవారు. పరమాత్మ జీవాత్మగా ఎన్నడూ అవలేదు. పరమాత్మ జీవాత్మగా మారకపోతే, జీవాత్మ మళ్ళీ పరమాత్మగా మారే ప్రశ్న ఎక్కడుంది? పరమాత్మ నిర్వచనం నిర్వికారం, మార్పు చెందనివాడు. మారాడు అన్న పదంలోనే మార్పు అర్థం ఉంది. పరమాత్మ వికారాలకు లోనుకానప్పుడు, పరమాత్మ మారాడు అని ఎలా చెప్పగలరు? పరమాత్మ జీవాత్మగా మారలేదు, అందువల్ల జీవాత్మ పరమాత్మగా మారలేదు. పరమాత్మ సరిగ్గా అర్థం కాకపోతే అది జీవాత్మ.

మరయితే జీవాత్మ ఏమిటి?

జీవాత్మను సరిగ్గా అర్థం చేసుకుంటే అది పరమాత్మ. మార్పు రావాల్సింది జీవాత్మలో కాదు, అర్థం చేసుకోవటంలో. తాడు–పాము దృష్టాంతంలో తాడు పాముగా మారలేదు. పాము మళ్ళీ తాడుగా మారనవసరం లేదు. తాడును పొరపాటుగా అర్థం చేసుకుంటే అది పాము. పామును సరిగ్గా అర్థం చేసుకుంటే అది తాడు. ఇక్కడ మారాల్సింది వస్తువు కాదు, దృక్పథం, దృక్కోణం.

2. మరి కొంతమంది, జీవాత్మ అంతకుముందు పరమాత్మలోనే కలిసివున్నాడనీ, ఏ కారణంవల్లనో విడిపోయాడనీ అంటారు. వీరు పరమాత్మ జీవాత్మగా మారలేదు, పరమాత్మ ఎప్పుడూ పరమాత్మే అంటారు. కాకపోతే పరమాత్మతో అంతకుముందు కలిసివున్న జీవాత్మ తరువాత పరమాత్మనుంచి విడిపోయాడు అంటారు. అందువల్ల వారి సాధన – కష్టపడి కొండెక్కినట్టుగా కష్టపడి జీవాత్మ పరమాత్మను చేరుకోవాలి అంటారు. మీరు పరమాత్మ వైపు పడి అడుగులు వేస్తే, పరమాత్మ మీవైపు ఇర్వై అడుగులు వేస్తాడు అనే సిద్ధాంతాన్ని నమ్ముతారు. అందువల్ల అలా కష్టపడి వెళ్ళి, జీవాత్మ పరమాత్మలో ఐక్యం అవుతాడు అంటారు.

**జవాబు** – ఇది మరొక పెద్ద పొరపాటు. పరమాత్మకు దూరంగా వెళ్ళే ప్రశ్నే లేదు. పరమాత్మ సర్వవ్యాపకం. సర్వవ్యాపకమైన పరమాత్మకు దూరంగా వచ్చే ఆస్కారం ఎక్కడ ఉంది? మీరు ఫలానా సుబ్బారావునుంచి దూరంగా వచ్చి, తరువాతెప్పుడో మళ్ళీ వెళ్ళి ఆయనను కలిసే అవకాశం ఉంది. ఎందుకంటే మీరు, అతను కూడా పరిచ్ఛిన్న జీవులు. దేశ పరిచ్ఛిన్నం ఉంది. కాని పరమాత్మ అపరిచ్ఛిన్నం. సర్వవ్యాపకమైన పరమాత్మనుంచి దూరం వచ్చే ప్రసక్తి ఎక్కడ?

ఒక విషయం వారు స్పష్టంగా అర్థం చేసుకోవాలి. విడిపోవటం అనేది భౌతికంగా కాదు, అది కేవలం ఒక అపోహ మాత్రమే. వారు పరమాత్మనుంచి విడిగా రాలేదు, వచ్చాం అని అపోహ పడుతున్నారు అంతే. ఈ అపోహ వారి అజ్ఞానంవల్ల ఏర్పడింది.

అందువల్ల జీవాత్మ, పరమాత్మల ఐక్యం అంటే జీవాత్మ వెళ్ళి వెళ్ళి ఎక్కడో వైకుంఠంలో ఉన్న పరమాత్మతో కలవటం కాదు. ఐక్యం అంటే బుద్ధిలో కలిగే మార్పు. ఆ మార్పు

జ్ఞానంవల్ల కలుగుతుంది. నేను అంతకుముందు, ఇప్పుడు, తరువాత కూడా పరమాత్మతోనే ఉన్నాను; అందువల్ల కొత్తగా వెళ్ళి పరమాత్మతో కలవటం అనే ప్రసక్తి లేదు.

ఈ వాదనల సారం మళ్ళీ టూకీగా చూస్తే – కొత్తగా వెళ్ళి పరమాత్మగా మారే ప్రసక్తీ లేదు, కొత్తగా వెళ్ళి పరమాత్మతో కలిసే ప్రసక్తీ లేదు, నేను అంతకుముందూ, ఇప్పుడూ, తరువాత కూడా పరమాత్మనే అని అర్థం చేసుకోవాలి అంతే. పరమాత్మస్వరూపం అర్థం అయితేనే ఇది సరిగ్గా అర్థమవుతుంది. ఈ నేపథ్యంతో ఆరవ కారిక చూద్దాము.

**వాదినః అజాతస్య ధర్మస్య జాతిమిచ్ఛంతి** – కొందరు దార్శనికులు మార్పులేని పరమాత్మ మారాడు అంటున్నారు. పరమాత్మ నిర్వికారం. అలాంటప్పుడు పరమాత్మ మారాడని ఎలా చెబుతున్నారు? వారు పరమాత్మకు కారణం హోదాను ఇవ్వటం ద్వారా చెబుతున్నారు. కారణం హోదా వస్తే, అది మార్పు చెంది తీరుతుంది. వారు పరమాత్మను జగత్కారణంగా అభివర్ణించి, పరమాత్మకు కొత్త హోదా ఇచ్చినట్టు మురిసిపోతున్నారు కాని అలా చేయటం వల్ల పరమాత్మను కిందికి దింపినట్టుగా భావించటం లేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. దేశకాలాతీత పరమాత్మకు దేశకాల పరిచ్ఛిన్నాన్ని ఆపాదిస్తున్నారు.

అది గౌరవించటం కాదు, అవమానించటమే అవుతుంది. ఎలా?

**అజాతో హ్యమృతో ధర్మో మర్త్యతాం కథమేష్యతి** – మార్పులేని పరమాత్మ, ఈ జగత్తుకు మారే కారణమెలా అవుతాడు? ఎలా అవుతాడు అనేది ప్రశ్న కాదు. దీన్ని ఆక్షేపార్థే (రిటారికల్ క్వశ్చన్) అంటారు. ఇందులో కాదు అనే జవాబు ఇమిడి ఉంటుంది. అంటే మార్పులేని పరమాత్మ, ఎన్నటికీ కారణంగా మారలేడు. పరమాత్మ కారణం కాకపోతే, జగత్తనే కార్యం కాని, జీవాత్మ అనే కార్యం కాని, పుట్టే అవకాశమే లేదు.

జీవాత్మే లేకపోతే, సంసారి జీవాత్మ ఎక్కడనుంచి వస్తాడు? జీవాత్మ నామవాచకం, సంసారి విశేషణం. నామవాచకమే లేకపోతే, విశేషణానికి చోటేది?

దీని సారం – ఉనికే లేని జీవాత్మ ఎన్నటికీ సంసారి కాలేదు.

**కారిక 4.7**

**న భవత్యమృతం మర్త్యం న మర్త్యమమృతం తథా ।**
**ప్రకృతేరన్యథాభావో న కథంచిద్భవిష్యతి ॥**

ఈ కారిక 3.21 కారికని పోలివుంది అని చూశాము. ఇప్పుడు ఆ కారికను చూద్దాము.

**న భవత్యమృతం మర్త్యం న మర్త్యమమృతం తథా ।**
**ప్రకృతేరన్యథాభావో న కథంచిద్భవిష్యతి ॥** – 3.21

అక్షరాలా అలాగే ఉంది ఈ కారిక కూడా.

ఆరవ కారికలో చూసిన అంశాన్నే మళ్ళీ చూస్తాము. నిత్యమైన పరమాత్మ ఎన్నటికీ అనిత్య జీవాత్మ అవలేదు. ఏ తర్కం ప్రకారం చెప్పగలరు? నిత్యం అంటే నిర్వికారం; మార్పులేదు; మార్పు లేనిది జీవాత్మగా ఎలా మారగలదు? అమృతం మర్త్యం అవలేదు. మార్పులేని పరమాత్మ మారే జీవాత్మగా ఎన్నడూ అవలేదు. అదే విధంగా అశాశ్వతమైన జీవాత్మ, శాశ్వతమైన పరమాత్మగా ఎన్నటికీ మారలేదు.

ఒక్కముక్కలో చెప్పాలంటే, శాశ్వతత్వానికీ, అశాశ్వతత్వానికీ మధ్య సంబంధం లేదు. ఒక తతంగం ద్వారా అనిత్యమైనది నిత్యం కాలేదు; నిత్యమైనది అనిత్యమూ కాలేదు. అందువల్ల నాకు మోక్షం కావాలని చెప్పటంలో అర్థం లేదు. మోక్షం కావాలి అంటే నేను నిత్యం అవాలని కోరినట్టు అర్థం. అప్పుడు తిరిగి ఒక ప్రశ్న వేయాలి.

అనిత్య జీవాత్మ, నిత్యం అవాలనుకుంటున్నదా?

నిత్య జీవాత్మ నిత్యం అవాలనుకుంటున్నదా?

ఎటు చూసినా అది సాధ్యం కాదు. ఎందుకు? అది నిత్యం అయితే, కొత్తగా నిత్యం అవాల్సిన అవసరం లేదు. ఒకవేళ అది అనిత్యం అయితే, అది ఎన్నటికీ నిత్యం అవలేదు. అనిత్యవస్తువు మార్పు చెందినా కూడా, అనిత్యంగానే ఉంటుంది. కాబట్టి మోక్షం పొందాలనుకోవటమే ఒక పెద్ద పొరపాటు. మరి అయితే మోక్షం అంటే ఏమిటి? మోక్షం అంటే నేను మోక్షం పొందాలనే భావననుంచి విముక్తి పొందటమే.

**న భవత్యమృతం మర్త్యమ్** – అమృతం మరణించే స్వభావం కలది అవదు.

**న మర్త్యమమృతం తథా** – అదే విధంగా మరణించే స్వభావం కలది అమృతం అవదు.

అలా ఎలా చెప్పగలరు? స్వభావం అంటేనే స్వస్వరూపం, మార్పులేనిది. మరణించే స్వభావమే మీ స్వరూపం అయితే, మీరు ఎంత సాధన చేసినా కూడా అమృతం అవలేరు. ఒకవేళ అమృతత్త్వమే మీ స్వభావం అయితే, అమృతత్త్వంకోసం మీరు కొత్తగా ప్రయత్నించ నవసరం లేదు. ఏ విధంగా చూసినా కూడా మీరు నిత్యత్వంకోసం ప్రయత్నించనవసరం లేదు. మీరు చేయాల్సిన సాధనల్లా, ఈ విషయాన్ని అర్థం చేసుకోవటమే.

**ప్రకృతేరన్యథాభావో న కథంచిద్భవిష్యతి** – స్వస్వరూపంలో మార్పు సాధ్యం కాదు. స్వస్వరూపం అంటేనే మార్పులేనిది అని అర్థం. అగ్ని సహజగుణం ఉష్ణం. అందువల్ల మంచు ప్రాంతంలో కూడా అగ్ని సహజంగా వేడిగానే ఉంటుంది. చల్లటి అగ్ని అనే పదాన్ని ఎన్నడూ వాడలేరు. అగ్ని ఉంటే వేడిగా ఉంటుంది, లేదా అసలు ఉండదు, అంతేకాని చల్లటి అగ్ని ఉండే ప్రసక్తే లేదు.

అదే విధంగా పరమాత్మ సహజగుణం నిత్యత్వం. అందువల్ల పరమాత్మ జీవాత్మగా మారే ప్రసక్తే లేదు.

**కారిక 4.8**

**స్వభావేనామృతో యస్య ధర్మో గచ్ఛతి మర్త్యతామ్ ।**
**కృతకేనామృతస్తస్య కథం స్థాస్యతి నిశ్చలః ॥**

ఈ కారిక 3.22ని పోలివుంది అని చూశాము. ఇప్పుడు ఆ కారికను చూద్దాము.

**స్వభావేనామృతో యస్య భావో గచ్ఛతి మర్త్యతామ్ ।**
**కృతకేనామృతస్తస్య కథం స్థాస్యతి నిశ్చలః ॥** – 3.22

ఒక్క భావో పదం మారింది ఇక్కడ. భావో బదులు ధర్మో వచ్చింది. ఆరవ కారికలోనూ, దాన్ని పోలిన 3.20 కారికలోనూ ఇదే భేదం వచ్చింది. భావో అన్నా, ధర్మో అన్నా రెండింటి అర్థం ఒకటే – పరమాత్మ. అది తప్ప మిగతా కారిక అంతా అక్షరాలా అలాగే ఉంది.

ఈ కారికలో గౌడపాదాచార్యులవారు అభ్యుపేద్య వాదన చేస్తున్నారు. ఎదుటివారి వాదన సబబు కాదని తెలిసినా, కాదు అని నిరూపించినా కూడా, వాదనకోసం, వారి వాదనను ఒప్పుకున్నట్టే ఒప్పుకుని, దానిలోని లొసుగును ఎత్తి చూపటాన్ని అభ్యుపేద్య వాదన అంటారు.

ఇంతవరకూ పరమాత్మ జీవాత్మ కాలేదు అని నిరూపించేశారు గౌడపాదాచార్యులవారు. కాని వాదనకోసం, కాసేపు నిత్యమైన పరమాత్మ, అనిత్యమైన జీవాత్మగా మారాడు అనుకుందాం అంటున్నారు.

పరమాత్మ జీవాత్మగా మారి, సంసారంలో పడ్డాడు. జీవాత్మ కష్టపడి సాధన చేస్తున్నాడు మళ్ళీ పరమాత్మగా మారటానికి. మాండూక్యం నేర్చుకుంటున్నాడు కాబట్టి ఇప్పటికే ముప్పావు వంతు పరమాత్మగా మారాడు, ఇంకా కొంచెమే మిగిలింది. ఈ అధ్యాయం కూడా పూర్తయ్యేసరికి, పూర్తిగా మారిపోతాడు. అంటే సాధన ద్వారా అశాశ్వతమైన జీవాత్మ, శాశ్వతమైన పరమాత్మగా మారతాడు. ఇదీ వారి వాదన.

వారి వాదనే సబబు అందామనుకున్నా కూడా, అది సాధ్యం కాదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎందుకు? ఒకవేళ, వారి వాదన ప్రకారమే నిత్యమైన పరమాత్మ అనిత్యం అయ్యాడు, సాధన ద్వారా మళ్ళీ నిత్యం అయ్యాడు అని స్వీకరించినా కూడా అందులో లొసుగు ఉంది. నిత్యమైన పరమాత్మ ఒకసారి అనిత్యం అయితే, సాధనతో నిత్యం అయినా కూడా మళ్ళీ అనిత్యం అవడని ఏమిటి నమ్మకం? మళ్ళీ అనిత్యం అయితే, మళ్ళీ నిత్యం అవటంకోసం, మళ్ళీ సాధన చేయాలి. అప్పుడు అది మోక్షం అవదు. ఎందుకంటే వారు కూడా మోక్షం నిత్యం అని ఒప్పుకుంటారు.

ఇది స్వర్గలోకానికి వెళ్ళి, మళ్ళీ తిరిగివచ్చినట్టు అవుతుంది. మళ్ళీ సంసారంలో పడేటట్టయితే, మోక్షం వచ్చిందని ఎలా చెప్పగలరు? అందువల్ల జీవాత్మ పరమాత్మగా మారాడు వాదన చెల్లదు. ఒకసారి జీవాత్మగా మారిన పరమాత్మ, మళ్ళీ మారదని ఏమిటి నమ్మకం?

ఇదే వాదన జీవాత్మ వెళ్ళి వెళ్ళి పరమాత్మలో ఐక్యం అయ్యాడు వాదనకు కూడా వర్తిస్తుంది. రెండవరకం వాదనలో జీవాత్మ, అంతకుముందు పరమాత్మలోనే కలిసి ఉన్నాడనీ, ఏ కారణం వల్లనో విడిపోయాడనీ, అందువల్ల పరమాత్మలో కలవటానికి సాధన చేయాలని వారు అంటారు. దానికీ ఇదే జవాబు. పరమాత్మనుంచి ఒకసారి దూరంగా వస్తే, మళ్ళీ వెళ్ళి పరమాత్మతో కలిస్తే, కలిశాక ఎప్పటికీ పరమాత్మతోనే ఉంటాడని ఏమిటి నమ్మకం? ఒకసారి దూరం వస్తే, ఇంకొకసారి రాదా? వీరి వాదన ప్రకారం మోక్షం నిత్యం అవలేదు. వైకుంఠపాళీ ఆటలో ఒకసారి నిచ్చెన ఎక్కి పైకెళితే, ఇంకొకసారి పాము నోటబడి కిందికి జారినట్టు ఉంటుంది వీరి పరిస్థితి. అలాంటప్పుడు శాశ్వతమైన మోక్షానికి ఆస్కారం ఏది?

పై రెండు వాదనల్లోనూ నిత్యమైన మోక్షం సాధ్యం కాదు. అంటే పరమాత్మగా మారటం నిత్యమోక్షం కాదు, వెళ్ళి వెళ్ళి పరమాత్మలో ఐక్యమవటం కూడా నిత్యమోక్షం కాదు. మరి అయితే నిత్యమోక్షం అంటే ఏమిటి? మోక్షం అంటే పరమాత్మగా మారటం కాదు, పరమాత్మలో కలవటం కాదు, నేనే పరమాత్మ అని అర్థం చేసుకోవటం. నేను చైతన్యపరంగా అంతకుముందూ, ఇప్పుడూ, తరువాతా పరమాత్మనే అని అర్థం చేసుకోవాలి.

సంసారం అనేది నిజంగా లేదు. అది ఒక పెద్ద పొరపాటు. అది అజ్ఞానజనిత పొరపాటు. ఆ పొరపాటును పారద్రోలాలంటే, ఆ పొరపాటుకు మూలకారణమైన అజ్ఞానాన్ని పారద్రోలాలి. అజ్ఞానం పోతే, అజ్ఞానంనుంచి పొరపాటుగా వచ్చిన సంసారం కూడా పోతుంది. అజ్ఞానం పోవాలంటే, దానికి జ్ఞానం పొందటం ఒక్కటే మార్గం.

సంసారానికి పరిష్కారం జ్ఞానమొక్కటే అని అర్థం చేసుకోవాలి. ఇది స్పష్టంగా అర్థమవకపోతే, మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో జరిగే సంఘటన అనుకుంటారు. 'నాకు మోక్షం అంటే ఏమిటో బాగా అర్థమయింది. నాకు మోక్షం ఎప్పుడొస్తుంది?' ఈ ప్రశ్న మీరు వేశారంటేనే, మోక్షం గురించి మీకు బాగా అర్థమవలేదని అర్థం. వేదాంతం మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో వస్తుందని చెప్పదు. మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు. మీరు నిత్యముక్తపురుషులు అంటుంది. మీరు మోక్షం కలగాలి అని కోరుకుంటే మీరు పొరపాటు పడుతున్నారు అంటుంది.

**కృతకేనామృతస్తస్య** – ఒకకాలంలో పుట్టిన మోక్షం, అనిత్యమోక్షం అవుతుంది. అనిత్యమోక్షం నిత్యమోక్షం ఎలా అవుతుంది?

ఇక్కడ మనం వివరంగా ఈ కారిక అర్థం చూడటం లేదు. ఎందుకంటే, దీని అర్థాన్ని 3.22లో చూశాము.

ఈ మూడు కారికలూ నిదిధ్యాసనకు ఉపయోగపడే కారికలు. వీటి సారం మోక్షం అంటే ఎప్పుడో భవిష్యత్తులో కలిగేది అనే భావనను ఒదులుకోవాలి.

**కారిక 4.9**

**సాంసిద్ధికీ స్వాభావికీ సహజా అకృతా చ యా ।**
**ప్రకృతిస్సేతి విజ్ఞేయా స్వభావం న జహాతి యా ॥**

ఈ కారికలో గౌడపాదాచార్యులవారు ప్రకృతిని అంటే స్వభావాన్ని వివరిస్తున్నారు. పరమాత్మ ప్రకృతి నిత్యత్వం. అందువల్ల పరమాత్మ అనిత్య జీవాత్మ అవలేదు. ప్రకృతి గుణాన్ని వివరించటానికి గౌడపాదాచార్యులవారు, నాలుగు ఉదాహరణలను తీసుకున్నారు.

1. **సాంసిద్ధికీ** – సిద్ధపురుషులు పొందే కొన్ని అసాధారణ శక్తులతో పోల్చవచ్చు స్వస్వరూపాన్ని. సిద్ధులంటే అసాధారణ శక్తులు. పూర్వజన్మలో చేసిన సాధనవల్ల కొందరు ఈ సిద్ధులతో పుడతారు. అణిమ, మహిమ, గరిమవంటి సిద్ధులను పొందుతారు. అవి అనేక పద్ధతుల ద్వారా పొందుతారు. యోగాసనం, ప్రత్యేక మణులు, కొన్ని మూలికలు, ఔషధాలు, మంత్రాలు– వీటిలో దేన్నైనా పూర్వజన్మలో సాధన చేస్తే, ఈ జన్మలో సిద్ధపురుషులుగా పుడతారు. అంటే పుట్టినప్పటినుంచే కొన్ని అసాధారణ శక్తులను చూపిస్తారు. లేని వస్తువును పుట్టించటం, ఎదుటివారి మనస్సును చదవటం, భూభాగంలో ఉన్న జలాశయాన్ని కనుగొనటం కొన్ని సిద్ధులు. ఆ సిద్ధులు మారవు.

శాస్త్రం ఈ సిద్ధుల గురించి చెబుతుంది. భాగవత పురాణంలో కూడా వస్తాయి ఇవి. ఒకసారి ఈ సిద్ధి పొందితే, అది వారిని విడిచిపెట్టదు. ఈ జన్మంతా వారికి ఉంటుంది. అంటే అది వారి స్వస్వరూపం అయిపోతుంది. అందువల్ల ప్రకృతి గుణాన్ని ఇలా యోగులకున్న సిద్ధులతో పోల్చవచ్చు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

2. **స్వాభావికీ** – కొన్ని వస్తువులలో కొన్ని గుణాలు వాటి స్వస్వరూపంలా ఉంటుంది. ఉదాహరణకు ఉష్ణం, అగ్నియొక్క స్వభావం. అగ్ని ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా వేడిగానే ఉంటుంది.

3. **సహజా** – పుట్టుకతోనే కొన్ని సహజగుణాలు వస్తాయి కొన్నింటికి. ఉదాహరణకు పక్షులకు ఎగిరే గుణం, చేపకు నీటిలో ఈదే గుణం, గుడ్లగూబకు చీకటిలో చూసే గుణం– ఇవన్నీ సహజంగా అబ్బిన గుణాలు. ఎవరూ వాటికి శిక్షణనివ్వలేదు. సహజా అంటే సహ జాతా, తనతోపాటు పుట్టినది.

4. **అకృతా** – ఈ సృష్టిలో కొన్నింటికి కొన్ని గుణాలు ముందే ఉంటాయి. ఉదాహరణకు నీటికి పల్లం వైపుకు ప్రవహించే లక్షణం ఉంది. అందువల్లనే నీరు పల్లమెరుగు, నిజం దేవుడెరుగు అంటారు. పైనున్న నీటిని కిందకు ప్రవహింపజేయటానికి మానవప్రయత్నం అవసరం లేదు. కిందనుంచి పైకి పంపాలంటే ప్రయత్నం చేయాలి.

ఈ విధంగా ప్రకృతి అంటే సహజంగా ఉండే లక్షణాలు. ఎన్నటికీ పోని లక్షణాలు.

**ప్రకృతిస్సేతి విజ్ఞేయా** – అది ప్రకృతి అని తెలుసుకోవాలి అంటే ఏదైతే స్వస్వరూపమో, సహజమో, ఎన్నటికీ మారదో అది ప్రకృతి.

**యా స్వభావం న జహాతి** – దాని ప్రత్యేకత. అటువంటి స్వభావం ఎన్నటికీ మారదు.

ఈ విధంగా పరమాత్మ స్వభావం నిత్యత్వం. అలాగే ఆనందం, శుద్ధత్వం పరమాత్మ స్వభావం. అందువల్లనే మనను శుద్ధి చేసుకోనవసరం లేదని అంటారు. మనం నిత్య, శుద్ధ, ముక్తపురుషులం. అలాగని స్నానం చేయనవసరం లేదని పొరపాటు పడకండి. మనం నిత్యశుద్ధులం ఆత్మపరంగా; శరీరపరంగా కాదు. శరీరాన్ని, మనస్సును ఎప్పటికప్పుడు శుద్ధిపరుచుకోవాలి, కాని ఆత్మగా నిత్యశుద్ధులం అని అర్థం చేసుకోవాలి, గుర్తు పెట్టుకోవాలి.

### కారిక 4.10

**జరామరణనిర్ముక్తాస్సర్వే ధర్మాః స్వభావతః ।**
**జరామరణమిచ్ఛంతశ్చ్యవంతే తన్మనీషయా ॥**

వేదాంతసారాన్ని ఈ కారికలో ముగిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. వేదాంతసారం ఒక్కముక్కలో చెప్పాలంటే, మనం నిత్య, శుద్ధ, ముక్తపురుషులం.

**నిర్ముక్తాః** – మనం నిత్యముక్తులం.

**సర్వే ధర్మాః** – ఇక్కడ ధర్మః అంటే జీవాత్మ. అంతకుముందు ధర్మాః అంటే పరమాత్మ అని చూశాము. ఇప్పుడు జీవాత్మ అని ఎందుకంటున్నామంటే జీవాత్మ అంటే జీవాత్మగా మారిన పరమాత్మ కాదు, పరమాత్మనుంచి విడిపోయి, దూరంగా వచ్చిన జీవాత్మ కాదు; జీవాత్మ అంటే పరమాత్మకు ఇంకోపేరు. జీవాత్మ నిత్యముక్తం. ఎలా?

**స్వభావతః** – స్వభావపరంగా. మీరు దేన్నుంచి విముక్తి పొందుదామనుకుంటున్నారో, దాన్నుంచి మీరు ముందే ముక్తి పొందారు.

**జరా** – వృద్ధాప్యం. వృద్ధాప్యం అంటే ఎప్పుడూ భయపడతారు. వృద్ధాప్యం మీదపడితే, మీరు ఎవరిమీదో ఆధారపడాల్సి ఉంటుంది, మీ స్వేచ్ఛ పోతుంది.

**మరణమ్** – మిమ్మల్ని నిత్యం భయపెట్టే ఇంకొక అంశం మృత్యుభయం. ఈ భూమ్మీదనుంచి మాయమైపోకుండా, శాశ్వతంగా ఉండాలని కోరుకుంటారు. మీరు నిత్యత్వాన్ని కోరుకోవటానికి

కారణం, నిత్యత్వం మీ స్వరూపం. ఒకవేళ మరణమే మీ స్వరూపమయితే మీరు మరణం గురించి భయపడేవారు కాదు. ప్రకృతి సూత్రమే అది – ఏదయితే సహజమో దానితో మీరు హాయిగా ఉంటారు. ఏదయితే అసహజమో, దానితో యుద్ధం చేస్తారు.

ఉదాహరణకు కంటిలో నలుసు పడితే, దాన్ని పారద్రోలేదాకా మీరు హాయిగా ఉండలేరు. అలాగే అనారోగ్యం. ఏదైనా అనారోగ్యం చేస్తే, అది పోయేదాకా, నిశ్చింతగా ఉండలేరు. అంటే మీ స్వరూపంతోనే మీరు హాయిగా ఉండగలరు.

మీరు మరణాన్ని స్వీకరించలేకపోతున్నారు అంటేనే, మరణం మీ స్వస్వరూపం కాదని అర్థమవుతున్నది. అంటే మీరు వృద్ధాప్యం, మరణంనుంచి ముక్తి పొందలేరు కాని మీరు ఈ రెండింటినుంచీ ముక్తి పొందాలని తపన పడుతుంటారు.

**ఇచ్ఛంతః** – జరామరణాలను కోరుతున్నారు అంటే వృద్ధాప్యంనుంచి, మరణంనుంచి విముక్తి పొందాలని కోరుకుంటారు. దానికి కారణం అజ్ఞానం.

అజ్ఞానం ఎలా వచ్చింది? అజ్ఞానం ఎప్పుడు వచ్చింది? ఇది ఒక అంతుపట్టని సమస్య. అజ్ఞానం కొత్తగా లేదు; ఒకవేళ అజ్ఞానం కొత్తగా వస్తే ఎప్పుడొచ్చింది, ఎలా వచ్చిందని అడగవచ్చు. కాని మనం పుట్టటమే అజ్ఞానమనే పెట్టుబడితో పుట్టాము. కాకపోతే అజ్ఞానంయొక్క ప్రత్యేకత ఏమిటంటే, అజ్ఞానం అనాది కాని అది సంతం అంటే దానికి అంతం ఉంది.

ఉదాహరణకు మీకు ఫ్రెంచ్ భాషలో అజ్ఞానం ఉంది! ఈ అజ్ఞానం మీకు ఎప్పుడు వచ్చింది. మీ ఏడవ ఏట వచ్చిందా? ఒకవేళ మీ ఏడవ ఏట వచ్చిందని మీరు అనేటట్టయితే, మీకు మీ ఆరవ ఏట ఫ్రెంచ్ భాష వచ్చివుండాలి. కాని అలా జరగలేదే! అందువల్ల అజ్ఞానం అనాది కాని, దానికి అంతం ఉంది.

అదే విధంగా ఈ అనాది అజ్ఞానంవల్ల. మీరు వృద్ధాప్యం, మరణం మీకు వస్తాయని పొరపాటుపడి, వాటినుంచి మోక్షం కోరుతున్నారు.

**తన్మనీషయా** – ఈ పొరపాటు వల్ల, వీరు

**చ్యవంతే** – సంసారంలో పడిపోతున్నారు.

పూర్వం కొందరు చిన్నపిల్లలు ఒక కాయిన్‌గేమ్ ఆడేవారు. కొందరు పిల్లలు కలిసి, ఒక అబ్బాయి నుదుటిమీద ఒక నాణేన్ని పది, పదిహేను నిముషాలు నొక్కిపెట్టి ఉంచేవారు. దాని తరువాత, అతను ఆ నాణేన్ని కిందకి పడేలాగా చేయాలి అంటారు. అతను నాణేన్ని ముట్టుకోకుండా, తల వంచి ఉంచి, తన తల వెనుక తనే కొట్టుకోవాలి అంటారు. దానికి మూడు అవకాశాలు కూడా ఇస్తారు ఉదారంగా.

నిజానికి వారేం చేస్తారు? ఆ నాణేన్ని పదిహేను నిముషాలు అతని నుదుటిమీద నొక్కిపెట్టి ఉంచాక, ఆ అబ్బాయికి తెలియకుండా తీసేసి, ఎవరో ఒకరి అరచేతిలో దాచేస్తారు. కాని అంతసేపు నాణేన్ని అదిమిపెట్టి ఉంచటంవల్ల ఆ అబ్బాయికి తన నుదుటిమీద నాణెం లేదనే విషయమే తెలియదు, అనుమానం కూడా రాదు.

అతని ప్రారబ్ధకర్మ చూడండి! తన తలవెనుక తనే కొట్టుకుంటాడు! ఆ నాణెం కింద పడటంకోసం. అది కిందపడదు. తక్కిన పిల్లలు గలగలా నవ్వుతారు. రెండోసారి, మూడోసారీ అంతకంతకూ గట్టిగా కొట్టుకుంటాడు కాని నాణెం కిందపడదు సరికదా, అంతకంతకూ తోటివారి నవ్వు ఎక్కువవుతూ వస్తుంది. అతనికి కొంచెం కూడా అనుమానం రాదు. ఎందుకూ? అతని దృష్టిలో ఆ నాణెం అతని నుదుటి మీదే ఉంది.

స్నేహితులేమో ఉదారంగా మరో రెండు అవకాశాలు ఇస్తామంటారు. రెండు కాదుకదా, మరో వందసార్లు తన తల వెనుక తను కొట్టుకున్నా, ఆ నాణెం కిందపడదు. ఉంటే కదా పడటానికి! అలా అతన్ని కొంతసేపు ఏడిపించాక, వారి సరదా తీరాక, అద్దం తెచ్చి అతని ముఖం ముందు పెడతారు. అప్పుడా అబ్బాయికి అర్థం అవుతుంది. ఇంతవరకూ, తన నుదుటిమీద నాణెం లేదని, లేనేలేని నాణేన్ని కింద పడేయటానికి, తనను తను బాధించుకుంటున్నాడనీను.

మనం చేస్తున్నదేమీ తక్కువకాదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఉపనిషత్తులు నేర్చుకుని కూడా, లేనేలేని సంసారం ఉందనుకుని పొరపాటు పడి, ఆ సంసారంనుంచి బయటపడటానికి, మనను మనమే బాధించుకుంటున్నాము. ఈ జన్మలో కాకపోతే వచ్చే జన్మలోనైనా ఈ సంసారంనుంచి విముక్తి పొందుతామా అని ఆశిస్తాము. ఇంతకుమించిన దుఃఖం మరొకటి లేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

అక్కడ సమస్య నాణెం ఉండటం కాదు, నాణెం ఉందనుకోవటం. అంటే సమస్య లేకపోయినా ఉందనుకోవటం. సంసార విషయమూ అంతే. నిజంగా సంసారం లేదు, సంసారం ఉందనుకుంటున్నాము. అక్కడ పరిష్కారం తల వెనుక కొట్టుకోవటం కాదు, అద్దం తెచ్చి చూపించటం. ఇక్కడ పరిష్కారం - సంసారాన్ని పారద్రోలటం కాదు, శాస్త్రం అనే అద్దం తెచ్చి చూపించటం. గురువు వేదాంతశాస్త్రం ద్వారా సంసారం లేదు, ఉందనుకుని నువ్వు భ్రాంతి చెందుతున్నావని చూపించాలి. గురువు దీనికి చాలా అవస్థ పడాలి. ఎందుకంటే, లేనేలేని దాన్ని పారద్రోలాలి.

తన్మనీషయా అంటే మామూలుగా జ్ఞానం కాని ఇక్కడ పొరపాటు. ఆ పొరపాటువల్ల; చ్యవంతే - మోక్షం పొందాలి అనే పొరపాటువల్ల సంసారంలో పడిపోతారు.

**2బి) వేదాంతసారము కారికలు 6–10**

| **పొరపాటు** | **ఖండన** | **లక్షణం** |
|---|---|---|
| పరమాత్మ జీవాత్మ అయ్యాడు<br>జీవాత్మ మళ్ళీ పరమాత్మ అవ్వాలి | మళ్ళీ పరమాత్మ జీవాత్మ అవదని<br>ఏమిటి నమ్మకం | పరమాత్మ<br>నిర్వికారం |
| పరమాత్మనుంచి జీవాత్మ కిందికి పడ్డాడు.<br>సాధన చేసి ఆ లోకానికి వెళ్ళి పరమాత్మతో<br>ఐక్యం అవ్వాలి | సాధన చేసి పైకి వెళితే, మళ్ళీ<br>కిందికి వస్తాడు | పరమాత్మ<br>సర్వవ్యాపకం |
| పై కారణాలవల్ల మోక్షం<br>భవిష్యత్తులో వస్తుంది | మోక్షానికి ఒక ఆది ఉంటే ఒక<br>అంతం కూడా ఉంటుంది. అది<br>అనిత్యం అవుతుంది | మోక్షం నిత్యం.<br>అజ్ఞానం తొలగటమే మోక్షం |

అందువల్ల సంసారం అంటే, అసలు సంసారం లేనేలేదని అర్థం చేసుకోవాలి. సంసారాన్ని తొలగించనవసరం లేదని అర్థం చేసుకోవటాన్నే, లక్ష్యార్థంగా సంసారం తొలుగుతుంది అంటారు. అది అర్థమయ్యేదాకా, అనేక ఉపనిషత్తులు నేర్చుకుంటూనే ఉండాలి.

ఎందుకంటే మనం మన స్వస్వరూపంనుంచి బాగా దూరంగా వచ్చేశాము. అందువల్ల వేదాంతం చేయాల్సింది మనలో పేరుకుపోయిన తప్పుడు భావనలను పారద్రోలటమే. వేదాంతం అంటే బుద్ధిని కడిగివేస్తుందని ఎవరైనా అంటే మనమేమీ వారిని తప్పుపట్టము. నిజమే, బుద్ధిలో పేరుకున్న అనేక మలినాలను కడిగివేస్తేనే, స్వచ్ఛమైన స్వరూపం బయటకు వస్తుంది.

ఇక్కడితో వేదాంతసారం అయిపోయింది.

(దీన్ని టూకీగా **3.వేదాంతసారము కారికలు 6-10** పట్టికలో పక్క పేజీలో చూడవచ్చు.)

**2బి). సాంఖ్యమత ఖండన - కారికలు 11-13: ఉపోద్ఘాతం**

మనకు ప్రధానంగా రెండు దర్శనాలు ఉన్నాయనీ, వాటిని నాస్తికదర్శనం అనీ, ఆస్తికదర్శనం అనీ అంటారని చూశాము. నాస్తికదర్శనంలో వేదాన్ని నమ్మరు, ఆస్తికదర్శనంలో వేదాన్ని నమ్ముతారు. ఆస్తికదర్శనంలో ఆరు దర్శనాలు ఉన్నాయి, అద్వైత వేదాంతంతో కలిపి. అందులో రెండు శక్తివంతమైనవి. అవి సాంఖ్యదర్శనం, న్యాయదర్శనం. ఆ రెండూ సృష్టి జరిగిందని అంటాయి కాని, వాటి వాదనల్లో భేదం ఉంది. సాంఖ్య దర్శనానిది సత్కార్యవాదం అయితే, న్యాయదర్శనానిది అసత్కార్యవాదం. నిజానికి మనం వారితో విడిగా వాదించనవసరం లేదనీ, వారిద్దరూ వారికి తెలియకుండానే, ఒకరిని ఒకరు ఖండించుకోవటం ద్వారా మన అజాతివాదాన్ని సమర్థిస్తున్నారనీ, ఈ అధ్యాయంలోనే కారికలు 3-5లో చూశాము. (పట్టిక **2. అవివాదము వివరణ కారికలు 3-5** మళ్ళీ చూడండి)

కాని గౌడపాదాచార్యులవారు సాంఖ్యదర్శనాన్ని ఖండించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. ఎందుకంటే ఒక కారణం అది చాలా శక్తివంతమైన దర్శనం; ఇంకొక కారణం అది చాలా అంశాల్లో మన వేదాంతానికి చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో వేదాంతాన్ని సాంఖ్య అని కూడా అంటారు. భగవద్గీత రెండవ అధ్యాయం పేరు సాంఖ్యయోగం. అలా పోలికలు ఉండటంవల్లనూ, అదే పేరును కూడా వాడటంవల్లనూ సాంఖ్యదర్శనాన్నే వేదాంతంగా పొరపాటు పడే అవకాశం ఉంది. అందువల్ల దాన్ని ఖండించాల్సిన గురుతరమైన బాధ్యత మన గురువులమీద ఉంది.

సాంఖ్యమత దార్శనికుడు కపిలముని. భాగవతంలో చూసే కపిలముని కాదు ఈయన. భాగవతంలోని కపిలముని సాక్షాత్తూ భగవంతుని అవతారం. ఆయన వేదాంతాన్నే

బోధించాడు కూడా. కాని ఇప్పటి సాంఖ్యముని అవతారం కాదు. ఆయన సాంఖ్య దార్శనికుడు. వ్యాసాచార్యులవారు, శంకరాచార్యులవారు ఆయన బోధ వేదాంతానికి భిన్నంగా ఉందని భావిస్తారు.

బ్రహ్మసూత్రాల్లో నాలుగు అధ్యాయాలు ఉంటే, మొదటి అధ్యాయం మొత్తమే కాకుండా, రెండవ అధ్యాయంలో కూడా కొంతమేరకు సాంఖ్యదర్శనాన్ని ఖండించారు వ్యాసాచార్యులవారు. బ్రహ్మసూత్రాల భాష్యంలో శంకరాచార్యులవారు కూడా ఖండించారు. అదే విధంగా ఇక్కడ కూడా గౌడపాదాచార్యులవారు సాంఖ్యమతాన్ని ఖండిస్తున్నారు, కారికలు 11–13లో.

న్యాయదర్శనం కూడా శక్తివంతమైనదే అయినా, దాన్ని పట్టించుకోవటం లేదు గౌడపాదాచార్యులవారు. ఆయన ఉద్దేశ్యంలో అది అంత శక్తివంతమైనది కాదు. అది అసత్కార్యవాదాన్ని సూచిస్తుందని చూశాము. దాన్ని సాంఖ్యులు కొట్టివేశారని కూడా చూశాము. ఇక్కడ ఒకసారి ఆ వాదనలను గుర్తు తెచ్చుకుందాము.

న్యాయదార్శనికులు ఉనికి లేని కుండ పుట్టింది అంటారు. ఆ వాదన రెండు కారణాలవల్ల చెల్లదు.

ఎ) **సైన్స్‌పరంగా పుట్టదు** – సైన్స్‌పరంగా పదార్థం కొత్తగా పుట్టదు, నాశనమవదు. ఈ సూత్రం ప్రకారం ఉనికిలేని వస్తువు పుట్టలేదు.

బి) **వ్యాకరణపరంగా కుదరదు** – ఉనికి లేని కుండ పుట్టింది అంటే ఆ వాక్యంలో **పుట్టింది** క్రియ. ప్రతిక్రియాపదానికి కర్త ఉండాలి. క్రియ ఒక పనిని చూపిస్తుంది కాబట్టి దానంతట ఆ పని జరగదు. కర్త లేకుండా వాక్యం రాదు. పుట్టింది అంటే ఏది పుట్టింది? ఉనికిలేని కుండ అనలేము. అందువల్ల ఈ వాదన చెల్లదు.

అందువల్ల న్యాయదర్శనం జోలికి వెళ్ళటం లేదు గౌడపాదాచార్యులవారు. సాంఖ్య మతాన్ని ఖండిస్తున్నారు. కారికల్లోకి వెళ్ళేముందు వాటి సారాన్ని చూద్దాము.

**సాంఖ్యమత సిద్ధాంతము** – సాంఖ్యమతఖండన చూసేముందు వారి సిద్ధాంతమేమిటో అర్థం చేసుకోవాలి. వీరిది సత్కార్యవాదన.

1. **కారణం = కార్యం** – కుండ సృష్టి జరిగింది అంటే కుండ కొత్తగా పుట్టలేదు అంటారు వారు. కుండ, కుండగా రూపుదాల్చకముందు అవ్యక్తంగా దాని కారణంలో ఉంది అంటారు. కుండ పుట్టకముందు మట్టిలో అవ్యక్తంగా ఉంది, చెట్టు పుట్టకముందు దాని విత్తనంలో అవ్యక్తంగా ఉంది.

అంటే ఒక కారణంనుంచి కార్యం రాకముందు, అది కారణావస్థలో ఉంది. అది పుట్టాక, కార్యావస్థలోకి వస్తుంది. అంటే సృష్టి అంటే అవస్థాభేదం మాత్రమే అంటారు

వారు. కారణమే మారి కార్యంగా అవుతుంది. కారణంలో అవ్యక్తంగా ఉన్న కొన్ని లక్షణాలు కార్యంలో వ్యక్తరూపం దాలుస్తాయి. విత్తనంలో చెట్టులో ఉండే అనేక భాగాలు తెలియవు. అది కార్యావస్థ దాల్చాక తెలుస్తాయి.

మట్టి అవ్యక్తంగా ఉంటే కారణం, కుండగా వ్యక్తమయితే కార్యం. అంటే వీటిలో అవస్థాభేదం ఉంది తప్పితే, వస్తుభేదం లేదు. ఉదాహరణకు మంచు, నీరు, ఆవిరి తీసుకోండి. ఈ మూడింటిలోనూ ఉన్నది ఒకటే నీరు. వస్తువు భేదం లేదు, అవస్థాభేదం ఉంది.

ఆ విధంగా వారి మొదటి సిద్ధాంతం కారణం = కార్యం. వేదాంతం కూడా ఈ సిద్ధాంతాన్ని స్వీకరిస్తుంది కాని కొంతమేరకు మాత్రమే. కారణం = కార్యం, కుండ-మట్టికి, సరిపోతుంది కాని, బ్రహ్మ-జగత్తులకు సరిపోదు.

2. **కారణం = ప్రకృతి = నిత్యం** - జగత్తుయొక్క సృష్టి జరిగిందని చెబితే, దానికొక కారణాన్ని చూపించాలి. సాంఖ్యదార్శనికులు జగత్తుయొక్క సృష్టి ప్రకృతినుంచి జరిగిందని అంటారు. సాంఖ్యులు ప్రకృతిని ప్రధానం అంటారు. అంతేకాదు ప్రకృతి నిత్యం అనికూడా అంటారు.

కారణం = ప్రకృతి = నిత్యం

3. **కార్యం = ప్రపంచం = అనిత్యం** - జగత్తు ప్రకృతినుంచి పుట్టింది కాబట్టి ప్రకృతి కారణం, జగత్తు కార్యం అవుతాయి. కార్యం పుడుతుంది కాబట్టి దానికొక ఆరంభం ఉంటుంది, ఒక అంతం ఉంటుంది. పుట్టిన ప్రతిదీ గిట్టక తప్పదు. అందువల్ల అది అనిత్యం అవుతుంది.

కార్యం = ప్రపంచం = అనిత్యం

సాంఖ్యదర్శనంలో ఇంకా చాలా సిద్ధాంతాలు ఉన్నాయి కాని, ఈ సందర్భంలో ఈ మూడు సిద్ధాంతాలు చాలు మనకు.

**సాంఖ్యమత ఖండన** - ఈ సిద్ధాంతాలను ఆధారంగా చేసుకుని గౌడపాదాచార్యులవారు వాటిలో నాలుగు దోషాలను ఎత్తి చూపించబోతున్నారు. కారిక 11లో మొదటి దోషం, 12లో రెండవ దోషం, 13లో మూడవ, నాలుగవ దోషాలను చూపించబోతున్నారు.

ఇప్పుడు మనం విడిగా మొదటి రెండు దోషాలనే చూద్దాము. ఎందుకంటే విషయమే జటిలమైనదంటే, 11, 12 కారికల్లో గౌడపాదాచార్యులవారు వాడిన భాష కూడా చాలా క్లిష్టంగా ఉంటుంది. ఆ దోషాలను చూసేముందు, వారి మూడు సిద్ధాంతాలను ఒకచోట చూద్దాము.

సిద్ధాంతం 1 – కారణం = కార్యం

సిద్ధాంతం 2 – కారణం = ప్రకృతి = నిత్యం

సిద్ధాంతం 3 – కార్యం = ప్రపంచం = అనిత్యం

**దోషం 1 – కార్య నిత్యత్వ దోషం**

1, 2 సిద్ధాంతాలను కలిపి చూద్దాము. కారణం = కార్యం అయితే, కారణం = నిత్యం అయితే, కార్యం = నిత్యం అవాలి. కాని వారేం అంటున్నారు? కార్యం = అనిత్యం అంటున్నారు. దీని ప్రకారం కార్యనిత్యత్వ దోషం ఏర్పడుతుంది.

**దోషం 2 – కారణ అనిత్యత్వ దోషం**

ఇప్పుడు 1, 3 సిద్ధాంతాలను కలిపి చూద్దాము.

కారణం = కార్యం అయితే, కార్యం = అనిత్యం అయితే, కారణం = అనిత్యం అవాలి. కాని వారేం అంటున్నారు? కారణం = నిత్యం అంటున్నారు. దీని ప్రకారం కారణ అనిత్యత్వదోషం ఏర్పడుతుంది.

ఆ విధంగా 1, 2 కలిపితే, మూడవ సిద్ధాంతం చెల్లదు; 1, 3 కలిపితే రెండవ సిద్ధాంతం చెల్లదు. ఈ దోషాలను ఇప్పుడు 11, 12 కారికల్లో చూద్దాము. తక్కిన రెండు దోషాలను 13వ కారికకు వచ్చినప్పుడే చూద్దాము.

**కారిక 4.11**

**కారణం యస్య వై కార్యం కారణం తస్య జాయతే ।**
**జాయమానం కథమజం భిన్నం నిత్యం కథం చ తత్ ॥**

ఈ రెండు కారికల పదప్రయోగాలు క్లిష్టంగా ఉన్నాయని చూశాము కాబట్టి మనం వాటి ప్రతిపదార్థం చూడబోవటం లేదు. ఈ కారికలో 1, 3 సిద్ధాంతాల దృష్ట్యా రెండవ సిద్ధాంతం చెల్లదని నిరూపిస్తున్నారు.

**కారణం యస్య వై కార్యమ్** – సాంఖ్యదార్శనికుల ప్రకారం కారణం = కార్యం. ఇది సిద్ధాంతం 1.

సిద్ధాంతం 3 – కార్యం = ప్రపంచం = అనిత్యం

**జాయమానం కథమ్ అజమ్** – అలాంటప్పుడు కారణం నిత్యం ఎలా అవుతుంది?

1, 3 కలిపితే 2వ సిద్ధాంతం తప్పు. దీన్ని కారణ అనిత్యత్వదోషం అంటారు.

**కారిక 4.12**

**కారణాద్యద్యనన్యత్వమతః కార్యమజం యది।**
**జాయమానాద్ధి వై కార్యాత్కారణం తే కథం ధ్రువమ్ ॥**

ఇందులో రెండవపాదం, ముందు కారికలో చెప్పిన దోషాన్నే మళ్ళీ చెబుతున్నది. ఏమిటా దోషం? 1, 3 సిద్ధాంతాలు కలిపితే, 2వ సిద్ధాంతం తప్పు. దీన్ని కారణ అనిత్యత్వదోషం అంటారు.

మొదటిపాదంలో ఇంకొక దోషాన్ని చూస్తాము. ఏమిటది? 1, 2 కలిపితే, మూడవ సిద్ధాంతం తప్పు.

కారణం = కార్యం అయితే, కారణం = నిత్యం అయితే, కార్యం = నిత్యం అవాలి. కాని కార్యం = అనిత్యం అంటున్నారు వారు.

**కారణాద్ యది అనన్యత్వమ్** – ఒకవేళ కార్యం కారణం కంటే భిన్నం కాకపోతే,

**అతః కార్యమ్ అజమ్** – అప్పుడు కార్యం నిత్యం అవాలి. కాని మీరు కార్యం అనిత్యం అంటున్నారు. దీన్ని కార్య నిత్యత్వ దోషం అంటారు.

కారణం = కార్యం అన్నప్పుడు, అయితే రెండూ నిత్యం అవాలి లేదా రెండూ అనిత్యం అవాలి. ఒకటి నిత్యం, ఇంకొకటి అనిత్యం ఎలా అవుతాయి? సాంఖ్యదార్శనికులే రెండూ ఒకటే అని ముందు చెప్పి, ఒకటి నిత్యం అనీ, ఇంకొకటి అనిత్యం అనీ అన్నారు. అవి చెల్లవని నిరూపించారు గౌడపాదాచార్యులవారు.

**కారిక 4.13**

**అజాద్వై జాయతే యస్య దృష్టాంతస్తస్య నాస్తి వై।**
**జాతాచ్చ జాయమానస్య న వ్యవస్థా ప్రసజ్యతే ॥**

ఇందులో సాంఖ్యదార్శనికుల వాదనల్లో ఇంకో రెండు దోషాలను ఎత్తి చూపుతున్నారు గౌడపాదాచార్యులవారు. ఈ దోషాలను అర్థం చేసుకోవటానికి సాంఖ్యదార్శనికుల సిద్ధాంతం ఇంకొకటి అర్థం చేసుకోవాలి.

3. **యుక్తి విరోధదోషం**

**ప్రకృతి = మూలకారణం = అప్రత్యక్షం**

సాంఖ్యదార్శనికులు ప్రకృతిని ప్రధానం అంటారని చూశాము. దాన్ని మూలకారణం అంటారు. అందువల్లనే ప్రకృతిని మూలప్రకృతి అనికూడా అంటారు. కాని ప్రకృతి ప్రత్యక్ష ప్రమాణ అగోచరం అంటారు. వారికి ప్రకృతి ప్రత్యక్షప్రమాణానికి అందకపోతే ప్రకృతే

మూలకారణం అని ఎలా చెప్పగలరు? తర్కప్రమాణం ద్వారా తెలుసుకున్నాము అంటారు. తర్కప్రమాణాన్ని అనుమాన ప్రమాణం అనికూడా అంటారు. అనుమాన ప్రమాణానికి ఒక వ్యాప్తి వాక్యం ఉండాలని చూశాము. వ్యాప్తి వాక్యం ప్రత్యక్ష ప్రమాణంనుంచి వస్తుంది. శాస్త్రంలో చూసే ఉదాహరణ కొండమీద అగ్ని ఉంది; పొగనుబట్టి చెప్పాము, దానికి ఉదాహరణ పూర్వకాలపు వంటిల్లు. ఈ అనుమానవాక్యానికి వ్యాప్తి వాక్యం –

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుంది.

ఇది మన ప్రత్యక్షప్రమాణంనుంచి వస్తుంది. పూర్వకాలపు వంటిల్లు గమనిస్తే పొగ, అగ్ని కలిపి ఉండటం చూస్తాము. అందువల్ల ఇంకోచోట పొగ మాత్రం కనిపిస్తే, అక్కడ అగ్ని ఉందని తర్కాన్ని ఉపయోగించి చెబుతాము.

కాని ఇదే వాక్యాన్ని తిరగేసి చెప్పకూడదు –

**యత్ర యత్ర అగ్నిః తత్ర తత్ర ధూమః**

ఎక్కడ అగ్ని ఉంటే, అక్కడ పొగ ఉంది అనకూడదు. ఎందుకంటే ఇప్పటి వంటింట్లో గ్యాస్‌స్టవ్‌లకు అగ్ని ఉంటుంది కాని పొగ రాదు. రెండు ఒకచోట కలిసి ఉండటం చూస్తే, దాన్ని వ్యాప్తి వాక్యం అంటారు.

సాంఖ్యులు ప్రకృతి కారణం, ఈ ప్రకృతి నిత్యం అంటారు.

**దోషం** – ప్రకృతి = నిత్యం అనేదానికి వ్యాప్తి వాక్యం కుదరదు. మన అనుభవంలో మనం చూసే వ్యాప్తి వాక్యం ఏది కారణమో అది అనిత్యం.

**యత్ యత్ కారణం తత్ తత్ అనిత్యత్వమ్**

ఏది కారణమైతే, అది అనిత్యం అవుతుంది

జగత్తులో ఏ కారణాన్ని తీసుకున్నా, అది ఇంకొక కారణంనుంచి వచ్చిన కార్యమే అవుతుంది. మన తల్లిదండ్రులు మన పుట్టుకకు కారణం; కాని వారే వారి తల్లిదండ్రుల నుంచి వచ్చిన కార్యం. అలాగే విత్తనం చెట్టుకి కారణం, కాని విత్తనం ఇంకొక చెట్టునుంచి వచ్చిన కార్యం. ఈ సూత్రం ప్రకారం ప్రకృతి = నిత్యం అనే సిద్ధాంతం చెల్లదు. దీనికి అనుమానవాక్యం ఇది –

**ప్రకృతిః అనిత్యా కారణత్వాత్ బీజవత్**

ప్రకృతి అనిత్యం, అది కారణం కాబట్టి, విత్తనంలాగా.

ఈ అనుమాన వాక్యానికి వ్యాప్తి వాక్యం ఇది

**యత్ యత్ కారణం తత్ తత్ సాది**

ఏది కారణమైతే దానికొక ఆది ఉంటుంది

సాది అంటే సా+ఆది=ఆరంభం ఉన్నది. అందువల్ల ఆరంభం లేని కారణాన్ని చూపించటానికి మనకు ప్రత్యక్ష ప్రమాణం లేదు.

దోషం 3 – యుక్తి విరోధ దోషం.

4. **అనవస్థా దోషం** – ఈ మూడవ దోషాన్ని పారద్రోలటానికి వారికి ఒకటే మార్గం ఉంది. ప్రకృతి మూలకారణం కాని అది అనాది కాదు, అదికూడా ఒక కార్యమే అనాలి. మన తల్లిదండ్రులు మన పుట్టుకకు కారణం, వారి పుట్టుక విషయంలో కార్యం అయినట్టుగా ప్రకృతి, జగత్తుకు కారణం, కాని అదికూడా కార్యం అనాలి.

వారు ప్రకృతి అనాది అనే అంటారు. సాది అని ఒప్పుకోరు. సాది అన్నారనుకుందాము, అప్పుడు కూడా ఒక దోషం ఉంది. నిజం కాకపోయినా, అలా ఒప్పుకుని చేసే వాదనను అభ్యుపేద్య వాదన అంటారు. అలా ఒకవేళ వారు ప్రకృతి సాది అని ఒప్పుకున్నా కూడా, అందులో ఒక దోషం ఉంది ఏమిటది?

సరే, ప్రకృతి అనాది కాదు, అది కూడా కార్యమే అంటే, దాని కారణం ఏమిటి అంటాము మనం. పిల్లలు అడుగుతూ ఉంటారు, 'భగవంతుణ్ణి ఎవరు సృష్టించారు?' ఆ విధంగా ప్రకృతిని ఎవరు సృష్టించారు అంటే వారు మూలప్రకృతి అంటున్న ఈ ప్రకృతికి ఇంకొక మూల, మూలప్రకృతి కారణం అవాలి. అప్పుడు కూడా సమస్య తీరదు. మూల, మూలప్రకృతికి కారణం ఏమిటి అంటాము? మూల, మూల, మూలప్రకృతి అనాలి. కాని ఈ ప్రశ్నల పరంపరకు అంతు ఉండదు. ఎందుకంటే ప్రతి కారణానికి దాని కారణం ఇంకొకటి ఉందని మన అనుభవం చెబుతున్నది. ఈ కార్య–కారణ గొలుసు నిరంతరంగా సాగుతుంది. దీన్ని అనవస్థాదోషం అంటారు. ఇంగ్లీషులో ఇన్‌ఫినిట్ రిగ్రెస్ అంటారు.

దోషం 4 – అనవస్థా దోషం.

అందువల్ల కారణాన్ని నిరూపించలేకపోతే, కార్యం లేదు. ఆ విధంగా సాంఖ్యులు సృష్టి జరిగిందని నిరూపించలేరు. అజాతివాదము సత్యము.

ఈ నేపథ్యంతో కారిక 13 చూద్దాము.

**తస్య** – ఆ సాంఖ్య దార్శనికుడు అంటున్నాడు,

**అజాద్వై జాయతే** – అనాది అయిన ప్రకృతినుంచి జగత్తు వచ్చిందని. అజాద్ అంటే పుట్టుక లేనిది. అంటే అనాది ప్రకృతి. సాంఖ్యులు ప్రకృతిని కారణం అంటారు కాని, అదే సమయంలో

ప్రకృతి అనాది, అజం అంటారు. కారణత్వం, అనాదిత్వం ఒకచోట ఉండలేవు. అలా రెండూ కలిపి చూపాలంటే, కనీసం ఒక ఉదాహరణ చూపించగలగాలి.

**దృష్టాంతస్తస్య నాస్తి వై** – కాని అతను చూపించటానికి ఒక్క ఉదాహరణ కూడా లేదు. అది అతను భావిస్తున్నాడు అంతే. అది తార్కికంగా చెల్లదు.

ఈ పాదం దోషం 3 – యుక్తి విరోధదోషాన్ని చూపిస్తుంది.

**జాతాచ్చ జాయమానస్య** – ఒకవేళ మీరు జగత్తు ప్రకృతినుంచి పుట్టిందనీ, ప్రకృతి ఇంకొకదానినుంచి పుట్టిందనీ అనేటట్టయితే,

**న వ్యవస్థా** – అనవస్థా దోషం

**ప్రసజ్యతే** – ప్రాప్తిస్తుంది.

అనవస్థా దోషం అంటే ఒక నిర్ణయం చేయటానికి వీలులేని పరిస్థితి.

ఈ పాదం దోషం 4 – అనవస్థా దోషం చూపిస్తుంది.

అందువల్ల జగత్తుకు ఒక మూలకారణాన్ని చూపించలేరు వారు. తార్కికంగా ఒక కారణాన్ని చూపించలేకపోతే, కార్యాన్ని నిరూపించలేరు. కార్యాన్ని నిరూపించలేకపోతే, 'సృష్టి' పదాన్ని వాడలేరు. సృష్టి పదం వాడాలంటే ఒక కారణం, ఒక కార్యం ఉండితీరాలి. కార్య–కారణాలను నిరూపించలేకపోతే, సృష్టి పదాన్ని ఎందుకు వాడుతున్నారు? దాన్ని కొట్టివేయండి అంటారు గౌడపాదాచార్యులవారు.

ఒకవేళ అలా సాంఖ్యులు సృష్టి లేదని ఒప్పుకుంటే, అది కూడా వేదాంతంలోకి వస్తుంది. మూడవ అధ్యాయంలో గౌడపాదాచార్యులవారు అజాతివాదాన్ని నిరూపించారు. జీవ, జగత్తుల సృష్టి నిజంగా జరగలేదని శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా నిరూపించారు అందులో.

సృష్టి జరగకపోతే, ఉన్నదేమిటి? బ్రహ్మ ఉంది. అంతకుముందు, ఇప్పుడు, ఇకముందూ కూడా ఉండేది బ్రహ్మ మాత్రమే. మరి అయితే సృష్టి మాటేమిటి? సృష్టి జరిగిందనుకోవటం మన పొరపాటు మాత్రమే. మరి అయితే మనమేం చేయాలి? ఈ పొరపాటును వదిలివేయాలి. ఎలా వదిలివేయాలి? మాండూక్యోపనిషత్‌ను చివరిదాకా అధ్యయనం చేయాలి. చివర్లోనన్నా,

**న జాయతే మ్రియతే వా కదాచిత్**

అని చెప్పగలుగుతాము. సృష్టి జరిగిందనుకోవటం ఒక పొరపాటు.

**అజాతి వాదము సత్యము.**

దీనితో సాంఖ్యమత ఖండన అయిపోయింది.

**2డి). ద్వైతవాద ఖండన - కారికలు 14-23 ఉపోద్ఘాతం**

గౌడపాదాచార్యులవారు కారికలు 14-23లో ద్వైతవాదులను ఖండిస్తున్నారు. వీరు సాంఖ్యులకు భిన్నంగా ఉంటారు.

సాంఖ్యులు ప్రధానంగా తార్కికులు. వారు వేదాన్ని నమ్ముతారు కాని వారికి వేదం ముఖ్యం కాదు. వేదమా, తర్కమా అంటే వారు తర్కానికే పెద్దపీట వేస్తారు. కాని వైదికులు వేదానికి పెద్దపీట వేస్తారు. వారికి వేదమా, తర్కమా అంటే వేదమే ముఖ్యం. వేదాన్ని ఆధారంగా చేసుకుని వచ్చిన వీరి వాదనను ద్వైతం అంటారు. ఈ ద్వైతంలోనే మళ్ళీ చిన్నచిన్న భేదాలు ఉన్నాయి. కాని వీరంతా మూకుమ్మడిగా సృష్టి నిజంగా జరిగింది అంటారు.

గౌడపాదాచార్యులవారు వీరిని కూడా ఖండించి, నిజంగా సృష్టి జరగలేదనీ, అజాతి వాదమే సత్యమనీ నిరూపించదలుచుకున్నారు. అంతకుముందు, ఇప్పుడు, ఇకముందూ కూడా ఉండేది బ్రహ్మే. సృష్టి అనేది ఒక పొరపాటు మాత్రమే. అది అజ్ఞానంనుంచి రూపుదిద్దుకున్న పొరపాటు. ఇప్పుడు ద్వైతవాద ఖండనను చూస్తాము. వీరిది కర్మ సిద్ధాంతం.

**కర్మ సిద్ధాంతంలో వాదనలు**

వీరు సృష్టి జరిగిందని నిరూపించటానికి కర్మ సిద్ధాంతాన్ని తీసుకుంటారు. కాని అది తర్కానికి నిలవదు అంటారు గౌడపాదాచార్యులవారు.

మనం కూడా కర్మ సిద్ధాంతం గురించి మాట్లాడతాము కాని దాన్నే అంతిమ సత్యంగా తీసుకోము. ప్రశ్నలు వేసే మన బుద్ధిని తాత్కాలికంగా తృప్తి పరచటానికి ఈ కర్మ సిద్ధాంతాన్ని వాడతాము. కాని బుద్ధి పరిపక్వత చెంది, మాండూక్య కారికలను జీర్ణించుకునే దశకు చేరుకున్నాక, కర్మ సిద్ధాంతాన్ని కొట్టివేసి, **అజాతివాదము సత్యము** అంటాము.

కాని ఈ ద్వైతవాదులు కర్మ సిద్ధాంతం అంతిమసత్యం అంటారు. అది తాత్కాలికంగా పనిచేస్తుంది కాని అంతిమసత్యం కాలేదు. దానిలో అనేక దోషాలు ఉన్నాయి. గౌడపాదాచార్యులవారు ఆరు వాదనలు తీసుకున్నారు.

ఒక సిద్ధాంతాన్ని ఖండించటానికి ఇది ఒక మార్గం. వారి సిద్ధాంతంలో అనేక వాదాలను తీసుకుని, ఒక్కొక్క వాదాన్నీ ఖండించుకుంటూ వస్తాము. అప్పుడు వారి వాదన ముక్కలు ముక్కలుగా విడిపోతుంది. దీన్ని వికల్ప పద్ధతి అంటారు. ఒక కట్టెలమోపును విరవాలంటే కష్టం కాని, అందులోని ఒక్కొక్క కట్టెపుల్లను విడివిడిగా తీసుకుంటే, దాన్ని విరవటం చాలా తేలిక అవుతుంది. గౌడపాదాచార్యులవారు చాలా పాతకాలం నాటికి చెందినవారు కాబట్టి వారి భాషను అర్థం చేసుకోవటం కష్టం. అంతే కాకుండా, వారి వాదనలను కూడా అర్థం

చేసుకోవటం కష్టం. అందువల్ల మనం ఆ ఆరు వాదనలను కారికల్లోకి వెళ్ళేముందు విడిగా చూద్దాము.

ఆరు వాదనలు ఇవ్వబడ్డాయి మూలకారణం తెలుసుకోవటానికి. మనం తక్షణకారణం జోలికి వెళ్ళటం లేదు. ఉదాహరణకు చెట్టుకు తక్షణకారణం విత్తనం అని మనకు తెలుసు. మనం మూలకారణానికి వెళ్ళాలి. ద్వైతవాదులు కర్మను, జగత్తు యొక్క సృష్టికి మూలకారణం అంటారు.

కర్మ అంటే పుణ్య, పాప కర్మ. ఇంకా చెప్పాలంటే సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మ. కర్మవల్లనే జీవులకు ఇప్పటి శరీరం వచ్చిందని వారు అంటారు. కర్మ, శరీరాలకు గౌడపాదాచార్యులవారు వాడిన సాంకేతిక పదాలు హేతువు, ఫలం. కర్మకు హేతువు పదం వాడితే శరీరానికి ఫలం వాడారు. కర్మ అనే కారణం (హేతువు)వల్ల, శరీరమనే కార్యం (ఫలం) వచ్చింది. మనం ప్రస్తుతం కర్మ, శరీరం పదాలనే వాడదాము.

కర్మ, శరీరాల పరంగా గౌడపాదాచార్యులవారు ఆరు వాదనలు చేశారు. అవేమిటో చూద్దాము.

1. **కర్మ మూలకారణం** – జీవరాశుల పుట్టుకకు వారు చేసుకున్న కర్మ మూలకారణం అనుకుందాము.

**ఖండన** – పూర్వజన్మలో చేసుకున్న పుణ్య, పాపాలవల్ల ఈ జన్మలో ఈ శరీరం వచ్చింది అంటున్నారు, బాగానే ఉంది. కాని ఈ పుణ్య, పాపాలు ఎక్కడనుంచి వచ్చాయి? భగవంతుడు పుణ్య, పాపాలను ఇవ్వడు. పుణ్యపాపాలు కర్మనుంచి వస్తాయి. కర్మ కర్తనుంచి వస్తుంది. కర్తకు కర్మ చేయాలంటే, శరీరం ఉండాలి.

శరీరం లేకుండా కర్మ చేయటం కుదరదు కాబట్టి కర్మ మూలకారణం కాదు.

2. **శరీరం మూలకారణం** – సరే, అయితే శరీరం లేకుండా కర్మ చేయటం కుదరదు కాబట్టి శరీరం మూలకారణం అనుకుందాము. ఉదాహరణకు ఎవరో చేసే వ్యాపారానికి, ఇంకెవరో పెట్టుబడి పెడతారు. అదే విధంగా భగవంతుడు ఈ జీవులు కర్మలు చేయటానికి, వారికి శరీరం ఇచ్చాడనుకుందాము. ఈ శరీరంతో జీవులు కర్మ చేస్తారు. అందువల్ల శరీరం మూలకారణం.

**ఖండన** – భగవంతుడు శరీరాలను ఇచ్చాడు అనుకుంటే, ఏ శరీరం ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తాడు? ఒక జీవికి ఎటువంటి శరీరం రావాలనేది అతను చేసుకున్న కర్మమీద ఆధారపడి ఉంటుంది. మొట్టమొదటి శరీరం ఇవ్వటానికి దేన్ని ఆధారంగా చేసుకుని ఇస్తాడు? జంతు శరీరం ఇవ్వాలా, మనుష్యశరీరం ఇవ్వాలా? మనుష్యశరీరం ఇద్దామనుకుంటే

స్త్రీశరీరం ఇవ్వాలా, పురుషశరీరం ఇవ్వాలా? పురుషశరీరం ఇవ్వాలనుకుంటే ఆరోగ్యశరీరం ఇవ్వాలా, అనారోగ్యశరీరం ఇవ్వాలా? ఇవన్నీ అంతుపట్టని సమస్యలు.

భగవంతుడు ఏదో ఒక శరీరం ఇస్తాడులే, తనకు తోచినట్టుగా అంటే అది కూడా కుదరదు. అలా చేస్తే భగవంతుడు ఆలోచించకుండా చేసినట్లో లేదా పక్షపాతం చూపించినట్లో అవుతుంది.

కర్మవల్ల శరీరం వస్తుంది, భగవంతుడు స్వంతంగా శరీరాన్ని ఇవ్వడు కాబట్టి శరీరం మూలకారణం కాదు.

3. **కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు** – ఏదో ఒకటి మూలకారణం అంటే కదా సమస్య; కర్మ, శరీరాల మధ్య కార్య–కారణ సంబంధం ఉందనుకుందాము.

**ఖండన** – కర్మ, శరీరాల్లో ఒకటి కారణం, ఒకటి కార్యం అయితే, కారణం కార్యానికి ముందు రావాలి; కార్యం తర్వాత రావాలి. అంటే కాలం దృష్ట్యా ఒకటి ముందు, ఇంకొకటి తర్వాత రావాలి.

కాని వారి వాదన ప్రకారం కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు అంటే కార్యమే మళ్ళీ కారణం అవాలి కాని కార్యంనుంచి కారణం రాలేదు. ఉదాహరణకు తండ్రీ, కొడుకులు. తండ్రినుంచి కొడుకు వస్తాడు కాని కొడుకునుంచి తండ్రి రాలేదు.

కార్యంనుంచి కారణం రాలేదు కాబట్టి కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు కాదు.

4. **కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టాయి** – ద్వైతవాదులు ఈ వాదనను చేయకపోయినా, వాదనకోసం గౌడపాదాచార్యులవారు ఈ వాదనను చేస్తున్నారు. కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టాయి అంటే సృష్టి మొదట్లో జీవునికి శరీరం, కొంత కర్మ కూడా ఉందనుకుందాము.

**ఖండన** – కర్మ, శరీరాలు ఏకకాలంలో పుడితే, వాటి మధ్య కార్యకారణ సంబంధం కుదరదు. ఉదాహరణకు కవలపిల్లలు. కార్యకారణ సంబంధంలో కారణం ముందు రావాలి, కార్యం తరువాత రావాలని చూశాము. రెండూ ఒకేసారి పుడితే, వాటిలో ఏది కారణ మవుతుంది, ఏది కార్యమవుంది? ఈ రెండింటికీ మరొక కారణం ఉండాలి. కాని అలా మరొక కారణం కుదరదు. దీన్ని యుగపత్ సంభవం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. యుగపత్ సంభవం అంటే ఒకేసారి పుట్టటం.

కర్మ, శరీరాలు ఏకకాలంలో పుడితే కార్యకారణ సంబంధం కుదరదు కాబట్టి కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టలేవు.

5. **కారణ–కార్య ప్రవాహం / కర్మ–శరీరం ప్రవాహం** – మూలకారణం, కారణ–కార్య ప్రవాహరూపంలో ఉంటుంది. కర్మ ఒకటి శరీరం ఒకటిని పుట్టిస్తుంది. శరీరం ఒకటి మళ్ళీ

కర్మ ఒకటిని పుట్టించదు (అలా పుట్టిస్తే కదా సమస్య) కాని, కర్మ రెండుని పుట్టిస్తుంది. కర్మ రెండు శరీరం రెండుని పుట్టిస్తుంది. శరీరం రెండు, కర్మ మూడుని పుట్టిస్తుంది.

కర్మ 1 → శరీరం 1 → కర్మ 2 → శరీరం 2 → కర్మ 3

దీన్ని జన్మల పరంగా చూద్దాము. పూర్వజన్మ కర్మ ఈ జన్మలో శరీరాన్ని ఇచ్చింది. పూర్వజన్మ కర్మ – కర్మ 1, ఈ జన్మ శరీరం – శరీరం 1 అవుతాయి. ఈ జన్మ శరీరం, పూర్వజన్మ కర్మను ఇవ్వదు కాని, ఈ జన్మ కర్మను ఇస్తుంది. అందువల్ల ఈ జన్మ శరీరం అంటే శరీరం 1, ఈ జన్మ కర్మను ఇస్తుంది. అది కర్మ 2 అవుతుంది. ఈ జన్మ కర్మ (కర్మ 2), వచ్చే జన్మలో శరీరాన్ని ఇస్తుంది. అది శరీరం 2 అవుతుంది. వచ్చే జన్మలో శరీరం 2తో చేసే కర్మ – కర్మ 3 అవుతుంది. ఆ విధంగా కారణం–కార్యం ప్రవాహాన్ని కర్మ శరీరం ప్రవాహంగా వాడవచ్చు అనుకుందాము.

**ఖండన** – ఈ కారణ–కార్య ప్రవాహం వినటానికి బాగానే ఉంది, కాని దీన్నుంచి కూడా మా ప్రాథమిక ప్రశ్నకు జవాబు రాలేదు అంటారు గౌడపాదాచార్యులవారు. కారణ–కార్య ప్రవాహంలో కర్మ–శరీరాలను ప్రవాహంగా వాడారు కాని, ఈ రెండింటిలో ఏది మూలకారణం? విత్తు ముందా, చెట్టు ముందా? కోడి ముందా, గుడ్డు ముందా? ఈ రెండింటి ప్రవాహం గురించి మాట్లాడగలరేమో కాని మూలకారణం విషయంలో వాడలేరు.

కర్మ మూలకారణం అనలేరు; ఎందుకంటే శరీరం లేనిదే కర్మ చేయలేరు. పోనీ శరీరం మూలకారణం అందామా అంటే, కర్మ లేనిదే శరీరం రాదు. అందువల్ల కర్మ–శరీరాల ప్రవాహం మూలకారణం కాదు.

6. **కారణ–కార్య ప్రవాహం అనాది** – కారణ–కార్యాలు ఒక ప్రవాహం అంటే ఏది ముందు పుట్టింది అని సమస్య వస్తున్నది కాబట్టి కారణ–కార్య ప్రవాహం అనాది అనుకుందామంటే అది కూడా చెల్లదు. ఈ శరీరం ముందు జన్మకర్మనుంచి పుట్టింది. ప్రతి కర్మ ముందు జన్మశరీరంనుంచి పుట్టిందే!

**ఖండన** – ఈ వాదన సమస్యకు పరిష్కారంగా ఉన్నట్టుగా కనిపించినా, ఇందులో చాలా లొసుగులు ఉన్నాయి. నిజానికి ఈ కారణ–కార్య ప్రవాహం అనాది అని మనం కూడా వేదాంతంలో అంటాము. కాని దాన్ని తాత్కాలికంగానే స్వీకరిస్తాము. దాని లోతులు కొలిస్తే, అందులోని లోపాలు బయటపడతాయి. కాని మనం స్వీకరించే దశలో శిష్యుడు లోతులు కొలవడు; అందువల్ల సమస్య అర్థం కాదు, గురువుకు తెలిసినా అప్పుడు బయటపెట్టడు. శిష్యుడు పరిపక్వత చెందాక, అసలు సృష్టే జరగలేదు,**అజాతివాదమే సత్యము**

అని నిరూపిస్తాడు గురువు. అంటే గౌడపాదాచార్యులవారి మాండూక్య కారికలకు వచ్చాక, ఈ వాదాన్ని నిరూపిస్తాడు గురువు.

**గౌడపాదాచార్యులవారి అజాతివాదము** తిరుగులేనిది. ఆయన మకుటం లేని మహారాజు. ఆయన చేసిన ఘాటైన వాదనలను చూద్దాము. అనాది పదం విశేషణం. ఈ విశేషణం ముందు మూడు నామవాచకాలు ఉన్నాయి. అవి కర్మ, శరీరం, ప్రవాహం. ఈ మూడింటిలో ఈ విశేషణాన్ని ఏ నామవాచకానికి వాడతారు?

ఎ) **కర్మ అనాది కాలేదు** – కర్మ అనాది కాలేదు ఎందుకంటే కర్మ చేయటానికి ఒక శరీరం కావాలి.

బి) **శరీరం అనాది కాలేదు** – శరీరం అనాది కాలేదు ఎందుకంటే శరీరం కర్మవల్ల పుడుతుంది. శరీరానికి ఒక పుట్టినతేదీ ఉంటుంది. భగవంతుని అవతారానికి కూడా ఒక పుట్టినతేదీ ఉంది. కృష్ణాష్టమి అంటాము, శ్రీరామనవమి అంటాము.

సి) **ప్రవాహం అనాది కాలేదు** – ప్రవాహం అనాది అనలేము ఎందుకంటే లోతుగా ఆలోచిస్తే, అసలు ప్రవాహం అనే పదమే లేదు. గురు–శిష్య పరంపర అంటాము కాని లోతుగా చూస్తే అటువంటి పరంపర పదమే లేదు. అందులోని ఒక్కొక్క గురువునూ, ఒక్కొక్క శిష్యుణ్ణీ విడిగా తీస్తే పరంపర పదానికి ఉనికి ఉండదు.

ఉదాహరణకు ఫ్రూట్‌సలాడ్ పదం తీసుకోండి. ఎవరో ఫ్రూట్‌సలాడ్‌కి మూలపదార్థం ఏమిటో చూడాలనుకున్నాడు. అందులో ఉన్న ఒక్కొక్క పండునూ విడిగా తీయటం మొదలు పెట్టాడు. ఇది మామిడిపండు, ఇది ఆరెంజ్, ఇది అరటిపండు, ఇది ద్రాక్ష అంటూ అందులో ఉన్న పండ్లను విడదీస్తే, అక్కడ మిగిలింది ఏమిటి? ఏమీలేదు! ఫ్రూట్‌సలాడ్ పదానికి ఉనికే లేదు.

అలాగే కుటుంబం ఉదాహరణను తీసుకోండి. అందులోంచి తండ్రిని, తల్లిని, తాతను, బామ్మను, కొడుకును, కూతురును తీస్తే ఇంక కుటుంబం పదానికి ఉనికి ఏది? అందువల్ల ప్రవాహం అనే పదానికి ఉనికి లేదు. కాబట్టి కర్మ–శరీర ప్రవాహం అనాది అనలేము.

అయినా వాదనకోసం అలాంటి ఒక ప్రవాహం ఉందనుకుందాము. అంటే కర్మ–శరీర ప్రవాహం అనాదిగా ఉంది అనుకుందాము. ఇప్పుడు ఈ అనాదికి అంతం ఉందా, లేదా? ఎలా చెప్పినా వారు సమస్యలో పడతారు.

i) **అనిర్మోక్ష ప్రసంగం** – ఒకవేళ కర్మ–శరీరం ప్రవాహం అనాది అయి, దానికి అంతం కూడా లేదు అంటే, మోక్షం ఎన్నటికీ పొందలేరు. పునరపి జననం–పునరపి మరణం వృత్తం కొనసాగుతూనే ఉంటుంది కాబట్టి మోక్షం పొందే అవకాశం లేదు. దాన్ని **అనిర్మోక్ష ప్రసంగం** అంటారు. మోక్షం పొందలేమంటే, మాండూక్య కారికలు నేర్చుకుని ఏమిటి

లాభం? ఉపనిషత్తులు నేర్చుకునేది మోక్షం వస్తుందని కదా, మోక్షమే రాదంటే ఇంక ఉపనిషత్తులను నేర్చుకోవటమెందుకు?

ii) **మోక్ష అనిత్యత్వం** – ఈ సమస్యను తప్పించుకోవటానికి వారు ఒకవేళ కర్మ–శరీరం ప్రవాహం అనాది కాని, దానికి అంతం ఉంది అంటే కూడా సమస్యే. ఒక కాలంలో వచ్చిన మోక్షం ఇంకొక కాలంలో పోతుంది. (ఈ వాదనను గౌడపాదాచార్యులవారు ఇక్కడ చేయరు కాని, మనం మన వీలుకోసం దాన్ని కూడా వీటితో కలిపి చూస్తున్నాము.)

దీని ప్రకారం ఈ ప్రవాహం ముగిసి, సాయంకాలం 6.20కి మోక్షం వచ్చిందనుకుందాము, వాదనకోసం. కాని అలా ఒక సమయంలో వచ్చిన మోక్షం, ఇంకొక సమయంలో ముగిసితీరాలి. ఎందుకంటే ఆరంభం ఉన్న ప్రతిదానికీ అంతం ఉంటుంది.

**జాతస్య హి ధ్రువో మృత్యుః** – గీత

అలా మోక్షానికి కూడా అంతం ఉంటే, మోక్షం నిత్యం అవదు. మోక్షం నిత్యం కాకపోతే ఇంక మోక్షానికీ, స్వర్గలోకప్రాప్తికీ మధ్య భేదం ఏముంది? మనం స్వర్గలోకప్రాప్తిని కూడా వద్దనుకుని మోక్షానికి వచ్చేదే మోక్షం దానికన్నా శ్రేష్టమనీ, నిత్యమనీ ఆశించటంవల్ల. తాత్కాలిక మోక్షం వచ్చినా రానట్టే అవుతుంది. ఆ విధంగా ఇది **మోక్ష అనిత్యత్వం** అవుతుంది.

ఈ ఆరు వాదనలవల్ల కర్మ సిద్ధాంతం ద్వారా సృష్టి జరిగిందని తార్కికంగా నిరూపించలేరు.

**అజాతివాదము సత్యము.**

మరి ఏమిటి ఉంది? అంతకుముందు, ఇప్పుడు, తర్వాత కూడా ఉండేది బ్రహ్మే.

**ద్వైతవాదులు చేసిన వాదన** – ఈ సందర్భంలో గౌడపాదాచార్యులవారు చెప్పకపోయినా, ఆయన ముందు అధ్యాయాల్లో చేసిన వాదనలను ఇక్కడకు తెచ్చుకోవాలి.

ద్వైతవాదులు మన అద్వైతులను ఈ విధంగా ఖండిస్తారు. మీరు సృష్టి జరిగిందని తార్కికంగా నిరూపించలేదు కాబట్టి నిజంగా సృష్టి జరగలేదు, అజాతివాదము సత్యము అంటున్నారు కాని మీ ఉపనిషత్తుల్లోనే అనేక సందర్భాలలో సృష్టి గురించి వస్తుంది. తత్త్వబోధలో వస్తుంది, తైత్తిరీయ, ముండక, కైవల్య ఉపనిషత్తుల్లో వస్తాయి. ఇన్నిసార్లు సృష్టి ప్రకరణం గురించి వస్తే, అంత నిర్దాక్షిణ్యంగా సృష్టే జరగలేదని ఎలా చెప్పగలరు?

**జవాబు** – ఇప్పటికీ అజాతివాదము సత్యము అనే చెబుతాము అంటారు గౌడపాదాచార్యుల వారు. మరి అయితే సృష్టి గురించి ఎందుకు చెబుతారు అంటే దాన్ని అధ్యారోప–అపవాద ప్రక్రియ అంటారు.

ఓం ప్రథమంగానే సృష్టి జరగలేదని శిష్యునికి చెబితే, శిష్యుడు దాన్ని మొదట్లో జీర్ణించుకోలేడు. ఒక చిన్నపిల్లవానికి ముందే ఘనపదార్థం పెడితే అతడు దాన్ని జీర్ణించుకోలేడని

కదా తల్లి ముందు ద్రవపదార్థంతో మొదలుపెడుతుంది. అలాగే ముందే సృష్టి జరగలేదని చెబితే, గురువు అద్వైతం అయిపోతాడు, అంటే రెండో క్లాసులో శిష్యుడు ఉండడు.

అందువల్ల అధ్యారోప-అపవాద ప్రక్రియను ఎన్నుకుంటాడు. అధ్యారోపంలో సృష్టి ఉందని చూపించి, అపవాదంలో నిజంగా సృష్టి జరగలేదని నిరూపిస్తారు. శిష్యుడు పరిపక్వత చెందాక **అజాతివాదము సత్యము** అని చూపిస్తారు. వేదాంతబోధ అసలు బోధ ఇదీ.

ఇప్పుడు ఈ ఆరు వాదనలనూ కారికలు 14-23లో చూస్తాము. ఈ నేపథ్యంతో ఈ కారికలను చూద్దాము.

### కారిక 4.14

**హేతోరాదిః ఫలం యేషామాదిర్హేతుః ఫలస్య చ ।**
**హేతోః ఫలస్య చానాదిః కథం తైరుపవర్ణ్యతే ॥**

ఇందులో వాదన 1, 2 చూస్తాము. అవి కర్మ మూలకారణం, శరీరం మూలకారణం. గౌడపాదాచార్యులవారు రెండూ తార్కికంగా చెల్లవంటారు.

**హేతోః ఫలస్య చానాదిః** – హేతువు అంటే కర్మ; ఫలం అంటే శరీరం. కర్మ, శరీరం రెండూ కూడా అనాది కాలేవు. అనాది అంటే ఆరంభం లేనిది. వీటిని విడివిడిగా చెప్పాలంటే కర్మ మూలకారణం కాలేదు; శరీరం మూలకారణం కాలేదు. ఈ భావాన్ని ప్రశ్నరూపంలో వేస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**కథం తైరుపవర్ణ్యతే** – కర్మ ఎలా మూలకారణం అవుతుంది? శరీరం ఎలా మూలకారణం అవుతుంది? ఇవి ప్రశ్నలు కావు. కర్మ, శరీరం మూలకారణం కాలేదు అనే జవాబు ఇమిడి ఉన్నవి. అలా ఎలా చెప్పగలము?

**హేతోరాదిః ఫలం యేషామ్** – హేతుః అంటే కర్మ; ఆదిః అంటే కారణం; ఫలం అంటే శరీరం. అందువల్ల వారు కర్మ, శరీరానికి మూలకారణం అంటారు. ఇంకో విధంగా చెప్పాలంటే శరీరం కర్మనుంచి వచ్చింది అంటారు.

**ఆదిర్హేతుః ఫలస్య చ** – అంతేకాదు శరీరం, కర్మకు మూలకారణం అంటారు. ఇంకో విధంగా చెప్పాలంటే కర్మ శరీరంనుంచి వచ్చింది అంటారు. కాని ఈ రెండూ చెల్లవు.

**వాదనలు – ఖండనలు**

వాదన 1 – కర్మ మూలకారణం
ఖండన – శరీరం లేకుండా కర్మ చేయటం కుదరదు
వాదన 2 – శరీరం మూలకారణం
ఖండన – కర్మవల్ల శరీరం వస్తుంది

ముందే చూసినట్టుగా గౌడపాదాచార్యులవారు వీటికి ప్రత్యేకమైన పదాలను వాడుతున్నారు. కర్మను హేతువు, శరీరాన్ని ఫలం, కారణాన్ని ఆదిః అంటున్నారు.

**కారిక 4.15**

**హేతోరాదిః ఫలం యేషామాదిర్హేతుః ఫలస్య చ ।**

**తథా జన్మ భవేత్తేషాం పుత్రాజ్జన్మ పితుర్యథా ॥**

ఇందులో వాదన మూడు చూస్తాము. అది కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు.

**హేతోరాదిః ఫలమ్** – కర్మ శరీరానికి కారణం.

**యేషామాదిర్హేతుః ఫలస్య** – శరీరం కర్మకు కారణం వాదన ఇది. ఇంకో విధంగా చెప్పాలంటే రెండూ అన్యోన్య ఆశ్రితాలు అవుతాయి. అలా అయితే దానిలో దోషం ఇదీ –

**తథా జన్మ భవేత్తేషాం పుత్రాజ్జన్మ పితుర్యథా** – కారణంనుంచి కార్యం, కార్యంనుంచి కారణం వచ్చేటట్టయితే తండ్రినుంచి పుత్రుడు, పుత్రునినుంచి తండ్రి పుట్టాలి. అది సాధ్యం కాదు.

**మూడవ వాదన – ఖండన**

వాదన 3 – కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు

ఖండన – కారణం ముందు రావాలి, కార్యం తరువాత కాలంలో రావాలి. ఉదా. తండ్రీ, కొడుకులు.

**కారిక 4.16**

**సంభవే హేతుఫలయోరేషితవ్యః క్రమస్త్వ యా ।**

**యుగపత్సంభవే యస్మాదసంబంధో విషాణవత్ ॥**

వాదన 4 చూస్తాము. అది కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టాయి. అంటే భగవంతుడు శరీరాన్ని సృష్టించి, కొంత కర్మను కూడా ఇచ్చాడు. ఇందులో దాని ఖండన ఏమిటో చూస్తాము.

**యుగపత్సంభవే** – యుగపత్ అంటే ఏకకాలంలో; సంభవః అంటే పుట్టటం. ఏవి ఏకకాలంలో పుట్టాయి? యస్మద్ – మనం కలుపుకోవాలి. కర్మ, శరీరం ఏకకాలంలో పుట్టాయి. అలా పుడితే,

**అసంబంధః** – వాటి మధ్య కారణ–కార్య సంబంధం కుదరదు. ఒకేసారి పుట్టినవాటి మధ్య కారణ–కార్య సంబంధం కుదరదు. ఒకేసారి పుట్టిన కవలపిల్లల్లో ఒకరిని కారణం, ఒకరిని కార్యం అనగలరా? కారణ–కార్య సంబంధం ఉండాలంటే కారణం ముందు రావాలి, కార్యం తరువాత కాలంలో రావాలి. ఇక్కడ గౌడపాదాచార్యులవారే దానికి ఉదాహరణను ఇస్తున్నారు.

**విషాణవత్** – ఒక గోవుయొక్క ఎడమ–కుడి కొమ్ముల మధ్య కారణ–కార్య సంబంధం ఉండదు కదా!

కర్మ, శరీరం రెండూ ఒకేసారి పుడితే వాటికి ఇంకొక మూలకారణం ఉండాలి. అందువల్ల నాలుగవ వాదన కూడా చెల్లదు.

ఒకవేళ ఒకేసారి పుట్టలేదు, ఒకదాని తర్వాత ఒకటి పుట్టాయని అన్నా కూడా గౌడపాదాచార్యులవారు వారిని వదలరు. వారు **అజాతివాదము సత్యము** అనేదాక ఊరుకోరు. సరే ఒకదాని తరువాత ఒకటి పుట్టాయంటే, ఏది ముందు పుట్టిందో చెప్పండి అంటున్నారు.

**హేతుఫలయోః (క్రమేణ) సంభవే** – ఒకవేళ కర్మ, శరీరం ఒకదాని తర్వాత ఒకటి పుట్టాయి అంటే,

**క్రమస్త్వయా ఏషితవ్యః** – కర్మ ముందు పుట్టిందా, శరీరం ముందు పుట్టిందా? దీనికి జవాబు చెప్పలేరు అంటే మీరు సృష్టికి మూలకారణం చెప్పలేరు.

**నాలుగవ వాదన – ఖండన**

వాదన 4 – కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టాయి

ఖండన – ఏకకాలంలో పుడితే కారణ–కార్య సంబంధం కుదరదు. ఉదాహరణ కవలపిల్లలు.

### కారిక 4.17

**ఫలాదుత్పద్యమానస్సన్న తే హేతుః ప్రసిధ్యతి ।**
**అప్రసిద్ధః కథం హేతుః ఫలముత్పాదయిష్యతి ॥**

ఈ నాలుగు వాదనల సారాంశాన్ని ఈ కారికలో చూస్తాము.

**న తే హేతుః ప్రసిధ్యతి** – అనాది కర్మ మూలకారణం అని చెప్పలేరు; ఎందుకంటే,

**ఫలాదుత్పద్యమానస్సన్** – కర్మ చేయాలంటే శరీరం కావాలి. అనాది కర్మ గురించి ఎన్నడూ మీరు మాట్లాడలేరు. ఎందుకంటే కర్మ చేయాలంటే ఒక కర్త ఉండాలి; ఆ కర్తకు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఉండాలి; జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఉండాలంటే వాటికొక శరీరం కావాలి. అందువల్ల కర్మ అనాది కాలేదు.

శరీరం ద్వారా కర్మ చేయకుండా, భగవంతుడే కొంత కర్మను ఇచ్చాడనుకోవటానికి కూడా ఆస్కారం లేదు. అలా భగవంతుడు ఇస్తే, అది పక్షపాతం చూపినట్టు అవుతుంది. ఒకవేళ పక్షపాతం చూపించకుండా సమానంగా ఇవ్వాలంటే అయితే అందరూ స్త్రీలు అవాలి; లేదా అందరూ పురుషులు అవ్వాలి. అలా అయితే వచ్చే తరం వచ్చే మార్గం లేదు. అందువల్ల భగవంతుడు కర్మను ఇవ్వడు.

పోనీ జగత్తు కర్మను ఇస్తుందా? జగత్తు కూడా ఇవ్వదు. ఎందుకు? జగత్తు జడం. జడమైన జగత్తు కర్మను ఎలా చేస్తుంది? అటు ఈశ్వరుడూ ఇవ్వక, ఇటు జగత్తూ ఇవ్వక, జీవుడే కర్మ చేయాలి అంటే కర్మ చేయటానికి అతనికొక శరీరం ఉండితీరాలి. కర్మకు శరీరం కావాలంటే, కర్మ ఎలా అనాది అవుతుంది? అందువల్ల కర్మ శరీరంనుంచి పుట్టాలి.

**అప్రసిద్ధః కథం హేతుః ఫలముత్పాదయిష్యతి** – అప్రసిద్ధః అంటే తర్కానికి నిలవనిది. కర్మ అనాది అని నిరూపించలేకపోతే, అనాది కర్మ, శరీరానికి మూలకారణం ఎలా కాగలదు? అంటే ఈ నాలుగు వాదనలూ చెల్లవని అర్థం.

**కారిక 4.18**

**యది హేతోః ఫలాత్సిద్ధిః ఫలసిద్ధిశ్చ హేతుతః ।**
**కతరత్పూర్వనిష్పన్నం యస్య సిద్ధిరపేక్షయా ॥**

ఇందులో వాదన 5 చూస్తాము. అది కారణ–కార్య ప్రవాహం.

ఈ వాదన ప్రకారం, కర్మ –1 శరీరం –1ని పుట్టిస్తుంది. శరీరం –1, కర్మ –2ని పుట్టిస్తుంది. కర్మ –2 శరీరం –2ని పుట్టిస్తుంది. శరీరం –2, కర్మ –3ని పుట్టిస్తుంది. ఆ విధంగా ఒక ప్రవాహంగా సాగుతుంది అంటే ఇది వినటానికి బాగానే ఉంది కాని, మా ప్రాథమిక ప్రశ్నకు జవాబు రాలేదు అంటారు గౌడపాదాచార్యులవారు. కర్మ ముందా, శరీరం ముందా?

**యది హేతోః ఫలాత్సిద్ధిః** – కర్మ శరీరంనుంచి పుడితే,

**ఫలసిద్ధిశ్చ హేతుతః** – శరీరం కర్మనుంచి పుడితే, అంటే కారణ–కార్య ప్రవాహం కొనసాగితే,

**కతరత్పూర్వ నిష్పన్నం** – ఈ ప్రవాహం ఎక్కడ మొదలయింది? కతరత అంటే ఈ రెండింటిలో. ఏ రెండింటిలో? కర్మ, శరీరాలు రెండింటిలో. పూర్వ నిష్పన్నమ్ అంటే ఏది ముందు పుట్టింది?

**యస్య సిద్ధిరపేక్షయా** – దేనినుంచి రెండవది పుట్టిందని చెప్పగలరు?

ఈ రెండింటిలో ఏది ముందని చెప్పగలరు? దేన్నుంచి ఏది వచ్చిందని నిరూపించగలరు? రెండూ సాధ్యం కాదు.

**ఐదవ వాదన – ఖండన**

వాదన 5 – కారణ–కార్య ప్రవాహం / కర్మ–శరీరప్రవాహం

కర్మ 1 → శరీరం 1 → కర్మ 2 → శరీరం 2 → కర్మ 3

ఖండన – కర్మ, శరీరాల్లో ఏది ముందు?

శరీరం లేనిదే కర్మ చేయలేరు. కర్మ లేనిదే శరీరం రాదు.

ఆరవ వాదన గౌడపాదాచార్యులవారు ఇక్కడ చేయలేదు కాని ఆ వాదనను మనం ముందే చూశాము. అది ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

వాదన 6 – కారణ–కార్య–ప్రవాహం. అనాది / కర్మ–శరీరం–ప్రవాహం అనాది

ఖండన – కర్మ అనాది కాలేదు, శరీరం అనాది కాలేదు, ప్రవాహం అనే వస్తువు లేదు.

అనాదికి అంతం ఉంటే అది అనిత్యం అవుతుంది, అంతం లేకపోతే అనిర్మోక్ష ప్రసంగం అవుతుంది.

కాని ద్వైతవాదులు కూడా మనని ఖండించవచ్చు. అదేమిటో ఈ సందర్భంలో చూద్దాము. ఒక కాలంలో పుట్టిన మోక్షం ఇంకొక కాలంలో ముగుస్తుంది. అది అనిత్యం అవుతుందని మనం అంటున్నాము కదా.

**ద్వైతవాదుల వాదన** – మీ ప్రకారం జ్ఞానంవల్ల మోక్షం పుడుతుంది. జ్ఞానేన మోక్షః. జ్ఞానంవల్ల మోక్షం **పుడుతుంది** అంటే మీరు చెప్పే మోక్షానికి కూడా ఒక ఆరంభం ఉంది కదా! ఆరంభం ఉంటే దానికి అంతం కూడా ఉంటుంది కదా! ఇదీ ద్వైతవాదుల వాదన.

**జవాబు** – జ్ఞానంవల్ల మోక్షం **పుడుతుంది** అని మనమెన్నడూ చెప్పము. నిజమే, పుడుతుంది అంటే దానికొక ఆరంభం ఉంటుంది, దానికి అంతం కూడా ఉంటుంది. కాని జ్ఞానంవల్ల మోక్షం పుట్టదు. జ్ఞానం నువ్వు కొత్తగా మోక్షం పొందనవసరం లేదు, నువ్వు ముందే ముక్తపురుషునివి అంటుంది.

దీన్నే ఇంకో భాషలో చెప్పాలంటే, నేను బద్ధజీవుణ్ణి, నేను సంసారిని అనే అపోహను జ్ఞానం తొలగిస్తుంది. అందువల్ల మోక్షం అంటే అజ్ఞాననివృత్తి. మోక్షం అంటే కొత్తగా విముక్తి పొందటం కాదు.

### కారిక 4.19

**అశక్తిరపరిజ్ఞానం క్రమకోపోఽ థవా పునః ।**
**ఏవం హి సర్వథా బుద్ధైరజాతిః పరిదీపితా ॥**

ఈ కారికలో గౌడపాదాచార్యులవారు ద్వైతవాదిని సంబోధిస్తున్నారు. ఒకవేళ మీరు సృష్టి ఉంది అని అనేటట్టయితే, మేము మిమ్మల్ని ఒకటే ప్రశ్న అడుగుతాము. ఆ సృష్టికి మూలకారణం ఏమిటి? మీరు దానికి జవాబు చెప్పినా, చెప్పకపోయినా, ఇబ్బందిలో పడతారు. కర్మ, శరీరం పేర్లే కాదు, ఏది చెప్పినా తప్పించుకోలేరు. ఎందుకంటే మూలకారణం ఇదీ అని నిర్ధారించలేరు. ప్రతి కారణమూ, ఇంకొక కారణానికి కార్యం అవుతుంది.

ఇలా అంతుపట్టని విషయాలు అనేకం మన దైనందిన జీవితంలో కూడా చూస్తాము. శరీరంవల్ల మనస్సు కలత చెందుతుందా? మనస్సువల్ల శరీరం దెబ్బతింటుందా? దీనికి జవాబు చెప్పటం కష్టం. మనస్సులో ఏదో అలజడి రేగితే, అది చాలా ఆందోళన చెందుతుంది.

దాని ప్రభావం శరీరంమీద పడుతుంది. అలాగే శరీరంలోని హార్మోన్లలో మార్పులు వచ్చినప్పుడు వాటి ప్రభావం మనస్సుమీద కూడా పడుతుంది. అప్పుడు చిరాకుగా ఉంటుంది.

అందువల్ల కర్మ ముందా, శరీరం ముందా అనే ప్రశ్నకు ద్వైతవాదులు జవాబు చెప్పలేరు. వారు జవాబు చెప్పకుండా మౌనంగా ఉన్నారంటే, వారి సిద్ధాంతం గురించి వారికే స్పష్టంగా తెలియదన్నమాట. మీ సిద్ధాంతమే మీకు సరిగ్గా తెలియకపోతే, మమ్మల్నెందుకు ప్రశ్నిస్తారు? వెనక్కి వెళ్ళి ముందు మీది మీరు సరిగ్గా నేర్చుకోండి అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అశక్తిరపరిజ్ఞానం** – అశక్తిః అంటే సృష్టి గురించిన వారి సిద్ధాంతాన్ని సరిగ్గా వివరించలేక పోవటం. ఇంతవరకూ వారి వాదనలు ఆరు చూశాము; వాటిలోని లొసుగులను కూడా చూశాము. అపరిజ్ఞానం అంటే మీ సిద్ధాంతం గురించి మీకే పూర్తి జ్ఞానం లేకపోవటం. మీ సిద్ధాంతమే మీకు సరిగ్గా తెలియకపోతే, మా సిద్ధాంతాన్ని మీరు ఎలా ప్రశ్నించగలరు? మీరు మిమ్మల్ని సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తే, సమస్య ఇది.

**క్రమకోపోఽథవా పునః** – కర్మ, శరీరాల్లో ఏది ముందు? కర్మ ముందా, శరీరం ముందా? కర్మనుంచి శరీరం వచ్చిందా, శరీరంనుంచి కర్మ వచ్చిందా? దీనికి జవాబు చెప్పలేరు.

అలా అంతుపట్టని సమస్యలో ఒకటి – ఫ్రీవిల్లా, విధా? కొందరేమో ఫ్రీవిల్‌ను నమ్మరు. అంతా ముందే నిర్ణయించబడింది అంటారు. వారిని మనం తిరిగి ప్రశ్నించాలి. **ఎవరి చేత నిర్ణయించబడింది?**

భగవంతునిచేత నిర్ణయించబడింది అనలేరు. అలా అంటే భగవంతుడు పక్షపాతం చూపించనట్టు అవుతుంది. జగత్తు చేత నిర్ణయించబడింది అని కూడా అనలేరు. జగత్తు జడం. జడమైన జగత్తు మీకు సాయంకాలం 6.30కి తలనెప్పి రావాలి అని ఎలా నిర్ణయించగలదు? పోనీ అనుకోకుండా జరిగింది అని కూడా అనలేరు – ఇంత క్రమపద్ధతిలో నడుస్తున్న జగత్తులో ఏదీ అనుకోకుండా జరగదు; జరిగే ఆస్కారం లేదు. 'ఎలా జరిగిందో వివరించలేని సంఘటనను యాదృచ్ఛికంగా జరిగింది,' అని వివరించారు ఎవరో.

మరయితే ఎవరిచేత ముందే నిర్ణయించబడింది? మనచేతనే అని మనం ఒప్పుకోక తప్పదు. మనం చేసుకున్న కర్మవల్ల నిర్ణయించబడుతుంది. ఈ కర్మ ఎక్కడనుంచి వస్తుంది? పూర్వజన్మవల్ల వస్తుంది. పూర్వజన్మ ఎలా వచ్చింది? అంతకుముందు చేసిన కర్మవల్ల వచ్చింది. అందువల్ల కర్మ ముందా, శరీరం ముందా అని ఎన్నడూ చెప్పలేము.

మనం కూడా కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతాము కాని, దాన్ని తాత్కాలికంగానే స్వీకరిస్తాము. కాని ద్వైతవాదులు కర్మ సిద్ధాంతమే సృష్టికి మూలకారణం అంటున్నారు. అందువల్ల వారి వాదన చెల్లదు. అందువల్ల క్రమకోపం చెల్లదు అంటాము.

ఇక్కడ కోపం అంటే నిఘంటువు అర్థం రాదు. కోపం అంటే అయోమయం. క్రమకోపం అంటే ఏది ముందు అనే విషయంలో అయోమయం. ఈ అయోమయాన్ని వారు తీర్చలేరు. వారు జవాబు చెప్పటానికి ప్రయత్నిస్తే, వారు అయోమయాన్ని పారద్రోలలేరు; జవాబు చెప్పకుండా మౌనంగా ఉంటే వారి అజ్ఞానం బయట పడుతుంది. ఎలా చూసినా వారు ఇబ్బందిలో పడతారు.

**ఏవం** – ఈ విధంగా,

**బుద్ధైః** – ఈ తెలివైన ద్వైతవాదులవల్ల. ఇక్కడ నిజంగా వారిని తెలివైనవారు అనటం లేదు గౌడపాదాచార్యులవారు. వారిని పరిహసిస్తున్నారు. మనం కొంతమందిని బృహస్పతి అంటాము వ్యంగ్యంగా. నిజానికి బృహస్పతి దేవతల గురువు, చాలా తెలివైన గురువు కాని వాడిన సందర్భం వేరే ఉండవచ్చు. ఈ బృహస్పతులు ఏం చెబుతున్నారు?

**సర్వతః** – అన్ని విధాలా. అంటే ఏ వాదన చూసినా,

**అజాతిః పరిదీపితా** – జాతిః అంటే కులం కాదు; జన్మ. అజాతిః అంటే జన్మ లేకపోవటం అంటే సృష్టి లేకపోవటం. పరిదీపితా అంటే మన బోధే విజయవంతమవుతుంది.

వారు వారి వాదనలతో మన సిద్ధాంతాన్ని ఖండిద్దామని చూస్తారు కాని, మన వాదనను ఖండించలేకపోగా, పరోక్షంగా మన సిద్ధాంతాన్నే మళ్ళీ నిరూపిస్తున్నారు.

**అజాతివాదము సత్యము.**

### కారిక 4.20

**బీజాంకురాఖ్యో దృష్టాంతస్సదా సాధ్యసమో హి సః ।**
**న హి సాధ్యసమో హేతుస్సిద్ధౌ సాధ్యస్య యుజ్యతే ॥**

ఇందులో ద్వైతవాదులు ఒక ఉదాహరణ ఇస్తున్నారు. మనం వారి ఆరు వాదనల్లో దేన్నీ స్వీకరించలేకపోయినా, వారు ఈ ఉదాహరణ ద్వారా సృష్టి జరిగిందని నిరూపించాలి అనుకున్నారు.

**బీజాంకురాఖ్యో దృష్టాంతః** – విత్తనంనుంచి చెట్టు మొలచిన ఉదాహరణ చూడండి అంటున్నారు. ఈ ఉదాహరణ ద్వారా సృష్టిని అర్థం చేసుకోవచ్చు అంటున్నారు ద్వైతవాదులు.

**జవాబు** – కాని ఈ ఉదాహరణవల్ల, సృష్టి విషయంలో ఉన్న అయోమయం ఏమాత్రం పోదు. ఒకవేళ విత్తనం-చెట్టు ఉదాహరణలో అయోమయం లేకపోతే, అది సృష్టి విషయంలో ఉన్న అయోమయాన్ని పారద్రోలుతుంది. కాని అక్కడ ఏం అయోమయం ఉందో ఇక్కడా అదే అయోమయం ఉంది. ఈ రెండింటిలో ఏది మూలకారణం? అక్కడ కర్మ-శరీరాల గురించి ఆరు ప్రశ్నలు వేస్తే ఇప్పుడు అవే ఆరు ప్రశ్నలు విత్తనం-చెట్టుల గురించి వేయవచ్చు.

అవి –

1. విత్తనం మూలకారణమా?
2. చెట్టు మూలకారణమా?
3. విత్తనం–చెట్టు అన్యోన్య ఆశ్రితాలా?
4. విత్తనం–చెట్టు ఏకకాలంలో పుట్టాయా?
5. విత్తనం–చెట్టు ఒక ప్రవాహమా?
6. విత్తనం–చెట్టు–ప్రవాహం అనాదా?

అక్కడ జవాబు చెప్పలేనట్టే, ఇక్కడా చెప్పలేరు. అది ఉన్న సమస్యను ఇంకాస్త ఎక్కువ చేసినట్టవుతుంది అంతే.

**బీజాంకురాఖ్యో దృష్టాంతః** – విత్తనం–చెట్టుల దృష్టాంతం తీసుకుంటే,

**సదా సాధ్యసమో హి సః** – అంతకుముందు పదం ఎంత అయోమయంలో పడవేసిందో, ఈ దృష్టాంతం కూడా అంతే అయోమయంలో పడవేస్తుంది. సాధ్య అంటే మొదటి అయోమయం. మొదటి అయోమయం – కర్మ–శరీరాల గురించిన అయోమయం. అదే అయోమయం ఇందులోనూ కొనసాగుతున్నది కాబట్టి ఈ ఉదాహరణ ఇచ్చి లాభం లేదు.

ఒక ఉదాహరణనిస్తే అది స్పష్టంగా ఉండాలి, దాన్ని స్వీకరించేలా ఉండాలి, దానిలో ఏ అయోమయమూ ఉండకూడదు. ఇదీ నియమం. అందువల్ల గౌడపాదాచార్యులవారు అంటున్నారు,

**సాధ్యసమో హేతుః** – ఇక్కడ హేతుః అంటే ఉదాహరణ. ఎటువంటి ఉదాహరణ? అయోమయంలో పడవేసే ఉదాహరణ. సాధ్యసమః అంటే అసలు విషయంలో ఉన్నంత అయోమయం ఉదాహరణలో కూడా ఉంది. అసలు విషయంలో ఉన్నంత అయోమయం ఉన్న ఉదాహరణను,

**న యుజ్యతే** – ఇవ్వకూడదు.

పిల్లి అంటే ఏమిటని ఎవరో అడిగితే, మార్జాలము అన్నాడుట ఇంకొక వ్యక్తి. మార్జాలము అంటే ఏమిటి అంటే బిడాలము అన్నాడుట అతను. అంత తేలికైన మాటైన పిల్లే తెలియకపోతే, ఇంక మార్జాలము, బిడాలము పదాలు ఎలా తెలుస్తాయి?

అదేవిధంగా కర్మ–శరీరం విషయంలోనే కావాల్సినంత అయోమయం ఉంది. దాన్ని తీర్చాల్సింది పోయి, ఆ అయోమయాన్ని మరింత పెంచి పోషిస్తున్నారు వారు. అది మంచి పద్ధతి కాదు.

**సాధ్యస్య సిద్ధౌ (న యుజ్యతే)** – అసలు సమస్యను పరిష్కరించటానికి, ఇంకొక సమస్యను కొత్తగా తెచ్చిపెట్టకూడదు.

## కారిక 4.21

**పూర్వాపరాపరిజ్ఞానమజాతేః పరిదీపకమ్ ।**
**జాయమానాద్ధి వై ధర్మాత్కథం పూర్వం న గృహ్యతే ॥**

కర్మ-శరీరం విషయం తీసుకున్నా, విత్తనం-చెట్టు దృష్టాంతం తీసుకున్నా, సమస్య అలాగే ఉంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**పూర్వాపరాపరిజ్ఞానమ్** - ఏది ముందు, ఏది తర్వాత అనే విషయంలో మన అజ్ఞానం అలాగే ఉంది. కర్మ ముందా, శరీరం ముందా? విత్తనం ముందా, చెట్టు ముందా? ఈ విషయంలో మన అజ్ఞానం అలాగే ఉంది.

ఏది కారణమో, ఏది కార్యమో తెలియకుండా సృష్టి గురించి మాట్లాడుతున్నారు వారు. వేదాంతం ప్రకారం సృష్టి ప్రకరణం లేదా కారణ-కార్య సంబంధం అవిద్యను సూచిస్తుంది. ఈ అధ్యాయంలోనే, గౌడపాదాచార్యులవారు ఈ కారణ-కార్య సంబంధానికి అతీతంగా ఎదిగితేనే మోక్షం పొందుతారు అని అంటారు. ఈ కారణ-కార్య సంబంధంలో కూరుకు పోయినన్నాళ్ళూ మీరు, అయితే గతం గురించి తలుచుకుని వాపోతారు, లేదా భవిష్యత్తుమీద బెంగ పెట్టుకుంటారు.

గతంతో మీ జీవితాన్ని పోల్చుకుంటే, మీ గతం కారణం, మీ వర్తమానం కార్యం. గతంలో మీరు చేసిన కర్మల ఫలం ఇప్పటి జీవితం. అందువల్ల దాని గురించి పశ్చాత్తాప పడుతూ ఉంటారు. భవిష్యత్తుతో మీ జీవితాన్ని పోల్చుకుంటే, మీ వర్తమానం కారణం, మీ భవిష్యత్తు కార్యం అవుతాయి. అంటే ఇప్పుడు మీరు చేసే కర్మల ఫలం భవిష్యత్తులో అనుభవిస్తారు. అందువల్ల రేపేమవుతుందోననే బెంగ మిమ్మల్ని కృంగదీస్తూనే ఉంటుంది. మీరు గతంయొక్క కార్యం కాదు, భవిష్యత్తుయొక్క కారణమూ కాదని అర్థం చేసుకుంటేనే ఈ ఆందోళనలనుంచి విముక్తి చెందుతారు.

### కార్యకారణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి

ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే కారణ-కార్య సంబంధం గురించిన తపననుంచి బయటపడతారు. దీన్ని హేతు-ఫల ఆవేశం అంటారు. సంసారానికి ఒక కారణం ఈ హేతు-ఫల ఆవేశమే. ఇది అవిద్యవల్ల ఏర్పడింది. నేను కార్యకారణవిలక్షణమైన తురీయాన్ని అని అర్థం చేసుకోవటమే మోక్షం.

కారణ-కార్య సంబంధానికి అతీతంగా ఎదిగితే కాలానికి కూడా అతీతంగా ఎదుగుతారు. కాలమే ఒక విషయాన్ని కారణంగానో, కార్యంగానో చేస్తుంది. **నేడు** కారణమా, కార్యమా? అది కాలంమీద ఆధారపడింది. నేడుని నిన్నతో పోలిస్తే, నిన్న కారణం, నేడు కార్యం.

నేడుని రేపుతో పోలిస్తే, నేడు కారణం, రేపు కార్యం. అందువల్ల ఇలా కాలంలో మమేకం చెందినంతవరకూ కారణ–కార్య సంబంధం గురించి ఆలోచించకుండా ఉండలేరు. అందువల్ల భూత–భవిష్యత్ కాలాలకు అతీతంగా ఎదగాలి.

భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్‌కాలం – ఈ మూడు పదాల్లోని కాలం పదం మీరు కాలం కోరల్లో చిక్కుకున్నారని చూపిస్తుంది. కాలం కోరల్లో చిక్కుకుంటే, ఆందోళన పడక ఏం చేస్తారు?

పూర్వాపరాపరిజ్ఞానం అంటే కారణ–కార్య–సంబంధం గురించిన అయోమయం చూపిస్తున్నది. ఏం చూపిస్తున్నది?

**అజాతేః పరిదీపకమ్** – అజాతివాదము సత్యము అని నిరూపిస్తున్నది.

**జాయమానాద్ధి వై ధర్మాత్** – లేదు, మేము నిజంగానే కారణ–కార్యాల గురించి నమ్ముతాము అంటే ఏది ముందు పుట్టిందో చెప్పండి.

మీరు సృష్టి జరిగిందని చెప్పేటట్టయితే, దానియొక్క కారణమేమిటో ఎందుకు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు?

**(జాయమానాత్ ధర్మాత్ పూర్వం కారణం) కథం న గృహ్యతే** – ఎందుకు మీరు కార్యం ముందు వచ్చే కారణం గురించి చెప్పలేకపోతున్నారు? గౌడపాదాచార్యులవారి భాషా ప్రయోగం కూడా ప్రత్యేకంగానే ఉంటుంది.

దీని సారం చూస్తే, మీరు సృష్టి జరిగిందని చెబుతున్నప్పుడు, ఆ సృష్టికి గల కారణమేమిటో ఎందుకు చెప్పలేకపోతున్నారు? మూలకారణాన్ని చెప్పలేకపోతే మీరు అయోమయంలో పడ్డట్టే అర్థం.

**కారిక 4.22**

**స్వతో వా పరతో వాఽపి న కించిద్వస్తు జాయతే ।**
**సదసత్సదసద్వాఽపి న కించిద్వస్తు జాయతే ॥**

ఇంకా ద్వైతవాదన ఖండనే కొనసాగుతున్నది. ఇంతవరకూ జగత్తు సృష్టి జరిగిందని నిరూపించలేరు అని ఆరు వాదనల ద్వారా నిరూపించుకు వచ్చారు గౌడపాదాచార్యులవారు. తర్వాత విత్తనం–చెట్టు ఉదాహరణ ద్వారా నిరూపించలేరు అని కూడా చూపించారు. ఇప్పుడు నిజం చెప్పాలంటే, జగత్తునే కాదు, జగత్తులో ఒక చిన్న వస్తువును తీసుకున్నా కూడా, దాని సృష్టిని నిరూపించలేరు అంటున్నారు ఈ కారికలో. జగత్తు దాకా అవసరం లేదు, అందులో ఒక కలం, ఒక కుండ, ఒక బల్ల, ఏది తీసుకున్నా అది కార్యంగా వచ్చిందని చూపలేరు.

శాస్త్రంలో కుండ గురించి ఎక్కువగా వస్తుంది కాబట్టి, గౌడపాదాచార్యులవారు కూడా కుండనే తీసుకున్నారు. మీరు కుండ పుట్టింది అనేటట్టయితే, నేను మిమ్మల్ని ఆరు ప్రశ్నలు వేస్తాను అంటున్నారు. వాటిలో ముందు మూడు చూద్దాము.

ఎ) ఘటాత్ ఘటః జాయతే వా – కుండనుంచి కుండ వచ్చిందా?

బి) పటాత్ ఘటః జాయతే వా – కుండ, బట్టనుంచి వచ్చిందా?

సి) ఘటపటాత్ ఘటః జాయతే వా – కుండ, రెండింటి మిశ్రమంనుంచి వచ్చిందా?

ఈ మూడు వాదనలూ చెల్లవు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

ఎ) **స్వతః న జాయతే** – కుండ, కుండ నుంచి రాలేదు.

బి) **పరతః (న జాయతే)** – కుండ, వేరే దాన్నుంచి రాలేదు. అలా ఒకదానినుంచి ఇంకొకటి పుడితే బాగానే ఉంటుంది. నీటిని బాగా కాస్తే, అది కోకో కోలాగా మారితే ఎంత బాగుంటుంది? కాని అది సాధ్యం కాదు.

సి) **ఉభయతః (న జాయతే)** – అసలు అటువంటి మిశ్రమం లేనేలేదు. అది మీ ఊహ మాత్రమే. ఉంటే కుండ ఉంటుంది, లేకపోతే బట్ట ఉంటుంది. రెండింటి మిశ్రమం ఉండదు.

ఈ విధంగా కేవలం ఒక కుండే పుట్టిందని నిరూపించలేనప్పుడు మొత్తం ఈ సృష్టి జరిగిందని ఎలా నిరూపించగలరు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

## కుండ-మట్టి విశ్లేషణ

**వాదన** – ఎవరైనా పై వాదన విని, ఈ విధంగా వాదించవచ్చు. నిజమే, నేనూ ఒప్పుకుంటాను, కుండ కుండనుంచీ రాలేదు, బట్టనుంచీ రాలేదు, వాటి మిశ్రమంనుంచీ రాలేదు. కాని కుండ మట్టినుంచి వచ్చింది. నిజానికి ఆ విషయం మీ అద్వైత సిద్ధాంతులే పదేపదే చెబుతారు. కుండ కార్యమని, దాని కారణం మట్టి అనీ, మట్టి-కుండల మధ్య కారణ-కార్య సంబంధం ఉందనీ మీరే చెబుతుంటారు కదా, అలాంటప్పుడు కుండ పుట్టిందని ఎందుకు ఒప్పుకోరు?

**జవాబు** – నిజానికి ఈ ప్రశ్నను గౌడపాదాచార్యులవారు చర్చించరు, ఆయన విషయంలో ఇది అనవసరం. కాని శంకరాచార్యులవారే మనమీద జాలికొద్దీ, ఈ ప్రశ్నను వేసి, దానికి జవాబును కూడా ఇస్తున్నారు.

శంకరాచార్యులవారు లోతుగా విశ్లేషిస్తే, నిజానికి కుండ పుట్టిందని ఎన్నడూ చెప్పలేరు అంటున్నారు. ఎందుకు? అంతకుముందు ఉన్నదీ మట్టే, కుండలో ఉన్నదీ మట్టే, కుండ పగిలిపోయాక ఉండేదీ మట్టే. మధ్యలో కుండ అనే పదాన్ని పరిచయం చేశాము కాని, నిజానికి ఇసుమంత కూడా కొత్తగా వస్తువేదీ పుట్టలేదు. సైన్స్‌పరంగా కూడా పదార్థం కొత్తగా పుట్టదు, నాశనమవదు అని నేర్చుకుంటాము. అందువల్ల కుండ అనేది ఒక పదం మాత్రమే, అది పదార్థం కాదు.

కుండ అనే పదార్థం లేదు, ఉన్నదొకటే పదార్థం. అది మట్టి. ఒకే పదార్థానికి రెండు పదాలు ఇవ్వబడ్డాయి. రెండు పదాలు వచ్చేసరికి, రెండు వస్తువులు ఉన్నట్టుగా పొరబడతాము కాని నిజానికి అక్కడ రెండు వస్తువులు లేవు.

ఉదాహరణకు బంగారంనుంచి గొలుసు వచ్చింది అంటాము. అంటే రెండు పదాలు వచ్చాయి కాని అక్కడ ఉన్నది ఒకటే పదార్థం. అది బంగారం. లేదు రెండు పదార్థాలు ఉన్నాయని మీరనేటట్టయితే, అయితే మీరు నా దగ్గర బంగారాన్ని వదిలివేసి, మీరు గొలుసుని తీసుకువెళ్ళండి అని నేను అంటే మీరు అలా చేయగలరా? బంగారం లేకుండా గొలుసు లేదు.

### నామద్వయం, వస్తు ఏకమ్

రెండు పేర్లు ఉన్నాయి కాని, వస్తువు ఒకటే ఉంది. ఒకటే వస్తువు ఉన్నప్పుడు వాటి మధ్య కారణ-కార్య సంబంధం గురించి ఎలా మాట్లాడగలరు? ఏ సంబంధం గురించి మాట్లాడాలన్నా కూడా అక్కడ రెండు వస్తువులు లేదా ఇద్దరు మనుష్యులు ఉండితీరాలి.

అందువల్ల మట్టి-కుండల మధ్య కారణ-కార్య సంబంధం గురించి మాట్లాడితే, అది భ్రాంతి మాత్రమే అవుతుంది. మట్టి-కుండ, బంగారం-ఆభరణం, చెక్క-బల్ల. వీటి మధ్య కారణ-కార్య సంబంధాలు ఉన్నాయనుకోవటం మన భ్రాంతి మాత్రమే. ఈ అయోమయం అందరిలోనూ ఉంది. అందువల్ల అది అయోమయంగా తెలియటం లేదు. **పదుగురాడు మాట పాడియై ధరణి జెల్లు** అంటారు. నలుగురూ చెబితే, అదే నిజం అవుతుంది.

లోతుగా విశ్లేషిస్తేనే, అది నిజం కాదని తెలుస్తుంది. కుండ నిజంగా పుట్టలేదు. కుండ అనే ఒక కొత్త పదాన్ని పలికారు అంతే.

**వాచాఽ ఽ రంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్** - ఛాందోగ్యమ్

మట్టి నుంచి ఒక రూపం రాగానే వాక్కు దానికి కుండ అనే పేరు ఇచ్చింది కాని సత్యం మట్టి మాత్రమే. కుండ నిజంగా పుట్టలేదు. ఈ నేపథ్యంతో ఈ కారికను చూద్దాము.

**కించిత్ వస్తు న జాయతే** - ఏ వస్తువు కూడా పుట్టలేదు;

**స్వతః** - దాన్నుంచి కాని,

**పరతః** - ఇంకొకదాన్నుంచి కాని.

స్వతః అంటే ఘటాత్ ఘటః న జాయతే - కుండనుంచి కుండ పుట్టలేదు. పరతః అంటే పటాత్ ఘటః న జాయతే - బట్టనుంచి కుండ పుట్టలేదు. మూడవ అంశం మనం కలుపుకోవాలి. పటఘటాత్ ఘటః న జాయతే - ఈ రెండింటి మిశ్రమంనుంచీ కుండ పుట్టలేదు.

గౌడపాదాచార్యులవారు ఆరు వాదనలను చేస్తున్నారనీ, ఇప్పుడు మూడు వాదనలను చూద్దామనీ ముందు చూశాము. వాటిని మొదటిపాదంలో చూశాము. ఇప్పుడు రెండవ పాదంలో మరో మూడు వాదనలు చూస్తాము. అవి -

డి) సత్ జాయతే వా - ఉనికి ఉన్న వస్తువు పుడుతుందా?

ఇ) అసత్ జాయతే వా - ఉనికి లేని వస్తువు పుడుతుందా?

ఎఫ్) సదసత్ జాయతే వా - రెండింటి మిశ్రమంనుంచి పుడుతుందా?

ఈ మూడూ సాధ్యం కాదని నిరూపిస్తారు గౌడపాదాచార్యులవారు. అవివాదము వివరణ (కారికలు 3-5) చూసినప్పుడు మనం వీటికి జవాబులు ముందే చూసేశాము. కాని ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి మళ్ళీ చూద్దాము.

డి) **సత్ జాయతే వా** - ఉనికి ఉన్న వస్తువు కొత్తగా పుట్టనవసరం లేదు. అది తార్కికంగా కుదరదు.

ఇ) **అసత్ జాయతే వా** – ఉనికి లేని వస్తువు అసలు పుట్టలేదు. దానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

**సైన్స్‌పరంగా పుట్టదు** – సైన్స్‌పరంగా పదార్థం కొత్తగా పుట్టదు, నాశనమవదు. ఈ సూత్రం ప్రకారం ఉనికి లేని వస్తువు పుట్టలేదు.

**వ్యాకరణపరంగా కుదరదు** – కర్త లేకుండా వాక్యం రాదు. పుట్టింది అంటే ఏది పుట్టింది? ఉనికి లేని కుండ అనలేము. అందువల్ల ఈ వాదన చెల్లదు.

ఎఫ్) **సదసత్ జాయతే వా** – రెండింటి మిశ్రమంనుంచి పుట్టే అవకాశం లేదు. రెండు భిన్నవస్తువులను కలపలేము. సత్ అంటే ఉనికి ఉన్నది, అసత్ అంటే ఉనికి లేనిది. ఉనికి ఉన్న వస్తువును, ఉనికి లేని వస్తువుతో కలపటమంటే వెలుగు, చీకటులను కలిపినట్టవుతుంది.

**మిశ్రః న సంభవతి పరస్పర విరోధత్వాత్**

ఇప్పుడు రెండవ పాదాన్ని చూద్దాము.

**సదసత్సదసద్వాఽపి** – ఈ పదాన్ని మనం సత్, అసత్, సదసత్‌గా విడదీసుకోవాలి. సత్ వస్తువునుంచి కాని, అసత్ వస్తువునుంచి, ఈ రెండింటి మిశ్రమంనుంచి కాని,

**కించిత్ వస్తు న జాయతే** – ఏ వస్తువు కూడా పుట్టలేదు.

ఈ ఆరు వాదనల దృష్ట్యా, అసలు సృష్టే జరగలేదు. ఇన్ని వాదనలు చేయలేను అంటే, సైన్స్‌పరంగా ఒక్క వాక్యంలో చెప్పవచ్చు – పదార్థాన్ని ఎన్నడూ సృష్టించలేము.

## కారిక 4.23

**హేతుర్న జాయతేఽనాదేః ఫలం చాపి స్వభావతః ।**
**ఆదిర్న విద్యతే యస్య తస్య హ్యాదిర్న విద్యతే ॥**

ఈ కారికతో ద్వైతవాదుల ఖండన ముగుస్తుంది. ఇంతవరకూ కర్మ–శరీరాల పరంగా ఆరు వాదనలు, కుండపరంగా ఆరు వాదనలూ చూశాము. ఇప్పుడు మరో మూడు వాదనలు చూడబోతున్నాము. నిజానికి ఈ వాదనలు సాంఖ్యమత ఖండనలో చూసేశాము. మళ్ళీ అవే చూడబోతున్నాము.

కర్మ–శరీరాల విషయం తీసుకుంటే వీటిలో ఏది మూలకారణం? పూర్వపక్షి మూడు వాదనలు చేయవచ్చు.

ఎ) **అనాది శరీరం మూలకారణం** – అనాది శరీరంనుంచి కర్మ పుట్టింది.

బి) **అనాది కర్మ మూలకారణం** – అనాది కర్మనుంచి శరీరం పుట్టింది.

సి) **స్వభావతః** – రెండూ ఆకస్మాత్తుగా పుట్టాయి.

ఈ మూడు వాదనలూ చెల్లవంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అనాదేః హేతుః న జాయతే** – హేతువు అంటే కర్మ అనీ, ఫలం అంటే శరీరం అనీ అంతకుముందు చూశాము. అందువల్ల అనాదినుంచి కర్మ పుట్టలేదని ఈ వాక్యం అర్థం. అనాది ఏమిటో ఇక్కడ చెప్పలేదు. ఫలం అని మనం కలుపుకోవాలి, ఫలం అంటే శరీరం అని గుర్తుపెట్టుకోవాలి. ఇప్పుడు ఇవన్నీ కలిపి ఈ వాక్యం అర్థం చూస్తే, అనాది శరీరంనుంచి కర్మ పుట్టలేదు. మొదటి వాదన కొట్టివేయటమైంది.

**ఫలం చ అపి (అనాది హేతువు)**– ఫలం అంటే శరీరం అని చూశాము; అనాది హేతువు అని మనం కలుపుకోవాలి. దీని అర్థం అనాది కర్మనుంచి శరీరం పుట్టలేదు. రెండవ వాదన కొట్టి వేయటమైంది.

ఈ రెండు వాదనల్లో ఉన్న సూక్ష్మభేదాన్ని గమనించాలి. కర్మ అనాది శరీరంనుంచి పుట్టలేదని మొదటి వాక్యం అర్థం అయితే, శరీరం అనాది కర్మనుంచి పుట్టలేదని రెండవ వాక్యం అర్థం. అనాది పదం శరీరంనుంచి కర్మకు మారింది.

**స్వభావతః (ఉభయం న జాయతే)** – రెండూ ఏకకాలంలో పుట్టాయి అనలేరు. స్వభావతః అంటే సహజంగా. సహజంగా అంటే కారణం లేకుండా. కారణం లేకుండా లేదా ఆకస్మాత్తుగా రెండూ ఒకేసారి పుట్టాయి అని కూడా అనలేరు. రెండూ అంటే కర్మ, శరీరం.

మొత్తం కలిపితే అవి సహజంగా పుట్టలేదు. ఎందుకు?

**యస్య ఆదిః న విద్యతే తస్య హి ఆదిః న విద్యతే** – ఎంత వింతైన వాక్యమో చూడండి. దీని అర్థం అక్షరాలా చూస్తే దేనికైతే ఆది లేదో, దానికి నిశ్చయంగా ఆది ఉండదు. ఆది పదం రెండుసార్లు వచ్చింది. దానికి రెండు భిన్న అర్థాలు వస్తాయి. అవి కారణం, ఉత్పత్తి. ఈ పదాలని ఇప్పుడు ఆది పదంతో మారిస్తే అర్థం సరిపోతుంది. దేనికైతే కారణం లేదో, దానికి నిశ్చయంగా ఉత్పత్తి ఉండదు. ఉత్పత్తి అంటే సృష్టి లేదా పుట్టుక. అంటే దీని అర్థం – కారణం లేకుండా సహజంగా, దానంతట అది ఏదీ పుట్టదు. ఈ వాదన ద్వారా మూడవ వాదనను కొట్టివేస్తున్నారు. మూడవ వాదన – రెండూ ఆకస్మాత్తుగా పుట్టాయి.

**యస్య కారణం నాస్తి, తస్య ఉత్పత్తిః నాస్తి**

ఈ వాదనలను ఇలా ఖండించారు కాని గౌడపాదాచార్యులవారు వాటికి కారణాలను ఇవ్వలేదు. మనం అంతకుముందు కూడా చూశాము కాబట్టి, వాటిని ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. అనాది కారణం అనేది తార్కికంగా చెల్లదు. యుక్తివిరోధదోషం వస్తుంది. దానికి వ్యాప్తి వాక్యం –

**యత్ యత్ కారణం తత్ తత్ సాది**

ఏది కారణమైతే దానికొక ఆది ఉంటుంది. సాది అంటే సా+ఆది=ఆరంభం ఉన్నది. అందువల్ల ఆరంభం లేని కారణాన్ని చూపించటానికి మనకు ప్రత్యక్షప్రమాణం లేదు. మూలకారణాన్ని నిరూపించలేకపోతే, కార్యం లేదు.

ఇప్పుడు ఈ మూడు వాదనలను చూస్తే –

ఎ) **శరీరం అనాది కాలేదు** – శరీరానికి ఒక పుట్టినతేదీ ఉంటుంది. అది కర్మవల్ల పుడుతుంది.

బి) **కర్మ అనాది కాలేదు** – కర్మ చేయటానికి శరీరం కావాలి.

సి) **రెండూ ఆకస్మాత్తుగా పుట్టలేవు** – రెండూ ఏకకాలంలో వాటికి కారణం లేకుండా పుట్టాయని కూడా అనలేరు. శరీరం, కర్మ వాటికి కారణం లేకుండా ఆకస్మాత్తుగా పుడితే, మోక్షం కూడా ఆకస్మాత్తుగా వస్తుంది. కారణం లేకుండా వస్తుంది. అలా కారణం లేకుండా వచ్చింది, ఎన్నాళ్ళు ఉంటుందో తెలియదు. ఆకస్మాత్తుగా మోక్షంనుంచి సంసారంలో పడిపోవచ్చు కూడా. ఎన్నాళ్ళు ఉంటుందో తెలియని మోక్షంకోసం నేనెందుకు పాటుపడాలి అనే సందేహం వస్తుంది. అనుకోకుండా ఒక పాపకర్మ దూసుకురావచ్చు అనిపిస్తుంది. దీన్ని **అనిర్మోక్ష ప్రసంగం** అంటారు.

అనుకోకుండా జరిగింది, యాదృచ్ఛికంగా జరిగింది, ఆకస్మాత్తుగా జరిగింది అనే వాక్యాలను శాస్త్రం ఒప్పుకోదు. ఎప్పుడైతే ఇలా ఆకస్మాత్తుగా జరిగింది అనేది నమ్ముతామో, అప్పుడు జీవితంలో ఎన్నడూ, దేన్నీ చేపట్టలేము. ఎందుకంటే ఎప్పుడైనా, ఏదైనా జరగవచ్చు. అందువల్ల స్వభావతః వాదన కూడా కొట్టివేయబడింది. దీనితో ద్వైతవాదుల ఖండన కూడా అయిపోయింది. మొత్తం 15 వాదనల ద్వారా నిజంగా సృష్టి జరగలేదని నిరూపించారు గౌడపాదాచార్యులవారు.

**అజాతివాదము సత్యము.**

(ఈ వాదనలను ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు.)

**2ఇ). బౌద్ధమత ఖండన - కారికలు 24-28 ఉపోద్ఘాతం**

ఇంతవరకూ గౌడపాదాచార్యులవారు సాంఖ్యదర్శనాన్ని, ద్వైతవాదుల సిద్ధాంతాన్ని ఖండించారు. ఇద్దరూ సృష్టి జరిగిందని ఒప్పుకుంటారు. వీరిది ఆస్తికదర్శనాలు. ఆస్తికులు అంటే భగవంతుణ్ణి నమ్మేవారు అనికాదు అర్థం; వేదాన్ని నమ్మేవారు అని అర్థం. ఇప్పుడు గౌడపాదాచార్యులవారు నాస్తిక దర్శనాలను ఖండించబోతున్నారు. నాస్తికులు అంటే భగవంతుణ్ణి నమ్మనివారు అనికాదు అర్థం; వేదాన్ని నమ్మనివారు అని అర్థం. వీరు ప్రత్యక్ష ప్రమాణాన్ని, అనుమానప్రమాణాన్ని నమ్ముతారు కాని వేదాన్ని నమ్మరు.

నాస్తిక దర్శనాలు ఆరు.

1. చార్వాకదర్శనం - చార్వాకుడు ప్రసిద్ధి చెందేలా చేశాడు
2. జైనదర్శనం - ఋషభదేవుడు దర్శించాడు

తరువాత చాలామంది ఆచార్యులు దానిలో మార్పులు తెచ్చారు. వారిలో ప్రథములు వర్ధమాన మహావీరుడు. ఈ ఆచార్యుణ్ణి జినః అంటారు. జినః అంటే ఇంద్రియాలను జయించిన వ్యక్తి. ఆచార్యుణ్ణి జినః అంటారు కాబట్టి ఆయన అనుయాయులను జైనులు అంటారు.

3. బౌద్ధదర్శనం - 4 మతాలు - బుద్ధభగవానుడు దర్శించాడు

బుద్ధభగవానుణ్ణి దశావతారాల్లో ఒకటిగా పేర్కొంటారు కాని ఆయన వేదాన్ని ప్రమాణంగా స్వీకరించరు కాబట్టి ఆయన దర్శనం నాస్తిక దర్శనంలోకే వస్తుంది.

బుద్ధభగవానుడు చేసిన బోధలు ప్రత్యక్షంగా అందుబాటులో లేవు. కొన్ని శతాబ్దాల తర్వాత, అశోకచక్రవర్తి, బౌద్ధమత పండితులను పిలిచి, వారిని బుద్ధభగవానుడు చేసిన బోధను క్రోడీకరించమని కోరాడు. అప్పుడవి నాలుగు మతాలుగా వెలిశాయి. ఆ నాలుగు సౌత్రాంత్రిక మతము, వైభాషిక మతము, యోగాచార మతము, మాధ్యమిక మతము.

గౌడపాదాచార్యులవారు ఈ నాస్తిక దర్శనాల్లో చార్వాక, జైనదర్శనాలను తీసుకోవటం లేదు. ఈ బౌద్ధమతాలనే తీసుకుని ఖండిస్తున్నారు. ఆయన చేసిన ఖండన చూసేముందు మనం వారి మతాలలోని కొన్ని ప్రాథమిక అంశాలను చూద్దాము. మతం అంటే సిద్ధాంతం. వారి సిద్ధాంతం అంటే ఏమిటో అర్థమయితే కాని ఖండనను అర్థం చేసుకోలేము.

ఎ) **సౌత్రాంత్రిక మతము - బాహ్యార్థ ప్రత్యక్ష వాదినః**

బాహ్య అంటే బాహ్యంగా ఉన్న; అర్థ అంటే నిజం జగత్తు; ప్రత్యక్ష అంటే ప్రత్యక్ష ప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు; వాదినః అంటే ఈ సిద్ధాంతాన్ని నమ్ముతారు. వారి వాదనను టూకీగా చూస్తే -

- బాహ్యప్రపంచం ఉంది
- అది చూసే నాకు భిన్నంగా ఉంది
- అది సత్యం
- దాన్ని ప్రత్యక్ష ప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు.

బి) **వైభాషిక మతము – బాహ్యార్థ అనుమాన వాదినః**

వీరి వాదన చాలామటుకు సౌత్రాంత్రిక మత సిద్ధాంతానికి దగ్గరగా ఉంటుంది, కాని వారు ప్రత్యక్ష ప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు అంటే వీరు అనుమాన ప్రమాణం (తర్కం) ద్వారా తెలుసుకోవచ్చు అంటారు. అలా ఎందుకంటారో మనం ఇప్పుడు వివరాలలోకి వెళ్ళటం లేదు. వారి వాదనను టూకీగా చూస్తే –

- బాహ్యప్రపంచం ఉంది
- అది చూసే నాకు భిన్నంగా ఉంది
- అది సత్యం
- దాన్ని అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు.

సౌత్రాంత్రిక, వైభాషిక మతాలను కలిపి హీనయాన మతము అంటారు.

సి) **యోగాచార మతము – బాహ్యార్థ అభావ వాదినః**

వీరు చూసే నాకు భిన్నంగా బాహ్యప్రపంచం లేదు అంటారు. స్వప్నప్రపంచం ఎలా మిథ్యో, అలా జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అంటారు. బాహ్యప్రపంచాన్ని కొట్టి వేస్తున్నారు కాబట్టి వీరిని బాహ్యార్థ అభావ వాదినః అంటారు. అభావ అంటే ఉనికి లేకపోవటం. చూసే నేను సత్యం అంటారు కాని నేను క్షణిక విజ్ఞానప్రవాహాన్ని అంటారు. వీరిని క్షణిక విజ్ఞాన వాదినః అని కూడా అంటారు.

వీరి వాదనను టూకీగా చూస్తే –

- చూసే నాకు భిన్నంగా బాహ్యప్రపంచం లేదు
- స్వప్నప్రపంచంలాగా జగత్తు మిథ్య
- చూసే నేను ఉన్నాను
- నేను సత్యం
- నేను క్షణిక విజ్ఞానప్రవాహాన్ని

డి) **మాధ్యమిక మతము – సర్వార్థ అభావ వాదినః**

వీరిది కొంతమేరకు యోగాచార మతానికి దగ్గరగా ఉంటుంది. వీరు కూడా బాహ్యప్రపంచం మిథ్య అనే అంటారు. కాని వారికన్నా వీరు ఇంకొక మెట్టు పైన ఉన్నారు.

వీరు చూసే నేను కూడా లేను అంటారు. ఏదీ లేదు అంటారు కాబట్టి వీరిని సర్వార్థ అభావ వాదినః అంటారు. ఏదీ లేదు అంటే శూన్యమే ఉంది అంటారు కాబట్టి వీరిని శూన్యవాదినః అని కూడా అంటారు.

వీరి వాదనను టూకీగా చూస్తే -

- బాహ్యప్రపంచం లేదు
- చూసే నేను కూడా లేను
- అంతా శూన్యమే.

యోగాచార, మాధ్యమిక మతాలను కలిపి మహాయాన మతము అంటారు.

ఇప్పుడు నాలుగు మతాలను తీసుకుంటే, మన అద్వైత సిద్ధాంతానికి ఏది దగ్గరగా ఉంది? యోగాచారమతము దగ్గరగా ఉంది. ఆ పోలికలేమిటో చూద్దాము.

ఎ) **జగత్ మిథ్య** - చూసే నాకు భిన్నంగా బాహ్యప్రపంచం లేదు అంటారు యోగాచార మతస్థులు. అంటే జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి జగత్తు మిథ్య అని వారు కూడా ఒప్పుకుంటారు. మనం కూడా స్వప్నప్రపంచంలాగా జగత్తు కూడా మిథ్య అంటాము.

బి) **నేను సత్యం** - జగత్తును చూసే నేను సత్యం అని వారు కూడా అంటారు. చూడబడే జగత్తు మిథ్య కాని, చూసే నేను సత్యం అంటారు. మనం కూడా బాహ్యంగా, ఆబ్జెక్టుగా తెలిసేదంతా మిథ్య అంటాము. సబ్జెక్టు-ఆబ్జెక్టు విభజన లేదు కాబట్టే అద్వైతం మాత్రమే సత్యం అంటాము. విభజన ఉంటే అది ద్వైతం అవుతుంది. సబ్జెక్టు-ఆబ్జెక్టులను ప్రమాత-ప్రమేయం అంటారు.

ప్రమాత + ప్రమేయం = ద్వైతం

ప్రమాతకు ప్రమేయం భిన్నంగా లేదు = అద్వైతం

సి) **నేను చైతన్యం** - చూసే నేను సత్యం, నేను చైతన్యం అని వారు కూడా అంటారు. వారు చైతన్యాన్ని విజ్ఞానస్వరూపం అంటారు. అందువల్ల వారిని విజ్ఞానవాదినః అనికూడా అంటారు. మనం విజ్ఞానం బదులు చైతన్యం అంటాము.

ఈ విధంగా మూడు పోలికలు ఉన్నాయి - జగత్ మిథ్య, నేను సత్యం, నేను చైతన్యం. ఇన్ని పోలికలు ఉంటే బౌద్ధ ఏమిటి? బొత్తిగా భేదం లేకపోతే వారిని అద్వైతులు అనాలి లేదా మనను యోగాచారులు అనాలి. మనను యోగాచారులు అంటే మనం కూడా నాస్తికులం అయిపోతాము. కాని మనకీ, వారికీ మధ్య ఒక ప్రాథమిక భేదం ఉంది, దాని వివరాలు తరువాత చూద్దాము. ఇప్పుడు అదేమిటో తెలుసుకుందాము.

వారు నేను చైతన్యాన్ని అంటారు కాని అక్కడ మనకీ, వారికీ మధ్య భేదం వస్తుంది. వారు చైతన్యం వచ్చిపోయేది, తాత్కాలికం అంటారు. మనం చైతన్యం ఏకం, నిత్యం అంటే వారు చైతన్యం క్షణక్షణమూ మారే తాత్కాలిక ప్రవాహం అంటారు. దాన్ని క్షణిక విజ్ఞాన ప్రవాహః అంటారు. క్షణిక అంటే ఒక్కక్షణం. మెరుపెలా ఒక్కక్షణంలో మెరిసి మాయమవుతుందో, అలా చైతన్యం క్షణక్షణమూ వచ్చి, పోతుంది అంటారు. అంటే ఈ క్షణం ఒక చైతన్యం ఉంటే, రెండో క్షణం మొదటిది పోయి, రెండోది వస్తుంది అంటారు.

కాని ప్రస్తుతానికి ఈ చివరి అంశమైన భేదాన్ని ప్రక్కన పెడదాము. ముందు మనం యోగాచార మతంతో చేతులు కలిపి, వారి ద్వారా బౌద్ధమతంలోని మొదటి రెండింటినీ ఖండిస్తాము. మొదటి రెండు మతాలూ సౌత్రాంత్రిక మతము, వైభాషిక మతము. వారిద్దరిదీ కలిపి హీనయాన మతం అంటారని చూశాము. వారిది బాహ్యార్థ వాదన అంటే బాహ్యప్రపంచం చూసే నాకు భిన్నంగా ఉంది, అది సత్యం. మనం విడిగా వారిని ఖండించ నవసరం లేదు, యోగాచారుల వారితో చేతులు కలిపితే చాలు. వారికీ, మనకూ మధ్య ఉన్న పోలికలను ముందు గుర్తు తెచ్చుకోవాలి. అవి – జగత్ మిథ్య, నేను సత్యం, నేను చైతన్యం. వారి ద్వారా తక్కిన మతాలను ఖండించాక, చివరికి యోగాచార మతాన్ని కూడా ఖండిస్తారు గౌడపాదాచార్యులవారు.

కారికలు 24–28లో బౌద్ధమత ఖండన ఈ విధంగా సాగుతుంది.

కారిక 24 – హీనయాన మతము చేసే వాదన

కారికలు 25–27 – హీనయాన మత ఖండన – యోగాచార వాదన ద్వారా

కారిక 28 – యోగాచార మత ఖండన.

ఇక్కడ నాలుగవ మతము అయిన మాధ్యమిక మతము గురించి రాలేదు. వారిది శూన్యవాదన అని చూశాము. లేనిదాన్ని ఖండించేదేమిటి అనే ఉద్దేశ్యంతో గౌడపాదాచార్యుల వారు దాని జోలికి పోరు. దీనితో బౌద్ధమత ఖండన ఉపోద్ఘాతం అయిపోయింది. ఈ నేపథ్యంతో ఆ కారికలను చూద్దాము.

**కారిక 4.24**

**ప్రజ్ఞప్తేస్సనిమిత్తత్వమన్యథా ద్వయనాశతః ।**
**సంక్లేశస్యోపలబ్ధేశ్చ పరతంత్రాస్తితా మతా ॥**

**కారిక 24 – హీనయాన మతము చేసే వాదన**

ఈ కారికలో హీనయాన బాహ్యార్థవాది తన మతం గురించి చెబుతున్నాడు.

**ప్రజ్ఞప్తేస్సనిమిత్తత్వమ్** – మనకు ఒక విషయం గురించి జ్ఞానం కలిగితే, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉండాలి. బాహ్యంగా లేకపోతే, దాని గురించిన జ్ఞానం పొందలేము. సుషుప్తిలో బాహ్యప్రపంచం ఉండదు కాబట్టి, సుషుప్తిలో జ్ఞానం కూడా ఉండదు. జాగ్రదావస్థలో అనేక వస్తువులను చూస్తాము కాబట్టి వాటి గురించిన జ్ఞానం ఏర్పడుతుంది. కుండను చూస్తే కుండ జ్ఞానం ఏర్పడుతుంది, మనిషిని చూస్తే మనిషి జ్ఞానం ఏర్పడుతుంది, చెట్టును చూస్తే చెట్టు జ్ఞానం ఏర్పడుతుంది. అంటే లోపల ఒక జ్ఞానం కలుగుతున్నది అంటే, బాహ్యంగా దానికి సంబంధించిన వస్తువు ఉందనే అర్థం. ఆ జ్ఞానం అనేక విషయాల మీద ఉంటుంది. ఎందుకంటే మనం చూసేది అనేక వస్తువులను కాబట్టి.

ఒక పెద్ద హాలును చూస్తే, అనేక విషయాలమీద జ్ఞానం కలుగుతుంది. అందులో ఉన్న మనుష్యులు అనేక రంగుల దుస్తులు తొడిగితే, రంగుల గురించిన జ్ఞానం కలుగుతుంది. అందువల్ల జ్ఞానం కలిగిందంటేనే, బాహ్యవస్తువు ఉందని అర్థం అంటారు వారు.

ప్రజ్ఞప్తిః అంటే జ్ఞానం; సనిమిత్తత్వామ్ అంటే బాహ్యంగా ఉన్న వస్తువుతో కూడినది. అందువల్ల బాహ్య అర్థః అస్తి.

**అన్యథా** – ఒకవేళ మీరు బాహ్యవస్తువుల ఉనికిని ఒప్పుకోకపోతే,

**ద్వయనాశతః** – అంతర్గతంగా కలిగే జ్ఞానాన్ని ఒప్పుకోలేరు. ఇదంతా హీనయాన మతం చేసే వాదన అని మర్చిపోకూడదు. రెండవ వాదన రెండవ పాదంలో చేస్తున్నారు.

మనం అనేక భావోద్రేకాలకు లోనవుతాము. ఆనందం, దుఃఖం, రాగం, ద్వేషం కలుగుతాయి. ఈ భావోద్రేకాలు ఏదో ఒక బాహ్యవస్తువువల్ల కలగాలి. శరీరం వేడెక్కినట్టు ఉంటే, వేడిని కలిగించే వస్తువేదో బాహ్యంగా ఉందన్నమాట. ఉన్నట్టుండి, దానంతట అది శరీరం వేడెక్కదు కదా. దానికేదో కారణం ఉండాలి. అది కూడా బాహ్యంగా ఉండాలి.

ఈ రెండు వాదనలకూ మధ్య సూక్ష్మభేదం ఉంది.

1. మనకు అగ్ని గురించిన జ్ఞానం కలుగుతున్నదంటే, బాహ్యంగా అగ్ని ఉందన్నమాట.
2. మనకు శరీరం వేడిగా అనిపిస్తే, వేడి కలిగించే అగ్ని బాహ్యంగా ఉందన్నమాట.

ఉన్నట్టుండి కాలిలో ఎక్కడో నొప్పి పుడితే, ఏదో దోమ కుట్టిందని అర్థం. అంటే మన శరీరానికి కలిగే బాధకు కారణం బాహ్యవస్తువు.

**సంక్లేశస్యోపలబ్ధేశ్చ** – సంక్లేశం అంటే నిజానికి దుఃఖం. కాని దానికి సుఖం కూడా కలుపుకోవాలి. అంటే మనకు కలిగే సుఖదుఃఖాలన్నీ బాహ్యవస్తువులవల్ల కలుగుతాయి.

**పరతంత్రాస్థితా మతా** – ఈ కారణాల దృష్ట్యా బాహ్యప్రపంచం ఉందని ఒప్పుకుని తీరాలి అంటున్నారు హీనయాన మతస్థులు. అస్థితా అంటే బాహ్యప్రపంచం ఉంది అని; పరతంత్రం అంటే తక్కిన అన్ని దర్శనాలు కూడా ఒప్పుకుంటాయి.

హీనయాన వాదన టూకీగా –

1. మనకు ఒక విషయం గురించిన జ్ఞానం కలిగితే, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉండాలి.

2. మనకు ఒక విషయం గురించిన భావోద్రేకం కలిగితే, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉండాలి.

**కారిక 4.25**

**ప్రజ్ఞప్తేస్సనిమిత్తత్వమిష్యతే యుక్తిదర్శనాత్ ।**
**నిమిత్తస్యానిమిత్తత్వమిష్యతే భూతదర్శనాత్ ॥**

**హీనయాన మత ఖండన – కారికలు 25–27**

ఇప్పుడు హీనయాన మతఖండన చూడబోతున్నాము. హీనయాన మతస్థులది బాహ్యార్థ వాదన అని చూశాము. నిజానికి మనం చూడబోయే వాదన యోగాచారమతం చేసే వాదన. కాని దాన్నే గౌడపాదాచార్యులవారి వాదనగా కూడా తీసుకోవచ్చు. అంటే ఆయన తాత్కాలికంగా యోగాచారులవారితో చేతులు కలిపారు.

యోగాచారమతం చేసిన ఖండన ద్వారా గౌడపాదాచార్యులవారు ఖండన చేశారు.

ముందుగా హీనయాన మతాన్ని ఒప్పుకుంటున్నట్టు ఒప్పుకుంటూనే, దాన్ని ఖండిస్తున్నారు. 'నిజమే, మీరన్నది పైపైన చూస్తే సబబుగానే ఉంది.' అంటున్నారు. పైపైన చూస్తే మాటను వదలకూడదు. ఎందుకు వారి వాదన సబబుగా అనిపిస్తున్నది?

1. నిజమే, తార్కికంగా చూస్తే ప్రతి ఒక్క జ్ఞానానికి, దానికి సంబంధించిన బాహ్యవస్తువు ఉండాలి.

2. కాని, స్వరూపలక్షణం చూస్తే, బాహ్యవస్తువు అంటూ లేదు.

కాని వచ్చిన చిక్కేమిటంటే దీన్ని లోతుగా విశ్లేషిస్తే – బాహ్యవస్తువు మాయమైపోతుంది. ఏ వస్తువు అయితే అనుభవాన్ని ఇస్తుందంటున్నారో, అది అక్కడ నిజంగా లేనేలేదు. దానికి ఎన్నైనా ఉదాహరణలు చెప్పవచ్చు. మొదటి అధ్యాయంలో మనం బంగారము–ఆభరణముల విశ్లేషణ చాలా వివరంగా చూశాము. దాన్నే మళ్ళీ ఇక్కడ చూద్దాము.

## విచారణ చేయటమెలా?

ఎవరైనా ఏదైనా ఉపాసనను చాలాకాలం పాటు చేసి, చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందారనుకుందాము. కాని ఆత్మవిచారణ ఎలా చేయాలో తెలియకపోతే ఎలా? అందువల్ల ఇప్పుడు విచారణ ఎలా చేయాలో చూద్దాము. దీన్ని నాలుగు దశల్లో చూద్దాము.

**దశ 1** – సాధారణంగా ప్రతి పదార్థానికీ ఒక పేరు ఉంటుంది. పేరును పదం అంటారు. ప్రతి పేరూ, ఒక పదార్థాన్ని సూచిస్తుంది. అందువల్ల ఎన్ని పదార్థాలుంటే, అన్ని పేర్లు ఉంటాయి. మనకు తెలిసిన పద్ధతి ఇది. కాని ఇక్కడ వేదాంతం ఈ సత్యాన్ని కొంచెం లోతుగా విశ్లేషించమంటున్నది.

ఇప్పుడు మనం మూడు పదాలను తీసుకుందాము. అవి గాజు, గొలుసు, ఉంగరము. మనకు తెలిసినదాన్ని బట్టి, ఒక్కొక్క పదానికీ ఒక్కొక్క పదార్థం ఉండాలి కదా! కుడివైపు మూడు పదార్థాలను తీసుకుందాము. అవి గాజు పదార్థం, గొలుసు పదార్థం, ఉంగరం పదార్థం.

**బంగారము – ఆభరణముల విశ్లేషణ**

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు | గాజు |
| గొలుసు | గొలుసు |
| ఉంగరం | ఉంగరం |

**దశ 2** – ఇప్పుడు ఈ ఉన్న పదాలు – పదార్థాలకు బంగారం అనే పదం కలుపుదాము. ఇటు నాలుగు పదాలు వచ్చాయి కాని అటు మూడే పదార్థాలు ఉన్నాయి. బంగారానికి పదార్థమేదో వెతకాలి.

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు | గాజు |
| గొలుసు | గొలుసు |
| ఉంగరం | ఉంగరం |
| బంగారం | ? |

ఇది దశ 2.

**దశ 3** – లోతుగా విశ్లేషిస్తే గాజు దేనితో చేయబడింది? బంగారంతో! గొలుసు దేనితో చేయబడింది? బంగారంతో! ఉంగరం దేనితో చేయబడింది? బంగారంతో! ఈ బంగారాన్ని

తీసి, గొలుసు ఇవ్వండి అనగలమా? అనలేము. అంటే బంగారం లేకుండా గాజుకు కాని, గొలుసుకు కాని, ఉంగరానికి కాని విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటారు. అది ఉన్నా లేనట్టే. ఇప్పుడు వీటిని మళ్ళీ చూద్దాము.

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు | బంగారం (గాజు ×) |
| గొలుసు | బంగారం (గొలుసు ×) |
| ఉంగరం | బంగారం (ఉంగరం ×) |
| బంగారం | |

పదార్థత్రయ నిషేధః. అంటే పదార్థాలను నిషేధించాము.

ఇది దశ 3.

**దశ 4** – మళ్ళీ పదాలు, పదార్థాలను చూస్తే, అక్కడ మనకు మూడు పదార్థాలు లేవు. ఉన్నదొక్కటే పదార్థం. అది బంగారం. ఎప్పుడైతే పదార్థాలను నిషేధించామో, అప్పుడే వాటిని పేర్కొనే పదాలకు విలువ లేదు. అంటే వాటికి కూడా ఉనికి లేదు.

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు × | × |
| గొలుసు × | × |
| ఉంగరం × | × |
| బంగారం ✓ | బంగారం ✓ |

పదత్రయ నిషేధః.

ఇప్పుడు పదాలను కూడా నిషేధించాము.

ఇది దశ 4.

**దశ 5** – ముందు పదార్థాలను నిషేధించాము. పదార్థాలు లేకపోతే పదాలకు కూడా ఉనికి లేదు కాబట్టి తరువాత పదాలను కూడా నిషేధించాము. ఇంక మిగిలింది ఏమిటి? మిగిలింది ఒకటే. అధిష్ఠానమైన బంగారం.

ఇది దశ 5

ఇప్పుడు ఇదే సూత్రాన్ని తీసుకుని, పదం స్థానంలో మాత్ర, పదార్థం స్థానంలో ప్రపంచం పెడదాము.

| **మాత్ర** | **ప్రపంచం** |
|---|---|
| అకార మాత్ర | స్థూలప్రపంచం |
| ఉకార మాత్ర | సూక్ష్మప్రపంచం |
| మకార మాత్ర | కారణప్రపంచం |

ఇది దశ 1. ఇప్పుడు దశ 2లో తురీయాన్ని పరిచయం చేస్తాము. తురీయాన్ని ఎక్కడ పెట్టాలి?

దశ 3లో తురీయం లేకుండా ప్రపంచాలకు విడిగా ఉనికి లేదు. అందువల్ల ప్రపంచాలను నిషేధిస్తాము. ప్రపంచత్రయ నిషేధః. అంటే మూడు ప్రపంచాలను నిషేధిస్తాము. దశ 4లో ప్రపంచాలు లేకపోతే వాటిని సూచించే అ, ఉ, మ లకు ఉనికి లేదు. వాటిని కూడా నిషేధిస్తాము. మాత్రత్రయ నిషేధః అంటే మూడు మాత్రలను నిషేధిస్తాము. మూడు మాత్రలను నిషేధిస్తే మిగిలేది ఏమిటి? అమాత్ర. అమాత్ర = తురీయం. ఇది దశ 5.

ఇదే సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే జగత్తులోని పదాలు లేవు, పదార్థాలు లేవు, జగత్తును సాక్షీభూతంగా చూసే నేను మాత్రమే మిగులుతాను. ఇదీ ఈ కారిక సారాంశం. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**ప్రజ్ఞప్తేస్సనిమిత్తత్వ మిష్యతే** – ప్రతి ఒక్క జ్ఞానానికి లేదా అనుభవానికి, బాహ్యంగా దానికి సంబంధించిన వస్తువు ఉండాలి నిజమే. నిమిత్తం అంటే వస్తువు; ప్రజ్ఞప్తిః అంటే జ్ఞానం. ఇందాక చూసినట్టుగా గాజు జ్ఞానం కలగాలంటే గాజు అనే పదార్థం ఉండాలి.

**యుక్తిదర్శనాత్** – యుక్తిపరంగా అంటే తార్కికంగా చూస్తే అది నిజమే. తర్కం ప్రకారం ప్రతి జ్ఞానానికి దానికి సంబంధించిన వస్తువు ఉండాలి. కాని సమస్య ఎక్కడుంది?

**భూతదర్శనాత్** – లోతుగా విశ్లేషిస్తే నిజంగా గాజు, ఉంగరం, గొలుసులు ఉన్నాయా? భూత అంటే స్వరూపం, తత్త్వం. లోతుగా విశ్లేషిస్తే నమ్మలేని నిజం బయటపడుతుంది. ఏమిటది?

**నిమిత్తస్య అనిమిత్తత్వమ్** – బాహ్యవస్తువుగా కనబడుతున్నదానికి నిజంగా ఉనికి లేదు. గాజు బరువు ఎంత అని అడిగితే, నిజానికి ఆ బరువు దేనిది? గాజుది ఎంతమాత్రమూ కాదు. అంతా బంగారానిదే. అందులో 0.00001 గ్రాము బరువు కూడా గాజుది కాదు. మరయితే గాజు ఏమిటి? అది కేవలం నామం లేదా పదం మాత్రమే.

అదే సూత్రం జగత్తుకు కూడా వర్తిస్తుంది. జగత్తు కేవలం నామరూపాత్మకం మాత్రమే. అందులోంచి నామరూపాలను తీస్తే ఉన్నట్టుగా అనిపించిన వస్తువులు నిజంగా ఉండవు.

**ఇష్యతే** – ఈ సత్యాన్ని ఒప్పుకుని తీరాలి.

దీనికి ఇంకొక ఉదాహరణ స్వప్నప్రపంచం. స్వప్నప్రపంచంలో కూడా బాహ్యంగా ఒక వస్తువుని చూసి భయపడతాడు స్వాప్నికుడు. పులిని చూసి భయపడతాడు. కాని స్వప్నం నుంచి లేస్తే, భయమూ లేదు, భయపెట్టిన పులీ లేదు. రెండూ అతను ఊహించుకున్నవే. భయాన్ని జ్ఞాన అధ్యాస అంటే, పులిని అర్థ అధ్యాస అంటారు. నిద్రనుంచి లేస్తే జ్ఞానమూ పోతుంది, జ్ఞానాన్ని కలుగజేసిన వస్తువూ పోతుంది.

అలాగే జాగ్రత్ ప్రపంచంనుంచి ఉన్నతస్థాయికి చెందిన పారమార్థిక సత్యానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచ అనుభవమూ పోతుంది, జాగ్రత్ ప్రపంచవస్తువులూ పోతాయి.

**కారిక 4.26**

**చిత్తం న సంస్పృశత్యర్థం నార్థాభాసం తథైవ చ।**
**అభూతో హి యతశ్చార్థో నార్థాభాసస్తతః పృథక్ ॥**

యోగాచారమతం వారు అసలు బాహ్యప్రపంచం లేదు, ఉన్నది చైతన్యం మాత్రమే అంటారు. చైతన్యం బాహ్యవస్తువును అనుభవించే ప్రశ్నే లేదు, ఎందుకంటే బాహ్యవస్తువు లేనేలేదు.

**చిత్తం న సంస్పృశతి అర్థమ్**– చైతన్యం బాహ్యంగా ఉన్న వస్తువును అనుభవించదు. ఎందుకు? బాహ్యవస్తువు నిజంగా లేదు. స్వప్నంలో ఏనుగును చూసినా కూడా, అది ఎలా నిజం ఏనుగు కాదో, అలా జాగ్రత్ ప్రపంచం ఎదురుగా కనిపిస్తున్నా అది నిజం కాదు.

అయితే నిజంకాని వస్తువును అనుభవిస్తుందా చైతన్యం?

**న అర్థాభాసం చ (సంస్పృశతి)** – అదే విధంగా చైతన్యం, నిజంకాని వస్తువును కూడా అనుభవించలేదు.

అసలు సత్యవస్తువు అవనీ, మిథ్యావస్తువు అవనీ, ఏదీ కూడా చైతన్యానికి భిన్నంగా లేదు. ఉన్నదొకటే చైతన్యం. చైతన్యానికి భిన్నంగా ఏదీ లేకపోతే ఎలా ముట్టుకుంటుంది? నేను దేన్నైనా ముట్టుకోవాలంటే ఆ వస్తువు నాకు భిన్నంగా ఉండాలి.

బంగారం నిజం గాజునీ ముట్టుకోలేదు, నిజంకాని గాజునీ ముట్టుకోలేదు. ఎందుకు? గాజు బంగారానికి భిన్నంగా లేదు. లోతుగా విశ్లేషిస్తే, ఇది చాలా ఆసక్తికరమైన విషయం. బంగారం గాజుని ముట్టుకోవాలంటే బంగారం విడిగా, గాజు విడిగా ఉండాలి. బంగారం, గాజు ఒకటే వస్తువుకు ఉన్న రెండు భిన్న నామధేయాలు మాత్రమే అని ఇంతకు ముందే వివరంగా చూశాము. పేర్లు రెండు, వస్తువు ఒకటే.

అదే సూత్రం ప్రకారం జగత్తు, చైతన్యం పేర్లు రెండు, వస్తువు ఒకటే. అది చైతన్యం మాత్రమే. తెలివైన వ్యక్తి ఆభరణాన్ని చూసినా దాన్ని బంగారం అని ఎలా అంటాడో, అలా

తెలివైన వ్యక్తి జగత్తును చూస్తున్నా, దాన్ని చైతన్యం అంటాడు. అజ్ఞాని బంగారం చూడకుండా ఆభరణాన్ని మాత్రమే చూసినట్టుగా, ఇక్కడ చైతన్యాన్ని వదిలి జగత్తును మాత్రమే చూస్తాడు.

**చిత్తం** – చిత్తం అంటే ఇక్కడ చైతన్యం. తత్త్వబోధలో నాలుగు అంతఃకరణాల గురించి నేర్చుకుంటాము. అవి మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం. ఆ చిత్తం కాదిక్కడ. ఇక్కడ చిత్తం అంటే చిత్ లేదా చైతన్యం. చైతన్యం దేనినీ స్పృశించదు.

**యతః** – ఎందుకంటే,

**అర్థః అభూతః** – చైతన్యానికి భిన్నంగా వేరే పదార్థం ఏదీ లేదు కాబట్టి.

**నార్థాభాసః** – న అర్థ అభాసః – మిథ్యాపదార్థం కూడా లేదు.

**తతః పృథక్** – చైతన్యానికి భిన్నంగా లేదు.

ఈ కారిక అర్థం చైతన్యం పదార్థాన్ని స్పృశించదు, మిథ్యాపదార్థాన్ని కూడా స్పృశించదు. ఎందుకంటే చైతన్యానికి భిన్నంగా పదార్థం లేనేలేదు.

### కారిక 4.27

**నిమిత్తం న సదా చిత్తం సంస్పృశత్యధ్వసు త్రిషు ।**
**అనిమిత్తో విపర్యాసః కథం తస్య భవిష్యతి ॥**

మొదటిపాదంలో ఈ వాదనను ముగుస్తున్నారు యోగాచారవాదులు.

**చిత్తం నిమిత్తం న సంస్పృశతి** – చైతన్యం బాహ్యవస్తువును స్పృశించదు. నిమిత్తం అంటే బాహ్యవస్తువు అనీ, చిత్తం అంటే చైతన్యం అనీ చూశాము. చైతన్యం బాహ్యవస్తువును స్పృశించదు. ఎప్పుడు?

**సదా** – ఎప్పుడూ,

**త్రిషు అధ్వసు** – మూడు కాలాల్లోనూ. అంటే భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల్లో ఎన్నడూ బాహ్యవస్తువును చైతన్యం స్పృశించదు అంటే అనుభవించదు. స్వప్నప్రపంచంలో చూసే పులి స్వప్నం ముందూ లేదు, స్వప్నంలోనూ లేదు, స్వప్నంనుంచి లేచాకా లేదు. 'స్వప్నంలో పులి లేదని ఎలా చెప్పగలరు? అది నన్ను భయపెట్టింది, నన్ను పరుగులు తీయించింది,' అనవచ్చు మీరు. కాని అది ఒక భావన మాత్రమే అంటాము. ఆ పులి మీ వాసనలనుంచి వచ్చింది. వాసనామయప్రపంచం సత్యం కాదు. మీరు అనుభవించిన ప్రతిదీ సత్యం కాదు. మీకు కలిగిన భావనలన్నీ సత్యం కాదు. మీకు మీరు అత్యంత ఐశ్వర్యవంతుణ్ణి అనే భావన కలిగినంత మాత్రాన అది సత్యమవాలనే నియమమేమీ లేదు.

**విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ తుల్యం నిజాంతర్గతం**
**పశ్యన్నాత్మని మయయా బహిరివోద్భూతం యథా నిద్రయా**

విశ్వం ఆత్మలో ఉంది, కాని అద్దంలో కనబడే నగరంలా బాహ్యంగా ఉన్నట్టుగా కనబడుతున్నది. అది మాయవల్ల బాహ్యంగా అనిపిస్తుంది. జ్ఞానికి, స్వప్నప్రపంచంలాగా జాగ్రత్ ప్రపంచం కూడా మాయాకల్పితమని తెలుస్తుంది.

రెండవపాదంలో యోగాచారమతం వారు మనకు రాగల ఒక సూక్ష్మమైన, సాంకేతికమైన సందేహాన్ని ఊహించుకుని దానికి జవాబు చెబుతున్నారు. నిజంగా ఎవరూ ప్రశ్న వేయలేదు, ఈ సందేహం వస్తే ఇదీ జవాబు. అందువల్ల ముందు మనం అడగని ప్రశ్నని అర్థం చేసుకుంటే, దానికి చెప్పిన జవాబుని ఆనందించగలుగుతాము.

**ప్రశ్న** – మీరసలు బాహ్యప్రపంచం లేనే లేదంటే, సరియైన జ్ఞానానికీ, పొరపాటుకీ మధ్య భేదాన్ని ఎలా గుర్తిస్తారు?

ఉదాహరణకు రజ్జుసర్పభ్రాంతి గురించి వేదాంతంలో పదేపదే చూస్తాము. ఒకవ్యక్తి ఒక వస్తువును చూసి పాము అనుకుంటాడు, ఇంకొక వ్యక్తి దాన్నే తాడు అంటాడు. పాము అనుకున్న వ్యక్తిది సరియైన జ్ఞానమా, తాడు అనుకుంటున్న వ్యక్తిది సరియైన జ్ఞానమా? అక్కడ టార్చ్‌లైట్ వేసి చూస్తే ఆ వస్తువు స్పష్టంగా తాడుగా కనబడుతుంది కాబట్టి పాము అనుకున్న వ్యక్తిది పొరపాటు అంటాము. అంటే మీరనుకున్నది, బాహ్యంగా ఉన్న వస్తువుకు భిన్నంగా ఉంటే అది పొరపాటు, బాహ్యంగా ఉన్న వస్తువుతో సరిపోలితే, అది జ్ఞానం.

జ్ఞానం–పొరపాటుల భేదం ఎప్పుడు తెలుస్తుంది? బాహ్యంగా దానికి సంబంధించిన వస్తువు ఉంటేనే. అక్కడ వస్తువే లేదంటే, దాని గురించిన పొరపాటుని ఎలా వివరిస్తారు? పొరపాటును అర్థం చేసుకోవాలంటే బాహ్యంగా వస్తువు ఉండాలి. దీన్నెలా వివరిస్తారు? ఇదీ ప్రశ్న.

**జవాబు** – 'సరియైన జ్ఞానం, పొరపాటు అనే భేదాన్నే నేను ఒప్పుకోను,' అంటారు వీరు. ఎందుకు? అక్కడ అసలు వస్తువు ఉంటే కదా, దాని గురించిన జ్ఞానం తప్పో, ఒప్పో చెప్పటానికి? స్వప్నంలో నేను చూసినది తాడా–పామా తేల్చి చెప్పండి అంటే ఎలా ఉంటుంది? స్వప్నమే సత్యం కానప్పుడు స్వప్నంలోని పాము కాని, తాడు కాని ఎలా సత్యమవుతుంది? అదంతా మీనుంచి వచ్చిన వాసనామయప్రపంచం.

**విపర్యాసః కథం భవిష్యతి** – విపరీతజ్ఞానం ఎలా కలుగుతుంది? విపర్యాసః అంటే అసలు జ్ఞానం లేదా పొరపాటు.

**అనిమిత్తః** – అసలు బాహ్యంగా వస్తువే లేదు. బాహ్యంగా వస్తువే లేకపోతే దాని గురించిన జ్ఞానం తప్పో, ఒప్పో ఎలా చెబుతాను? తప్పొప్పులు చెప్పాలంటే, ఒక బాహ్యవస్తువు ఉండాలి. బాహ్యంగా వస్తువు ఉందని మీరంటే, మీరు స్వప్నంలో ఉన్నట్టు అర్థం.

మరయితే ఈ మాండూక్యం నేర్చుకోవటం మాటేమిటి? ఇది కూడా మీ స్వప్నంలోనే జరుగుతున్నది. మీ స్వప్నంలో, స్వప్నబోధ జరుగుతున్నది. ఈ బోధ విని మీరు ఉన్నత స్థాయికి లేస్తారనే ఉద్దేశ్యంతో జరుగుతున్నది.

పైపైన చూస్తే నిజంగా బాహ్యప్రపంచం ఉన్నట్టుగా ఉంటుంది, కాని లోతుగా విశ్లేషిస్తే, చూసే ప్రమాతకు భిన్నంగా లేదు ప్రమేయం. దానికి వివరంగా ఐదు దశల్లో బంగారం – ఆభరణాల విశ్లేషణ చూశాము.

మాండూక్యపరంగా చూద్దాము ఇప్పుడు.

| **పదాలు** | **పదార్థాలు** |
|---|---|
| అకారం | స్థూలపదార్థాలు |
| ఉకారం | సూక్ష్మపదార్థాలు |
| మకారం | కారణపదార్థాలు |

లోతుగా విశ్లేషిస్తే ఈ మూడు పదాలు, పదార్థాలు కూడా అంతిమ సత్యం అయిన ఒక్క అధిష్ఠాన చైతన్యంలో లయమయిపోతాయి. ఈ కారికతో యోగాచార మతంతో కలిపి, గౌడపాదాచార్యులవారు తక్కిన బౌద్ధమతంలోని తక్కిన రెండు మతాలను ఖండించారు. అవి సౌత్రాంత్రిక మతము, వైభాషిక మతము.

**కారిక 4.28**

**తస్మాన్న జాయతే చిత్తం చిత్తదృశ్యం న జాయతే ।**
**తస్య పశ్యంతి యే జాతిం ఖే వై పశ్యంతి తే పదమ్ ॥**

**యోగాచారమత ఖండన – కారిక 28**

ఇంతవరకు, తక్కిన బౌద్ధమతస్థులను ఖండించటంకోసం యోగాచార మతంతో చేతులు కలిపారు గౌడపాదాచార్యులవారు అని చూశాము. ఇందులో కూడా, రెండవ పాదంలో ఇద్దరూ కలిపి చేసే వాదనకు ముగింపు పలుకుతున్నారు.

**తస్మాత్** – అందువల్ల. ఎందువల్ల? ముందు కారికల్లో చూసిన కారణాలవల్ల.

**చిత్తం దృశ్యం న జాయతే** – బాహ్యప్రపంచం పుట్టనే లేదు. మామూలుగా చూస్తే చిత్తదృశ్యం అంటే అనుభవంలోకి వచ్చే విషయవస్తువు. ఇక్కడ చిత్తం అంటే చైతన్యం అని చూశాము. అందువల్ల చైతన్య విషయవస్తువు. న జాయతే అంటే పుట్టలేదు. అంతా కలిపితే బాహ్య ప్రపంచం అసలు పుట్టనే లేదు.

బాహ్యప్రపంచం పుట్టలేదు సరే, దానికి ఉనికి ఉందా? ఈ ప్రశ్నే తప్పు. పుట్టుకే లేని పిల్లవాని ఉనికి గురించి ఏం మాట్లాడగలరు? సృష్టి జరిగితే, దాని తర్వాత దానియొక్క స్థితి, లయల గురించి మాట్లాడగలరు. సృష్టే లేకపోతే, స్థితి ఎలా వస్తుంది? బాహ్యప్రపంచం పుట్టనే లేదు అని గౌడపాదాచార్యులవారు అంటుంటే, దాని స్థితి గురించి ఎలా మాట్లాడతాము?

మరి నాకు అనుభవంలోకి వస్తున్న జగత్తు మాటేమిటి? అది మిథ్యా జగత్తు. మిథ్యా జగత్తు అయితే, నాకెలా అనుభవం కలుగుతుంది? గౌడపాదాచార్యులవారు, ఒక్కసారి మీ స్వప్నప్రపంచం గురించి గుర్తు తెచ్చుకోండి అంటారు. స్వప్నప్రపంచంలో ఉన్నంతసేపూ స్వప్నప్రపంచం నిజంగా నిజం అనిపిస్తుంది. అది మీకు నిజం అనిపించినంత మాత్రాన నిజమవాలని లేదు. మీకు మీరు గొప్ప ఐశ్వర్యవంతుణ్ణి అనే భావన కలిగినంత మాత్రాన మీరు అయిపోరు. అలాగే బాహ్యప్రపంచం నిజం అనిపించినంత మాత్రాన అది నిజంకాదు.

స్వప్నంలో కూడా స్వప్నప్రపంచం మీకు బాహ్యంగా కనిపిస్తుంది, నిజం అనిపిస్తుంది. పులిని చూసి భయపడతారు. కాని నిద్రనుంచి లేస్తే, స్వప్నప్రపంచం నిజంగా లేదు. మీ చిత్తంనుంచి వచ్చిన బాహ్యప్రపంచం అని అర్థం చేసుకుంటారు. మిమ్మల్ని భయపెట్టిన పులీ నిజం కాదని తెలుసుకుంటారు. అదే విధంగా బాహ్యప్రపంచం నిజంగా నిజం అనిపించినా అది నిజంకాదు. చిత్తదృశ్యం న జాయతే.

ఇక్కడిదాకా యోగాచారమతంతో చేతులు కలిపి గౌడపాదాచార్యులవారు హీనయాన మతఖండన చేశారు.

ఇప్పుడు యోగాచార మతాన్ని కూడా ఖండించబోతున్నారు. మొదటిపాదంలోకి వద్దాము. **చిత్తం న జాయతే** – ఈ వాక్యంతో గౌడపాదాచార్యులవారు, యోగాచార మతాన్ని ఖండిస్తున్నారు. ఆ ఖండన వివరాలలోకి వెళ్ళేముందు యోగాచార మతానికీ, అద్వైతానికీ మధ్యనున్న పోలికలేమిటో, భేదాలేమిటో మళ్ళీ ఒకసారి గుర్తు తెచ్చుకుందాము.

**పోలికలు**

ఎ) జగత్ మిథ్య, చూసే నాకు అది భిన్నంగా లేదు

బి) నేను చైతన్యం

సి) నేను సత్యం

**భేదాలు**

| | | |
|---|---|---|
| అద్వైతం | – | చైతన్యం ఏకం, నిత్యం |
| యోగాచార మతం | – | చైతన్యం క్షణక్షణమూ మారే తాత్కాలిక ప్రవాహం |
| | – | క్షణికవిజ్ఞాన ప్రవాహః |

ఈ భేదాన్ని కొంచెం వివరంగా చూద్దాము. 'నేను క్షణిక విజ్ఞాన ప్రవాహాన్ని ఎలా అవుతాను?' అంటాము మనము. మనం ఇవాళ ఉన్నాము, వారం కిందట కూడా ఉన్నాము. అప్పుడూ మాండూక్యం నేర్చుకున్నాము, ఇప్పుడూ మాండూక్యం నేర్చుకుంటున్నాము అంటాము.

యోగాచారమతం వారు మీరు క్షణికవిజ్ఞానం మాత్రమే కాదు, మీరు క్షణికవిజ్ఞాన ప్రవాహం అంటారు. వారు చైతన్యాన్ని విజ్ఞానం అంటారు. మొదటి క్షణం చైతన్యం వస్తుంది, క్షణం ఉంటుంది, పోతుంది. దాని తర్వాత రెండవ క్షణం రెండవ విజ్ఞానం వస్తుంది. అలా ఒక ప్రవాహంలా క్షణక్షణమూ వస్తుంది. అలా ఆత్మ క్షణక్షణమూ ప్రవహించే ప్రవాహం కాబట్టి, అది నిత్యంగా ఉన్నట్టు ఉంటుంది. నిజానికి నిత్య ఆత్మ అంటూ లేదు. క్షణిక విజ్ఞానంయొక్క నిత్యప్రవాహం ఆత్మ అంటారు వారు. ఆత్మ నిత్యం అనుకోవటం భ్రమ, పొరపాటు మాత్రమే. ఆత్మ నిత్యం అనుకోవటం భ్రమ అని నిరూపించటానికి వారు రెండు ఉదాహరణలు కూడా ఇస్తారు. అవి జీవనది, అఖండజ్యోతి.

**జీవనది** – గంగానదిని జీవనది అంటాము. కాని యోగాచారమతం వాదన వేరేగా ఉంది. నది నిరంతరంగా ప్రవహిస్తుంది. మీరు పోయిన సంవత్సరంలో స్నానం చేసిన గంగానదిలోనే ఈ సంవత్సరం కూడా స్నానం చేశాను అనుకుంటారు కాని అది భ్రమ. అది నిరంతరం ప్రవహించే నది.

ఆ మాటకొస్తే పోయిన సంవత్సరం దాకా ఎందుకు? క్షణక్షణమూ నది ప్రవహిస్తూ ఉంటుంది కాబట్టి, మీరు నదిలో మునిగినప్పుడు ఉన్న నీరు మీరు స్నానం ముగించేసరికి ఉండదు. అది ముందుకు సాగిపోతుంది; అందువల్ల గంగానదిని జీవనది అనకూడదు, నిరంతర ప్రవాహం అనాలి అంటారు వారు. అదే విధంగా శాశ్వత ఆత్మ అంటూ లేదు, అది ఒక వచ్చిపోయే ప్రవాహం; జలప్రవాహంలాగా ఆత్మ క్షణికవిజ్ఞాన ప్రవాహం అంటారు వారు.

**అఖండజ్యోతి** – కొన్ని ఆలయాల్లో అఖండజ్యోతి వెలుగుతుంది అంటారు. అంటే ఒకటే జ్యోతి వెలుగుతున్నది అనుకుంటాము కాని లోతుగా విశ్లేషిస్తే, ఒకటే అగ్ని నిరంతరంగా ఉండదు. ఒకవేళ ఒకటే అగ్ని నిత్యం మండుతున్నట్టయితే, అందులో ఉన్న నూనె తరగిపోకూడదు. మొదటి అగ్నిరవ్వ మొదటి నూనెచుక్కని తీసుకుని వస్తుంది, మాయమవుతుంది. దాని తర్వాత ఇంకొక నూనెచుక్కనుంచి ఇంకొక అగ్నికణిక వస్తుంది. అలా అగ్నికణికలు మారుతూ ఉంటాయి. అవి ఒకే అగ్ని కాదు, చూడటానికి ఒకే అగ్నిలాగా ఉంటాయి.

ఒకే అగ్నికీ, ఒక్కలాగా అగ్ని ఉంది అనే పదానికీ మధ్య భేదం ఏమిటి? రెండవ అగ్నికణిక మొదటి అగ్నికణికలా చూడటానికి ఉంది కాని అది వేరు. అలాగే మూడవది,

రెండవదానికి భిన్నంగా ఉంటుంది. ఈ నిరంతరప్రవాహం సత్యాగ్నిలాగా భ్రమింపజేస్తోంది అంతే అంటారు యోగాచార మతం వారు.

అదే విధంగా చైతన్యం క్షణికం, ప్రతి ఒక్కక్షణం చైతన్యం పుడుతూ ఉంటుంది, మరణిస్తూ ఉంటుంది; మరుక్షణం ఇంకొక చైతన్యం పుడుతుంది, పోతుంది. చైతన్యాన్ని వారు విజ్ఞానం అంటారు. అందువల్ల వారిది క్షణిక విజ్ఞానవాదం అని చూశాము.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – వీరి వాదనను గౌడపాదాచార్యులవారు మూడు పదాలతో ఖండిస్తారు. అవి –

**చిత్తం న జాయతే** – చిత్త అంటే చైతన్యం అని చూస్తున్నాము. నిజానికి చిత్తం అంటే నాలుగు అంతఃకరణాలలో ఒకటి కాని, ఇక్కడ చిత్తం అంటే చైతన్యం. వీరి భాషలో విజ్ఞానం – చైతన్యం అసలు పుట్టనే లేదు అంటారు. అంటే చైతన్యం శాశ్వతం. క్షణక్షణమూ మారే చైతన్యం గురించి చెప్పలేరు. అనిత్య చైతన్యం అనేది లేనేలేదు అంటారు గౌడపాదాచార్యులవారు.

అలా ఎందుకు అంటున్నారో గౌడపాదాచార్యులవారు కారణం చెప్పరు కాని, శంకరాచార్యులవారు ఇటువంటి పరిస్థితుల్లో మనను ఆదుకుంటారు. శంకరాచార్యులవారు మాండూక్యభాష్యంలో, బ్రహ్మసూత్ర భాష్యంలో, ఇలా సందర్భం వచ్చినప్పుడల్లా ఈ క్షణిక విజ్ఞాన వాదనను ఖండిస్తూ వస్తారు. వాటిల్లోంచి ఒక వాదనను ఇక్కడ చూద్దాము.

ఇక్కడ శంకరాచార్యులవారు, యోగాచార మతస్థులను ఇలా అడుగుతున్నారు, 'ఓ యోగాచారా! మీరు క్షణికవిజ్ఞాన వాదన చేస్తున్నారు కదా! ఆ క్షణిక విజ్ఞానమే ఆత్మ అంటున్నారు కదా! ఈ ప్రవాహం గురించి ఎవరు మాట్లాడుతున్నారో చెప్పండి.'

వీరి వాదనలోని లొసుగు ఏమిటి? వారేమంటారు? చైతన్యం ఒకటి వచ్చి, పోతుంది. చైతన్యం రెండు వచ్చి, పోతుంది. చైతన్యం మూడు వచ్చి, పోతుంది. ఇప్పుడు ఈ వచ్చిపోయే చైతన్యం గురించి చెప్పేదెవరు? ఒకటి చెబుతుందా అంటే, రెండవది వచ్చేసరికి మొదటిది వెళ్ళిపోతుంది. పోనీ రెండవది చెబుతుందా అంటే, మొదటిది వచ్చివెళ్ళినట్టే రెండవ చైతన్యానికి తెలియదు. అందువల్ల ఒకదాని గురించి ఇంకొకటి చెప్పలేదు.

ఇది ఇంకా బాగా అర్థం కావటానికి, రైలు రాకపోకలు తీసుకుందాము. ఒక ఊరిలో ఒకే ప్లాట్‌ఫారమ్‌మీద మూడు రైళ్ళు ఒకదాని తర్వాత ఒకటి వచ్చి వెళ్ళాయి అనుకుందాము. మొదటి రైలు రెండవ రైలు గురించి మాట్లాడలేదు. ఎందుకంటే అది వచ్చేలోపు ఇది వెళ్ళిపోతుంది. రెండవ రైలు కూడా మొదటి రైలు గురించి చెప్పలేదు. ఎందుకంటే, అది వెళ్ళాకనే ఇది వస్తుంది. మూడవ రైలు గురించీ చెప్పలేదు. ఎందుకంటే, అది వచ్చేలోపు రెండవ రైలు వెళ్ళిపోతుంది.

మూడు రైళ్ళు వచ్చిపోతున్నాయి అని చెప్పాలంటే, ఏ రైలులోనూ లేకుండా, ప్లాట్‌ఫార్మ్ మీద నిలబడ్డ వ్యక్తి మాత్రమే చెప్పగలడు. అంటే ఆ వ్యక్తికి రాకపోకలు ఉండకూడదు. అతను కదలకుండా, నిశ్చలంగా ఉంటేనే, కదిలే రైళ్ళ గురించి చెప్పగలడు.

దీనికి సూత్రం – ఒకదాని రాకపోకల గురించి మాట్లాడాలంటే, చూసే వ్యక్తికి రాకపోకలు ఉండకూడదు. యోగాచారులు చెప్పే క్షణికవిజ్ఞానం క్షణికవృత్తి మాత్రమే. చైతన్యం నిత్యచైతన్యం. అందువల్ల అతని వాదన చెల్లదంటాము.

అయితే వారు చైతన్యాన్ని క్షణికవిజ్ఞానం అని ఎందుకు అంటున్నారు? యోగాచారులు కదిలే ఆలోచనా ప్రవాహాన్ని చైతన్యంగా పొరపాటు పడుతున్నారు. ఆలోచనలు క్షణికం. అవి ఒక్కక్షణంలో వస్తాయి, పోతాయి. అందువల్ల వారు క్షణికవిజ్ఞానం అనేది క్షణికవృత్తి గురించి మాత్రమే.

గౌడపాదాచార్యులవారు, క్షణికవృత్తులు వస్తాయి, పోతాయి కాని నిత్యచైతన్యం ఆ వచ్చిపోయే ఆలోచనలను సాక్షిగా చూస్తుంది. సాక్షిచైతన్యానికి రాకపోకలు లేవు అంటారు. సత్యం ఏమిటి? క్షణిక విజ్ఞానం కాదు, నిత్యవిజ్ఞానం లేదా చైతన్యం.

యోగాచార మతానికీ, అద్వైతానికీ మధ్య ఉన్న భేదం ఇది. వారు విజ్ఞానం (చైతన్యం) అనిత్యం, అది అంతిమసత్యం అంటారు; అద్వైతం విజ్ఞానం నిత్యం, అది అంతిమసత్యం అంటుంది.

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** – తైత్తిరీయమ్

అనంతం పదాన్ని సత్యానికీ, జ్ఞానానికీ కూడా కలుపుతాము. అనంతం జ్ఞానం అంటే కాలాతీతం; చావు, పుట్టుకలు లేవు.

చిత్ న జాయతే అంటే చైతన్యం నిత్యం; దానికి చావు, పుట్టుకలు లేవు.

**చైతన్యం న జాయతే నిత్యచైతన్యమ్ ఏవ సత్యమ్**

**యే** – యోగాచార మతస్థుడు,

**తస్య జాతిం పశ్యంతి** – నిత్యచైతన్యానికి చావు, పుట్టుకలు ఉన్నాయని పొరపాటు పడుతున్నారు. తస్య అంటే నిత్య చైతన్యానికి; జాతిమ్ – పుట్టుక ఉందని పొరపాటు పడుతున్నారు. పుట్టుక ఉన్నదానికి మరణం కూడా ఉంటుంది. పుట్టుక, చావు అనేది మనసులో వచ్చే ఆలోచనలకు. ఒక ప్రసంగం వింటుంటే, ఆ వక్త చెప్పే మాటలు మీలో ఆలోచనలను పుట్టిస్తాయి. ఆలోచనలు వచ్చి, పోతాయి. వచ్చిపోయే ఆలోచనలను సాక్షిగా చూసే మీరు నిత్యం.

ప్రసంగం వింటున్నంతసేపూ ఆలోచనలు వస్తాయి; ప్రసంగం అయిపోయాక, ఆలోచనల ప్రవాహం ఆగిపోతుంది. ఆలోచనలు ఆగిపోయాయి అనికూడా మీకు తెలుస్తున్నది.

ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును నిత్యచైతన్యం సాక్షిగా చూస్తుంది. కాని దురదృష్టవశాత్తూ, ఈ చైతన్యమే వచ్చిపోతున్నది అంటున్నారు వారు. వారిని విమర్శిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**ఖే వై పశ్యంతి తే పదమ్** – ఇదెలా ఉందంటే, ఆకాశంలో ఎగిరే పక్షుల కాలి గుర్తులను చూస్తునట్టు ఉంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అంటే నిజంగా లేనిదాన్ని చూస్తున్నారు. ఖే అంటే ఆకాశంలో, పదమ్ అంటే కాలిగుర్తులను; పశ్యంతి చూస్తున్నారు. అంటే లేనిదాన్ని చూస్తున్నారు. అలాగే పుట్టుకే లేని చైతన్యానికి పుట్టుక ఉంది అంటున్నారు. దీనితో యోగాచారమత ఖండన కూడా అయిపోయింది.

ఒక్కముక్కలో చెప్పాలంటే యోగాచారులు చెప్పే క్షణిక విజ్ఞానం క్షణికవృత్తి మాత్రమే, చైతన్యం నిత్యచైతన్యం.

దీనితో బౌద్ధమతంలోని మూడు మతాల ఖండన అయిపోయింది. మాధ్యమిక మతం మిగిలింది. వారిది శూన్యవాదన. వారి వాదన ప్రకారం జగత్తు మిథ్య, చూసే నువ్వు కూడా మిథ్య. చూసే నువ్వు మిథ్య అయితే, నీ మతం కూడా మిథ్యే, దేన్ని ఖండించాలి ఇంక నేను అంటారు అద్వైత సిద్ధాంతి. అందువల్ల ఇక్కడ శూన్యవాద ఖండన లేదు.

ఇక్కడితో గౌడపాదాచార్యులవారు చేస్తున్న పరమత ఖండనలు అయిపోయాయి. ఇక్కడ ఆయన చేసిన ఖండనలు – సాంఖ్యదర్శనం, ద్వైతదర్శనం, హీనయానమతం (సౌత్రాంత్రికం, వైభాషికం), యోగాచార మతాల ఖండనలు. ఇన్ని మతాల వాదనలు చూస్తే మన మతం సిద్ధాంతం ఏమిటో మరిచిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల మన సిద్ధాంతాన్ని మళ్ళీ గుర్తు చేస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**కారిక 4.29**

**అజాతం జాయతే యస్మాదజాతిః ప్రకృతిస్తతః ।**
**ప్రకృతేరన్యథాభావో న కథంచిద్భవిష్యతి ॥**

### 3. వేదాంతసారం – కారికలు 29–46

ఇన్ని వాదనలు చూశాక, మన సిద్ధాంతాన్ని మనలో బాగా నాటుకునేలా చేయాల్సిన బాధ్యత తనమీద ఉంది అనుకుంటున్నారు గౌడపాదాచార్యులవారు. అందువల్ల మళ్ళీ వేదాంత సారాన్ని కారికలు 29–46ల్లో వివరించబోతున్నారు. వేదాంతసారం ఇది –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

**బ్రహ్మ సత్యమ్** – చైతన్యం లేదా బ్రహ్మ మాత్రమే సత్యం.

**జగన్మిథ్యా** – జగత్తును మిథ్యగా కొట్టివేస్తుంటే, జగత్తులో కలిగే అనుభవాన్ని కొట్టివేయటం లేదు. జగత్తుయొక్క సత్యత్వాన్ని కొట్టివేస్తున్నాము. స్వప్నంలో ఉన్నంతవరకూ ఎలాగైతే స్వప్నం సత్యంగా కనిపిస్తుందో, అలాగే జాగ్రదావస్థలో ఉన్నంతవరకూ జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. దాన్నుంచి పారమార్థికస్థాయికి ఎదిగితేనే, జాగ్రత్ ప్రపంచం మిథ్య అని అర్థమవుతుంది.

మనకు అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది సత్యం అవాలని లేదు అంటుంది వేదాంతం. దానికి స్వప్నప్రపంచమే గొప్ప ఉదాహరణ. స్వప్నంలో ఉన్నంతవరకూ సత్యంగా అనిపిస్తుంది, కాని దాన్నుంచి లేవగానే అది స్వప్నంగా తెలిపోతుంది.

బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అనగానే సరిపోదు. వీటిలో నేనేమిటి? జగత్తులోకి నా శరీరం, నా మనస్సు కూడా వస్తాయి. నేను అంటే సాక్షి చైతన్యాన్ని, నేను బ్రహ్మను. నేను బ్రహ్మగా ఈ జగత్తుకు అధిష్ఠానాన్ని.

29వ కారికలో గౌడపాదాచార్యులవారు రెండు ముఖ్యమైన విషయాలను స్పష్టం చేస్తున్నారు.

ఎ) ఒక వస్తువుయొక్క స్వాభావిక లక్షణం ఎన్నటికీ మారదు. అగ్నియొక్క స్వాభావిక లక్షణం ఉష్ణం. అది ఎక్కడన్నా, ఎప్పుడన్నా, ఎట్టి పరిస్థితిలోనైనా వేడిగానే ఉంటుంది. స్వాభావిక గుణం అంటేనే మార్పు లేనిది అని అర్థం.

బి) బ్రహ్మయొక్క స్వాభావిక గుణం నిర్వికారత్వం. బ్రహ్మ దేశకాలాతీతం. కాలం కోరల్లో చిక్కుకున్నదానికి మార్పులు ఉంటాయి కాని, కాలాతీత బ్రహ్మకు మార్పులేదు. అందువల్ల బ్రహ్మ మూడుకాలాల్లోనూ అజం.

అజం ఒక సాంకేతిక పదం. గౌడపాదాచార్యులవారికి ఈ పదం చాలా ఇష్టం. ఆయనది అందువల్లనే అజాతివాదము అయింది.

అజం = దేశకాల అతీతం, నిత్య నిర్వికారం

దీన్నుంచి ఒక ఉపసిద్ధాంతం చెప్పవచ్చు. బ్రహ్మ స్వాభావిక లక్షణం నిర్వికారత్వం అయితే అది ఎన్నటికీ, దేనికీ కారణం కాలేదు. ఎందుకంటే బ్రహ్మ కారణం అయితే, నిమిత్తకారణం అయినా, ఉపాదానకారణం అయినా, మార్పు చెందాలి. కాని బ్రహ్మ నిత్యనిర్వికారం కాబట్టి, బ్రహ్మ కారణం కాలేదు. బ్రహ్మ కార్యకారణ విలక్షణం.

**అన్యత్ర కృత అకృతాత్** – కఠ

దీని అర్థం బ్రహ్మ, కార్యకారణ విలక్షణం.

ఈ కారిక సారం బ్రహ్మ ఎన్నటికీ కారణం కాదు, అందువల్ల బ్రహ్మ ఎన్నటికీ జగత్తును సృష్టించలేదు, అందువల్ల ఈ జగత్తనే పదార్థం లేనేలేదు. మరయితే, ఈ కనబడే జగత్తు ఏమిటి? అది మూర్తీభవించిన అజ్ఞానం మాత్రమే. ఈ నేపథ్యంతో ఈ కారికను చూద్దాము.

**అజాతం జాయతే** – తక్కిన దార్శనికులు ఈ నిత్యనిర్వికారబ్రహ్మను జగత్ కారణం అంటారు. అజాతమ్ అంటే అకారణం బ్రహ్మ, జాయతే అంటే కారణం. కారణం కాని బ్రహ్మను వారు కారణం అంటున్నారు. కాని కారణం అవాలంటే, బ్రహ్మ మార్పు చెందాలి. కాని సత్యం ఏమిటంటే,

**అజాతిః ప్రకృతిః** – కాని బ్రహ్మ స్వాభావిక లక్షణం మార్పు లేకపోవటం. ప్రకృతి అంటే స్వాభావిక గుణం. బ్రహ్మ స్వాభావిక లక్షణం నిర్వికారం అని చూశాము. నిర్వికారం బ్రహ్మ మార్పు చెందలేదు కాబట్టి కారణం కాలేదు. కారణం కాకపోతే, నిజం సృష్టి చేయలేదు. అందువల్ల బ్రహ్మ కార్యకారణ విలక్షణం.

**ప్రకృతేరన్యథాభావః** – బ్రహ్మయొక్క ఈ మార్పులేని స్వభావం ఎప్పటికీ అలాగే ఉంటుంది. ప్రకృతి అంటే స్వాభావిక లక్షణం అని చూశాము. ఆ లక్షణం మారదు అంటే అది కార్యమూ కాలేదు, కారణమూ కాలేదు.

**న కథంచిద్భవిష్యతి** – అందువల్ల బ్రహ్మనుంచి జగత్తు అంతకు ముందు పుట్టలేదు, ఇప్పుడు పుట్టలేదు, ఇకముందు కూడా పుట్టదు. మరయితే ఈ కనబడే జగత్తు ఏమిటి? మూర్తీభవించిన అయోమయం మాత్రమే.

### కారిక 4.30

**అనాదేరంతవత్త్వం చ సంసారస్య న సేత్స్యతి ।**
**అనంతతా చాదిమతో మోక్షస్య న భవిష్యతి ॥**

ఇది చాలా ముఖ్యమైన కారిక. దీనిమీద నిదిధ్యాసనం చేస్తే మంచిది. ఇందులో వేదాంతసారం వస్తుంది. దీని సారం మోక్షం భవిష్యత్తులో వచ్చే సాధ్యవస్తువు కాదు.

మిమ్మల్ని మీరు సంసారిగా పొరపాటుపడి, దాన్నుంచి మోక్షం పొందాలని ప్రయత్నిస్తే, మోక్షం ఎన్నటికీ రాదు. ఒకవేళ మోక్షం భవిష్యత్తులో వచ్చినా, అది మోక్షం కాదు. పరస్పర విరుద్ధంగా లేదా అంటే లేదు. ఎందుకంటే ఒక సమయంలో వచ్చిన మోక్షాన్ని, మోక్షం అనరు. ఒక సమయంలో వస్తుంది అంటే, దానికొక ఆరంభం ఉందని అర్థం. ఆరంభం ఉన్న ప్రతిదానికీ అంతం కూడా ఉంటుంది.

నాకు సంసారం లేదు, నేను సంసారంలో బందీగా ఉన్నాను అని పొరపాటు పడుతున్నాను అని అర్థం చేసుకోవటమే మోక్షం. ఈ పొరపాటును వదులుకోవటమే మోక్షం 'పొందటం'. ఇది బుద్ధిలో కలిగే మార్పు. ఈ విషయాన్ని వేదాంతం పదేపదే చెబుతుంది.

ఇది నిరూపించటానికి గౌడపాదాచార్యులవారు ఒక ఊహాజనితమైన వాదన చేస్తున్నారు. తక్కిన దార్శనికుల వాదనను ఒప్పుకుంటున్నట్టు ఒప్పుకుంటూనే దానిలోని లొసుగును ఎత్తి చూపుతున్నారు. దీన్ని అభ్యుపేద్య వాదన అంటారు.

తక్కిన దార్శనికులు జగత్తు సృష్టి నిజంగా జరిగిందంటారు. జగత్తు ఉందంటే, ద్వైతవాదాన్ని స్వీకరించాలి. కారికలు 14-23ల్లో ద్వైతవాద ఖండనను చూశాము. వారు కర్మ సిద్ధాంతంవల్ల జగత్తు వచ్చిందంటారు. దానికి మూలకారణం ఏమిటో చూపించమంటారు గౌడపాదాచార్యులవారు. కర్మ మూలకారణం అంటే, శరీరం ఉంటేనే కర్మ చేయగలరు, శరీరం మూలకారణం అందామా అంటే కర్మవల్లనే ఈ శరీరం వస్తుంది. అలా ఏది మూలకారణమో తేల్చి చెప్పలేరని అక్కడ ఆరు కారణాలు చూశాము.

అక్కడ ఆరవ వాదన చూసినప్పుడు గౌడపాదాచార్యులవారు నిజానికి ఈ అంశాన్ని అక్కడ చర్చించలేదనీ, వేరే ఎక్కడో చర్చించినది అక్కడికి తెచ్చుకున్నామనీ చూశాము. ఆ వేరే సందర్భం ఈ సందర్భమే. ఇక్కడి వాదన అప్పుడు, అక్కడికి తీసుకెళ్ళాము. ఇప్పుడు అక్కడినుంచి మనకు కావాల్సినంత మేరకు ఆ వాదనను అరువు తెచ్చుకుందాము.

వాదన 5 - కారణ-కార్యప్రవాహం / కర్మ-శరీరప్రవాహం

కర్మ 1 → శరీరం 1 → కర్మ 2 → శరీరం 2 → కర్మ 3

ఖండన - కర్మ, శరీరాల్లో ఏది ముందు?

శరీరం లేనిదే కర్మ చేయలేరు. కర్మ లేనిదే శరీరం రాదు.

ఆరవ వాదన గౌడపాదాచార్యులవారు అక్కడ చేయలేదు కాని ఆ వాదనను మనం ముందే చూశాము. అది ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

వాదన 6 - కారణ-కార్య-ప్రవాహం అనాది / కర్మ-శరీరం-ప్రవాహం అనాది

ఖండన - కర్మ అనాది కాలేదు, శరీరం అనాది కాలేదు, ప్రవాహం అనే వస్తువు లేదు.

అనాదికి అంతం ఉంటే అది అనిత్యం అవుతుంది, అంతం లేకపోతే అనిర్మోక్ష ప్రసంగం అవుతుంది.

అందువల్ల సంసారాన్ని స్వీకరిస్తే, ఎలా చూసినా సమస్యే అవుతుంది. మోక్షం అనిత్యమోక్షమన్నా అవుతుంది లేదా అనిర్మోక్షప్రసంగం అన్నా అవుతుంది. అందువల్ల మోక్షం అంటే సంసారంనుంచి ముక్తి పొందటం కాదు; మోక్షం అంటే నేను సంసారిని అనే భావననుంచి ముక్తి పొందటం. ఈ నేపథ్యంతో ఈ శ్లోకం చూద్దాము.

**అనాదేః సంసారస్య అంతవత్త్వం న సేత్స్యతి** – ఒకవేళ సంసారం అనాది అంటే, అది అంతం అవలేదు. అనాదేః ని సంసారస్యతో కలుపుకోవాలి. అనాది (ఆది లేని) సంసారానికి అంతం ఉండదు. ఇది మొదటి వాదన.

కాని వాదనకోసం ఈ ఆదిలేని సంసారానికి అంతం ఉంది అనుకుందాము. నిజానికి అంతం లేదు కాని అభ్యుపేత్య వాదన ప్రకారం అంతం ఉంది అనుకుందాము. అప్పుడేమిటి సమస్య? మోక్షానికి ఒక ఆరంభతేదీ ఉంటుంది. సంసారం ముగిసినరోజు మోక్షం ఆరంభమవుతుంది. తయారయిన తేదీ ఉన్న ప్రతిదానికీ ఒక ముగింపు తేదీ ఉంటుంది.

**ఆదిమతః మోక్షస్య** – సాధన ద్వారా ఒక ఆరంభం వచ్చిన మోక్షానికి,

**అనంతతా న భవిష్యతి** – అనంతం అవటం సంభవం కాదు. అంటే ఒకరోజు వచ్చిన మోక్షం నిత్యం కాలేదు. అది అనిత్యమోక్షం అవుతుంది.

అందువల్ల మన సిద్ధాంతమే సత్యం. నేను నిత్యముక్తుడను. నేను అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా ముక్తుడనే. ఈ బోధను జీర్ణించుకోకుండా ఉన్నామంటే, దానికి ఒకటే మార్గం – అది జీర్ణించుకునే వరకూ ఈ మాండూక్యోపనిషత్తును అధ్యయనం చేస్తూ ఉండటమే. దీన్ని మించిన మార్గం వేరే లేదు.

### కారిక 4.31

**ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా ।**

**వితథైస్సదృశాస్సంతోఽవితథా ఇవ లక్షితాః ॥**

ఈ రాబోయే కారికల్లో, గౌడపాదాచార్యులవారు రెండు, మూడు అధ్యాయాల్లో చెప్పిన అంశాలను కొన్నింటిని మళ్ళీ చెబుతున్నారు. అందువల్ల వాటిల్లోని కారికలను అక్షరాలా అలాగే తీసుకురావటమో, చిన్న మార్పులతో తీసుకురావటమో చేస్తున్నారు. ఈ కారిక 2.6లో చూసినది. అక్షరాలా అలాగే వచ్చింది.

**ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా ।**

**వితథైస్సదృశాస్సంతోఽవితథా ఇవ లక్షితాః ॥** – 2.6

అక్షరాలా అలాగే ఉంది కాబట్టి దీని సారం మాత్రం చూద్దాము. దేనికైతే తాత్కాలిక ఉనికి ఉందో, దానికి నిజంగా ఉనికి లేదు అంటారు గౌడపాదాచార్యులవారు.

కుండ ఉదాహరణే తీసుకోండి. అది కుండగా రూపుదిద్దుకోకముందు లేదు, కుండ పగిలిపోయాకా లేదు. కుండ రూపంలో ఉన్నప్పుడు ఉన్నట్టుగా ఉంది. కుండ ఉనికి గురించి మాట్లాడతాము, దాని బరువు ఇంత అంటాము, దానిలో నీరు నింపుకున్నాము అంటాము. కాని లోతుగా విశ్లేషిస్తే కుండ అనే పదార్థమే లేదు, అది మట్టికి ఇచ్చిన నామం మాత్రమే.

అదే మట్టి పరంగా చూస్తే, మట్టి కుండ పుట్టక ముందూ ఉంది, కుండలోనూ ఉంది, కుండ పగిలిపోయాకా ఉంది. కుండ బరువు మట్టిదే, కుండను ముట్టుకుంటున్నా, ముట్టుకుంటున్నది మట్టినే. ఆ విధంగా జగత్తులో ఏ వస్తువును తీసుకున్నా కూడా, దాని ఉనికి నామమాత్రమే. అది నిజంగా పదార్థం కాదు. కుండ **ఉంది** అంటే ఆ **ఉంది** మాట మట్టికి చెందుతుంది, కుండకు కాదు. అలా ఎలా చెప్పగలరు? అయితే, కుండనుంచి మట్టిని విడదీయండి, మీకే తెలుస్తుంది అంటాము. కుండనుంచి మట్టిని విడదీయలేము.

ఇదే సూత్రం ప్రకారం, ఈ జగత్తు అంతా ఒక కార్యం. జగత్తు ఒకప్పుడు లేదు, తరువాత ఉండబోదు, మధ్యలో మాత్రం **ఉంది**. ఈ ఉంది పదం జగత్తుకు చెందదు. నిజానికి దాన్ని సృష్టించిన సృష్టికర్త అయిన బ్రహ్మకు చెందుతుంది. జగత్తులో ఏ వస్తువైనా తీసుకోండి – ఆకాశం **ఉంది** అనండి. ఆ ఉంది బ్రహ్మకు చెందుతుంది; వాయువు ఉంది అనండి. ఆ ఉంది బ్రహ్మకు చెందుతుంది. మరయితే, బ్రహ్మ ఏమిటి? ఏది ఉందో, ఆ ఉన్నదే బ్రహ్మ. పుట్టిన వస్తువులకు పుట్టగానే మన వాక్కు ఒక నామకరణం చేస్తుంది అంతే.

**ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేఽ పి తత్తథా** – ఏదైతే ఆదిలోనూ, అంతంలోనూ లేదో, అది వర్తమానంలో కూడా లేనట్టే అర్థం.

**వితథై స్సదృశాస్సంతః** – ఈ జగత్తు మిథ్య, దానికి నిజంగా ఉనికి లేదు కాని,

**అవితథా ఇవ లక్షితాః** – దానికి నిజంగా ఉనికి ఉందని పొరపాటు పడతారు అజ్ఞానులు. వితథై అంటే మిథ్య; అవితథ అంటే మిథ్య లేదు; అంటే మిథ్యాజగత్తును మిథ్య కాదు, నిజం అనుకుంటారు అజ్ఞానులు. జగత్తు మిథ్య, బ్రహ్మ సత్యం అని వారికి తెలియదు.

### కారిక 4.32

**సప్రయోజనతా తేషాం స్వప్నే విప్రతిపద్యతే ।**
**తస్మాదాద్యంతవత్త్వేన మిథ్యైవ ఖలు తే స్మృతాః ॥**

రెండవ అధ్యాయంలోని ఏడవ కారిక ఇక్కడ అక్షరాలా వచ్చింది.

**సప్రయోజనతా తేషాం స్వప్నే విప్రతిపద్యతే ।**
**తస్మాదాద్యంతవత్త్వేన మిథ్యైవ ఖలు తే స్మృతాః ॥** – 2.7

ఇంతకుముందు అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది సత్యం కానవసరం లేదు అన్నాము. ఇప్పుడేమో, ప్రయోజనం ఉన్నంత మాత్రాన అది సత్యం కానవసరం లేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

అద్వైతంలో జగత్తువల్ల ప్రయోజనం లేదు అని పూర్తిగా కొట్టివేయము. జగత్తును వాడతాము కూడా. ఆకలి వేస్తే బ్రహ్మను తినము, తినలేము కూడా. ఆకలి వేస్తే ఆహారమే తీసుకుంటాము. అందువల్ల ప్రయోజనం ఉంది, కాదనము; కాని ప్రయోజనం ఉన్నంత మాత్రాన అది సత్యం కావాలని లేదు అంటారు. ప్రయోజనం ఉంది కాని అది మిథ్య అంటాము. ఇదే కొరుకుడు పడదు తక్కిన దార్శనికులకు.

మన సిద్ధాంతాన్ని ఎలా నిరూపిస్తాము? స్వప్న దృష్టాంతం ద్వారా. స్వప్నంలో ఉన్నంతసేపూ స్వప్నంలో కూడా ప్రయోజనం ఉంది. స్వప్నంలో ఆకలి వేస్తే, స్వప్న ఆహారాన్ని తీసుకుంటాము. నిజానికి స్వప్న ఆహారం తీసుకుంటాము అంటే చాలదు, స్వప్న ఆహారం మాత్రమే తీసుకోగలము. కాని అంత ప్రయోజనకరం అయిన స్వప్నప్రపంచాన్ని, నిద్రనుంచి లేచాక, నిర్దాక్షిణ్యంగా కొట్టివేస్తాము. అది మిథ్య అంటాము. అక్కడ స్వప్నపదార్థాలు మనకు పనికివచ్చినా అవి సత్యం అని ఒప్పుకోలేము. అందువల్ల ప్రయోజనం ఉన్నంత మాత్రాన అది నిజం కానవసరం లేదు.

గౌడపాదాచార్యులవారు ఇంకొక విషయాన్ని కూడా నొక్కి చెబుతున్నారు. జగత్తుయొక్క ప్రయోజనకత్వం ఆపేక్షిక సత్యమే కాని పారమార్థిక సత్యం కాదు. ఎందుకు? జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ పురుషునికి మాత్రమే, జాగ్రదావస్థలో మాత్రమే ఉపయోగకరంగా ఉంటుంది. సాంకేతికంగా చెప్పాలంటే విశ్వకు మాత్రమే పనికివస్తుంది. ఎప్పుడైతే విశ్వ, తైజసగా మారతాడో అప్పుడే, ఇంత ఘనంగా కనిపిస్తున్న జాగ్రత్ ప్రపంచం మటుమాయం అవుతుంది.

ఒక చిన్నపిల్లవాడు తల్లి ఒడిలో పడుకుని నిద్రపోతాడు. ఆ నిద్రలో తను తల్లినుంచి విడిపోయి, ఎక్కడో అడవిలో ఒంటరిగా చిక్కుకుపోయినట్లు కలగంటాడు. తల్లి ఒడిలో ఉండి, తల్లినుంచి దూరమయిన ఆ బాలున్ని జాగ్రదవస్థలో ఉన్న తల్లి ఓదార్చలేదు. ఆ మాటకొస్తే ఆ తల్లికి తన తనయుడు అటువంటి కలగంటున్నట్లు కూడా తెలియదు. ఇప్పుడు చెప్పండి! తల్లివల్ల ప్రయోజనం ఉందా, లేదా? ఆవిడ ప్రయోజనం ఆపేక్షిక ప్రయోజనం మాత్రమే. పిల్లవాని స్వప్నంలో ఆమె ఏమీ సహాయపడలేదు.

అందువల్ల ప్రయోజకత్వం, సత్యానికి నిదర్శనం కాదు. ఎందుకంటే అది ఆత్యంతిక సత్యం కాదు! అందువల్ల దానిని కూడా కొట్టివేయటం అవుతుంది.

**సప్రయోజనతా తేషాం స్వప్నే విప్రతిపద్యతే** – జాగ్రత్ ప్రపంచంలోని ప్రయోజకత్వం స్వప్నంలో కొట్టివేయబడుతుంది. (దీన్ని వివరంగా 2.7లో చూశాము.)

**కారిక 4.33**

**సర్వే ధర్మా మృషా స్వప్నే కాయస్యాంతర్నిదర్శనాత్ ।**
**సంవృతేఽస్మిన్ప్రదేశే వై భూతానాం దర్శనం కుతః ॥**

ఈ కారికలో, రెండవ అధ్యాయంలోని మొదటి కారికలోని సారాంశం చూస్తాము. ఇక్కడ అక్షరాలా అలాగే రాదు కాని భావం ఒకటే.

**వైతథ్యం సర్వభావానాం స్వప్న ఆహుర్మనీషిణః ।**
**అంతఃస్థానాత్తు భావానాం సంవృతత్వేన హేతునా ॥** - 2.1

ఇంతకు ముందేమన్నాము? అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది సత్యం అయితీరాలన్న నియమమేమీ లేదు అన్నాము. దాన్నే చాలామంది జీర్ణించుకోలేరు. ఎందుకంటే ఏదైనా సత్యమని నిరూపించటానికి, నా కళ్ళారా చూశాను అంటాము. అంటే ప్రత్యక్షప్రమాణం సత్యం. కాని వేదాంతం సాహసం చూడండి, మీరు అనుభవించినంత మాత్రాన అది సత్యం అయితీరాలన్న నియమమేమీ లేదు అన్నది.

ఇప్పుడు వేదాంతం ఇంకొక అడుగు ముందుకు వేసి, ఇంకొంచెం ఆగ్రహానికి గురి అవుతున్నది. మీకు అనుభవంలోకి వచ్చిందా, అయితే అది సత్యం కాదు అని తేల్చిచెప్పేస్తున్నది. మిథ్య నిర్వచనం, వేదాంతం ప్రకారం ఇది. 'మీరు అనుభవించేదేదీ సత్యం కాదు.' వేదాంత సూత్రం - అనుభవంలోకి వచ్చినదేదీ సత్యం కాదు, అది మిథ్యే. చూడండి! ఎంత నమ్మలేని నిజమో! వేదాంతం అలా ఒక్కొక్క వాక్యాన్ని వదులుతూ మనని ఆకాశం అంచులకు తీసుకువెళుతుంది. మీకు అనుభవంలోకి వచ్చేది మిథ్య, ఎందుకంటే సత్యం అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు అంటుంది.

మరయితే సత్యం ఏమిటి? సత్యం అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాకపోతే, అసలు సత్యం అంటూ ఉందా? 'ఉంది. సత్యం ఉంది, కాని అది అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు,' అంటుంది వేదాంతం. సత్యం ఉండి, అనుభవంలోకి రాని సత్యం ఏమై ఉంటుంది? అది అన్నింటినీ అనుభవించే మీరే.

**దృగేవ న తు దృశ్యతే**

ఎన్నటికీ చూడబడే వస్తువు కాదు, చూసే నువ్వే అది; ఎన్నటికీ వినబడే శబ్దం కాదు, వినే నువ్వే అది; ఎన్నటికీ ఆలోచించే ఆలోచన కాదు, ఎప్పటికీ ఆలోచించే నువ్వే అది; ఎన్నటికీ ప్రమేయం కాదు, ఎప్పటికీ ప్రమాతవు అయిన నువ్వే అది.

సూత్రం - **అనుభవంలోకి వచ్చింది అంటే అది మిథ్య**

ఇది నిరూపించటానికి గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచం వృత్తాంతం ఇస్తారు. స్వప్నం అక్షరాలా నిజం అనిపిస్తుంది. పులి మిమ్మల్ని పరుగులు పెట్టిస్తుంది, కాని అది మిథ్య. ఇదే సూత్రాన్ని జాగ్రత్ ప్రపంచానికి కూడా అన్వయిస్తే, జాగ్రత్ ప్రపంచం కూడా అనుభవంలోకి వస్తున్నది కాబట్టి అది మిథ్య. ఇది వైతథ్యప్రకరణంలో చూశాము. అక్కడ దానికి ఒక అనుమానవాక్యం కూడా చూశాము.

**జాగ్రద్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

అదే భావనను ఈ కారికలో కూడా చూస్తాము.

**స్వప్నే సర్వే ధర్మా మృషాః** – స్వప్నంలో కనిపించిన అన్ని వస్తువులూ మిథ్య. ఏమిటి దానికి కారణం?

**కాయస్యాంతర్నిదర్శనాత్** – అన్నీ దేహంలోపల కనిపించటంవల్ల మిథ్య. అంత చిన్న తలలో అంత పెద్ద ఏనుగు ఎలా ఇమడగలదు?

**సంవృతేఽస్మిన్ ప్రదేశే వై** – ఇంత ఇరుకైన ప్రదేశంలో,

**భూతానాం దర్శనం కుతః** – భూతాలు అంటే వస్తువులు, మనుష్యులు. ఇంతమందిని ఎలా చూడగలదు?

33–36 కారికల్లో స్వప్నప్రపంచ మిథ్యాత్వాన్ని నిరూపిస్తున్నారు గౌడపాదాచార్యులవారు మళ్ళీ. దీని ద్వారా స్వప్నప్రపంచంలాగా జాగ్రద్‌ప్రపంచం కూడా మిథ్యే అని నిరూపిస్తారు. రెండింటికీ మధ్య ఉన్న పోలిక ఏమిటి? రెండూ అనుభవంలోకి వస్తున్నాయి.

## కారిక 4.34

**న యుక్తం దర్శనం గత్వా కాలస్యానియమాద్గతౌ ।**
**ప్రతిబుద్ధశ్చ వై సర్వస్తస్మిన్ దేశే న విద్యతే ॥**

ఈ కారికలో, రెండవ అధ్యాయంలోని రెండవ కారికలోని సారాంశం చూస్తాము. ఇక్కడ అక్షరాలా అలాగే రాదు కాని భావం ఒకటే.

**అదీర్ఘత్వాచ్చ కాలస్య గత్వా దేహాన్న పశ్యతి ।**
**ప్రతిబుద్ధశ్చ వై సర్వస్తస్మిన్ దేశే న విద్యతే ॥** – 2.2

ముందు కారికలో, స్వప్నంలో ఉచితదేశం లేదు అని వచ్చింది. ఇప్పుడు స్వప్నంలో ఉచితకాలం లేదు అని చూస్తాము.

**కాలస్య అనియమాత్ గతౌ దర్శనం న యుక్తమ్** – ఒక్క రాత్రిలో ప్రపంచయాత్ర చేయలేరు, కాని స్వప్నంలో ప్రపంచం అంతా చుట్టివస్తారు. ముందు కారికనూ, దీన్నీ కలిపితే అనుమానవాక్యం ఇలా వస్తుంది.

**ఎ) స్వప్న ప్రపంచః మిథ్యా ఉచితదేశకాల అభావాత్ దర్పణస్థ హస్తివత్**

ఉచిత దేశకాలం లేనందున స్వప్నప్రపంచం మిథ్య. ఇది యుక్తి ప్రమాణం. ఇప్పుడు రెండవ పాదంలో అనుభవ ప్రమాణం ఇస్తున్నారు. మీరు స్వప్నంలో కాశీలో రోడ్డుమీద నడుస్తుండగా ఎద్దు మిమ్మల్ని కుమ్మితే మీరు కిందపడతారు. ఉలిక్కిపడి లేచి చూస్తే, మీరు ఎక్కడ ఉంటారు? కాశీరోడ్డులో కాదు, మీ గదిలో, మీ మంచంమీద. అందువల్ల స్వప్నప్రపంచం మిథ్య.

**బి) స్వప్నంనుంచి లేస్తే స్వప్నం జరుగుతున్నచోట లేవరు – అనుభవప్రమాణం**

**ప్రతిబుద్ధశ్చ వై సర్వస్తస్మిన్ దేశే న విద్యతే** – నిద్ర లేచాక స్వాప్నికుడు, తను స్వప్నంలో చూసిన ప్రదేశంలో ఉండడు, తను పడుకున్న చోటే ఉంటాడు.

ఆ విధంగా ఇక్కడ మళ్ళీ గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచం మిథ్య అని యుక్తి ప్రమాణం, అనుభవ ప్రమాణాల ద్వారా నిరూపించారు. రెండవ అధ్యాయంలో శ్రుతి ప్రమాణం కూడా తీసుకున్నారు.

**సి) స్వప్నంలో చూసిన రథాలు, గుర్రాలు, మార్గాలు మనస్సు సృష్టించినవే – శ్రుతిప్రమాణం**

ఇంతవరకూ వైతథ్య ప్రకరణంలో చెప్పిన అంశాలను మళ్ళీ చెప్పారు. ఇప్పుడు స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపించటానికి రాబోయే కారికల్లో మరికొన్ని కారణాలను చూపిస్తున్నారు.

**కారిక 4.35**

**మిత్రాద్యైస్సహ సంమంత్ర్య సంబుద్ధో న ప్రపద్యతే ।**
**గృహీతం చాపి యత్కించిత్ప్రతిబుద్ధో న పశ్యతి ॥**

ఇక్కడ మరో రెండు కారణాలు చూపిస్తున్నారు స్వప్నప్రపంచం మిథ్యాత్వం నిరూపించటానికి.

మీరు ఒక సమస్య గురించి మథన పడుతున్నారు అనుకోండి. రాత్రి పడుకునేముందు, మర్నాడు వెళ్ళి మీ స్నేహితుణ్ణి సలహా అడగాలి అనుకుంటారు. కాని ఆ స్నేహితుని ఇంటికి వెళ్ళినట్టు, అతనితో మాట్లాడినట్టు, అతను మీకు సలహా ఇచ్చినట్టు మీకు స్వప్నం వస్తుంది. అది ఎంత నిజంగా అనిపిస్తుందంటే, మీరు నిజంగా వెళ్ళానేమో అనుకుంటారు. కాని అది నిజమో కాదో మీరు తేల్చుకోవచ్చు. ఎలా? ఆ స్నేహితునికి ఫోన్ చేసి, నేను నిజంగా మీ ఇంటికి వచ్చానా అని అడగవచ్చు.

ఎవరో పూజ్యస్వామీజీ దగ్గరకు వచ్చి అన్నాడుట, 'స్వామీజీ, రెండురోజుల క్రితం మీరు నా కలలోకి వచ్చి నన్ను మీ ఆశ్రమానికి రమ్మని ఆహ్వానించినట్టుగా కలవచ్చింది. అది

కలా లేక మీరు నిజంగా వచ్చి పిలిచారా?' దానికి పూజ్యస్వామీజీ నవ్వి, తను నిజంగా వెళ్ళి పిలవలేదు, అది కలేనని చెప్పి, కలే అయినా అతను నిజంగా వచ్చి ఉండవచ్చనీ చెప్పారు.

అలాగే ఎవరైనా ఏ వజ్రాలహారమో ఇచ్చినట్టు కల వచ్చినా, లేచిచూస్తే, నిజంగా వజ్రాలహారం ఉండదు. దానివల్ల కూడా అది నిజం కాదని తెలుస్తుంది; ఆ విధంగా ఇక్కడ రెండు కారణాల దృష్ట్యా స్వప్నప్రపంచం నిజంకాదని తెలుస్తుంది. అవి –

**డి) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో స్నేహితునితో మాట్లాడివుంటే, అది నిజం కాదని తెలుస్తుంది.**

**ఇ) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో కానుక పొందితే, ఆ కానుక మాయమవుతుంది.**

**మిత్రాద్యైస్సహ సంమంత్ర్య** – స్వప్నంలో చూసిన స్నేహితునితో సంప్రదింపులు చేసినా,

**సంబుద్ధో న ప్రపద్యతే** – నిద్ర లేచాక, అది సత్యం కాదని తెలుస్తుంది. ఒకవేళ నిజమనిపిస్తే, ఆ స్నేహితుణ్ణి అడిగితే, నిజం కాదని తెలుస్తుంది.

**గృహీతం చాపి యత్కించిత్** – స్వప్నంలో ఖరీదైన వస్తువు పొందినా,

**ప్రతిబద్ధో న పశ్యతి** – నిద్ర లేచాక, ఆ వస్తువు కనబడదు.

ఈ అనుభవాలు నిజంగా జరిగినట్టు ఉన్నా కూడా, అవి నిద్రనుంచి లేచాక మిథ్య అని తెలుస్తుంది.

## కారిక 4.36

**స్వప్నే చావస్తుకః కాయః పృథగన్యస్య దర్శనాత్ ।**
**యథా కాయస్తథా సర్వం చిత్తదృశ్యమవస్తుకమ్ ॥**

ఇందులో, స్వప్నప్రపంచ మిథ్యాత్వాన్ని నిరూపించటానికి గౌడపాదాచార్యులవారు ఇంకొక ఉదాహరణను ఇస్తున్నారు. స్వప్నప్రపంచంలో స్వప్నశరీరంతో వ్యవహారాలు నడుపుతాము. స్వప్నశరీరాన్ని వాసనామయ శరీరం అంటాము. ఎందుకంటే అది మనస్సులోని వాసనలనుంచి ఏర్పడింది. అలా అది మనస్సువల్ల ఏర్పడిన శరీరమే అయినా, స్వప్నంలో ఉన్నంత వరకూ, అది నిజంగానే అనిపిస్తుంది.

ఉదాహరణకు స్వప్నంలో ఏదో దెబ్బ తగిలి, రక్తం కారుతోందనుకోండి. ఖంగారుగా మీరు నిద్ర లేచిచూస్తే, మంచంమీద పడుకున్న శరీరానికి ఇంత కూడా రక్తపుచుక్క లేదు. దీన్నిబట్టి స్వప్నం మిథ్య అని అర్థం అవుతుంది.

**స్వప్నే** – స్వప్నంలో,

**కాయః అవస్తుకః** – కాయః అంటే స్వప్నశరీరం; అవస్తుకః అంటే మిథ్య. స్వప్నంలో ఉన్న స్వప్నశరీరం మిథ్య. ఎప్పుడు?

**పృథక్ అన్యస్య (కాయస్య) దర్శనాత్** – నిద్రనుంచి లేస్తే, మంచంమీద ఉన్న శరీరం వేరు, స్వప్నశరీరం వేరు అని తెలుస్తుంది.

**యథాకాయః** – ఎలాగైతే స్వప్నంలో అనుభవించిన స్వప్నశరీరం (ఇక్కడ స్వప్నశరీరంతో పాటు స్వప్నంలో అనుభవించినవన్నీ తీసుకోవాలి),

**అవస్తుకమ్** – మిథ్యే,

**తథా** – అదే విధంగా,

**చిత్తదృశ్యమ్ (అవస్తుకమ్)** – చైతన్యం చూసే ఏ వస్తువైనా కూడా మిథ్యే. ఇక్కడ చిత్తం అంటే అంతఃకరణంలో వచ్చే చిత్తం కాదు, చైతన్యం. దీనివల్ల జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్యే.

ఇక్కడ స్వప్నప్రపంచం నిజం కాదని చెప్పిన కారణం –

**ఎఫ్) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో ఉన్న శరీరం వేరు, మంచంమీద పడుకున్న శరీరం వేరు అని తెలుస్తుంది.**

ఇక్కడితో స్వప్నప్రపంచ మిథ్యాత్వదర్శనం అయిపోయింది. దానికి గౌడపాదాచార్యుల వారు ఆరు కారణాలు చూపించారు (అందులో మూడవది రెండవ అధ్యాయంలో చూశాము).

(ఈ అంశాలను **స్వప్నప్రపంచం మిథ్యాత్వం** పేరిట ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

బ్రహ్మ సత్యం జగన్మిథ్యా అని నిరూపించటానికి, మిథ్యా జగత్తును రెండుగా తీసుకోవాలి. అవి జాగ్రత్ ప్రపంచం, స్వప్నప్రపంచం. ముందు మిథ్య పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మిథ్య అంటే అసలు ఉనికి లేదని కాదు అర్థం. మిథ్య అంటే అది ఆత్యంతిక సత్యం కాదు, ఆపేక్షిక సత్యం మాత్రమే అని అర్థం.

ఆపేక్షిక సత్యం అంటే ఏమిటి? ముందు స్వప్నప్రపంచం పరంగా చూద్దాము. స్వప్నప్రపంచం స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ సత్యం. కాని అతను స్వప్నంనుంచి లేవగానే అది మిథ్యగా తేలిపోతుంది. అలాగే జాగ్రత్ పురుషునికి జాగ్రత్ ప్రపంచం జాగ్రదావస్థలో ఉన్నంతవరకూ సత్యం. కాని జాగ్రత్ పురుషుడు స్వప్నంలోకి జారుకుంటే అతనికి జాగ్రత్ ప్రపంచం మిథ్య అవుతుంది. స్వప్నప్రపంచంలో ఆకలి వేస్తే, స్వప్నప్రపంచంలో ఉన్న ఆహారమే తీసుకోవాలి. జాగ్రత్ ప్రపంచంలోది తీసుకోలేడు.

ఆమాటకొస్తే స్వాప్నికునికి అసలు జాగ్రత్ ప్రపంచం అనేది ఒకటుందనే తెలీదు. అతనితో ఎవరైనా గురువు, 'ఇది స్వప్నం, దీన్నుంచి లే, ఇంకొక జాగ్రత్ ప్రపంచం ఉంది,' అంటే అతను నమ్మడు. అందువల్ల స్వాప్నికునికి జాగ్రత్ ప్రపంచం లేదు; జాగ్రత్ పురుషునికి స్వప్నప్రపంచం మిథ్య. ఒక ప్రపంచం ఇంకొక అవస్థలో అనుభవంలోకి రాదు. అందువల్ల దాన్ని ఆపేక్షిక సత్యం అంటారు.

స్వప్నప్రపంచం మిథ్య అని తేలికగానే అర్థం చేసుకోగలము. ఎందుకంటే దాన్నుంచి లేవగానే అది మిథ్య అని తెలుస్తున్నది. కాని గౌడపాదాచార్యులవారు ఇంత కష్టపడి రెండవ అధ్యాయంలోనూ, ఇక్కడా స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపించటానికి ఇన్ని కారణాలు చూపించాల్సిన అవసరం ఏముంది అనిపించవచ్చు. కాని అది అవసరమే. ఎందుకంటే, కొంతమంది స్వప్నప్రపంచం కూడా జాగ్రత్ ప్రపంచంలాగా సత్యమే అంటారు. అది వాసనామయ ప్రపంచం అంటే ఒప్పుకోరు కూడా.

స్వప్నప్రపంచం కూడా భగవంతుడు సృష్టించినదే అంటారు వారు. అది ఎవరికి వారికి విడిగా భగవంతుడు సృష్టించాడు అంటారు. భగవంతుడు సృష్టించాడు కాబట్టి జాగ్రత్ ప్రపంచంలాగా స్వప్నప్రపంచం కూడా సత్యమే అంటారు వారు.

**స్వప్నప్రపంచః సత్యః ఈశ్వర సృష్టత్వాత్ జాగ్రత్ ప్రపంచవత్**

తమాషా ఏమిటంటే వారు నేర్చుకునేది మనం నేర్చుకునే ప్రస్థానత్రయమే కాని ఇదీ వారి సిద్ధాంతం. అందువల్ల ముందు స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపిస్తేనే కాని జాగ్రత్ ప్రపంచం మిథ్యాత్వం మనం నిరూపించలేము.

**ఎ) జాగ్రద్ ప్రపంచంవల్ల ప్రయోజనం ఉంది, అది నాకు భిన్నంగా ఉంది, నేను చూడకపోయినా ఉంది, స్పష్టత ఉంది. కాని అది సాపేక్షిక సత్యం మాత్రమే** అని రెండవ అధ్యాయంలో చూశాము. అవన్నీ ఆపేక్షిక సత్యాలే కాని ఆత్యంతిక సత్యం కాదు. అది ఆత్యంతిక సత్యం అనుకోవటంవల్ల సంసారంలో పడుతున్నారు. ఆత్యంతిక సత్యం కాదు అని అర్థం చేసుకుంటే, ప్రపంచంతో వ్యవహారం నడుపుతారు కాని, దానిమీద ఆధారపడరు. ఏదైతే శాశ్వతం కాదో అది శాంతి, భద్రత, ఆనందాలనివ్వలేదు. అటువంటి మిథ్యా ప్రపంచంమీద ఆధారపడలేరు. మరి దేనిమీద ఆధారపడాలి? సత్యవస్తువుమీద ఆధారపడాలి.

సత్యవస్తువు ఎక్కడ ఉందని దిక్కులు చూడకండి. అది మీరే. మారుతున్న జాగ్రత్, స్వప్నప్రపంచాలను మారకుండా చూసే చైతన్యస్వరూపమైన మీరే సత్యవస్తువు. అంటే అనుభవంలోకి వచ్చే ప్రతిదీ మిథ్య; అనుభవించే మీరే సత్యం.

ఇంతకుముందు తక్కిన దార్శనికులు ఏమన్నారన్నాం?

**స్వప్నప్రపంచః సత్యః ఈశ్వర సృష్టత్వాత్ జాగ్రత్ ప్రపంచవత్**

ఇప్పుడు అద్వైత సిద్ధాంతం ఏమిటి?

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

అనుభవంలోకి వచ్చినంత మాత్రాన, అది సత్యం కాదని అనేక కారణాల దృష్ట్యా స్వప్నప్రపంచ మిథ్యాత్వాన్ని ఇంతవరకూ నిరూపించుకు వచ్చారు గౌడపాదాచార్యులవారు.

ఇప్పుడు అదే సూత్రాన్ని జాగ్రత్ ప్రపంచానికి అన్వయిస్తూ అనుభవంలోకి వచ్చినంత మాత్రాన జాగ్రత్ ప్రపంచం సత్యం కాదని నిరూపించబోతున్నారు గౌడపాదాచార్యులవారు.

నిజానికి తురీయవర్ణన చూసినప్పుడు చూశాము. తురీయం ప్రత్యక్ష ప్రమాణానికి అందదని, అనుమాన ప్రమాణానికి అందదని, శబ్దప్రమాణానికి అందదనీ చూసినప్పుడు దాన్ని సర్వప్రమాణ అగోచరం అన్నాము. ప్రమాణాలకు అందేది ప్రమేయం మాత్రమే. అందువల్ల తురీయం ప్రమేయం కాదు, ప్రమేయాన్ని చూసే సాక్షిచైతన్యం.

తురీయం ప్రమాణానికి అందదు అంటే దాన్నుంచి ఒక ఉపసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవచ్చు. అనుభవంలోకి వచ్చేది ఏదీ ఆత్యంతిక సత్యం కాదు.

**యత్ దృశ్యం తత్ మిథ్య**

ఈ కారణంవల్లనే స్వప్నప్రపంచంలాగా జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అన్నాము. దానికి బీజం ఇక్కడ మళ్ళీ 36వ కారికలో వేశారు. ఎలాగైతే స్వప్నంనుంచి లేస్తే స్వప్న శరీరం (అనుభవం) వేరు, జాగ్రత్ శరీరం వేరు అని తెలుస్తుందో, అలా వ్యవహారసత్యంనుంచి పారమార్థిక సత్యానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం మిథ్య అని తెలుస్తుంది. జాగ్రత్ ప్రపంచాన్ని స్వప్నం-2 అంటారు. ఇక్కడ చూపించిన కారణం -

**బి) జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

**సి) జాగ్రద్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్నప్రపంచవత్ -**

అని అంతకు ముందు చూశాము.

## కారిక 4.37

**గ్రహణాజ్జాగరితవత్తద్ధేతుస్స్వప్న ఇష్యతే ।**
**తద్ధేతుత్వాత్తు తస్యైవ సజ్జాగరితమిష్యతే ॥**

ఇక్కడ గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం మిథ్య అని మరి కొన్ని కారణాలు చూపిస్తున్నారు.

జాగ్రత్ ప్రపంచంనుంచి స్వప్నప్రపంచం వస్తుంది అని తత్త్వబోధలో వస్తుంది. జాగ్రత్ ప్రపంచంలో చూసినవీ, విన్నవీ, అనుభవంలోకి వచ్చినవీ, చిత్తంలో నిక్షిప్తం అవుతాయి. వాటిని వాసనలు అంటాము. నిద్రలో ఈ వాసనలే వాసనామయ ప్రపంచాన్ని సృష్టిస్తాయి. అందుకనే మనం భారతదేశంలో ఉంటే, భారతదేశం గురించే కలలు కంటాము.

దీన్నిబట్టి జాగ్రత్ ప్రపంచాన్ని కారణం అనీ, స్వప్నప్రపంచాన్ని కార్యం అనీ అనవచ్చు. అందువల్ల పరోక్షంగా జాగ్రత్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య కారణ-కార్య సంబంధం

ఉంది అని చెప్పవచ్చు. పరోక్షంగా ఎందుకు? జాగ్రత్ ప్రపంచం వాసనలు ఉత్పత్తి చేస్తే, వాసనలు స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాయి.

వీటి మధ్య కారణ–కార్య సంబంధం ఉంది కాబట్టి, రెండింటిలోని అనుభవాలూ ఒకదాన్ని ఒకటి పోలివుంటాయి. తల్లిదండ్రులకీ, పిల్లలకూ మధ్య కారణ–కార్య సంబంధం ఉంటుంది కాబట్టే పిల్లలు తల్లిదండ్రుల పోలికలను పుణికిపుచ్చుకుంటారు. పోలికలే కాదు అలవాట్లు, అనారోగ్యాలను కూడా అందుకుంటారు.

జాగ్రత్ ప్రపంచంలో దేశం, కాలం, త్రిపుటి ఉన్నాయి. త్రిపుటి అంటే ప్రమాత, ప్రమేయం, ప్రమాణం. స్వప్నప్రపంచంలో కూడా ఈ మూడూ ఉంటాయి. దీన్నిబట్టి కూడా జాగ్రత్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య కారణ–కార్య సంబంధం ఉందని చెప్పవచ్చు. అలా పోలికలు ఉంటే ఒక తానులో ముక్కలు అంటారు.

దేశ, కాల, త్రిపుటి పరంగా వీటి మధ్య పోలికలు ఉంటే, ఇంకొక పోలికను కూడా చూడవచ్చు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. కాకపోతే ఇప్పుడు స్వప్నప్రపంచం నుంచి చెప్తూకువస్తున్నారు. ఇంతవరకూ జాగ్రత్ ప్రపంచంనుంచి పోలికని చూశాము. ఇప్పుడు స్వప్నప్రపంచంనుంచి చూస్తాము. ఇది గౌడపాదాచార్యులవారి సిద్ధాంతం.

స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపించబడింది. స్వప్నప్రపంచం మిథ్య అయితే, జాగ్రత్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య పోలికలు ఉంటే, జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్యే అవాలి. అంటే నాలుగవ పోలికగా మిథ్యాత్వం తీసుకోవాలి.

మిథ్యాత్వం అంటే ఏమిటో మర్చిపోకూడదు. మిథ్యాత్వం అంటే ఒక అవస్థలో సత్యంగా కనిపించిన ప్రపంచం ఇంకొక అవస్థలో తేలిపోతుంది. స్వాప్నికునికి స్వప్నప్రపంచం సత్యం కాని జాగ్రత్ పురుషునికి అది స్వప్నం. అలాగే జాగ్రత్ పురుషునికి జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. కాని స్వాప్నికునికి అది మహా మిథ్య. అతనికి అలా ఒక జాగ్రత్ ప్రపంచం ఉందనే తెలియదు. ఈ నేపథ్యంతో ఈ కారిక చూద్దాము.

**జాగరితవత్ గ్రహణాత్** – స్వప్నప్రపంచం జాగ్రత్ ప్రపంచంలాగా అనుభవంలోకి వస్తుంది. గ్రహణాత్ అంటే అనుభవంలోకి వస్తుంది. ఏది? స్వప్నప్రపంచం. ఏమిటా పోలికలు? దేశం, కాలం, త్రిపుటి. ఈ పోలికలవల్ల,

**తద్ధేతుః స్వప్నః ఇష్యతే** – స్వప్నప్రపంచాన్ని జాగ్రత్ ప్రపంచంయొక్క కార్యం అని అంటారు. హేతుః అంటే కార్యం; తత్ అంటే ఇక్కడ జాగ్రత్ ప్రపంచం. అందువల్ల జాగ్రత్ ప్రపంచాన్ని కారణం అనీ, స్వప్నప్రపంచాన్ని కార్యమనీ అంటారు.

ఈ పోలికని ఎంతవరకు తీసుకోవాలో అంతవరకే తీసుకోవాలి. అంతేకాని జాగ్రత్ ప్రపంచంలో కడుపుతో ఉన్న స్త్రీ స్వప్నప్రపంచంలో బిడ్డను కంటుంది అనకూడదు. ఎలా

కారణ-కార్యమో ఇంతకుముందే చూశాము. జాగ్రత్ ప్రపంచం వాసనలను పుట్టిస్తే, ఆ వాసనలు స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాయి. అందువల్ల ఈ కారణ-కార్య సంబంధం పరోక్ష సంబంధం.

**తద్ధేతుత్వాత్** - జాగరిత కార్యత్వాత్, జాగ్రత్ ప్రపంచంయొక్క కార్యం అవటంవల్ల,

**జాగరితం తస్యైవ స తు ఇష్యతే** - జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ పురుషునికి మాత్రమే సత్యం. స్వప్నప్రపంచం స్వాప్నికునికి మాత్రమే సత్యమైనట్టుగా, జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ పురుషునికి మాత్రమే సత్యం. విశ్వ పరంగా జాగ్రత్ ప్రపంచం సత్యం; తైజస దృష్ట్యా స్వప్నప్రపంచం సత్యం; ఇక్కడ జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వం చూపిన కారణం -

**డి) జాగ్రద్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య కారణ-కార్య సంబంధం ఉంది. స్వప్నప్రపంచం మిథ్య కాబట్టి జాగ్రద్ ప్రపంచం కూడా మిథ్య.**

**కారిక 4.38**

**ఉత్పాదస్యాప్రసిద్ధత్వాదజం సర్వముదాహృతమ్ ।**
**న చ భూతాదభూతస్య సంభవోఽస్తి కథంచన ॥**

ఇప్పుడు జాగ్రత్ ప్రపంచం దృష్ట్యా చూస్తాము. నిజంగా సృష్టి జరిగిందని నిరూపించలేము. నిజం సృష్టి జరగలేదు కాబట్టి బ్రహ్మను కారణం అనికూడా అనలేము. అందువల్ల బ్రహ్మ కార్యకారణ విలక్షణం.

నిజానికి మాండూక్య కారికల్లో తంబూరా శృతిలాగా ఒకటే అంశం పదేపదే వస్తుంది. అది -

**కార్యకారణ విలక్షణ బ్రహ్మ అహమస్మి**

ఎవరైనా మాండూక్యం సారాంశం ఏమిటంటే మీరు తడుముకోకుండా ఈ వాక్యం చెప్పవచ్చు. కార్యకారణ విలక్షణ బ్రహ్మ అని మాత్రం చెబితే మీ జ్ఞానం పరిపూర్ణం కాదు. కార్యకారణ విలక్షణ బ్రహ్మ అహమస్మి అని పూర్తిచేయాలి. ఆ కార్యకారణ విలక్షణ బ్రహ్మ గురించి చూస్తున్నాము ఈ కారికల్లో.

**ఉత్పాదస్య అప్రసిద్ధత్వాత్** - తార్కికంగా నిజం సృష్టి జరిగిందని ఎన్నడూ నిరూపించలేము. ఉత్పాదం అంటే నిజం సృష్టి; ప్రసిద్ధం అంటే తార్కికంగా నిరూపించలేము. ప్రసిద్ధం అంటే మామూలు అర్థం పేరు పొందినది అని. కాని ఇక్కడ తార్కికంగా నిరూపించటం అని అర్థం తీసుకోవాలి. తార్కికంగా సృష్టి గురించి నిరూపించలేము కాబట్టి, నిజం సృష్టి జరగలేదు.

మరయితే మనం చూస్తున్నదేమిటి?

**అజం సర్వమ్ ఉదాహృతమ్** – దేన్నయితే మీరు జగత్తుగా చూస్తున్నారో, అది నిజంగా జగత్తు కాదు. అది అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా బ్రహ్మే. మీ స్వప్నప్రపంచం మొత్తం మీ మనస్సు సృష్టించినదే. స్వప్నంలో మిమ్మల్ని వెంటాడిన పులి ఒక ఆలోచన మాత్రమే. ఆలోచన మీ మనస్సునుంచి వచ్చినదే. అదే విధంగా మీ జాగ్రదావస్థలోని ప్రతి ఒక్క వస్తువు కూడా బ్రహ్మే.

సర్వమ్ అంటే మొత్తం జగత్తు; అజమ్ అంటే బ్రహ్మ. అజం అంటే కారణం కాదు, జగత్తు సృష్టించటానికి పరిణామం చెందదు. అందువల్ల అంతా బ్రహ్మే.

**న చ భూతాదభూతస్య సంభవోఽస్తి కథంచన** – ఉనికి ఉన్న దాన్నుంచి, ఉనికి లేని దాన్నుంచి కూడా సృష్టి జరగలేదు. ఈ వాదనను ఇంతకముందు కూడా చూశాము. సత్ నుంచి, అసత్‌నుంచి కూడా సృష్టి జరగదు.

**కారిక 4.39**

**అసజ్జాగరితే దృష్ట్వా స్వప్నే పశ్యతి తన్మయః ।**
**అసత్స్వప్నేఽపి దృష్ట్వా చ ప్రతిబుద్ధో న పశ్యతి ॥**

ఇంతకు ముందేమన్నాం? జాగ్రత్ ప్రపంచం కారణం, స్వప్నప్రపంచం కార్యం అన్నాం. కార్య స్వప్నప్రపంచం మిథ్య కాబట్టి, కారణ జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అని నిరూపించాము. ఇప్పుడు, గౌడపాదాచార్యులవారు ఇటునుంచి చెప్పుకొస్తున్నారు. అంటే జాగ్రత్ ప్రపంచం మిథ్య, జాగ్రత్ ప్రపంచం మిథ్య కాబట్టి, దాన్నుంచి వచ్చిన స్వప్నప్రపంచం కూడా మిథ్యే అని నిరూపిస్తున్నారు. అంటే కారణం మిథ్య కాబట్టి, కార్యం కూడా మిథ్యే అంటున్నారు.

మిథ్యా జాగ్రత్ ప్రపంచాన్ని అనుభవించటంవల్ల, మిథ్యా వాసనలు మనస్సులో చోటు చేసుకుంటాయి. మిథ్యా వాసనలనుంచి మిథ్యా స్వప్నప్రపంచం వస్తుంది. రెండూ మిథ్యే.

**అసద్ జాగరితే దృష్ట్వా** – మీరు జాగ్రదావస్థలో మిథ్యా జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తారు. కాని వచ్చిన చిక్కేమిటంటే అది మిథ్య అని తెలియదు. అది సత్యమే అనుకుంటారు. ఆ మిథ్యా జాగ్రత్ ప్రపంచం వాసనలను నిక్షిప్తం చేస్తుంది. వాసనలు అంటే మీరు పొందిన అనుభవాలను మనస్సులో జ్ఞాపకాల రూపంలో దాచి ఉంచుతుంది. దీన్ని వి.సి.ఆర్.తో పోల్చవచ్చు. వి.సి.ఆర్.లో అనేక విషయాలను రికార్డ్ చేసినట్టుగా, మీ మనస్సనే వి.సి.ఆర్. మీరు పొందిన అనేక అనుభవాలను రికార్డు చేస్తుంది. వి.సి.ఆర్.లో రికార్డ్ చేసినవాటిని వి.సి.పి. ప్లే చేస్తుంది.

**ఇ) కారణ జాగ్రత్ ప్రపంచం మిథ్య కాబట్టి, దాన్నుంచి వచ్చిన కార్య స్వప్నప్రపంచం కూడా మిథ్య**

**తన్మయః (భవతి)** – అలా ఎన్నో వాసనలు మీ చిత్తంలో నిక్షిప్తమై ఉంటాయి. అది కూడా చాలా బలంగా నాటుకొని ఉంటాయి. ఉదాహరణకు ఒక దారుణమైన రోడ్డు ప్రమాదం చూసారనుకోండి. కాలేజీలో చదివే అమ్మాయి రక్తపు మడుగులో పడివుంది. ఆ హృదయవిదారకమైన దృశ్యం మిమ్మల్ని ఎంతగా కదిల్చి వేసిందంటే, ఆ రక్తపు మడుగులో ఉన్న అమ్మాయే మిమ్మల్ని పదేపదే వెన్నాడుతుంది. కొన్ని అనుభవాలు కలుగుతాయి కాని అవి మనస్సులో పెద్దగా చోటుచేసుకోవు. కాని కొన్ని ఇలా మనస్సును కలత చెందిస్తాయి. అటువంటి వాసనలను తన్మయత్వమ్ అంటారు. ఆ వాసనలతో

**స్వప్నే పశ్యతి** – కలలో అదే దృశ్యం చూస్తారు. లేదా అగ్నిప్రమాదంలో ఒళ్ళంతా కాలి బూడిదయిన కొన్ని శవాలను చూస్తారు. అవి పదేపదే కలలో వచ్చి, అర్ధరాత్రి హఠాత్తుగా లేచి కూర్చుంటారు. ఇటువంటి యథార్థ సంఘటనలే అవసరం లేదు; ఒక దారుణమైన మారణకాండ ఉన్న సినిమా చూసినా చాలు. ఒక్క కత్తివేటుతో తల ఎగిరి ఆమడదూరం వెళ్ళిపడటం, కింద నేలమీద తలను మాత్రం చూడటం జరిగిందనుకోండి, ఆ సన్నివేశం కూడా మీ మనస్సును చాలా బాధిస్తుంది. అందువల్లనే శాస్త్రం అటువంటి దారుణకాండలు ఉన్న వాటిని చూడవద్దంటుంది.

నాకేం భయం లేదు, నేను చూస్తాను అని మీరనుకోవచ్చు. నిజమే మీకు ధైర్యం ఉండి, మీరు చూశారు. కాని మీ స్వప్నం మీ చేతిలో లేదు. మీరు ఒక సినిమాలో మొహం వెనక్కి తిరిగి ఉండటం చూస్తే, అదే మీరు వద్దనుకున్నా కలలో వస్తుంది. అందువల్లనే మంచి విషయాలనే చూడాలి, మంచి విషయాలనే వినాలి అని వస్తుంది శాంతిపాఠంలో. ధైర్యం ఉందికదా అని అటువంటి సినిమాలు చూస్తే అవి మిమ్మల్ని స్వప్నం రూపంలో వెన్నాడుతాయి.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు చెప్పదలుచుకున్నది ఇది – జాగ్రత్ ప్రపంచం చూస్తున్నంతసేపూ జాగ్రత్ ప్రపంచం సత్యం అనిపిస్తుంది; స్వప్నప్రపంచాన్ని చూస్తున్నంతసేపూ స్వప్నప్రపంచం సత్యం అనిపిస్తుంది. కాని నిజానికి రెండూ మిథ్యే.

**ఎఫ్) జాగ్రత్ ప్రపంచం స్వాప్నికునికి మిథ్య; స్వప్నప్రపంచం జాగ్రత్ పురుషునికి మిథ్య. అందువల్ల రెండూ ఆపేక్షిక సత్యాలే.**

**అసత్ స్వప్నే అపి దృష్ట్వా చ** – మిథ్యా ప్రపంచాన్ని స్వప్నంలో చూసినా కూడా,

**ప్రతిబుద్ధో న పశ్యతి** – స్వప్నప్రపంచంనుంచి లేస్తే, అది మిథ్య అవుతుంది.

స్వప్నంలో ఉన్నంతసేపూ అది సత్యమే అనిపించినా, జాగ్రత్ ప్రపంచానికి లేస్తే అది మిథ్య అని తెలుస్తుంది. అలాగే జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతసేపూ అది సత్యం అనిపించినా, పారమార్థిక స్థాయికి లేస్తే జాగ్రత్ ప్రపంచం స్వప్నం–2 అనీ, అది కూడా మిథ్య అనీ తెలుస్తుంది.

కాని ఇప్పుడు జాగ్రత్ ప్రపంచం మిథ్య అని అంగీకరించలేకపోతున్నారు. ఎందుకు? మీరు జాగ్రత్ పురుషునిగా ఉండి, జగత్తును మిథ్యగా కొట్టివేయటానికి ప్రయత్నిస్తున్నారు. అలా ఎన్నడూ చేయకూడదు. అది అర్థంలేని పని. ఈ విషయం చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. విశ్వ దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. తురీయ దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నప్రపంచంలాగా మిథ్య.

కాని జాగ్రత్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య ఒక భేదం ఉంది. స్వప్నప్రపంచం నుంచి జాగ్రదావస్థకు లేస్తే స్వప్నప్రపంచం మాయమవుతుంది. అందువల్ల అది ఎంత సత్యంగా అనిపించినా, అది మిథ్య అని అర్థం చేసుకోవటం తేలిక. కాని జాగ్రత్ ప్రపంచం నుంచి తురీయానికి లేచినా, ఈ ప్రపంచం మిథ్య అని తెలిసినా, ఈ ప్రపంచం మీ కంటి ముందునుంచి మాయమవదు. ద్వైతం అలాగే ఉంటుంది. కాకపోతే, దాన్ని చూసే మీ దృక్పథం మారుతుంది. స్వప్నప్రపంచం స్వప్నం అని తెలిసి, దాన్ని చూస్తే ఎలా ఉంటుంది? అలా ఉంటుంది జాగ్రత్ ప్రపంచం మిథ్య అని తెలిసి, దాన్ని అనుభవించటం. జ్ఞాని ఈ జాగ్రత్ ప్రపంచాన్ని కూడా స్వప్నంలా చూస్తాడు. అతనికి ఈ ప్రపంచం స్వప్నం-2 అవుతుంది. ఎందుకంటే అనుభవంలోకి వచ్చినదేదీ నిజం కాదని అతనికి తెలుసు.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

బాహ్యప్రపంచ మిథ్యాత్వం గురించి ఇంతవరకూ కొన్ని కారణాలు చూశాము. (ఈ అంశాలను **బాహ్యపపంచం మిథ్యాత్వం** పేరిట ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

**కారిక 4.40**

**నాస్త్యసద్ధేతుకమసత్సదసద్ధేతుకం తథా ।**
**సచ్చ సద్ధేతుకం నాస్తి సద్ధేతుకమసత్కుతః ॥**

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు నిరూపించదలుచుకున్న విషయం - **అహం సత్యం, జగత్ మిథ్య**. ఈ జ్ఞానం పొందితే మిథ్యా జగత్తులో ఏం జరిగినా, సత్య అధిష్ఠానమైన నన్ను బాధించదు. దీన్నే జీవన్ముక్తి అంటారు.

గౌడపాదాచార్యులవారిది అజాతివాదము. జాగ్రత్, స్వప్నప్రపంచాలు రెండూ మిథ్య. ఇంకో విధంగా చెప్పాలంటే, జగత్తు ఆత్యంతిక సత్యం కాదు, ఆపేక్షిక సత్యం మాత్రమే. జగత్తు ఆపేక్షిక సత్యం అంటే నిజం జగత్తు బ్రహ్మనుంచి రాలేదని అర్థం.

**మిథ్యాజగత్తు పుట్టింది అన్నా, నిజం జగత్తు పుట్టలేదు అన్నా ఒకటే**

మిథ్యాజగత్తు పుట్టింది అంటే అది మిథ్యా సృష్టివాదము అవుతుంది. నిజం జగత్తు పుట్టలేదు అంటే అది అజాతివాదము అవుతుంది. పేరేదైనా అర్థం ఒకటే.

బ్రహ్మ నిజం జగత్తును పుట్టించలేదు కాబట్టి బ్రహ్మకూ-జగత్తుకూ మధ్య కారణ-కార్య సంబంధం గురించి మాట్లాడలేము. కాని గౌడపాదాచార్యులవారు తనదైన బాణీలో ఈ విషయాన్ని చెబుతున్నారు. నిజానికి ఈ వాదన అంతకు ముందు కూడా చూశాము. దాన్నే మళ్ళీ ఇక్కడ చెబుతున్నారు. అవి -

ఎ) అసత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు

బి) అసత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు

సి) సత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు

డి) సత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు

ఈ వాదనలను ఒక్కొక్కటిగా చూద్దాము.

ఎ) **అసత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు** - ఉనికిలేని వస్తువు, ఉనికిలేని వస్తువును పుట్టించలేదు. మనిషి కొమ్ము, కుందేటికొమ్మును పుట్టించలేదు. కుందేటికొమ్ముదాకా ఎందుకు, మనిషి కొమ్ము అసలు దేన్నీ పుట్టించలేదు. ఉనికిలేని వస్తువు ఇంకొక ఉనికిలేని వస్తువును ఎలా పుట్టిస్తుంది?

బి) **అసత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు** - ఉనికి లేని వస్తువు ఉనికి ఉన్న వస్తువును పుట్టించలేదు. అలా ఉనికి లేని వస్తువునుంచి కొత్త వస్తువులు వస్తాయంటే ఎంత బాగుంటుంది? ముడిసరుకులు లేకుండా ఇల్లు కట్టేయవచ్చు; కూరలు లేకుండా వంట చేసేయవచ్చు. అలా కుదరదు కాబట్టి, ఈ మార్గం కూడా సాధ్యం కాదు.

సి) **సత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు** - ఉనికి ఉన్న వస్తువు ఉనికి ఉన్న వస్తువును పుట్టించలేదు. ఈ వాదనను అంత తేలికగా ఒప్పుకోలేము. ఎందుకంటే ఉనికి ఉన్న మట్టినుంచి, ఉనికి ఉన్న కుండ పుడుతుంది కదా అనుకుంటాము. వాటి మధ్య కారణ-కార్య సంబంధాన్ని కూడా చూస్తాము.

కాని కుండ-మట్టిని లోతుగా విశ్లేషిస్తే నిజంగా వాటి మధ్య అటువంటి సంబంధం లేదని తెలుస్తుంది. బంగారం-ఆభరణాల దృష్ట్యా ఇప్పటికే రెండుసార్లు చూశాము. మళ్ళీ ఒకసారి కుండ-మట్టి పరంగా టూకీగా చూద్దాము.

కుండ-మట్టిల మధ్య కారణ-కార్య సంబంధం ఉండాలి అంటే అవి రెండు భిన్నవస్తువులై ఉండాలి. కాని లోతుగా ఆలోచిస్తే అవి రెండు భిన్నవస్తువులు కావు. ఒకటే పదార్థానికి ఇచ్చిన రెండు భిన్న పేర్లు. వాటిమధ్య కాలభేదం, రూపభేదం, అవస్థాభేదం ఉన్నాయి కాని, నిజానికి వస్తుభేదం లేదు. అందువల్ల గౌడపాదాచార్యులవారు సత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు అంటారు.

డి) **సత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు** – ఉనికి ఉన్న వస్తువు, ఉనికి లేని వస్తువును పుట్టించలేదు. అసత్ వస్తువు పుట్టిందని వ్యాకరణపరంగా నిరూపించలేము. పుట్టింది అనే క్రియా పదానికి ఏం పుట్టింది అనే ప్రశ్నవేస్తే జవాబు లేదు. అందువల్ల సత్ వస్తువు అసత్ వస్తువును పుట్టిస్తుంది అని కూడా చెప్పలేము.

ఈ వాదనల సారాంశం – అసలు ఏదీ పుట్టలేదు. సృష్టే నిజంగా జరగలేదు. మరయితే మన కళ్ళ ఎదురుగా కనిపిస్తున్న ఈ జగత్తు మాటేమిటి? అంతకుముందు, ఇప్పుడు, ఇకముందూ కూడా ఉన్నది బ్రహ్మ మాత్రమే. అజ్ఞానంవల్ల జగత్తు అనుకుంటున్నాము అంతే.

అజ్ఞానికి ఏదైతే పాముగా కనబడుతుందో, అదే జ్ఞానికి తాడుగా అర్థమవుతుంది. అదే విధంగా అజ్ఞానికి ఏదైతే జగత్తుగా కనబడుతుందో, అదే జ్ఞానికి బ్రహ్మగా అర్థమవుతుంది. అంటే ఇక్కడ రెండు దృష్టులు ఉన్నాయి – జ్ఞానదృష్టి, అజ్ఞానదృష్టి. అంతేకాని నిజంగా జగత్తు లేదు. మరయితే 'నేనేం చేయాలి?' అని మీరడిగితే, మీ దృష్టిని మార్చుకోవాలి. 'దృష్టిని ఎలా మార్చుకోవాలి?' మాండూక్యోపనిషత్తును చివరిదాకా నేర్చుకోవాలి. ఈ కారిక భాష కూడా కొంచెం క్లిష్టంగా ఉంటుంది. అందువల్ల సారం మాత్రమే చూద్దాము.

**న అసి అసద్ధేతుకమ్ అసత్** – ఇది మొదటి వాదనను చూపిస్తున్నది. అసత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు.

**తథా సత్ అసద్ధేతుకం చ** – ఇది రెండవ వాదనను చూపిస్తున్నది. అసత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు.

**సత్ చ సద్ధేతుకం న అస్తి** – ఇది మూడవ వాదనను చూపిస్తున్నది. సత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు. సైన్స్‌పరంగా కూడా పదార్థాన్ని కొత్తగా పుట్టించలేము, నాశనం చేయలేము.

**సద్ధేతుకం అసత్ కుతః** – ఇది నాలుగవ వాదనను చూపిస్తున్నది. సత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు. ఈ కారణాల దృష్ట్యా జగత్తు సృష్టించబడలేదు.

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**
**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

అజాతివాదము సత్యము. అలా ఎలా చెప్పగలరు అని గౌడపాదాచార్యులవారిని అడిగితే, 'ఇది నా స్వంతం కాదు, మాండూక్యోపనిషత్తు చేస్తున్న బోధే ఇది. కావాలంటే ప్రపంచోపశమమ్ పదం చూడండి,' అంటారు. ఎందుకంటే ఆయన కారికలకు మూలమే ఆ పదం.

**కారిక 4.41**

**విపర్యాసాద్యథా జాగ్రదచింత్యాన్ భూతవత్ స్పృశేత్।**
**తథా స్వప్నే విపర్యాసాద్ధర్మాంస్తత్రైవ పశ్యతి॥**

బ్రహ్మను జగత్తుగా పొరపాటు పడటం అందరూ చేసే పొరపాటే అంటారు గౌడపాదాచార్యులవారు. పైగా ఈ పొరపాటు స్వప్నావస్థలోనే కాదు, జాగ్రదావస్థలో కూడా చేస్తారు అంటారు. కాకపోతే మనకు, జాగ్రదావస్థలో పొరపాటు పడుతున్నామని తెలియదు. స్వప్నావస్థలోనే పొరపాటు పడుతున్నామని పొరపాటు పడతాము. కాని గౌడపాదాచార్యులవారు జాగ్రదావస్థలో కూడా పొరపాటు పడుతున్నాము అంటారు. ఇది పొరపాటు రెండు అంటారు.

తాడు-పాము దృష్టాంతాన్ని తీసుకుందాము. ముందు తాడుని చూసి పాముగా పొరపాటు పడతాము. కొంచెం దగ్గరికి వెళ్ళి, టార్చ్‌లైట్ వేసి చూస్తాము. కాని ఆ టార్చ్‌లైటు వెలుతురు కూడా సరిగ్గా లేదు. అందువల్ల అది పాము కాదు, పూలదండ అంటాము. అంటే పొరపాటు ఒకటినుంచి పొరపాటు రెండుకి ప్రయాణం చేశాము.

గౌడపాదాచార్యులవారు మన అవస్థాత్రయంలో కూడా అలాగే పొరపాట్లు పడుతున్నాము అంటారు. స్వప్నావస్థ పొరపాటు ఒకటి అయితే, జాగ్రదావస్థ పొరపాటు రెండు అవుతుంది. సుషుప్తి పొరపాటు మూడు అవుతుందా? అవదు. ఎందుకంటే సుషుప్తిలో అజ్ఞానం మాత్రమే ఉంటుంది, పొరపాటు ఉండదు. అజ్ఞానం ఉంటుంది కాబట్టి, అక్కడ సత్యం తెలియదు. పైగా నిద్రలేవటం ఈ అజ్ఞానం అనే పెట్టుబడితోనే లేస్తాము.

అందువల్ల మూడు అవస్థల్లోనూ పొరపాటు కొనసాగుతుంది. సరియైన జ్ఞానానికి ఎవరూ రారు. పోనీ వచ్చే జన్మలో వస్తారా? అప్పుడూ రారు. వచ్చే సృష్టిలో వస్తారా? అక్కడ కూడా అజ్ఞానం కొనసాగుతుంది. అది మాయ చేసే మాయ. అది నిరంతరంగా కొనసాగుతుంది. ఆ మాయ చేసే మాయనుంచి తప్పించుకోవాలంటే ఒకటే మార్గం ఉంది. అది శాస్త్రమనే టార్చ్‌లైట్‌ను పట్టుకోవాలి. అందువల్లనే గౌడపాదాచార్యులవారు మొదటి అధ్యాయంలోనే చెప్పేశారు -

**అనాది మాయయా సుప్తో యదా జీవః ప్రబుధ్యతే** - 1.16

జీవుడు మాయయొక్క మాయలో పడి అనాదికాలంగా నిద్రిస్తున్నాడు. శాస్త్రమూ, గురువూ కలిసి జీవిని పట్టి కుదిపి లేపటానికి ప్రయత్నిస్తున్నా, జీవుడు అటువైపు తిరిగి, మళ్ళీ గుర్రుకొట్టి నిద్రపోతూనే ఉన్నాడు, జాగ్రదావస్థలో నిద్రపోతున్నాడు.

**అచింత్యాన్ స్పృశన్** – జాగ్రదావస్థలో అజ్ఞాని మిథ్యా ప్రపంచాన్ని తన లౌకిక ప్రమాణాలతో చూస్తున్నాడు. అచింత్యా అంటే మిథ్య. మిథ్యా ప్రపంచాన్ని చూస్తే తప్పులేదు కాని అది మిథ్య అనే జ్ఞానంతో చూడాలి.

సినిమా మిథ్య అని తెలిసి, సినిమాకి వెళ్ళటంలో తప్పులేదు. సినిమా మొదలయ్యాక, అందులో లీనమై పగలబడి నవ్వినా, బాధతో ఏడ్చినా తప్పులేదు. దాన్ని మీరు తాత్కాలికంగానే సత్యంగా భావిస్తున్నారు కాబట్టి తప్పులేదు. ఎందుకంటే మీరు సినిమానుంచి బయటకు వచ్చిన మరుక్షణం, మీ మనస్సు కూడా దాన్నుంచి బయటకు వస్తుంది. ఒకవేళ అందులో హీరో చనిపోయి, అప్పుడు మీరు ఏడ్చినా, బయటకు వచ్చాక, ఆ సన్నివేశం మిమ్మల్ని ప్రభావితం చేయదు. ఇంకా మాట్లాడితే మరణించినట్టుగా హీరో బాగా నటించాడు అంటారు. అలా గనుక వెంటనే దాన్నుంచి బయటకు రాగలిగితే, సినిమా చూడటంలో తప్పులేదు.

అలాగే మీరు మీ జీవితంలో ధరించాల్సిన పాత్రలను దిగ్విజయంగా ధరించండి. తండ్రిగా, కొడుకుగా, భర్తగా, స్నేహితునిగా, ఏది వేసినా, సందర్భానికి తగ్గట్టు ప్రవర్తించండి. కాని ఆ పాత్ర మిథ్యా పాత్ర అని మర్చిపోకూడదు. సినిమాకి వెళ్ళినప్పుడు, సినిమా చూసేముందు అది తెరమీద ఆడే బొమ్మే, నిజంకాదు అని తెలిసి కూడా, మీరు హీరో మరణానికి చలించి ఏడ్వారా లేదా? అలాగే నిజజీవితంలో మీరు తండ్రి పాత్ర వేస్తున్నప్పుడు, పిల్లవానిమీద కోపం తెచ్చుకోవాల్సి వచ్చినప్పుడు కోపం తెచ్చుకోండి; స్నేహితుని పాత్ర వేస్తున్నప్పుడు స్నేహితుని కష్టాలు విని చలించాల్సి వస్తే చలించండి. కాని రాత్రి పడుకునేటప్పుడు ఈ పాత్రలన్నింటినీ మిథ్యగా వదుల్చుకోగలగాలి. అప్పుడు ఈ జీవితం ఒక పెద్ద నాటకంలా అర్థమవుతుంది.

వచ్చిన చిక్కేమిటంటే, ఆ పాత్రల్లో ఎంతగా మమేకం చెందుతారంటే, వాటి గురించి తలుచుకుని బాధపడతారు. ఒక్కోసారి నిద్రలేని రాత్రులు కూడా గడుపుతారు. మిథ్యను చూడటంలో తప్పులేదు కాని మిథ్యను సత్యంగా పొరపాటు పడటంతో వస్తుంది చిక్కంతా. అటువంటి అజ్ఞానీ సంసారుల గురించి చెబుతున్నారు గౌడపాదాచార్యులవారు ఈ కారికలో.

అచింత్యాన్ స్పృశన్ అంటే మిథ్యా ప్రపంచాన్ని చూస్తున్నారు. ఎలా,

**భూతవత్** – ఆత్యంతిక సత్యంగా చూస్తున్నారు. మిథ్యను మిథ్యగా చూడటం సరియైన దృక్పథం; సత్యాన్ని సత్యంగా చూడటం సరియైన జ్ఞానం. కాని కొందరు మిథ్యని సత్యంగా చూస్తున్నారు. ఎందుకు?

**విపర్యాసాద్** – అవివేకంవల్ల, అజ్ఞానంవల్ల. దీన్ని అధ్యాస అంటారు. ఈ పొరపాటు జాగ్రదావస్థలోనే కాదు, స్వప్నావస్థలో కూడా చేస్తున్నాడు.

**తథా** – అదే విధంగా,

**స్వప్నే** – స్వప్నంలో కూడా.

**ధర్మాన్ తత్ర ఏవ పశ్యతి** – ధర్మాన్ అన్నా కూడా అచింత్యాన్ అనే అర్థం. అంటే స్వప్నంలో కూడా మిథ్యా వస్తువులను చూస్తున్నాడు, కాని దురదృష్టవశాత్తూ స్వప్నంలో ఒక స్వాప్నికునికి తన స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. తత్ర అంటే స్వప్నకాలంలో, స్వప్నదేశంలో. భూతవత్ మనం కలుపుకోవాలి. స్వప్నాన్ని సత్యంగా భావిస్తాడు. స్వప్నాన్ని అది స్వప్నం అనే జ్ఞానంతో చూస్తే, సీరియల్ బాధించనట్టుగా, అది కూడా బాధించదు. స్వప్నంలో స్వప్నప్రపంచం సత్యం అనిపించినట్టుగా, జాగ్రదావస్థలో జాగ్రత్ ప్రపంచం మహాసత్యంగా కనిపిస్తుంది. ఎందుకిలా అవుతున్నది?

విపర్యాసాద్ – అవివేకంవల్ల. అధ్యాసవల్ల లేదా భ్రమవల్ల. అందువల్ల జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో కూడా సంసారం కొనసాగుతుంది. అందువల్లనే స్వప్నంలో కూడా మన ప్రారబ్ధకర్మ క్షయమవుతుంది.

మీకు బాగా కావాల్సిన వ్యక్తి చావుబతుకుల్లో ఉన్నారని తెలిస్తే, మీరు వారి గురించి జాగ్రదావస్థలో చాలా ఆందోళన చెందుతూ ఉంటారు. వారికేమవుతుందో అనే బెంగ మిమ్మల్ని కృంగదీస్తుంది. ఆ బెంగ మిమ్మల్ని ఎంతగా కృంగదీస్తుంటే, మీకు నిద్రలో ఆ వ్యక్తి చనిపోయినట్టు కల వస్తుంది. ఆ వ్యక్తి నిజంగా మరణించలేదు. కాని ఆ స్వప్నమే మిమ్మల్ని బాగా కలచివేస్తుంది. మీరు ఉలిక్కిపడి నిద్రలేస్తారు. నిద్ర లేవగానే, ఈ కల మిథ్యగా తేలిపోదు మీ మనస్సులో. ఆ కల మిమ్మల్ని ఇంకా వెంటాడుతూనే ఉంటుంది. నిజంగా ఆ వ్యక్తి మరణిస్తారేమోననే భయంతో మీకు జాగ్రదావస్థలో కూడా చెమటలు పడతాయి. ఇంకా మాట్లాడితే, మీరు ఆ రోజు గుడికి వెళ్ళి, ఆ వ్యక్తి పేరిట అర్చన కూడా చేయిస్తారేమో! ఇదంతా ఎందుకు జరిగింది? మీ ఆందోళన మీ సుప్తచేతనమనస్సులోకి ఇంకటంవల్ల జరిగింది.

సుప్తచేతనమనస్సులోకి ఇంకటంవల్ల, మిథ్యా ప్రపంచమే మిమ్మల్ని అంతలా కృంగదీస్తే, ఇంక జాగ్రత్ ప్రపంచం ఎలా భయపెడుతుందో ప్రత్యేకించి చెప్పాలా? జాగ్రత్ ప్రపంచం అలా భయపెట్టకూడదు అంటే, మీరు వేదాంతంలో నేర్చుకున్నది మీ సుప్తచేతనంలోకి ఇంకాలి. అలా ఇంకాలంటే కేవలం శ్రవణం చేస్తే చాలదు; దానికి మనన, నిదిధ్యాసనలు కూడా తోడవ్వాలి. లేకపోతే సంసారం మిమ్మల్ని వదిలివెళ్ళదు.

**కారిక 4.42**

**ఉపలంభాత్సమాచారాదస్తివస్తుత్వవాదినామ్ ।**
**జాతిస్తు దేశితా బుద్ధైరజాతేస్త్రసతాం సదా ॥**

వేదాంతబోధలో బ్రహ్మే అంతటా ఉంది, బ్రహ్మ వినా మరొక వస్తువు లేదు అనేది అంతిమ సత్యం.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాత్**
**బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ।**
**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం**
**బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్ ॥**– ముండకమ్ 2.2.12

గౌడపాదాచార్యులవారు ఇక్కడ అందరూ ఎదుర్కొనే సమస్యను వివరిస్తున్నారు. అంతటా ఉన్నది బ్రహ్మే, బ్రహ్మ వినా మరొక వస్తువు లేదు అనే సత్యాన్ని జీర్ణించుకోవటానికి చాలా మంది సిద్ధంగా ఉండరు. దాన్ని జీర్ణించుకోవటానికి సూక్ష్మమైన బుద్ధి ఉండాలి, పరిపక్వత ఉండాలి, జ్ఞానయోగ్యత ఉండాలి. ఇది లేనివారు, 'ఇంత స్పష్టంగా కనబడుతున్న జగత్తు సత్యం కాదు, మిథ్య అని ఎలా స్వీకరించగలము?' అంటారు.

మన ప్రత్యక్షప్రమాణం మనకు నేర్పేది – జాగ్రత్ ప్రపంచానికి ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది కాబట్టి అది సత్యం అనే అంశం. అంతేకాదు, ప్రపంచం అంతా ఒక క్రమబద్ధతతో నడుస్తున్నది. మామూలు మనుష్యులే కాదు, తక్కిన దార్శనికులు కూడా అద్వైతాన్ని స్వీకరించలేరు. వారు కూడా ఈ ప్రస్థానత్రయాన్నే అధ్యయనం చేసినా, వారూ అద్వైతాన్ని స్వీకరించలేరు. అంత గొప్ప దార్శనికులే అద్వైతాన్ని అర్థం చేసుకోలేకపోతే, ఇంక మామూలు మనుష్యుల గురించి చెప్పేది ఏముంది?

అందువల్ల జగత్తు మిథ్య అనే సత్యాన్ని తేలికగా ఎవరూ జీర్ణించుకోలేరు. జగత్తు అనుభవంలోకి వస్తున్నది, దానితో వ్యవహారం నడుపుతున్నాము, దానివల్ల ప్రయోజనం ఉంది అంటారు వారు.

వేదాంతాన్ని స్వీకరించలేకపోవటానికి ఇంకొక కారణం – మనుష్యులకుండే మమకారం. తనకంటూ తనవారు ఉంటే వారి అండలో తన జీవితాన్ని కృష్ణా, రామా అంటూ నిశ్చింతగా గడిపివేయవచ్చు అనుకుంటారు చాలామంది. అందువల్ల బంధువులు ఉంటే అదొక దీవెనగా భావిస్తారు వారు. ఇలా బంధుత్వాలు ఉండటం ద్వైతంలోనే సాధ్యం.

ఓదార్పునిచ్చే భుజం ఉంటే చాలు, జీవితంలో ఇంకేమీ అవసరం లేదు అనుకునేవారిని అద్వైతం భయపెడుతుంది. వారు అద్వైతంలో భద్రతను పొందలేమని భయపడతారు. ఎందుకు? అద్వైతంలో అనుబంధాలకు ఆస్కారం లేదు. అనుబంధాలు ఉండాలంటే, రెండు ఉండాలి కాని అద్వైతంలో ఉన్నదొకటే; అది చైతన్యమైన నువ్వే అని అంటుంది శాస్త్రం. కాని మనుష్యులకేమో మేమిద్దరం, మాకిద్దరు భావన బాగా లోతుగా పాతుకుపోయింది. పైగా అలా నావారు అంటూ లేనివారిని అనాథ అని సమాజం వేలెత్తి చూపుతుంది.

ఇటువంటి భావాలు ఉండటంవల్ల అద్వైతానికి వస్తే అనాథలమైపోతామేమోననే భయం వెంటాడుతుంది చాలామందిని. అటువంటివారు సన్న్యాసిని చూసి జాలిపడతారు కూడా! అయ్యో! సన్న్యాసికి ఆప్యాయంగా వరుసలు పెట్టి పిలిచే నా అన్నవారు లేరే అంటారు. ఆయనకు అనారోగ్యం చేస్తే దగ్గరుండి ఎవరు సేవ చేస్తారు, ఎవరు వైద్యం చేయిస్తారు, చివరి నిముషంలో గుక్కెడు తులసితీర్థం నోట్లో ఎవరు పోస్తారు అంటారు.

ఒక్కముక్కలో చెప్పాలంటే ద్వైతంలో ఉంటే భద్రత దొరుకుతుంది, అద్వైతానికి వస్తే ఏకాకి అయిపోతామనే లోతైన భావనలు మనుష్యుల్లో కూరుకుపోయి ఉంటాయి. అటువంటి వారికి గురువు అద్వైతం గురించి బోధిస్తే, వారు రెండవ క్లాసుకి రారు. ఆ విషయం శాస్త్రానికి కూడా తెలుసు. అందువల్లనే అద్వైతం వేదఅంతభాగంలో వస్తుంది. వేదపూర్వ భాగంలో కర్మకాండ, ఉపాసనకాండ వస్తాయి.

కర్మకాండలో జగత్తుమీద ఆధారపడతాడు ఒక సాధకుడు. పుణ్యకర్మలు చేస్తే పుణ్యలోకప్రాప్తి అని నేర్చుకుంటాడు. ఉపాసనకాండలో జగత్తుమీద ఆధారపడేస్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడే స్థాయికి వస్తాడు.

వేదాంతానికి వచ్చాక కూడా, శాస్త్రం వెంటనే అద్వైతం గురించి చెప్పదు. అధ్యారోప, అపవాద పద్ధతిని ఉపయోగిస్తుంది. అంటే ముందు ద్వైతాన్ని ప్రవేశపెడుతుంది. ఒక జగత్తు ఉందని, దానికి సృష్టికర్త పరమాత్మ అనీ ఈ రెండింటి మధ్యా కార్య-కారణ సంబంధం ఉందనీ చెబుతుంది. శిష్యుడు ఇదంతా అర్థం చేసుకుని, ఉత్తమ అధికారి స్థాయికి ఎదిగాక, సృష్టిని నిషేధిస్తుంది. అసలు నిజంగా సృష్టి జరగలేదు అంటుంది. ఎందుకంటే బ్రహ్మ లేకుండా, జగత్తుకు విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటారు. మిథ్యావస్తువు ఉన్నా లేనట్టే అర్థం. బ్రహ్మ కార్య, కారణ విలక్షణం అని చెప్పి, ఆ బ్రహ్మవు నువ్వే అంటుంది.

అంటే ఇప్పుడు శిష్యుడు భగవంతునిమీద ఆధారపడే స్థాయినుంచి, తనమీదే ఆధారపడే స్థాయికి ఎదుగుతాడు. తనమీద అంటే వ్యక్తిగా కాదు, జీవ-ఈశ్వర ఐక్యం ఉన్న చైతన్యంగా అర్థం చేసుకుంటాడు. నేను అసంగ ఆత్మను (చైతన్యాన్ని) అని అర్థం చేసుకుంటాడు. ఈ నేపథ్యంతో ఈ కారిక అర్థం చూద్దాము.

**అస్తివస్తుత్వవాదినామ్** - ద్వైతం సత్యం అని వాదించేవారు. వస్తు అంటే ద్వైతం; అస్తి అంటే నిజంగా ఉంది; వాది అంటే నమ్మేవారు. ద్వైతం నిజంగా ఉందని నమ్మేవారు జగత్తు సత్యం, అనుభవాలు సత్యం అంటారు.

**ఉపలంభః తస్మాద్** - ఉపలంభః అంటే అనుభవం. ద్వైతప్రపంచం అనుభవంలోకి వస్తున్నది కాబట్టి అది సత్యం అంటారు వారు. అనుభవంలోకి వచ్చినంత మాత్రాన సత్యం కానవసరం

లేదు అంటుంది వేదాంతం. అలా ఎలా చెప్పగలదు అంటే మీ స్వప్నప్రపంచ అనుభవాన్ని తీసుకోండి అంటుంది. స్వప్నప్రపంచం కూడా అనుభవంలోకి వస్తుంది కాని దాన్నుంచి లేచాక అది మిథ్యగా తేలిపోతుంది. ద్వైతం సత్యం అని చెప్పటానికి వారు ఇంకొక కారణం కూడా చెబుతారు.

**సమాచారాద్** – ప్రపంచం అంతా ఒక క్రమపద్ధతిలో నడుస్తున్నది. విశ్వంలో అనేక ప్రకృతి నియమాలు ఉన్నాయి. వాటిని నిర్దేశించే ప్రకృతి సూత్రాలు అనేకం ఉన్నాయి. సౌరమండలం ఎంత అద్భుతమైన సృష్టి! ఋతువులు ఎంత సక్రమంగా వస్తాయి! ఇంత క్రమపద్ధతి ఉన్న విశ్వం మిథ్య అని ఎలా అనగలరు?

విజ్ఞానశాస్త్రం ఇంతగా వృద్ధి చెందింది అంటే ప్రకృతి సూత్రాలవల్లనే అని చెప్పవచ్చు మనం కూడా. ఎప్పుడో కనుగొన్న భూమ్యాకర్షణశక్తిని ఇప్పటికీ ప్రకృతి సూత్రంగా స్వీకరిస్తాము. కాని జగత్తు కంటికి కనిపించినంత మాత్రాన, ప్రయోజకత్వం ఉన్నంత మాత్రాన, ఒక క్రమపద్ధతి ఉన్నంత మాత్రాన దాన్ని సత్యంగా తీసుకోలేము.

ముందు మిథ్య పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మిథ్య అంటే అసలు లేదని కాదు అర్థం. ఒక కాలంలో ఉండి, ఇంకొక కాలంలో లేనిది మిథ్య. జాగ్రదావస్థలో సత్యంగా కనిపించిన జాగ్రత్ ప్రపంచం నిద్రలోకి జారుకుంటే తేలిపోతుంది. అందుకని జాగ్రత్ ప్రపంచం అసలు లేదందామా అంటే ఉంది. అలాగని ఉనికి ఉందందామా అంటే లేదు. అటువంటిదాన్ని **సత్ అసద్భ్యాం అనిర్వచనీయం మిథ్యా** అంటారు.

ఇంకొక విషయం అర్థం చేసుకోవాల్సింది, జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ పురుషునికి మిథ్య కాదు. దాన్నుంచి పారమార్థిక స్థాయికి ఎదిగిన జ్ఞానికి మిథ్య. ఇదంతా ఇంత తేలికగా అద్వైతానికి రాగానే అర్థం కాదని శాస్త్రమాతకూ తెలుసు.

తల్లి ఎలాగైతే తన చిన్నిపాపాయికి ముందు ద్రవపదార్థం పెట్టి, కొన్ని నెలలయ్యాక నెమ్మదిగా కొంచెం ద్రవం, కొంచెం ఘనపదార్థాల మిశ్రమం పెట్టి తర్వాత ఘనపదార్థం పెడుతుందో, అలా శాస్త్రమాత కూడా తన ఆధ్యాత్మిక పాపాయిలకు కొంచెం కొంచెంగా ఆధ్యాత్మిక ఆహారాన్ని పెడుతుంది. తన ఆధ్యాత్మిక పాపాయిలు ఏ స్థాయిలో ఉంటే, ఆ స్థాయికి దిగివస్తుంది. ముందే అద్వైతంతో మొదలుపెట్టదు.

ముందు సృష్టిప్రకరణం చెబుతుంది. బ్రహ్మనుంచి పంచభూతాలు వచ్చాయని, దాన్నుంచి అన్నం, అన్నంనుంచి పురుషుడు వచ్చాడని చెబుతుంది. తర్వాత ఏకరూపభక్తిని ప్రవేశపెడుతుంది. ఆ భక్తిలో కూడా నవవిధ భక్తులు ఉన్నాయి. సఖాభక్తి, వాత్సల్యభక్తి మొదలైనవి. కొంతమంది స్నేహితునితో చెప్పుకున్నట్టు భగవంతునితో కష్టసుఖాలు చెప్పుకుంటారు. మన భావోద్రేకాలను

తృప్తిపరచటానికి చెబుతుందలా. కాని మనం ఆ స్థాయిలోనే ఆగిపోకూడదు. ఇంకా పైకి ఎదగాలి అంటుంది శాస్త్రం.

**అజాతేః త్రసతాం సదా** – త్రసతాం అంటే భయపడతారు. దేని గురించి భయపడతారు? అజాతేః. అద్వైతబ్రహ్మ గురించి భయపడతారు. ఎందుకు? అద్వైతంలో అనుబంధాలకు చోటు లేదు కాబట్టి.

**అసంగోఽ హమ్ అసంగోఽ హం పునః పునః**

అలా అసంగంగా ఉంటే ముక్తి వస్తుందంటే, నా పిల్లలనుంచి నేను విడివడాల్సి వస్తే అటువంటి ముక్తి వద్దు నాకు అంటారు వారు. పిల్లలనుంచి నిజంగా విడివడనవసరం లేదు. కాని అలా పొరపాటు పడతారు వారు. ఏకాంతానికీ, ఒంటరితనానికీ మధ్య భేదం అది. ఏకాంతాన్ని కోరి వరిస్తాడు జ్ఞాని; ఒంటరితనం చూసి భయపడతాడు అజ్ఞాని.

**జాతిః తు దేశితా** – జాతి అంటే సృష్టి. దేశితా అంటే బోధింపబడుతుంది. ఇలా భయపడేవారికోసం సృష్టి ప్రకరణం బోధింపబడుతుంది. దానికి అధ్యారోప అపవాద పద్ధతిని ఉపయోగిస్తుందని చూశాము. తాత్కాలికంగా సృష్టి ఉందని ఒప్పుకోవటం అధ్యారోపం; తర్వాత దానిని నిషేధించటం అపవాదం.

**బుధైః** – తెలివైన ఆచార్యులచేత. తెలివైన ఆచార్యులు వీరి స్థాయికి దిగివచ్చి, నెమ్మదిగా అద్వైతం స్థాయికి వారిని తీసుకువెళతారు. ఇదీ మన శాస్త్రం, మన గురువుల గొప్పదనం.

**కారిక 4.43**

**అజాతేస్త్రసతాం తేషాముపలంభాద్వియంతి యే ।**
**జాతిదోషా న సేత్స్యంతి దోషోఽ ప్యల్పో భవిష్యతి ॥**

ముందు కారికలో భావనే ఇంకా కొనసాగుతున్నది. ఈ అధ్యాత్మశిష్యులు ద్వైతంలోనే కూరుకుపోతారు కాబట్టి అంత తేలికగా అద్వైతాన్ని స్వీకరించలేరు. ఆ భావనను మొదటి పాదంలో మళ్ళీ చూస్తాము.

**తేషామ్ అజాతేః త్రసతామ్** – వారు అద్వైతం అంటే భయపడటం కొనసాగిస్తారు.

**వియంతి** – వియంతి అంటే విరుద్ధం. యంతి అంటే అద్వైతానికి విరుద్ధంగా, ద్వైతాన్ని సమర్థిస్తూ వాదిస్తారు. దానికి వారు చూపే కారణం ఏమిటి?

**ఉపలంభాత్** – ద్వైతం అనుభవంలోకి వస్తున్నది కాబట్టి. రెండవ అధ్యాయంలో చూశాము, జాగ్రత్ ప్రపంచానికి ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టత ఉంది కాబట్టి అది సత్యం అని కొందరు వాదిస్తారు. అటువంటి వారికి వేదాంతం మొదటే అద్వైతాన్ని నేర్పించదు.

సిగరెట్లు తెగ కాల్చేవ్యక్తి తన స్నేహితునితో ఇలా అన్నాడుట, 'ఏ వార్తాపత్రికని తిరగేసినా, పొగత్రాగటం హానికరం అని భయపెడుతున్నది. అందుకని నేను మానేశాను.' ఆ స్నేహితుడు ఆశ్చర్యంగా అడిగాడు, 'నిజంగా పొగత్రాగటం మానేశావా?' 'పుస్తకాలు చదవటం మానేశాను,' అన్నాడు నిదానంగా. అలాగే ఉంటుంది ద్వైతవాది పరిస్థితి కూడా. అతను వేదాంతానికి రాగానే ద్వైతప్రపంచం మిథ్య అని అద్వైతగురువు బోధిస్తే అతను వెంటనే వదిలేస్తాడు, ద్వైతభావనను కాదు, అద్వైతగురువును. అప్పుడు అద్వైతగురువు అద్వైతం అయిపోతాడు. అంటే అతనికి ఇంక శిష్యులు రారు.

శాస్త్రానికి కూడా ఆ విషయం తెలుసు. అందువల్ల వేదాంతం కొంత దిగివస్తుంది. సృష్టి గురించి చెబుతుంది. కార్యకారణ విలక్షణ బ్రహ్మను కారణబ్రహ్మగా వివరిస్తుంది. అలా వివరిస్తే అందులో దోషం ఉంటుందని తెలుసు. ఏమిటా దోషం?

సగుణబ్రహ్మమీద భక్తి పెంచుకుంటాడు శిష్యుడు. ముందంతా జగత్తుమీద ఆధారపడితే, ఇప్పుడు భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకుంటాడు. భగవంతునిమీద ఆధారపడితే తప్పేమిటి అని ప్రశ్నించవచ్చు మీరు. అది ద్వైతాన్ని ఇంకొంచెం పెంచి పోషిస్తుంది. ఇదీ సృష్టి గురించి బోధిస్తే కలిగే సమస్య.

కాని గౌడపాదాచార్యులవారు ఫర్వాలేదు అంటారు. వారు ద్వైతాన్ని పాటించనివ్వండి, జీవాత్మ–పరమాత్మ భేదభావనలో కొనసాగనివ్వండి, ఫర్వాలేదు. ఈ భేదబుద్ధే క్రమేపీ వారిని దీన్నుంచి అనేకరూప ఈశ్వరభక్తికి తీసుకువస్తుంది. అనేకరూప ఈశ్వరభక్తి అంటే విశ్వరూపదర్శనం. అన్నింటిలోనూ, అందరిలోనూ భగవంతుణ్ణే దర్శించటం. అనేకరూప ఈశ్వరభక్తి నుంచి అరూపఈశ్వర జ్ఞానానికి రావటానికి ఎంతోసేపు పట్టదు. అందువల్ల ద్వైతం బోధించటంవల్ల ముందు సమస్యలు ఎదుర్కొన్నా ఫర్వాలేదు అంటుంది శాస్త్రం.

**దోషః అపి అల్పః ఏవ భవిష్యతి** – సృష్టి ప్రకరణాన్ని స్వీకరిస్తే దానివల్ల కొన్ని అల్పదోషాలు లేకపోలేదు. దానివల్ల ద్వైతాన్ని ఒప్పుకున్నట్లు అవుతుంది. అయినా ఫర్వాలేదు.

మనకు ఏదైనా అనారోగ్యం చేస్తే డాక్టరు కొన్ని ఏంటీబయాటిక్స్ ఇస్తాడు. దానివల్ల కొన్ని సైడ్ఎఫెక్ట్స్ వస్తాయని ఆయనకు తెలుసు. అయినా వాటిని ఇస్తాడు. ఎందుకంటే ఏంటీబయోటిక్స్‌వల్లనే అనారోగ్యం నయమవుతుంది. ముందు రోగం నయమయితే, ఆ వచ్చిన సైడ్ఎఫెక్ట్స్‌ను శరీరమే నయం చేసుకుంటుంది.

అలాగే, వేదాంతం కూడా సృష్టిప్రకరణం గురించి చెబితే, దానివల్ల కూడా సైడ్ఎఫెక్ట్ వస్తాయి. ఇక్కడ వచ్చే సైడ్ఎఫెక్ట్ – ద్వైతభావన ఇంకొంచెం పుంజుకుంటుంది. అయినా ఫర్వాలేదు. సృష్టి గురించి చెబుతుంది.

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ**
**ఖం వాయుర్జ్యోతి రాపశ్చ పృథ్వీ విశ్వస్య ధారిణీ** – కైవల్యమ్ 15

బ్రహ్మనుంచి సమష్టిపరంగా పంచభూతాలు, వ్యష్టిపరంగా ప్రాణం. మనస్సు, ఇంద్రియాలు వచ్చాయని కైవల్యంలో పదిహేనవ మంత్రంలో చెప్పి, అదే ఉపనిషత్తు కొన్ని మంత్రాలవగానే వీటన్నింటి సృష్టిని నిషేధిస్తుంది.

**న పుణ్యపాపే మమ నాస్తి నాశో న జన్మ దేహేంద్రియబుద్ధిరస్తి ॥** – కైవల్యమ్ 21
**న భూమిరాపో న చ వహ్నిరస్తి । న చాఽనిలో మేఽస్తి న చాంబరం చ ॥** – కైవల్యమ్ 22

వ్యష్టిలో, సమష్టిలో ఇవేవీ పుట్టలేదు అని నిషేధిస్తున్నది.

ముందు సృష్టి గురించి చెబితే ద్వైతానికి ఆకర్షింపబడతారు అని తెలిసి కూడా చెబుతుంది. **జాతిదోషా న సేత్స్యంతి** – వారు ద్వైతం వైపు ఆకర్షింపబడినా, అది అల్పమైన దోషమే అవుతుంది. ఈ దోషం ఎక్కువకాలం ఉండదు. వారు ఎప్పటికీ ద్వైతంలోనే నిలచిపోరు. జాతి దోషా అంటే సృష్టిని స్వీకరించటంవల్ల కలిగే తాత్కాలిక దోషం; న సేత్స్యంతి – ఎక్కువకాలం ఉండదు. వారు అపవాదంలో సృష్టి నిషేధం గురించి అర్థం చేసుకుంటారు.

**కారిక 4.44**

**ఉపలంభాత్సమాచారాన్మాయాహస్తీ యథోచ్యతే ।**
**ఉపలంభాసత్సమాచారాదస్తి వస్తు తథోచ్యతే ॥**

బాహ్యప్రపంచంలో ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టత ఉంది, అందువల్ల అది సత్యం అని వాదించిన వారితో గౌడపాదాచార్యులవారు రెండవ అధ్యాయంలో వాటిలోని ఒక్కొక్క అంశాన్ని తీసుకుని స్వప్నప్రపంచంతో పోల్చి జాగ్రత్ ప్రపంచం, స్వప్నప్రపంచంలా మిథ్య అని నిరూపించారు.

ఇక్కడ ఇంకొక ఉదాహరణనిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. అది ఇంద్రజాలికుడు చేసే ఇంద్రజాలం. ఈ ఉదాహరణను కూడా ఇంతకుముందు చూశాము.

ఇంద్రజాలికుడు ఒక యువతిని ఒక పెట్టెలో పడుకోపెట్టి ఆమెను పెద్ద కత్తితో రెండు భాగాలుగా కోస్తాడు. కోసి ఆ రెండు పెట్టెలను చెరోవైపుకి త్రోసి, వాటి మధ్యలోంచి తను నడుస్తాడు. కింద రక్తంబొట్లు కారటం కూడా చూస్తాము. తల, మొండెం మాత్రం ఉన్న వైపునుంచి అరుపులు, కేకలు వినబడితే, కాళ్ళు మాత్రం ఉన్నవైపు కాళ్ళు కదలటం కనిపిస్తుంది. దానిలో కొంచెం విషాదం కూడా చొప్పిస్తాడు ఆ ఇంద్రజాలికుడు. 'అయ్యో! నా భార్య చనిపోయింది,' దుఃఖిస్తాడు. ఇదంతా మన కళ్ళారా చూస్తాము. అతని భార్య ద్వైతంగా

అయినట్టు (రెండు ముక్కలు అయినట్టు) కనిపిస్తుంది కాని నిజానికి ఆమె అద్వైతం (కోయబడలేదు). ఇదంతా కనికట్టు విద్య లేదా మాయ.

శంకరాచార్యులవారు అద్భుతమైన మాయాపంచకం రాశారు.

**విధిహరిహర విభేదమప్యఖండే**
**బత విరచయ్య బుధానపి ప్రకామమ్**
**భ్రమయతి హరిహరభేదభావా**
**నఘటితఘటనా పటీయసీ మాయా** – మాయాపంచకమ్ 5

అసాధ్యమైన వాటిని జరిగేలా చేయటంలో నేర్పరి అయిన మాయ. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనే భేదాలు లేకపోయినా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనే భేదాలను సృష్టించి, వారిని భిన్నమైన వారిగా చూసేలా చేయటం ద్వారా విద్యావంతులను కూడా కలవరపెడుతున్నది.

ఇలా మాయ చేస్తున్నది అని చెప్పినా వారు నమ్మరు. ఇంద్రజాలికుడు చేసినది ఎలా నిజమనిపిస్తుందో, అలా ఈ ద్వైతం కూడా నిజమనిపిస్తుంది.

**ఉపలంభాత్ సమాచారాత్** – కనబడుతున్నది కాబట్టి, ఒక క్రమపద్ధతి ఉంది కాబట్టి,

**మాయాహస్తీ** – కల్పితమైన ఏనుగును నిజంగా ఉన్నట్టుగా భావిస్తారు. ఇంద్రజాలానికి ఒక ఉదాహరణగా ఏనుగును తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు. మనం ఒక యువతిని రెండుగా కోయటం ఉదాహరణగా చూశాము. ఇక్కడ మాయా అంటే సృష్టి చేస్తున్న మాయ కాదు; ఇంద్రజాలం.

**ఉచ్యతే** – నిజంగా ఉందని అంటారు. అంటే ఏనుగు నిజంగా లేకపోయినా ఉందని భావిస్తారు జనులు. ఇంద్రజాలికుడు చేతిలో ఒక నెట్‌ను పట్టుకుని, ఇంకొక చేతిలో ఒక మంత్రదండాన్ని పట్టుకుని, అబ్రకదబ్ర అంటూ ఒక పక్షినో, ఒక కుందేలునో సృష్టిస్తాడు. ఒక మామూలు ఇంద్రజాలికుడే అనేక వస్తువులను సృష్టించగా లేనిది, మహా ఇంద్రజాలికుడైన భగవంతుడు జగత్తును సృష్టించలేడా? భగవంతుడు ఒకసారి తన నెట్‌ను కదిలిస్తే ఆకాశం, ఇంకొకసారి కదిపితే వాయువు, అలా సృష్టించుకుంటూ పోవచ్చు.

**తథా ఉపలంభాత్ సమాచారాత్** – అదే విధంగా కనబడుతున్నది కాబట్టి, ఒక క్రమపద్ధతి ఉంది కాబట్టి,

**అస్తి వస్తు ఉచ్యతే** – ఈ ద్వైతప్రపంచం ఉంది అంటారు. వస్తు అంటే ద్వైతప్రపంచం.

**కారిక 4.45**

**జాత్యాభాసం చలాభాసం వస్త్వాభాసం తథైవ చ ।**
**అజాచలమవస్తుత్వం విజ్ఞానం శాంతమద్వయమ్ ॥**

సృష్టి నిజంగా జరిగినట్టు ఉన్నా, నిజంగా సృష్టి రాలేదు. ఇది మాయయొక్క మాయ.

**జాత్యాభాసమ్** – జాతి అభాస అంటే సృష్టి అభాస; సృష్టి జరిగినట్టు కనిపించినా పుట్టుక లేనిదీ;

**చలాభాసం** – చలనం ఉన్నట్టు కనిపించినా చలనం లేనిదీ;

**వస్త్వాభాసం** – ఒక పదార్థలాగా కనిపించినా, పదార్థం కానిదీ; ఏదైతే ఉందో;

**విజ్ఞానమ్** – అది విజ్ఞానం. విజ్ఞానం అంటే చైతన్యతత్త్వం. దాని అసలు తత్త్వం ఏమిటి?

**అజమ్** – దానికి పుట్టుక లేదు. అజమ్‌ని జాతితో కలుపుకోవాలి. అంటే పుట్టుకలేని బ్రహ్మ పుట్టినట్టుగా;

**అచలమ్** – దానికి చలనం లేదు. అచలమ్‌ని చలంతో కలుపుకోవాలి. చలనం లేని బ్రహ్మకు చలనం ఉన్నట్టుగా;

**అవస్తుత్వమ్** – అది పదార్థం కాదు. అవస్తుత్వమ్‌ని వస్తుతో కలుపుకోవాలి. పదార్థంగా కనిపించినా పదార్థం కానిది విజ్ఞానం. చైతన్యమే పదార్థంగా కనిపిస్తుంది. చైతన్యానికి పుట్టుకలేదు, చలనం లేదు, అది పదార్థం కాదు. దాన్ని ఇక్కడ విజ్ఞానం అంటున్నారు. అది ఎలా ఉంటుంది?

**శాంతమ్** – ఎప్పటికీ శాంతంగా ఉంటుంది; దేనికీ చలించదు. స్వప్నంలో స్వాప్నికుడు భయపడుతున్నా, జాగ్రత్‌పురుషుదు ఎలా ప్రశాంతంగా పడుకుంటాడో, అలా అనాత్మ అయిన అహంకారం భయపడుతున్నా ఆత్మ శాంతం.

**అద్వయమ్** – రెండవది లేని తత్త్వం ఏదైతే ఉందో అది విజ్ఞానం. శాంతం, అద్వయమ్ పదాలు ఏడవ మంత్రంలోనివి.

**శాంతం శివమద్వైతమ్** – మంత్రం 7

**కారిక 4.46**

**ఏవం న జాయతే చిత్తమేవం ధర్మా అజాస్స్మృతాః ।**
**ఏవమేవ విజానంతో న పతంతి విపర్యయే ॥**

దీనితో గౌడపాదాచార్యులవారు చర్చిస్తున్న వేదాంతసారం ముగింపుకు వస్తున్నది.

**ఏవం చిత్తం న జాయతే** – ఈ విధంగా చైతన్యం పుట్టటం లేదు. చిత్తం అంటే ఇక్కడ

చైతన్యం అని చూశాము. ఈ విధంగా అంటే 29-45 కారికల్లో చూసిన విధంగా. న జాయతే అంటే అది కారణమూ కాదు, కార్యమూ కాదు. కార్యకారణ విలక్షణ తురీయమ్.

**ఏవం ధర్మాః అజాః** – ఇక్కడ ధర్మాః అంటే జీవులు. చైతన్యస్వరూపజీవులు. చైతన్యం పుట్టటం లేదు. జీవులూ పుట్టటం లేదు. జీవులు పుట్టలేదు అంటే ఈ జన్మే లేదు. ఈ జన్మే లేకపోతే, పునర్జన్మ ప్రసక్తి ఎక్కడ వస్తుంది? పునర్జన్మ ఉండకూడదు అని ప్రార్థన చేసారంటేనే, వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు అని అర్థం.

వేదాంతానికి రాకముందు పునర్జన్మనుంచి మోక్షం కావాలని శిష్యుడు అంటే 'అయితే వేదాంతం నేర్చుకో, నీకు పునర్జన్మ ఉండదు,' అని శాస్త్రం అంటుంది. పునర్జన్మను తప్పించుకోవటానికి, శిష్యుడు వేదాంతానికి వస్తాడు. అప్పుడు చెబుతుంది. 'అసలు నీకు ఈ జన్మే లేకపోతే, పునర్జన్మ ప్రసక్తి ఎక్కడ వస్తుంది?' అందువల్ల ధర్మాః అజాః అంటే జీవులు కూడా పుట్టలేదు.

**(ఇతి) స్మృతాః** – ఇది వేదాంతబోధ.

**ఏవమేవ విజానంతః** – ప్రతి సాధకుడూ, ఈ జ్ఞానాన్ని పొందాలి. ఏమిటా జ్ఞానం? అద్వైత బ్రహ్మ అయిన నేనే మూడు కాలాల్లోనూ ఉన్నాను. జీవ-ఈశ్వర భేదం మిథ్య; స్వామి-దాసభేదం మిథ్య. అహం బ్రహ్మ అస్మి సత్యం.

మీకు స్వామి అవాలని ఉందా, దాసునిగా ఉండిపోవాలని ఉందా? దాసునిగా ఉంటే మోక్షం ప్రసక్తి లేదు. మోక్షం, దాసం రెండు వ్యతిరేకపదాలు. వాటిని కలపలేము. ముక్తి పొందిన దాసుడు అనలేము. ఒకవేళ మీరు దాసుడుగా ఉంటే – ఆ దాసత్వం ఎవరికైనా అవనీ, మోక్షం కుదరదు. తోటి జీవికి దాసుడైనా, ఈశ్వరునికి దాసుడైనా కూడా అది బంధకత్వానికే దారితీస్తుంది.

మీకు మోక్షం కావాలనుకుంటే మీరు స్వామి అవాలి. స్వామి అవాలంటే సన్న్యాసం స్వీకరించమని కాదు అర్థం. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందటం. ఏవం ఏవ విజానంతః అంటే అద్వైతజ్ఞానాన్ని మాత్రమే పొందాలి.

మొదట్లో ద్వైతజ్ఞానం ఉండటం మంచిదే కాని అదే అంతిమలక్ష్యంగా ఉండకూడదు. దాన్ని దాటి పైకి రావాలి. ఎవరు చెబుతున్నారు? గౌడపాదాచార్యులవారు చెబుతున్నారు. **ఏవ** ఇక్కడ చాలా ముఖ్యమైన పదం. అద్వైతజ్ఞానం మాత్రమే ముఖ్యం.

**న పతంతి విపర్యయే** – విపర్యయే అంటే సంసారం; న పతంతి అంటే పడరు. అంటే ఈ ఆత్మజ్ఞానం పొందినవారు సంసారచక్రంలో పడరు. మళ్ళీ మళ్ళీ తల్లిగర్భంలో ప్రవేశించే దుస్థితినుంచి బయటపడతారు. ఎవరైతే ద్వైతాన్నే చూస్తారో, వారు మృత్యువునుంచి మృత్యువుకు ప్రయాణం చేస్తారు.

ఈ విధంగా కారికలు 29-46 వరకు గౌడపాదాచార్యులవారు వేదాంతసారాన్ని, స్వప్నదృష్టాంతంతోనూ, ఇంద్రజాల దృష్టాంతంతోనూ వివరించి చెప్పారు. వేదాంతసారం- **అద్వైతం సత్యం, జగన్మిథ్యా.**

**4. అలాత దృష్టాంతం - కారికలు 47-56 ఉపోద్ఘాతం**

ఈ కారికల్లో కూడా వేదాంతసారం చూస్తాము కాని కోణం మారుతుంది. అంతకు ముందు స్వప్నదృష్టాంతం, ఇంద్రజాల దృష్టాంతంనుంచి చెబితే, ఇప్పుడు ఇంకొక దృష్టాంతాన్ని తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు. దాన్ని అలాతం అంటారు. అలాతం అంటే కొరివి, కాగడా, దివిటీ అనవచ్చు. ఇక్కడ మనం కొరివి పదం వాడదాము. కొరివి అంటే ఒక పొడుగు కర్రకు ఒక చివర ఒక బట్టను లావుగా చుట్టి, దాన్ని నూనెలో ముంచి వెలిగిస్తారు. దాన్నుంచి వచ్చే కాంతి చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. ఇప్పుడంటే టార్చ్‌లైట్లు వచ్చాయి కాని అప్పుడు ఇవే ఉండేవి.

అలాత దృష్టాంతం వాడుతున్నారు కాబట్టి ఈ అధ్యాయానికి అలాతశాంతి ప్రకరణం అని పేరు వచ్చింది. ఈ అలాతాన్ని తిప్పితే కొన్ని ఆకారాలు ఏర్పడతాయి. వాటిని **స్పందనం** అంటారు. అలాతాన్ని తిప్పితే వచ్చే ఆకారాలని ఆభాస అంటారు. అలాతాన్ని ఇప్పటి దీపావళి టపాకాయల్లోని కాకరపువ్వుతో పోల్చవచ్చు.

అలాతాన్ని నిలువుగా తిప్పితే, నిలువుగా ఆకారాలు ఏర్పడతాయి; గుండ్రంగా తిప్పితే, వృత్తాకారంలో ఆకారాలు ఏర్పడతాయి. వాటితో ఎన్ని రకాలైన ఆకారాలనైనా ఏర్పరచవచ్చు. ఈ ఆకారాలను ద్వైతప్రపంచంలో ఉన్న అనేక వస్తువులతో పోల్చవచ్చు. అలాతాన్ని బ్రహ్మతోనూ, ఆకారాలను ద్వైతప్రపంచంతోనూ పోలుస్తారు గౌడపాదాచార్యులవారు ఈ కారికల్లో. ఈసారి వేదాంతసారాన్ని అలాత దృష్టాంతంతో వివరించబోతున్నారు.

మనం అలాతానికి, బ్రహ్మకూ మధ్యనున్న పోలికలు చూద్దాము.

1. **ఏకం** - ఈ అలాతం చివర ప్రకాశిస్తుంది అని చూశాము. అది ఒకవైపు, ఒక చివర మాత్రమే ఉంటుంది. అది ఏకం, అద్వైతం. దాన్నుంచి వచ్చే ఆకారాలను ఆభాస అన్నాము. ఈ ఆభాస అనేకం, ద్వైతం. అలాగే బ్రహ్మ ఏకం, ద్వైతప్రపంచం అనేకం.

2. **స్వయంప్రకాశకం** - అలాతం స్వయంప్రకాశకం. అది వెలుగుతున్నదో లేదో గమనించటానికి ఇంకొక టార్చ్‌లైటు అవసరం లేదు. దాని కాంతే చాలు. అదే విధంగా బ్రహ్మ స్వయంజ్యోతి. బ్రహ్మవల్ల తక్కినవాటిని చూస్తాము కాని, బ్రహ్మను వేరేదానితో చూడము. దృగేవ నతు దృశ్యతే.

3. **కారణం** - మండుతున్న అలాతాన్ని తిప్పితే, అనేక ఆకారాలు ఏర్పడుతున్నాయి. అందువల్ల ఆకారాలు కార్యం, వాటికి అలాతం కారణం. అదే విధంగా జగత్తు కార్యం, బ్రహ్మ దానికి కారణం.

4. **స్వతంత్రం** – ఈ అలాతం చీకటిగదిలో స్వతంత్రంగా ప్రకాశించగలదు. కాని ఆకారాలకు విడిగా ఉనికి లేదు. నేను ఈ చీకటిగదినుంచి ఈ అలాతాన్ని తీసుకువెళతాను, ఈ ఆకారాలు వాటంతట అవి ఏర్పడనీ అని అనలేరు. అలాతం లేనిదే ఆకారాలు ఏర్పడలేవు. అదే విధంగా జగత్తు ఉన్నా లేకపోయినా బ్రహ్మ ఉంటుంది.

**ఏకమేవాద్వితీయమ్**

కాని బ్రహ్మ అనే కారణం లేకపోతే, జగత్తు అనే కార్యం లేదు.

| **అలాతం** | **ఆభాస** | **బ్రహ్మ** | **జగత్తు** |
|---|---|---|---|
| ఏకం | అనేకం | ఏకం | అనేకం |
| స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం | స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం |
| కారణం | కార్యం | కారణం | కార్యం |
| స్వతంత్రం | పరతంత్రం | స్వతంత్రం | పరతంత్రం |

ఇదే సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే –

**బ్రహ్మ సత్యం, ద్వైతప్రపంచం మిథ్య**

ఇక్కడ రెండు విషయాలను గమనించాలి మనం.

1. ఉదాహరణను ఎంతవరకూ తీసుకోవాలో అంతవరకే తీసుకోవాలి. అలాతం విషయంలో, దాన్ని కదిపితే అనేక ఆకారాలు ఏర్పడతాయి అన్నాము. అలాగే బ్రహ్మనుంచి అనేక ఆకారాలు వస్తాయి అన్నాము. అక్కడ అలాతం, బ్రహ్మ–ఏకం; ఆకారాలు, జగత్తు – అనేకం అన్నాం.

కాని బ్రహ్మ విషయం వచ్చేసరికి అలాతాన్ని కదిపినట్టు బ్రహ్మను కదపలేము. ఇక్కడ బ్రహ్మ కదలిక అంటే ఆలోచనల లేదా మాయ కదలిక. వ్యష్టిపరంగా చూస్తే ఆలోచనల కదలిక, చైతన్యంయొక్క కదలికగా కనిపిస్తుంది. జాగ్రత్, స్వప్నావస్థల్లో ఆలోచనలు ఉండటంవల్ల చైతన్యం కదులుతున్నట్టుగా కనిపిస్తుంది. కాని సుషుప్తికి వచ్చేసరికి మనస్సు పడుకుంటుంది కాబట్టి, ఆలోచనలు ఉండవు. ఆలోచనలు ఉండకపోతే, కదలిక తెలియదు. కదలిక తెలియకపోతే చైతన్య స్పందనం తెలియదు. అందువల్ల బాహ్యప్రపంచం (ఆకారాలు) తెలియదు. అందువల్ల చైతన్యానికి భిన్నంగా ప్రపంచం లేదు.

**చైతన్యం సత్యం, జగన్మిథ్యా**

నేనెవరు? నేను చైతన్యాన్ని. ఈ విషయం మర్చిపోకూడదు. వేదాంతం అంతా విని నేను మిథ్యాజగత్తును అనకూడదు.

**అవస్థాత్రయ తురీయ చైతన్యమ్ అహమస్మి**

ఈ సారం తంబూరా శ్రుతిలాగా మీ మనస్సులో నిరంతరం మెదులుతూనే ఉండాలి.

మొదటి అంశం - చైతన్యం అలాతం కదిలినట్టుగా నిజంగా కదలదు.

2. మొదట్లో అలాతం కారణం, ఆభాస కార్యం అన్నాము నిజమే. ఆభాస అంటే అలాతంనుంచి ఏర్పడిన ఆకారాలు. అందువల్ల అలాతానికీ-ఆభాసకీ కారణ-కార్య సంబంధం ఉంది అనికూడా అన్నాము. కాని తరువాత అలాతం కూడా కారణ -కార్య విలక్షణం అంటాము. ఎందుకంటే సంబంధం ఉండాలంటే రెండు వస్తువులు ఉండాలి. కాని అలాతాన్ని, ఆభాసను రెండు భిన్నవస్తువులుగా చూడలేము. అలాతం లేనిదే ఆభాసానికి విడిగా ఉనికి లేదు. చీకటిగదిలోంచి అలాతాన్ని తెచ్చేస్తే, ఆకారాలు వాటంతట అవి ఏర్పడవని చూశాము. అంటే అవి రెండు భిన్నవస్తువులు కావు, ఒకటే పదార్థానికి ఉన్న రెండు భిన్న పేర్లు.

**నామ ద్వయం, వస్తు ఏకమ్**

రెండు పేర్లు ఉన్నాయి కాని ఉన్నదొకటే వస్తువు అని ఇప్పటిదాకా అనేక ఉదాహరణలతో చూశాము. బంగారం-ఆభరణాల దృష్ట్యా చూశాము; మట్టి-కుండ పరంగా చూశాము. ఇప్పుడు అలాతం-ఆభాస పరంగా చూస్తాము. అంతే తేడా. అలాతం కదిలి ఆకారాలు ఏర్పడితే, కదిలినప్పుడు దాన్ని స్పందనం అంటుంది; అలాతం కదలకుండా ఆగిపోయినప్పుడు, ఆకారాలు కూడా ఆగిపోతాయి. అలా అలాతం ఆగితే దాన్ని శాంతి అంటారు. అందువల్ల ఈ ప్రకరణానికి అలాతశాంతి ప్రకరణం అని పేరు వచ్చింది.

అలాగే మొదట్లో బ్రహ్మ కారణమనీ, జగత్తు కార్యమనీ చెబుతుంది శాస్త్రం. శిష్యుని బుద్ధి సూక్ష్మమయ్యాక, కారణ-కార్య సంబంధం అంటూ లేదనీ, బ్రహ్మ, జగత్తు ఒకటే చైతన్యానికి ఉన్న రెండు పేర్లనీ చెబుతుంది. అలాతంతో చైతన్యాన్ని పోలిస్తే కదలికలేని అలాతం బ్రహ్మ, కదులుతున్నప్పుడు ఏర్పడిన ఆకారాలు జగత్తు. జగత్తు, బ్రహ్మ ఒకే చైతన్యానికి రెండు పేర్లయినప్పుడు, వాటిమధ్య కారణ-కార్య సంబంధానికి చోటేది? అందువల్ల బ్రహ్మ కారణకార్య విలక్షణం; ఆ బ్రహ్మను నేనే. ఇదీ ఈ కారికల సారాంశం. ఈ నేపథ్యంతో వీటిని చూద్దాము.

**కారిక 4.47**

**ఋజువక్రాదికాభాసమలాతస్పందితం యథా ।**

**గ్రహణగ్రాహకాభాసం విజ్ఞానస్పందితం తథా ॥**

**ఋజువక్రాదికాభాసమలాతస్పందితం యథా** - ఆభాసం అంటే ఆకారాలు; ఋజు అంటే నిలువుగా; వక్రం అంటే వంకరగా (వృత్తాకారంగా); స్పందితం అంటే కదిలినప్పుడు. అలాతం కదిలినప్పుడు ఒక చీకటిగదిలో నిలువు ఆకారాలు, వృత్తాకారాలు ఎలాగైతే ఏర్పడతాయో,

**గ్రహణగ్రాహకాభాసం విజ్ఞానస్పందితం తథా** – అదే విధంగా, చైతన్యం కదిలినట్టుగా ఉన్నప్పుడు ద్వైతం ఉన్నట్టుగా ఉంటుంది. ఆభాస అంటే ద్వైతభావనను కలుగజేసే ఆకారాలు అని చూశాము. ఇక్కడ ద్వైతం ప్రమాత–ప్రమేయం భేదం. గ్రహణం అంటే ప్రమేయం; గ్రాహకం అంటే ప్రమాత.

అలాతంనుంచి ఏర్పడిన ఆకారాలు ఎలాగైతే అలాతానికి భిన్నంగా లేవో, అదే విధంగా ఈ ప్రమాత–ప్రమేయం విభజన నిజంగా లేదు. మరయితే ఏమిటవి? అవి విజ్ఞానస్పందనం అంటే కదులుతున్నట్టుగా ఉన్న చైతన్యం మాత్రమే. చైతన్యంయొక్క కదలిక వ్యష్టిస్థాయిలో మనస్సులో ఉన్న అనేక ఆలోచనలవల్ల ఏర్పడితే, సమష్టి స్థాయిలో మాయవల్ల ఏర్పడుతుంది.

అలాతం కదిలితే – ఆకారాలు వస్తున్నాయి; చైతన్యం కదిలితే జగత్తు ఉంది. అన్వయ వ్యతిరేకంలో ఇది అన్వయం. తరువాత వచ్చే కారికలో వ్యతిరేకం వస్తుంది. అలాతం శాంతిస్తే, ఆకారాలు ఉండవు; చైతన్యం కదలకపోతే జగత్తు లేదు. సుషుప్తిలో జగత్తు ఉండదు. అందువల్ల చైతన్యం లేనట్టుగా అనిపిస్తుంది. కాని నిజంగా లేకుండా ఉండదు; లేనట్టుగా ఉంటుంది. ఇక్కడ అన్వయం చూశాము. అలాతం కదిలితే, ఆకారాలు ఏర్పడినట్టుగా, చైతన్యం కదిలితే జగత్తు ఉంటుంది.

## కారిక 4.48

**అస్పందమానమాలాతమనాభాసమజం యథా ।**
**అస్పందమానం విజ్ఞానమనాభాసమజం తథా ॥**

**అస్పందమానమాలాతమ్** – ఆలాతం అంటే అలాతమే. ఛందస్సుకోసం అలా వాడబడింది. ఈ అలాతం కదలకపోతే,

**అనాభాసమ్** – ఆకారాలు ఏర్పడవు. దీన్నిబట్టి ఒక విషయం స్పష్టమవుతున్నది. ఏమిటది? అలాతం కదిలితే ఆకారాలు ఏర్పడుతాయి; అలాతం కదలకపోతే ఆకారాలు ఏర్పడవు. దీన్ని వ్యతిరేక పద్ధతి అంటారు. ఆకారాలు ఏర్పడకపోతే,

**అజమ్** – ఈ అలాతాన్ని కారణం అనలేము. అజం అంటే కారణం కాదు. ఆకారాలు కార్యం. ఆకారాలు కార్యం అయితే, ఆ కార్యానికి కారణం అలాతం. కాని కార్యమే లేకపోతే, దాన్ని కారణం అనలేము.

**తథా** – అదే విధంగా,

**అస్పందమానం విజ్ఞానమ్** – ఈ చైతన్యం కదలకపోతే; అంటే వ్యష్టిస్థాయిలో ఆలోచనలు కదలకపోతే, సమష్టిస్థాయిలో మాయ పనిచేయకపోతే. వ్యష్టిలో ఆలోచనలు సుషుప్తిలో

ఆగిపోతాయి; సమష్టిలో ప్రళయంలో మాయ ద్వారా వచ్చిన జగత్తు లయమయిపోతుంది. అలా చైతన్యం కదలకపోతే,

**అనాభాసమ్** - బాహ్యప్రపంచం లేదు. ప్రమాత-ప్రమేయం; సబ్జెక్ట్-ఆబ్జెక్ట్ విభజన లేదు. అప్పుడు ద్వైతం ఉండదు. దాన్ని నిర్వికల్పకరూపం అంటారు.

**అజమ్** - ఈ చైతన్యాన్ని కారణం అనలేము. జగత్తనే కార్యం లేకపోతే చైతన్యం కారణం కాలేదు. మరయితే ఏం ఉంది? కార్యకారణ విలక్షణ చైతన్యం మాత్రమే ఉంది.

**చైతన్య సత్వే జగత్ సత్వమ్**
**చైతన్య స్పందన అభావే జగతః అభావః**

అందువల్ల చైతన్యానికి భిన్నంగా జగత్తు లేదు.

**కారిక 4.49**

**అలాతే స్పందమానే వై నాభాసా అన్యతోభువః ।**
**న తతోఽన్యత్ర నిస్స్పందాన్నాలాతం ప్రవిశంతి తే ॥**

అలాతంనుంచి వచ్చిన ఈ ఆకారాలను విశ్లేషిస్తే, వచ్చే జవాబులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. అలాతం కదిలితే ఆకారాలు వస్తున్నాయి, శాంతిస్తే ఆకారాలు మాయమవుతున్నాయి. అలాతం కదులుతున్నప్పుడు -

1. ఆకారాలు అలాతం లోపలినుంచి రావు
2. ఆకారాలు అలాతం బయటనుంచి రావు

అలాతం శాంతించినప్పుడు -

3. ఆకారాలు అలాతం బయటకు పోవు
4. ఆకారాలు అలాతం లోపలకు పోవు

ఈ నాలుగు వాక్యాలలోని ఆకారాలు, అలాతం పదాల బదులు జగత్తు, చైతన్య పరంగా చూస్తే ఇలా వస్తాయి.

చైతన్యం కదులుతున్నప్పుడు (మాయ ద్వారా సృష్టి జరిగినప్పుడు) -

1. ద్వైతప్రపంచం చైతన్యం లోపలినుంచి రాదు
2. ద్వైతప్రపంచం చైతన్యం బయటనుంచి రాదు

చైతన్యం శాంతించినప్పుడు (ప్రళయకాలంలో) -

3. ద్వైతప్రపంచం చైతన్యం బయటకు పోదు
4. ద్వైతప్రపంచం చైతన్యం లోపలకి పోదు

అంటే జగత్తుయొక్క సృష్టి గురించి తార్కికంగా మాట్లాడలేము. జగత్తుయొక్క రాకపోకలు తర్కానికి అందవు. దానికి క్రియాపదాన్ని వాడలేము. ఒక వస్తువు ఉంటే కదా, దానికి క్రియాపదం వాడేది. అటు ఆకారాలు కాని, ఇటు జగత్తు కాని లేకపోతే, వాటి రాకపోకలనే క్రియాపదాన్ని ఎలా వాడతారు?

కారికలు 49, 50లో అలాతం పరంగా ఈ వాక్యాలను చూస్తాము. ఈ నాలుగు వాక్యాలను కారిక 49లోనూ, కారిక 50లో మొదటి పాదంలోనూ చూస్తాము.

ముందు కారిక 4.50లోని మొదటి పాదం తీసుకుందాము.

**న నిర్గతా అలాతాత్తే** – 1. ఆకారాలు అలాతం లోపలినుంచి రావు.

**ఆభాసాః న అన్యతోభువః** – 2. ఆకారాలు అలాతం బయటనుంచి రావు. ఎప్పుడు?

**అలాతే స్పందమానే** – అలాతం కదులుతున్నప్పుడు.

మొదటి రెండు వాక్యాలూ వచ్చాయి. అలాతం కదులుతున్నప్పుడు ఆకారాలు అలాతం లోపల్నించీ రావు, బయటనుంచీ రావు. ఇప్పుడు అలాతం కదలనప్పుడు ఏమవుతుందో చూద్దాము.

**న తతః నిస్పందాత్ అన్యత్ర** – అలాతం కదలనప్పుడు, 3. ఆకారాలు అలాతం బయటకు పోవు.

**న అలాతం ప్రవిశంతి తే** – 4. ఆకారాలు అలాతం లోపలికి పోవు. రేడియోకు ఉన్న ఏరియల్‌ను రేడియో వినేటప్పుడు తీసి, రేడియో ఆపేసినప్పుడు ఆ ఏరియల్‌ను లోపలికి తోస్తాము. అదే విధంగా వానొచ్చినప్పుడు గొడుగును వాడతాము కాని, వాన ఆగిపోయినప్పుడు దాన్ని చిన్నగా మడిచి, హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుంటాము. కాని అలాతం ఉదాహరణలో ఆకారాలు లోపలికి పోవు.

అలాతం శాంతించినప్పుడు ఆకారాలు బయటకు పోవు, లోపలికి పోవు. ఇక్కడ వరకూ దృష్టాంతం అయింది. దీన్ని ద్రాష్టాంతానికి అన్వయించాలి. అంటే బ్రహ్మకు అన్వయించాలి.

**కారిక 4.50**

**న నిర్గతా అలాతాత్తే ద్రవ్యత్వాభావయోగతః ।**
**విజ్ఞానేఽపి తథైవ స్యురాభాసస్యావిశేషతః ॥**

**న నిర్గతా అలాతాత్తే** – దీన్ని ముందు కారికతో కలిపి చూసేశాము. 1. ఆకారాలు అలాతం లోపలినుంచి రావు.

ఈ ఆకారాల గురించి ఎందుకు వివరించలేము? మనం ప్రాథమిక ప్రశ్న జోలికి పోలేదు కాబట్టి. అసలు ఈ ఆకారాలు ఉన్నాయా అని ఎప్పుడన్నా ఆలోచించామా? లేదు. ఆకారాలు ఉన్నాయని అనుకుంటున్నాము.

బంగారు-ఆభరణాల ఉదాహరణ దశలవారిగా చాలాసార్లు చూశాము. ఆభరణాలకు బంగారం లేకుండా విడిగా ఉనికి లేదనీ, అందువల్ల అసలు ఆభరణం అనే పదార్థం లేదనీ, అవి కేవలం నామరూపాలు మాత్రమేననీ చూశాము. జగత్తు విషయమూ అంతే. మనం నమ్మినా, నమ్మలేకపోయినా, జగత్తు అనే పదార్థం విడిగా లేదు.

**ద్రవ్యత్వాభావయోగతః** - ఈ సమస్య ఎందుకు వస్తున్నదీ అంటే, ఆకారాలకు విడిగా ఉనికి లేదు కాబట్టి. అది నామరూపాత్మకం మాత్రమే, వస్తువు కాదు. వస్తువే లేనప్పుడు, దాని రాకపోకల గురించి ఎలా మాట్లాడతారు? ఒక వ్యక్తి రాకపోకల గురించి మాట్లాడాలంటే ఆ వ్యక్తి ఉండాలి కదా! ఉనికే లేని ఆకారాలయొక్క రాకపోకల గురించి ఎలా మాట్లాడతారు? ఉనికి అలాతానిది. అలాగే జగత్తుయొక్క ఉనికి చైతన్యానిది. అందువల్ల ఆకారాలు మిథ్య. ద్రవ్య అభావ యోగతః అంటే ఆకారాలు మిథ్య. అవి మిథ్యా నామరూపాలు మాత్రమే. ఈ ఉదాహరణ అర్థమయితే, జగత్తును అర్థం చేసుకోవటం తేలిక.

ఇప్పుడు దృష్టాంతంనుంచి ద్రాష్టాంతానికి వెళుతున్నారు.

**విజ్ఞానేఽ పి తథైవ స్యుః** - చైతన్యం విషయంలో కూడా అదే వాదన వస్తుంది. తథా ఏవ స్యుః అంటే అదే అర్థం.

**ఆభాసస్యావిశేషతః** - ఎందుకంటే, ఈ ఆకారాల లాగానే ఈ జగత్తు కూడా ఆభాస. అవిశేషతః అంటే సమానం. ఏమిటి సమానం? ఆభాస సమానం. ఆభాస అంటే ఏమిటి? కనిపించే రూపాలు. చైతన్యం కదిలితే ఆకాశంలా కనిపిస్తుంది; చైతన్యం కదిలితే వాయువులాగా కనిపిస్తుంది; చైతన్యం కదిలితే (అంటే మాయద్వారా సృష్టి జరిగినప్పుడు) మూడు ప్రపంచాలుగా కనిపిస్తుంది. ఆ విధంగా చైతన్యం కదిలినప్పుడు మనకు భ్రమను కలుగజేస్తుంది. ఈ భ్రమ సత్యమనుకుని పొరపాటు పడి, సంసారంలో అవస్థలు పడుతున్నాము.

ఇదంతా అర్థం కావటంలేదు మహాప్రభో అంటే ఇది తేలిక అని ఎవరన్నారు? ఇది అర్థం చేసుకోవటం కష్టమే కాని ఇది అంతిమసత్యం. ఎవరంటున్నారు? గౌడపాదాచార్యులవారు అంటున్నారు.

### కారిక 4.51

**విజ్ఞానే స్పందమానే వై నాభాసా అన్యతోభువః ।**
**న తతోఽ న్యత్ర నిస్పుందాన్న విజ్ఞానం విశంతి తే ॥**

అలాతం, ఆకారాల విషయాల్లో చూసిన నాలుగు వాక్యాలను ఇప్పుడు చైతన్యం, జగత్తుల పరంగా చూద్దాము. దృష్టాంతంలాగానే ద్రాష్టాంతం కూడా కొనసాగుతుంది కాబట్టి, కారికలు 51, 52 ఇంచుమించుగా కారికలు 49, 50 లాగానే ఉంటాయి. ఇక్కడ కూడా చైతన్యం, జగత్తుల గురించి కారిక 51లో మూడు వాక్యాలు, కారిక 52లో ఒక వాక్యం వస్తాయి. అక్కడ చేసినట్టే, ముందు 51లో మొదటి వాక్యం తీసుకుంటాము.

**న నిర్గతాస్తే విజ్ఞానాత్** – 1. ద్వైతప్రపంచం, చైతన్యం లోపలినుంచి రాదు.

**ఆభాసా న అన్యతోభువః** – 2. ద్వైతప్రపంచం, చైతన్యం బయటనుంచి రాదు. ఎప్పుడు?

**విజ్ఞానే స్పందమానే** – చైతన్యం కదులుతున్నప్పుడు.

మొదటి రెండు వాక్యాలూ వచ్చాయి. చైతన్యం కదులుతున్నప్పుడు ద్వైతప్రపంచం లోపల్నుంచీ రాదు, బయటనుంచీ రాదు. ఇప్పుడు చైతన్యం కదలనప్పుడు ఏమవుతుందో చూద్దాము.

**న తతః నిస్పందాత్ అన్యత్ర** – చైతన్యం కదలనప్పుడు (ప్రళయకాలంలో), 3. ద్వైతప్రపంచం చైతన్యం బయటకు పోదు.

**న విజ్ఞానం విశంతి తే** – 4. ద్వైతప్రపంచం చైతన్యం లోపలకు పోదు.

అందువల్ల ఈ జగత్తు ఎలా వచ్చిందో, ఎలా పోయిందో చెప్పలేము. లేదా ఎక్కడనుంచి వచ్చిందో, ఎక్కడికి పోతుందో చెప్పలేము. ఒక్కముక్కలో చెప్పాలంటే అది ఒక అనూహ్యమైన, వర్ణనాతీతమైన అనుభవం.

### కారిక 4.52

**న నిర్గతాస్తే విజ్ఞానాద్ద్రవ్యత్వాభావయోగతః ।**
**కార్యకారణతాఽభావాద్యతోఽచింత్యాస్సదైవ తే ॥**

**న నిర్గతాస్తే విజ్ఞానాత్** – దీన్ని ముందు కారికతో కలిపి చూసేశాము. 1. ద్వైతప్రపంచం చైతన్యం లోపలనుంచి రాదు.

పైపైన చూస్తే ద్వైతప్రపంచానికీ, చైతన్యానికీ మధ్య కార్య–కారణ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తుంది కాని లోతుగా విశ్లేషిస్తే, దాన్ని తార్కికంగా నిరూపించలేమని తెలుస్తుంది. ఏదైనా సంబంధం ఉండాలంటే, రెండు వస్తువులు ఉండాలి. ఇక్కడ అలాత దృష్టాంతం పరంగా చూస్తే రెండు వస్తువులు ఉన్నాయి కదా అనవచ్చు మీరు. అవి అలాతం, ఆకారాలు అంటారు మీరు. కాని ఆకారాలకు అలాతం లేకుండా భిన్నంగా ఉనికి లేదు. రెండు పేర్లు ఉండేసరికి, రెండు భిన్నవస్తువులు ఉన్నాయనుకుని పొరపాటు పడతాము. కాని అది తప్పు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**ద్రవ్యత్వాభావయోగతః** – జగత్తుకు విడిగా ఉనికి లేదు, అది మిథ్యా నామరూపాలు మాత్రమే.

**కార్యకారణతాఽభావాత్** – రెండు భిన్నవస్తువులు లేవు కాబట్టి, వాటి మధ్య కార్యకారణ సంబంధం గురించి మాట్లాడలేము. అద్వైతంలో ఉన్నదొకటే. సంబంధానికి చోటులేదు. చైతన్యం కదిలితే జగత్తు అంటాము. కనబడని చైతన్యాన్ని కనబడే జగత్తు అని ఎలా అనగలరు అంటే సైన్స్ చెప్పేదీ అదే కదా! సైన్స్‌లో కనబడని శక్తి కనబడే పదార్థంగా మారగా లేనిది, కనబడని చైతన్యం కనబడే ద్వైతప్రపంచంగా ఎందుకు మారలేదు? ఇటువంటి జగత్తు స్వరూపం ఏమిటి?

**అచింత్యాః తే యతః సదా ఏవ** – అందువలన ఎప్పటికీ అనిర్వచనీయం మాత్రమే. తార్కికంగా నిర్వచించలేనిదాన్ని మిథ్య అంటారు. దానికే గౌడపాదాచార్యులవారు అచింత్యాః అంటున్నారు. జగత్తు అనుభవంలోకి వస్తుంది కాని దాన్ని తార్కికంగా నిర్వచించలేము. విడిగా ఉనికి లేదు కాని అనుభవంలోకి వస్తుంది. స్వప్నవస్తువులు నిజంగా లేకపోయినా, మనం వాటిని అనుభవించినట్టే, జాగ్రత్ ప్రపంచం నిజంగా లేకపోయినా కూడా దాన్ని అనుభవిస్తున్నాము. అలా ఉంటే దాన్ని మిథ్య అంటారు.

**అజాతివాదము సత్యము.**

**కారిక 4.53**

**ద్రవ్యం ద్రవ్యస్య హేతుస్స్యాదన్యదన్యస్య చైవ హి ।**
**ద్రవ్యత్వమన్యభావో వా ధర్మాణాం నోపపద్యతే ॥**

ఈ కారిక అంతకుముందు కారికలోని రెండవ పాదానికి విశ్లేషణ. అది కార్యకారణ అభావాత్ – కార్యకారణ సంబంధం లేదు. ఎందుకు?

దీనికి మనం వివరణ చాలాసార్లే చూశాము కాని ఇక్కడ గౌడపాదాచార్యులవారు వివరణనిస్తున్నారు. ఏదైనా సంబంధం ఉండాలి అంటే రెండు వస్తువులు ఉండాలి. రెండు వస్తువులు ఉండటమే కాదు, వాటికి విడిగా ఉనికి ఉండాలి. కుండ, మట్టిలాగా ఉండకూడదు. కుండ, మట్టి రెండు భిన్నవస్తువులు కాదు, అవి భిన్ననామరూపాలు మాత్రమే అని చూశాము.

**వస్తు ఏకం నామమ్ అనేకమ్**

రెండు వస్తువులు అంటే రెండు భిన్నవస్తువులు అయివుండాలి. ఉదాహరణకు పుస్తకం, గడియారం. బల్లమీద ఈ రెండూ పెట్టుకుంటారు మీరు. పుస్తకం తీసేసినా గడియారం ఉంటుంది; అలాగే గడియారం తీసేసినా పుస్తకం ఉంటుంది. కాని ఈ నియమం కుండ, మట్టికి చెల్లదు. మట్టి తీసేస్తే, కుండకు విడిగా ఉనికి లేదు. అందువల్ల వాటి మధ్య సంబంధం గురించి మాట్లాడలేము.

**అన్యత్ ద్రవ్యం అన్యస్య ద్రవస్య హేతుః స్యాత్** – ఒక వస్తువుకు ఇంకొక వస్తువుకు మధ్య భిన్నత్వం ఉంటేనే కారణ–కార్య సంబంధం కుదురుతుంది.

జగత్తు విషయంలో బ్రహ్మకు భిన్నంగా జగత్తు ఉందని నిరూపించలేరు.

**ధర్మాణామ్ ద్రవ్యత్వం న ఉపపద్యతే** – ధర్మాణామ్ అంటే ఇక్కడ జగత్తులోని వస్తువులు. ద్రవ్యత్వం నాస్తి అంటే వాటికి విడిగా ఉనికి లేదు. జగత్తులోని వస్తువులకు విడిగా ఉనికి లేదు.

**అన్యభావః** – అందువల్ల వాటిని విడిగా వస్తువుల కింద తీసుకోకూడదు. వాటికి వేరే వస్తువుతో కార్య–కారణ సంబంధం ఉందనుకోకూడదు. అందువల్ల జగత్తు కార్యం కాదు, బ్రహ్మ కారణం కాదు. మరయితే ఏం ఉంది?

**కార్య–కారణ విలక్షణ బ్రహ్మ**

మంత్రం 7లో **అద్వైతమ్** పదంతో చూశాము. తురీయం అంటే కార్యకారణ విలక్షణ తురీయం. ఆ తురీయం ఎక్కడ ఉంది అని అడిగితే దిక్కులు చూడకూడదు. ఆ తురీయాన్ని నేనే అని చెప్పగలగాలి.

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి**

ఈ వాక్యాన్ని ఆత్మస్థైర్యంతో చెప్పగలిగితే, మాండూక్య కారికలు మీకు బాగా అర్థమయ్యాయన్నమాట. కార్యకారణ విలక్షణ తురీయం అని అంటే మాత్రం మీరు మాండూక్య కారికలను ఇంకా, ఇంకా నేర్చుకోవాలన్నమాట. ఇవన్నీ ఏడవ మంత్రాన్ని విశ్లేషించే అద్భుతమైన కారికలు.

**కారిక 4.54**

**ఏవం న చిత్తజా ధర్మాశ్చిత్తం వాఽపి న ధర్మజమ్ ।**

**ఏవం హేతుఫలాజాతిం ప్రవిశంతి మనీషిణః ॥**

ఈ అలాతశాంతి దృష్టాంతం ప్రకారం, ఈ విధంగా ఏ వస్తువూ కూడా దేన్నుంచీ పుట్టదు. పదార్థం పుట్టలేదు కాని జగత్తుని ఆరోపిస్తున్నాము అంటే ఆభాస చేస్తున్నాము.

**ఏవమ్** – ఈ విధంగా,

**ధర్మాః న చిత్తజాః** – ధర్మాః అంటే జగత్తులో ఉన్న విషయవస్తువులు, జీవులు. న చిత్తజాః అంటే బ్రహ్మనుంచి పుట్టలేదు. అందువల్ల బ్రహ్మనుంచి జీవ–జగత్తు రాలేదు, భోక్త–భోగ్యం రాలేదు, చర – అచర ప్రపంచం రాలేదు. అంతేకాదు వేరే దేన్నుంచీ బ్రహ్మ రాలేదు.

**చిత్తం వాఽపి న ధర్మజమ్** – ఇక్కడ చిత్తం అంటే చైతన్యం అని మర్చిపోకూడదు. చైతన్యం కూడా వస్తువునుంచి పుట్టలేదు.

నిజానికి ముందు పదార్థం ఉంది, చైతన్యం తరువాత వచ్చింది అంటుంది సైన్స్. ఆ విధంగా భావిస్తారు కూడా కొందరు దార్శనికులు. అంటే చైతన్యం, పదార్థంనుంచి వచ్చింది అంటారు వారు. కాని ఇది నిజంకాదు, పొరపాటు మాత్రమే అంటారు గౌడపాదాచార్యులవారు. ఉన్నదొకటే చైతన్యం. దానిని పదార్థంగా పొరపాటు పడతారు అంటారు. అందువల్ల చైతన్యం కూడా ద్వైతప్రపంచంనుంచి పుట్టలేదు అని ఎవరైతే అర్థం చేసుకుంటారో, అతనే జ్ఞాని.

**మనీషిణః (ప్రవిశంతి)** – జ్ఞాని 'నేను తురీయాన్ని,' అని అర్థం చేసుకుంటాడు. ఎప్పుడైతే తను తురీయం అని అర్థం చేసుకుంటాడో అప్పుడే తను ప్రథమ పాదమైన విశ్వ కాదు; ద్వితీయ పాదమైన తైజస కాదు; తృతీయ పాదమైన ప్రాజ్ఞ కాదు అని అర్థం చేసుకుంటాడు. మొదటి రెండు పాదాలూ కార్యం, మూడవ పాదం కారణం. జ్ఞాని నాలుగవ పాదం.

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి**

**హేతు ఫల అజాతిమ్** – ఈ జ్ఞాని హేతువు, ఫలం రెండూ పుట్టలేదు అంటాడు. హేతువు అంటే కారణం అనీ, ఫలం అంటే కార్యం అనీ చూశాము. కారణ–కార్యాలకు మీరు అతీతంగా ఎదిగారంటే, కాలతత్త్వానికి మీరు అతీతంగా ఎదిగినట్టు అర్థం. ఎందుకంటే ఇది కాలంలో వస్తుంది. ఉదాహరణకు కొన్ని నెలల ముందు విత్తనం కారణం, ఇప్పుడు అది వృక్షం అయింది. నిజానికి విత్తనమే వృక్షం అయింది కాబట్టి రెండూ ఒకటే. కాకపోతే గతంలో ఏదైతే కారణమైందో, అదే ఇప్పుడు కార్యమైంది. అందువల్ల కాలతత్త్వం గురించి మాట్లాడకుండా కారణ–కార్య సంబంధం గురించి మాట్లాడలేము. కారణ–కార్యాలకు అతీతంగా ఎదిగితే, కాలానికి కూడా అతీతంగా ఎదిగినట్టు అర్థం. అందువల్ల జ్ఞాని నేను కాలాతీత తురీయాన్ని అంటాడు.

## కారిక 4.55

**యావద్ధేతుఫలావేశస్తావద్ధేతుఫలోదయః ।**
**క్షీణే హేతుఫలావేశే నాస్తి హేతుఫలోద్భవః ॥**

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి**

ఈ సత్యానికి ఎదగనంతవరకూ, ఎవరైనా సరే, సంసారంనుంచి తప్పించుకోలేరు. ఈ జ్ఞానం మోక్షం పొందే అనేక మార్గాలలో ఒకటి కాదు; ఈ జ్ఞానం ఒక్కటే మోక్షం పొందే మార్గం. అంటే మాండూక్యోపనిషత్తు నేర్చుకుంటే మోక్షం పొందుతారు. ఎవరైనా 'ఇది అర్థం చేసుకోవటం చాలా కష్టంగా ఉంది, నేను దీన్ని వదిలేసి వేరే మార్గంలో ప్రయత్నించవచ్చా?' అని అడిగితే, వేరే మార్గం లేదని ఖచ్చితంగా చెబుతారు గౌడపాదాచార్యులవారు.

మరయితే అతనేం చేయాలి? అది అర్థమవటం కష్టమయితే, అది తేలికగా అర్థమవటానికి తనను తాను సంసిద్ధం చేసుకోవాలి. ఒకసారి అధ్యయనం చేస్తే అర్థం కాకపోతే, మళ్ళీ చేయాలి. రెండోసారి కూడా అర్థం కాకపోతే, చేస్తూనే ఉండాలి. అసలు ఈ జన్మలోనే అర్థం కాకపోతే, వచ్చే జన్మలోనైనా అర్థం చేసుకోవాలి. అప్పుడు అర్థం కాకపోతే, ఎన్ని జన్మలెత్తినా జ్ఞానం పొందటానికి ప్రయత్నిస్తూనే ఉండాలి.

ఈ సిద్ధాంతం వెనకనున్న సత్యం – ఆత్మజ్ఞానం పొందటానికి వేదాంతబోధకు రాక తప్పదు. సంసారంనుంచి విముక్తి పొందాలంటే ఇదొక్కటే మార్గం. మీరెందుకు ఇంత ఉన్మాదులుగా ప్రవర్తిస్తున్నారు. మీరు మాండూక్యం బోధించాలని కంకణం కట్టుకుని, దానికి సాధకులను ఆకర్షించటానికా?

గౌడపాదాచార్యులవారు ఇది ఉన్మాదం కాదని, దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలనీ అంటున్నారు. ఒకసారి ఈ విషయాన్నే పరిశీలిద్దాము. ఎవరైనా నేను తురీయచైతన్యాన్ని అనే జ్ఞానం పొందకపోతే, అతను ఖచ్చితంగా పొరపాటు పడతాడు. ఏమని? నేను విశ్వను లేదా తైజసను లేదా ప్రాజ్ఞను అంటాడు. ఎప్పుడైతే తను విశ్వ అనుకుంటాడో అప్పుడే స్థూలశరీర అభిమానం పెంచుకుని నిస్సహాయంగా కర్త, భోక్త, ప్రమాత అవుతాడు. వద్దనుకున్నా, జాగ్రత్‌ప్రపంచంతో వ్యవహారం నడపక తప్పదు.

ఎప్పుడైతే తను విశ్వ అనుకుంటాడో, అప్పుడే పరిచ్ఛేదం తప్పదు. **అవిద్య (అజ్ఞానం) పరిచ్ఛేద భావన**కు దారితీస్తుంది. తను పరిమితి ఉన్న జీవిని అనుకునేసరికి, దాన్నుంచి బయటపడాలనే కోరిక బయలుదేరుతుంది. దాన్ని **కామం** అంటారు. కామం అతన్ని **కర్త**గా చేస్తుంది. కర్తగా అతను అనేక **కర్మలు** చేస్తాడు. అతను చేసిన కర్మలకు **ఫలం** రాకతప్పదు. ఆ ఫలం పుణ్య, పాపాలరూపంలో వస్తుంది. ఆ ఫలాన్ని అనుభవించటానికి మళ్ళీ జన్మలు ఎత్తక తప్పదు. దీన్ని పునరపి జననం, పునరపి మరణం అంటారు. ఈ ఏడు దశలను మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము. అవి –

అవిద్య → పరిచ్ఛేదం → కామం → కర్త → కర్మ → ఫలం → పునరపి జననం, పునరపి మరణం = సంసారం.

మొదటిదశ, ఆఖరిదశ చూస్తే అవిద్య = సంసారం.

అతను కర్మలనే ఈ విషవలయంలో చిక్కుకుని తిరుగుతూనే ఉంటాడు. జీవితం హాయిగా ఉంటే ఆ విషవలయం మెర్రీగో రౌండులాగానే ఉంటుంది, కాని ఎప్పుడైతే పరిస్థితులు మీ చేయి జారిపోతాయో, అప్పుడే అది సారీగో రౌండు అవుతుంది.

అందువల్ల మీరు విశ్వ లేదా తైజస అనుకుంటున్నంత వరకూ ఈ సంసారచక్రంలో పడి తిరగక తప్పదు. మీరు ప్రాజ్ఞ అనుకున్నా, శాశ్వత పరిష్కారం ఉండదు. సుషుప్తిలో తాత్కాలికంగా

ఉపశమనం కలుగుతుంది అంతే. కాని అది కూడా అందరికీ దొరకదు. జీవితం సమస్యల మయంగా ఉంటే గాఢనిద్ర దరిదాపులకు కూడా రాదు. ఒకవేళ గాఢనిద్ర పట్టినా, దాన్నుంచి లేవగానే, మీ సమస్యలు మేమున్నామంటూ వెంటనే చుట్టుముట్టుతాయి.

ఈ సంసారచక్రంనుంచి బయటపడే మార్గం ఏమిటి? మీరు మెర్రీగో రౌండు ఎక్కి హాయిగా తిరుగుతుండగా, కిందికి చూస్తే దాన్ని తిప్పే అతను ఎక్కడికో వెళ్ళిపోయాడని గమనిస్తారు. ఆ మెర్రీగో రౌండు కాస్తా సారీగో రౌండు అవుతుంది. దాన్నుంచి బయటపడటం ఎలా? దానిలోంచి బయటకు దూకటమే.

ఇదే సూత్రాన్ని సంసారచక్రానికి కూడా అన్వయించాలి అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. సంసారచక్రంనుంచి బయటపడాలంటే, దాన్నుంచి బయటకు దూకాలి. బయటకు దూకాలంటే, ఆత్మజ్ఞానం పొందాలి. అదొక్కటే మార్గం, వేరే మార్గాలు లేవు, ఉన్నాయనుకుంటే అది పొరపాటు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎండాకాలంలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుంటే, అతి చల్లని పానీయాన్ని తాగినా, ఐస్‌క్రీమ్ తిన్నా వాటివల్ల కలిగే ఉపశమనం తాత్కాలికమే కాని శాశ్వత పరిష్కారం దొరకదు. అదే విధంగా వేరే మార్గాలు శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వవు. లేదు మాకు దొరుకుతాయి అంటే '**ఆల్ ది బెస్ట్**,' సంతోషంగా వెళ్ళండి కాని ఎప్పటికైనా మీరు తిరిగిరాక తప్పదు, అప్పుడు నేను మిమ్మల్ని నిందించకుండా మీకు మాండూక్యోపనిషత్తు, కారికలతో పాటు నేర్పిస్తాను అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**యావద్ధేతుఫలావేశో** – హేతుఫలాలతో ఎంతవరకూ మమేకం చెందుతారో,

**తావద్ధేతుఫలోదయః** – అంతవరకు హేతుఫలాలు పుడుతూనే ఉంటాయి. అంటే కర్మ చేస్తూనే ఉంటారు, దాని ఫలం వస్తూనే ఉంటుంది.

మీరు, ఎప్పుడైనా జ్యోతిష్కుని దగ్గరకు వెళితే, అతను, 'మీ గ్రహబలం బాగాలేదు. మీరు పాముని చంపారు,' అంటాడు. పాము కాకపోతే ఇంకేదో పాపపు కర్మ చేశారు, దానికి ప్రాయశ్చిత్త కర్మ చేయాలి అంటాడు. అంటే మీరు గతంలో చేసిన కర్మ మిమ్మల్ని వర్తమానంలో పట్టి పీడిస్తున్నది. అతను మిమ్మల్ని వర్తమానంలో చేయమని చెప్పే ప్రాయశ్చిత్తకర్మ మీ భవిష్యత్తును మెరుగుపరుస్తుందని ఆశిస్తారు. ఇక్కడే ఒక నిరంతర సంసారం కనిపిస్తున్నది. మీ గతం మీ వర్తమానాన్ని నిర్దేశిస్తుంది, మీ వర్తమానంలో ప్రాయశ్చిత్తకర్మ చేయటం ద్వారా భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని ప్రయత్నిస్తారు.

**కృతి మహోదదౌ పతన కారణం ఫలమశాశ్వతం గతినిరోధకమ్**

దీనికి అంతెక్కడ? ప్రారబ్ధకర్మను తప్పించుకోలేరు. తావద్ – అంతవరకూ; హేతు ఫలోదయః – కారణ–కార్య ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. ఈ ప్రవాహం చాలా శక్తివంతమైనది. దీన్నుంచి తప్పించుకోవటానికి ఒకటే మార్గం ఉంది.

**అనాది అవిద్యా వాసనయా** – ఈ కాలచక్రం అనాదిగా వస్తున్న అజ్ఞానంవల్ల కొనసాగుతున్నది. ఈ కాలచక్రాన్ని మీరు ఆపలేరు. దాన్నించి బయటకు దూకటం ఒక్కటే మార్గం.

**క్షీణే హేతుఫలావేశః** – కారణ–కార్య సంబంధంమీద మీ తపన ఎప్పుడు పోతుందో,

**హేతుఫలోద్భవః నాస్తి** – అప్పుడే కారణ–కార్య వృత్తం మీకు కొనసాగదు. హేతు–ఫల ప్రవాహంనుంచి మీరు తప్పించుకుంటారు. ఇది మాండూక్యోపనిషత్తు సారం.

**స్థూలశరీర అభిమానం మిమ్మల్ని విశ్వ చేస్తుంది**
**సూక్ష్మశరీర అభిమానం మిమ్మల్ని తైజస చేస్తుంది**
**కారణశరీర అభిమానం మిమ్మల్ని ప్రాజ్ఞ చేస్తుంది**

ఈ వృత్తంనుంచి బయటపడాలంటే ఈ అభిమాన త్రయాన్ని వదులుకోవాలి. అంటే శరీరాలని నాశనం చేయనవసరం లేదు, వాటిమీద ఉన్న అభిమానాన్ని త్యాగం చేయాలి అంతే. అప్పుడు మీరు కాలాతీతంగా ఎదుగుతారు. ప్రాజ్ఞలోనే కాలవిభజన ఉండదు, ఇంక అలాంటప్పుడు తురీయం గురించి చెప్పేదేమున్నది?

ఈ అభిమానాన్ని ఎలా వదులుకోవాలి? గౌడపాదాచార్యులవారు అదెలాగో ఇక్కడ చెప్పరు. దీన్ని వేరే చోటునుంచి తెచ్చుకోవాలి. శరీర అభిమానం ఎందుకు ఏర్పడుతుంది? తురీయ అజ్ఞానంవల్ల.

తురీయ అజ్ఞానంవల్ల శరీర అభిమానం ఏర్పడితే, తురీయజ్ఞానం పొందితే సహజంగానే శరీర అభిమానం పోతుంది. స్వప్నంలో ఉండగా, స్వప్నశరీర అభిమానం ఉంటుంది, కాని స్వప్నంనుంచి లేవగానే దానిమీద అభిమానం పోతుంది. అలాగే, జాగ్రదావస్థలో ఉండగా జాగ్రత్ శరీర అభిమానం ఉంటుంది. కాని తురీయానికి లేవగానే, జాగ్రత్ శరీర అభిమానం పోతుంది.

చిన్ముద్ర సారం అదే. ఒక్కక్షణంలో వేదాంతసారం అంతా వచ్చేస్తుంది. మన చేతివేళ్ళు తీసుకుంటే, బొటనవేలు పరమాత్మను, చూపుడువేలు జీవాత్మను, తక్కిన మూడు వేళ్ళు మూడు శరీరాలను సూచిస్తాయి. జీవాత్మ అనే చూపుడువేలు ఎక్కువగా మూడు శరీరాలు అనే తక్కిన వేళ్ళతో కలిసి ఉంటుంది ఎప్పుడూ. అలా వాటితో కలిసి ఉన్నంతవరకూ సంసారం తప్పదు. దాన్నుంచి మోక్షం రావాలంటే జీవాత్మ వేలును పరమాత్మ వేలుతో కలపాలి. అదే చిన్ముద్ర. చిన్ముద్ర వేస్తే వృత్తాకారం కనిపిస్తుంది. జీవాత్మ, పరమాత్మ ఐక్యం అర్థమయితే పూర్ణత్వం ఏర్పడుతుంది.

**కారిక 4.56**

**యావద్ధేతుఫలావేశస్సంసారస్తావదాయతః ।**
**క్షీణే హేతుఫలావేశే సంసారం న ప్రపద్యతే ॥**

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఒక తీవ్రమైన హెచ్చరిక చేస్తున్నారు. మీరు కర్తగా ఉంటే, అనేక కర్మలు చేస్తారు. వాటి ఫలాలను భవిష్యత్తులో అనుభవించాలని చూస్తారు. అంటే ఇప్పుడు కర్తగా చేసిన పనుల వల్ల భవిష్యత్తులో మంచి భోక్త అవాలని ఆశిస్తారు. భవిష్యత్తులో మంచి ఇల్లు, మంచి భార్య రావాలని ఆశిస్తారు.

భవిష్యత్తులో భోక్తగా ఆనందించాలనుకోవటంవల్ల ఇప్పుడు కర్తగా మీరు పూర్తిగా తృప్తి చెందరు. భవిష్యత్తులో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, భావపరంగా, వృత్తిపరంగా ఆనందంగా ఉండటానికే మీ కృషి అంతా. అలాగని భవిష్యత్తులోని భోక్తను, నువ్వు ఆనందంగా ఉన్నావా అని అప్పుడు అడిగితే, అతను, 'అవును, నేను చాలా ఆనందంగా ఉన్నాను,' అంటాడా? ఇంకా ఏదో కొరత మిగిలే ఉంటుంది అతనిలో. దీనికి అంతెక్కడ అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

ఒక విషయం మీకు ఖచ్చితంగా చెప్పగలను అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఏమిటది? మీరు ఆనందంగా ఉండాలంటే, ఇప్పుడు ఉంటేనే ఉన్నట్టు. భవిష్యత్తులో ఆనందంగా ఉంటాననుకోవటం భ్రమ. **నౌ ఆర్ నెవ్వర్** అంటారు ఇంగ్లీషులో. ఇప్పుడు కాకపోతే, ఎప్పటికీ కారు. భవిష్యత్తులో ఆనందంకోసం పరుగులు తీయటం ఎండమావుల వెంట పరుగులు తీయటమే అవుతుంది. అందువల్ల ఇప్పుడే ఆనందంగా ఉండటం నేర్చుకోండి. ఎవరంటున్నారు అలా? గౌడపాదాచార్యులవారు అంటున్నారు.

**యావద్ధేతుఫలావేశో** – కర్మ–ఫలం వృత్తంలో మీరు తిరుగుతున్నంతసేపు; అంటే నేటి కర్తా – రేపటి ఆనందభోక్తా వృత్తంలో,

**తావత్** – అంతవరకూ

**సంసారః ఆయతః** – సంసారం కొనసాగుతూనే ఉంటుంది. అంతకుముందు బ్రహ్మచారీ సంసారి అయితే ఇప్పుడు గృహస్థసంసారి; ఇప్పుడు గృహస్థసంసారి అయితే తండ్రిగా సంసారి, తర్వాత తాతగా సంసారి. అలా కొనసాగుతూనే ఉంటుంది.

పిల్లలకు పిల్లలు పుట్టాక కూడా మన సంసారతాపత్రయం పోదు. పిల్లలని సరిగ్గా పెంచటంలేదని మన పిల్లలను సతాయిస్తాము. ఇప్పుడైతే భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయటంవల్ల బామ్మా, తాతలకు మనవళ్ళను సాకటం తప్పటం లేదు. అందువల్ల రిటైరయ్యాక ఉపనిషత్తులు నేర్చుకుందామనుకున్నా ఆ ప్రణాళిక సాగదు. బాధ్యతలు తీరాక వేదాంతం నేర్చుకుందామనుకోవటం ఎలా ఉంటుందంటే అలలు ఆగాక సముద్రస్నానం చేస్తాను

అన్నట్టు ఉంటుంది. ఎవరంటున్నారు? గౌడపాదాచార్యులవారు అంటున్నారు.

**క్షీణే హేతుఫలావేశే** – ఈ కర్తా, భోక్తా వృత్తంనుంచి బయటపడితే,

**సంసారం న ప్రపద్యతే** – సంసారం బాధించదు.

ఈ వృత్తంనుంచి బయటపడాలంటే వేదాంతం ఒక్కటే మార్గం. వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. వేదాంతం 'నువ్వు కర్తవా?' అని ప్రశ్నిస్తుంది. కర్మఫలం వృత్తం కర్తతో పెనవేసుకుని ఉంటుంది. కర్తగా ఉన్నంతవరకూ ఈ మూడు శరీరాల అభిమానం ఉంటుంది. 'నేనెవరు?' అని ప్రశ్నించుకుంటే మాండూక్యం నేర్చుకుంటే విశ్వ, తైజస, ప్రాజ్ఞులు నేను వేసుకునే మూడు వేషాలనీ, నేను తురీయాన్ని అనీ అర్థమవుతుంది.

**అకర్తా అభోక్తా కర్మఫల సంబంధరహిత తురీయ చైతన్యమ్ అహమస్మి**

ఈ జ్ఞానం ఒక్క వేదాంతంలోనే పొందుతాము. తక్కినవన్నీ విశ్వగా అనేక పూజలు చేయి, వైకుంఠానికి వెళతావు, అక్కడ మోక్షం పొందుతావు అంటాయి. అవన్నీ పరిచ్ఛిన్న ఫలాలు – దేశ, కాల పరిమితిలో వస్తాయి. తురీయజ్ఞానం ఒక్కటే నిత్యఫలమైన మోక్షాన్ని ఇస్తుంది. ఇటువంటి జ్ఞానం పొందితే **సంసారం న ప్రపద్యతే.** అంటే సంసారం సమస్య పరిష్కరింపబడదు. సమస్య మటుమాయమవుతుంది. స్వప్నంలో మిమ్మల్ని వెంటాడిన పులి మీరు నిద్ర లేవగానే ఏమయింది? మంచం కింద దాక్కుందా? అడవిలోకి పారిపోయిందా? ఎక్కడికీ పారిపోలేదు, మీకే నిజంగా పులిలేదు, అది మీ స్వప్నం మాత్రమే అని అర్థమవుతుంది. అదే విధంగా మీరు తురీయజ్ఞానం పొందితే సంసారం మాయమవదు. అసలు సంసారం ఉంటేనే కదా మాయమవటానికి కానీ, పరిష్కారం పొందటానికి కానీ, అని అర్థమవుతుంది.

అంతకుముందు పిల్లలు ఆడే కాయిన్‌గేమ్ ఉదాహరణ కూడా చూశాము. అక్కడ లేనే లేని నాణేన్ని తన తల వెనుక కొట్టుకుని కింద పడేయమంటారు తక్కిన పిల్లలు. అతను ఎంత కొట్టుకున్నా నాణెం కింద పడదు. అక్కడ ఉంటేకదా కింద పడటానికి! చివరికి అద్దం తెచ్చి చూపిస్తారు వారు. అలాగే లేనేలేని సంసారంనుంచి బయటపడటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాము. అక్కడ ఉంటే కదా పోవటానికి అంటుంది శాస్త్రం. శాస్త్రమనే దర్పణంలో చూస్తేగాని ఆ విషయం తెలియదు. ఇది నమ్మలేము కాని సత్యం! సంసారం న ప్రపద్యతే అంటే అర్థం ఇది.

దీనితో అలాతశాంతి దృష్టాంతం అయిపోయింది. కారికలు 47–56 వరకు గౌడపాదాచార్యులవారు **అజాతివాదము సత్యము** అని అలాతశాంతి దృష్టాంతం ద్వారా నిరూపించుకు వచ్చారు. అజాతివాదము సత్యము అని అనేక కోణాల్లో చెప్పుకువస్తున్నారు. వాటిలో ఇది ఒకటి.

ఇక్కడ ఈ దృష్టాంతంలో ముందు రెండు విషయాలు మనకు అనుభవంలోకి వస్తున్నాయని చూపించారు గౌడపాదాచార్యులవారు. అవి అలాతం, ఆకారాలు. అంతేకాదు, ఆ రెండింటి మధ్య కారణ-కార్య సంబంధం ఉన్నట్టుగా కూడా అనిపిస్తుంది.

కాని వాటిని లోతుగా విశ్లేషిస్తే ఆకారాలకు, అలాతానికి భిన్నంగా ఉనికి లేదని అర్థమవుతుంది. అలాతం కదిలితే ఆకారాలు ఏర్పడుతున్నాయి; అలాతం శాంతిస్తే ఆకారాలు మాయమవుతున్నాయి. ఎప్పుడైతే వాటికి విడిగా ఉనికి లేదని అర్థం చేసుకుంటామో, అప్పుడే ద్వైతం మటుమాయమవుతుంది. అక్కడ ఉన్నది ఒక్కటే – అలాతం. ఉన్నది ఒక్కటే అలాతం అని ఎప్పుడైతే అర్థమవుతుందో, అప్పుడే కారణ-కార్య సంబంధం మాయమవుతుంది. ఎందుకంటే ఈ సంబంధం ఉండాలంటే రెండు భిన్నవస్తువులు ఉండాలి. అవి ఒకే స్థాయికి చెందినవై ఉండాలి.

ఎక్కడుంది ఆ తురీయచైతన్యం అనకూడదు. ఆ తురీయచైతన్యానివి నువ్వే; విశ్వ, తైజస, ప్రాజ్ఞ నువ్వు వేసుకున్న మూడు వేషాలు అంటున్నారు. ఈ జ్ఞానం పొందితే

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి**

అని చెప్పగలుగుతారు.

ఎప్పుడైతే నేను తురీయాన్ని అని అర్థం చేసుకుంటారో, అప్పుడే కాలాతీతంగా ఎదుగుతారు. యమధర్మరాజు మిమ్మల్ని భయపెట్టలేడు. మొదటి మూడు పాదాల్లోనూ ఏ పాదంతో మమేకం చెందినా మీరు కార్య ఆత్మో, కారణ ఆత్మో అవుతారు. ప్రాయశ్చిత్తకర్మల వెంట పడతారు; కర్మ-ఫల వృత్తంలో పడి తిరుగుతారు.

కారణ-కార్య చక్రం ఒక పెద్ద నదిలో ఉన్న ఊబిలాంటిది. అందులో పడితే అవస్థ పడటం తప్ప, బయటపడటం అంటూ ఉండదు. అలాగే ఈ చక్రంలో మరణించినా, చక్రం పోదు; ఎందుకంటే మళ్ళీ జన్మనెత్తి మళ్ళీ కర్మ-ఫల చక్రంలో పడి తిరుగుతుంటారు. మీ జీవితం అంతకంతకూ వేగంగా సాగిపోతుంటుంది.

పల్లెటూరి జీవనానికన్నా పట్నవాసజీవనం వేగంగా ఉంటుంది; పట్నవాసజీవనంకన్నా మహానగరజీవనం ఇంకా వేగంగా ఉంటుంది; మహానగరజీవనంకన్నా లండన్‌లో, న్యూయార్క్‌లో జీవనం మరింత ఉరుకులు, పరుగుల మయం. ఎస్కలేటర్‌మీద కూడా పరుగులు పెడతారు వారు. జీవనవేగానికి తగ్గట్టుగానే వాక్ప్రవాహం కూడా వేగాన్ని అందుకుంది. కొన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర 'రిలాక్స్' అని వస్తుంది. కాని ఆ ఇరవై, ముప్పయి క్షణాలు కూడా రిలాక్స్ అవలేని వేగవంతమైన జీవితం ఇప్పుడు. ఇలా పరుగులు తీయించే

మనస్సును నిలదీసి ప్రశ్నిస్తున్నారు భర్తృహరి. ఓ మనసా! ఎందుకు పరుగులు తీస్తున్నావు నువ్వు? నువ్వు ఎంత పరుగులు తీసినా, రేపనేది రేపే వస్తుంది, ఇవాళ వచ్చేయదు.

ఒక వ్యక్తి కారును చాలా వేగంగా పోనిస్తున్నాడు. ఒక పోలీసు అధికారి అతని కారాపి అడిగాడు, 'ఎందుకింత వేగంగా వెళుతున్నావు నువ్వు?' 'నేను ఏం చేసినా వేగంగా చేస్తాను.' 'అలాగా, అయితే నీకు ఏడాదిపాటు కారాగారశిక్ష విధిస్తున్నాను. ఈ సంవత్సరాన్ని ఎంత త్వరగా గడిపేస్తావో చూస్తాను,' అన్నాడుట.

కాలచక్రం గిర్రున తిరిగింది అంటాము కాని అది నిజంగా వేగంగా తిరగదు. అది ఎంత సమయంలో తిరగాలో, అంత సమయంలోనే తిరుగుతుంది. అందువల్ల ముందస్తుగా, ఒక చిన్న సాధన చేయండి. రోజులో కొంతభాగం ఏ పనీ చేయకుండా కూర్చోండి. గతం గురించి వాపోకుండా, భవిష్యత్తు గురించి బెంగపడకుండా కూర్చోండి. పనులు వేగంగా అవాలనే తపనను మానుకోండి. ఒక్కముక్కలో చెప్పాలంటే, కాలానికి అతీతంగా మారి, వర్తమానంలో ప్రశాంతంగా కాసేపు కూర్చోండి. భవిష్యత్తు గురించి బెంగపడకుండా కాసేపన్నా ఉండగలమని నేర్చుకుంటారు.

ఒక కవి అన్నాడు, 'మనిషి జీవితంలోని అతి పెద్ద విషాదం, భవిష్యత్తులో ఆనందంగా జీవించటానికి చేసే ఏర్పాట్లతో జీవితం గడిచిపోతుంది. జీవితాన్ని జీవించకుండానే మరణిస్తాడు. ఉద్యోగం రాకముందు, ఉద్యోగం సంపాదించటానికి తిప్పలు పడతాడు; ఉద్యోగం వచ్చాక, రిటైర్‌మెంట్‌కు సన్నాహాలు చేసుకుంటూ ఉంటాడు. ఇలా ఏర్పాట్లు చేసుకుంటూ కూర్చుంటే, జీవించేదెప్పుడు? అన్నీ అయి జీవిద్దామనుకుంటూంటే యమధర్మరాజు వచ్చి, 'నీ జీవితం ముగిసిపోయింది, పద,' అంటాడు. అదే తురీయజ్ఞానం పొందితే, ప్రతిక్షణమూ ఆనందంగా గడుపుతారు.

**5. వేదాంతసారం ఇంకొకసారి - కారికలు 57-74 ఉపోద్ఘాతం**

గౌడపాదాచార్యులవారు అలాత దృష్టాంతాన్ని ఆధారంగా చేసుకుని, వేదాంతసారాన్ని ఇంకొకసారి వివరించదలుచుకున్నారు. అద్వైత అలాతం బ్రహ్మగా, ఆకారాలను జగత్తుగా తీసుకుంటే వేదాంతసారం వచ్చేస్తుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాపరః**

జగత్తుకూ-బ్రహ్మకూ మధ్య కార్య-కారణ సంబంధం ఉందనుకుని ఎంతగా పొరపాటు పడుతున్నామంటే, అదే సత్యం అనుకుంటున్నాము. ఆ విషయాన్ని లోతుగా విశ్లేషించక పోవటంవల్ల ఈ సమస్య వస్తున్నది.

దీనికి గౌడపాదాచార్యులవారు వాడిన సాంకేతిక పదం - **సంవృత్తిః**. శంకరాచార్యులవారు సంవృత్తిః అంటే అజ్ఞానలౌకిక దృష్టి అంటున్నారు. అంటే లౌకిక జీవనంలో మనం వ్యవహారం నడపటానికి అనేక పదాలను వాడతాము కాని, ఆ పదాల గురించి లోతుగా విశ్లేషించము.

ఇది బంగారం-ఆభరణాల దృష్ట్యా చాలాసార్లు చూశాము. గాజు, గొలుసు, ఉంగరం పేర్లు ఒకే పదార్థమైన బంగారానికి ఉన్నాయి. వస్తు ఏకం, నామం అనేకం అని చూశాము. అవి ఒకటే వస్తువు అయినప్పుడు, భిన్న పేర్లు ఎందుకు? అక్కడ అనేక వస్తువులు ఉంటే బంగారం తీసుకురా అంటే ఏది తెస్తారు? అందువల్ల పేర్లు వచ్చాయి. కాని ఆ పేర్లలో ఎంతగా కూరుకుపోతామంటే, నిజంగా అన్ని వస్తువులు ఉన్నాయనుకుని పొరపాటు పడతాము.

ఎలాగైతే బంగారం-ఆభరణాలు రెండు భిన్నవస్తువులు కావో, అలాతం-ఆకారాలు రెండు భిన్నవస్తువులు కావో, అలాగే బ్రహ్మ-జగత్తు రెండు భిన్నవస్తువులు కావు. ఈ విషయం అర్థమయితే, జగత్తుయొక్క సృష్టి గురించి మాట్లాడము.

**సంవృత్యా జాయతే సర్వమ్** - 4.57

జగత్ సృష్టి గురించి ఎందుకు మాట్లాడతామంటే అది అజ్ఞాన అలౌకిక దృష్టివల్ల లేదా అవిద్యవల్ల పుడుతున్నది. మరయితే సత్యమేమిటి? సృష్టి నిజంగా జరగలేదు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఈ సారాన్ని ఈ కారికల్లో చూస్తాము.

**కారిక 4.57**

**సంవృత్యా జాయతే సర్వం శాశ్వతం నాస్తి తేన వై।**
**సద్భావేన హ్యజం సర్వముచ్ఛేదస్తేన నాస్తి వై ॥**

**సంవృత్యా జాయతే సర్వమ్** – సర్వం – మొత్తం జగత్తు; జాయతే – పుట్టింది; సంవృత్యా– అజ్ఞానంవల్ల. మొత్తం వాక్యం చూస్తే, అజ్ఞానంవల్ల ఈ మొత్తం జగత్తు పుట్టినట్టుగా భావిస్తున్నాము.

అజ్ఞానాన్ని అవిద్య అంటారు. అవిద్య వస్తే కాలం వస్తుంది; కాలం వస్తే కారణ–కార్య సంబంధం వస్తుంది; కారణ–కార్య సంబంధం వస్తే సంసారం వస్తుంది. జగత్తు నిత్యమూ బాధిస్తూ ఉంటుంది. జగత్తు మిమ్మల్ని నిరంతరం బాధిస్తున్నదనే భావనలో ఉంటారు. ప్రారబ్ధకర్మలు బాధిస్తున్నాయి అనుకుంటారు.

**తేన** – ఈ కాలతత్త్వంవల్ల,

**శాశ్వతం నాస్తి** – ఈ జగత్తులో శాశ్వతమైనది ఏదీ లేదు. ఈ మాట వింటే అది మనుష్యులను ఆందోళనకు గురిచేస్తుంది. మనిషి స్వభావం ఏమిటంటే, భద్రతకోసం ఏదో ఒకదానిమీద ఆధారపడటం. అటువంటప్పుడు మనుష్యులు శాశ్వతం కాదు, వస్తువులు శాశ్వతం కాదు, పరిస్థితులు శాశ్వతం కాదు, ఉద్యోగం శాశ్వతం కాదు, అనుబంధం శాశ్వతం కాదు, ఆస్తి శాశ్వతం కాదు అనేసరికి బెంబేలెత్తిపోతాడు.

చుక్కాని లేకుండా, నదిలో పడవ సాగలేనట్టే, మనిషి భద్రత అనే చుక్కాని లేకపోతే జీవితమనే నదిలో ముందుకు సాగలేడు. కాని ఆ చుక్కాని ఏమిటో సరిగ్గా అర్థం చేసుకోవాలి. అది ఒక్క తురీయం మాత్రమే. అది అర్థం కాకపోతే, మీరు నిల్చునచోట, మీ కాళ్ళ కిందనుంచి తివాచీని లాగేసినట్టు అవుతుంది.

తేన శాశ్వతం నాస్తి అంటే అజ్ఞాని దృష్టిలో ఏదీ శాశ్వతం కాదు. అందువల్ల ఉన్నదొక్కటే సంసారం. కాని జ్ఞాని దృష్టిలో ఉన్నదొక్కటే బ్రహ్మ. ఏ జగత్తైతే అజ్ఞానికి అశాశ్వత జగత్తుగా కనిపిస్తుందో, అదే జగత్తు జ్ఞానికి నిత్యబ్రహ్మగా అర్థమవుతుంది. అజ్ఞాని దృష్టిలో ఒక అల అశాశ్వతమైన చిన్న అల అయితే, జ్ఞాని దృష్టిలో అదే చిన్న అల శాశ్వతమైన నీరు. అజ్ఞాని దృష్టిలో పాముగా ఏదైతే భయపెడుతుందో, జ్ఞాని దృష్టిలో అదే పాము కేవలం తాడు మాత్రమే. అజ్ఞాని దృష్టిలో సినిమాలో ఏదైతే దయ్యంగా హడలుగొడుతుందో, జ్ఞాని దృష్టిలో అదే తెరమీద ఆడే కేవలం ఒక బొమ్మ మాత్రమే.

**సద్భావేన** – సత్ బ్రహ్మ పరంగా చూస్తే,

**సర్వమ్ అజమ్** – ఈ సృష్టిలో ప్రతిదీ శాశ్వతమైనదే. అజం అంటే నిజానికి పుట్టుక లేనిది. పుట్టుక లేనిది అంటే శాశ్వతమైనది లేదా వికారాలు లేనిది. నామరూపదృష్ట్యా జగత్తులోని అన్నీ నాశనమవుతాయి కాని బ్రహ్మ దృష్ట్యా ఏదీ నాశనం కాదు. అందువల్ల,

**ఉచ్ఛేదస్తేన నాస్తి వై** – బ్రహ్మదృష్ట్యా ఏదీ నాశనం కాదు. అల విషయమే తీసుకుంటే అల పుట్టకముందూ నీరు ఉంది, అల అనే నామరూపాలు వచ్చాకా నీరు ఉంది, అల కరిగిపోయాకా నీరు ఉంది. నీటి దృష్ట్యా చూస్తే అలకు జన్మలేదు, మరణమూ లేదు. అందువల్ల ఉచ్ఛేదః న అస్తి అంటే చావు, పుట్టుకలు లేవు. జనన, మరణాలు లేకపోతే, అభద్రతాభావన కూడా లేదు.

మనుష్యులందరినీ సమానంగా భయపెట్టేది ఈ అభద్రతాభావనే. ప్రతివారు తన మరణం గురించో, తన ఆత్మీయుల మరణం గురించో ఆందోళన పడుతూ ఉంటారు. కాని జ్ఞానికి ఈ అభద్రతాభావన ఉండదు.

**కారిక 4.58**

**ధర్మాయ ఇతి జాయంతే జాయంతే తే న తత్త్వతః ।**
**జన్మ మాయోపమం తేషాం సా చ మాయా న విద్యతే ॥**

ఇక్కడ, మనం ఏదైనా పుట్టింది అని అంటున్నా, అది నిజంగా పుట్టలేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**యత్ అజ్ఞాన జనకం తత్ మిథ్యా జాయతే**

స్వప్నప్రపంచం, జాగ్రత్ పురుషుని అజ్ఞానంనుంచి వచ్చింది. నిద్ర పదం మనం తేలికగా వాడేస్తాము కాని సిద్ధాంతపరంగా చూస్తే నిద్ర అంటే మంచంమీద హాయిగా నిద్రపోతున్న జాగ్రత్ పురుషుణ్ణి నేను అనే విషయం మర్చిపోవటం. నిద్ర ముంచుకురాగానే, తానెవరో మరుగున పడిపోయి, స్వప్నప్రపంచం సృష్టించబడినట్టుగా అవుతుంది.

**యే ధర్మాః ఇతి జాయంతే** – ధర్మా అంటే చేతన, అచేతన వస్తువు. య ఇతిని విడదీస్తే యే ఇతి అని వస్తుంది. ఏ వస్తువైతే ఈ విధంగా పుడుతుందో. ఈ విధంగా అంటే అజ్ఞానంవల్ల పుడుతోంది. అంటే అజ్ఞానం వల్ల పుట్టినదేదైనా స్వప్నప్రపంచంలాగా,

**తే తత్త్వతః న జాయంతే** – తత్త్వతః అంటే నిజంగా. నిజంగా పుట్టలేదు. అజ్ఞానంవల్ల నిజంగా ఉంది అని పొరపాటు పడుతున్నాము. తాడు అజ్ఞానం, పాము ఉందనే పొరపాటుకి దారితీస్తుంది; తన గురించిన అజ్ఞానం స్వప్నప్రపంచ సృష్టికి దారితీస్తుంది. అదే విధంగా తురీయ అజ్ఞానం ఈ జగత్తు సృష్టికి దారితీస్తుంది. మరి నిజంగా పుట్టలేదు అంటే ఎలా పుట్టాయి?

**తేషాం జన్మ మాయోపమమ్** – వాటి సృష్టి ఇంద్రజాల సృష్టిలాగా ఉంది. ఎలాగైతే ఇంద్రజాలికుడు లేని వస్తువులను నిజంగా సృష్టించినట్టుగా చేస్తాడో, అలాగే జగత్తులోని వస్తువులు నిజంగా సృష్టించబడినట్టుగా అనిపిస్తాయి. ఒక మామూలు ఇంద్రజాలికుడే

అంత మాయా ప్రపంచాన్ని సృష్టించగా లేనిది, మన అవిద్య ఇంకెంత సృష్టించగలదు? ఇక్కడ మాయ అంటే వేదాంతంలో చూసే మాయ కాదు, ఇంద్రజాలం.

జగత్తు లేదు, బ్రహ్మ మాత్రమే ఉన్నాడు; ఈ జగత్తు అవిద్య లేదా మాయవల్ల సృష్టించ బడింది అని మనం అన్నాకూడా, ఇంకా ద్వైతమే ఉంది; జగత్తు లేకపోవచ్చు కాని మాయ, బ్రహ్మ – రెండు ఉన్నాయి, దానికేం జవాబు చెబుతారు అంటారు కొందరు.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – నిజమే, బ్రహ్మలో మాయాశక్తి ఉంది కాని అది కూడా మిథ్యే. మిథ్యాజగత్తును మాయ సృష్టించింది; జగత్తు మిథ్య అయితే, జగత్తును సృష్టించిన మాయ కూడా మిథ్యే.

స్వప్నంలో ఒక విత్తనంనుంచి ఒక చెట్టు మొలకెత్తాలంటే, ఆ విత్తనం కూడా స్వప్నంలోనే పాతపడి ఉండాలి. స్వప్నవృక్షం స్వప్నవిత్తనంనుంచే వస్తుంది. అంటే కార్యం మిథ్య అయితే, కారణం కూడా మిథ్య అవాలి. అందువల్ల మాయ కూడా పారమార్థిక సత్యంలోకి రాదు. వ్యావహారిక ప్రపంచాన్ని సృష్టించిన మాయ వ్యావహారిక సత్యంలోకి వస్తుంది. అందువల్ల పారమార్థిక దృష్ట్యా, మాయ కూడా మిథ్యే అంటారు గౌడపాదాచార్యులవారు. చాలా శక్తివంతమైన వాక్యం ఇది.

**సా చ మాయా న విద్యతే** – పారమార్థిక దృష్ట్యా మాయకూడా లేదు. అందువల్లనే మాయను అవిద్య అంటారు. అవిద్య నిర్వచనాల్లో ఒకటి – న విద్యతే ఇతి అవిద్య – ఏదైతే నిజంగా లేదో అది అవిద్య.

ఇప్పుడు మూడు అంశాలు ఉన్నాయి – బ్రహ్మ, మాయ, జగత్తు. ఈ మూడింటిలో రెండు వ్యావహారిక సత్యం, ఒక్కటి మాత్రమే పారమార్థిక సత్యం. బ్రహ్మ పారమార్థిక సత్యం. బ్రహ్మలో వ్యావహారిక జగత్తును సృష్టించిన వ్యావహారికమాయ ఉంది. జగత్తు కార్యం, మాయ కారణం. రెండూ మిథ్యే.

జగత్తు సృష్టి గురించి చెప్పేటప్పుడు, మాయనుంచి జగత్తు వచ్చింది అంటాము. కాని జగత్తును మిథ్యగా కొట్టివేసేటప్పుడు మాయను కూడా మిథ్య వైపుకు పంపించేస్తాము. మిథ్యామాయ, మిథ్యాజగత్తును సృష్టించింది; ఈ రెండింటికీ ఆధారం సత్యం బ్రహ్మ. **సత్యం బ్రహ్మ కార్య–కారణ విలక్షణమ్** అని చెబుతాము.

**మాయా మాయా కార్యం సర్వం మహదాది దేహపర్యంతమ్**
**అసదిదమనాత్మకం త్వం విద్ధి త్వం మరుమరీచికా కల్పమ్॥** – వివేక చూడామణి

మాయ మిథ్య, జగత్తు మిథ్య, బ్రహ్మ మాత్రమే సత్యం. అదే విధంగా బ్రహ్మ కూడా మిథ్య అనేయకూడదు. ఇక్కడ మాయ ఉంటే ద్వైతం రాదా అనే ప్రశ్నకు ద్వైతం రాదు అని అంటున్నాము. ఎందుకంటే మాయ కూడా మిథ్యే.

**కారిక 4.59**

**యథా మాయామయాద్బీజాజ్జాయతే తన్మయోఽ౭ంకురః।**
**నాసౌ నిత్యో న చోచ్ఛేదీ తద్వద్ధర్మేషు యోజనా ॥**

గౌడపాదాచార్యులవారు కారణం కూడా మిథ్యే అని చూపించటానికి ఒక ఉదాహరణను ఇస్తున్నారు. ఆ ఉదాహరణను మనం ముందే చూసేశాము. ఏమిటది? స్వప్నంలో విత్తనంనుంచే స్వప్నంలో వృక్షం వస్తుంది. రెండూ ఒకే సత్యానికి చెందినవి. స్వప్నాన్ని ప్రాతిభాసిక సత్యం అంటారు. స్వప్నంలో కడుపుతో ఉన్న యువతి, స్వప్నంలోనే పిల్లని కంటుంది. స్వప్నంలో పాము కాటేస్తే, ఆ విషం స్వప్నశరీరంలోకే ఎక్కుతుంది. రెండూ ఒక స్థాయికి చెందినవే అయివుంటాయి. ఇదే సూత్రం ప్రకారం మాయ, మాయ సృష్టించిన జగత్తు రెండూ ఒకే స్థాయికి చెందినవి. కాకపోతే, ఇవి వ్యావహారిక స్థాయికి చెందినవి.

**యథా మాయామయాద్బీజాజ్జాయతే** – మాయామయం అంటే మిథ్య. మిథ్యావిత్తనంనుంచి మిథ్యావృక్షం ఎలా పుడుతుందో. ఇంద్రజాలంలో ఇంద్రజాలికుడు ఒక విత్తనాన్ని చూపించినట్టుగా చేస్తాడు. తర్వాత అబ్రకదబ్ర అని చేతిలో ఉన్న కర్రను కదిపితే, ఒక పెద్ద వృక్షం వచ్చేస్తుంది. మామూలుగా ఒక వృక్షం మొలకెత్తి, ఎదగాలంటే కొన్ని నెలలు అవుతుంది. కాని ఇంద్రజాలంలో కనుమూసి తెరిచేలోపు వస్తుంది. అదే ఇంద్రజాలం అంటే. అదే విధంగా మిథ్యా విత్తనం (బీజం)నుంచి,

**తన్మయోఽ౭ంకురః** – వృక్షం మొలకెత్తుతుంది. తన్మయః అంటే మాయామయః అంటే మిథ్యా విత్తనంనుంచి మిథ్యా అంకురం మొలకెత్తుతుంది. దీన్నిబట్టి కారణం మిథ్య, కార్యం మిథ్య, కార్యకారణ విలక్షణ తురీయం మాత్రమే సత్యం అని అర్థమవుతున్నది.

మాండూక్యోపనిషత్తులో వచ్చిన ఆత్మయొక్క నాలుగు పాదాల వివరణ మర్చిపోకూడదు. దాన్ని ఆధారంగా చేసుకుని వచ్చిన విశ్లేషణే ఈ కారికలు. అందులో మొదటి రెండు పాదాలూ కార్యపాదాలనీ, మూడవపాదం కారణ పాదమనీ, నాలుగవ పాదం కార్యకారణ విలక్షణ పాదమనీ, నాలుగవ పాదం మాత్రమే సత్యమనీ చూశాము. సాంకేతిక పదజాలంతో చెప్పాలంటే, విశ్వ, తైజస–కార్యం; ప్రాజ్ఞ–కారణం; తురీయం–కార్య–కారణ విలక్షణం. కార్యకారణ విలక్షణ తురీయం సత్యం. తక్కినవి మిథ్య.

విచారణ చేయనంతవరకే ఉనికి ఉన్నది మిథ్య. దీనికొక అద్భుతమైన ఉదాహరణని ఇస్తారు చిన్మయానందస్వామీజీ. పూర్వం పల్లెటూర్లలో పెళ్ళిళ్ళకు ఊరేగింపులో పెట్రోమాక్స్ లైట్లను వాడేవారు. అలాంటి ఒక సందర్భంలో పెట్రోమాక్స్ లైటును పట్టుకుని వచ్చిన ఒక

వ్యక్తి, పెళ్ళికూతురి తండ్రిని అడిగాడు, 'అయ్యా, ఈ దీపం ఎక్కడ పెట్టమంటారు?' 'ఎక్కడ చీకటిగా ఉంటే అక్కడ పెట్టు,' అన్నారా పెద్దమనిషి. అనేసి పందిట్లోకి వెళ్ళి వచ్చినా కూడా, ఇంకా ఆ వ్యక్తి ఆ ఇంట్లోనే తారాట్లాడుతున్నాడు. ఇదేమిటని ఆరా తీస్తే, అతను ఇలా జవాబు చెప్పాడు.

'అయ్యా, మీరు చీకట్లో పెట్టమన్నారా! అక్కడ చీకటిగా ఉందని వెళితే, నేను వెళ్ళేసరికి చీకటి పోయిందండి. ఇటు చీకటిగా అనిపించి, ఇటు వచ్చానండి; ఇటు చీకటి లేదు. ఎక్కడ చీకటి ఉందని వెళితే, అక్కడ చీకటి ఉండటం లేదండి. ఎక్కడ పెట్టాలో తెలియటం లేదండి.'

**చీకటి** ఉందని మనం అనుకుంటున్నాము, కాని లోతుగా విశ్లేషిస్తే నిజంగా చీకటి లేదు.

అలాగే అజ్ఞానం. దాన్ని విశ్లేషించటానికి ప్రయత్నిస్తే, అది తర్కానికి అందదు. దాన్నే మిథ్య అంటారు. మిథ్య అంటే ఉన్నట్టూ కాదు, లేనట్టూ కాదు.

**సత్ అసత్యాభ్యామ్ అనిర్వచనీయం మిథ్యా**

మిథ్యకి నిజంగా ఉనికి లేదు కాబట్టి, దాని గుణాన్ని వివరించే విశేషణాలు వాడలేము. రజ్జు-సర్ప భ్రాంతి ఎప్పుడు పుట్టింది? ఈ ప్రశ్నకు జవాబు లేదు. ఎందుకు? అసలు ఉనికే లేని పాముకి ఎక్కడనుంచి పుట్టుక వస్తుంది? సరే, పాము ఎప్పుడు పోయింది? ఇదీ అర్థం లేని ప్రశ్నే! అక్కడ పాము ఉంటే కదా, పోవటానికి.

అదే విధంగా జగత్తుయొక్క సృష్టి ఇప్పుడు జరిగింది, అది ఇప్పుడు ప్రళయంలోకి వెళ్ళింది అని చెప్పలేము. అక్కడ జగత్తనే పదార్థమే లేకపోతే, దానికి గుణాలను ఎలా ఆపాదిస్తాము?

**ద్రవ్యస్య ఏవ అభావే కథం గుణాః భవేయుః**

ఎవరైనా జగత్తు శాశ్వతమా అంటే వేదాంతం జవాబు చెప్పలేదు. అలా అయితే, జగత్తు అశాశ్వతమా అంటారు వెంటనే. దానికీ వేదాంతం జవాబు చెప్పదు. జగత్తు ఒక వస్తువు అయితే కదా దానికి గుణాలను ఆపాదించగలిగేది?

**అసౌ న నిత్యః** – జగత్తు శాశ్వతం అనలేము. శాశ్వతం ఒక విశేషణం. అసౌ అంటే ఈ మిథ్యాప్రపంచం; న నిత్యః అంటే తాడు-పాములాగా శాశ్వతం కాదు.

**న చ ఉచ్ఛేదీ** – ఉచ్ఛేదీ అంటే అనిత్యం. జగత్తు అనిత్యం అనికూడా చెప్పలేము. తాడు-పాములో పాము విషంపామా, నాగుపామా, త్రాచుపామా అంటే ఏం చెబుతారు? అక్కడ నిజంగా పాము ఉంటే కదా, ఈ గుణాల్లో ఏదైనా వాడేది?

**తద్వద్** – అదే విధంగా, ఈ సూత్రాన్ని మొత్తం సృష్టికి అన్వయించాలి.

**అనిర్వచనీయ ప్రపంచః** – ఈ జగత్తును నిర్వచించలేము. విశేషణం వాడటానికి దానికొక నామవాచకం ఉండాలి. అంటే పదార్థం ఉండాలి. జగత్తు అనే పదార్థం నిజంగా లేదు.

**ధర్మేషు యోజనా**– ఈ జగత్తులోని అన్ని వస్తువులు, జీవులు కూడా నిజంగా లేవు.

**కారిక 4.60**

**నాజేషు సర్వధర్మేషు శాశ్వతాశాశ్వతాభిధా ।**
**యత్ర వర్ణా న వర్తంతే వివేకస్తత్ర నోచ్యతే ॥**

ఈ కారికలన్నీ చాలా లోతైనవి, ముఖ్యమైనవి. జగత్తనే పదార్థం నిజంగా లేనప్పుడు దానికి గుణాలని ఆపాదించలేమని చెబుతున్నారు గౌడపాదాచార్యులవారు.

జగత్తు లేదంటే మరి మనకి కనిపిస్తున్నదేమిటి? గౌడపాదాచార్యులవారు ఉన్నదొకటే బ్రహ్మ అంటున్నారు. అంతకుముందు ఉన్నదీ బ్రహ్మే, ఇప్పుడు ఉన్నదీ బ్రహ్మే, ఇకముందు ఉండబోయేదీ బ్రహ్మే.

**కార్యకారణ విలక్షణ తురీయ బ్రహ్మ**

ముందు కారికలో జగత్తు నిజంగా లేదు కాబట్టి దానికి గుణాలను ఆపాదించలేమన్నాము సరే జగత్తు లేదు కాబట్టి, దానికి గుణాలను ఆపాదించలేము, బాగానే ఉంది కాని, బ్రహ్మ సర్వవ్యాపకం కదా, బ్రహ్మకు గుణాలను ఆపాదించగలమా?

అదీ కష్టమే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. బ్రహ్మకు కూడా గుణాలను ఆపాదించలేము. ఎందుకు? అదే సూత్రాన్ని ఇక్కడ కూడా ఆపాదించకూడదు. బ్రహ్మ కూడా అనిర్వచనీయమే. బ్రహ్మ అనిర్వచనీయం అంటే ఉనికి లేకకాదు, నిర్గుణం కాబట్టి. అందువల్ల జగత్తుకు, బ్రహ్మకు కూడా అనిర్వచనీయం పదం వాడినా, కారణాలు వేరు. జగత్తు మిథ్య కాబట్టి అనిర్వచనీయం, బ్రహ్మ నిర్గుణం కాబట్టి అనిర్వచనీయం. అందువల్ల రెండింటి గురించీ మాట్లాడలేము. మరయితే దేని గురించి మాట్లాడాలి? దేని గురించీ మాట్లాడవద్దు అంటారు గౌడపాదాచార్యులవారు.

శంకరాచార్యులవారు జ్ఞాని మౌనాన్ని పాటిస్తాడు అంటారు అపరోక్షానుభూతిలో. ఎందుకు? బ్రహ్మ గురించి మాట్లాడదామంటే, బ్రహ్మ నిర్గుణంబ్రహ్మ. గుణాలు లేని బ్రహ్మకు ఏ గుణాలు ఆపాదిస్తాడు? పోనీ జగత్తు గురించి మాట్లాడదామంటే, అసలు ఉనికే లేని జగత్తును ఏమని వర్ణిస్తాడు? సత్యబ్రహ్మ అనిర్వచనీయమే, మిథ్యాజగత్తు కూడా అనిర్వచనీయమే. ఇంక మాట్లాడేదేముంది? మౌనమే ఉత్తమం.

**అమాత్ర చతుర్థః అవ్యవహారః**

అమాత్ర అంటే ఓంకారం ఒకసారి పలికి, ఇంకోసారి పలికేముందు ఉన్న నిశ్శబ్దాన్ని అమాత్ర అంటారు. చతుర్థః అంటే తురీయం. తురీయం నిశ్శబ్దచైతన్యం. వ్యవహారాలు నడపదు. ఇప్పుడు ఈ కారికను చూద్దాము.

**సర్వధర్మేషు అజేషు** – అజ అంటే బ్రహ్మ; ధర్మ అంటే మొత్తం జగత్తు. జగత్తులోని అన్ని వస్తువులు బ్రహ్మ తప్ప వేరే ఏమీ కావు కాబట్టి, బ్రహ్మ నిర్గుణం కాబట్టి ఆ వస్తువులను కూడా నిర్వచించలేము.

**శాశ్వతః అశాశ్వతః న అభిధా** – అభిధా అంటే వర్ణన లేదా గుణాలు. మనం ఆపాదించ గలిగిన గుణాలు రెండు. అవి శాశ్వతం లేదా అశాశ్వతం. బ్రహ్మకు ఈ రెండింటిలో ఏ గుణాన్నీ ఆపాదించలేము. ఎందుకంటే బ్రహ్మ అనిర్వచనీయం.

**యత్ర వర్ణా న వర్తంతే** – యత్ర అంటే ఆ బ్రహ్మలో; వర్ణా అంటే వర్ణించే శబ్దాలు; న వర్తంతే అంటే ఉపయోగించలేము. మొత్తం కలిపితే బ్రహ్మను మాటలతో వర్ణించలేము. ఈ విషయాన్ని వివరంగా ఈ ఉపనిషత్తు ప్రారంభంలో చూశాము. ఇక్కడ టూకీగా మళ్ళీ చూద్దాము.

ఏదైనా ఒక వస్తువును వివరించాలంటే, ఆ వస్తువు ఈ ఐదు నియమాల్లో దేనికన్నా సరిపోయి ఉండాలి. ఆ నియమాలని **శబ్ద ప్రవృత్తి నిమిత్తాని** అంటారు. అవి జాతి, గుణం, క్రియ, ద్రవ్యం, సంబంధం. కాని బ్రహ్మని వర్ణించటానికి ఈ నియమాలలో దేన్నీ వాడలేము. ఎందుకంటే బ్రహ్మ ఏకం, నిర్గుణం, అవ్యవహారి, అసంగం కాబట్టి.

**యతో వాచో నివర్తంతే**
**న తత్ర చక్షుర్గచ్ఛతి నా వాక్ గచ్ఛతి నో మనః** – కేన

బ్రహ్మను వాక్కుతో వర్ణించలేము. అందువల్ల జగత్తే అనిర్వచనీయం కాదు, బ్రహ్మ కూడా అనిర్వచనీయం.

**వివేకస్తత్ర నోచ్యతే** – తత్ర అంటే ఆ బ్రహ్మ గురించి; వివేకః న ఉచ్యతే అంటే వాక్కుతో వివరించలేము.

ఇప్పుడు మనకు రెండు ఉన్నాయి – అనిర్వచనీయమైన మిథ్యావస్తువు, అనిర్వచనీయమైన సత్యవస్తువు. ఇప్పుడు ఈ రెండింటిలో నేనెవరు? నేను సత్యవస్తువైన తురీయాన్ని.

### కారిక 4.61

**యథా స్వప్నే ద్వయాభాసం చిత్తం చలతి మాయయా ।**
**తథా జాగ్రద్ద్వయాభాసం చిత్తం చలతి మాయయా ॥**

గౌడపాదాచార్యులవారు ఇలా పదేపదే జగత్తు అసలు లేనేలేదు అని చెబుతుంటే, దాన్ని స్వీకరించటానికి ఇబ్బందిగానే ఉంటుంది.

నేను ప్రత్యక్షంగా అనుభవిస్తున్న జగత్తును, కంటికి ఎదురుగా అనుభవిస్తున్న జగత్తును మిథ్యావస్తువుగా ఎలా కొట్టిపారేయగలరు? కొట్టివేసినప్పుడల్లా గౌడపాదాచార్యులవారు జవాబు ఇస్తూనే వస్తున్నారు, అయినా అది అంత తేలికగా కొరుకుడు పడే విషయం కాదు వేదాంత విద్యార్థికి.

ఈ సందేహానికి శాస్త్రం పదేపదే ఒకటే జవాబుని ఇస్తుంది. అదే స్వప్నప్రపంచం. స్వప్నంలో కూడా ఒక ప్రపంచాన్ని అనుభవిస్తారు, ప్రత్యక్షంగా చూస్తారు. స్వప్నంలో ఉండగా ఒక స్వాప్నికుడు తన స్వప్నం ఒక స్వప్నం అని ఒప్పుకోడు. అక్కడ అతను రాగద్వేషాలను అనుభవిస్తాడు, సుఖదుఃఖాలను పొందుతాడు. కాని జాగ్రత్ పురుషుని దృష్ట్యా అది అంతా మిథ్య.

ఇక్కడ ఒక విషయాన్ని బాగా గమనించాలి. స్వప్నప్రపంచం మిథ్య అని కొట్టివేసేది స్వప్నపురుషుడు కాదు, జాగ్రత్ పురుషుడు. స్వప్నంనుంచి లేచాక, జాగ్రత్ పురుషుడయ్యాక స్వప్నం మిథ్య అని అర్థమవుతుంది. ఈ సూత్రాన్ని అర్థం చేసుకుంటే జాగ్రత్ ప్రపంచాన్ని మిథ్య అని ఎలా అంటున్నామో అర్థమవుతుంది. జాగ్రత్ ప్రపంచాన్ని జాగ్రత్ పురుషుని దృష్ట్యా మిథ్య అనటం లేదు. అలా చేస్తే అది పెద్ద పొరపాటు. జాగ్రత్ ప్రపంచాన్ని మిథ్య అని తురీయం స్థాయికి లేస్తే అర్థం చేసుకోగలరు. తురీయ దృష్ట్యా, జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నమే. అది స్వప్నం-2 అవుతుంది. ఏ దృష్టితో చూస్తున్నాము అనేది చాలా ముఖ్యం.

అందువల్ల ఇక్కడ గౌడపాదాచార్యులవారు మళ్ళీ స్వప్నదృష్టాంతాన్ని ఇస్తున్నారు. అద్వైతప్రకరణంలోని కారికలు 29, 30లనే చిన్న మార్పులతో మళ్ళీ కారికలు 61, 62లలో చూస్తాము. అక్కడ మనః అనే పదం వేస్తే ఇక్కడ చిత్తం అన్నారు అంతే. అందువల్ల మనం దాని సారం మాత్రమే చూద్దాము.

**యథా స్వప్నే ద్వయాభాసం స్పందతే మాయయా మనః ।**
**తథా జాగ్రద్ద్వయాభాసం స్పందతే మాయయా మనః ॥** - 3.29

స్వప్నంలో చూసేది వాసనామయ ప్రపంచం మాత్రమే. వ్యష్టి మనస్సే ఈ స్వప్న ప్రపంచంలోని వస్తువులను, మనుష్యులను సృష్టిస్తుంది. స్వప్నప్రపంచాన్ని మనిషి నిద్రాశక్తి సృష్టిస్తే జాగ్రత్ ప్రపంచాన్ని ఈశ్వరుని మనస్సు లేదా మాయ సృష్టిస్తుంది. అంతఃకరణ వృత్తి స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తే, మాయ వృత్తి జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టిస్తుంది. అదే ఈ రెండింటి మధ్య భేదం.

### కారిక 4.62

**అద్వయం చ ద్వయాభాసం చిత్తం స్వప్నే న సంశయః ।**
**అద్వయం చ ద్వయాభాసం తథా జాగ్రన్న సంశయః ॥**

ఇది 3.30 లాగానే ఉంది. అంతకుముందు కారికలో మనస్సు అంటే ఇక్కడ చిత్తం అంటున్నారు.

**అద్వయం చ ద్వయాభాసం మనః స్వప్నే న సంశయః ।**
**అద్వయం చ ద్వయాభాసం తథా జాగ్రన్న సంశయః ॥** – 3.30

స్వప్నవస్తువులు, మీ మనస్సునుంచి వచ్చినవే.

**ద్వయాభాసమ్ స్వప్నే** – కలలో ఉన్నట్టుగా ఉన్న ద్వైతం,

**అద్వయం చిత్తం న సంశయః** – రెండవది లేని మనస్సునుంచి వచ్చింది. అందులో సందేహం లేదు. అద్వయం పదాన్ని చిత్తం దగ్గరకు తెచ్చుకోవాలి.

**ద్వయాభాసం తథా జాగ్రత్** – జాగ్రత్ ప్రపంచంలో ఉన్నట్టుగా ఉన్న ద్వైతం,

**అద్వయం చ న సంశయః** – రెండవది లేని మాయనుంచి వచ్చింది. అందులో సందేహం లేదు.

లోతుగా విశ్లేషిస్తే, నిజంగా జాగ్రత్ ప్రపంచం లేదు. మీకేమైనా సందేహం ఉంటే, స్వప్నప్రపంచాన్ని ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి.

స్వప్నప్రపంచం మంచి ఉదాహరణగా పనిచేస్తుంది కాని, దానికొక పరిమితి కూడా ఉంది. స్వప్నప్రపంచంనుంచి జాగ్రత్ ప్రపంచానికి లేస్తే, స్వప్నప్రపంచం కరిగిపోతుంది. అందువల్ల దాన్ని మిథ్యగా కొట్టివేయటం తేలిక అవుతుంది. కాని జాగ్రత్ ప్రపంచంనుంచి తురీయజ్ఞానానికి లేచినా కూడా, జాగ్రత్ ప్రపంచం కంటినుంచి మాయమవదు. ఆ అనుభవం అలాగే కొనసాగుతుంది. అందువల్ల జ్ఞానం అంటే, అనుభవం అలాగే ఉంటుంది కాని, అది మిథ్య అని అర్థమవుతుంది.

### కారిక 4.63

**స్వప్నదృక్ ప్రచరన్ స్వప్నే దిక్షు వై దశసు స్థితాన్ ।**
**అండజాన్ స్వేదజాన్ వాఽపి జీవాన్ పశ్యతి యాన్ సదా ॥**

**దృక్‌దృశ్య వివేకం - కారికలు 63-67**

గౌడపాదాచార్యులవారు వేదాంతసారాన్ని కారికలు 57-74 వరకూ మళ్ళీ వివరిస్తున్నారు. మాండూక్యంలో మనం నేర్చుకుంటున్న సారం -

**అవస్థాత్రయ తురీయమ్ ఆత్మా అహమస్మి**

ఈ భావాన్ని గౌడపాదాచార్యులవారు అనేక కోణాల్లోంచి వివరించుకు వస్తున్నారు. ఇప్పుడు కారికలు 63-67 వరకూ వాడుతున్న ప్రక్రియను దృక్‌దృశ్య వివేకం అంటారు. ఆ కారికలను చూసేముందు ఆ ప్రక్రియను విడిగా చూద్దాము.

దీన్ని ముందు దృక్‌దృశ్య వివేకం అనే ప్రకరణ గ్రంథపరంగా చూద్దాము. జగత్తునుంచీ చూద్దాము. జగత్తును కన్ను చూస్తుంది.

జగత్తు దృశ్యం 1, కన్ను దృక్ 1

కన్ను ఎలా పనిచేస్తుందో మనస్సుకు తెలుస్తుంది.

కన్ను దృశ్యం 2, మనస్సు దృక్ 2

మనస్సులో రేగే ఆలోచనలను సాక్షి చూస్తుంది.

మనస్సు దృశ్యం 3, సాక్షి దృక్ 3

సాక్షిని చూసేది ఎవరు? దృగేవ న తు దృశ్యతే.

ఇప్పుడు ఈ దృక్-దృశ్యాల జంటలను తీసుకుంటే జగత్తు ఎప్పటికీ దృశ్యమే, అది దేన్నీ చూడదు. కన్నుకు, మనస్సుకు రెండు హోదాలు ఉన్నాయి. సాక్షి విషయం చూస్తే అది ఎప్పటికీ దృక్కే, దృశ్యం ఎన్నటికీ కాదు.

దీన్నే గౌడపాదాచార్యులవారు ఇక్కడ చెబుతున్నారు, కాకపోతే ఇందులో కన్ను భాగం చూడము. అందువల్ల మూడే అంశాలు వచ్చాయి. అవి జగత్తు, మనస్సు, చైతన్యం.

సూత్రం 1 - చైతన్యం - ఎప్పటికీ దృక్, ఎన్నటికీ దృశ్యం కాదు
మనస్సు - జగత్తు పరంగా దృక్, చైతన్యం పరంగా దృశ్యం
జగత్తు - దృశ్యం మాత్రమే, ఎన్నటికీ దృక్ కాదు.

సూత్రం 2 - దృక్ చూస్తేనే దృశ్యానికి ఉనికి ఉంది
కాబట్టి దృక్ సత్యం, దృశ్యం మిథ్య

**యత్ దృశ్యం తత్ మిథ్యా ఘటవత్**

ఇప్పుడు ఈ రెండు సూత్రాలను తీసుకుని, గౌడపాదాచార్యులవారు దశలవారీగా చైతన్యం సత్యం; జగత్తు, మనస్సు మిథ్య అని నిరూపించబోతున్నారు. అదెలాగో చూద్దాము.

దశ 1 – మనస్సు–జగత్తు జంటను చూద్దాము.

సూత్రం 1 ప్రకారం మనస్సు దృక్, జగత్తు దృశ్యం

సూత్రం 2 ప్రకారం మనస్సు సత్యం, జగత్తు మిథ్య

జగత్తుకి విడిగా ఉనికి లేదు, మనస్సు చూస్తేనే దానికి ఉనికి ఉంది. ఎక్కడో ఏదో అద్భుతం జరిగింది, కాని ఆ విషయం మీకు తెలియకపోతే, ఆ అద్భుతాన్ని మీరు అనుభవించలేరు. అలాగే ఏదో బాధాకరమైన సంఘటన జరిగింది. అది మీకు తెలియకపోతే మీరు దాని గురించి దుఃఖించలేరు. అంటే ఏ విషయమైనా సరే, మీ మనస్సుకు చేరితేనే, మీ మనస్సు ఆనందాన్నో, దుఃఖాన్నో అనుభవించగలదు. దీనివల్ల తెలిసిన విషయం ఏమిటి? దృశ్యం విలువ దృక్ చూస్తేనే ఉంటుంది; కాని దృక్ విలువ దృశ్యం లేకపోయినా ఉంటుంది. ఈ సూత్రం ప్రకారం మనస్సు సత్యం, జగత్తు మిథ్య.

**ప్రపంచః మిథ్యా చిత్త దృశ్యత్వాత్ స్వప్నవత్**

ఓ మనస్సా, మిడిసిపడకే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. జగత్తుపరంగా మనస్సు సత్యమే. కాని తర్వాత దశకు రమ్మంటున్నారు.

దశ 2 – చైతన్యం–మనస్సు జంటను చూద్దాము.

సూత్రం 1 ప్రకారం – చైతన్యం దృక్, మనస్సు దృశ్యం

సూత్రం 2 ప్రకారం – చైతన్యం సత్యం, మనస్సు మిథ్య

జగత్తు మిథ్య, మనస్సు మిథ్య అంటే అదే ఊపులో చైతన్యం కూడా మిథ్య అనేయకూడదు. ముందే చూశాము, చైతన్యం దృక్ మాత్రమే, ఎన్నటికీ దృశ్యం కాదు.

**దృగేవ న తు దృశ్యతే.** అందువల్ల చైతన్యం సత్యం, మనస్సు మిథ్య.

**చిత్తం మిథ్యా సాక్షి దృశ్యత్వాత్ స్వప్నవత్**

దశ 3 – దశ 1 పరంగా – జగత్తు మిథ్య
దశ 2 పరంగా – మనస్సు మిథ్య

అందువల్ల చైతన్యం సత్యం – జగత్తు, మనస్సు మిథ్య

**సాక్షిః సత్యః అదృశ్యత్వాత్ వ్యతిరేకేన స్వప్నవత్**

స్వప్నప్రపంచానికి భిన్నంగా సాక్షి సత్యం. ఎందుకంటే సాక్షి దృశ్యం కాదు, దృక్ మాత్రమే. ఈ నేపథ్యంతో ఈ కారికలను చూద్దాము. గౌడపాదాచార్యులవారు ముందు స్వప్నప్రపంచం ఉదాహరణకు ఈ దశలను అన్వయించి చూపిస్తున్నారు.

ఇక్కడ ఉన్న మూడు అంశాలు – చైతన్యం, మనస్సు, జగత్తు. స్వప్నప్రపంచం గురించి చెప్పేటప్పుడు గౌడపాదాచార్యులవారు చైతన్యాన్ని స్వప్నదృక్ అనీ, మనస్సును స్వప్నదృక్ చిత్తం అనీ, జగత్తును స్వప్నదృక్ చిత్తదృశ్యం అనీ అంటున్నారు. వీటిలో స్వప్నదృక్ మాత్రమే సత్యం, స్వప్నదృక్ చూస్తున్న చిత్తం, స్వప్నదృక్ చిత్తం చూస్తున్న దృశ్యం కూడా మిథ్య. ఈ స్వప్నప్రపంచాన్ని చాలా వివరంగా వర్ణించుకొస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**స్వప్నదృక్ ప్రచరన్ స్వప్నే** – స్వప్నాన్ని చూసే స్వాప్నికుడు, స్వప్నప్రపంచంలో తిరుగుతున్నాడు.

**సదా జీవాన్ పశ్యతి** – అనేక జీవరాశులను చూస్తున్నాడు. తను ఒంటరిగా తన పడకగదిలో పడుకుని ఉన్నాకూడా, అన్ని రకాల జీవులను చూస్తున్నాడు. ఎక్కడ?

**దిక్షు వై దశసు స్థితాన్** – పది దిక్కుల్లోనూ చూస్తున్నాడు. పది దిక్కులు అంటే నాలుగు దిక్కులు, నాలుగు ఉపదిక్కులు, పైన, కింద. ఏ జీవులను చూస్తున్నాడు?

**అండజాన్ స్వేదజాన్ వాఽపి (జీవాన్)** – శాస్త్రం జీవరాశులను నాలుగు తెగల క్రింద విభజిస్తుంది. అవి

ఎ) **అండజాలు** – అండం అంటే గుడ్డునుంచి వచ్చినవి. ఉదా. పక్షులు.

బి) **స్వేదజాలు** – తడినుంచి పుట్టినవి. ఎక్కడ చేవ ఉంటే అక్కడ పుడతాయి ఇవి. ఉదా. క్రిమికీటకాలు, సూక్ష్మక్రిములు

సి) **జరాయుజాలు** – గర్భంనుంచి పుట్టినవి. తల్లిగర్భంనుంచి వచ్చిన జీవులు. ఉదా. మనుష్యులు, జంతువులు.

డి) **ఉద్భిజాలు** – నేలనుంచి పుట్టినవి. నేలను చీల్చుకుని వచ్చినవి. ఉదా. వృక్షాలు, మొక్కలు.

ఈ నాలుగు రకాల్లో ఇక్కడ గౌడపాదాచార్యులవారు మొదటి రెండే తీసుకున్నారు. అండజాన్ స్వేదజాన్. తక్కిన రెండూ మనం కలుపుకోవాలి. ఈ జీవులన్నింటినీ స్వప్నప్రపంచంలో చూస్తాడు.

స్వప్నదృక్ – స్వప్నదృక్ అంటే చైతన్యాన్ని సూచిస్తుందని చూశాము.

మనస్సు – సృప్నదృక్ చిత్తం. దాన్ని వచ్చే శ్లోకంలో చూస్తాము.

**కారిక 4.64**

**స్వప్నదృక్చిత్తదృశ్యాస్తే న విద్యంతే తతః పృథక్ ।**
**తథా తద్దృశ్యమేవేదం స్వప్న దృక్చిత్తమిష్యతే ॥**

ఇక్కడ ముందు మనస్సు–జగత్తు జంటను చూస్తాము. సూత్రం 1 ప్రకారం మనస్సు దృక్, జగత్తు దృశ్యం; సూత్రం 2 ప్రకారం మనస్సు సత్యం, జగత్తు మిథ్య. కాకపోతే స్వప్నప్రపంచం పరంగా చూస్తున్నాము కాబట్టి మనస్సును స్వప్నదృక్ చిత్తం అనీ, జగత్తును స్వప్నదృక్ చిత్తదృశ్యం అనీ అంటారని చూశాము.

**తే స్వప్నదృక్ చిత్తదృశ్యాః**–స్వప్నప్రపంచంలో కనబడే వస్తువులు, జీవులు అన్నీ స్వప్నప్రపంచంలోని మనస్సుకు దృశ్యం కాబట్టి దృశ్యం మిథ్య; దృక్ అయిన మనస్సు సత్యం.

**తతః పృథక్ న విద్యంతే** – స్వప్నప్రపంచంలోని వస్తువులకు మనస్సు లేకుండా విడిగా ఉనికి లేదు. తతః అంటే మనస్సు, ఇక్కడ స్వప్నదృక్ చిత్తం.

ఇక్కడిదాకా దశ 1 అయింది.

స్వప్న జగత్తు మిథ్య, స్వప్న మనస్సు సత్యం.

**తథా** – ఇదే విధంగా రెండవ జంటను తీసుకుంటే, చైతన్యం–మనస్సు జంటను చూస్తే,

సూత్రం 1 ప్రకారం చైతన్యం దృక్, మనస్సు దృశ్యం

సూత్రం 2 ప్రకారం చైతన్యం సత్యం, మనస్సు మిథ్య

కాకపోతే స్వప్నపరంగా చూస్తున్నాము కాబట్టి చైతన్యాన్ని స్వప్నదృక్ అనీ, మనస్సును స్వప్నదృక్ చిత్తం అనీ అంటారని చూశాము.

**ఇదం స్వప్నదృక్ చిత్తమ్** – జగత్తు పరంగా చూస్తే, మనస్సును దృక్ అన్నాము, కాని ఇప్పుడదే మనస్సు,

**తత్ దృశ్యమ్ ఏవ** – దృశ్యం మాత్రమే. చైతన్యం పరంగా చూస్తే మనస్సు దృశ్యం మాత్రమే అవుతుంది.

స్వప్నదృక్ – చైతన్యం దృక్ అవుతుంది. చైతన్యాన్ని స్వప్నదృక్ అంటారని చూశాము. మనస్సు దృశ్యం అయితే అది కూడా మిథ్య. **స్వప్నచైతన్యం సత్యం, స్వప్నమనస్సు మిథ్య.**

దశ 3 చూస్తే – దశ 1 పరంగా స్వప్నజగత్తు మిథ్య
దశ 2 పరంగా స్వప్నమనస్సు మిథ్య

అందువల్ల స్వప్నచైతన్యం సత్యం; స్వప్నజగత్తు, స్వప్నమనస్సు మిథ్య.

### కారిక 4.65

**చరన్ జాగరితే జాగ్రద్దిక్షు వై దశసు స్థితాన్ ।**
**అండజాన్ స్వేదజాన్ వాఽపి జీవాన్ పశ్యతి యాన్ సదా ॥**

కారికలు 65, 66, కారికలు 63, 64 లాగానే ఉంటాయి. స్వప్నప్రపంచంలో ఎలా దశలవారీగా స్వప్నజగత్తు, స్వప్నమనస్సు మిథ్య; స్వప్నచైతన్యం మాత్రమే సత్యం అని నిరూపించుకువచ్చారో, ఇప్పుడు అలాగే ఇంచుమించు అవే పదాలతో జాగ్రత్ జగత్తు, జాగ్రత్ మనస్సు మిథ్య; చైతన్యం మాత్రమే సత్యం అని నిరూపించుకువస్తారు. ఇక్కడ వాటికి వాడే పదాలు - చైతన్యానికి జాగ్రత్ దృక్, మనస్సుకు జాగ్రత్ చిత్తం, జగత్తుకు జాగ్రత్ దృక్చిత్తదృశ్యం.

ఇక్కడ కూడా ముందు జగత్తు మిథ్య, మనస్సు సత్యం అని నిరూపిస్తాము.

**జాగరితే** - జాగరితావస్థలో కూడా,

**జాగ్రత్ ప్రచరన్** - జాగ్రత్ దృక్, జాగ్రత్ ప్రపంచంలో తిరుగుతున్నాడు.

**సదా జీవాన్ పశ్యతి** - అనేక జీవరాశులను చూస్తున్నాడు.

**దిక్షు వై దశసు స్థితాన్** - పది దిక్కుల్లోనూ చూస్తున్నాడు.

**అండజాన్ స్వేదజాన్ వాఽపి (జీవాన్)** - అండజాలను, స్వేదజాలను చూస్తున్నాడు. తక్కిన రెండూ మనం కలుపుకోవాలి. అవి జరాయుజాలు, ఉద్భిజాలు.

### కారిక 4.66

> **జాగ్రచ్చిత్తేక్షణీయాస్తే న విద్యంతే తతః పృథక్।**
> **తథా తద్దృశ్యమేవేదం జాగ్రతశ్చిత్తమిష్యతే ॥**

ఇక్కడ కూడా 64లో లాగానే ముందు మనస్సు-జగత్తు జంటను చూస్తాము.

**జాగ్రచ్చిత్తేక్షణీయాస్తే** - తే అంటే జాగ్రత్ ప్రపంచం. జాగ్రత్ ప్రపంచంలో కనబడే వస్తువులు, జీవులు అన్నీ జాగ్రత్ ప్రపంచంలో మనస్సుకు దృశ్యం.

**తతః పృథక్ న విద్యంతే** - ప్రపంచంలోని వస్తువులకు, మనస్సు లేకుండా విడిగా ఉనికి లేదు.

ఇక్కడిదాకా దశ 1 అయింది.

జాగ్రత్ ప్రపంచం మిథ్య, మనస్సు సత్యం.

**తథా జాగ్రతః చిత్తం తత్ దృశ్యమ్ ఏవ** - ఇదే విధంగా, చైతన్యం-మనస్సు జంటను చూస్తే, చైతన్యం పరంగా చూస్తే, మనస్సు దృశ్యం మాత్రమే అవుతుంది. చైతన్యం దృక్ అవుతుంది.

చైతన్యం సత్యం, మనస్సు మిథ్య

దశ 3 చూస్తే - దశ 1 పరంగా జగత్తు మిథ్య
దశ 2 పరంగా మనస్సు మిథ్య

అందువల్ల చైతన్యం సత్యం; జగత్తు, మనస్సు మిథ్య.

**సాక్షిః సత్యమ్ అదృశ్యత్వాత్ వ్యతిరేకేన స్వప్నవత్**

ఈ దశల ప్రకారం ముందు మూడు వస్తువులు – జగత్తు, మనస్సు, చైతన్యం ఉంటే దశ 1లో జగత్తును కొట్టివేయటంవల్ల రెండే మిగిలాయి – మనస్సు, సాక్షి. దశ 2లో మనస్సును కూడా కొట్టివేయటంవల్ల దశ 3లో సాక్షి మాత్రమే మిగిలింది. అంటే అద్వైతం మాత్రమే సత్యం.

### కారిక 4.67

**ఉభే హ్యన్యోన్యదృశ్యే తే కిం తదస్తీతి చోచ్యతే ।**
**లక్షణాశూన్యముభయం తన్మతేనైవ గృహ్యతే ॥**

ఈ వాదనను ఇంకొక వాదన ద్వారా బలపరుస్తున్నారు గౌడపాదాచార్యులవారు. మనస్సు, జగత్తు రెండూ మిథ్య అయితే, రెండింటికీ విడిగా ఉనికి లేదు; ఒకదానిమీద ఒకటి ఆధారపడివున్నాయి. మనస్సు చూస్తేనే జగత్తుకు ఉనికి ఉంది; జగత్తు ఉంటేనే మనస్సు చూడగలుగుతుంది. అందువల్ల రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడివున్నాయి.

మనస్సు పడుకోగానే, జగత్తు మాయమవుతుంది. కాని జగత్తు లేకపోతే, మనస్సు చూడటానికి ఏమీ ఉండదు. ఈ విషయాన్ని మనం సాధారణంగా పట్టించుకోము.

ధ్యానంలో మనస్సును శూన్యం చేయాలని చూస్తాము. మనస్సు చూసే వస్తువులను, మనస్సు చేసే ఆలోచనలను పారద్రోలటానికి చూస్తాము కాని, అవి లేనిదే మనస్సుకు విడిగా ఉనికి లేదు. అందువల్లనే సుషుప్తిలో మనస్సు, జాగ్రత్ ప్రపంచం రెండూ ఒకేసారి పడుకుంటాయి. లేచినప్పుడు కూడా, రెండూ ఒకేసారి లేస్తాయి. మనస్సు లేచిన కాసేపటికి, జగత్తు నెమ్మదిగా లేవదు.

**ధియా సహోదేతి ధియాస్తమేతి**
**లోకస్తతో ధీ ప్రవిభాస్య ఏషః**
**ధీలోకజన్మక్షయధామపూర్ణం**
**సద్వస్తు జన్మక్షయశూన్యమేకమ్** – సద్దర్శనం

సద్దర్శనంలో రమణమహర్షి ఎలా మనస్సు, జగత్తు అన్యోన్య ఆశ్రయాలో అద్భుతంగా వర్ణిస్తారు. అవి రెండూ ఒకేసారి లేస్తాయి, ఒకేసారి పడుకుంటాయి. అవి అన్యోన్య ఆశ్రయాలు అంటే ఒకటి లేకుండా ఇంకొకదానికి విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేకపోతే, రెండూ మిథ్యే. ఈ సాంకేతిక అంశాన్ని వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**ఉభే హ్యాన్యోన్యదృశ్యే** – ఉభే అంటే మనస్సు, జగత్తు. దృశ్యే అంటే చూడబడేది, గుర్తించబడేది, తెలియబడేది. అన్యోన్యం అంటే రెండవదానివల్ల. అంటే ఒకదానివల్ల ఇంకొకటి చూడబడుతున్నది, తెలుస్తున్నది. జగత్తు ఉంటేనే మనస్సు చూడగలదు; మనస్సు చూడాలంటే జగత్తు ఉండాలి. కుండ ఉంటే కుండ వృత్తి ఏర్పడుతుంది; కుండ వృత్తి ఏర్పడాలంటే, ఎదురుగా కుండ ఉండాలి. ఆ విధంగా వస్తువు, వృత్తి ఒకదానిమీద ఒకటి ఆధారపడివున్నాయి.

క్వాంటమ్ ఫిజిక్స్‌లో ఈ ప్రశ్న వస్తుంది. 'అక్కడ చెట్టు ఉంది కాబట్టి నేను చెట్టును చూస్తున్నానా? నేను చూస్తున్నాను కాబట్టి చెట్టు ఉందా?'

అలా రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడివుంటే, రెండూ మిథ్యే.

**కిం తత్ అస్తి ఇతి** – ఈ జంటకు విడిగా ఉనికి ఉందా అని అద్వైత సిద్ధాంతిని అడిగితే,

**న ఇతి ఉచ్యతే** – లేదు అనే చెబుతాడు అతను. జగత్తు లేనిదే మనస్సు లేదు; మనస్సు లేనిదే జగత్తు లేదు. ఆ రెండింటికీ అధిష్ఠానం చైతన్యం.

**లక్షణా శూన్యముభయమ్** – లక్షణా అంటే విడిగా ఉనికి; శూన్యం అంటే లేదు; ఉభయం అంటే రెండింటికీ. మొత్తం చూస్తే ఈ రెండింటికీ విడిగా ఉనికి లేదు. మనస్సు ఉంది అని చెప్పాలంటే జగత్తు గురించి మాట్లాడాలి; జగత్తు ఉంది అని చెప్పాలంటే మనస్సు గురించి మాట్లాడాలి.

నిజానికి ఈ సూత్రాన్ని పంచజ్ఞానేంద్రియాలకు కూడా అన్వయించవచ్చు. రంగు, రూపు లేని జగత్తు ఉందనుకోండి. అప్పుడు మనం రంగు, రూపులను అనుభవించలేము. దాన్ని కొట్టివేస్తాము. రంగు, రూపు లేవు సరే కాని, కన్ను ఉందా అంటే ఏం చెబుతాము? బాగా ఆలోచించండి! ఇది ఆలోచించి తీరాల్సిన అంశం.

కన్నుయొక్క ఉనికిని నిరూపించగలమా? జగత్తులో రంగు, రూపు లేకపోతే, కన్ను దేన్ని చూస్తుంది? మన నిఘంటువులోంచి కన్ను అనే ఇంద్రియ పదాన్ని తీసివేయాల్సి ఉంటుంది. ఎందుకు? కన్ను నిర్వచనం అప్పుడు పనిచేయదు. కన్ను అంటే రంగు, రూపును చూసే ప్రమాణం. కన్ను చూస్తే వాటికి ఉనికి; అవి ఉంటే కన్నుకి ఉనికి. అందువల్ల రెండూ లేవు.

**తన్మతే** – ఒకదానివల్ల ఇంకొకటి తెలుస్తున్నది. మతం అంటే జ్ఞానం; తన్మతే అంటే ఒకదాని జ్ఞానం ఇంకొక దానిమీద ఆధారపడివుంది. దేనికీ విడిగా ఉనికి లేదు. దీన్ని తర్కంలో **జ్ఞప్తౌ అన్యోన్య ఆశ్రయః** అంటారు. అంటే జ్ఞానం పొందటానికి ఒకదానిమీద ఒకటి ఆధారపడ్డాయి. విడిగా ఉనికి లేనిది మిథ్య.

అందువల్ల జగత్తు, మనస్సు రెండూ మిథ్య. అయితే సత్యం ఏమిటి? ఈ రెండింటికీ అధిష్ఠానంగా ఏదైతే ఉందో అది సత్యం. సాక్షిచైతన్యం సత్యం. మాండూక్య పరిభాషలో చెప్పాలంటే తురీయం సత్యం.

**కారిక 4.68**

**యథా స్వప్నమయో జీవో జాయతే మ్రియతేఽపి చ ।**

**తథా జీవా అమీ సర్వే భవంతి న భవంతి చ ॥**

మొత్తం జగత్తు, అందులోని జీవరాశులు మిథ్య కాబట్టి, వాటి రాకపోకల గురించి స్పష్టంగా ఎన్నడూ చెప్పలేము. అవి వచ్చిపోతున్నట్టుగా ఉంటాయి.

**అమీ సర్వే జీవా** – మనముందు కనబడుతున్న ఈ జీవులందరూ,

**భవంతి న భవంతి చ** – కనిపిస్తున్నట్టుగా ఉన్నారు, మాయమవుతున్నట్టుగా ఉన్నారు.

కంటికి కనిపిస్తున్నది కనిపిస్తున్నట్టుగా, మాయమవుతున్నట్టుగా అని ఎలా అనగలరు అంటే స్వప్నదృష్టాంతం తీసుకోండి అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**యథా స్వప్నమయో జీవః** – స్వప్నంలో చూస్తున్న జీవరాశుల గురించి తార్కికంగా వివరించలేము. స్వప్నంలో ఉన్నంతవరకూ నిజమని భ్రమింపజేసి, మిమ్మల్ని పరుగులు కూడా పెట్టిస్తాయి ఒక్కోసారి.

**జాయతే మ్రియతేఽపి చ** – స్వప్నంలో జీవులు ఎలా వస్తాయో, ఎలా పోతాయో తార్కికంగా వివరించలేము. అది అనిర్వచనీయం.

అదే విధంగా జాగ్రత్ ప్రపంచంలో లోతులు కొలిచినకొద్దీ, అది అర్థంకాని విషయంగా మిగిలిపోతుంది. ఈ జీవులన్నీ ఎలా వచ్చాయి? కర్మవల్ల వచ్చాయా, శరీరంవల్ల వచ్చాయా? కర్మ ముందా, శరీరం ముందా? ఈ ప్రశ్నలకు ఎవరూ జవాబులు చెప్పలేరు. జవాబు చెప్పలేనిదేదైనా సరే అనిర్వచనీయం. దాన్ని ఒక పదంతో సూచిస్తాము. అది **మాయ**.

నాకు మాయ అర్థం కాలేదని మీరు అంటే, అందుకే దాని పేరు మాయ అంటాము.

**కారిక 4.69**

**యథా మాయామయో జీవో జాయతే మ్రియతేఽపి చ ।**

**తథా జీవా అమీ సర్వే భవంతి న భవంతి చ ॥**

ఇందులోని రెండవ పాదం అచ్చం ముందు కారికలోని రెండవ పాదమే. ఈ రెండవ పాదం అర్థం జాగ్రత్ ప్రపంచంలోని జీవులన్నీ వచ్చిపోతున్నట్టుగా ఉంటాయి. దాన్ని నిరూపించటానికి ముందు కారికలో స్వప్నదృష్టాంతం తీసుకుంటే, ఇక్కడ ఇంద్రజాలం ఉదాహరణ చూస్తాము. అంతే వ్యత్యాసం.

**యథా మాయామయో జీవః** – ఇక్కడ మాయ అంటే వేదాంతంలో వచ్చే మాయ కాదు, ఇంద్రజాలం. ఇంద్రజాలంలో చూస్తున్న జీవరాశుల గురించి తార్కికంగా వివరించలేము. ఇంద్రజాలం చూస్తున్నంతసేపూ నిజమని భ్రమింపజేసి, మిమ్మల్ని భయభ్రాంతులను కూడా చేస్తుంది ఒక్కోసారి. ఒక యువతిని రెండుగా కోయటం చూస్తే భయమే వేస్తుంది.

**జాయతే మ్రియతేఽపి చ** – ఇంద్రజాలంలో వస్తువులు, జీవులు ఎలా వస్తాయో, ఎలా పోతాయో తార్కికంగా వివరించలేము. అది అనిర్వచనీయం.

**కారిక 4.70**

**యథా నిర్మితకో జీవో జాయతే మ్రియతేఽపి చ ।**
**తథా జీవా అమీ సర్వే భవంతి న భవంతి చ ॥**

ఇందులో కూడా రెండవ పాదం 68, 69ల్లోని రెండవ పాదమే అక్షరాలా. జాగ్రత్ ప్రపంచంలోని జీవులన్నీ వచ్చిపోతున్నట్టుగా ఉంటాయి అనే వాక్యానికి నిరూపణగా ఇంకొక ఉదాహరణ చూస్తాము ఇందులో.

**యథా నిర్మితకో జీవః** – సిద్ధపురుషుడు ఎలాగైతే అనేక వస్తువులను తన సిద్ధుల ద్వారా సృష్టించగలడో. చేతిలోంచి, నోటిలోంచి అనేక వస్తువులను సృష్టిస్తారు వారు. రామాయణంలో విశ్వామిత్రుడు త్రిశంకు స్వర్గం సృష్టించాడని చూస్తాము. సిద్ధపురుషుని సృష్టిని నిర్మిత్తక సృష్టి అంటారు.

**జాయతే మ్రియతేఽపి చ** – సిద్ధులు సృష్టించే వస్తువులు ఎలా వస్తాయో, ఎలా పోతాయో తార్కికంగా వివరించలేము. అది అనిర్వచనీయం.

ఇంద్రజాలికుని సృష్టికి, సిద్ధపురుషుని సృష్టికి మధ్య ఉన్న భేదం ఏమిటి? ఇంద్రజాలికుని సృష్టి ప్రాతిభాసికం అయితే సిద్ధపురుషుని సృష్టి వ్యావహారికం. ఇంద్రజాలికుడు మాయావి అయితే, సిద్ధపురుషుడు మహాయోగి. వీరిలో ఎవరు సృష్టించినా రెండూ మిథ్యే. వీరిని మించిన మాయావి, మహాయోగి భగవంతుడు. అందువల్ల భగవంతుని సృష్టి అయిన జగత్తూ మిథ్యే. అది వచ్చిపోతున్నట్టుగా భ్రమింపజేస్తుంది.

**కారిక 4.71**

**న కశ్చిజ్జాయతే జీవస్సంభవోఽస్య న విద్యతే ।**
**ఏతత్తదుత్తమం సత్యం యత్ర కించిన్న జాయతే ॥**

ఇప్పుడు నాలుగు రకాల జీవులను కొట్టివేశాము. అవి స్వప్నమయ జీవుడు, మాయామయ జీవుడు, నిర్మిత్తిక జీవుడు, జాగ్రత్ ప్రపంచ జీవుడు. ఈ నాలుగు రకాల జీవులూ నిజంగా పుట్టలేదు అంటే, మరి ఏ జీవుడు నిజంగా పుట్టాడు? ఏ జీవుడూ నిజంగా పుట్టలేదు. **అజాతివాదము సత్యము.**

**న కశ్చిజ్జాయతే జీవః** – ఏ జీవుడు కూడా పుట్టటం లేదు. ఎందుకంటే జీవాత్మ ఎవరో కాదు, పుట్టుకలేని పరమాత్మే. ఇది అక్షరాలా మూడవ అధ్యాయంలోని కారిక 48.

**న కశ్చిజ్జాయతే జీవస్సంభవోఽస్య న విద్యతే ।**
**ఏతత్తదుత్తమం సత్యం యత్ర కించిన్న జాయతే ॥**

జీవాత్మ అసలు పుట్టలేదు అని ఎందుకు అంటున్నాము? జీవాత్మ కార్యం అవాలంటే, దానికొక కారణం ఉండాలి. జీవాత్మ అనే కార్యానికి, పరమాత్మ కారణం అనుకుంటాము. కాని వేదాంతాన్ని అధ్యయనం చేస్తే పరమాత్మ కారణం కాదని తెలుస్తుంది. పరమాత్మ కార్య–కారణ విలక్షణం అని నేర్చుకుంటాము. పరమాత్మ కారణం కాకపోతే, జీవాత్మ పరమాత్మనుంచి ఎలా వస్తుంది?

**అస్య** – ఈ జీవాత్మ పుట్టాలంటే,

**సంభవః న విద్యతే** – సంభవం అంటే కారణం; జీవాత్మకు కారణం లేదు.

**కారణం నాస్తి తస్మాత్ కార్యమపి నాస్తి**

మరయితే ఏం ఉంది?

**ఏతత్తదుత్తమం సత్యమ్** – ఉన్నదొకటే సత్యం. అది పారమార్థిక సత్యం. మాండూక్య పరిభాషలో తురీయం. ఈ పారమార్థిక సత్యం తక్కిన రెండు సత్యాలకన్నా ఉత్తమం. స్వప్నప్రపంచాన్ని ప్రాతిభాసిక సత్యం అంటారు. స్వప్నం ఉన్నంతసేపే అది ఉంటుంది. జాగ్రత్ ప్రపంచాన్ని వ్యావహారిక సత్యం అంటారు. అది వ్యవహారం నడపటానికి మాత్రమే పనికి వస్తుంది. తురీయ చైతన్యం పారమార్థిక సత్యం.

తక్కిన రెండు సత్యాలూ ఆపేక్షిక సత్యం మాత్రమే. ఎందుకు? స్వప్నప్రపంచం స్వాప్నికునికి మాత్రమే సత్యం, జాగ్రత్ పురుషునికి మిథ్య; అలాగే జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ పురుషునికి మాత్రమే సత్యం, స్వప్నపురుషునికి అదొకటి ఉందని కూడా తెలియదు. అంతేకాదు, జాగ్రత్ ప్రపంచంలోని వస్తువులను స్వప్నంలో వాడలేము; స్వప్నంలో సంపాదించిన ధనాన్ని జాగ్రత్ ప్రపంచంలో వాడలేము. అందువల్ల రెండూ ఆపేక్షిక సత్యం మాత్రమే.

మరయితే ఆత్యంతిక సత్యం ఏమిటి? తురీయ చైతన్యం మాత్రమే సత్యం. అది ఈ మూడు అవస్థల్లోనూ అధిష్ఠానంగా ఉంది, వాటికి విలక్షణంగానూ ఉంది. ఈ తురీయం గొప్పదనం ఏమిటి?

**యత్ర** – ఆ తురీయంలో,

**కించిన్న జాయతే** – ఏదీ పుట్టలేదు. తురీయం కార్యకారణ విలక్షణం. ఆ తురీయం ఎక్కడ ఉంది? దిక్కులు చూడకండి. అది మీరే.

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి**

ఈ వాక్యం చెప్పగలగాలి. ఇదంతా 7వ మంత్రం వివరణే.

**కారిక 4.72**

**చిత్తస్పందితమేవేదం గ్రాహ్యగ్రాహకవద్ద్వయమ్ ।**
**చిత్తం నిర్విషయం నిత్యమసంగం తేన కీర్తితమ్ ॥**

జీవులు పుట్టలేదు, జగత్తు పుట్టలేదు అంటే ఈ పుట్టిన జీవులు, జగత్తుల మాటేమిటి? ఈ ప్రశ్న ఎన్నిసార్లు అడిగినా జవాబు ఒకటే.

స్వప్నప్రపంచం నిజంగా పుట్టినట్టుగా ఉంటుంది. సైన్స్ ప్రకారం కూడా స్థిరంగా, గట్టిగా ఉన్న ఈ గోడ కదులుతున్న శక్తి మాత్రమే. అలాగే వేదాంతం ప్రకారం, కదలకుండా, కనబడకుండా ఉన్న చైతన్యమే కదిలినట్టుగా అనిపించినప్పుడు జగత్తుగా కనిపిస్తుంది.

**చైతన్య స్పందనమ్ ఏవ జగత్**

**చిత్తం స్పందితమ్** – ఈ కారికల్లో చిత్తం అంటే చైతన్యం అనే విషయాన్ని మర్చిపోకూడదు. స్పందితం అంటే తీవ్రమైన కదలిక.

నటరాజుని విలయతాండవం, జగత్తుయొక్క కదలికకు ప్రతీక. ఎందుకంటే జగత్తు నటరాజుకి భిన్నంగా లేదు కాబట్టి. నటరాజు విలయతాండవం చేస్తున్నట్టు ఎలా తెలుసు? భూమికి సమాంతరరేఖలుగా విచ్చుకున్న శివుని జటాఝూటాలే దానికి నిదర్శనం. మనం మామూలుగా భూమిమీద కదలకుండా నిల్చుంటే, మన జుట్టు కిందికి ఉంటుంది. నృత్యం చేస్తుంటే, వెంట్రుకలు పైకి లేస్తాయి.

నటరాజు అంటే చైతన్యస్వరూపం. చైతన్య స్పందనాన్ని నృత్యం ద్వారా సూచిస్తున్నారు.

చైతన్యం = నటరాజ స్పందనం = నృత్యం

చిత్త స్పందనం – నటరాజుని నృత్యం. ఈ జగత్తు చిత్తస్పందితం ఏవ.

**ద్వయమ్** – ఈ జగత్తులో ద్వైతం ఉంది. ద్వైతం అంటే రెండు. కాని జగత్తులో అనేక వస్తువులు ఉన్నాయి. ద్వైతం అంటే సబ్జెక్టు, ఆబ్జెక్టు విభజన లేదా ప్రమాత, ప్రమేయ విభజన.

**గ్రాహ్యమ్** – ప్రమేయం,

**గ్రాహకమ్** – ప్రమాత,

**గ్రాహ్యగ్రాహకవద్ద్వయమ్** – ప్రమాత–ప్రమేయం విభజన ఉన్న ద్వైతప్రపంచం. ఈ ద్వైతప్రపంచం స్పందనలో ఉన్న చైతన్యం తప్ప మరేమీ కాదు. చైతన్యం స్పందించకుండా శాంతిస్తే,

ఈ ద్వైతం లేదు. సుషుప్తిలో ద్వైతం లేదు, ఆలోచనలు లేవు, కదలిక లేదు. దాన్ని అలాతశాంతి అంటారు. అంతిమసత్యం ఏమిటి?

**చిత్తమ్** – చైతన్యం నిజంగా,

**నిర్విషయం** – విషయ వస్తువులతో వ్యవహారం నడపదు.

**నిత్యమ్** – ఎప్పుడూ. చిత్తం ఎన్నడూ విషయ వస్తువులతో వ్యవహారం నడపదు.

**అసంగమ్** – చైతన్యం, అద్వైతం కాబట్టి, అసంగం. అందువల్లనే చైతన్యానికి అస్పర్శయోగం అనే పేరుని చూశాము. అద్వైతంలో సంబంధానికి చోటులేదు.

**తేన** – అందువల్ల; అది అసంగం.

**ఇతి కీర్తితమ్** – అని ఉపనిషత్తుల్లో కీర్తించబడుతున్నది.

**అసంగోహి అయం పురుషః** – బృహదారణ్యకమ్

ఆత్మ అసంగం కాబట్టే మనుష్యులు అద్వైతానికి రావటానికి భయపడుతున్నారని మూడవ అధ్యాయంలో చూశాము. నిజానికి అద్వైత ఆత్మ అంటే పూర్ణత్వం, ఆనందస్వరూపం, భయపడే ఆస్కారమే లేదు కాని అది అర్థంకాని వారు అద్వైతం అంటే భయపడుతున్నారు. **అసంగ ఆత్మా** అనే నిర్వచనం దీనికి కారణం.

**కారిక 4.73**

**యోఽస్తి కల్పితసంవృత్యా పరమార్థేన నాస్త్యసౌ ।**
**పరతంత్రాభిసంవృత్యా స్యాన్నాస్తి పరమార్థతః ॥**

మిథ్యాజగత్తు పుట్టింది – మిథ్యాసృష్టి వాదము
జగత్తు నిజంగా పుట్టలేదు – అజాతివాదము

రెండింటి అర్థమూ ఒకటే. మిథ్యా జగత్తు పుట్టింది వాక్యాన్ని ఇంకోలా రాస్తే నిజమైన జగత్తు పుట్టలేదు. మిథ్యాజగత్తుని ఇంకోలా చెబితే వ్యావహారిక సత్యం అవుతుంది. దీన్ని **మిథ్యా సృష్టివాదము** అంటారు. జగత్తు నిజంగా పుట్టలేదు, చైతన్యం కదిలినప్పుడు పుట్టినట్టుగా ఉంది అంటే అది **అజాతివాదము** అవుతుంది. నిజం పదాన్ని ఒకసారి జగత్తు ముందు వేశాము, ఇంకొకసారి తరువాత వేశాము. రెండింటి అర్థం ఒకటే, ఈ సూక్ష్మభేదం తప్ప.

**యోఽస్తి కల్పితసంవృత్యా** – ఈ జగత్తు వ్యావహారిక దృష్ట్యా పుట్టింది. కల్పితసంవృత్యా అంటే వ్యావహారిక దృష్టి. యః అస్తి అంటే జాగ్రత్‌ప్రపంచం ఉంది. అది స్వప్నప్రపంచాన్ని స్వాప్నికుని దృష్ట్యా చూసినట్టు అన్నమాట. 'స్వప్నప్రపంచం సత్యమా, మిథ్యా?' ఈ ప్రశ్న ఎవరైనా అడిగితే, 'స్వాప్నికుని దృష్ట్యా అది సత్యమే,' అని చెప్పాలి. ఎందుకంటే స్వప్నంలో

స్వాప్నికునికి ఆకలివేస్తే, స్వప్నంలో ఉన్న ఆహారమే తినాలి, స్వప్నంలో ఉన్న నీరే త్రాగాలి. అదే విధంగా జాగ్రత్‌పురుషుని దృష్ట్యా జాగ్రత్‌ప్రపంచం మహాసత్యం.

**పరమార్థేన నాస్త్యసౌ** – పారమార్థిక స్థాయినుంచి చూస్తే, జాగ్రత్‌ప్రపంచం లేదు. 'జాగ్రత్ ప్రపంచం సత్యమా, మిథ్యా?' ఈ ప్రశ్నకు జవాబు 'పారమార్థిక దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం మిథ్య.'

**పరతంత్రాభిసంవృత్యా స్యాత్** – పరతంత్రం అంటే తక్కిన దార్శనికులు. సాంఖ్య, న్యాయ వంటి తక్కిన దార్శనికులు జగత్తును వ్యావహారిక స్థాయినుంచే చూస్తారు. వారు పారమార్థిక స్థాయి అని ఒకటి ఉందనే ఒప్పుకోరు. అందువల్ల అటువంటివారితో పైన చెప్పిన జవాబు చెప్పకూడదు. ఏమిటది? 'పారమార్థిక దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం మిథ్య.' మీరు మాండూక్య కారికలను అధ్యయనం చేశారు కాబట్టి, మీకు అద్వైతం సత్యం అని అర్థమయింది.

మీరు అదే ఉత్సాహంతో పారమార్థిక దృష్ట్యా జాగ్రత్‌ప్రపంచం మిథ్య అని జవాబు చెబితే, వారు మిమ్మల్ని పిచ్చివారి కింద జమకడతారు. వారికి తురీయం అంటే ఏమిటో తెలియదు. తురీయ లక్షణాలు ఏమిటో అసలే తెలియదు. (నిజానికి చాలామందికి మాండూక్యోపనిషత్తును పలకటమే రాదు. మాండూకోపనిషత్తు అంటారు.) అటువంటి వారితో మీరు జాగ్రత్తగా మాట్లాడాలి.

జాగ్రత్‌పురుషుని దృష్ట్యా జాగ్రత్‌ప్రపంచం మహాసత్యం అని పదేపదే చూశాము. ఎండాకాలపు ఎండవేడి, చలికాలపు చలి స్థూలశరీరాన్ని బాధిస్తాయి కాని తురీయాన్ని కాదు. తురీయం అంటే ఏమిటో తెలియనివారికి ఇది చెప్పి లాభం లేదు. తురీయజ్ఞానం ఉన్నవారితో చెప్పవచ్చు కాని తక్కినవారికి జగత్తు సత్యమే.

ద్వైతవాదులు నిర్గుణబ్రహ్మ జ్ఞానం దాకా రారు. వారి ఉద్దేశ్యంలో జగత్తు సత్యం. వారికి నిర్గుణబ్రహ్మ తెలియనప్పుడు, నిర్గుణబ్రహ్మయొక్క పారమార్థిక స్థాయినుంచి ఏం మాట్లాడతారు? అందువల్ల తక్కిన దార్శనికులకు జాగ్రత్ ప్రపంచం సత్యం;

**నాస్తి పరమార్థతః** – పారమార్థిక స్థాయి లేనేలేదు. అందువల్ల ఎవరైనా జగత్తు సత్యమా, మిథ్యా అంటే జగత్తు సత్యమే అని వారితో అని, మీలో మీరు అది వ్యావహారిక దృష్ట్యా సత్యం, పారమార్థిక దృష్ట్యా మిథ్య అని మీకు మీరు చెప్పుకోండి. దృష్టి భేదాలను కలపకండి.

స్వాప్నికునికి స్వప్నం నిజం అని తెలియకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు తనంతట తనే స్వప్నంనుంచి లేస్తాడు కాబట్టి, లేచాక అది మిథ్య అని గ్రహిస్తాడు. కాని జాగ్రత్ ప్రపంచంనుంచి సహజంగా లేవడు. మోక్షం దానంతట అది వచ్చేయదు; అజ్ఞానం దానంతట అది పోదు. దానికి ప్రయత్నం చేయాలి. సృష్టిలో ప్రతివస్తువుకూ సహజమరణం ఉంటుంది. అంటే

దానంతట అది మరణిస్తుంది. ఈ శరీరం పుడుతుంది, దానంతట అది మరణిస్తుంది. చివరికి నక్షత్రాలు కూడా ఎప్పుడో రాలిపోతాయి. కాని ఈ ప్రకృతి సూత్రానికి ఒక ఉల్లంఘన ఉంది. అది అవిద్య లేదా అజ్ఞానం. అజ్ఞానం దానంతట అది పోదు.

మనం శిష్యునిగా మారి, శాస్త్రాన్ని గురువు ద్వారా అధ్యయనం చేయాలి. గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే అజ్ఞానాన్ని పారద్రోలగలము. అందువల్ల శాస్త్రానికి రాని, మామూలు మనిషికి తురీయం గురించి తెలియదు. అతనికి తెలియకపోయినా ఫర్వాలేదు, శాస్త్రానికి వచ్చి కూడా, శాస్త్రానికి విలువని ఇవ్వకుండా, తర్కానికి పెద్దపీట వేస్తారు కొందరు దార్శనికులు. వారూ తురీయానికి రారు.

అందువల్ల ఒకవేళ వారితో మనం, జగత్తు మిథ్య అంటే వారు దాన్ని జీర్ణించుకోలేరు. 'జగత్తు మిథ్య అని ఎలా అంటారు, తినటం సత్యం కాదా?' అంటారు. వారికి ఇలా రెండు సత్యాలు ఉన్నాయని తెలీదు.

**వ్యావహారిక దృష్ట్యా జగత్తు మహాసత్యం**
**పారమార్థిక దృష్ట్యా జగత్తు మిథ్య, తురీయం సత్యం.**

**కారిక 4.74**

**అజః కల్పితసంవృత్యా పరమార్థేన నాప్యజః ।**
**పరతన్త్రాభినిష్పత్త్యా సంవృత్యా జాయతే తు సః ॥**

చాలా లోతైన విశ్లేషణ. ఇంతవరకూ తురీయం అద్వైతం అనీ, దానికి జనన, మరణాలు లేవనీ, అందువల్ల కార్య-కారణ విలక్షణం అనీ, అందువల్ల కాలాతీతం అనీ, అందువల్ల బ్రహ్మ **నిర్వికారం** అనీ చెబుతూ వచ్చారు. నిర్వికారం అంటే వికారాలు లేనిది.

ఇప్పుడు, ఈ కారికలో గౌడపాదాచార్యులవారు, నిజం చెప్పాలంటే బ్రహ్మకు నిర్వికారం పదం కూడా వాడలేము అంటున్నారు. పారమార్థిక దృష్ట్యా అన్న పదం ముందు కారికలో వచ్చింది కాబట్టి, ఈ కారికలో పారమార్థిక దృష్టికి ఎదిగితే, తురీయం గురించి ఏ పదమూ వాడలేమని చెబుతున్నారు.

వ్యావహారిక దృష్ట్యా జగత్తు పుట్టిందనీ, అది కార్యమనీ, జగత్తుకు కారణం బ్రహ్మ అనీ అందరూ అంటారు. కారణం ఏదైనా అది **సవికారం** అవుతుంది. మార్పుకు లోనవుతుంది. వారు బ్రహ్మను కూడా సవికారం అంటారు కాబట్టి, వారి అపోహను పారద్రోలటానికి వ్యావహారిక స్థాయిలోనే బ్రహ్మ సవికారం కాదు **నిర్వికారం** అంటాము. పారమార్థిక స్థాయిలో బ్రహ్మ కార్యకారణ విలక్షణం అంటే వికారానికి చోటు లేదు కాబట్టి నిర్వికారం పదం కూడా వాడనవసరం లేదు.

అలాగే వ్యావహారిక స్థాయిలో బ్రహ్మ గురించి ఉన్న కొన్ని అపోహలను పారద్రోలటానికి దానికి భిన్న పదాలు వాడాల్సి ఉంటుంది. బ్రహ్మ సగుణం అంటే కాదు నిర్గుణం అనాల్సి ఉంటుంది. వాళ్ళు జగత్తు కార్యం, బ్రహ్మ కారణం అంటే బ్రహ్మ కార్య-కారణ విలక్షణం అనాల్సి ఉంటుంది. జగత్తు సత్యం అనుకుంటారు కాబట్టి, దాన్ని ఖండించటానికి జగత్తు సత్యం కాదు, మిథ్య; బ్రహ్మ మాత్రమే సత్యం అనాల్సి ఉంటుంది. జగత్తు జడం అని చెప్పటానికి బ్రహ్మ చైతన్యం అని చెప్పాల్సి ఉంటుంది. పారమార్థిక స్థాయికి ఎదిగితే బ్రహ్మను వర్ణించే నిర్వికారం, కార్యకారణవిలక్షణం, సత్యం, చైతన్యం పదాలేవీ వాడలేము.

ఎవరో అద్భుతంగా అన్నారు, 'పగలు గురించి భూమ్మీద మాత్రమే మాట్లాడగలము. ఎందుకంటే రాత్రి అనుభవం మనకు ఉంది కాబట్టి.' రాత్రికి భిన్నంగా పగలు ఉంది. అదే సూర్యునిమీద ఉన్నారనుకోండి (అది సాధ్యం కాదని తెలుసు), అక్కడ పగలే ఉంటుంది కాబట్టి అక్కడ పగలు పదం కూడా వాడలేము.

అందువల్ల పారమార్థిక దృష్ట్యా బ్రహ్మ నిర్వచనం మౌనవ్యాఖ్యానం లేదా **అమాత్రః చతుర్థః**.

శంకరాచార్యులవారు తన మంగళ శ్లోకాల్లో తురీయాన్ని తురీయం అనికూడా పిలవలేము అని అంటారు. ఎందుకు? నిజానికి తురీయం అంటే నాలుగవది. వ్యావహారిక దృష్ట్యా ఆత్మకు నాలుగు పాదాలు ఉన్నాయనీ, అవి విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయం అనీ చూశాము. అలా చూస్తే నాలుగవ పాదం తురీయం. మొదటి మూడు పాదాలను ఖండిస్తే, తురీయానికి నాలుగవ పాదం హోదా పోతుంది.

**మాయా సంఖ్యాతురీయం పరమమృతమజం బ్రహ్మ యత్తన్నతోఽస్మి॥**

బ్రహ్మ మూడు అవస్థల్లోనూ వ్యాపించి ఉన్నా కూడా అజ్ఞానంవల్ల లెక్క ప్రకారంగా నాలుగవది అవుతున్నది. అటువంటి బ్రహ్మ చావు పుట్టుకలు లేనిది అని వర్ణించుకుంటూ వస్తూ, చివరగా, ఇటువంటి తురీయం మమ్ములను కాపాడుగాక అని అంటారు.

**అజః కల్పితసంవృత్యా** – తురీయబ్రహ్మ అజః అంటే పుట్టుక లేనిది, శాశ్వతమైనది, మార్పులేనిది. కల్పితసంవృత్యా అంటే వ్యావహారిక దృష్ట్యా అని ముందు శ్లోకంలో కూడా చూశాము. వ్యావహారిక దృష్ట్యా తురీయం అజః అని అంటాము,

**పరమార్థేన నాప్యజః** – కాని పారమార్థిక స్థాయికి ఎదిగితే, అజః అనికూడా అనలేము. అనిత్య జగత్తును చూస్తే నిత్యతురీయం గురించి మాట్లాడతాము.

**పరతంత్రాభినిష్పత్త్యా సంవృత్యా** – పరతంత్ర అంటే తక్కిన దార్శనికులు అని చూశాము. వారిది వ్యావహారిక దృష్టి అని కూడా చూశాము.

**జాయతే తు సః** – తక్కిన దార్శనికుల దృష్ట్యా, బ్రహ్మకు పుట్టుక ఉంది. పుట్టుక ఉంది అంటే వికారాలు ఉన్నాయి. అందువల్ల వారిని ఖండించటంకోసం బ్రహ్మ నిర్వికారం అంటాము.

ఈ కారిక రెండవ అధ్యాయంలో కారిక 32ని పోలివుంది.

అక్కడ ఇంచుమించు ఇదే అర్థం చూశాము. బ్రహ్మ సత్యం అనాలంటే మిథ్యాజగత్తు ఉండాలి; బ్రహ్మ అద్వైతం అనాలంటే ద్వైతం ఉండాలి. అలా ఏ పదం వాడాలన్నా దానికి భిన్నంగా ఇంకొక పదం వాడాలి. బ్రహ్మ సత్యం అని నిరూపించాక సత్యం పదం కూడా వాడలేము. మౌనవ్యాఖ్యానం అంటే ఏమీ మాట్లాడకపోవటం కాదు, మాట్లాడటానికి ఏమీ పదాలు వాడలేకపోవటం.

**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ**

బ్రహ్మను వాక్కు వర్ణించలేదు, మనస్సు అర్థం చేసుకోలేదు.

ఇక్కడితో వేదాంతసారం ప్రస్తుతానికి ముగిసింది. ప్రస్తుతానికి అని ఎందుకంటున్నామంటే కొన్ని కారికలు అయ్యాక మళ్ళీ ఆ విషయానికి వస్తారు.

### 6. సంసార కారణం, సంసార నివృత్తి సాధనం – కారికలు 75–86 ఉపోద్ఘాతం

మనం ఎందుకు సంసారంలో కూరుకుపోతున్నామో విశ్లేషిస్తున్నారు గౌడపాదాచార్యుల వారు ఈ కారికల్లో. వేదాంతం మీరు అసలు బెంగపడనవసరం లేదు, మీరు నిత్య, ముక్త, పూర్ణ, శుద్ధ, జన్మరహిత, అకర్తా, అభోక్తా బ్రహ్మ అంటుంది. అందువల్ల మనం ఆనందమే ఆనందంగా ఉండాలి.

అంతలా మనం ఆనందస్వరూపులం అయితే అంతచేటు సంసారంలో ఎలా పడిపోయాము? నిజానికి కిందికి పడటం అసాధ్యం. శాశ్వతమైనది ఎలా అశాశ్వతమౌవుంది? కాని అదీ మన గొప్పతనం. మార్పులేని బ్రహ్మ అయిన మనం, విజయవంతంగా సంసారులుగా మారిపోయాము. మార్పు సాధ్యం కాని మనం ఎలా మారాము? దీనికి ఒకటే కారణం. దాన్ని అవిద్య లేదా అజ్ఞానం లేదా మాయ అంటారు.

ఈ అజ్ఞానం ఎందుకు వచ్చింది? ఈ ప్రశ్న అడగకూడదు; ఎందుకంటే అజ్ఞానం కొత్తగా రాలేదు. మనం అజ్ఞానమనే పెట్టుబడితో పుట్టాము.

**అనాది కాలప్రవృత్త మిథ్యా అవిద్య**

ఈ మాయవల్ల నిజంగా పడకుండా పడ్డాము. స్వప్నప్రపంచంలో నిజంగా డబ్బు పోగొట్టుకోకుండా, పోగొట్టుకుంటాము. ఒక పిల్లవాడు తల్లి ఒడిలో నిశ్చింతగా పడుకుని కూడా, తల్లినుంచి దూరమైనట్టు కలగంటాడు.

అదే విధంగా అజ్ఞానంవల్ల తురీయం అయిన నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞల స్థాయికి పడిపోయాను. నేను ప్రాజ్ఞ అనుకుంటే పెద్దగా సమస్య లేదు. ఎందుకంటే ప్రాజ్ఞలో అజ్ఞానం మాత్రమే ఉంటుంది కాని అజ్ఞానజనిత పొరపాటు ఉండదు.

విశ్వ, తైజసల్లో అజ్ఞానంతో పాటు, అజ్ఞానజనిత పొరపాటు కూడా ఉంటుంది. స్వప్నంలో స్వప్నప్రపంచం సత్యం అనిపించినట్టుగా, జాగ్రదావస్థలో జాగ్రత్ ప్రపంచం సత్యం అనిపిస్తుంది. పైగా ఆ ప్రపంచంతో మమేకం చెందినకొద్దీ, అది అంతకంతకూ సత్యం అనిపిస్తుంది. ఒక సినిమా చూడటానికి వెళ్ళినప్పుడు సినిమా మొదలయ్యేముందు అది సినిమా అనీ, తెరమీద ఆడే బొమ్మ అనీ మనకు తెలుసు. కాని సినిమా మొదలై, అందులో లీనమయ్యాక, అందులోని సన్నివేశాలతో మమేకం చెందుతాము. హీరోయిన్ ఏడిస్తే ఏడుస్తాము, నవ్వితే నవ్వుతాము. ఒక మామూలు సినిమా తీసిన దర్శకుడు అంతగా మనలను కదిలించగలిగితే, ఈ జగన్నాటక సూత్రధారి తీసిన జీవితమనే సినిమాలో ఇంకెంత మమేకం చెందుతాము?

అందువల్ల మిథ్యా ప్రపంచంతో మమేకం చెందటం మన సమస్యకు కారణం. మనం మమేకం చెందేది ముందుగా మనశ్శరీరాలతో. వాటివల్ల అహంకార మమకారాలు పెరుగుతాయి. నేను, నావారు అనుకుంటాము. నావారులో నా కుటుంబం, నా స్నేహితులు, నా బంధువులు, నా వస్తువులు, నా ఊరు, నా నీటిసమస్య కూడా వస్తుంది. వీటిలో ఎంతగా కూరుకుపోతామంటే, ఇవి ఇంత సత్యంగా కంటికి ఎదురుగా కనిపించి, నన్ను చలింపజేస్తుంటే, జగత్తు మిథ్య అని ఎలా స్వీకరించగలను అనుకుంటాము. దానికి గౌడపాదాచార్యులవారు ఒక అద్భుతమైన పదాన్ని వేశారు. **అభినివేశః.** అభినివేశః అంటే మొండి పట్టుదల.

ఉదాహరణకు ఏదో చిన్న అనారోగ్యం చేసి మీరు డాక్టరు దగ్గరికి వెళ్ళారనుకోండి. డాక్టరు ఏవో పరీక్షలు చేసి, 'ట్యూమర్ ఏమోనని అనుమానంగా ఉంది, మరికొన్ని పరీక్షలు చేద్దాము,' అంటాడు. పరీక్షలు జరగలేదు; ట్యూమర్ ఉందో లేదో తేలీదు; ఒకవేళ ఉన్నా అది క్యాన్సరుకు సంబంధించినదో కాదో తెలీదు. అయినా టెస్ట్, ట్యూమర్ – ఈ రెండు పదాలు చాలు మీ ఆలోచనలు గట్టు తెంచుకుని పరుగెత్తటానికి. ఇంక రకరకాల సన్నివేశాలను ఊహించుకుంటారు. కీమోథెరపీ, రేడియోథెరపీ, పిల్లల భవిష్యత్తు, ఆర్థికసమస్య, కుటుంబ పరిస్థితి – ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు చుట్టుముడతాయి. అవి మనస్సును ఎంతగా తొలిచేస్తాయంటే అది శరీరానికి కూడా పాకి, కంటినిండా నిద్ర కూడా పోనివ్వదు.

మూడురోజులు, ఇలా నరకం అంచుల దాకా వెళ్ళివచ్చాక, రిజల్టు వస్తుంది. ట్యూమర్ లేదు, ఏమీ లేదు. ట్యూమర్ లేకపోతే క్యాన్సరు అసలే లేదు. కానీ ఈ మూడురోజులూ మిమ్మల్ని బాధించింది ఏమిటి? ఉనికే లేని క్యాన్సర్. ఉనికే లేని క్యాన్సర్ ఎలా బాధించింది?

అదే అజ్ఞానంయొక్క గొప్పతనం. లేనే లేని క్యాన్సర్ బాధించగా లేనిది, మీరు ఉందనుకుంటున్న జగత్తు బాధించదా? ఈ జగత్తు బాధించకూడదు అంటే, ఈ క్యాన్సర్ లేదని తెలుసుకున్నట్టుగా వేదాంతం లోతులు కొలిచి, జగత్తు నిజంగా లేదని అర్థం చేసుకోవాలి. అలా అర్థం చేసుకుని, జగత్తును సాక్షిగా చూస్తే, ఈ జీవితం చేసే గారడీని ఆనందిస్తారు.

ఒక నటుడు అనేక పాత్రల్లో నటిస్తాడు. అతనికి తెలుసు, అవేవీ తన అసలు స్వరూపం కాదని. ఒకవేళ అతను ఏదైనా పాత్రతో మమేకం చెందుతున్నట్టు అనిపిస్తే, దానికి అతను చూపాల్సిన పరిష్కారం ఏమిటి? అతను గ్రీన్‌రూమ్‌లోకి వెళ్ళి, 'ఇది నటన మాత్రమే, నేను ఈ పాత్రను కాను,' అని తనకు తాను చెప్పుకోవాలి.

అలా ఈ జీవితంమీద మనం పెంచుకున్న అనుబంధంనుంచి ఎంత కాలంలో బయటపడగలము? అది మనం ఎంత లోతుగా అనుబంధం పెంచుకున్నామనే దానిమీద ఆధారపడివుంటుంది. ఒక గోడకు కొట్టిన మేకును ఊడదీయాలంటే, గోడలో దింపటానికి ఎన్ని సుత్తిదెబ్బలు కొట్టారో, అంతకన్నా ఎక్కువే కొట్టాలి. పది దెబ్బలు కొడితే పది పైనే కొట్టాలి. వంద దెబ్బలు కొడితే, వంద పైనే కొట్టాలి. మనం వేసే పాత్రల్లో మనం లోతుగా కూరుకుపోయాము. నేను తండ్రిని, నేను భర్తను, నేను బంధువును, నేను శిష్యుణ్ణి. ఇటువంటి వాటిల్లో కూరుకుపోయాము.

**పితా నైవ మే నైవ మాతా చ జన్మ**
**న బంధుర్న మిత్రం గురుర్నైవ శిష్యః॥**

ఈ మనశ్శరీరాలమీద, ఈ పాత్రలమీద ఎందుకు మమకారం పెంచుకుంటాము? అజ్ఞానంవల్ల అని చూశాము. అజ్ఞానం ఎప్పుడు వచ్చింది? పుడుతూనే అజ్ఞానంతో పుట్టాము. కాని అదృష్టం ఏమిటంటే అజ్ఞానం అనాదిగా వచ్చినా, దాన్ని పారద్రోలవచ్చు. అది అనాది అయినా దానికొక అంతం ఉంది. అది అనాది, అనంతం కూడా అయితే, ఎప్పటికీ సంసారంలోనే ఉండిపోయేవారం.

దేని గురించిన అజ్ఞానం ఇది? నా స్వరూపమైన తురీయం గురించిన అజ్ఞానం. అజ్ఞానం ఒక్కటే ఉంటే సమస్య లేదు. అజ్ఞానం పొరపాటుకి దారితీస్తుంది. తాడు అజ్ఞానం, పాము పొరపాటుకు దారితీస్తుంది; తురీయ అజ్ఞానం విశ్వ, తైజస, ప్రాజ్ఞ పొరపాటుకు దారితీస్తుంది. నేను విశ్వ అనుకుంటే జాగ్రత్ ప్రపంచం సత్యం అవుతుంది; తైజస అనుకుంటే స్వప్నప్రపంచం సత్యం అవుతుంది.

ఈ అజ్ఞానం మనను ఏడు తప్పటడుగులు వేసి, సంసారంలో పడిపోయేలాగా చేస్తుంది.

అజ్ఞానం → అహంకారం → కామం → కర్మ → కర్మఫలం → సుఖదుఃఖాలు → పునరపి జననం, పునరపి మరణం = సంసారం

అజ్ఞానంవల్ల నేను చేస్తున్నాను అనుకుంటాము. నేను పరిమితి ఉన్న జీవిని అని పొరపాటు పడతాము. దానివల్ల కోరికలు ఏర్పడతాయి. కోరికలు తీర్చుకోవటానికి కర్మలు చేస్తాము. కర్మలవల్ల పుణ్యపాపాలు కలుగుతాయి; పుణ్యపాపాలను సుఖదుఃఖాల రూపంలో అనుభవిస్తాము. వాటిని అనుభవించటానికి ఈ జన్మ చాలదు. అందువల్ల మళ్ళీ మళ్ళీ పుడుతూనే ఉంటాము. ఈ దశల్లో మొదటిదీ, ఆఖరిదీ చూస్తే అజ్ఞానం = సంసారం. అందువల్ల సంసారం పోవాలంటే అజ్ఞానం పోవాలి. ఈ నేపథ్యంతో ఈ కారికలను చూద్దాము.

**కారిక 4.75**

**అభూతాభినివేశోఽస్తి ద్వయం తత్ర న విద్యతే ।**
**ద్వయాభావం స బుద్ధ్వైవ నిర్నిమిత్తో న జాయతే ॥**

**ద్వయం తత్ర న విద్యతే** – బ్రహ్మనుంచి నిజంగా ద్వైతంయొక్క సృష్టి, స్థితి, లయ జరగలేదు. మరయితే ఎదురుగా కనిపిస్తున్నది ఏమిటి?

**అభూతాభినివేశోఽస్తి** – అభూతం అంటే నిజంగా లేదు. అభినివేశః అంటే మొండి పట్టుదల అని చూశాము. లేనిది ఉందనే తీవ్రమైన తపన తప్ప, తురీయదృష్ట్యా నిజంగా అక్కడ జగత్తు లేదు.

కాయిన్ గేమ్ గుర్తుంచుకోండి. ఒక పిల్లవాని నుదుటిమీద నాణేన్ని కాసేపు గట్టిగా నొక్కిపట్టి, తరువాత తీసేస్తారు. నాణెం తీసేసినా కూడా ఇంకా నుదుటిమీద ఉన్న భావనే కొనసాగుతుంది. తరువాత దాన్ని పడేయటానికి, తల వెనుక కొట్టుకోమంటారు. ఎన్నిసార్లు కొట్టినా అది పడదు. అక్కడ నాణెం ఉంటే కదా పడటానికి?

గౌడపాదాచార్యులవారు మనం అవస్థ పడుతున్న ఈ సంసారం కూడా అటువంటిదే అంటున్నారు. మనల్ని మనం ఎంత గట్టిగా కొట్టుకున్నా కూడా అది పోదు. ఎందుకు? సంసారం నిజంగా ఉంటేకదా, పోవటానికి? 'సరే, నాకు సంసారం లేదని అర్థమయింది; కాని దాన్ని ఎలా పారద్రోలాలో చెప్పండి.' ఎవరైనా ఈ ప్రశ్న అడిగితే, వారు పరమానందయ్య శిష్యులతో సమానం. సంసారం నిజంగా లేదు, సంసారం ఉందనుకునే అజ్ఞానం పారద్రోలాలి అని అర్థం చేసుకోవాలి.

**ద్వయాభావం స బుద్ధ్వైవ** – అది అజ్ఞానానికి సంబంధించినది మాత్రమే. ఆ పిల్లవాడు తన తల వెనుక కొట్టుకుంటుంటే, అక్కడ నాణెం లేదని ఒక స్నేహితుడు చెప్పినా నమ్మడు. ఎందుకంటే ఆ నాణెం ఉందన్న ప్రభావం అంత ఎక్కువగా ఉంది. అప్పుడు అతని స్నేహితుడు అద్దం తెచ్చి చూపిస్తాడు.

అలాగే గురువు నీకసలు సంసారమే లేదు అంటే మీరు నమ్మరు. అప్పుడు గురువు శాస్త్రదర్పణాన్ని చూపిస్తాడు. అప్పుడు నమ్ముతారు మీరు.

సః అంటే అలా మొండి పట్టుదలతో ఉన్న అతను; బుద్ధ్వా అంటే తెలుసుకుంటాడు. ఏం తెలుసుకుంటాడు?

ద్వయ అభావం – ద్వైతం నిజంగా లేదని లేదా ద్వైతం మిథ్య అని తెలుసుకుంటాడు. రెండు వాక్యాల అర్థం ఒకటే. ఏదైతే మిథ్యో అది ఉన్నా లేనట్టే అర్థం. ఎండమావిలోని నీరు లేనట్టే లెక్క.

వేదాంతంలో ద్వైతం అంటే సంసారం అని మర్చిపోకూడదు. ద్వైతం సంసారాన్ని పుట్టిస్తుంది అనటం లేదు, ద్వైతం అంటే సంసారం అంటున్నాము. ద్వైతం అంటే దేశం, కాలం వస్తాయి. సుషుప్తిలో ద్వైతం లేదు, కాలం లేదు. పడుకున్న వ్యక్తి ఇంతసేపు పడుకున్నాడు అని చూసినవారు అంటారు కాని గాఢనిద్రలో ఉన్న అతనికి తెలియదు తను ఎంతసేపు పడుకుంటున్నాడో.

ద్వైతం, కాలం చెట్టాపట్టాలు వేసుకుని ఉంటాయి. అందువల్ల ద్వైతం వస్తే, కాలాన్ని స్వీకరించక తప్పదు. కాలం వస్తే మరణాన్ని స్వీకరించక తప్పదు. జన్మమృత్యుజరావ్యాధి దుఃఖాలను కాలం మోసుకుని వస్తుంది. వయస్సు పైనబడుతున్న కొద్దీ, మోకాలి నొప్పి మొదలవుతుంది. ఇది కాలప్రభావం. కాలం కోరల్లో చిక్కుకోక తప్పదు. కాలం ఆడించినట్టు ఆడకా తప్పదు.

**కాలః క్రీడతి గచ్ఛతి ఆయుః।**
**తదపి న ముంచ్యత్యాశావాయుః॥** – భజగోవిందమ్

వయస్సు పెరిగేకొద్దీ నిస్సహాయత పెరుగుతుంది. దానికోసమే కాచుకుని కూర్చుంటుంది ప్రారబ్ధం. అప్పుడు అది వేసే దెబ్బ తీవ్రంగా ఉంటుంది. ఇవన్నీ కాలప్రభావం. ద్వైతంలో ఉన్నంతవరకూ ఈ కాలప్రభావంనుంచి తప్పించుకోలేము. ద్వైతం అంటే సంసారం. అందువల్ల ద్వైత అభావం అంటే సంసార అభావం. సంసార అభావం అంటే నేను తురీయాన్ని, నాకు సంసారం లేదు అనే జ్ఞానం పొందటమే.

**నిర్నిమిత్తః** – జ్ఞానం పొందితే, సంసార కారణం పోతుంది. సంసార కారణం అజ్ఞానం అనీ, అజ్ఞానం వల్ల కలిగిన పొరపాటు అనీ చూశాము. పొరపాటుని మొండి పట్టుదలగా చూశాము ఇక్కడ. ఎప్పుడైతే అజ్ఞానం పోతుందో, అప్పుడే అజ్ఞానంవల్ల ఏర్పడిన మొండి పట్టుదల కూడా పోతుంది. అందువల్ల నిర్నిమిత్తః అంటే అజ్ఞానం అనే కారణం; దానివల్ల ఏర్పడిన పొరపాటు కూడా పోతాయి అని అర్థం.

**న జాయతే** – ఆ జ్ఞాని మళ్ళీ పుట్టడు. నిజానికి జ్ఞానికి మళ్ళీ పుట్టడు పదం కూడా వాడలేము. అతను పుడితే కదా, మళ్ళీ పుట్టటానికి. అతను జనన, మరణాలు లేని తురీయం తానని అర్థం చేసుకుంటాడు. అందువల్ల జన్మమృత్యువృత్తంనుంచి మోక్షం పొందుతాడు.

సంసారానికి పరిష్కారం ఏమిటి? బుద్ధ్వా–జ్ఞానం ప్రాప్య అంటే జ్ఞానం ఒక్కటే సంసారానికి పరిష్కారం. ఈ కారిక చాలా ముఖ్యమైన కారిక.

**కారిక 4.76**

**యదా న లభతే హేతూనుత్తమాధమమధ్యమాన్ ।**
**తదా న జాయతే చిత్తం హేత్వభావే ఫలం కుతః ॥**

ఇదే అంశం కొనసాగుతున్నది ఇంకా. అజ్ఞానం సంసారానికి మూలకారణం, జ్ఞానం పొందటం ఒక్కటే దానికి పరిష్కారమార్గం.

అజ్ఞానం ఎలా కారణం? అజ్ఞానంవల్ల పొరపాటు వస్తుందని చూశాము. క్యాన్సర్ ఉదాహరణ గుర్తు తెచ్చుకోండి. నిజంగా క్యాన్సర్ లేదనే జ్ఞానం కలిగేదాకా, అజ్ఞానంలో ఉన్నారు. ఆ అజ్ఞానం రోగం ఉందనే పొరపాటుకి, తద్వారా ఆందోళన అనే సంసారానికి దారితీసింది.

అదే విధంగా మీరు తురీయం అనే జ్ఞానం లేకపోతే మీరు విశ్వ, తైజస, ప్రాజ్ఞలుగా పొరపాటు పడతారు. స్థూలశరీరంతో మమేకం చెందితే కర్తా, భోక్తా అవుతారు. వాటివల్ల కర్మలు చేస్తారు, ఆ కర్మయొక్క కర్మఫలాలు పొందుతారు.

అజ్ఞానం → దేహ అభిమానం → కర్తా → కర్మ → కర్మఫలం

ఈ కర్మఫలాలు మూడు రకాలని వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. అవి ఉత్తమ, మధ్యమ, అధమఫలాలు. ఉత్తమఫలం ఊర్ధ్వలోకాలకు తీసుకువెళితే, అధమఫలం అధోలోకాలకు తీసుకుని వెళుతుంది. మధ్యమఫలం మధ్యలోకం అయిన మనుష్యలోకానికి తీసుకుని వస్తుంది. ఈ మూడు కర్మఫలాలవల్ల పునరపి జననం, పునరపి మరణం తప్పదు.

వచ్చే జన్మలోనైనా మాండూక్యోపనిషత్ నేర్చుకుంటే సంసారనివృత్తి కలుగుతుంది కాని దానికి సమయమే ఉండదు, లౌకిక సుఖాల వెంట పరుగులు తీయటమే సరిపోతుంది. అందువల్ల మళ్ళీ ఈ కర్మవృత్తం కొనసాగక తప్పదు. దీనంతటికీ కారణం అజ్ఞానం.

తెలివైన వ్యక్తి పీకలదాకా వ్యవహారాల్లో మునిగిపోయినా కూడా, వేదాంతం నేర్చుకోవటానికి కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. మొదట్లో కర్మల్లో కూరుకుపోవచ్చు, నిజానికి శాస్త్రమే అనేక కర్మలను నిర్దేశిస్తుంది. కాని ఎప్పటికీ వాటిల్లో మునిగిపోకుండా, పైకి తేలమంటుంది. మొదట్లో నూరుశాతం కర్మలు చేయటం మాని 75% సమయంలో కర్మలు చేసి 25%

సమయాన్ని వేదాంతానికి కేటాయించాలి. క్రమేపీ 50–50%కి వచ్చి, చివర్లో ఈ నిష్పత్తిని రెండోవైపుకు మార్చగలగాలి. అంటే 25% కర్మలు చేసి 75% వేదాంతం నేర్చుకోవాలి. ఈ నిష్పత్తికి వస్తే, శరీర అభిమానం పోతుంది, కర్తృత్వభావన పోతుంది.

> **తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
> **గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥** – గీత 3.28

జ్ఞానికి దేహ అభిమానం ఉండదు, అందువల్ల అతనికి ఆగామి కర్మఫలాలు అంటవు అని కృష్ణపరమాత్మ చెబుతాడు. అదే భావనను ఈ కారికలో చూస్తాము. ఇప్పుడు కారికను చూద్దాము.

**యదా న లభ్యతే హేతూనుత్తమాధమమధ్యమాన్** – జ్ఞానికి అనే పదాన్ని మనం కలుపుకోవాలి. జ్ఞాని తను తురీయాన్ని అనీ, అకర్తా, అభోక్తా అనీ అర్థం చేసుకుంటాడు. న లభ్యతే – అతను చూడడు; హేతూన్ – పునర్జన్మకు కారణాలను చూడడు. ఏమిటా కారణాలు?

ఉత్తమ అధమ మధ్యమాన్ – ఉత్తమఫలం, అధమఫలం, మధ్యమఫలం. ఉత్తమఫలం పుణ్యం, అధమఫలం పాపం, మధ్యమఫలం మిశ్రమం.

**తదా న జాయతే చిత్తమ్** – చిత్తం అంటే చైతన్యం. ఇక్కడ చైతన్యం అంటే జ్ఞానం పొందిన జీవాత్మ. జీవాత్మకు మళ్ళీ పుట్టుక లేదు. విదేహముక్తి పొందుతాడు. ఎందుకు?

**హేత్వభావే ఫలం కుతః** – కారణం లేకపోతే, దాన్నుంచి వచ్చే కార్యం ఎలా ఉంటుంది?

> **కారణ అభావే కార్య అభావః**
> **పుణ్యపాప అభావే పునర్జన్మ అభావః**

తురీయజ్ఞానం ఎలా పొందాలో ఇక్కడ చెప్పరు గౌడపాదాచార్యులవారు. కాని గురుశాస్త్ర ఉపదేశం ద్వారా పొందాలని చూస్తూనే ఉన్నాము.

### కారిక 4.77

> **అనిమిత్తస్య చిత్తస్య యాఽనుత్పత్తిస్సమాఽద్వయా ।**
> **అజాతస్యైవ సర్వస్య చిత్తదృశ్యం హి తద్యతః ॥**

ఈ కారికలో, ముందు కారిక నేర్చుకుంటే రాగల సందేహాన్ని నివృత్తి చేస్తున్నారు గౌడపాదాచార్యులవారు. ముందు కారిక సారాంశం ఏమిటి? ఎప్పుడైతే కర్మలు జ్ఞానంవల్ల నాశనమవుతాయో అప్పుడే, జ్ఞాని మోక్షం పొందుతాడు. యదా – తదా అంటే ఎప్పుడు, అప్పుడు. అంటే కాలం ప్రస్తావన చాలా స్పష్టంగా వచ్చింది. అందువల్ల ఈ సాధనలన్నీ పాటిస్తే, భవిష్యత్తులో మోక్షం వస్తుందని పొరపాటు పడే ఆస్కారం ఉంది. అంటే మోక్షం భవిష్యత్తులో వచ్చే సంఘటన అనుకునే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదం పూర్తిగా

రూపుదిద్దుకోకముందే దాన్ని పారద్రోలే గురుతమ బాధ్యత గురువుమీద ఉంది. అందువల్ల గౌడపాదాచార్యులవారు, అటువంటి పొరపాటు ఏర్పడేటట్టయితే, అది తప్పు అని, దాన్ని ఖండించదలుచుకున్నారు.

మోక్షం భవిష్యత్తులో కలిగే ఒక సంఘటన కాదు. ఒకవేళ భవిష్యత్తులో వస్తుంది అంటే, ఇంకొొక కాలంలో పోయే ప్రమాదం ఉంది. సంసారం ఫలానారోజు పోయి, మోక్షం వస్తుంది అంటే మోక్షం కూడా ఇంకొొకరోజు పోయే అవకాశం ఉంది. ఎందుకంటే ఆరంభం ఉన్న ప్రతిదానికీ ఒక అంతం ఉంటుంది. ప్రకృతి సూత్రం ఇది.

**జాతస్య హి ధ్రువో మృత్యుః** – గీత

అందువల్ల మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు అని అర్థం చేసుకోవాలి. మోక్షం వస్తుంది అని అన్నాము అంటే నేను బద్ధజీవి అని అనుకునే పొరపాటును తొలగిస్తుంది అని అర్థం. మోక్షం కొత్తగా వచ్చేది కాదు. అది నా స్వరూపం. నేను నిత్య, ముక్త పురుషుణ్ణి. మోక్షం అంటే బుద్ధిలో కలిగే మార్పు. అంతేకాని భవిష్యత్తులో కలిగే సంఘటన కాదు.

దీనికి నసీరుద్దీన్ ముల్లా కథ ఒకటి చూద్దాము. అతని కథలు హాస్యభరితంగా, సరదాగా ఉంటాయి. అంతేకాదు, కొన్నింటిలో లోతైన సిద్ధాంతం కూడా ఉంటుంది. ఒక పౌర్ణమిరాత్రి ముల్లా తన గ్రామంలో ఎక్కడికో వెళుతున్నాడు. దోవలో ఒక బావి కనబడింది. ఆ బావిలో ఏముందో చూడాలనే కుతూహలం కలిగింది. అందులోకి తొంగిచూశాడు. చూస్తే ఏముంది? చందమామ అందులో పడిపోయాడు!

మనకు తెలుసు అసలు విషయమేమిటో! బావి నిండుగా నీరు ఉంది. ఆ నీటిలో పున్నమిచంద్రుని ప్రతిబింబం మెరిసిపోతున్నది. కాని ముల్లా, ముల్లాయే! అయ్యో, చందమామ బావిలో పడిపోయాడు; ఎలాగైనా చందమామని కాపాడాలి అని కంకణం కట్టుకున్నాడు.

ఎక్కడినుంచో ఒక పొడుగుతాడు, దాని చివర ఒక కొక్కెం సంపాదించాడు. ఆ కొక్కేన్ని బావిలోకి వేసి, తాడుతో చందమామను పైకి లేపటానికి ప్రయత్నించసాగాడు. మొదట్లో సాధ్యం కాలేదు, కాని ఎలాగైతేనేం, ఆ కొక్కెంతో చందమామను పట్టుకోగలిగాడు. పట్టుకోగలిగానని అనుకున్నాడు! నిజానికి జరిగినది ఏమిటి? నీటిలో ఒక బండరాయి ఉంది. అతను వేసిన కొక్కెం వెళ్ళి ఆ బండరాయిని పట్టుకుంది. ఇంకేముంది, చందమామను పట్టుకున్నాను అని మురిసిపోయిన ముల్లా, తన శక్తినంతా ఉపయోగించి లాగసాగాడు.

చందమామ రాలేదు సరికదా, అతను బలంగా లాగేసరికి, ఆ తాడు తెగి, అతను ఆమడదూరం వెళ్ళి, వెల్లకిలా పడ్డాడు. చేతులు, కాళ్ళు డోక్కుపోయాయి. కాని అతని మొహం ఆకాశం వైపు ఉండటంతో, అనుకోకుండా ఆకాశం వైపు చూశాడు. ఆకాశంలో

నిండుపున్నమి చందమామ కనిపిస్తున్నాడు. తనను చూసి కృతజ్ఞతాపూర్వకంగా చిరునవ్వులు చిందిస్తున్నట్టుగా అనిపించింది. తనకి కలిగిన దెబ్బలన్నింటినీ మర్చిపోయాడు. తను చేసిన ప్రయత్నంవల్లనే చందమామ తన యథాస్థానానికి చేరుకున్నాడని మురిసిపోయాడు. సంతోషంగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

ఈ కథ సారాంశం ఏమిటి? చందమామ బావిలో పడ్డాడు, తను రక్షించి వెనక్కి, ఆకాశంలోకి పంపాడు అనుకున్నాడు ముల్లా. మీరు అతని తెలివితక్కువతనానికి నవ్వుకుంటున్నారు కదూ! కాని గౌడపాదాచార్యులవారు మీరూ ఏం తక్కువ తినలేదు అని చురకలు వేస్తున్నారు. మీరు కూడా సంసారం అనే బావిలో పడ్డారు అనుకుంటున్నారు. దాన్నుంచి బయటకు రావటానికి వాడుతున్న తాడు – వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, పంచమహాయజ్ఞాలు, ఉపాసన, శ్రవణం, మననం, ఆడియో వినటం, నోట్స్ రాసుకోవటం. చందమామ జీవాత్మ చందమామ; బావి సంసారబావి. కష్టపడి లాగగా, లాగగా, తత్త్వమసి అర్థమవుతుంది. సంతోషంగా, 'నేను మోక్షం పొందాను,' అనుకుంటారు. మీరు ఎప్పుడో మోక్షం పొందారు, 'నేను బావిలో ఉన్నాను,' అనే అపోహ పోతుంది అంతే.

ముల్లా నిజంగా చందమామను రక్షించాడా? లేదు. చందమామ బావిలో పడ్డాడనుకుని పొరపాటు పడ్డాడు; చందమామను తను రక్షించానని భ్రమపడ్డాడు. రెండూ మిథ్యే. అలాగే సంసారం ఉందనుకోవటం ఒక పొరపాటు, సంసారనివృత్తి కలిగిందనుకోవటం ఇంకొక భ్రమ. రెండింటినీ అధ్యాస అంటారు. మరయితే మనకు కలిగే లాభమేమిటి? ముల్లా తన ప్రయత్నంవల్ల లాభం పొందాననుకున్నాడు. మనం కూడా ముల్లాలాగా మన ప్రయత్నంవల్ల మోక్షం పొందామనుకుంటాము. ఇప్పుడు కారిక చూద్దాము.

**చిత్తస్య అనుత్పత్తిః** – ఇక్కడ కూడా చిత్తం అంటే జ్ఞానం పొందిన జీవాత్మ. ఈ జీవాత్మ పునర్జన్మనుంచి విముక్తి పొందింది. ఉత్పత్తి అంటే జన్మ; అనుత్పత్తి అంటే జన్మ లేకపోవటం. చందమామ ముల్లా ప్రయత్నంవల్ల పైకి వెళ్ళిపోయినట్టుగా, మీ ప్రయత్నంవల్ల పునర్జన్మ లేకుండా మోక్షం వచ్చినట్టుగా అనిపిస్తుంది. కాని నిజానికి జీవాత్మ స్వరూపమే నిత్యముక్త స్వరూపం.

**అనిమిత్తస్య** – పునర్జన్మకు కారణమైన కర్మలనుంచి జీవాత్మ ముక్తి పొందింది. నిమిత్తం అంటే కారణం. కారణం దేనికి? పునర్జన్మకు. పునర్జన్మ కారణం ఏమిటి? త్రివిధా కర్మ – ఉత్తమ, అధమ, మధ్యమ కర్మలు. వాటిని నిమిత్తం అంటున్నారు ఇక్కడ. అనిమిత్తం అంటే ఈ మూడురకాల కర్మలు లేవు. పునర్జన్మను తీసుకువచ్చే ఈ మూడు కర్మఫలాలనుంచి విడివడతాడు జ్ఞాని.

**అజాతస్య** – జీవాత్మ పునర్జన్మనుంచి విడివడుతుంది. ఇక్కడ జన్మ అంటే అన్ని వికారాలను కూడా తీసుకోవచ్చు. అందువల్ల నిర్వికార జీవాత్మ, త్రివిధా కర్మరహిత జీవాత్మ.

**సర్వస్య** – ఆ జీవాత్మే ద్వైతప్రపంచంగా కనిపిస్తోంది. ఒక్క జాగ్రత్ పురుషుడే, స్వప్నంలో ప్రమాతగా, ప్రమాణంగా, ప్రమేయంగా కనిపిస్తాడు. అలాగే ఒక్క ఆత్మే సర్వంగా కనిపిస్తోంది. అటువంటి ఆత్మకు,

అనుత్పత్తిః – మోక్షం కలిగింది. భవిష్యత్తులో వచ్చే ఒక సంఘటనగా కనిపించే ఆ మోక్షం; నిజానికి,

సమా – ఎప్పుడూ ఉంది. అది సాధనవల్ల కొత్తగా పొందే మోక్షం కాదు. ఆ మోక్షం అంతకుముందూ ఉంది, ఇప్పుడూ ఉంది, ఇకముందూ ఉంటుంది. అది బావినుంచి మోక్షం పొందిన చందమామలాగా కాదు. చందమామ ఎప్పుడూ ఉన్నాడు ఆకాశంలో. సమా అంటే మూడు అవస్థల్లోనూ జీవాత్మ ముక్తపురుషుడే.

మరి అయితే, కొత్తగా జరిగింది ఏమిటి? నేను బద్ధజీవిని అనుకుని పొరపాటు పడ్డాను. ఇప్పుడు ఆ పొరపాటును పారద్రోలాను. ఆ పొరపాటును వదులుకోవటాన్నే మోక్షం పొందటంగా వర్ణిస్తారు. నిజానికి, కొత్తగా పొందిందేమీ లేదు.

అద్వయా – అద్వయా అంటే దానికి గతం, వర్తమానం, భవిష్యత్తు అనే విభజనలు లేవు. అది ఎప్పుడూ ఒకే స్వరూపం గలది. మోక్షం నిత్యం. మోక్షం నిత్యం అని ఎలా చెబుతాము?

**యతః** – కారణం ఏమిటంటే,

**తత్ చిత్తదృశ్యం హి** – మనం మాట్లాడే ఈ బంధం నిజంగా లేదు. అది మిథ్య. నిజంగా బంధం అంటూ ఉంటే, అది నిజంగా ముగింపుకు రావాలి. నిజంగా మోక్షం పొందాలి. కాని ఆ బంధం నిజం కాదు. అది చిత్తదృశ్యం మాత్రమే. చిత్తదృశ్యం అంటే జననమరణ వృత్తం. ఇది ఒక సాంకేతిక పదం. దీని అర్థం విద్య. అలా ఎలా చెప్పగలము? దృక్‌దృశ్య వివేక ప్రక్రియ చూసినప్పుడు ఈ వివరాలు చూశాము. అవి ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. చిత్తదృశ్యం అంటే ప్రమేయం. ప్రమేయానికి విడిగా ఉనికి లేదు కాబట్టి అది మిథ్య అన్నాము. ప్రమేయం దాన్ని చూసే ప్రమాతమీద ఆధారపడివుంది అని చూశాము. అంతేకాదు, ఏది దృశ్యమో అది మిథ్య అని కూడా చూశాము.

**యత్ దృశ్యం తత్ మిథ్యా**

దృక్ మాత్రమే సత్యం, దృశ్యం మిథ్య. అందువల్ల ఇక్కడ చిత్తదృశ్యం అంటే మిథ్య; తత్ అంటే ఈ సంసారవృత్తం. మొత్తం కలిపితే, ఈ సంసారవృత్తం మిథ్య. అందువల్ల మనకు

ఈ మిథ్యాసంసారంనుంచి నిజం మోక్షం అవసరం లేదు. స్వప్నంలో సమస్య నిజం సమస్య కాదు, దాన్నుంచి లేస్తే చాలు.

స్వప్నంనుంచి లేస్తే సమస్య పరిష్కారం అవదు. స్వప్నంనుంచి లేస్తే, అసలు పరిష్కారం కోరే సమస్యే లేదని అర్థమవుతుంది. అంటే అక్కడ సమస్యను పరిష్కరించలేదు, సమస్యను పారద్రోలాము. పరిష్కారం కోరే సమస్య లేదని అర్థం చేసుకున్నాము.

ముక్తి ఎప్పుడు కలుగుతుంది? 'ముక్తి నా స్వస్వరూపం అని తెలుసు, కాని నేను ఎప్పుడు ముక్తిని పొందుతాను?' అని ఎవరైనా అడిగితే, 'మాండూక్యకారికలు ఇంకా అధ్యయనం చేయండి,' అని చెప్పటమే.

**కారిక 4.78**

**బుద్ధ్వాఽనిమిత్తతాం సత్యాం హేతుం పృథగనాప్నువన్ ।**
**వీతశోకం తథా ఽకామమభయం పదమశ్నుతే ॥**

ఈ మాండూక్య కారికలను అంతకంతకూ అర్థం చేసుకున్నకొద్దీ, తురీయ స్వరూపం గురించిన స్పష్టమైన జ్ఞానం కలుగుతుంది. తురీయం అకర్త; విశ్వ, తైజసలు కర్త. మళ్ళీ ప్రాజ్ఞ అకర్త. అవస్థాత్రయలో ఒకటైన ప్రాజ్ఞే అకర్త అయితే, అవస్థాత్రయ సాక్షి అయిన తురీయం గురించి చెప్పేదేముంది? ఎప్పుడైతే మీరు అకర్త అయిన తురీయం అని అర్థం చేసుకుంటారో, అప్పుడే మీకు సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలు అంటవు. ఆ కర్మలను మీరు కష్టపడి క్షయం చేసుకోనవసరం లేదు. మీకు అసలు కర్మలు లేవు.

**అనిమిత్తతామ్** – దీన్ని అనిమిత్తం అంటారు. కర్మను నిమిత్తం అంటారు. ఎందుకంటే అది పునర్జన్మకు కారణం. నిమిత్తం అంటే పునర్జన్మకు కారణం అని ముందుకూడా చూశాము. అందువల్ల అనిమిత్తం అంటే కర్మరహితం. మీరు సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మరహితం. ఎప్పుడు?

**సత్యమ్** – ఇది మీ స్వరూపం. ఈ కర్మలు మిథ్య. కర్తే మిథ్య అయినప్పుడు, కర్త చేసే కర్మలు ఎలా సత్యమవుతాయి. అందువల్ల మీ కర్మరహితత్వం సత్యం. సత్యం అంటే మీ స్వస్వరూపం. ఇది ఎంత బాగా జీర్ణించుకుంటే, అంత మంచిది. లేకపోతే ఈ కర్మ చేశాక మోక్షం వస్తుంది అనుకుంటారు. లేకపోతే ఎప్పుడు మోక్షం వస్తుందని గురువును అడుగుతారు. ఇది బాగా అర్థమయితేనే, మోక్షం భవిష్యత్తులో వచ్చేది కాదని అర్థమవుతుంది. నిదిధ్యాసనం మోక్షంకోసం చేసే ధ్యానం కాదు. ఇదొకటి బాగా అర్థం చేసుకోవాలి. మోక్షం భవిష్యత్తులో వచ్చేది కాదు, అంటే మోక్షం ఎప్పటికీ రాదు, అది అసాధ్యం అనికాదు అర్థం ఇక్కడ. మోక్షం భవిష్యత్తులో రాదు. ఎందుకంటే మోక్షం మీ స్వరూపం. ఇది స్పష్టంగా అర్థమయ్యేటంతవరకూ శ్రవణ, మనన, నిదిధ్యాసనలు కొనసాగిస్తూనే ఉండాలి.

**బుద్ధ్వా** – నేను ఎప్పటికీ కర్మరహితుణ్ణి అని అర్థం చేసుకోవాలి.

**హేతుం పృథగనాప్నువన్** – కొంతమందికి ఇంకా సందేహం తీరదు. సరే ఇప్పుడు నేను కర్మరహితుణ్ణి, కాని భవిష్యత్తులో మాటేమిటి అనుకుంటారు. ఏదైనా అనారోగ్యం వస్తే, ఇప్పుడు నయమవుతుంది కాని అదే అనారోగ్యం మళ్ళీ రావచ్చు లేదా కొత్తగా ఇంకొక రోగం రావచ్చు. కర్మ గురించి కూడా అలా అనుకునే ప్రమాదం ఉంది.

కాని వేదాంతం సరిగ్గా అర్థమయితే, ఇటువంటి సందేహాలకు చోటులేదు. నేను కర్మ రహితమే కాదు, కొత్తగా కర్మను కూడా పొందలేనని అర్థం చేసుకోగలుగుతారు. ఎందుకు? కర్మ కర్తకు మాత్రమే చెందుతుంది. మీరు అకర్తా తురీయం అయితే, కర్మఫలం ఎలా వస్తుంది మీకు? అందువల్ల హేతుం న ఆప్నువన్ అంటే కొత్త కర్మలు రావు. కొత్త కర్మ అంటే ఆగామికర్మ. సంచితకర్మలు దగ్ధమయిపోతాయి, ఆగామికర్మలు రావు. కృష్ణపరమాత్మ ఈ విషయాన్ని పదేపదే బోధిస్తాడు. చూస్తున్నా, వింటున్నా, ముట్టుకుంటున్నా, వాసన పీలుస్తున్నా, తింటున్నా, నడుస్తున్నా, ఏం చేస్తున్నా నేను చేస్తున్నాను అనుకోడు జ్ఞాని. అందువల్ల పృథగ్ హేతు అంటే కొత్త కర్మ; అనాప్నువన్ అంటే రాదు. కొత్త కర్మలు రావు. ఈ సత్యాన్ని అర్థం చేసుకుంటే,

**పదమశ్నుతే** – ఇది కొందరు గురువులు చెప్పిందో, శాస్త్రం చెప్పిందో కాదు, ఇది సత్యం అని ఎప్పుడైతే అర్థం చేసుకుంటాడో అప్పుడు ఆ జ్ఞాని మోక్షపదాన్ని 'పొందుతాడు'. పొందుతాడు అంటే నిజంగా పొందుతాడని కాదు అర్థం. మోక్షంకోసం చేసే సాధన ముగుస్తుంది. తనుసాధకుడు కాదు, సిద్ధపురుషుడు అని అర్థం చేసుకుంటాడు. ఎటువంటి మోక్షం అది?

**వీతశోకమ్** – దీని ద్వారా మోక్షులాన్ని స్తుతిస్తున్నారు. అన్నిరకాల దుఃఖాలనుంచి విడివడతాడు జ్ఞాని.

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః** – గీత 2.11

గీతలో కృష్ణపరమాత్మ అనేక సందర్భాలలో మోక్షం అంటే శోకనివృత్తిగా అభివర్ణిస్తాడు.

**అకామమ్** – ఇది ఇంకొక నిర్వచనం. సకామ కోరికలు ఉండవు. ఈ సకామ కోరికలు అపూర్ణత్వభావనవల్ల కలుగుతాయి. జ్ఞాని తను పూర్ణుడను అని అర్థం చేసుకుంటాడు కాబట్టి, అతనికి ఏ కోరికలూ ఉండవు. ఒకవేళ ఏదైనా కోరిక ఉంటే, ఆ కోరిక పూర్ణత్వం**కోసం** కాదు, పూర్ణత్వం**వల్ల** వస్తుంది. అంటే తన స్వార్థంకోసం కాదు, లోకసంగ్రహంకోసం కోరుతాడు. అలా బంధించని కోరికలు ఎన్నైనా ఉండవచ్చు. అందువల్ల జ్ఞానికి కోరికలు ఉండవు.

**అభయమ్** – ప్రతిమనిషీ జీవితంలో కోరుకునేది మూడే. అవి – శాంతి, భద్రత, ఆనందం. అభద్రతాభావన ఎక్కువగా మనిషిని పట్టిపీడిస్తుంది. జీవితంలో అతను ఏం పొందినా –

పేరు ప్రఖ్యాతులు, ఆస్తులు, బంధాలు – వాటి వెనకనున్న ఏకైక ప్రాథమిక కారణం – అభద్రతాభావన. తమాషా ఏమిటంటే, వయస్సు పైబడుతున్నకొద్దీ ఇది అంతకంతకూ ఎక్కువవుతుంది. నిజానికి వయస్సు పైబడేసరికి మీకు కావలసినవన్నీ పొందివుంటారు కాని అప్పుడే అభద్రతాభావన పెరుగుతుంది. పిల్లలు మీతోనే ఉండాలనీ, రోజూ మాట్లాడుతూ ఉండాలనీ అనిపిస్తుంది. భయం సంసారం అయితే, అభయం మోక్షం.

**అభయం ప్రతిష్ఠితాం విందతే**

అందువల్ల ఇక్కడ వర్ణించిన మోక్షఫలాలు మూడు. అవి వీతశోకం, అకామం, అభయం.

కారికలు 75లోనూ, 78లోనూ గౌడపాదాచార్యులవారు **బుద్ధ్వా** పదాన్ని వేశారు. దీని అర్థం మోక్షం పొందటానికి ఒక్కటే మార్గం ఉంది. అది జ్ఞానం మాత్రమే. కర్మ, భక్తి, ఉపాసనల మాటేమిటి? వాటి ఫలాలని మనం కించపరటం లేదు కాని వాటి పరిమితి తెలుసుకోమంటున్నాము. కర్మ, భక్తి అద్భుతం, నామజపం మంచిది, సంఘసేవ మెచ్చుకోదగినది, ఉపాసనలు గొప్పవి, అష్టాంగయోగం చాలా ఉపయోగకరమైనది; కాని ఇవేవీ మోక్షాన్ని ఇవ్వలేవు. అవి జ్ఞానం పొందటానికి సిద్ధం చేస్తాయి; అంటే జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇస్తాయి. జ్ఞానం శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే పొందాలి. ఇవన్నీ సహకారీ సాధనలు, జ్ఞానం సాక్షాత్ సాధన మోక్షం పొందటానికి. అందువల్ల మీరే మార్గం ఎన్నుకున్నా, చివరికి జ్ఞానమార్గానికి రాకతప్పదు.

శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయక తప్పదు. ఎవరు అంటున్నారు ఈ మాట? గౌడపాదాచార్యులవారే అంటున్నారు. బుద్ధ్వా అంటే అర్థం అదీ. జ్ఞానం పొందితేనే మోక్షం.

## కారిక 4.79

**అభూతాభినివేశాద్ధి సదృశే తత్ప్రవర్తతే ।**
**వస్త్వభావం స బుద్ధ్వైవ నిస్సంగం వినివర్తతే ॥**

జ్ఞానం పొందితేనే మోక్షం అని గౌడపాదాచార్యులవారు అంటున్నారని ఇప్పుడే చూశాము. అలా ఎందుకంటున్నారో ఇక్కడ తార్కికంగా నిరూపిస్తున్నారు. అజ్ఞానం ఎలా సంసారంలోనే ఉంచుతుందో, జ్ఞానం ఎలా సంసారబంధంనుంచి విముక్తినిస్తుందో చూపిస్తున్నారు. జ్ఞానం మాత్రమే మోక్షాన్నిస్తుందనేది ఉన్మాదం కాదు. ఇది గుడ్డి నమ్మకం అంతకన్నా కాదు.

చీకటిని వెలుతురు మాత్రమే పారద్రోలుతుందని అంటే, అందులో ఉన్మాదం ఏం ఉంది? గుడ్డి నమ్మకం ఏం ఉంది? చీకటిని అనేక మార్గాల ద్వారా పారద్రోలగలమా? లేదే! ఒకటే మార్గం ఉంది. అది సత్యం. ఒక చీకటిగదిలో మీరు కూర్చుని విష్ణుసహస్రనామం చదివారనుకోండి, చీకటి పోతుందా? మీ భక్తివల్ల పుణ్యం వస్తుంది. ఆ గది ఊడ్చి, ముగ్గులు

పెట్టారు. చీకటి పోయిందా? మీరు చేసిన కర్మవల్ల మీకు పుణ్యం వస్తుంది. మీరు శీర్షాసనం వేశారు. చీకటి పోయిందా? ఆ యోగాసనంవల్ల మీ రక్తప్రసరణ మెరుగుపడుతుంది. అందువల్ల చీకటిని పారద్రోలటానికి అనేక మార్గాలున్నాయనుకోవటం ఎంత అర్థంలేని పనో, అలాగే మోక్షానికి అనేక మార్గాలున్నాయి అనుకోవటం కూడా అంతే అర్థంలేని పని.

మీరెందుకు అంత ఉన్మాదంగా మాట్లాడుతున్నారు? కర్మ, ఉపాసన, భక్తి, యోగం – ఇలా అనేక మార్గాలను చెప్పవచ్చు కదా అని ఎవరైనా అంటే, అవేవీ కుదరవు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అవన్నీ చిత్తశుద్ధికి అనేక మార్గాలు కాని, మోక్షానికి జ్ఞానమొక్కటే మార్గం. గుడిలోకి అనేక ద్వారాల ద్వారా వెళ్ళవచ్చేమో కాని, గర్భగుడిలోకి ఒక్క మార్గం ద్వారానే వెళ్ళాలి.

**అభూతాభినివేశః** – అభూతం అంటే మిథ్య. భూతం అంటే ఉనికి ఉన్నది; అభూతం అంటే నిజంగా ఉనికి లేనిది. ఇక్కడ మిథ్య అనేది మిథ్యాశరీరం గురించి. అభినివేశః అంటే మొండి పట్టుదల అని చూశాము. ఇక్కడ శరీరంమీద గట్టి అభిమానం అని అర్థం తీసుకోవచ్చు. శరీరపోషణ చేయవచ్చు కానీ, శరీరంతో అతిగా మమేకం చెందకూడదు. కాని ఈ దేహాభిమానాన్ని చూసే అనేక బ్యూటీపార్లర్లు రాజ్యమేలుతున్నాయి.

దేహాభిమానం ఉంటే అది అక్కడితో ఆగదు. దేహానికి సంబంధించిన వాటన్నిటిమీదా అభిమానం పెరుగుతుంది. దీనికొక సూత్రం ఉంది – ఒక మిథ్యావస్తువు పరంగా చూస్తే, ఇంకొక మిథ్యావస్తువు కూడా సత్యం అవుతుంది. స్వప్నశరీరపరంగా, స్వప్న పులి సత్యమే అవుతుంది. అలాగే జాగ్రత్ శరీరపరంగా, జాగ్రత్ ప్రపంచంలోని పదార్థాలు సత్యమే అవుతాయి. అన్నింటికన్నా దేహాభిమానం ఎక్కువైతే, ఈ జాగ్రత్ ప్రపంచంలో ఈ శరీరానికి భద్రతను ఇచ్చేదేదైనా చాలా ముఖ్యమైన వస్తువు అవుతుంది.

మిథ్యాశరీరం ఎప్పుడైతే సత్యవస్తువులా అనిపిస్తుందో, అప్పుడే మిథ్యాధనం, మిథ్యా మనుష్యులు, మిథ్యానామం, మిథ్యాహోదా – అన్నీ సత్యం అయికూర్చుంటాయి. నిజానికి మీరు చూసే ప్రతివస్తువుమీద, కొన్ని క్షణాలలోనే రాగమో, ద్వేషమో పెంచుకుంటారు. అమెరికా దేశస్థుడు, ఆస్ట్రేలియా దేశస్థుల మధ్య జరిగే టెన్నిస్‌మ్యాచ్ చూస్తున్నా, వారిలో ఎవరి మీదా మీకు సాధారణంగా అభిమానం ఉండే అవకాశం లేకపోయినా కూడా, ఆట ముగిసేలోపు ఒకరిమీద అభిమానం పెంచుకుని, వారు గెలవాలని కోరుకుంటారు.

అలా దేన్ని చూస్తే, దానికి బంకలాగా అతుక్కుపోయే శక్తి ఉంటుంది మనస్సుకి. అందువల్ల జాగ్రత్ పురుషునిగా అంటే విశ్వగా మిమ్మల్ని మీరు భావించుకున్నంతవరకూ రాగద్వేషాలను తప్పించుకోలేరు. రాగద్వేషాలు ప్రవృత్తిని, నివృత్తిని సూచిస్తాయి. ప్రవృత్తి

అంటే ఒకదాని వెంట వెళ్ళటం; నివృత్తి అంటే దానికి దూరంగా వెళ్ళటం. అభూత అభినివేశ అంటే ఈ మిథ్యాశరీరంమీద ఉన్న తీవ్రమైన మమకారంవల్ల,

**సదృశే** – దీన్ని పోలివున్న వస్తువుమీద కూడా అభిమానం ఏర్పడుతుంది. స్థూలశరీరాన్ని పోలిన వస్తువు స్థూలప్రపంచం.

**ప్రవర్తతే** – ఈ మిథ్యా స్థూలప్రపంచంమీద మమకారం పెంచుకుంటారు. నిజానికి మనస్సు నిరంతరం కోరే వస్తువుల పట్టికను కాగితంమీద రాసి చూశారంటే, అది కోరేది సగుణ ప్రపంచంలోని వస్తువులను. ఎందుకంటే, అది సగుణ శరీరంతో మమేకం చెందింది కాబట్టి. మిథ్యావస్తువు, మిథ్యావస్తువునే సత్యం అనుకుంటుంది. వాటి వెంట పరుగులు తీస్తుంది. సత్య అధిష్ఠానం గురించి ఆగి, ఆలోచించే తీరికే లేదు. ఇంకా చాలాకాలం ఉందిలే అనుకుంటారు కాని ఎప్పుడో చెప్పాపెట్టకుండా యమధర్మరాజు వచ్చేస్తాడు.

ఆ విధంగా మీరు మిథ్యావస్తువును సత్యవస్తువుగా పొరపాటుపడి, ప్రవృత్తి మార్గంలో వెళుతూ ఉంటారు. ఈ నిరంతర పోరాటం ముగిసేదెలా? దీనికి ఒకటే మార్గం ఉంది. అది మీ ఉన్నత స్వరూపం గురించి తెలుసుకోవటమే. ఎలాగైతే స్వప్నంనుంచి మీ ఉన్నత స్థాయికైన జాగ్రత్ పురుషునికి లేస్తే ఎలా స్వప్నశరీరం–స్వప్నప్రపంచం మిథ్యగా తేలిపోతాయో, అలాగే మీ ఉన్నతస్థాయి అయిన తురీయానికి లేస్తే, ఈ జాగ్రత్ శరీరం–జాగ్రత్ ప్రపంచం మిథ్యగా తేలిపోతాయి.

**సః బుద్ధ్వా** – మళ్ళీ బుద్ధ్వా పదం వచ్చింది. బుద్ధ్వా అంటే జ్ఞానంవల్లనే మోక్షం పొందగలమని చూశాము. తురీయజ్ఞానం పొందటం ఒక్కటే అంతిమమార్గం. సః బుద్ధ్వా ద్వారా, గౌడపాదాచార్యులవారు మంత్రం 7లోని పదాలను గుర్తు చేస్తున్నారు.

**స ఆత్మా స విజ్ఞేయః**

అందువల్ల సమయం లేదు అనుకోకుండా, ఆత్మజ్ఞానం పొందటానికి సమయాన్ని కేటాయించుకోవాలి. ఎలా ఆత్మజ్ఞానం పొందాలో ఇక్కడ చెప్పరు. మనం కలుపుకోవాలి.

గురు సహాయంతో వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసన చేయటం ద్వారా ఈ విషయాన్ని పదేపదే గుర్తు తెచ్చుకోవాలి. తురీయం స్థాయికి ఎదిగితే స్వప్నప్రపంచం కల 1 అయితే, జాగ్రత్ ప్రపంచం కల 2 అని అర్థమవుతుంది. రెండూ మిథ్యే అని తెలుస్తుంది.

**వస్త్వభావం (బుద్ధ్వా)** – జాగ్రత్ ప్రపంచం మిథ్య అని తెలుస్తుంది. వస్తు అంటే ఇక్కడ ద్వైత ప్రపంచం; అభావ అంటే ఉనికి లేకపోవటం. నిద్రనుంచి లేస్తే, ఎలా స్వప్నప్రపంచం మిథ్యగా తేలిపోతుందో, అలా తురీయం స్థాయికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్యగా తేలిపోతుంది.

**న భూమిరాపో న చ వహ్నిరస్తి**
**న చ అనిలో మే అస్తి న చాంబరం చ** – కైవల్యమ్

కాని ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. స్వప్నప్రపంచంనుంచి లేస్తే, స్వప్నప్రపంచం కంటిముందునుంచి మాయమవుతుంది; కాని జాగ్రత్ ప్రపంచంనుంచి లేస్తే అది కంటిముందునుంచి మాయమవదు. ద్వైతప్రపంచ అనుభవం కొనసాగుతూనే ఉంటుంది. మరయితే ఏమిటి భేదం?

అంతకుముందు ద్వైతప్రపంచాన్ని అనుభవిస్తున్నప్పుడు అదే సత్యమనే భ్రమలో ఉన్నారు. ఇప్పుడు జ్ఞానం పొందాక కూడా దాన్ని అనుభవిస్తారు కాని, దానికి సత్యాత్మభావనను ఇవ్వరు. మీకూ, అజ్ఞానికీ అనుభవం స్థాయిలో ఏమీ మార్పు ఉండదు కాని, ఆలోచనల్లో భేదం ఉంటుంది. ఇద్దరూ చూస్తున్నది ఒకటే ద్వైతప్రపంచాన్ని కాని అజ్ఞాని అది సత్యం అనుకుంటే, జ్ఞానం పొందాక మీరు దాన్ని మిథ్యగా అర్థం చేసుకుంటారు. దీనికి ఉదాహరణ సూర్యోదయం. సూర్యుడు నిజంగా ఉదయించకపోయినా, ఆ విషయం తెలిసినా, సూర్యోదయాన్ని అనుభవిస్తారు. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతుంది కాని మీకు భూమి కదలనట్టుగా అనుభవంలోకి వస్తుంది.

అందువల్ల జ్ఞానం పొందాక కూడా అనుభవం కొనసాగుతుంది కాని మీ బుద్ధిలో మార్పు కలుగుతుంది. జ్ఞానం పొందాక కూడా ద్వైత అనుభవం కొనసాగుతుంది కాని ద్వైత సత్యత్వభ్రాంతి పోతుంది. వస్తు అభావం సః బుద్ధ్వా అర్థం ఇదీ.

ఈ జ్ఞానం పొందటంవల్ల కలిగే లాభం ఏమిటి? మిథ్యావస్తువుమీద రాగద్వేషాలు ఏర్పడవు. ఐదువందల రూపాయల నోటు మామూలుగా మీకు చాలా విలువైనది కాని ఆ నోటు దొంగనోటు అని తెలిస్తే, దానిమీద ఉన్న మమకారం దానంతట అదే పోతుంది.

అదే విధంగా తాడు-పాము దృష్టాంతంలో పామును చూసి భయపడ్డారు కాని అది పాము కాదు, తాడు అని చెప్పగానే, దాన్ని చూసిన భయం దానంతట అదే పోయింది. అలాగే జాగ్రత్ ప్రపంచంమీద రాగద్వేషాలు పెంచుకున్నారు కాని అది మిథ్యాప్రపంచం అని తెలిస్తే, దానిమీద ఉన్న రాగద్వేషాలు వాటంతట అవే పోతాయి.

**నిస్సంగం వినివర్తతే** – జ్ఞాని మిథ్యాప్రపంచంమీద ఉన్న సంగత్వాన్ని వదులుకుంటాడు. ఎప్పుడైతే సంగత్వాన్ని వదులుకుంటాడో, అప్పుడే సంసారం అతన్ని బాధించదు. ఎండమావుల వెంట ఎలా పడడో, మిథ్యాప్రపంచం వెంట అలా పడదు. ఎండమావులలో నీరు వెంట జ్ఞాని పడదు. దానికి రెండు కారణాలు చెప్పవచ్చు. ఒకటి, ఎండమావుల వెంట పడటంవల్ల అతని దాహం తీరదు. రెండవది, వాటివెంట పడటంవల్ల దాహం తీరకపోగా, ఇంకా

ఎక్కువవుతుంది. అదే ఎండమావుల వెంట పడకపోతే, అతని దాహం తీరకపోయినా, కనీసం ఎక్కువవదు. వినివర్తతే అంటే సంసారంనుంచి విడివడతాడు. దాన్నే మోక్షం అంటారు.

**కారిక 4.80**

**నివృత్తస్యాప్రవృత్తస్య నిశ్చలా హి తదా స్థితిః ।**
**విషయస్స హి బుద్ధానాం తత్సామ్యమజమద్వయమ్ ॥**

జ్ఞాని భద్రతను బాహ్యవస్తువునుంచి కోరదు. అతనికి బాహ్యవస్తువు మిథ్య అనీ, తనే తురీయంగా ఆనందస్వరూపుడనీ, శాంతి, భద్రతలు తనలోనే దొరుకుతాయనీ తెలుసు. ఆ భావాన్నే ఈ కారికలో చూస్తాము.

**నివృత్తస్య** – తను ఏ ప్రపంచం నుంచైతే భద్రతను ఇన్నాళ్ళూ కోరాడో, అది మిథ్యాప్రపంచం అని గ్రహించిన జ్ఞాని దాన్నుంచి వెనకకు మరలుతాడు. అది తాత్కాలికం కాదు, శాశ్వతం. కొంతమంది ఒక వస్తువుమీద వైరాగ్యం పెంచుకుని, ఇంకొక వస్తువు వెంట పరుగులు తీస్తారు.

**అప్రవృత్తస్య** – కాని, జ్ఞాని ఒకసారి వదిలిన ద్వైతప్రపంచం వెంట మళ్ళీ పడడు. అది మిథ్య, తనే ఆనందస్వరూపుడనే జ్ఞానంలో నెలకొని ఉంటాడు.

కొంతమంది ఇల్లు సర్దినప్పుడు చాలా వస్తువులు నిరుపయోగంగా ఉన్నాయనీ, వాటిని ఎవరికైనా ఇచ్చేయాలనీ పక్కన పెడతారు. కానీ తీరా ఇవ్వాల్సినరోజు వచ్చేసరికి, అన్నీ ఇవ్వటానికి మనస్సు ఒప్పదు. వాటిలో సగంపైగా వస్తువులను మళ్ళీ వెనక్కు పెట్టేస్తారు. అంటే నివృత్తినుంచి మళ్ళీ ప్రవృత్తికి వస్తారు. కాని జ్ఞాని అలా చేయడు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఒకసారి నివృత్తి మార్గానికి వెళ్ళాడంటే, నివృత్తిలోనే నిలబడతాడు. మళ్ళీ దానిమీద మోజు పెంచుకోడు. అతని మనఃస్థితి ఎలా ఉంటుంది?

**తదా** – నివృత్తి మార్గంలోకి వచ్చినప్పుడు,

**స్థితిః నిశ్చలా** – మనస్సు నిశ్చలంగా, చలనం లేకుండా ఉంటుంది. అతనికుండే ప్రశాంత మనస్సును వర్ణించలేము. అది జ్ఞానులు మాత్రమే అర్థం చేసుకోగలరు. అజ్ఞానీ సంసారులకు అర్థం కాదీ ప్రశాంతత.

**సః** – ఆ శాంతి, ఆ నిశ్చలత్వం, ఆ సమత్వం,

**బుద్ధానాం విషయః** – జ్ఞానులు మాత్రమే పొందగలరు. ఆ మోక్ష అవస్థను జీవన్ముక్తి అంటారు. జ్ఞానఫలంగా కలిగే జీవన్ముక్తి జ్ఞానిని బ్రహ్మతో సమానం చేస్తుంది.

**తత్ సామ్యమ్ అజమ్ అద్వయమ్** – శాస్త్రం మోక్షాన్ని బ్రహ్మతో సమానంగా వర్ణిస్తుంది. మోక్షం అంటే జ్ఞానంవల్ల మనస్సు పొందే ప్రశాంతత. ఎందుకు బ్రహ్మతో పోలుస్తుంది?

జ్ఞాని ఉన్నదంతా బ్రహ్మే అని అర్థం చేసుకుంటాడు. ఉన్నదంతా బ్రహ్మేలో అతని ప్రశాంత మనస్సు కూడా వస్తుంది. అందువల్ల మోక్షాన్ని బ్రహ్మతో పోలుస్తుంది శాస్త్రం. గౌడపాదాచార్యులవారు కూడా ఇక్కడ అదేపని చేస్తున్నారు. మోక్షాన్ని బ్రహ్మతో పోలుస్తున్నారు. అందువల్లనే జ్ఞాని అనుభవించే మోక్షం బ్రహ్మతో సమానం అంటున్నారు. జ్ఞాని పొందే ప్రశాంతత, లౌకిక జీవనంలో పొందే ప్రశాంతతలాగా తాత్కాలికం కాదు.

లౌకిక జీవనంలో ముందు మీ అబ్బాయి చదువు గురించి ఆందోళన చెందుతూ ఉంటారు. అతను ఇంటర్మీడియెట్‌లో 98% తెచ్చుకుంటాడు. మీరు చాలా ఆనందిస్తారు. మనస్సు తేలికవుతుంది. కాని ఎన్నాళ్ళు? కొన్నాళ్ళే. మళ్ళీ మంచి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వస్తుందో లేదో అనే బెంగ వెంటాడుతుంది. దాని తర్వాత ఉద్యోగం. చదువు, ఉద్యోగం, పెళ్ళి అన్నీ సక్రమంగా అవుతాయి. అప్పుడన్నా నిశ్చింతగా ఉంటారా? అబ్బాయి పెళ్ళయి ఐదేళ్ళయిపోయింది, ఇంకా వారికొక అమ్మాయో, అబ్బాయో పుట్టలేదనే బెంగ కొత్తగా చోటు చేసుకుంటుంది.

ఇది ఒక అంతులేని పోరాటం. లౌకిక జీవనం ఆనందం ఇచ్చినా అది శాశ్వతం కాదు. శాశ్వతమైన ఆనందం పొందాలంటే దానికి ఒకటే మార్గం. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందాలి. లేకపోతే వేలకొద్దీ ఎపిసోడ్స్‌కి సాగిపోతున్న సీరియల్‌లాగా ఉంటుంది జీవితం. దానికీ ముగింపు ఉండదు, మీ జీవన పోరాటానికీ ముగింపు ఉండదు. కర్తగా మిమ్మల్ని మీరు భావించుకున్నన్నాళ్ళూ ఆనందం పొందటం అడియాసే అవుతుంది. శాశ్వతానందం పొందాలంటే అహం అకర్తా అస్మి జ్ఞానం పొందాలి. అదొక్కటే మార్గం.

ఈ జ్ఞానం గొప్పదనం ఏమిటంటే, మీ జీవితంలో ఏ ఒడిదుడుకులు ఎదురైనా అది మారదు. 2+2=4. ఇది సర్వజనీన జ్ఞానం. ఇది మీ ఆరోగ్యం ఎలా ఉన్నా మారదు. అలాగే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం మీరు శనిదశలో ఉన్నా కూడా మారదు. శనిదశను మీరు తప్పించుకోలేకపోవచ్చు కాని, జ్ఞానజన్య శాంతి కొనసాగుతుంది.

అజమ్ - ఈ మోక్షం బ్రహ్మతో సమానం. అది పుట్టుకలేనిది అవుతుంది.

అద్వయమ్ - రెండవది లేనిది అవుతుంది. మోక్షం బ్రహ్మతో సమానం కాబట్టి అది కూడా పుట్టుక లేనిది, అద్వయం. మోక్షం నిత్యం అని చూస్తూనే ఉన్నాము కదా!

**కారిక 4.81**

**అజమనిద్రమస్వప్నం ప్రభాతం భవతి స్వయమ్ ।**
**సకృద్విభాతో హ్యేవైష ధర్మో ధాతుస్వభావతః ॥**

ఈ కారికలో కూడా గౌడపాదాచార్యులవారు మోక్షాన్ని బ్రహ్మతో పోలుస్తున్నారు. సాంకేతికంగా చూస్తే అవి రెండూ భిన్నం. మోక్షం అంటే జ్ఞానంవల్ల పొందిన ప్రశాంతమైన మనస్సు.

**జ్ఞానజన్య మనస్థితిః మోక్షః**

మోక్షం, బ్రహ్మకన్నా భిన్నమైతే మోక్షాన్ని ఎందుకు బ్రహ్మతో సమానం చేశారో, ఇప్పుడే చూశాము. ఉన్నదంతా బ్రహ్మే అంటే ప్రశాంత మనస్సు కూడా బ్రహ్మలోకి వస్తుంది. అందువల్ల మోక్షాన్ని బ్రహ్మతోనూ, ఆత్మతోనూ పోలుస్తున్నారు.

**ధర్మః** – మోక్షం అంటే ఆత్మకు భిన్నం కాదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ధర్మం అంటే ఇక్కడ ఆత్మ. మామూలుగా ధర్మం అంటే ధర్మార్థకామమోక్షాల్లోని ధర్మం అర్థం వస్తుంది. ఆ ధర్మం అర్థం ఉన్నతమైన కర్మ, పుణ్యఫలం. సత్కర్మను, సత్కర్మ ఫలాన్ని ధర్మం అంటారు. కాని ధర్మం అర్థం ఆత్మ అనికూడా వస్తుంది. ఆ అర్థాన్ని కఠోపనిషత్తులో చూస్తాము.

**అణురేష ధర్మః దేవైరత్రాపి విచికిత్సితం పురా**
**న హి సువిజ్ఞేయమణురేష ధర్మః** – కఠ

అదే అర్థాన్ని వాడుతున్నారు గౌడపాదాచార్యులవారు కూడా ఇక్కడ.

**అజమనిద్రమస్వప్నమ్** – ఇది తురీయస్వరూపం. ఇవే పదాలను తురీయం గురించి వర్ణించేటప్పుడు వాడారు గౌడపాదాచార్యులవారు.

అజమ్ – అజం అంటే పుట్టుకలేనిది. పుట్టుక స్థూలశరీరానికి చెందినది. కాబట్టిఅజమ్ అంటే స్థూలశరీరం లేనిది.

అస్వప్నమ్ – అస్వప్నమ్ అంటే అక్షరాలా చూస్తే కలలు లేనిది. స్వప్నం మన వాసనలనుంచి వస్తుంది; వాసనలు మనస్సుయొక్క చిత్తానికి చెందినవి; మనస్సు సూక్ష్మశరీరానికి చెందినది. కాబట్టి అస్వప్నమ్ అంటే సూక్ష్మశరీరం లేనిది.

అనిద్రమ్ – అక్షరాలా చూస్తే నిద్రలేనిది. నిద్ర కారణ శరీరానికి చెందినది. అందువల్ల అనిద్రం అంటే కారణశరీరం లేనిది. ఈ మూడు పదాలూ కలిపితే,

**స్థూల–సూక్ష్మ–కారణ–శరీర–సంబంధ–రహితమ్ ఆత్మా**

అటువంటి ఆత్మ లక్షణం ఏమిటి?

**స్వయం ప్రభాతమ్** – అది శుద్ధచైతన్యం తప్ప వేరే ఏమీ కాదు. విశ్వ, తైజస, ప్రాజ్ఞలు పదార్థానికి చెందినవి కాని తురీయం పదార్థం కాదు; అది శుద్ధచైతన్యం. చైతన్యం గురించి నేర్చుకునే లక్షణాలను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. అది స్వయంప్రకాశక జ్యోతి, శుద్ధచైతన్యమే మోక్షం.

**సకృద్విభాతః** – ఈ చైతన్యం స్వయంప్రకాశక జ్యోతి మాత్రమే కాదు, నిత్యప్రకాశకం కూడా. **ధాతు స్వభావతః** – దాని ప్రకాశకత్వం దాని స్వరూపం, అది ఆగంతుక లక్షణం కాదు. స్థూలశరీరం స్వతహాగా జడం, కాని సూక్ష్మశరీరంనుంచి చైతన్యాన్ని అరువు తెచ్చుకుంది. ఎలా చెప్పగలము? మరణ సమయంలో, సూక్ష్మశరీరం, స్థూలశరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అప్పుడు స్థూలశరీరాన్ని ముట్టుకుంటే శరీరం చల్లగా, కట్టెలాగా మిగులుతుంది. ఎంత దగ్గరవారు కూడా ఆ శరీరాన్ని కొన్ని రోజులు అట్టిపెట్టుకోవాలని ఆశించరు.

అలాగే మనస్సు కూడా పాంచభౌతికం కాబట్టి, మనస్సు కూడా జడం. మనస్సు చైతన్యాన్ని శుద్ధచైతన్యంనుంచి అరువు తెచ్చుకుంది. మనస్సునుంచి శరీరం, చైతన్యం నుంచి మనస్సు చైతన్యాన్ని అరువు తెచ్చుకుంటే, చైతన్యం లేదా ఆత్మ దేన్నుంచి అరువు తెచ్చుకుంది? చైతన్యం లేదా ఆత్మ స్వయంప్రకాశకం. అది చైతన్యాన్ని అరువు ఇస్తుంది కాని, దేన్నుంచీ అరువు తెచ్చుకోదు. ధాతు స్వభావతః అంటే వస్తు స్వభావతః.

**కారిక 4.82**

**సుఖమావ్రియతే నిత్యం దుఃఖం వివ్రియతే సదా ।**

**యస్య కస్య చ ధర్మస్య గ్రహేణ భగవానసౌ ॥**

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ప్రతి సాధకుడూ ఎదుర్కొనే సమస్యను చర్చిస్తున్నారు. స్వప్నప్రపంచంలాగా జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అన్నప్పుడు, అక్కడొక భేదాన్ని చూశాము. ఏమిటది? స్వప్నప్రపంచంనుంచి లేస్తే అది మాయమవుతుంది. అందువల్ల దాన్ని మిథ్య అని తేలికగా స్వీకరించవచ్చు. కాని జాగ్రత్ ప్రపంచం విషయానికి వచ్చేసరికి, అది మిథ్య అని తెలిశాక కూడా అది కంటిముందే ఉంటుంది.

దీర్ఘకాల శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేశాక, కష్టపడి మీరు తురీయం అని, స్థూలశరీరం–సూక్ష్మప్రపంచం మిథ్య అనీ అర్థం చేసుకుంటారు. నేను సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ; నేను నిత్య, ముక్త, శుద్ధబ్రహ్మను అని చెప్పగలుగుతారు. కాని ఈ మిథ్యాప్రపంచం అలాగే ఉంటుంది. ఫ్యానుని ఆపాక కూడా అది కొంతసేపు తిరుగుతుంది. అలాగే ప్రపంచ మిథ్యాత్వం తెలిశాక కూడా అది మీ కళ్ళముందు (ఇక్కడ కొంతసేపు అనకూడదు) ఉంటూనే ఉంటుంది. అందువల్ల వ్యవహారం కొనసాగుతూనే ఉంటుంది. శరీరం ఆకలి అంటుంది; అశుద్ధం అవుతుంది; అందువల్ల వ్యవహారాలను తగ్గించగలరేమో కాని పూర్తిగా పారద్రోలలేరు. ఏ ఆశ్రమంలో ఉన్నా కొన్ని కర్మలు చేయకతప్పదు. చేసే కర్మలు మారతాయేమో కాని, కర్మలు తప్పవు.

కర్మ చేయాలంటే మీలోని విశ్వ బయటకు రాకతప్పదు. అందులో గృహస్థుగా కొనసాగితే, ఇంకా ఎక్కువ కర్మలు ఉంటాయి. విశ్వ వస్తే, అహంకారం వస్తుంది; మీ అబ్బాయిని చూస్తే

మీలోని తండ్రి బయటకు వస్తాడు; మీ మనవడి ముద్దు మురిపాలు చూస్తే, మీలోని తాతగారు ముందుకు దూకుతారు.

అలా స్థూలప్రపంచంతో వ్యవహారం నడుపుతున్నంతసేపూ విశ్వ బయటకు వస్తాడు. జ్ఞానం పొందాక, అప్రమత్తతగా లేకపోతే, ఈ విశ్వతో మళ్ళీ మమేకం చెంది, తురీయాన్ని అడుక్కి తోసేసే ప్రమాదం ఉంది. నేను విశ్వను కాదు, తైజసను కాను, ప్రాజ్ఞను కాను, వీటికి అతీతంగా ఉన్న తురీయాన్ని అని ఎంత బాగా నేర్చుకున్నా కూడా, ఆ జ్ఞానం తెరమరుగైపోయే ప్రమాదం ఉంది. ఎప్పుడైతే ఆ జ్ఞానం తెరమరుగైపోతుందో, అప్పుడే మీరు కూడా అజ్ఞానిలాగా ప్రవర్తించే అవకాశం ఉంది. జ్ఞానాన్ని మర్చిపోవటానికీ, అజ్ఞానానికీ మధ్య భేదం లేదు. రెండూ ఒకటే.

ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాస్తున్నారనుకోండి. ఒక పిల్లవాడు బాగా చదువుకుని వచ్చాడు, కాని ప్రశ్నాపత్రాన్ని చూడగానే నేర్చుకున్నదంతా మర్చిపోయాడు. ఇంకొక విద్యార్థి అసలు ఏమీ నేర్చుకోకుండా వచ్చాడు. అంటే ఒక విద్యార్థి నేర్చుకుని మర్చిపోయాడు, ఇంకొక విద్యార్థి అసలు నేర్చుకోలేదు; కాని ఇద్దరి మార్కులూ చూస్తే ఏముంది? ఇద్దరికీ సున్నానే వచ్చింది. సాంకేతికపరంగా చూస్తే ఇద్దరి మధ్యా పెద్ద భేదమే ఉంది కాని ఫలితం పరంగా చూస్తే ఇద్దరి పరిస్థితీ ఒకటే.

ఇదే సూత్రం అజ్ఞానికీ, జ్ఞానం పొంది మర్చిపోయిన వ్యక్తికీ వర్తిస్తుంది. ఒక వ్యక్తి ఉపనిషత్తులన్నీ, మాండూక్య కారికలతో సహా నేర్చుకున్నాడు; ఏడవ మంత్రం కంఠతా వచ్చు అనుకుందాము. కాని అతని జీవితంలో ఎదురైన క్లిష్టసమయంలో ఇదంతా గాలికెగిరి పోయింది. ఇంకొక వ్యక్తికి అసలు ఉపనిషత్తు అంటేనే ఏమిటో తెలియదు. అతనూ అటువంటి క్లిష్టపరిస్థితినే ఎదుర్కొంటాడు అనుకుందాము. ఇద్దరి పరిస్థితీ ఎలా ఉంటుంది? ఒక్కలాగే ఉంటుంది. అసలు నేర్చుకోకపోయినా, నేర్చుకుని అవసరం వచ్చినప్పుడు మర్చిపోయినా రెండింటి ఫలం ఒక్కలాగే ఉంటుంది. అందువల్ల, గౌడపాదాచార్యులవారు మీరు నేర్చుకున్న జ్ఞానం మీ మనస్సులో ఎప్పుడూ తాజాగా ఉండాలి తప్పితే, భద్రంగా బీరువాలో వేసి దాచకూడదు అంటున్నారు.

సంసారం అంటే ఏమిటి?

**అజ్ఞాన జన్య అభూత అభినివేశః సంసారః**

అజ్ఞానం పోవాలంటే జ్ఞానమొక్కటే మార్గం. కాని ఈ కారికలో గౌడపాదాచార్యులవారు జ్ఞానం పొందితే చాలదు, దాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవాలి అంటున్నారు. అజ్ఞానికి ద్వైతప్రపంచం మిథ్య అని తెలియదు. అది సత్యమనే అధ్యాస (పొరపాటు)లో ఉంటాడు.

జ్ఞానం పొంది నిష్ఠలో లేని వ్యక్తికి ద్వైతప్రపంచం మిథ్య అని తెలుసు; కాని సమయం వచ్చినప్పుడు మర్చిపోయాడు. అటువంటి జ్ఞానం ఉన్నా లేనట్టే అర్థం.

వేదాంతజ్ఞానం క్రాష్‌కోర్సుల్లో పొందేది కాదు. దానికి సుదీర్ఘ శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. లేకపోతే ఇలాగే ఉంటుంది పరిస్థితి. అందువల్ల జ్ఞానం పొందటానికి దగ్గర దారులేవీ లేవు.

పొందిన జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మార్చుకోవటమెలా? దానికి మార్గం చూపిస్తున్నారు గౌడపాదాచార్యులవారు ఈ కారికలో. జ్ఞానం పొందాక కూడా, జ్ఞాని తన ప్రారబ్ధకర్మను క్షయం చేసుకోవటానికి ఈ జాగ్రత్ ప్రపంచంతో వ్యవహారం నడపక తప్పదు. ప్రారబ్ధ క్షయం సుఖదుఃఖాల అనుభవం ద్వారానే కలుగుతుంది. అలా జగత్తుతో వ్యవహారం నడిపేటప్పుడు జ్ఞాని ఏ మాత్రం అజాగ్రత్త చూపినా, సంసారం దూసుకు వచ్చేస్తుంది.

అందువల్లనే వేదాంతం క్లాసులకు వెళ్ళేవారు అంటారు, 'క్లాసులో ఉన్నంతసేపూ సంసారంనుంచి విడివడినట్టే ఉంటుంది; కాని బయటకు వచ్చి చెప్పులు వేసుకుంటామో లేదో రాగద్వేషాలు వాటిలోకి దూసుకువచ్చేస్తాయి.' అంతసేపు వేదాంతం విన్నాకూడా, బయటకు వెళుతూ వారు చేసే సంభాషణ కూడా లౌకిక విషయాలమీద ఉంటుంది కాని, వేదాంతబోధమీద ఉండదు.

అక్కడే కాదు, సాధన శిబిరాలకు వెళతారు కొంతమంది. అక్కడ ఇంచుమించుగా రోజంతా వేదాంతబోధ, ధ్యానం, ప్రార్థన ఉంటాయి. అయినా ఎలాగో వీలుచూసుకుని క్లాసుకీ, క్లాసుకీ మధ్య ఉన్న కాస్త సమయాన్ని దొరకబుచ్చుకుని అడుగుతారు, 'మీ అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారని విన్నాను. ఏదైనా కుదిరిందా?' ఆ విధంగా అహంకారం మీ వెన్నంటే ఉండి, అదును చూసుకుని దూసుకువస్తుంది. నీరు పల్లమెరుగు అన్నట్టుగా విశ్వస్థాయికి దిగిరావటం తేలిక.

తురీయం స్థాయికి ఎదగటం కష్టం. అది కొండ ఎక్కటంలాంటిది. వేదాంతశిష్యుడు, నేను అసలు తురీయాన్ని, విశ్వ అనేది నేను వేసుకునే వేషం అని నిరంతరం గుర్తుంచుకోవాలి. కాని నిజానికి అతని ఆలోచన దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది. నేను విశ్వను, కాని తురీయం నేను వేసుకునే వేషం అని వేదాంతం నేర్చుకునే గంటసేపూ అనుకుంటాడు. అంటే అతని స్వస్వరూపాన్ని వేషమనుకుంటున్నాడు, వేషాన్ని స్వస్వరూపం అనుకుంటున్నాడు.

అలా స్వస్వరూపంలో నిలబడాలంటే, జ్ఞాననిష్ఠలో నిలబడాలి. మీరు జీవితంలో నేను తండ్రిని, నేను తాతను, నేను భర్తను అనుకుంటారు. కాని వీటన్నిటినీ మీరు వేసే **రోల్‌ప్లే**గా చూడమంటారు పూజ్యస్వామీజీ. అవి మీరు తాత్కాలికంగా వేసే పాత్రలు. మీ అసలు

స్వరూపం తురీయం అనే నిష్ఠలో నిలబడితే, సంసారం మిమ్మల్ని బాధించదు. పాత్ర వేసేటప్పుడు పాత్రలో జీవించండి తప్పులేదు, కాని రాత్రి నిద్రకొరిగినప్పుడు ఆ పాత్రలన్నీ కూడా పక్కకు తొలగిపోవాలి. మీ పక్క మీకు గ్రీన్‌రూమ్ అవాలి. మీరు ఈ పాత్రలేవీ కారు.

**చిదానందరూపశ్శివోఽ హం శివోఽ హమ్**

ఈ నేపథ్యంతో ఈ కారికను చూద్దాము.

**నిత్యమ్** – ఎప్పుడూ ఏదో ఒక పాత్రను వేయటం ద్వారా,

**ఆవ్రియతే** – తురీయం కప్పబడుతుంది, వెనకకు త్రోసివేయబడుతుంది. ఎలా జరుగుతుంది ఇది?

**సుఖమావ్రియతే** – తురీయాన్ని తేలికగా మర్చిపోవచ్చు అని గౌడపాదాచార్యులవారు మనలను విమర్శిస్తున్నారు. ఏది కష్టం?

**దుఃఖం వివ్రియతే సదా** – మీ ఉన్నతస్థాయిని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవటం కష్టం.

తురీయాన్ని గుర్తుపెట్టుకోవటం కష్టం, మర్చిపోవటం తేలిక. గురువు మళ్ళీ మీ ఆత్మ స్వరూపాన్ని గుర్తుచేయాలి. ఆ మాటకొస్తే గురువు అంత కష్టపడి మీరు ఆత్మ, మీరు విశ్వకాదు, మీరు విశ్వగా రోల్ ప్లే చేస్తున్నారు అంతే అని చెబుతున్నా కూడా, హఠాత్తుగా మీ కుటుంబసభ్యుల్లో ఎవరో మీ మనస్సులోకి బలవంతంగా చొరబడతారు. అలా ఎలా జరుగుతుంది?

**యస్య కస్య చ ధర్మస్య గ్రహేణ భగవానసౌ** – యస్య ధర్మస్య అంటే ప్రపంచంలోని ఏదైనా వస్తువు లేదా వ్యక్తి. ఎవరిని చూసినా, దేన్ని చూసినా మీలోని రాగమో, ద్వేషమో దూసుకు వస్తుంది. రాగద్వేషాలు వస్తే సంసారం వస్తుంది. తురీయజ్ఞానం మీరు చేస్తున్న వ్యవహారాల్లో నిలబడాలంటే, మీరు జ్ఞాననిష్ఠలో నిలబడాలి. జ్ఞాననిష్ఠలో నిలబడాలంటే ఎక్కువకాలం శ్రవణం, మరికొంత ఎక్కువకాలం మననం, ఇంకా కొంత ఎక్కువకాలం నిదిధ్యాసనం చేయాలి. అంటే వేదాంతం ఒక తపనతో నేర్చుకోవాలి. ఆషామాషీ వ్యవహారం కాదిది. ఈ విషయం గట్టిగా హెచ్చరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకున్నారో లేదో ఎలా తెలుస్తుంది? జీవితంలో అనుకోనిది ఏదైనా జరిగితే, 'ఏమిటి?' అంటారు వెంటనే ఆశ్చర్యంగా, బాధగా, దుఃఖంతో. ఇది జ్ఞానాన్ని సూచిస్తుంది. తర్వాత మీరు నేర్చుకున్న జ్ఞానాన్ని గుర్తు తెచ్చుకుని, ప్రారబ్ధకర్మవల్ల జీవితంలో ఏదైనా జరగవచ్చు అని అర్థం చేసుకున్నది గుర్తు తెచ్చుకుంటే, 'అయితే ఏమిటి?' అంటారు, ఈసారి నిదానంగా. అలా అనగలిగితే అది జ్ఞాననిష్ఠకు చిహ్నం. ఈ 'ఏమిటి?'కీ

'అయితే ఏమిటి?'కీ మధ్య దూరం ఎంతగా తరుగుతూ రావాలంటే, ఈ రెండింటికీ మధ్య అసలు దూరం ఉండకూడదు.

**గురుణాపి దుఃఖేన న విచాల్యతే** – గీత 6.22

ఎంత గొప్ప కష్టం వచ్చినా చలించకుండా ఉండగలిగితే, అప్పుడు జ్ఞాననిష్ఠలో నిలబడ గలిగినట్టు అర్థం.

ఆ బోధ చేసిన కృష్ణపరమాత్మే దానికి ప్రతీకగా నిలిచిన సన్నివేశాన్ని భాగవతంలో చూస్తాము. యాదవకులానికి ఇచ్చిన శాపంవల్ల, యాదవులు వారిలో వారు పోట్లాడుకుంటుంటే, కృష్ణపరమాత్మ వారంతా తనవారే అయినా, చెట్టుకింద కూర్చుని చిద్విలాసంగా వారిని చూస్తున్నాడుట. అంటే ఇది ప్రారబ్ధకర్మ అని అర్థం చేసుకున్నాడు.

మనం కూడా మన ప్రారబ్ధకర్మను ఇంత చిద్విలాసంగా చూడగలగాలంటే, మనం కూడా జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలచుకోవాలి.

ఆత్మజ్ఞాన విషయంలో రెండు అంశాలు గుర్తుంచుకోవాలి.

1. నేను తురీయాన్ని అనే జ్ఞానం పొందాలి.
2. నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞ అనుకునే అధ్యాస పోవాలి.

ఆత్మ ఒక కాన్సెప్టు (సిద్ధాంతం) కాదు. అన్ని కాన్సెప్టులనూ సాక్షీభూతంగా చూస్తుంది. కాని ఈ విషయం తెలియక దార్శనికులు కూడా వారివారి సిద్ధాంతాలను ఏర్పరచుకుంటున్నారు. సిద్ధాంతాలు, విషయవస్తువులు కూడా అనాత్మే. ఆత్మ వీటిని చూసే సాక్షిచైతన్యం.

### కారిక 4.83

**అస్తి నాస్త్యస్తి నాస్తీతి నాస్తి నాస్తీతి వా పునః ।**
**చలస్థిరోభయాభావైరావృణోత్యేవ బాలిశః ॥**

తురీయజ్ఞానం ఇలా కప్పబడిపోవటం, మామూలు మనుష్యులకే కాదు, తక్కిన దార్శనికులకు కూడా అవుతుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. కప్పబడటాన్ని ఆవరణ అంటారు. ఈ ఆవరణ ఇద్దరికీ సమానమే. కాకపోతే దేనితో కప్పబడిందన్నది ఒక్కొక్కరికీ మారుతుంది.

మామూలు మనుష్యులకు తురీయం లౌకిక విషయాలచేత కప్పబడుతుంది. లౌకిక విషయాలు అంటే కుటుంబ సభ్యులు, ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు. దార్శనికులు ఇటువంటి వాటికి బాధపడరు కాని, వారు తురీయం విషయంలో అనేక పొరపాట్లు పడతారు. ఆ పొరపాటు వారికి తురీయాన్ని కప్పుతుంది.

పొరపాటు కూడా ఆలోచనే. అది లౌకిక ఆలోచన కాదు కాని, వేదాంత ఆలోచన. ఇక్కడ ఉదాహరణ కింద, గౌడపాదాచార్యులవారు అటువంటి దార్శనికులు నలుగురిని తీసుకున్నారు.

| **దర్శనం** | **పొరపాటు** |
|---|---|
| 1. న్యాయ–వైశేషిక మతం | – అస్తి |
| 2. యోగాచార మతం | – నాస్తి |
| 3. జైన మతం | – అస్తి నాస్తి |
| 4. మాధ్యమిక మతం | – నాస్తి నాస్తి |

1. **న్యాయ–వైశేషిక మతం – అస్తి** – దేహ వ్యతిరిక్త ఆత్మా అస్తి. దేహానికి భిన్నంగా ఆత్మ ఉందనీ, శరీరం మరణించినా ఆత్మ ఉంటుందనీ అంటారు న్యాయ–వైశేషిక మతంవారు. ఇందులో పొరపాటు ఏమిటి? వీరు ఆత్మ కర్తా భోక్తా, అందువల్ల నిరంతరం మారుతుంది అంటారు. **చలః** అంటే పరిణామి లేదా మార్పు ఉన్నది.

**చలరూపేణ దేహవ్యతిరిక్త ఆత్మా అస్తి**

2. **యోగాచార మతం – నాస్తి** – క్షణిక విజ్ఞానమే ఆత్మ అంటారు యోగాచార మతంవారు. క్షణికవిజ్ఞాన వ్యతిరేకేన ఆత్మా నాస్తి. న్యాయవైశేషికులు ఆత్మ చలం అంటే వీరు **స్థిరః** – స్థిరం అంటారు. అంటే పరిణామరహితం.

మార్పు లేదని ఎలా అంటారు? మార్పు గురించి మాట్లాడాలంటే ఒకటే వస్తువు గతంలోనూ, ఇప్పుడూ ఉండాలి. ఒకటే వస్తువు రెండు కాలాల్లో ఉంటే అది ఇలా మారిందని చెప్పవచ్చు కాని క్షణిక విజ్ఞానంలో మార్పు గురించి మాట్లాడలేము. ఎందుకు? విజ్ఞానం చైతన్యం లేదా ఆత్మ. ఆత్మ వీరి సిద్ధాంతం ప్రకారం ఒక్క క్షణమే ఉంటుంది. తరువాత క్షణంలో ఉండనప్పుడు మార్పు గురించి ఎలా మాట్లాడతారు? మార్పు గురించి చెప్పాలంటే అనేక క్షణాలు ఉండాలి.

3. **జైనమతం – అస్తి నాస్తి** – వీరిది మధ్యే మార్గం. ఆత్మ ప్రాణమున్న జీవుల్లోనే ఉంటుంది, జడవస్తువుల్లో ఉండదు అంటారు. చేతన పదార్థేషు అస్తి అచేతన పదార్థేషు నాస్తి అంతేకాదు వీరు ఆత్మ ఏ శరీరంలో ఉంటే, ఆత్మ అంత పరిణామంలో ఉంటుందంటారు. అంటే చీమలో చిన్న ఆత్మ, ఏనుగులో పెద్ద ఆత్మ ఉంటుందంటారు. కొన్నింటిలో ఉండి, మరి కొన్నింటిలో లేదంటారు కాబట్టి వీరిది అస్తి, నాస్తి సిద్ధాంతం. **ఉభయః –** ఉభయదర్శనం.

వీరిది ఇంకొక సిద్ధాంతం కూడా ఉంది. ఆత్మకు సంసారకాలంలో చలనం ఉంది, మోక్షకాలంలో చలనం లేదు అంటారు. పూరీ ఉదాహరణ ఇక్కడ గుర్తు తెచ్చుకోవచ్చు.

పూరీ పొంగేదాకా బూర్లెమూకుడులో తిరిగి, పూర్తిగా పొంగాక అందులో స్థిరంగా ఉంటుంది. అలా ఆత్మ సంసారంలో ఉన్నంతవరకూ చలనం ఉంటుంది, మోక్షకాలంలో స్థిరంగా ఉంటుంది అంటారు జైనమతం వారు. **బంధకాలే చలః మోక్షకాలే స్థిరః**

4. **మాధ్యమిక మతం – నాస్తి నాస్తి** – యోగాచార మతం వారు క్షణిక విజ్ఞానం కాక వేరే ఏదీ లేదంటారు. అంటే వారు కనీసం ఆత్మ ఉంది అంటారు. మాధ్యమిక మతంవారు అసలు ఆత్మ అనేది లేనేలేదు అంటారు. బాహ్యప్రపంచం లేదు, ఆత్మ లేదు అంటారు. వారిది శూన్యవాదం. **అభావ**–అభావవాదన అని కూడా అంటారు. ప్రపంచం, ఆత్మ రెండూ లేవంటారు కాబట్టి నాస్తి–నాస్తి వాదన వీరిది.

కారికలో పదాలతో ఈ వాదనలు కలిపితే, ఇలా వస్తుంది.

| | |
|---|---|
| అస్తి ఇతి చల దర్శనమ్ | – న్యాయవైశేషికస్య |
| నాస్తి ఇతి స్థిర దర్శనమ్ | – యోగాచార బౌద్ధస్య |
| అస్తి–నాస్తి ఇతి ఉభయ దర్శనమ్ | – జైనస్య |
| నాస్తి–నాస్తి ఇతి అభావ దర్శనమ్ | – మాధ్యమికస్య |

ఈ నాలుగు పొరపాటు దర్శనాలవల్ల,

**ఆవృణోతి ఏవ** – అసలు తురీయం కప్పబడిపోయింది

**బాలిశః** – వీరు దార్శనికులైనా కూడా, పొరపాటుగా ఆలోచిస్తున్నారు కాబట్టి బాలురతో సమానం.

### కారిక 4.84

**కోట్యశ్చతస్ర ఏతాస్తు గ్రహైర్యాసాం సదాఽఽవృతః ।**
**భగవానాభిరస్పృష్టో యేన దృష్టస్స సర్వదృక్ ॥**

**కోట్యశ్చతస్ర ఏతాస్తు** – ఇవి నాలుగు సిద్ధాంతాలు. కోటిః అంటే సిద్ధాంతం, ఒక దర్శనం. కోట్యః అంటే బహువచనం. చతస్రః అంటే నాలుగు. ఏతః అంటే ఈ నాలుగు. ఈ నాలుగు సిద్ధాంతాలు. ఏమిటవి? ముందు కారికలో చూసిన నాలుగు సిద్ధాంతాలు గుర్తు తెచ్చుకోవాలి. అవి – అస్తి, నాస్తి, అస్తి నాస్తి, నాస్తి నాస్తి.

**గ్రహైర్యాసామ్** – ఈ దర్శనాల వైపు మొగ్గు చూపితే, అవే గుర్తుండిపోయి, నేను ఆత్మను అనే విషయం మర్చిపోతారు. అందువల్ల,

**(తురీయ ఆత్మా) ఆవృతః** – తురీయ ఆత్మా మనం కలుపుకోవాలి. మనం బాహ్యముఖంగా ఉండటంవల్ల ఈ నాలుగు సిద్ధాంతాల్లో దేనికో దానికి ఆకర్షించబడితే, అసలు ఆత్మ ఈ అజ్ఞానంచేత కప్పబడిపోయే ప్రమాదం ఉంది.

ఆత్మకు గుణాలు లేవు, అది నిర్గుణబ్రహ్మ అని చెబితే, శిష్యుడు ఆ నిర్గుణబ్రహ్మను చూడాలనుకుంటాడు. ధ్యానంలో కూర్చుంటే కనిపిస్తాడు అనుకుంటాడు. తక్కిన సిద్ధాంతాలన్నింటినీ ఖండించటానికి నిర్గుణబ్రహ్మ పదం వాడితే, ఆ సిద్ధాంతాలు లేని బ్రహ్మకు ఒక సిద్ధాంతం ఆపాదించటానికి చూస్తాడు శిష్యుడు.

అదే విధంగా ద్వైతభావాన్ని పారద్రోలటానికి అద్వైతం పదం వాడితే, ఆ అద్వైతాన్ని ధ్యానంలో అనుభవించాలి అనుకుంటాడు. అద్వైతాన్ని అనుభవించాలి అనుకుంటేనే అది ద్వైతంలోకి వస్తుందని అర్థం చేసుకోవటం లేదు. అద్వైతాన్ని అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టుగానూ, తనను అనుభవించే సబ్జెక్టుగానూ చూడాలనుకుంటాడు.

వేదాంతంలో ఏ పదం వాడినా, సరిగ్గా అర్థం చేసుకోడు శిష్యుడు. ఎప్పటికీ అనుభవించబడే ఆబ్జెక్టు కాదు, అనుభవిస్తున్న సబ్జెక్టు ఆత్మ అని ఎన్నిసార్లు చెప్పినా, తక్కిన ఆబ్జెక్టులను చూసినట్టుగా ఆత్మను కూడా ఇంకొక ఆబ్జెక్టుగా చూడాలనుకుంటాడు. బ్రహ్మను బాహ్యవస్తువుగా, కంటికి కనబడే వస్తువుగా చూడాలనుకుంటాడు, లేదా కంటికి కనబడదు అంటే ధ్యానంలో అనుభవించాలి అనుకుంటాడు. కాని అతను బ్రహ్మానుభవం పొందాలని ప్రయత్నించిన కొద్దీ, అతను సత్యానికి దూరంగా ప్రయాణిస్తున్నాడని తెలుసుకోలేక పోతున్నాడు. అందువల్ల బ్రహ్మను చూడాలని ఎన్నడూ ప్రయత్నించకూడదు.

**బ్రహ్మ ఎన్నటికీ చూడబడే వస్తువు కాదు, ఎప్పటికీ చూసే నువ్వే బ్రహ్మవు**

**యాసాం గ్రహైః** – అందువల్ల ఈ భిన్నదర్శనాలు చేస్తున్నారు అంటున్నారు గౌడపాదాచార్యులవారు కోపంగా.

**సదా ఆవృతః** – దానివల్ల, సబ్జెక్టు అయిన ఆత్మ ఎప్పటికీ కప్పబడిపోతున్నది.

అందువల్ల వేదాంతం ముందు ఒక పదం వేసి, తర్వాత ఆ పదాన్ని కూడా త్రోసి పుచ్చుతుంది. సగుణ ప్రపంచంలో ఉన్న శిష్యునికి ఆత్మ లేదా బ్రహ్మ సగుణం కాదు, నిర్గుణం అని చెబుతుంది. సరే అయితే, ఆ నిర్గుణబ్రహ్మనే చూస్తాను అని అతనంటే, అప్పుడు బ్రహ్మ నిర్గుణం కూడా కాదు అంటుంది. బ్రహ్మ సగుణమా? కాదు. నిర్గుణమా? కాదు. బ్రహ్మ సవికారం, మార్పులకు లోనవుతాడు అని శిష్యుడు పొరపాటు పడితే, బ్రహ్మ సవికారం కాదు, నిర్వికారం అంటుంది. సరే అయితే నిర్వికారం బ్రహ్మను చూస్తాను అంటే బ్రహ్మ నిర్వికారం కూడా కాదు అంటుంది. బ్రహ్మ సవికారమా? కాదు. నిర్వికారమా? కాదు.

అలా ఒక్కొక్క పదాన్ని పరిచయం చేసి, మళ్ళీ ఆ పదాన్ని కూడా త్రోసిపుచ్చుతుంది వేదాంతం. ఎందుకు? దాని ఉద్దేశ్యం – బ్రహ్మ వస్తువు కానేకాదు. బ్రహ్మను బాహ్యంగా కానీ, ఆంతరంగా కానీ చూడలేము. వెతుకుతున్న నువ్వే బ్రహ్మవు అంటుంది. **తత్త్వమసి.**

నేను బ్రహ్మను అంటే ఎప్పుడు బ్రహ్మను? మాండూక్యం నేర్చుకుంటున్నప్పుడా, నేర్చుకున్నాకనా? ఏ అవస్థలో? వేదాంతం ఎప్పుడూ బ్రహ్మవే; మాండూక్యం నేర్చుకున్నా, నేర్చుకోక పోయినా, మూడు అవస్థల్లోనూ బ్రహ్మవే అంటుంది. మాండూక్య పరిభాషలో చెప్పాలంటే తురీయ చైతన్యం.

**భగవానాభిరస్పృష్టః** – ఇక్కడ భగవాన్ అంటే తురీయ ఆత్మనైన నేను. నేను అస్పృష్టః ఆత్మను. అంటే అసంగం, శుద్ధం. అభిః అంటే ముందు చెప్పిన నాలుగు సిద్ధాంతాలు. శుద్ధ చైతన్యం ఈ నాలుగు సిద్ధాంతాలు– ద్వైతం, అద్వైతం, సవికారం, నిర్వికారం – అన్నింటికీ అతీతం. మీరు ఏ సిద్ధాంతాన్ని పాటించినా, అది ఆలోచనల రూపంలో ఉంటుంది. సిద్ధాంతం అంటే మనస్సులో కలిగే ఒక ఆలోచన మాత్రమే. ఆలోచన వ్యావహారిక సత్యంలోకి వస్తే ఆత్మ శుద్ధచైతన్యం. చైతన్యానికి ద్వైతం ఆలోచన, అద్వైతం ఆలోచన, విశిష్టాద్వైతం ఆలోచన, సాంఖ్య ఆలోచన, యోగ ఆలోచన, శూన్య ఆలోచన ఏదీ అంటదు. శూన్యంగా ఉంది అనే మాట కూడా మనస్సుయొక్క ఒక స్థితిని సూచిస్తుంది. ఆత్మ అస్పృష్టః – వీటన్నింటికీ అతీతం.

అందువల్లనే వేదాంతాన్ని ఒక సిద్ధాంతం అనము. తక్కిన సిద్ధాంతాలన్నీ వ్యావహారికం. అవన్నీ సగుణబ్రహ్మ దగ్గరే ఆగిపోతాయి. ఆ తక్కిన సిద్ధాంతాలను ఖండించటానికి అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని పరిచయం చేస్తాము; వారికి తెలిసిన సగుణబ్రహ్మను ఖండించటానికి, బ్రహ్మ నిర్గుణం అంటాము. వాటిని కొట్టివేశాక, అన్ని సిద్ధాంతాలకీ అతీతమైన నిర్గుణ బ్రహ్మలో నెలకొని ఉండమంటాము.

తక్కిన సిద్ధాంతాలు వ్యావహారిక సత్యానికి చెందితే, నిర్గుణబ్రహ్మ పారమార్థిక స్థాయికి చెందుతుంది. అందువల్ల అస్పృష్టం.

**యేన దృష్టః** – ఎవరైతే ఈ బోధను అర్థం చేసుకుంటారో! ఏ బోధను? ఇంతకుముందే చూశాము. వేదాంతం ఇంకొక సిద్ధాంతం కాదు, తక్కిన సిద్ధాంతాలను ఖండించటానికి అద్వైత వేదాంత సిద్ధాంతం అంటాము కాని వాటిని కొట్టివేశాక, వాటికి అతీతంగా ఉన్న ఆత్మ చైతన్యంలో నెలకొని ఉండాలి. ఎవరైతే ఈ సత్యాన్ని అర్థం చేసుకుంటారో,

**సః సర్వదృక్** – అతనికి పరిపూర్ణమైన జ్ఞానం ఉంది. అతనికి మాత్రమే వేదాంతబోధ గురించి స్పష్టమైన జ్ఞానం ఉంటుంది.

### కారిక 4.85

**ప్రాప్య సర్వజ్ఞతాం కృత్స్నాం బ్రాహ్మణ్యం పదమద్వయమ్ ।**
**అనాపన్నాదిమధ్యాంతం కిమతః పరమీహతే ॥**

ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలాన్ని చూస్తాము ఇక్కడ. జ్ఞానం – నేను తురీయాన్ని, నేను తక్కిన సిద్ధాంతాలకు అతీతంగా ఉన్నాను. ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలాలను నాలుగుగా అభివర్ణిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

1. **సర్వజ్ఞత్వ ప్రాప్తి** – తురీయజ్ఞానం పొందితే సర్వజ్ఞత్వ ప్రాప్తి పొందినట్టు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎందుకంటే ఆత్మజ్ఞానం తక్కిన అపరావిద్యలవంటిది కాదు. ఉదాహరణకు ఫిజిక్స్ జ్ఞానం పొందితే సర్వజ్ఞులం అవము. ఫిజిక్స్ జ్ఞానం పొందితే ఫిజిక్సే తెలుస్తుంది; ఎకనామిక్స్ జ్ఞానం కలుగదు. కాని ఆత్మజ్ఞానం విషయంలో అలా కాదు.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి** – ముండకమ్

ఏ ఒక్క విజ్ఞానం పొందితే అన్ని జ్ఞానాలూ పొందినట్టు అవుతుందని ప్రశ్న. దానికి జవాబు ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం పొందితే సర్వజ్ఞుడవుతాడు. అలా ఎలా చెప్పగలరు? ఎందుకంటే, ఈ జగత్తులో ఉన్నదేది తీసుకున్నా అది ఆత్మ+భిన్ననామరూపం మాత్రమే. అందువల్ల ఆత్మజ్ఞానం = సర్వజ్ఞానం.

**ప్రాప్య సర్వజ్ఞతాం కృత్స్నామ్** – ఈ తురీయజ్ఞానాన్ని పొందటంవల్ల, అతను సర్వజ్ఞుడు అవుతాడు. కృత్స్నామ్ పదాన్ని సర్వజ్ఞతాంతో కలుపుకోవాలి. పూర్ణమైన సర్వజ్ఞత్వాన్ని పొందుతాడు. పూర్ణమైన పదం వేయటంవల్ల ఇంక తెలుసుకోవలసినది ఏదీలేదు అని అర్థం వస్తుంది.

2. **బ్రాహ్మణత్వ ప్రాప్తి** – బ్రాహ్మణత్వం పొందుతాడు. బ్రాహ్మణత్వం అంటే బ్రహ్మజ్ఞానం పొందుతాడు. బృహదారణ్యకోపనిషత్తులో ఎవరైతే మరణించేలోపు బ్రహ్మజ్ఞానం పొందుతారో, అతనే అసలైన బ్రాహ్మణుడు అని వస్తుంది.

అలాగే వజ్రసూచికోపనిషత్తులో కూడా వస్తుంది. అసలైన బ్రాహ్మణుడు ఎవరని ప్రశ్న వేసి, అనేక దశలు దాటుకుంటూ వచ్చి ఎవరైతే బ్రహ్మజ్ఞానం పొందుతారో, అతనే అసలైన బ్రాహ్మణుడు అని వస్తుంది. మరయితే తక్కినవారి మాటేమిటి అంటే వారు నిజమైన బ్రాహ్మణులు కారు, వారిని బ్రహ్మ బంధువులు అంటారు అంటుంది. బ్రహ్మ బంధువులు అంటే ఆ పదానికి సరిపోరు అని అర్థం.

**బ్రాహ్మణ్యం పదం (ప్రాప్య)** – ఈ జ్ఞానం ద్వారా, అసలైన బ్రాహ్మణుడు అవుతాడు.

3. **బ్రహ్మప్రాప్తి** – ఈ జ్ఞానంవల్ల బ్రహ్మను పొందుతాడు.

**స యో హ వై తత్ పరమం బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి**

ఎవరు బ్రహ్మజ్ఞానం పొందితే, అతను బ్రహ్మ అవుతాడు. ఎలా చెప్పగలరు? ఈ జ్ఞానం నేను బ్రహ్మను అని నేర్పిస్తుంది.

నేను బ్రాహ్మణున్ని కాదు, క్షత్రియుణ్ణి కాదు, పురుషుణ్ణి కాదు, స్త్రీ కాదు, నపుంసకుణ్ణి కాదు; నేను నిర్గుణబ్రహ్మను అని తత్త్వబోధలో వస్తుంది.

**అద్వయం (ప్రాప్య)** – అద్వయం బ్రహ్మ ప్రాప్య. జ్ఞానప్రాప్తి పొందితే బ్రహ్మప్రాప్తి పొందినట్టు. ఎటువంటి అద్వయం బ్రహ్మ?

**అనాపన్నాదిమధ్యాంతమ్** – ఎటువంటి పరిమితులు లేని అనంతం బ్రహ్మ. ఆది అంటే మొదలు; మధ్యమ అంటే మధ్యభాగం; అంత అంటే చివరిభాగం. అనాపన్నాది మధ్యాంతం అంటే ఆది, మధ్యమ, అంతం లేని బ్రహ్మ.

పరిమితులు రెండు రకాలు.

**దేశ పరిమితి** – ఒక వస్తువుకు మొదలు, మధ్య, చివరి భాగాలు ఉంటాయి. ఉదా. బల్ల. దేశితః ఆది మధ్యాంతః.

**కాల పరిమితి** – ఒక వస్తువుకు కాలపరిమితి ఉంటుంది. పుట్టినరోజు, మరణించే రోజు, ఆ రెండింటి మధ్య కాలం. ఒక వ్యక్తి 100 సంవత్సరాలు జీవిస్తే 50వ సంవత్సరం అతని మధ్యకాలం. కాలతః ఆది మధ్యాంతః.

కాని బ్రహ్మకు దేశపరిమితి, కాలపరిమితులు లేవు. అనంతం బ్రహ్మ.

4. **పూర్ణత్వ ప్రాప్తి** – కోరికలు ఉండవు. మార్పు కోరుకోవటాన్ని సంసారం అంటారు. బ్రహ్మచారి గృహస్థు అవాలనుకుంటాడు; గృహస్థు పిల్లలు పుట్టాలనుకుంటాడు; పిల్లలు పుట్టాక, ఆఖరి అమ్మాయికి పెళ్ళి చేసి విశ్రాంతి పొందుతామనుకుంటాడు. కాని అప్పుడన్నా విశ్రాంతి దొరుకుతుందా? పెద్దబ్బాయికి ఇంకా పిల్లలు పుట్టలేదనే బెంగ వెన్నంటే ఉంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఇలా ఇంకా ఏదో కావాలనే తపనే సంసారం.

బృహదారణ్యకోపనిషత్తులో బ్రహ్మ కూడా తను ఒంటరిగా ఉన్నాడనీ, తనకొక తోడు కావాలనుకున్నాడనీ వస్తుంది. **తస్మాత్ ఏకాకీ న రమతే.** తనను తానే మను, శతరూప జంటగా విభజించుకుని వారి ద్వారా సృష్టిచేశాడు అని వస్తుంది.

ఆత్మజ్ఞానం పొందితే, ఈ కొరత పోతుంది. పూర్ణత్వభావన వస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, సంసారనివృత్తి కలిగి, మోక్షప్రాప్తి కలుగుతుంది.

**అతః పరమ్** – ఈ బ్రహ్మజ్ఞానం పొందాక, ఇంతకన్నా ఎక్కువగా పొందేది వేరే ఏమీలేదు.

**కిమ్ ఈహతే** – ఈహ అంటే కోరిక. ఇంకేం కోరిక ఉంటుంది అతనికి? జ్ఞానం పొందాక కూడా కర్మలు చేస్తాడు కాని అవి తన కోరికలు తీర్చుకోవటానికి కాదు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః**

అతను ఆత్మలోనే రమిస్తాడు. అందువల్ల అతనికి కోరికలు ఉండవు. అతను లోకకళ్యాణార్థం కర్మలు చేస్తాడు.

ఈ కారికలో జ్ఞానఫలాలు నాలుగు చూశాము. అవి – సర్వజ్ఞత్వ ప్రాప్తి, బ్రాహ్మణత్వ ప్రాప్తి, బ్రహ్మ ప్రాప్తి, పూర్ణత్వ ప్రాప్తి.

### కారిక 4.86

**విప్రాణాం వినయో హ్యేష శమః ప్రాకృత ఉచ్యతే ।**
**దమః ప్రకృతిదాంతత్వాదేవం విద్వాన్ శమం వ్రజేత్ ॥**

ఈ జ్ఞానంవల్ల కలిగే అవాంతర ఫలాన్ని చూస్తాము ఇక్కడ. ఈ జ్ఞానం పొందేముందు, సాధకుడు జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం సాధన చేస్తాడు. అవి వివేకం, వైరాగ్యం, శమాదిషట్క సంపత్తి, ముముక్షుత్వం. వాటిని సాధన చతుష్టయ సంపత్తి అంటారు. ఈ సంపత్తిని పొందటం ఒక ఎత్తు, పొందాక నిలబెట్టుకోవటం ఇంకొక ఎత్తు.

ఇది బరువు తగ్గించుకోవటం వంటిది. చాలా బరువెక్కిపోతున్నామని బెంగపడి, ఎక్కడో, ఏ ఆశ్రమంలోనో చేరుతారు. అక్కడ కొన్ని వ్యాయామాలు చేసి, కేవలం ద్రవపదార్థాలే ఆహారంగా తీసుకుని ఐదు కేజీల బరువు తగ్గి సంతోషంగా ఇంటికి తిరిగివస్తారు. పదిరోజుల్లో ఐదు కేజీలు తగ్గానని మురిసిపోతారు. అంతవరకూ బాగానే ఉంది. తరువాత మాటేమిటి? వెనక్కి తిరిగి రాగానే, పదిరోజులు బొత్తిగా ఏమీ తినలేదని, ఇన్నాళ్ళూ తినలేనివన్నీ కొన్ని రోజుల్లో తినేస్తారు. ఏమవుతుందప్పుడు?

ఆశ్రమానికి వెళ్ళకముందు 85 ఉన్నారు, వెళ్ళొచ్చాక 90కి పెరిగారు. మనం ఏ ఆశ్రమాన్ని తప్పు పట్టటం లేదు, కాని తిరిగివచ్చాక ఆ జీవనవిధానాన్ని కొనసాగించకపోతే కలిగే పర్యవసనాన్ని చూపిస్తున్నాం అంతే.

ఈ సూత్రం ఏ నియమానికన్నా వర్తిస్తుంది. ఒక వస్తువును పొందటానికి ఎంత కృషి చేయాలో, దాన్ని నిలబెట్టుకోవటానికి కూడా అంతే కృషో, ఇంకా ఎక్కువ కృషో చేయాల్సి ఉంటుంది. భగవద్గీతలో అనేక విలువలను పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ. వాటిని పొందటానికి కూడా చాలా కృషి చేయాల్సి ఉంటుంది.

కాని ఇక్కడ గౌడపాదాచార్యులవారు జ్ఞానిలో ఈ విలువలు అతని స్వభావంలో ఉంటాయి, ఇది ఒక గొప్ప అవాంతరఫలం అంటున్నారు. ఏ విలువలనైతే పొందటానికి అంతకుముందు అతను అవస్థ పడ్డాడో, అవి అతనికి సహజంగా ఆభరణంగా మారతాయి.

**యాని ముముక్షోః సాధనాని తాని ముక్తస్య లక్షణాని**

శంకరాచార్యులవారు, తన గీతాభాష్యంలో అంటారు – ఏవైతే ముముక్షువుకు సాధన కింద వస్తాయో, అవి జ్ఞానికి అతని లక్షణాలు అవుతాయి. అతను వైరాగ్యాన్ని కష్టపడి పెంపొందించుకోనవసరం లేదు. అది అతనికి సహజగుణం అవుతుంది. చక్కెరవ్యాధి ఉన్న వ్యక్తి, స్వీట్సును చూడగానే, వాటివైపు ఆకర్షితుడవుతాడు. కాని జ్ఞాని ఎంత మాత్రమూ చలించడు. వైరాగ్యం సహజంగా అబ్బుతుంది జ్ఞానికి.

ఆత్మజ్ఞానం పొందితే, ఈ జ్ఞానం మనస్సును మెరుగు పరుస్తుంది. జ్ఞాని తను మనస్సు కాదు అని తన మనస్సునుంచి విడివడినా కూడా, మనస్సు సంస్కరించబడుతుంది. అతను ఏ లక్షణాలనైతే అంతకుముందు శ్రమపడి పెంపొందించుకున్నాడో, అవి రెట్టింపు అవుతాయి. అతనికున్న శమదమాదులు రెట్టింపు అవుతాయి.

ఇందులో గొప్పదనం ఏమిటంటే, అతను వీటిని కావాలని ప్రత్యేకించి కోరలేదు. ఈ జ్ఞానం దానంతట అదే, అతని ప్రమేయం లేకుండానే అతనిలో ఉన్న శమదమాది లక్షణాలను, విలువలను రెట్టింపు చేస్తుంది. మనస్సు అతని ప్రమేయం లేకుండానే, ప్రసన్నంగా ఉంటుంది. అతను చిరాకు పడాలనుకున్నా కూడా పడలేడు. ప్రశాంతత సహజంగానే అబ్బుతుంది. అందువల్ల ఏ విలువలకోసం అంతకుముందు సాధన చేశాడో, ఆ విలువలు ఇప్పుడు అతనికి లక్షణం అవుతుంది.

సాధనకు, లక్షణానికి మధ్య భేదం ఏమిటి? సాధన మీరు ప్రయత్నపూర్వకంగా చేసేది, లక్షణం మీకు తెలియకుండా సహజంగా పెరిగేది. అవి మనస్సుకు చెందినవి కాబట్టి, జ్ఞాని వాటి గురించి అంతగా తాపత్రయపడడు కాని అతనికి అవి సహజంగానే అబ్బుతాయి. అతనికి **ఆందోళన పారద్రోలటం ఎలా** కోర్సులు అవసరం లేదు. జ్ఞానికి సహజంగా అబ్బే గుణాలను కొన్నింటిని ఇక్కడ గౌడపాదాచార్యులవారు పేర్కొంటున్నారు. అవేమిటో చూద్దాము.

**వినయః** – వినయం అంటే అమానిత్వం. కృష్ణపరమాత్మ 20 విలువలను పేర్కొన్నాడు భగవద్గీతలో, పదమూడవ అధ్యాయంలో. వాటిలో మొట్టమొదటి విలువ అమానిత్వం. అంటే గర్వం లేకపోవటం. నేను గొప్ప జ్ఞానిని అనే గర్వం కూడా ఉండదు జ్ఞానికి.

**శమః** – మనోనిగ్రహం. అతనికది కష్టం కాదు.

**దమః** – ఇంద్రియనిగ్రహం. ఇంద్రియాలకు అతను బానిసకాడు.

**విప్రాణామ్** – జ్ఞానులందరికీ. వారు పొందిన జ్ఞానంచూసుకునో, ఇతరుల పొగడ్తలకో పొంగిపోరు.

**ప్రాకృత ఉచ్యతే** – ఇక్కడ ప్రాకృతః అంటే సహజంగా వస్తుంది. ఈ విలువలన్నీ జ్ఞాని ప్రయత్నపూర్వకంగా పాటించడు. అవి అతనికి సహజంగా అబ్బుతాయి. ఎందుకు?

**ప్రకృతిదాంతత్వాత్** – అవి అతనిలో సహజంగా ఉంటాయి. ఈ విధంగా,

**విద్వాన్** – జ్ఞాని తనకున్న విలువలను ఆభరణాలుగా ధరిస్తాడు. ఇన్ని విలువలు సహజంగా ఉండటం వల్ల, అవి ప్రత్యేకంగా తెలుస్తాయి.

ఈ విలువలు మనలో ఉన్నాయో లేదో ఎలా తెలుస్తుంది? **మనసః సమత్వం.** మనస్సు సమత్వాన్ని పొందుతుంది అంటుంది శాస్త్రం. అంటే ఆందోళన లేని, బెంగలు లేని, ఒత్తిడి లేని ప్రశాంతమైన మనస్సు ఉంటుంది. ఎంత క్లిష్టమైన పరిస్థితి ఎదురైనా జ్ఞాని కలత చెందదు. అలా అనగానే అతను బాధ్యతారహితంగా ప్రవర్తిస్తాడు అనుకోకూడదు. జాగ్రత్తగా చూడండి! అతను ప్రశాంతంగా ఉండి, సమర్థవంతంగా పనులు చేస్తాడు. ఎవరికే కష్టం ఎదురైనా కావల్సిన సహాయం బాధ్యతతో చేస్తాడు. కాని తను బాధపడడు. అంటే ప్రేమ కురిపిస్తాడు, తను ప్రేమకు బందీకాడు.

మన దృక్పథం ఏమిటి? ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదురైతే ఆందోళన చెందాలి, కిందా మీదా పడిపోవాలి. ఎవరైనా కాస్త ప్రశాంతంగా కనబడితే, 'అంత నిదానంగా ఎలా ఉండగలుగుతున్నావు?' అంటాము. కాని వేదాంతం అతన్ని **విద్వాన్** అని మెచ్చుకుంటున్నది. జ్ఞాని బాధ్యత చూపుతాడు కాని బెంగపడడు.

**శమం వ్రజేత్** – మనోనిగ్రహం పాటిస్తాడు. ఈ మనోనిగ్రహాన్ని జీవన్ముక్తి అంటారు. జీవన్ముక్తి నిర్వచనాల్లో ఒక నిర్వచనం – జీవన్ముక్తి అంటే సాధన చతుష్టయ సంపత్తి లేదా సహజమైన విలువలు.

జ్ఞాని ధార్మికపురుషుడా, అధార్మికుడా? జ్ఞాని ధార్మిక పురుషుడు. అతను నైతికమైన, ధార్మికమైన జీవనం గడుపుతున్నాడు అంటే అది అతను కోరి, ప్రయత్నపూర్వకంగా ఎన్నుకున్నది కాదు. అతనికి తెలియకుండానే, అతని ప్రమేయం లేకుండానే, సహజంగానే అది అబ్బింది అతనికి.

దీనితో గౌడపాదాచార్యులవారు సంసారకారణం, సంసారనివృత్తి సాధనం ముగిస్తున్నారు. కారికలు 75–86 చూశాము. ఈ అంశాన్ని మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

**అజ్ఞాన సహిత అధ్యాసః ఏవ సంసారస్య కారణమ్**

అజ్ఞానంతో కూడిన పొరపాటు మాత్రమే సంసారానికి కారణం.

**అజ్ఞానం** – నేను తురీయాన్ని అనే విషయం తెలియని అజ్ఞానం

**పొరపాటు** – నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞ అని అనుకోవటమే అధ్యాస.

మోక్షం పొందటం ఎలా? ఆత్మజ్ఞానం పొందటం ద్వారా రెండూ తెలియాలి. నేను తురీయాన్ని అనే జ్ఞానం ఎంత దృఢంగా పొందాలో, నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞ కాదనే జ్ఞానం కూడా అంత దృఢంగానూ పొందాలి.

ఈ జ్ఞానం కలిగితే కలిగేఫలాలు -

1. **జ్ఞానఫలం** - శాంతం, శివం, అద్వైతం, తురీయం నేను అనే జ్ఞానం బుద్ధిలో కలుగుతుంది. దానివల్ల సర్వజ్ఞత్వప్రాప్తి, బ్రాహ్మణత్వప్రాప్తి, బ్రహ్మప్రాప్తి, పూర్ణత్వప్రాప్తి కలుగుతాయి.

2. **జీవన్ముక్తి** - వినయం, శమం, దమం, విలువలు సహజంగా పెరుగుతాయి.

**కారిక 4.87**

**సవస్తు సోపలంభం చ ద్వయం లౌకికమిష్యతే ।**
**అవస్తు సోపలంభం చ శుద్ధం లౌకికమిష్యతే ॥**

## 7. మాండూక్యోపనిషత్తు సారం - కారికలు 87-89

ఇక్కడ్నుంచీ మళ్ళీ ఇంకొక అంశంలోకి అడుగుపెడుతున్నారు గౌడపాదాచార్యులవారు. గౌడపాదాచార్యులవారు తను రచించిన ఈ 215 కారికలు తన స్వంత సిద్ధాంతాన్ని లేదా ఒక కొత్త సిద్ధాంతాన్ని తెలియజేయటం లేదనీ, మాండూక్యోపనిషత్తునే వివరిస్తున్నారనీ, మనం గుర్తుంచుకోవాలని భావిస్తున్నారు.

ఈ వివరణలో పడిపోయి, కారికలకు ఆధారమైన ఉపనిషత్తును మర్చిపోతే, ఆయన బోధ ఆయన స్వంతం అని మనం పొరపాటు పడే ఆస్కారం ఉంది. గౌడపాదాచార్యులవారు దీన్ని తన స్వంతంగా చాటి చెప్పుకోవాలనుకోవటం లేదు. అందువల్ల మనం మాండూక్యోపనిషత్తుని మర్చిపోకుండా, దాని సారాన్ని మనకి కారికలు 87-89లో గుర్తు చేయబోతున్నారు. మాండూక్యోపనిషత్తు సారం ఏమిటి?

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

ప్రమాత-ప్రమేయాల జంటలను మూడు అవస్థల్లోనూ చూశాము. అవి జాగ్రదావస్థ-జాగ్రత్ ప్రపంచం; స్వప్నావస్థ-స్వప్నప్రపంచం; సుషుప్తి అవస్థ-కారణ ప్రపంచం. ఈ మూడు జంటలూ మార్పుకు లోనవుతాయి. కాని నేను -

**అవస్థాత్రయ సాక్షి చైతన్యం అహమస్మి**

ఈ అవస్థాత్రయ వివేకాన్ని ఈ కారికలో చూడబోతున్నాము. ముందు వాటి సారం చూద్దాము. కాకపోతే, ఇక్కడ ఆ అవస్థలకు సాంకేతిక పదజాలాన్ని వాడుతున్నారు గౌడపాదాచార్యులవారు. ముందు అవేమిటో చూద్దాము.

| సాంకేతిక పదం | అవస్థ | అనుభవం |
|---|---|---|
| లౌకికమ్ | జాగ్రదావస్థ | అనుభవం, వస్తువు రెండూ ఉన్నాయి |
| శుద్ధం లౌకికమ్ | స్వప్నావస్థ | అనుభవం ఉంది, వస్తువు నిజంగా లేదు |

లోకోత్తరమ్ సుషుప్తి అవస్థ అనుభవం లేదు, వస్తువు లేదు

**సవస్తు సోపలంభం చ ద్వయమ్** – జాగ్రదావస్థలో ప్రతిదీ జంటగా అనుభవిస్తాము. బాహ్యపదార్థాలు, ఆంతర జ్ఞానము.

ద్వయమ్ – జంట

స వస్తు – బాహ్యవస్తువులు

స ఉపలంభం చ – ఆంతర అనుభవాలు

మీకు మనస్సులో ఒక అనుభవం లేదా ఆలోచన (వృత్తి) అయింది అంటే, బాహ్యంగా దానికి సంబంధించిన వస్తువు ఉంటుంది. ఉదాహరణకు మీకు ఘటవృత్తి ఏర్పడిందంటే, బాహ్యంగా ఒక ఘటం (కుండ) ఉందన్నమాట. ఏనుగు వృత్తి ఉంటే బాహ్యంగా ఏనుగు ఉందన్నమాట. ఆ విధంగా ఒక జంట ఉంది. ఎక్కడ?

**లౌకిక మిష్యతే** – జాగ్రదావస్థలో ద్వైతం ఉంది. జాగ్రదావస్థను ఇక్కడ లౌకికం అంటారు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

స్వప్నావస్థ ప్రత్యేకత ఏమిటి? స్వప్నావస్థలో కూడా బాహ్యంగా వస్తువు, ఆంతరంగా దానికి సంబంధించిన వృత్తి ఉన్నట్లు అనిపిస్తుంది. కాని లోతుగా విశ్లేషిస్తే, స్వప్నప్రపంచం మీ వాసనలనుంచి వచ్చింది. మీరు బాహ్యంగా చూస్తున్న ఏనుగు కాని, పులి కాని, బస్సు కాని ఏవీ లేవు. అవి మీ మనస్సులోంచి వచ్చిన ఆలోచనలు మాత్రమే. మీ పడకగదిలోనో, మీ స్థూలశరీరానికి భిన్నంగానో ఈ ఏనుగు కాని, పులి కాని, బస్సు కాని లేవు. నిజానికి అవి ఉండేటంత ప్రదేశం కూడా లేదు. అందువల్ల స్వప్నావస్థలో రెండు లేవు. ఆలోచన లేదా వృత్తి మాత్రమే ఉంది కాని దానికి సంబంధించిన వస్తువు లేదు.

**శుద్ధం లౌకికమిష్యతే** – స్వప్నావస్థను శుద్ధ లౌకికం అంటారు.

**స ఉపలంభం** – ఆంతరిక ఆలోచనలు ఉన్నాయి కాని,

**అవస్తు** – దానికి సంబంధించిన బాహ్యవస్తువు లేనేలేదు. అంటే బాహ్యవస్తువుతో కూడిన ఆలోచన జాగ్రత్ ప్రపంచం అయితే, బాహ్యవస్తువు లేని, ఆలోచన స్వప్నప్రపంచం.

**కారిక 4.88**

**అవస్త్వనుపలంభం చ లోకోత్తరమితి స్మృతమ్ ।**
**జ్ఞానం జ్ఞేయం చ విజ్ఞేయం సదా బుద్ధైః ప్రకీర్తితమ్ ॥**

ఇందులో సుషుప్తి గురించి చూస్తాము.

**లోకోత్తరమితి స్మృతమ్** – సుషుప్తిని లోకోత్తరం అని అంటారు. ఇందులో బాహ్యవస్తువూ లేదు, ఆంతర ఆలోచనా లేదు.

**ఘట జ్ఞానమపి నాస్తి ఘట పదార్థమపి నాస్తి**

**అవస్తు** – బాహ్యవస్తువు లేదు.

**అనుపలంభమ్** – లోపలి అనుభవం లేదా ఆలోచన లేదు.

దీనితో మూడు అవస్థల నిర్వచనం అయిపోయింది.

ఈ మూడు అవస్థల్లోనూ సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ జంటను జ్ఞానం–జ్ఞేయం జంట అంటారు. జ్ఞానం–జ్ఞేయం రెండూ సవికారం. ఉదాహరణకు కుండ గురించిన జ్ఞానాన్ని ఘటజ్ఞానం అంటారు. కుండను జ్ఞేయం అంటారు. ఘటాన్ని చూస్తే ఘటజ్ఞానం కలుగుతుంది. కాని దాని తర్వాత గోడను చూస్తే, గోడజ్ఞానం కలుగుతుంది. అందువల్ల ఈ జ్ఞానం–జ్ఞేయం జంట మారుతూ ఉంటుంది.

ఈ మూడు అవస్థలకూ భిన్నంగా, మార్పులేని తత్త్వం ఒకటుంది. దాన్ని చైతన్యం అంటారు. ఆలోచనలు వస్తాయి, పోతాయి. కాని ఈ రాకపోకలు లేనిది చైతన్యం. ఆ చైతన్యాన్ని విజ్ఞేయం అంటారు.

**జ్ఞానం జ్ఞేయం చ విజ్ఞేయమ్** – జ్ఞానం మారుతున్న అనుభవాలను సూచిస్తే, జ్ఞేయం మారుతున్న బాహ్యవస్తువులను సూచిస్తుంది. విజ్ఞేయం మార్పులేని, సాక్షి చైతన్యం. దాన్నే మాండూక్య పరిభాషలో తురీయం అంటారు.

అన్ని ఉపనిషత్తులూ, మాండూక్యంతో సహా, జ్ఞానులు ఈ జ్ఞానం, జ్ఞేయం, విజ్ఞేయాల గురించి మాట్లాడుతారు అంటాయి.

**బుద్ధైః** – బుద్ధైః అంటే జ్ఞానులు. సంస్కృతంలో బుద్ధః పదాన్ని విశేషణంగా వాడతారు. బుద్ధః అంటే జ్ఞానం పొందిన వ్యక్తి, జ్ఞాని. అందువల్ల జ్ఞానుల ముందు దీన్ని విశేషణంగా వాడవచ్చు. బుద్ధః శంకరాచార్యః, బుద్ధః వ్యాసాచార్యః అనవచ్చు. ఇక్కడ జ్ఞానులు అని తీసుకోవాలి.

**సదా ప్రకీర్తితమ్** – ఈ జ్ఞానులు ఎప్పుడూ మాట్లాడుతూ ఉంటారు. ఈ మూడింటి గురించి ఎప్పుడూ మాట్లాడుతుంటారు. ఎలా మాట్లాడుతారు? అది వచ్చే శ్లోకంలో చూస్తాము.

### కారిక 4.89

**జ్ఞానే చ త్రివిధే జ్ఞేయే క్రమేణ విదితే స్వయమ్ ।**
**సర్వజ్ఞతా హి సర్వత్ర భవతీహ మహాధియః ॥**

ఈ జ్ఞానం–జ్ఞేయం పదాలను మూడు జంటలుగా మూడు అవస్థల్లోనూ చూడవచ్చు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ముందు జ్ఞానపరంగా చూస్తే, జాగ్రదావస్థలోని

అనుభవాలని జాగ్రత్ జ్ఞానమనీ, స్వప్నావస్థలోని అనుభవాలని స్వప్నజ్ఞానమనీ, సుషుప్తి అవస్థలోని అనుభవాలని సుషుప్తి జ్ఞానమనీ అంటారు. ఆ విధంగా త్రివిధం జ్ఞానం వచ్చింది.

అలాగే త్రివిధం జ్ఞేయం వస్తుంది. జాగ్రదావస్థలోని బాహ్యవస్తువులు, స్వప్నావస్థలోని వాసనామయవస్తువులు. స్వప్నావస్థలో నిజంగా బాహ్యవస్తువు లేదు. సుషుప్తిలో జ్ఞేయం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి అజ్ఞానం, ఇంకొకటి సుఖం. గాఢనిద్రపోయి లేచాక ఎవరన్నా చెప్పే మాట ఒకటే! 'నాకేం తెలియలేదు, నేను హాయిగా నిద్రపోయాను.'

ఇప్పుడు ఈ రెండూ కలిపితే మనకు మూడు అవస్థల్లోనూ జ్ఞానం–జ్ఞేయం జంటలు ఉన్నాయి. కాకపోతే సుషుప్తిలో ఉన్న జ్ఞానం–జ్ఞేయం జంటను సుషుప్తిలో ఉండగా తెలుసుకోలేము. అది అవ్యక్తంలో ఉంటుంది. లేచాక తెలుస్తుంది.

**త్రివిధే జ్ఞానే** – మూడు అవస్థలకు చెందిన మూడు రకాల జ్ఞానం,

**(త్రివిధే) జ్ఞేయే** – మూడు అవస్థలకు చెందిన విషయవస్తువులు.

త్రివిధే పదం రెండుసార్లు చదవాలి. త్రివిధే జ్ఞానే, త్రివిధే జ్ఞేయే. ముందు ఈ జంటలను అర్థం చేసుకోవాలి. మాండూక్య ఉపనిషత్తులో వీటిని ప్రమాత–ప్రమేయం జంటగా, మూడు పాదాలలో చూశాము. వాటిని ప్రథమ పాదం, ద్వితీయ పాదం, తృతీయ పాదం అని నేర్చుకున్నాము. ఈ మూడు పాదాలను దాటితే, నాలుగవ పాదం అయిన తురీయాన్ని తెలుసుకుంటారు. దాన్నే ఇక్కడ విజ్ఞేయమ్ అంటున్నాము. కాకపోతే ఆ పదాన్ని మనం కలుపుకోవాలి.

**స్వయం (విజ్ఞేయం తురీయం) జ్ఞేయతే** – ఈ మూడు జంటలను తెలుసుకున్నాక, తురీయాన్ని తెలుసుకోవాలి. ముందే తురీయజ్ఞానానికి వెళ్ళలేము.

**క్రమేణ** – తురీయం గురించి దశల వారీగా నేర్చుకోవాలి. మాండూక్యోపనిషత్‌లో ఆత్మయొక్క నాలుగు పాదాలను ప్రవేశపెట్టి, ఒక్కొక్క పాదంగా చెప్పుకొచ్చి, ఆ పాదంలోని ప్రమాత–ప్రమేయం జంటని పరిచయం చేసుకుంటూ వచ్చింది.

(ఇవన్నీ **పట్టిక4– మంత్రాలు 3–7**లో మొదటి అధ్యాయం చివర్లో అప్పుడు చూశాము. ఇప్పుడు కూడా చూడవచ్చు.)

చివర్లో తురీయానికి వచ్చి తురీయం ప్రమాత–ప్రమేయ విలక్షణం, అధిష్ఠానం అని నిరూపించింది. అటువంటి తురీయజ్ఞానం పొందితే,

**మహాధియః** – గొప్ప బుద్ధిశాలికి,

**సర్వజ్ఞతా హి సర్వత్ర భవతి** – తురీయ ఐక్యం కలుగుతుంది. సర్వజ్ఞతా అంటే తురీయ స్థానప్రాప్తి లేదా బ్రహ్మ ఐక్యప్రాప్తి. తురీయం దగ్గరికి వచ్చేసరికి, అదిగో, అది తురీయం అనడు, నేనే ఆ తురీయాన్ని అని అర్థం చేసుకుంటాడు.

ఇక్కడ సర్వజ్ఞతా పదం ఒక సాంకేతిక పదం. మామూలుగా సర్వజ్ఞుడు అంటే అన్నీ తెలిసినవాడు అని అర్థం. కాని ఇక్కడ అర్థం వేరు. ఇక్కడ దీన్ని వేరే విధంగా విడదీయాలి.

**సర్వజ్ఞతా = సర్వః చ + జ్ఞః చ**

జ్ఞః అంటే చైతన్యస్వరూపం. అతను చైతన్యస్వరూపాన్ని లేదా ఆత్మస్వరూపాన్ని పొందుతాడు. ఎటువంటి ఆత్మస్వరూపం? సర్వః చ. అంతటా ఏదైతే ఉందో ఆ ఆత్మస్వరూపం.

**సర్వాత్మక బ్రహ్మస్వరూపం ప్రాప్నోతి**

అంటే నేనే ఈ జగత్తులో అంతటా భాసిల్లుతున్నాను. వేదాంతం అర్థం చేసుకుంటే నేనే పాటను, నేనే అందులోని భావాన్ని అని చెప్పవచ్చు. నమ్మలేకపోతే ఒకసారి స్వప్నవృత్తాంతం చూడండి. స్వప్నంలో మీరు నక్షత్రాలను, చందమామను, మనుష్యులను చూస్తారు. అవన్నీ మీకు భిన్నంగా, బాహ్యంగా ఉన్నట్టు చూస్తారు. కానీ స్వప్నంనుంచి లేవగానే, అవి నిజంగా బాహ్యంగా లేవనీ, మీ వాసనలనుంచి వచ్చిన వాసనామయప్రపంచం అనీ అర్థం చేసుకుంటారు. స్వప్నంలో ఉండగా ససేమిరా నమ్మరు కాని లేచాక మీరే అవన్నీ అంటారు.

అదే సూత్రం తురీయానికి కూడా వర్తిస్తుంది. తురీయం స్థాయికి ఎదిగితే, మీరే అన్నీ అంటారు. అందువల్ల,

మహాధియః – ఆ జ్ఞానులకు; సర్వజ్ఞతా భవతి – సర్వాత్మక భావం కలుగుతుంది; సర్వత్ర – వారు ఎక్కడికి వెళ్ళినా కూడా. ఎక్కడికి వెళ్ళినా **అహమేవ ఇదగ్ం సర్వమ్** అంటారు. ఎప్పుడు జరుగుతుంది ఇదంతా? మరణం తర్వాత అయితే అవునో, కాదో మనకు తెలియదు. ఇక్కడే, ఇప్పుడే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. సర్వజ్ఞతాలో చూసిన 'చ' ఇక్కడకు తెచ్చుకోవాలి. నేనే సృష్టి, స్థితి, లయ కారకుడనని అంటాడు జ్ఞాని.

ఇక్కడితో మాండూక్యోపనిషత్తు సారం అయిపోయింది. ఆ సారం మళ్ళీ చూస్తే –

| | | |
|---|---|---|
| లౌకికం | – జాగ్రదావస్థ | – అనుభవం, వస్తువు రెండూ ఉన్నాయి |
| శుద్ధం లౌకికం | – స్వప్నావస్థ | – అనుభవం ఉంది, వస్తువు నిజంగా లేదు |
| లోకోత్తరం | – సుషుప్తి అవస్థ | – అనుభవం లేదు, వస్తువు లేదు. |

మూడు అనుభవాలు (త్రివిధం జ్ఞానమ్), మూడు వస్తువులు (త్రివిధం జ్ఞేయమ్) మిథ్య

విజ్ఞేయం తురీయాన్ని తెలుసుకున్న జ్ఞాని సర్వాత్మక బ్రహ్మస్వరూపం పొందుతాడు.

**కారిక 4.90**

**హేయజ్ఞేయాప్యపాక్యాని విజ్ఞేయాన్యగ్రయాణతః ।**
**తేషామన్యత్ర విజ్ఞేయాదుపలంభస్త్రిషు స్మృతః ॥**

**8. సాధనలు – కారిక 90**

ఈ కారికలో ఆత్మజ్ఞానం పొందటానికి కావాల్సిన సాధనలను టూకీగా ఇస్తున్నారు గౌడపాదాచార్యులవారు. ఆ సాధనలు నేర్చుకోకపోతే ఈ బోధ ఏదో అసాధ్యమైన విషయంగా తోస్తుంది. నిజానికి, కొత్తలో గురువుమీద జాలికూడా కలుగుతుంది. మీ అనుభవం చూపించేది, శాస్త్రంనుంచి గురువు చెప్పేదీ, పూర్తిగా రెండు భిన్నధృవాలుగా అనిపిస్తాయి. సాధన చతుష్టయ సంపత్తి పొందితే, కొంతవరకూ సాధ్యమే అనిపిస్తుంది.

లౌకిక జీవనంలో విజయానికి ఎనిమిది మెట్లు అని ఒక అద్భుతమైన కొటేషన్ ఉంది. దాని తెలుగుసారం చూద్దాము.

1. నేను చేయను, 2. నేను చేయలేను, 3. నాకు చేయాలని ఉంది, 4. ఎలా చేయాలి? 5. చేయటానికి ప్రయత్నిస్తాను, 6. నేను చేయగలను, 7. నేను చేస్తాను, 8. అవును. నేను చేసాను (సాధించాను).

ఎక్కడనుంచి ఎక్కడికి వెళ్ళాడో చూడండి. నేను చేయను, చేయలేను దశనుంచి నేను చేయగలను, నేను చేస్తాను దశకు వస్తాడు. ఎప్పుడైతే ఆ దశకు వస్తాడో సాధించి తీరుతాడు. అలాగే ఆత్మజ్ఞానం కూడా ముందు అసాధ్యం అనిపిస్తుంది, తర్వాత సాధ్యమే అనిపిస్తుంది, తర్వాత నిశ్చయజ్ఞానం పొందుతాడు.

ఈ జ్ఞానం పొందటానికి సాధన చేయాలనుకునే సాధకుడు నాలుగు విషయాలను స్పష్టంగా తెలుసుకోవాలి. అవి హేయం, జ్ఞేయం, ఆప్యం, పాక్యం.

**విజ్ఞేయాని** – స్పష్టంగా తెలుసుకోవాల్సినవి. ఎప్పుడు?

**అగ్రయాణతః** – అన్నింటికన్నా ముందు; అంటే సాధన మొదలుపెట్టకముందే. ఏమిటవి?

1. **హేయమ్** – ఏవి విడిచి పెట్టవలసినవి? శాంతి, భద్రత, ఆనందంకోసం దేనిమీద ఆధారపడకూడదో తెలుసుకోవాలి.

మొత్తం బాహ్యప్రపంచం అనాత్మప్రపంచం. అది మిథ్య. మాండూక్య పరిభాషలో చెప్పాలంటే, మొదటి మూడు పాదాలు మిథ్యానామరూపాలు మాత్రమే. అవి నిత్యం కాదు. ఎప్పుడో ఒకప్పుడు నాశనమవుతాయి. బాహ్యవస్తువులు అందంగా ఉంటాయి, ఆకర్షణీయంగా ఉంటాయి. వ్యవహారం నడపటానికి పనికివస్తాయి. కాని వాటిమీద ఆధారపడలేము.

అందువల్ల ప్రపంచంలోని వస్తువులతో వ్యవహారం నడపండి. మనుష్యులను ప్రేమించండి, వారిమీద అక్కర చూపండి, వారి కష్టసుఖాలు పంచుకోండి. ఏదైనా చేయండి కాని ఒక్కటి మాత్రం చేయకండి. వారినుంచి శాశ్వతమైన భద్రతను కోరకండి. వారే శాశ్వతం కానప్పుడు వారు మీకెలా శాశ్వతమైన ఆనందాన్ని ఇస్తారు? అందువల్ల అనిత్య వస్తువుకు అతీతంగా ఎదగటం నేర్చుకోవాలి. ఇది స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

వాటిని మీరు లౌకికంగా ఎదగటానికి తాత్కాలికంగా ఉపయోగించుకోవచ్చు. కాని చివరికి వాటిని వదులుకోక తప్పదనే విషయాన్ని మీరు జీర్ణించుకోక తప్పదు. పోల్ వాల్టింగ్ ఉదాహరణ మర్చిపోకూడదు – క్రీడాకారుడు ఆ పోల్‌ను పట్టుకుని, పరుగెత్తుకుని వచ్చి, సరియైన సమయంలో, దాన్ని వదిలేసి, గోడకు అవతల వైపుకు దూకుతాడు. మీరు కూడా అనాత్మను పట్టుకుని, పరుగులు తీసి, సరియైన సమయంలో, దాన్ని వదిలేసి, ఆత్మ (జ్ఞానం) వైపుకు దూకాలి.

హేయం అంటే అక్షరాలా తీసుకుంటే వదులుకోవటం. ఇక్కడ వస్తువులమీద మానసికంగా, భావపరంగా ఆధారపడకపోవటం అని వస్తుంది. సాధన చతుష్టయంలో రెండవది వైరాగ్యం. వైరాగ్యం అంటే **ఇహాముత్ర ఫలభోగ విరాగః**. ఏది నిత్యమో, ఏది అనిత్యమో తెలుసుకుంటే, అనిత్యవస్తువుమీద ఆధారపడరు. హేయం అంటే అనిత్యవస్తువుమీద వైరాగ్యం.

ఎవరితోనైనా బంధం ఉండితీరాలి అంటే, ముగ్గురితో ఉండవచ్చు. అవి ఈశ్వరుడు, గురువు, శాస్త్రము. ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి, భగవంతునిమీద ఆధారపడే స్థాయికి ఎదగాలి. దాని తర్వాత మీమీదే మీరు ఆధారపడే స్థాయికి ఎదగాలి. ఇదే భగవద్గీత సారం కూడా. మీ ప్రయాణం ప్రపంచంనుంచి ఈశ్వరుడు – ఈశ్వరుణ్ణుంచి చైతన్యం వైపుకు సాగాలి. దానికి గురువు, శాస్త్రం తోడ్పడతారు.

2. **జ్ఞేయమ్** – హేయమ్‌లో దేన్ని విడిచిపెట్టాలో తెలుసుకుంటే, జ్ఞేయమ్‌లో దేన్ని పట్టుకోవాలో తెలుసుకుంటారు. ఏది శాశ్వతమో, దాన్ని పట్టుకోవాలి. శాశ్వతమైనది ఒకటే ఉంది. అది తురీయం. తురీయజ్ఞానం పొందాలి. బ్రహ్మ సత్యం అని తెలుసుకోవాలి.

హేయమ్ జగన్మిథ్యా అంటే జ్ఞేయం బ్రహ్మ సత్యం అని నేర్పిస్తుంది.

3. **ఆప్యమ్** – ఇది తెలుసుకోవటానికి పొందాల్సిన అర్హతలేమిటో తెలుసుకోవాలి. అవి సాధన చతుష్టయ సంపత్తి, విలువలు. భగవద్గీతలో కృష్ణపరమాత్మ అమానిత్వం, అదంభిత్వం వంటి కొన్ని విలువలను పేర్కొన్నాడు. వాటిని పెంపొందించుకోవాలి. అంతేకాదు, శ్రవణం, మననం, నిదిధ్యాసనం, గురువు సమీపానికి వెళ్ళటం కూడా ఆప్యంలోకి వస్తాయి. అంటే మిమ్మల్ని దృఢపరుచుకోవటానికి తోడ్పడేవన్నీ ఆప్యంలోకి వస్తాయి.

4. **పాక్యమ్** – పాక్యమ్ అంటే అక్షరాలా తీసుకుంటే పచనం చేయాలని అర్థం. పచనం అంటే వండటం. గింజను వేయిస్తే, అది నాశనం కాదు, దానికి రుచి ఉంటుంది కాని మొలకెత్తదు. ఈ వేయించటాన్ని పర్జనం అంటారు. జ్ఞానిని ఇలా వేయించిన గింజతో పోలుస్తాము. అటువంటి విత్తనాన్ని భర్జితబీజం అంటారు.

జీవితంలో కొన్ని సమస్యలు, కొన్ని గుణాలు ఎలా ఉంటాయంటే, వాటిని సమూలంగా నాశనం చేయలేము. అందరికీ ఈ సమస్య ఉంటూనే ఉంటుంది. ఆ సమస్యలను పారద్రోలలేము కాని వాటిని వేయించగలము. అప్పుడు అవి కొనసాగుతాయి కాని మనను వేధించవు. అప్పుడు మనం కూడా భర్జితబీజం అవుతాము.

అలా మనం నాశనం చేయలేని ప్రాథమిక గుణాలు – రాగద్వేషాలు. **పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో కాని పోవు** అని సామెత. అలా పుడుతూనే కొన్ని గుణాలతో మనం పుడతాము. కాని మనం పెరుగుతున్న కొద్దీ మనం పెరిగిన వాతావరణంతో పాటు పెరుగుతూ వస్తాయి. ఇవి మనిషి మనిషికీ మారతాయి. ఉదాహరణకు కొంతమందికి చీర కట్టుకోవటం ఇష్టం, కొంతమందికి ఆధునిక వస్త్రాలంకరణ ఇష్టం; కొంతమందికి ఎర్రరంగు ఇష్టం, కొంతమందికి తెలుపు లేదా లేతరంగులు ఇష్టం; కొంతమందికి హోరెత్తించే సంగీతం ఇష్టం, కొంతమందికి వీనులవిందుగా ఉండే సంగీతం ఇష్టం; కొంతమందికి స్వీట్లు ఇష్టం, కొంతమందికి హాట్లు ఇష్టం; ఏదైనా ప్రసంగానికి వెళ్ళినా కూడా కొంతమంది సరిగ్గా వక్త ఎదురుగా కూర్చుంటే, కొంతమంది హాలంతా ఖాళీగా ఉన్నా కూడా చివరికి వెళ్ళి కూర్చుంటారు; కొంతమంది ఎత్తైన సౌధాల్లో ఉండాలనుకుంటే, మరికొంతమంది పూరిగుడిసె అయినా, విడిగా ఉండాలి అనుకుంటారు.

**ఇంద్రియస్య ఇంద్రియస్య అర్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ** – గీత 3.34

ఆ విధంగా మనిషి, మనిషికీ రాగద్వేషాలు మారుతుంటాయి. అలాంటప్పుడు, ఈ రాగద్వేషాలను ఏం చేయాలి? అధార్మికమైనవి, అనైతికమైనవి వెంటనే పారద్రోలాలి. కొన్ని రాగద్వేషాలు సహజంగా ఉంటాయి. వాటిని పారద్రోలలేము అన్నామని, అయితే, 'నాకు మందు తాగటం ఇష్టం; ఆ అలవాటుని నేను పారద్రోలలేను,' అనకూడదు. శాస్త్ర విరుద్ధమైనవి, అధార్మికమైనవి, అనైతికమైనవి వెంటనే పారద్రోలాలి.

కొన్ని రాగద్వేషాలు మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తాయి. వాటివల్ల ఏమీ హాని జరగదు, అవి అధార్మికమూ కావు. అటువంటి వాటితో నష్టం లేదు. ఉదాహరణకు మీ ఆహారనియమాలు. వాటిని పారద్రోలనవసరం లేదు అంటుంది శాస్త్రం. అవి మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తాయి. ఎవరి వ్యక్తిత్వం వారిదే!

ఉపనిషత్తులనే తీసుకోండి. వీటిల్లో మీకేది ఇష్టం అని మీరు ఎవరినైనా అడిగితే, ఒకరేమో మాండూక్యం చాలా బాగుంది అంటే, ఇంకొకరు తలమీంచి వెళ్ళిపోయింది, బాలేదు అంటారు. వారు మధ్యలోనే వినటం మానేసినా మానేస్తారు. నచ్చిన మాండూక్యంలోనే ఏ అధ్యాయం బాగుంది అంటే జవాబులు భిన్నంగా వస్తాయి. అందువల్ల లోకోభిన్నరుచి అంటారు పెద్దలు.

దయానందస్వామీజీ లోకులకే కాదు, దేవుళ్ళకు కూడా భిన్నరుచులు ఉంటాయి అంటారు. సరస్వతీదేవి వీణ వాయిస్తే, కృష్ణపరమాత్మ వేణువు వాయిస్తాడు. దుర్గాదేవిది పులి వాహనం అయితే, సరస్వతీదేవిది హంసవాహనం; శివుడు అభిషేక ప్రియుడు అయితే విష్ణుమూర్తి అలంకార ప్రియుడు.

మరయితే, ఈ రాగద్వేషాలను ఏం చేయాలి? మీ రాగద్వేషాలను కొనసాగించుకోండి ఫర్వాలేదు, కాని అవి మిమ్మల్ని కట్టిపడేసేవిగా ఉండకుండా చూసుకోండి అంటుంది శాస్త్రం. దీన్ని పర్జనం అంటారు. అంటే బంధించని రాగద్వేషాలు ఉండవచ్చు.

బంధించని రాగద్వేషాలు అంటే ఏమిటి? ఎవరైనా మీకు కాఫీ కావాలా, టీ కావాలా అని అడిగితే మీరు కాఫీ అడగవచ్చు. తప్పులేదు. అప్పుడు అది బంధించే కోరిక కాదు. అది మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. కాని కాఫీ దొరకని ఊరు వెళ్ళి, అక్కడ కాఫీ దొరకకపోతే, కాఫీకోసం అల్లాడిపోతే, అది బంధించే కోరిక అవుతుంది. కాఫీ దొరకకపోతే, టీ అయినా ఫర్వాలేదు అనగలిగేటట్టు ఉండాలి.

బంధించే కోరిక మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు అడ్డుపడితే, బంధించని రాగద్వేషాలు ఎటువంటి ఆటంకాన్నీ కలుగజేయలేవు. అందువల్ల మీ బంధించే రాగద్వేషాలను బంధించని రాగద్వేషాలుగా మార్చుకోవాలి. అంతేకాదు, శాస్త్రం నిషేధించిన కోరికలు ఉండకూడదు. అవి ధార్మికంగా ఉండాలి. దీన్ని పాక్యం అంటారు.

ఈ నాలుగూ ఆధ్యాత్మిక సాధన మొదలుపెట్టే ముందే తెలుసుకోవటమే కాదు, వాటిని పాటించటం మొదలుపెట్టాలి. మీరు అలవాటుగా చేసే కొన్ని పనులకు 'వద్దు' అని చెప్పగలగటం నేర్చుకోవాలి. ఒకరోజు కాఫీకో, వార్తాపత్రికకో, టీవీ సీరియల్‌కో నో చెప్పగలగాలి. అలా చెప్పగలగటంకోసం మన శాస్త్రమే కొన్ని వ్రతాలను ఏర్పాటు చేసింది. అది ప్రయత్నపూర్వకంగా కొన్నింటికి వద్దు అనటం నేర్పిస్తుంది. అయ్యప్పదీక్షలో ఉన్నవారు చాలా అలవాట్లకు నో చెబుతారు. వీటి ద్వారా వారి రాగద్వేషాలను వేయించిన గింజలాగా చేసుకుంటున్నారు. ఇలా అప్పుడప్పుడూ కొన్ని అలవాట్లకు నో చెప్పగలిగితే, మీరు ఇంద్రియాలకు బానిస అయ్యారో, అవే మీకు బానిస అయ్యాయో మీకే తెలుస్తుంది. ఎవరూ విడమర్చి చెప్పనవసరం లేదు.

ఆ విధంగా ఈ నాలుగు సాధనలను చేసి, చివరికి మీ స్వస్వరూపమైన తురీయం మీదే ఆధారపడటం నేర్చుకోవాలి. దీన్ని మోక్షం అంటారు.

**తేషామ్** – ఈ నాలుగింటిలో. అంటే హేయం, జ్ఞేయం, ఆప్యం, పాక్యంలో

**త్రిషు ఉపలంభః స్మృతః** – మూడు అంశాలు వ్యావహారిక సత్యం మాత్రమే. అవి మిథ్య. వాటిని సాధన సమయంలోనే వాడతారు. ఉపలంభః అంటే మిథ్య. త్రిషు స్మృతః అంటే మూడు అంశాలు. అవి హేయం, ఆప్యం, పాక్యం.

మరయితే ఏమిటి అంతిమ సత్యం?

**అన్యత్ర విజ్ఞేయాత్** – అన్యత్ర అంటే ఈ మూడూ కానిది. ఈ మూడూ కాని, నాలుగవది అయిన జ్ఞేయం మీదనే ఆధారపడాలి. ఎప్పుడైతే తురీయజ్ఞానం పొందుతారో, అప్పుడే ఇంక తక్కిన మూడింటినీ వదులుకోవాలి. పోల్‌వాల్టర్ ఎలా పోల్‌ను వదులుతాడో, అలా మీరు కూడా వాటిని వదలాలి. మీకు ఎవరితోనైనా బంధం ఉండితీరాలంటే, ముగ్గురితో ఉండవచ్చు అని చూశాము. అవి ఈశ్వరుడు, గురువు, శాస్త్రం. వీరితో కూడా కొంతవరకే బంధం ఉండాలి. ఆత్మజ్ఞానం పొందాక వారికి కూడా అతీతంగా ఎదగాలి. కాని ఇప్పుడే కాదు, ఆత్మజ్ఞానం పొంది, మీమీదే ఆధారపడటం నేర్చుకున్నాక.

ఈ కారిక సారాంశం –

**తురీయం సత్యం అని తెలుసుకున్నాక (జ్ఞేయాన్ని తెలుసుకున్నాక) హేయం, ఆప్యం, పాక్యాలను వదిలివేయాలి.**

### 9. ఉపసంహారం – కారికలు 91–100 ఉపోద్ఘాతం

ఈ అధ్యాయంలో గౌడపాదాచార్యులవారు ఇంతవరకూ మాండూక్యోపనిషత్తులోని మంత్రాలను చాలా వివరంగా విశ్లేషించుకుంటూ వచ్చారు. అంతేకాదు, సాంఖ్య, యోగ, బౌద్ధ దర్శనాలను ఖండించి **అజాతివాదము సత్యము** అని నిరూపించారు. అలాతశాంతి దృష్టాంతం ద్వారా అహం సత్యం, జగన్మిథ్యా బోధను నిలబెట్టారు. తరువాత మళ్ళీ అవస్థాత్రయ విచారాన్ని చేశారు. ఈ విచారణ చేయటానికి కావలసిన నాలుగు సాధనలను కూడా పేర్కొన్నారు.

ఇప్పుడు కారికలు 91–100ల్లో ఈ ప్రకరణంలోని బోధనే కాక, మొత్తం కారికల్లోని బోధను కూడా ముగిస్తున్నారు. ఈ ఉపసంహారంలో గౌడపాదాచార్యులవారు చెప్పదలుచుకున్న సారం – మనం జీవితంలో ఏవైతే కోరతామో, అవి నీ స్వస్వరూపం అంటుంది శాస్త్రం అనే విషయం.

మీరు జీవితంలో కోరుకునేవి మూడు. అవి శాంతి, భద్రత, ఆనందం. అవి బాహ్యవస్తువుల్లో ఉన్నాయనుకుని బాహ్యంగా పరుగులు తీస్తారు.

ఎ) **భద్రత** – ముందు భద్రత చూద్దాము. మీరు చిన్నప్పటినుంచీ అభద్రతాభావనకు లోనవుతారు. చిన్నవయస్సులో తల్లి కొంగుచాటున దాక్కుంటారు. అక్కడ భద్రత దొరుకుతుందనే ధైర్యం. పెరుగుతూ వస్తున్న కొద్దీ ఉద్యోగంలో భద్రత దొరుకుతుందనీ, పెళ్ళయితే భద్రత ఉంటుందనీ, పిల్లలు పుడితే భద్రత వస్తుందనీ అనుకుంటారు. లేదా ఎల్.ఐ.సీ. పాలసీలు, మెడిక్లెయిమ్ స్కీములు, ఎఫ్.డి.లు ఉంటే జీవితం నిశ్చింతగా సాగిపోతుంది అనుకుంటారు. అలా ఏది కోరుకున్నా, ఏ అనుబంధం పెంచుకున్నా, దాని వెనుకనున్న కోరిక ఈ భద్రతాభావాన్ని పెంపొందించుకోవటానికి అంటే భయం పోయి అభయం పొందటానికి. కాని వేదాంతం అభయమే మీ స్వరూపం అంటుంది.

**అదృశ్యే అనాత్మ్యే అనిరుక్తే అనిలయే అభయం ప్రతిష్ఠాం విందతే** – తైత్తిరీయమ్

నీ స్వరూపమే అభయం. స్వప్నప్రపంచానికి ఆధారం ఎలాగైతే జాగ్రత్ పురుషుడో, అలాగే జాగ్రత్ ప్రపంచానికి ఆధారం తురీయమైన మీరే. అందువల్ల శాస్త్రం మీరు వెతుకుతున్న భద్రత మీలోనే దొరుకుతుంది, బాహ్యంగా కాదు అంటుంది. అదే నమ్మలేకపోతే, ఇంకొక అడుగు ముందుకేసి, నీలో **మాత్రమే** దొరుకుతుంది, వేరే ఎక్కడా దొరకదు అంటుంది. తక్కినవన్నీ అశాశ్వతమైనవి, రాకపోకలు ఉన్నవి, కాలం కోరల్లో చిక్కుకున్నవి.

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున** – గీత 8-16

బ్రహ్మలోకం కూడా శాశ్వతం కాదు. మీరే చైతన్యపరంగా శాశ్వతం. ఇది తెలియక బాహ్యంగా పరుగులు తీస్తారు.

బి) **పూర్ణత్వమ్** – భద్రత ఏర్పడ్డాక పూర్ణత్వం కోరుకుంటారు. అందువల్లనే, అందినవన్నీ దొరకపుచ్చుకుంటారు. మీ దగ్గర ఉన్నదేదీ వదులుకోవటానికి ఇష్టపడరు. మీకు రాని భాషలో ఏదైనా ఎవరైనా ఉచితంగా పంచుతుంటే, ఆలోచించకుండా దాన్నికూడా తీసుకుంటారు. **ఫ్రీగా వస్తే ఫినాయిల్ కూడా తాగుతాడు** అని సామెత. ఆ విధంగా లోభం, కార్పణ్యం చూపిస్తారు. మీరు ఇవ్వాల్సివస్తే, ఇరవై రూపాయలు ఇచ్చినా చాలు అంటే ఇరవయ్యే ఇస్తారు. ఇలా ఎందుకు చేస్తారంటే మీరు ఏదో తక్కువైంది, ఇంకా ఇంకా పోగేసుకోవాలి అనుకుంటారు. కాని మీకేమీ తక్కువ కాలేదు, మీరు పూర్ణపురుషులు అంటుంది శాస్త్రం.

**పూర్ణమదః పూర్ణమిదమ్**

అలా మీరు వెతుకుతున్న పూర్ణత్వం మీ స్వరూపమే.

సి) **ఆనందం** – అలాగే బాహ్యవస్తువుల్లో ఆనందం దొరుకుతుందనుకుని వాటివెంట పరుగులు తీస్తారు. కాని ఆనందం మీ స్వరూపం అంటుంది వేదాంతం.

**సత్ చిత్ ఆనందమ్ ఆత్మా**

ఇది తెలియక బాహ్యంగా పరుగులు తీస్తారు. పరుగులు తీసీ, తీసీ అవి బాహ్యంగా దొరకవని తెలుసుకుంటారు. అప్పుడు శాస్త్రం మీరే అభయం, పరిపూర్ణం, ఆనందం; మీరు ఇన్నాళ్ళూ ఏది కావాలనుకున్నారో అదే మీరు అంటుంది. కాని అది తెలియక సంసారంలో పడిపోయారు. నేను తురీయ చైతన్యాన్ని, శాంతం శివమద్వైతబ్రహ్మను అని తెలుసుకునేలా చేస్తుంది వేదాంతం. అదే ఈ కారికల సారం.

అహం అంటే నేను. ఈ నేను ఎవరు? నేను శుద్ధచైతన్యాన్నీ కానూ, శుద్ధ అహంకారాన్నీ కాను. విశ్వ, తైజస, ప్రాజ్ఞలను కలిపితే అహంకారం. మాండూక్య పరిభాషలో చెప్పాలంటే శరీరత్రయం. ఇప్పుడు అహంకారంగా తీసుకుందాము. తురీయం అంటే సాక్షి చైతన్యం.

అహం అంటే నేను, సాక్షి అహంకారాల మేలుకలయికను. వీటిలో 'నేను' అని చెప్పేది ఎవరు? శుద్ధ అహంకారం అసలు లేనేలేదు. అహంకారం సత్‌ని, చిత్‌ని సాక్షినుంచి అరువు తెచ్చుకుంది. శుద్ధ ఎండమావులు లేనేలేవు. శుద్ధస్వప్నప్రపంచం లేనేలేదు. శుద్ధవిద్య లేనేలేదు. అలాగే శుద్ధ అహంకారం కూడా లేదు. అలాగే శుద్ధచైతన్యం కూడా నేను అని చెప్పలేదు – ఎందుకంటే సాక్షి చైతన్యం అవ్యవహారి.

అందువల్ల నేను సాక్షి అహంకారాల మిశ్రమాన్ని. మిస్టర్ మిశ్రా అంటారు దయానంద స్వామీజీ సరదాగా. మనం మిశ్రా అయినా, మొదట్లో ఆ విషయం తెలియక అహంకారంతో మమేకం చెందుతాము. ఆ మాటకొస్తే అసలు సాక్షిచైతన్యం అనేది ఒకటుందనే తెలియదు. ఒకవేళ పొరపాటున తెలిసినా దాని గురించి పట్టించుకోము. అందువల్ల మొదట్లో మనం అహంకార ప్రధానజీవులం. నేను విశ్వను అనుకుంటాము కాని తురీయం అని తెలియదు.

అందువల్ల నాకు మోక్షం కావాలని మీరు కోరుకున్నా, ఆ మోక్షం అహంకార ప్రధానంగానే ఉంటుంది. 'నాకు శాంతి కావాలి,' అని మీరు అంటే దాని ఉద్దేశ్యం మనశ్శాంతి కావాలని. మనశ్శాంతి అహంకారానికి చెందుతుందా, సాక్షికి చెందుతుందా? ఈ ప్రశ్న ఎలా ఉంటుందంటే, 'వాల్మీకి రామాయణం ఎవరు రాశారు?' అని అడిగినట్టు ఉంటుంది. కాని తమాషా ఏమిటంటే, ఈ ప్రశ్నకు కూడా కొంతమంది ఆలోచించి మరీ, 'కంబన్, వాల్మీకి రామాయణం రాశారు,' అంటారు. అలాగే ఇక్కడ సాక్షికి చెందుతుంది అన్నా ఆశ్చర్యపోనవసరం లేదు.

మనశ్శాంతి అహంకారానికి చెందినదని అర్థం చేసుకోవాలి. సాక్షికి అంగాలు లేవు. అందువల్ల మనస్సూ లేదు. ఈ అహంకార ప్రధానజీవుడు, 'నాకు శాంతిలేదు, నాకు

వేదాంతం నేర్చుకునే అర్హత లేదు,' అంటాడు. అనేక కర్మలు చేసీ, సాధనలు చేసీ, 'ఇప్పుడు నాకు జ్ఞానయోగ్యత వచ్చింది, వేదాంతం నేర్చుకోవచ్చు,' అని అర్థం చేసుకుని, క్రమం తప్పకుండా వేదాంతబోధకు వెళ్ళి, ఒక శుభముహూర్తాన, 'ఇప్పుడు నేను జ్ఞానిని,' అని ప్రకటించుకుంటాడు. ఈ జ్ఞాని బిరుదు కూడా అహంకారానికి చెందినది. ఎందుకంటే, జ్ఞానం కలిగేది బుద్ధిలో. అందువల్ల అహంకార ప్రధానజీవుడు ఇప్పుడు జ్ఞాని అయ్యాడు. అందువల్ల అతని ప్రయాణం జ్ఞాన అయోగ్యతనుంచి జ్ఞానయోగ్యతకు సాగి, జ్ఞానయోగ్యతనుంచి జ్ఞానికి సాగుతుంది. గుర్తుంచుకోండి, అంతా అహంకారపరంగానే సాగుతున్నది.

ఇంకా అతని ప్రయాణం ముగియలేదు. జ్ఞానం పొందాక కూడా అహంకారపరంగానే ఆలోచిస్తాడు. జ్ఞానం పొందగానే చాలదు, జ్ఞాననిష్ఠలో నిలబడాలి; దానికి నిదిధ్యాసనం చేయాలని అర్థం చేసుకుని అది కూడా చేస్తాడు. తరువాత నేను జ్ఞాననిష్ఠలో ఉన్నాను అంటాడు. ఎలా అయ్యాడు? 'జీవితంలో ఏం జరిగినా, నేను చలించటం లేదు. నేను ప్రశాంతంగా ఉండగలుగుతున్నాను,' అంటాడు.

**వీతరాగ భయక్రోధః** – గీత

**అద్వేష్టా సర్వభూతానామ్** – గీత

ఇంత జ్ఞాననిష్ఠలో నిలబడ్డా కూడా, అది కూడా అహంకారం దృష్ట్యానే. జాలి, దయ కూడా అహంకారానికి చెందినవి.

ఆ విధంగా అహంకార ప్రధానజీవుడు ఈ దశలన్నీ దాటుకుంటూ వచ్చాడు. అవి –

**జ్ఞానఅయోగ్యత → జ్ఞానయోగ్యత → జ్ఞాని → జ్ఞాననిష్ఠ**

కాని ఇలా జ్ఞాననిష్ఠలో నిలబడ్డాక, పరిస్థితి మారుతుంది. అహంకారం పండిన దోసకాయలాగా దానంతట అది విడిపోతుంది. ఇంక తనను తను అహంకార ప్రధాన జీవునిగా కాక, సాక్షిప్రధాన అహంగా అర్థం చేసుకుంటాడు.

**ఊర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయమామృతాత్** – రుద్రమ్

ఎంత అద్భుతమైన ప్రార్థన. ఇందులో భక్తుడు అంటాడు, 'భగవంతుడా, నాకు సంసారంనుంచి విడివడాలని లేదు, సంసారమే నానుంచి వైదొలగాలని ఉంది నాకు.' దోసకాయ పండిపోయాక, అది రాలదు తీగనుంచి. అది అక్కడే ఉంటుంది, తీగే దాన్నుంచి దూరం తొలగిపోతుంది. అలాగే జ్ఞాని, జ్ఞాననిష్ఠలో నిలబడితే, అతను అహంకారంనుంచి విడివడడు, అహంకారమే అతన్నుంచి విడివడుతుంది.

ఇప్పటివరకూ జ్ఞాని ప్రయాణం చూశాము. జ్ఞాననిష్ఠలో నిలబడ్డాక, నేను ప్రయాణం చేశానని కూడా అనడు. తను శుద్ధచైతన్యం, తనను శుద్ధి చేసుకోనవసరం లేదని అర్థం చేసుకుంటాడు. తను ఎన్నడూ అయోగ్యుడు కాదు కాబట్టి, తను యోగ్యుడు అయ్యానని కూడా అనుకోడు. అలాగే తను జ్ఞాని అయ్యానని కూడా అనుకోడు; ఎందుకంటే తను ఎన్నడూ అజ్ఞాని కాదు కాబట్టి.

కాబట్టి తనను తాను సాక్షి దృష్ట్యా చూసుకుంటే వర్ణన మారుతుంది. దీన్ని సాక్షిప్రధాన దృష్టి అంటారు. అందువల్ల మీ ప్రయాణం అహంకార ప్రధానదృష్టి నుంచి సాక్షిప్రధాన దృష్టి వైపుకు సాగాలి. అదెలాగో కారికలు 91-100లో చూస్తాము.

### కారిక 4.91

**ప్రకృత్యాఽఽకాశవజ్జ్ఞేయాస్సర్వే ధర్మా అనాదయః ।**
**విద్యతే న హి నానాత్వం తేషాం క్వచన కించన ॥**

**సర్వే ధర్మాః** – ధర్మాః అంటే జీవాత్మ. ప్రతి ఒక్క జీవాత్మ కూడా,

**ప్రకృత్యాఽఽకాశవజ్జ్ఞేయాః** – స్వరూపరీత్యా ఆకాశం వంటిది.

ఆత్మకూ, ఆకాశానికీ అనేక పోలికలు ఉన్నాయి. రెండూ సర్వవ్యాపకం, శుద్ధం, నిస్సంగం, నిరవయం. ఆత్మకు రాగద్వేషాలు, కామక్రోధాలు లేవు. అందువల్ల మనస్సుకు అంటే మలినాలు లేవు. శరీరానికి అంటే మలినాలు కూడా లేవు. అందువల్ల ఆకాశంలాగా ఆత్మ కూడా శుద్ధం.

ఇతి జ్ఞేయాః – ఈ విషయం తెలుసుకుని, జీర్ణించుకోవాలి. నేను చైతన్యం అనగానే చైతన్యం విషయంలో నేర్చుకున్న ఐదు సూత్రాలను గుర్తు తెచ్చుకోవాలి.

**అనాదయః** – అనాది అంటే ఆది లేనిది. నాకు చైతన్యపరంగా పుట్టుక లేదు కాని నాకు పునర్జన్మ ఉండకూడదు అనకూడదు. ఈ జన్మే లేకపోతే, ఇంక పునర్జన్మ కలిగే ప్రసక్తి ఎక్కడ? మీ స్వస్వరూపానికి ఎదిగితే పుట్టుకలేని చైతన్యం మీరు.

**విద్యతే న హి నానాత్వమ్** – ఆత్మపరంగా చూస్తే నానాత్వం కూడా లేదు. ఎవరైనా, 'ఈ గదిలో ఎన్ని జీవాత్మలు ఉన్నాయి?' అని అడిగితే, 'పరమాత్మకు భిన్నంగా లేని జీవాత్మ ఒక్కటే ఉంది,' అనాలి. ఎన్ని శరీరాలు ఉన్నాయి అంటే, దానికి జవాబు వేరే ఉంటుంది. శరీరాలు అనేకం, మనస్సులు అనేకం, ఆత్మ మాత్రం ఏకం. అది అన్ని మనశ్శరీరాల్లో సర్వవ్యాపకంగా ఉంది.

**తేషాం క్వచన కించన** – కొంచెం కూడా నానాత్వం లేదు. క్వచన అంటే ఏ సమయంలోనూ, ఎక్కడానూ నానాత్వం లేదు. దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా అర్థం అవుతున్నది. ఇప్పుడు

ద్వైతం ఉంది, మోక్షం పొందాక అద్వైతాన్ని చేరుకుంటాము అనకూడదు. అద్వైతం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చేదికాదు; అంతకుముందు ఉన్నదీ అద్వైతమే, ఇప్పుడు ఉన్నదీ అద్వైతమే, ఇకముందు ఉండేదీ కూడా అద్వైతమే.

మరయితే ద్వైతం మాటేమిటి? ద్వైతం అయోమయం తప్ప ఏమీ కాదు. స్వప్నప్రపంచం కల-1 అయితే, జాగ్రత్‌ప్రపంచం కల-2.

**కారిక 4.92**

**ఆదిబుద్ధాః ప్రకృత్యైవ సర్వే ధర్మాస్సునిశ్చితాః ।**
**యస్యైవం భవతి క్షాంతిస్సోఽమృతత్వాయ కల్పతే ॥**

ఇందులో గౌడపాదాచార్యులవారు ఆత్మస్వరూపం ఇంత అద్భుతంగా ఉండటమే కాదు, అది ప్రత్యక్ష సిద్ధం కూడా అంటున్నారు. ఆత్మస్వరూపం అనాది, నిర్వికారం, ఆకాశతుల్యం. అది ఎన్నడూ కప్పబడిలేదు. ఆత్మ అనుభవం నిరంతరం పొందుతూనే ఉన్నారు. నేను చైతన్యస్వరూపాన్ని అనే వాక్యం చెబితేనే, మీకు చైతన్యం అంటే ఏమిటో అర్థమైనట్టు అర్థం.

తురీయ ఆత్మ అంటే చైతన్యం కాబట్టి, చైతన్యం ప్రత్యక్షసిద్ధం కాబట్టి, నిజం చెప్పాలంటే చైతన్యాన్ని మీరు ప్రతిక్షణమూ అనుభవిస్తూనే ఉన్నారు.

**ప్రతిబోధవిదితం మతమ్** – కేన

మీకు జరిగే ప్రతి ఒక్క అనుభవంలోనూ చైతన్యాన్ని అనుభవిస్తున్నారు.

మరయితే సమస్య ఎక్కడుంది? సమస్య ఆత్మ అనుభవం లేకపోవటంలో లేదు; సమస్య మీరు ప్రత్యక్షసిద్ధం అయిన ఆత్మకు కొన్ని పరిమితులు విధించటంలో ఉంది. ఆత్మ గురించిన పొరపాట్లలో ఉంది.

ఏమిటా పొరపాట్లు? మీ శరీరం, మనస్సు, బుద్ధియొక్క లక్షణాలు చైతన్యానికి ఆపాదిస్తున్నారు. 'నేను ఉన్నాను.' వాక్యం సత్, చిత్‌ల గురించి చెబుతుంది. అక్కడితో ఆగదు, 'నేను **ఇక్కడ** ఉన్నాను,' అంటారు. అది శరీరానికి చెందుతుంది. మీరు చైతన్యం గురించి మాట్లాడాలంటే 'నేను ఉన్నాను,' అని చెప్పి, అక్కడే ఆగిపోవాలి. దాని తర్వాత ఏ గుణాన్ని వేసినా, ఆ గుణం మనశ్శరీరాల్లో దేనికో చెందుతుంది. 'నేను **సన్నగా** ఉన్నాను,' అంటే ఆ గుణం శరీరానికి చెందుతుంది. 'నాకు **చిరాకుగా** ఉంది,' అంటే ఆ గుణం మనస్సుకు చెందుతుంది. 'నాకు **తెలియదు**,' అంటే ఆ గుణం బుద్ధికి చెందుతుంది.

అలా, నేను తర్వాత ఏ గుణం వాడినా అది అనాత్మకు లేదా అహంకారానికి చెందుతుంది. ఈ గుణాలు లేని శుద్ధచైతన్యం ఏదైతే ఉందో అది మీరు. అది తెలుసుకోవటానికి కొత్త

అనుభవం అవసరం లేదు, 'నేను' పదం చెప్పాక దానికి ఆపాదించిన గుణాలను వదిలేస్తే చాలు. ఇప్పుడు కారిక చూద్దాము.

**ఆదిబుద్ధాః** – ప్రతి ఒక్కరికీ ఈ ఆత్మ అనుభవం ఉంది. బుద్ధాః అంటే ఆత్మ అనుభవం లేదా చైతన్య అనుభవం. ఎప్పుడు ఉంది? ఆది – మొదటినుంచీ ఉంది. ఎలా ఉంది?

**ప్రకృత్యా ఏవ** – చైతన్యస్వరూపంవల్ల, ఎప్పుడూ చైతన్యాన్ని అనుభవిస్తున్నాము.

**సర్వే ధర్మాః** – ఆత్మ అనుభవం అన్ని జీవాత్మలకు సమానమే. ఆత్మ అనుభవం తెలియటమే కాదు,

**సునిశ్చితాః** – స్పష్టంగా కూడా తెలుసు. అంటే ఆత్మ అనుభవం విషయంలో సందేహం లేదు. ఎవరైనా మిమ్మల్ని 'నువ్వు చైతన్యమా, జడమా,' అని అడిగితే ఏం చెబుతారు మీరు? 'ఆలోచించి చెబుతాను,' అనో 'నా భార్యను అడిగి చెబుతాను,' అనో అంటారా? ఒకవేళ ఎవరైనా మాండూక్యంలోంచి ఏదైనా ప్రశ్న వేస్తే ఆలోచించి చెప్పాలేమో కాని, మీరు చైతన్యస్వరూపులు అనటంలో ఏ మాత్రం సందేహం లేదు. అందువల్ల సునిశ్చితాః అన్నారు.

**జాగ్రద్ స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృంభతే** – మనీషా పంచకం

జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే ఈ మూడు అవస్థల్లోనూ, ఒకటి స్ఫుటంగా ఉంది, అది చైతన్యం.

**యస్యైవం భవతి** – ఎవరైతే ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటారో; ఏ విషయాన్ని? తను ఆకాశంలాగా సర్వవ్యాపకమైన చైతన్యాన్ననీ, ఈ మూడు శరీరాలు తను తాత్కాలికంగా వేసుకున్న వేషాలనీ ఎవరైతే అర్థం చేసుకుంటారో,

ఉదాహరణకు మీరు ముందు ఒక సెల్‌ఫోన్ కొని, మళ్ళీ కొత్తది వస్తే దాన్ని మార్చి, ఇంకో కొత్తది కొంటారు కాని ఇదే సిమ్ కార్డ్ దానిలో ఎలా వేయించుకుంటారో, అలా ఈ ఆత్మ వేరే జన్మలో వేరే శరీరాన్ని దాల్చినా, ఆత్మ మారదు.

**క్షాంతిః** – అతను జీవితంలో నిశ్చింతగా ఉంటాడు. అతను మూర్తీభవించిన క్షమాగుణంలా ఉంటాడు. క్షమ అంటే ఓర్పు; ఆందోళన లేకపోవటం, చిరాకు లేకపోవటం. అతని జీవితంలో అంత ప్రశాంతతను అనుభవిస్తాడు. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే బద్ధకంగా పొరపాటు పడే అవకాశం ఉంది. ఎందుకంటే బద్ధకం, ఓర్పు చూడటానికి ఒక్కలాగే ఉంటాయి.

**సః అమృతత్వాయ కల్పతే** – అటువంటి వ్యక్తే మోక్షం పొందటానికి సమర్థుడవుతాడు.

## కారిక 4.93

**ఆదిశాంతా హ్యనుత్పన్నాః ప్రకృత్యైవ సునిర్వృతాః ।**
**సర్వే ధర్మాస్సమాభిన్నా అజం సామ్యం విశారదమ్ ॥**

**ఆదిశాంతాః** – శాంతాః అంటే ప్రశాంతత. ఈ ప్రశాంతతను కొత్తగా పొందాల్సిన అవసరం లేదు. మీ స్వరూపమే శాంతస్వరూపం.

**శాంతం శివమద్వైతమ్** – మంత్రం 7

మీరు మూర్తీభవించిన శాంతిస్వరూపులు. ఎప్పుడు? అనాదిగా. అందువల్ల ఆలోచనలను పారద్రోలటానికి ప్రయత్నించనవసరం లేదు. కొంతమంది ప్రశాంతత పొందాలంటే ధ్యానంలో కూర్చుని, మనస్సును శూన్యం చేయాలి అనుకుంటారు. శాంతి అంటే ఆలోచనలు లేని శూన్యమైన మనస్సు అని నిర్వచించుకుంటే మాత్రం, అలాంటి శాంతికోసం ప్రయత్నిస్తే మాత్రం అటువంటి శూన్యమైన మనస్సును నిరంతరం పొందలేరు.

మీరు ఏదో ఏకాంత ప్రదేశం వెతుక్కుంటూ వెళ్ళి, అక్కడ మీ మనస్సునుంచి ఆలోచనలను పారద్రోలి, ఒక పదినిముషాలు ప్రశాంతతను అనుభవించగలరేమో. ప్రశాంతత అంటే ఆలోచనలు లేకపోవటం అంటే, అలా ఆలోచనలు లేకుండా అసలు ఎప్పటికీ ఉండగలరా? ఉండగలరో లేదో, పక్కనపెడితే, మనస్సుయొక్క పనే ఆలోచనలు చేయటం. అలసిన మనస్సు కాసేపు ఆలోచనలు లేకుండా ఉంటుందేమో కాని, పూర్తిగా ఆలోచనలు లేకుండా ఉండదు, ఉండకూడదు కూడా! మనం జీవితం అద్భుతంగా జీవించాలంటే మనస్సును ఉపయోగించాలి. మనస్సు పని చేసేదే ఆలోచనల ద్వారా.

ఏ జీవికీ ఇవ్వని మనస్సును భగవంతుడు మనిషికి మాత్రమే ఎందుకు ఇచ్చాడు? దాన్ని తాళం వేసి పెట్టటానికా? మనస్సును ఇచ్చింది, దాన్ని సక్రమంగా వాడటానికి. దాన్ని వాడాలంటే మనస్సుకు తెలిసిన ఒకే ఒక మార్గం ఆలోచించటం. అందువల్ల మనస్సును ఆలోచించనివ్వండి. కాకపోతే దాన్ని సరియైన మార్గంలోకి మలచాలి అంతే. అంతేకాని, మనస్సులో ఆలోచనలు ఉన్నా, లేకపోయినా అవి మీ అసలు శాంతిని ఏమీ చేయలేవు. ఎందుకంటే అసలు శాంతి మీ స్వస్వరూపం. అది ఆత్మకు చెందుతుంది.

మనస్సుపరంగా అంటే అహంకారపరంగా ఆలోచిస్తే, మనశ్శాంతి నెమ్మదిగా రావాలి. కాని ఆత్మపరంగా చూస్తే మీరు శాంతస్వరూపులు. మీ మనస్సు కలత చెందుతున్నా మీరు శాంతస్వరూపులే; మీ మనస్సు ప్రశాంతంగా ఉన్నా కూడా మీరు శాంతస్వరూపులే. మీ శాంతి మీ మనస్సుయొక్క పరిస్థితి మీద ఆధారపడదు. ఎందుకంటే మీరు జ్ఞానం పొందితే, మిమ్మల్ని మీరు మనస్సుగా చూసుకోరు, తురీయంగా చూస్తారు.

జ్ఞానం పొందకముందు మనశ్శాంతి గురించి మాట్లాడతారు. దానికి రాకపోకలు ఉన్నాయి; కాని తురీయం విషయం తీసుకుంటే తురీయం శాంతిస్వరూపం. ఆ శాంతికి రాకపోకలు లేవు. అందువల్ల మీ స్వరూపం – ఆదిశాంతః.

**అనుత్పన్నాః** – ఏ జీవాత్మకు కూడా పుట్టుకలేదు.

**సునిర్వృతాః** – సంసారం ఎన్నడూ లేదు. అహంకార దృష్ట్యా, నేను సంసారంనుంచి విముక్తి పొందానని చెప్పగలరే కాని, సాక్షి దృష్ట్యా సంసారమే లేకపోతే, దాన్నుంచి మోక్షం పొందే ప్రసక్తి ఎక్కడ?

**ప్రకృత్యా ఏవ** – మీ స్వరూపమే నిత్యముక్తస్వరూపం. సంసారంనుంచి మోక్షంకోసం ప్రయత్నించనవసరం లేదు. నేను నిత్యముక్త స్వరూపుణ్ణి అని అర్థం చేసుకోవటమే మోక్షం.

**సర్వే ధర్మాస్సమాభిన్నాః** – ఇది అన్ని జీవుల విషయంలోనూ ఒక్కటే. కొందరు అర్థం చేసుకున్నారు, కొందరు అర్థం చేసుకోలేదు. వారు ఆత్మస్వరూపాన్ని అర్థం చేసుకున్నా, చేసుకోకపోయినా వారు తురీయ చైతన్యమే.

సమాః అభిన్నాః – అన్ని జీవులూ నిజానికి ఒకటే. అన్నీ తురీయచైతన్యమే. అహంకారం దృష్ట్యా అవి భిన్నం. లక్ష్యార్థ దృష్ట్యా అన్ని జీవులూ ఒకటే. సమాః అంటే ఒకటే. అన్ని జీవాత్మలూ ఒకటే అంటే, 'అదుగో, మీరు అనేక జీవాత్మలు ఉన్నాయని ఒప్పుకుంటున్నారు,' అనవచ్చు ఎవరైనా.

అందువల్ల గౌడపాదాచార్యులవారు తెలివిగా అభిన్నాః పదం వేశారు. అజ్ఞానికి అర్థమవటానికి అన్ని జీవాత్మలూ ఒకటే అంటున్నాను, కాని జ్ఞాని దృష్టిలో అన్నీ ఒకటే అని దాని అర్థం. శరీరాలు అనేకం, మనస్సులు అనేకం, కాని చైతన్యం ఒక్కటే. అది అఖండం. ఈ జీవాత్మల స్వరూపం ఏమిటి?

**అజం సామ్యం విశారదమ్** – అజం అంటే పుట్టుక లేదు; సామ్యం అంటే సచ్చిదానంద స్వరూపం; విశారదం అంటే నిత్యశుద్ధం. మిమ్మల్ని మీరు అహంకారపరంగా చూసుకుంటే, శుద్ధం అవాలి; సాక్షిగా అర్థం చేసుకుంటే మీరు నిత్యశుద్ధం. మనస్సు నేను నిత్యశుద్ధం అని చెప్పటానికి, మనస్సు శుద్ధం అవాలి. మళ్ళీ చూద్దాం! మీరు మనస్సు ద్వారా మీరు నిత్యశుద్ధం అని అర్థం చేసుకోవటానికి, మీ మనస్సు శుద్ధం అవాలి.

దీన్ని **కంఠచామీకర న్యాయం** అంటారు. చామీకరణం అంటే నగ. కంఠం అంటే మెడ. అంటే మెడలో వేసుకునే నగ. ఒకసారి ఒక వ్యక్తి ఒక సన్న చిన్న గొలుసు మెడలో వేసుకుని వెళ్ళి తన స్నేహితునికి చూపించాడు. అతను బాగుందని మెచ్చుకున్నాడు. ఈ వ్యక్తి ఇంటికి తిరిగి వచ్చేశాడు. కాసేపయ్యాక తన నగ కనబడలేదు. ఖంగారు పడ్డాడు. తన స్నేహితునికి చూపించి, అతని ఇంట్లోనే మర్చిపోయుండాలి అని భావించి, వెంటనే అతని ఇంటికి పరుగులు తీశాడు.

వెళ్ళగానే, అతను ఆదుర్దాగా అడిగాడు, 'నా గొలుసు నీ ఇంట్లో మర్చిపోయానా?' అతను నవ్వి, 'ఒకసారి నీ మెడ దగ్గర చేతిని పెట్టు,' అన్నాడు. అలాగే అతను చేతిని పెట్టిచూస్తే తన స్నేహితుడు చెప్పినట్టుగా, అక్షరాలా అక్కడే, తన మెడమీదే ఉంది. కాని అది చాలా సన్న గొలుసు అవటంతో, అది ఉన్నట్టే అతనికి అజ రాలేదు.

ఇప్పుడు ఈ ప్రశ్నకు జవాబు చెప్పండి! తన గొలుసు పొందటంకోసం ఆ వ్యక్తి తన స్నేహితుని ఇంటికి పరిగెత్తాడు కదా, ఆ పరిగెత్తటం అవసరమా? 'పరిగెత్తటం అవసరమే,' అని మీరు చెప్పలేరు; ఎందుకంటే ఆ గొలుసు అతని మెడలోనే ఉంది. అలాగని 'పరిగెత్తటం అనవసరమ'నీ చెప్పలేరు. ఎందుకు? అతను గనుక తన స్నేహితుని ఇంటికి పరుగులు తీయకపోయి ఉంటే, ఆ గొలుసు కోసం ఇల్లంతా వెతుకుతూనే ఉండి ఉండేవాడు. అందువల్ల మీ జవాబు ఎలా ఉండాలంటే, 'పరిగెత్తటం అవసరం లేదని అర్థం చేసుకోవటానికి పరిగెత్తటం అవసరమే!'

అదే విధంగా సాధన అవసరం లేదని అర్థం చేసుకోవటానికి సాధన అవసరమే. చాలా శ్రమపడి చాలా మలినాలు పోగొట్టుకోవాలి, శుద్ధి చేయటం అవసరం లేదు, మీరు నిత్యశుద్ధ ఆత్మ అని అర్థం చేసుకోవటానికి శుద్ధి చేసుకోవాలి. వేదాంతం అలా విరుద్ధ అంశాలను చెబుతుంది. విశారదం అంటే నిత్యశుద్ధం అన్న మాటకు ఇంత చెప్పాల్సి వచ్చింది.

### కారిక 4.94

**వైశారద్యం తు వై నాస్తి భేదే విచరతాం సదా ।**
**భేదనిమ్నాః పృథగ్వాదాస్తస్మాత్తే కృపణాస్స్మృతాః ॥**

నేను సాక్షిని, నేను తురీయాన్ని, నేను అద్వైతతురీయాన్ని – రెండవది లేని అద్వైతాన్ని అనే ఈ జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది. కాని జ్ఞానం పొందాక కూడా ద్వైతప్రపంచంలో వ్యవహారం నడపాలి. ఎప్పుడైతే ద్వైతం వస్తుందో, అప్పుడే మనస్సుకు సమస్య తప్పదు.

మనస్సుకు వచ్చే మొట్టమొదటి సమస్య, ఒంటరితనం. నాకెవరూ లేరు, నన్నెవరూ పట్టించుకోరు అనే ఏకాకి భావన తొలిచేస్తుంది మనస్సును. అందువలననే నావారు అంటూ నలుగురుని పోగేసుకోవటానికి ప్రయత్నిస్తారు.

నిజానికి ఈ సమస్య బాల్యంనుంచే మొదలవుతుంది. ఇంట్లో రెండవ పిల్లవాడు పుడితే, మొదటి పిల్లవాణ్ణి ఈ ఒంటరితనం బాధిస్తుంది. మొదటి పిల్లవానికి బుద్ధి అంతగా వికసించకపోయినా, ఇంకా చాలా చిన్నవాడే అయినా, ఇంటికి అందరూ రావటం, చంటి పాపాయినే ఎత్తుకుని ముద్దులాడటం, ఆ పాపాయికే కానుకలు తీసుకురావటం, తనను

పన్నెత్తి పలకరించకపోవటం, అన్నింటినీ మించి కన్నతల్లి కూడా ఎంతసేపూ చంటి పాపాయినే లాలించటం, ఇవన్నీ అతని చిన్నిమెదడును తొలిచివేస్తాయి. ఈ ఈర్ష్య అతనికి తెలియకుండానే, తన స్వంత తమ్ముని మీదే ద్వేషంగా మారుతుంది. కొంతమందిలో అయితే ఈ మానసిక ఘర్షణ తీవ్రరూపం దాల్చి, జీవితాంతం కొనసాగుతుంది.

దీనికి భిన్నంగా జ్ఞానం పొంది, జ్ఞాననిష్ఠలో నిలబడితే, ఎవరైనా మనస్సు విప్పి మాట్లాడేవారు లేకపోయినా; నోరారా పలకరించేవారు లేకపోయినా బాధ అనిపించదు. కాని ద్వైతభావనలో ఉన్నన్నాళ్ళూ పరిమితి, ఒంటరితనం, ఈర్ష్య, ద్వేషం, కోపం తప్పవు. మనస్సు ఎన్నడూ ప్రశాంతంగా, నిశ్చింతగా ఉండదు. ఎప్పుడూ అల్లకల్లోలంగానే ఉంటుంది. అటువంటి వారిని గౌడపాదాచార్యులవారు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

**సదా భేదే విచరతామ్** – భేదే అంటే భేదాలు ఉన్న, పరిమితులు ఉన్న ప్రపంచంలో; విచరతామ్ అంటే తిరుగుతున్న; సదా అంటే ఎప్పుడూ. అంటే ద్వైతప్రపంచంలో తిరుగుతున్నన్నాళ్ళూ ఈ భేదభావనలు తొలిచేస్తూనే ఉంటాయి. పోటీ మనస్తత్త్వం ఉంటూనే ఉంటుంది. ఎంత పెద్ద ఇల్లున్నా పొరుగువానిది తనకన్నా పెద్ద ఇల్లు అనే ఈర్ష్య ఉంటూనే ఉంటుంది.

**(తేషాం) వైశారద్యం తు వై నాస్తి** – అటువంటి వారికి మనస్సు ఎన్నడూ శుద్ధంగా, ప్రశాంతంగా ఉండదు. నిరంతర పోరాటం సాగుతుంది మనస్సులో. వారు ఇప్పుడున్న దశ వారికి నచ్చదు. ఇంకా ఏదో పొందాలనే తపన ఉంటుంది. దీన్నే సంసారం అంటారు.

**భేదనిమ్నాః పృథగ్వాదాః** – ద్వైతదర్శనం చేసే సిద్ధాంతులకు కూడా ఈ భేదభావన పోదు. అజ్ఞానీ జీవులు సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నారంటే అర్థం ఉంది. కాని ఇంత గొప్ప దార్శనికులు కూడా ద్వైతభావనలోనే మునిగి తేలుతుంటారు. సాంఖ్య దర్శనం చాలా గొప్ప దర్శనం. కాని వారి సిద్ధాంతం ప్రకారం ఆత్మలు అనేకం ఉన్నాయి. ఆత్మ బహుత్వాన్ని నమ్ముతారు వారు.

సాంఖ్య దర్శనమే కాదు, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వమీమాంస దర్శనాలన్నీ కూడా ద్వైతభావనలోనే నెలకొని ఉన్నాయి. ఈ ఐదు దర్శనాలు చాలా లోతుగా శాస్త్రాన్ని అధ్యయనం చేసి కూడా నేను నేనే; నువ్వు నువ్వే; నేను నువ్వు కాదు, నువ్వు నేను కాదు అంటారు. నేను నేనే, నువ్వు నువ్వే అని చెప్పటానికి ఇన్ని సంవత్సరాలు శాస్త్రాన్ని అధ్యయనం చేయాలా? మనకి ముందే తెలియదూ ఈ విషయం?

ఈ విధంగా అజ్ఞానికి శాస్త్రం గురించి తెలియదు కాబట్టి సంసారంలో పడిపోతే, తక్కిన దార్శనికులు, ఆస్తికులై ఉండి, శాస్త్రం లోతులు కొలిచి కూడా, సంసారంలోనే కూరుకుపోయి ఉన్నారు. అజ్ఞానికీ, దార్శనికులకీ మధ్య భేదం ఏముంది?

భేదనిమ్నాః అంటే ఈ ద్వైత దార్శనికులు భేదాలమీదే దృష్టి పెడతారు.

**తస్మాత్** – అందువల్ల,

**తే కృపణాః స్మృతాః** – ఈ ద్వైతవాదులందరూ కృపణులు అనేస్తున్నారు గౌడపాదాచార్యుల వారు. అంత లోతుగా శాస్త్రఅధ్యయనం చేసికూడా, అద్వైతానికి రాలేదంటే వారు దీనులు అంటున్నారు.

దయానందస్వామీజీ ఈ ఉదాహరణను ఇస్తారు. పల్లెటూర్లలో గుమ్మాలు ఎత్తు తక్కువలో ఉంటాయి. అలా ఎత్తు తక్కువగా ఉందని ఒక ఇంటి యజమాని ముందే ఇద్దరికి చెప్పాడు. ఒకతను దూరంనుంచే తల వంచి నడుస్తూ వచ్చి, తీరా దగ్గరికి వచ్చేసరికి తల ఎత్తాడు. తలబొప్పి కట్టింది. ఇంకొకతను పట్టించుకోకుండా తల ఎత్తి వెళ్ళాడు. అతనికీ తల బొప్పి కట్టింది. చివరికి ఇద్దరి పరిస్థితీ ఒకటే అయింది. తక్కిన దార్శనికులు ఈ అతిజాగ్రత్త పడ్డ వ్యక్తిలోకి వస్తారు. అతనికెలాగైతే అతిజాగ్రత్త పడ్డాకూడా బొప్పి తప్పలేదో, వీరికి కూడా లోతుగా నేర్చుకున్నా కూడా ద్వైతభావనవల్ల సంసారం తప్పలేదు.

**కారిక 4.95**

**అజే సామ్యే తు యే కేచిద్భవిష్యంతి సునిశ్చితాః ।**
**తే హి లోకే మహాజ్ఞానాస్తచ్చ లోకో న గాహతే ॥**

కాని, వీరికి భిన్నంగా కొంతమంది, అరుదుగా, అదృష్టవంతులు ఉంటారు. వారి అదృష్టం కొద్దీ మనుష్యజన్మను ఎత్తారు, మంచి సంస్కారవంతుల ఇంటిలో పుట్టారు. బోధ నేర్చుకునే అవకాశం ఉంది, నేర్చుకోవాలనే తపన కూడా ఉంది. అందువల్ల ఆత్మజ్ఞానాన్ని పొందారు, అర్థం చేసుకున్నారు, జీర్ణించుకున్నారు. అన్ని దశలూ దాటారు. జ్ఞానానికి వచ్చి, జ్ఞానం పొంది, జ్ఞాననిష్ఠలో నిలబడ్డారు. వీరు అరుదైనవారిలో అరుదు. అటువంటి వారిని వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు ఇందులో.

**యే కేచిత్** – కొంతమంది, అరుదైనవారిలో అరుదైనవారు;

**భవిష్యంతి సునిశ్చితాః** – వారికి నిశ్చయజ్ఞానం, నిస్సంశయజ్ఞానం కలుగుతుంది. వారు శ్రద్ధగా వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసివచ్చారు.

**వేదాంత విజ్ఞాన సునిశ్చితాః సన్న్యాసయోగాత్ యతః శుద్ధ సత్త్వాః**

వారు అద్వైతంలో నెలకొనివున్నారు.

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

మాండూక్యసారం బాగా జీర్ణించుకున్నారు.

**అజే సామ్యే** – అజం అంటే పుట్టుక లేనిది. సామ్యం అంటే అన్నింటిలోనూ సమానంగా ఉన్నది. విశ్వ స్థూలశరీర ప్రతిబింబ చైతన్యం; తైజస సూక్ష్మశరీర ప్రతిబింబచైతన్యం; ప్రాజ్ఞ కారణశరీర ప్రతిబింబచైతన్యం. తురీయం బింబచైతన్యం. ప్రతిబింబశరీరాలు మారతాయి కాని తురీయం శరీరత్రయవిలక్షణం. అందువల్ల సామ్యం.

ఇక్కడ ఒక విషయం మర్చిపోకూడదు. జ్ఞానికి తను తురీయం అనీ, అజం సామ్యం అనీ, తెలిసినా, ద్వైతప్రపంచ అనుభవం కొనసాగుతుంది. ద్వైతప్రపంచం అలాగే ఉంటుంది కాకపోతే అంతకుముందు ఏ ద్వైతప్రపంచాన్నైతే సత్యం అని పొరపాటు పడ్డాడో, ఇప్పుడదే ద్వైతప్రపంచం మిథ్య అనే జ్ఞానంలో నెలకొనివున్నాడు. అందువల్ల దృక్పథం మారుతుంది కాని, అనుభవం మారదు. సూర్యోదయం ఉదాహరణ మర్చిపోకూడదు. సూర్యుడు ఉదయించడు అని తెలిసినా ఆ అనుభవాన్ని ఎలా కాదనమో అలాగే ద్వైతం మిథ్య అని తెలిసినా ద్వైత అనుభవాన్ని కాదనడు.

**తే హి లోకే మహాజ్ఞానాః** – వారు లోకంలో గొప్ప జ్ఞానులు. ఎందుకంటే తక్కినవారు అపరావిద్యను మాత్రమే నేర్చుకుంటే వీరు పరావిద్యను నేర్చుకున్నారు. కాని వచ్చిన చిక్కేమిటంటే జ్ఞాని మహాజ్ఞాని అని సామాన్యమానవులకు తెలియదు. ఐన్‌స్టీన్ మహామేధావి అని మెచ్చుకోవాలంటే, తక్కిన మేధావులే మెచ్చుకోవాలి. అలాగే ఒక మహాజ్ఞానిని మెచ్చుకోవాలంటే, మెచ్చుకునే వారు కూడా మహామేధావులై ఉండాలి.

ఎవరో అద్భుతంగా సెలవిచ్చారు. 'సమయపాలన చేయటంవల్ల గొప్ప నష్టం, మీ సమయపాలనను మెచ్చుకునేందుకు ఎవరూ ఉండరు.' అలాగే మహాజ్ఞానిని మహాజ్ఞాని అని మెచ్చుకునేవారు ఉండరు. కాని జ్ఞానం గొప్పదనం ఏమిటంటే, అటువంటి జ్ఞానం పొందిన జ్ఞాని, ఇతరుల మెప్పుకోసం తాపత్రయపడదు. నిజానికి, అలా మెప్పు కోరితే, అతను మళ్ళీ మహా సంసారంలో కూరుకుపోయినట్టే.

జీవితంలో మనిషి కోరుకునేవి రెండే – ఏదో విజయం సాధించాలనీ, ఆ విజయాన్ని నలుగురూ వేన్నోళ్ళ కీర్తించాలనీ ఉంటుంది. కాని అద్వైతజ్ఞానం ఎంత అద్భుతమైనదంటే, దీని ద్వారా మీరు మోక్షం పొందటమే కాదు, మీ మోక్షాన్ని నలుగురూ మెచ్చుకోవాలనే కోరిక నుంచి కూడా మోక్షం పొందుతారు. అందులోనూ మీరు సమాజం దృష్టిలో అంతకు ముందు మామూలు మనిషి అయితే, అసలే మీ గురించి ఎవరూ పట్టించుకోరు. కాని మీరూ దాన్ని అసలే పట్టించుకోరు. ఆ భావనే ఈ పాదంలో వస్తున్నది.

**తచ్చ లోకో న గాహతే** – లోకః అంటే సామాన్య మానవుడు. జ్ఞానికి ఎంత లోతైన జ్ఞానం ఉందో సామాన్య మానవునికి తెలియదు.

**కారిక 4.96**

**అజేష్వజమసంక్రాంతం ధర్మేషు జ్ఞానమిష్యతే ।**
**యతో న క్రమతే జ్ఞానమసంగం తేన కీర్తితమ్ ॥**

ఇక్కడ, గౌడపాదాచార్యులవారు ఒక సాంకేతిక విషయాన్ని వివరిస్తున్నారు. నేను సాక్షి చైతన్యాన్ని అని మీరు అన్నాకూడా, అందులో కూడా ద్వైతాన్ని చూడవచ్చు కొందరు. మీరు సాక్షిగా చూస్తున్నాను అంటే దేన్ని చూస్తున్నారు? ఈ జగత్తును, మీ శరీరాన్ని, మీ మనస్సును. మీచేత చూడబడుతున్న వీటిని సాక్ష్యం అంటారు. సాక్ష్యం పదం అంతగా వాడుకలో లేదు. అందువల్ల ఈ పదాన్ని జాగ్రత్తగా గుర్తుపెట్టుకోండి. చూసే మీరు సాక్షి, చూడబడే వస్తువు సాక్ష్యం.

సాక్షి-సాక్ష్యం రెండు పదాలు ఉన్నాయి. సాక్షి సబ్జెక్టు, సాక్ష్యం ఆబ్జెక్టు. అంటే ద్వైతం ఉన్నట్టు అవుతుంది. అందువల్ల గౌడపాదాచార్యులవారు సాక్షి పదం కూడా ఆపేక్షిక పదం మాత్రమే అంటున్నారు. అది తాత్కాలికంగా ఇవ్వబడ్డ హోదా మాత్రమే. కాని ఎప్పుడైతే సాక్ష్యాన్ని మిథ్యగా కొట్టివేస్తామో, అప్పుడే సాక్షి హోదా కూడా ఉండదు. కుండను మిథ్యగా కొట్టివేస్తే, కుండను కార్యం అనలేము. కుండ కార్యం కాకపోతే, మట్టికి కారణత్వ హోదా ఉండదు. కారణం ఉండదు అనకూడదు. మట్టి ఉంటుంది కాని కారణత్వ హోదా ఉండదు.

అదే విధంగా, జగత్తును సాక్ష్యం అన్నాము. కాని దాన్ని మిథ్యగా కొట్టివేశాము. సాక్ష్యాన్ని చూసే చైతన్యాన్ని సాక్షిచైతన్యం అన్నాము. సాక్ష్యమే లేకపోతే సాక్షి హోదా ఉండదు. చైతన్యం ఉంటుంది అంటే సాక్షి హోదా కూడా చైతన్యం స్వరూపం కాదు. అందువల్ల సాక్షికి-సాక్ష్యానికి మధ్య అనుబంధం లేదు. ఎందుకు లేదు? దీనికి కారణం కూడా ముందే చూశాము.

రెండు వస్తువుల మధ్య అనుబంధం ఉండాలంటే, రెండూ ఒకే స్థాయికి చెందినవై ఉండాలి. జాగ్రదావస్థలోని ఇద్దరు వ్యక్తులు పెళ్ళి చేసుకోగలరు లేదా స్వప్నావస్థలో ఇద్దరు వ్యక్తులు పెళ్ళి చేసుకోగలరు. అంతేకాని, జాగ్రదావస్థలోని అబ్బాయి, స్వప్నావస్థలో తను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకోలేడు. దీనికి సూత్రం -

**సమాన సత్తా తయోః సంబంధః**

రెండు చైతన్యపదార్థాల మధ్య సంబంధం ఉండాలంటే రెండూ ఒకే స్థాయికి చెందినవై ఉండాలి. కాని నిజమేమిటంటే, చైతన్యం పారమార్థిక సత్యమైతే, పదార్థం వ్యావహారిక సత్యానికి చెందినది. అందువల్ల వాటి మధ్య సంబంధం కుదరదు. ఒకవేళ సంబంధం

గురించి మాట్లాడితే అది నిజం సంబంధం కాదు. కలలో పొందిన డబ్బుతో ఇలలో ధనవంతునిగా చెలామణీ అవలేదు. అది కలవరకు మాత్రమే పరిమితం. అలాగే, చైతన్యం, జగత్తును సాక్షిగా చూస్తుందని పారమార్థికస్థాయినుంచి చెప్పలేము – పారమార్థిక సత్యం దృష్ట్యా చైతన్యం సత్యం, జగత్తు మిథ్య.

**అజేషు ధర్మేషు అజం జ్ఞానమ్ అసంక్రాంతమ్** – అజం జ్ఞానం అంటే పుట్టుకలేని చైతన్యం; ధర్మేషు అంటే బాహ్యవస్తువులకు; అసంక్రాంతం అంటే సంబంధం లేదు. శాశ్వతమైన చైతన్యానికి, బాహ్యవస్తువులతో చేరే సంబంధం లేదు. ఎందుకంటే, రెండవ వస్తువు లేనేలేదు. పారమార్థిక దృష్ట్యా, రెండవ వస్తువు మిథ్య.

**యతః జ్ఞానం న క్రమతే** – చైతన్యం పదార్థాన్ని పట్టుకోదు. ఎందుకంటే చైతన్యానికి భిన్నంగా పదార్థం లేదు. మట్టి, కుండను పట్టుకోలేదు. ఎందుకంటే మట్టికి భిన్నంగా కుండ లేదు; నీరు అలను పట్టుకోలేదు. ఎందుకంటే నీటికి భిన్నంగా అల లేదు; సత్యం మిథ్యను పట్టుకోలేదు. ఎందుకంటే సత్యానికి భిన్నంగా మిథ్యకు ఉనికి లేదు. ఆ విధంగా చైతన్యం దేన్నీ పట్టుకోలేదు. ఎందుకంటే చైతన్యానికి భిన్నంగా ఇంకొక వస్తువు లేదు.

**అసంగం తేన కీర్తితమ్** – అందువల్ల తురీయం అయిన నేను అసంగ చైతన్యాన్ని. దేన్నైనా చూస్తే నేను సాక్షినవుతాను, చూడబడేది సాక్ష్యం అవుతుంది. కాని అద్వైతంలో ఉన్నదొకటే కాబట్టి సాక్షి–సాక్ష్యం భేదం కాని సంబంధం కాని లేదు. అందువల్ల నేను అసంగసాక్షిని, సంబంధరహిత చైతన్యాన్ని. అందువల్లనే అస్పర్శయోగం అన్నారు గౌడపాదాచార్యులవారు ముందే. అద్వైతం స్థాయికి ఎదిగాక, ఏ పదం కూడా వాడలేము.

### కారిక 4.97

**అణుమాత్రేఽపి వైధర్మ్యే జాయమానేఽవిపశ్చితః ।**
**అసంగతా సదా నాస్తి కిముతావరణచ్యుతిః ॥**

మాండూక్య కారికలను అర్థం చేసుకుంటే నేను అద్వయ తురీయచైతన్యాన్ని అనే జ్ఞానాన్ని జీర్ణించుకుంటారు. అద్వైతంలో నిలబడినన్నాళ్ళూ, మీరు ముక్తపురుషులు. ఏమాత్రం రెండవ వస్తువు ఉనికిని ఒప్పుకున్నా, ద్వైతం వస్తుంది, కాలం, దేశం వస్తాయి, అశాశ్వతత్వం వస్తుంది, అభద్రత వస్తుంది, భయం వస్తుంది, సంసారం వస్తుంది. ద్వైతం ఎంతలా భయపెడుతుందో చూశారా?

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

బృహదారణ్యకంలో రెండవది చూస్తే భయం కలుగుతుందని వస్తుంది. భయం వస్తే సంసారం అవుతుంది. రెండవది చూస్తే తప్పులేదు, కాని ఆ రెండవదాన్ని సత్యంగా భ్రమపడితే, అప్పుడే పరిమితి ఏర్పడుతుంది. మిథ్యా రెండవ వస్తువు ఏ సమస్యనూ సృష్టించలేదు.

అద్దంలో తన ప్రతిబింబం చూసి, ఇంకో పక్షి ఉందనుకుని, అద్దాన్ని ముక్కుతో పొడుస్తుంది పక్షి. అలాగే కుక్క కూడా. కుక్కలు, అవిఉన్న ప్రదేశంలో, ఇంకొక కుక్కని రానీయవు. అందువల్ల ఒకవేళ, ఒక కుక్క అద్దం ముందు నిలబడిందనుకోండి. ఇంకొక కుక్క ఉందనుకుని, దానిమీద అరుస్తుంది. అది ప్రతిబింబం కాబట్టి దాన్నుంచి కూడా అరుపు వినిపిస్తుంది. ఇంకా ఎక్కువ అరుస్తుంది అసలు కుక్క.

అదే విధంగా జగత్తును మిథ్యగా కొట్టివేస్తే, అది అద్దంలో ప్రతిబింబంలా మిమ్మల్ని ఏమీ చేయలేదు, కాని దాన్ని సత్యంగా భావిస్తేనే వస్తుంది సమస్య. దాన్ని సత్యం అనుకునేసరికి ముందు భయం వేస్తుంది. అంతేకాదు, దాన్ని వెన్నంటే రాగద్వేషాలు వస్తాయి. ఒక వస్తువుమీద బంధం అన్నా పెంచుకుంటారు లేదా ద్వేషం అన్నా పెంచుకుంటారు. ఎప్పుడైతే రాగద్వేషాలు వస్తాయో, అప్పుడే సంసారం వస్తుంది.

**అణుమాత్రేఽపి వైధర్మ్యే జాయమానే** – అణుమాత్రేపి – అణుమాత్రం అంత భేదం ఉన్నా చాలు, అది బాధిస్తుంది. మీరు వేసుకున్న దోమతెరలో ఒక్క దోమ దూరితే చాలు. మీరు కిందా, మీదా పడిపోతారు.

దయానందస్వామీజీ అంటారు, ప్రపంచంలో అన్నింటికన్నా శక్తివంతమైనది దోమ. ఎందుకంటే మనిషి అన్ని జంతువులనీ బోనులోనో, పంజరంలోనో పెట్టగలడు కానీ. దోమ మాత్రం మనిషిని దోమతెర అనే పంజరంలో పెడుతుంది. అందువల్ల ఒక చిన్నది, మీకు భిన్నంగా ఉంటే చాలు.

వైధర్మ్యే – మీకు భిన్నంగా ఉన్న వస్తువు. అనాత్మ వస్తువు. అది మీ ముందుకు వస్తే, **అవిపశ్చితః** – అవివేకి దాన్ని సత్యంగా భావిస్తాడు. అవిపశ్చితః అంటే అవివేకి, నిత్యానిత్యవస్తువివేకం లేనివ్యక్తి, సంసారి, అజ్ఞాని, మోహంలో పడ్డ వ్యక్తి.

**అసంగతా సదా నాస్తి** – అటువంటి అవివేకికి అసంగత్వం ఎన్నడూ ఉండదు. అతను వస్తువులమీద రాగమనే అనుబంధమో, ద్వేషమనే అనుబంధమో పెంచుకుంటాడు. అంటే సంగత్వం ఏర్పరచుకుంటాడు.

మనస్సుకు అసలు దేన్ని చూస్తే దానికి బంకలా అతుక్కుపోయే లక్షణం ఉంటుంది. ఒక ప్రసంగానికి వరుసగా మూడురోజులు వెళితే, అక్కడ కూడా మీరు కూర్చున్న కుర్చీమీద సంగత్వం ఏర్పడుతుంది. నాలుగవరోజు ఎవరైనా పొరపాటున మీ కుర్చీలో కూర్చుంటే వారి పని అయిపోయింది. వారిని అల్లించో, బెల్లించో అక్కడ్నుంచి లేపుతారు. అందువల్ల దేనితోనైనా సంబంధం పెంచుకుంటే చాలు, అసంగత్వం ఎన్నడూ ఏర్పడదు. అంటే సంగత్వం రాజ్యమేలుతుంది.

మీకు ఎవరిమీదైనా కోపం వస్తే, తప్పు ఆ వ్యక్తిది కాదు. మీరు పెంచుకున్న సంగత్వానిది. సంగం వస్తే ద్వైతం వస్తుంది; ద్వైతం వస్తే, మీ తురీయ హోదాను మర్చిపోతారు. విశ్వతో మమేకం చెందేసరికి ఒకదాని వెనుక ఒకటి బాధ్యతలు ముంచుకువస్తాయి. ఒక వస్తువును కొంటే దాని భద్రత గురించి ఆలోచించాల్సి వస్తుంది. అసలు ఆ మాటకొస్తే, ఆ వస్తువును కొంటున్నప్పుడే, దీన్ని అమ్మితే ఎంత ధర వస్తుంది అనే బేరీజు వేస్తారు. ఆ విధంగా సంగత్వం వెన్నంటే బాధ్యతలు వస్తాయి. బాధ్యతలు అంటే బెంగ, ఆందోళన వస్తాయి. బాహ్యముఖంగా పరుగులు తీయటమే సరిపోతుంది. బాహ్యముఖంగా పరుగులు తీస్తున్నారంటే, ఇంక వేదాంతం నేర్చుకోవటానికి తీరికే ఉండదు.

**కిముతావరణచ్యుతిః** – మీరిలా బాహ్యంగా పరుగులు తీస్తుంటే, మీరు జ్ఞానం పొందేది ఎప్పుడు; అజ్ఞానాన్ని పారద్రోలేది ఎప్పుడు అని రెట్టిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. బాధ్యతలు తీరాక, వేదాంతం నేర్చుకోవాలనుకోవటం అలలు ఆగాక సముద్రస్నానం చేద్దామనుకున్నట్టే ఉంటుంది. ఆవరణచ్యుతిః అంటే అజ్ఞాన నాశనం. ఆవరణం అంటే కప్పటం. అజ్ఞానం మిమ్మల్ని కప్పివేసింది; చ్యుతిః అంటే నాశనం. కిముత అంటే ఎలా జరుగుతుంది? మొత్తం చూస్తే ఇలా బాహ్యంగా పరుగులు తీస్తుంటే మిమ్మల్ని కప్పిన అజ్ఞానాన్ని ఎప్పుడు నాశనం చేస్తారు?

**కారిక 4.98**

**అలబ్ధావరణాస్సర్వే ధర్మాః ప్రకృతినిర్మలాః ।**
**ఆదౌ బుద్ధాస్తథా ముక్తా బుధ్యంత ఇతి నాయకాః ॥**

ముందు కారికలో చెప్పిన విషయాన్నిబట్టి ఒక సందేహం రావచ్చు మీకు. దాన్ని ఇందులో తీరుస్తున్నారు గౌడపాదాచార్యులవారు. ముందు కారికలో ఏమన్నారు? తురీయాన్ని అజ్ఞానం కప్పింది అన్నారు. మీరు తురీయం అనే జ్ఞానం పొందకుండా ఈ ద్వైతప్రపంచం సత్యమనే అజ్ఞానం మిమ్మల్ని కప్పింది అన్నారు. ఆవరణాన్ని అజ్ఞానం లేదా మాయ అని కూడా అంటారు.

ఇప్పుడు సందేహం ఏమిటంటే, మీరు కూడా రెండు పదాలు వాడుతున్నారు. అంటే మీరు కూడా ద్వైతాన్ని ఒప్పుకున్నట్టే కదా అనవచ్చు మీరు. ఏమిటా రెండు పదాలు? తురీయం, మాయ. అనాది తురీయం, అనాది మాయ.

ఆ సందేహాన్ని ఊహించి, గౌడపాదాచార్యులవారు ముందే సమాధానాన్ని ఇస్తున్నారు.

**జవాబు** – నిజమే, అనాది అజ్ఞానం ఉంది అని మేమూ అంటాము కాని ఆ అనాది అజ్ఞానం లేదా మాయ తురీయంలా సత్యం కాదు. రెండూ ఒకేస్థాయికి చెందినవి కావు.

ఒకవేళ రెండూ ఒకే స్థాయికి చెందితే, అప్పుడు ద్వైతం వస్తుంది. అంతేకాదు, అప్పుడొక సమస్య కూడా వస్తుంది. ఏమిటది?

రెండూ ఒకేస్థాయికి చెందితే, వాటిలో అజ్ఞానాన్ని నాశనం చేస్తే, అజ్ఞానంతో పాటు తురీయం కూడా నాశనం అవుతుంది. ఎందుకంటే సత్య అజ్ఞానానికి నాశనమయ్యే లక్షణం ఉంటే, సత్యతురీయానికి కూడా నాశనమయ్యే లక్షణం ఉంటుంది. లేదు, సత్యతురీయం నాశనమవదు అని మీరంటే, ఈ సూత్రం ప్రకారం సత్యఅజ్ఞానం కూడా నాశనమవటానికి వీలులేదు.

అందువల్ల తురీయానికీ, అజ్ఞానానికీ మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకోవాలి మీరు. అజ్ఞానం కూడా అనాది అయినా, దానికొక అంతం ఉంది. అంటే అజ్ఞానాన్ని నాశనం చేయగలము. కాని తురీయానికి ఆదిలేదు, అంతం లేదు. అందువల్ల రెండూ ఒకస్థాయికి చెందవు. అజ్ఞానం మిథ్య, తురీయం సత్యం అవుతాయి. తురీయం పారమార్థిక సత్యం అయితే, అజ్ఞానం వ్యావహారిక సత్యం. వ్యావహారిక సత్యానికి ఇంకోపేరు మిథ్య. మిథ్యావస్తువు ఉన్నా లేనట్టే అర్థం. అందువల్ల అజ్ఞానానికి తురీయంతో సమానహోదా ఇవ్వకూడదు.

ఇప్పుడు కారిక చూద్దాము.

**సర్వే ధర్మాః** – అన్ని ఆత్మలు కూడా,

**అలబ్ధావరణాః** – పారమార్థిక దృష్ట్యా చూస్తే, అజ్ఞానమనే ఆవరణలేనివి. మనం చెప్పుకునే అజ్ఞానం వ్యావహారిక సత్యానికి చెందినది, మిథ్య. అది తక్కువ స్థాయికి చెందినది. అందువల్ల అది ఉన్నా లేనట్టే అర్థం. అలబ్ధ ఆవరణం అంటే అజ్ఞానం లేదా మాయ లేనిది.

**ప్రకృతినిర్మలాః** – అందువల్ల మాయ అనే మలము లేనిది. తురీయాన్ని మాయ అనే మలం కూడా అశుద్ధం చేయలేదు.

**ఆదౌ బుద్ధాః** – అందువల్ల తురీయదృష్ట్యా, ప్రతి ఒక్క జీవాత్మ కూడా ఎప్పుడూ స్వయం ప్రకాశరూపమే. దాన్ని ఏమీ కప్పలేదు. కప్పినట్టుగా ఉంది. అందువల్ల తొలగించటం కూడా తొలగించినట్టుగా ఉంది అంటాము. ఆదౌ బుద్ధాః అంటే ప్రారంభంనుంచే ప్రతి ఒక్క జీవాత్మ కూడా అజ్ఞానం లేనిది.

**తథా ముక్తాః** – అందువల్ల పారమార్థిక దృష్ట్యా, ప్రతి ఆత్మ కూడా ముందునుంచి నిత్యముక్తమే. కాయిన్‌గేమ్‌లో కాయిన్ ఉందని ఆ పిల్లవాడు పొరపాటు పడినట్టే, సంసారం ఆటలో అక్కడ లేనేలేని సంసారాన్ని పారద్రోలటానికి మనం చాలా కృషి చేస్తాము. మరయితే మోక్షం, జ్ఞానం పదాల అర్థమేమిటి అంటే అవి లక్ష్యార్థాలు. నిజంగా చూస్తే ఈ పదాలు వర్తించవు.

ఆత్మ అజ్ఞానంలో ఉంది, ఇప్పుడు పోయింది అనేది లక్ష్యార్థం. అలాగే అంతకుముందు సంసారంలో ఉంది, ఇప్పుడు మోక్షం పొందింది అనేది లక్ష్యార్థం. ఈ పదాలన్నీ– అజ్ఞానం, జ్ఞానం, బంధం, మోక్షం – వ్యావహారిక స్థాయిలోనే వాడగలము.

**ఇతి నాయకాః** – జ్ఞానులు. జ్ఞానులు లక్ష్యార్థంగా ఇలా అంటారు.

**బుధ్యంతే** – సాధకుడు జ్ఞానం పొంది, మోక్షం పొందుతాడు. ఈ వాక్యాలన్నీ ఇన్‌వర్టెడ్ కామాల్లో ఉండాలి. రజ్జు–సర్ప భ్రాంతిలో జ్ఞానం పొందగానే పాము పోయింది అంటాము. పాము ఎక్కడికి పోయింది? మంచం కిందికి పోయిందా, బయటకు వెళ్ళిపోయిందా? అసలు నిజంగా ఉంటేకదా, ఎక్కడికన్నా పోవటానికి? అందువల్ల జ్ఞానులు లక్ష్యార్థం వచ్చేలాగా 'జ్ఞానం పొందితే, మోక్షం పొందుతారు,' అంటారు.

**కారిక 4.99**

**క్రమతే న హి బుద్ధస్య జ్ఞానం ధర్మేషు తాయినః ।**
**సర్వే ధర్మాస్తథా జ్ఞానం నైతద్బుద్ధేన భాషితమ్ ॥**

కాయిన్‌గేమ్ లాగానే, పిల్లలు ఇంతో తమాషా అయిన ఆట ఆడతారు. ఆ ఆటలో, ఒక పెద్దగదిలో ఒక పిల్లవాడిని ఒక చివర నిలబెడతారు. ఆ గది ఖాళీగా, బాగా పెద్దదిగా ఉండాలి. ఆ ఖాళీ గదిలో అక్కడక్కడా, దూరదూరంగా తలగడలు పెడతారు తక్కిన పిల్లలు. ఈ పిల్లవాడు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో, మనస్సులో చిత్రీకరించుకోవాలి. అలా అతను చిత్రీకరించుకున్నాక, అతని కళ్ళకు గంతలు కడతారు. ఇప్పుడు ఆట ఏమిటంటే, అతను కళ్ళకు కట్టిన ఆ గంతలతో, నేలమీద ఉన్న తలగడలను తాకకుండా, తొక్కకుండా, గది ఈ చివరినుంచి ఆ చివరకి వెళ్ళాలి.

పాపం అతను అతి జాగ్రత్తగా, అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూ వస్తాడు. అతను నడుస్తున్నకొద్దీ తక్కిన పిల్లల నవ్వులు, కేరింతలు ఎక్కువవుతూ ఉంటాయి. వారు నవ్వినప్పుడల్లా, తను తలగడని తొక్కబోతున్నాననుకుని, అతను అడుగు ఇంకొక వైపుకి వేస్తాడు. అలా జాగ్రత్తలు పడీపడీ, ఎలాగైతేనే ఆ చివరికి చేరి, అవతలిగోడ ముట్టుకుంటాడు. అతను విజయగర్వంతో, 'నేను జాగ్రత్తగా, ఒక్క తలగడను కూడా తొక్కకుండా వచ్చాను, చూశారా?' అంటాడు.

ఆ పిల్లలంతా ఘొల్లున నవ్వి, అతని కళ్ళకు కట్టిన గంతలను విప్పి, వెనక్కి తిరిగి, తను నడిచివచ్చిన గదికేసి చూడమంటారు! ఆశ్చర్యం! అక్కడ నేలమీద ఒక్క తలగడ కూడా లేదు! అతను నడవటం మొదలెట్టగానే, తక్కినవారు వాటన్నిటినీ తీసేశారు. అంటే ఇంతసేపూ అతను అక్కడ లేనేలేని తలగడలను దాటటానికి ప్రయత్నించాడన్నమాట. ఎంత దారుణం! పిల్లలు నవ్వులు, కేరింతలు కొట్టింది తన వెర్రితనాన్ని చూసి అన్నమాట.

చూడండి, పరిస్థితి ఎలా తారుమారయిందో! తనేదో అన్ని అడ్డంకులను దిగ్విజయంగా దాటుకుని ముందుకు వచ్చాననుకుంటే, అది తన విజయాన్ని కాదు, తన వెర్రితనాన్ని నిరూపించింది. అది విజయమెలా అవుతుంది?

మనం పొందామనుకున్న మోక్షమూ ఇటువంటిదే! ఎన్నో జన్మల సాధన తరువాత, జ్ఞానయోగ్యత పొంది, శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా జ్ఞానం పొంది, సంసారంనుంచి మోక్షం పొందాము అనుకుంటే, శాస్త్రం అక్కడ లేనేలేని సంసారంనుంచి ఎలా మోక్షం పొందుతావు అంటుంది. ఆ పిల్లవాడు విజయం సాధించాక ఎలాగైతే అక్కడ తలగడలు లేవని తెలుసుకుంటాడో, అలాగే జ్ఞానం పొందాక, జ్ఞాని అసలు సంసారం లేదని తెలుసుకుంటాడు. మోక్షం అంటే, మోక్షంకోసం సంసారబంధంనుంచి విముక్తి పొందటానికి సాధన చేయనవసరం లేదు; నువ్వు నిత్యముక్తుడివి అని తెలుసుకోవటమే మోక్షం. ఇది ప్రతి జ్ఞానికీ తప్పదు. అతిజాగ్రత్తగా తలగడలను దాటుకుంటూ వస్తాడు అతను కూడా.

**క్రమతే న హి బుద్ధస్య జ్ఞానం ధర్మేషు తాయినః** – చైతన్యపరంగా చూస్తే అసలు రెండవ వస్తువు లేనేలేదు. బుద్ధః అంటే జ్ఞాని; తాయి అంటే సర్వవ్యాపకం. జ్ఞాని సర్వవ్యాపకం. అంటే జ్ఞానం పొందితే, జ్ఞాని హఠాత్తుగా లావెక్కిపోతాడా? అంటే జ్ఞాని తను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని అని అర్థం చేసుకుంటాడు.

జ్ఞానం న క్రమతే – అటువంటి వ్యక్తికి, చైతన్యం ఏ వస్తువునూ పట్టుకోదు. ఇక్కడ ధర్మః అంటే వస్తువు. చైతన్యం పరంగా చూస్తే, చైతన్యానికి భిన్నంగా వేరే వస్తువు లేనేలేదు.

జ్ఞాని చైతన్యం ఏ వస్తువునూ పట్టుకోదు అంటే అజ్ఞాని చైతన్యం పట్టుకుంటుందా? గౌడపాదాచార్యులవారు అజ్ఞాని చైతన్యం, జ్ఞాని చైతన్యం అంటూ భేదం లేదు; చైతన్యం ఇద్దరిలోనూ ఒకటే కాకపోతే, వారు చూసే దృక్కోణం వేరే అంటారు. జ్ఞానికి తనకు భిన్నంగా వేరే వస్తువు లేదని తెలుసు; కాని అజ్ఞాని తనకు భిన్నంగా వేరే వస్తువు ఉంది అనుకుంటాడు. కాని నిజానికి ఇద్దరూ వేరే వస్తువును చూడరు.

**సర్వే ధర్మాస్తథా** – జ్ఞానిపరంగా చూసినా, అజ్ఞానిపరంగా చూసినా వారి స్వభావం ఒకటే. ఇద్దరూ తురీయ చైతన్యమే.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు తన బోధను ఒక వివరణతో ముగిస్తున్నారు.

**ఏతత్ జ్ఞానమ్** – ఈ బోధ,

**బుద్ధేన న భాషితమ్** – బౌద్ధమతబోధ కాదు; ఇది వేదాంతబోధ అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

బౌద్ధమతంలోనూ, అద్వైతంలోనూ జగత్తును నిషేధిస్తారు. జగత్తును నిషేధిస్తారు అంటే మిథ్యగా కొట్టివేస్తారు. రెండింటికీ ఉన్న ఈ సమానధర్మాన్నిబట్టి కొందరు అద్వైతం, బౌద్ధమతంలో ఒకరకం అనుకుంటారు. అందుకని ఈ పొరపాటుని చక్కదిద్దాల్సిన బాధ్యత తనమీద ఉంది అనుకుంటున్నారు గౌడపాదాచార్యులవారు. బౌద్ధమతస్థులు నాస్తికులలోకి వస్తారు. నాస్తికులు అంటే వేదాన్ని ప్రమాణంగా స్వీకరించనివారు. కాని అద్వైత సిద్ధాంతులు ఆస్తికులలోకి వస్తారు. అద్వైతం వేదాన్ని ప్రమాణంగా స్వీకరిస్తుంది. అందువల్ల ఈ రెండింటినీ కలపకూడదు.

ఈ జ్ఞానం బుద్ధుడు ఇచ్చిన జ్ఞానం కాదు. మరయితే ఎవరు ఇచ్చారు? మాండూక్యోపనిషత్తు ఇచ్చింది.

**కారిక 4.100**

**దుర్దర్శమతిగంభీరమజం సామ్యం విశారదమ్ ।**
**బుద్ధ్వా పదమనానాత్వం నమస్కుర్మో యథాబలమ్ ॥**

గౌడపాదాచార్యులవారు ఈ నాలుగవ అధ్యాయాన్ని మంగళాచరణంతో మొదలుపెట్టారు, ఇప్పుడు కూడా మంగళాచరణంతో ముగిస్తున్నారు. మొదట్లో మొదటి రెండు కారికల్లో బ్రహ్మవిద్యను నేర్పించిన ఆదిగురువైన నారాయణునికి, సాక్షాత్ బ్రహ్మవిద్యకు నమస్కారం చేశారు. ఆత్మజ్ఞానాన్ని స్తుతిస్తూ ఆత్మకు ఆరుగుణాలను పేర్కొన్నారు అక్కడ. అవి – అస్పర్శయోగః, సర్వాసత్త్వ సుఖః, హితః, అవివాదః, అవిరుద్ధః, దేశితః.

**నమామ్యహమ్** – అటువంటి ఆత్మజ్ఞానానికి నేను నమస్కారం చేస్తున్నాను అన్నారు.

ఇక్కడ కూడా ఆత్మయొక్క మరొక ఆరు లక్షణాలను పేర్కొని అటువంటి ఆత్మకు నమస్కరిస్తున్నాను అంటున్నారు.

**పదం నమస్కుర్మః** – పదం అంటే జీవితంలో ఉండాల్సిన అంతిమలక్ష్యం. అది తురీయ పదం. నమస్కుర్మః అంటే నేను నమస్కారం చేస్తున్నాను. ఎటువంటి తురీయం?

1. **దుర్దర్శమ్** – ప్రమేయం కానిది. మనకున్న ప్రమాణాలన్నీ ప్రమేయం గురించిన జ్ఞానం కలుగజేసేవి. ఆ ప్రమాణాలకు అందనిది. తురీయం ప్రమేయం కాదు, చైతన్యం అయిన నేనే అని తెలుసుకోవాలి.

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

ఇటువంటి ఆత్మ గురించి తెలుసుకోవటం కష్టం కాబట్టి **దుర్దర్శం**.

2. **అతిగంభీరమ్** – స్థూలబుద్ధి ఉన్న వ్యక్తి నేర్చుకోవాలంటే చాలా కష్టం. ఎందుకంటే ఆత్మ చాలా సూక్ష్మమైనది. స్థూలమనస్సుకు ఒక్కటే పద్ధతి తెలుసు. వస్తువులను ప్రమేయంగా

చూడటమే తెలుసు. అత్యంత సూక్ష్మమైన క్రిములను మైక్రోస్కోప్ ద్వారా, అత్యంత దూరమైన నక్షత్రాలను టెలిస్కోప్ ద్వారా చూడటమే వచ్చు. అందువల్ల, దేన్ని పరిచయం చేసినా, వెంటనే దాన్ని ప్రమేయంగా చూడటం అలవాటయిపోయింది మన స్థూలబుద్ధికి.

అందువల్ల అటువంటి స్థూలబుద్ధితో ఆత్మ చూడబడే వస్తువు కాదు, చూసే నువ్వే ఆత్మవు అని విన్నాకూడా, 'నాకు ఆత్మ గురించి చాలా బాగా అర్థమయింది, కాని ఇంతవరకూ ఆత్మ అనుభవం పొందలేదు. ఆత్మ అనుభవం ఎలా పొందాలో చెప్పండి,' అంటుంది అది. ఇది విన్న గురువు పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి. అతని ఉత్సాహం మీద నీళ్ళు జల్లినట్టు అవుతుంది.

**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

ఈ విషయం అంత తేలికగా అర్థం కాదు కాబట్టి **అతిగంభీరం.**

3. **అజమ్** – అజం అంటే పుట్టుక లేనిది. పుట్టుక లేనిది అంటే మరణం కూడా లేనిది. ఇంకో విధంగా చెప్పాలంటే **షడ్వికార రహితం.**

4. **సామ్యమ్** – అన్నింటిలోనూ సమానంగా ఉండేది. అంటే **నిర్గుణం.**

5. **విశారదమ్** – నిత్యశుద్ధం, మలినరహితం. అందువల్ల **విశారదం.**

6. **అనానాత్వమ్** – నానాత్వం లేనిది. **అద్వైతం.**

**శాంతం శివమద్వైతమ్** – మంత్రం 7

నమస్కుర్మః – అటువంటి ఆత్మకు నేను నమస్కారం చేస్తున్నాను.

నిర్గుణం, అద్వైతం అయిన ఆత్మకు ఎలా నమస్కారం చేస్తారు. ఆత్మకు నేను నమస్కారం చేస్తున్నాను అంటేనే ఆత్మ వేరు, నేను వేరు, ఆత్మ ఆబ్జెక్టు, నేను సబ్జెక్టు అని అర్థం వస్తుంది. కాని ఇక్కడ తురీయ ఆత్మకు నమస్కారం చేస్తున్నాను అంటే నేను తురీయజ్ఞానం పొందానని అర్థం. **జ్ఞాన ఆర్జనమేవ నమస్కారః**

జ్ఞానం పొందటమే నమస్కారంతో సమానం. అందువల్లనే జ్ఞానం పొందటాన్ని జ్ఞానయజ్ఞం అంటారు. జ్ఞానం పొందటమనే పూజ.

**బుద్ధ్వా (నమస్కుర్మః)** – బుద్ధ్వా అంటే జ్ఞానం ద్వారా నమస్కారం చేస్తున్నాను. అంటే నేను తురీయజ్ఞానాన్ని పొందాను.

జ్ఞానం పొందాను, జ్ఞానానికి నమస్కారం చేస్తున్నాను అన్నాకూడా, జ్ఞానం వేరు, నేను వేరు అంటే జ్ఞానం ఆబ్జెక్టు, నేను సబ్జెక్టు అని అర్థం వస్తుంది. అందువల్ల తురీయజ్ఞానం పొందాను అంటే –

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

నేను ప్రమాత, ప్రమేయం, ప్రమాణం కాని తురీయ ఆత్మను అని అర్థం చేసుకోవటం.

బుద్ధ్వా అంటే ఆత్మత్వేన బుద్ధ్వా అంటే తురీయజ్ఞానం ప్రమేయజ్ఞానం కాదు, స్వస్వరూప జ్ఞానంగా అర్థం చేసుకోవటం. నమస్కారం చేస్తున్నాను అంటే అర్థం, నిజంగా నమస్కారం చేయటం కాదు, ఆత్మస్వరూపం అవగతమైంది అని అర్థం.

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప** – గీత 4.33

కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలో పన్నెండు యజ్ఞాలను పేర్కొంటాడు. తపోయజ్ఞం, ఇంద్రియ యజ్ఞం, మనోయజ్ఞంవంటివి పేర్కొని వాటన్నింటిలోకి జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమైనది అంటాడు. ఈ యజ్ఞాలన్నింటిలోనూ నిజంగా హోమకుండం, అగ్ని ఉండవు. అలాగే జ్ఞానయజ్ఞంలో కూడా అగ్ని ఉండదు. జ్ఞానమనే అగ్నిలో ద్వైతభావనలనే హోమాలను వేయాలి – విశ్వ, తైజస, ప్రాజ్ఞలను ఆహుతులుగా వేయాలి. అలాగే స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలను ఆహుతులుగా వేయాలి. నేను తురీయ ఆత్మను అర్థం చేసుకుంటే అది నమస్కారం. ఆ నమస్కారం చేశాక నేను ఫలానా వ్యక్తిని కాదు, నేను తురీయాన్ని అని అర్థం చేసుకోవాలి.

అందువల్లనే మన గుళ్ళను దేవాలయాలు అంటారు. దేవాలయం అంటే దైవంలో వ్యష్టి లయమవటం. పరమాత్మతో, జీవాత్మ ఐక్యం అర్థం చేసుకోవటానికి తోడ్పడతాయి. అందువల్ల ఈ నమస్కారం మోక్షాన్ని ప్రసాదించే నమస్కారం. తురీయానికి నమస్కారం చేస్తున్నాను అంటే ఈ జ్ఞానాన్ని పొందాను అని అర్థం.

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

దీనితో నాలుగవ అధ్యాయం ముగిసింది. గౌడపాద కారికలు కూడా ముగిశాయి.

## శాంతిపాఠం

**ఓం భద్రం కర్ణేభిఃశృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఉపనిషత్తు మొదలుపెట్టే ముందు శాంతిపాఠం ఆటంకాలు లేకుండా మన విద్య నిర్విఘ్నంగా కొనసాగటానికి చేస్తే,మాండూక్యోపనిషత్, కారికలతో సహితంగా నేర్చుకున్నాక, నిర్విఘ్నంగా కొనసాగినందుకు, తురీయజ్ఞానం పొందినందుకు, మళ్ళీ శాంతిపాఠం పఠించి, కృతజ్ఞతలు తెలియజేసుకుంటాము.

# అధ్యాయం 4 – అలాతశాంతి ప్రకరణం – సారాంశం

మాండూక్య కారికలతో కూడిన అధ్యాయాల్లో, నాలుగవ అధ్యాయం చాలా పెద్దది. ఇందులో 100 కారికలు ఉన్నాయి.

ఇంతవరకూ చూసిన అధ్యాయాల్లో కాని, తక్కిన ఉపనిషత్తుల్లో కాని, పదేపదే చెబుతూ వచ్చిన విషయం ఒకటే –

**జ్ఞానాత్ ఏవ తు కైవల్యమ్**

జ్ఞానంవల్లనే మోక్షం కలుగుతుంది. సహజంగానే అందరికీ జ్ఞానం పొంది, మోక్షం పొందాలని ఉంటుంది. కాని ఆత్మజ్ఞానం ఎలా పొందాలనే విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొంతమంది ఆత్మజ్ఞానం అంటే క్షణంలో మెరుపులా మెరిసే అసాధారణ అనుభవం అనుకుంటారు. ఆ అనుభవం వారికి మోక్షాన్నిస్తుందని భావిస్తారు. అందువల్ల అటువంటి అసాధారణ అనుభవంకోసం ఎదురుచూపులు చూస్తారు.

అంతేకాదు, ఈ అసాధారణ అనుభవం కూడా ఏదో ఒక పద్ధతిలో పొందవచ్చు అనుకుంటారు. అంటే వారికి పద్ధతి ముఖ్యం కాదు, అనుభవమే ముఖ్యం. ఎప్పుడైతే ఇలా అసాధారణ అనుభవం పొందాలని నిర్ణయించుకుంటారో, అప్పుడే ఏదో ఒక విధంగా ఆ అనుభవం పొందటానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి పంథాలో సాగేవారికి, శాస్త్ర అధ్యయనం పెద్దగా ప్రాధాన్యత వహించదు. వారు అసలు శాస్త్రఅధ్యయనం చేయనవసరం లేదనో, లేదా అది అధ్యయనం చేయాలా, వద్దా అనేది పూర్తిగా మీ ఇష్టం అనో అంటారు. ఇది ఒక బలమైన, శక్తివంతమైన వాదన.

అతీంద్రియ అనుభవం మోక్షాన్నిస్తుందంటారు కాబట్టి, వీరు ఇంకొక అడుగు ముందుకు వేస్తారు. **జ్ఞానం** అనే పదాన్ని కూడా వారు ఇష్టపడరు. **జ్ఞానం** పదం, ఇంత గొప్ప విషయానికి ఒక సాదాసీదా పదం అనేస్తారు వారు. అందువల్ల వారు ఆత్మజ్ఞానం పదాన్ని వాడకుండా, అతీంద్రియ శక్తి అనో, జ్ఞానోదయం అనో అంటారు.

ఈ వాదనలను మనం ససేమిరా అంగీకరించము. ఆత్మజ్ఞానం మెరుపులా మెరిసే జ్ఞానోదయం కాదనీ, అతీంద్రియశక్తి అసలే కాదనీ, అది సిద్ధులవల్ల పొందేది కాదని పదేపదే చెబుతాము. ఆత్మజ్ఞానం అంటే బుద్ధిలో జరిగే మార్పు. బుద్ధిలో మార్పు కలగాలంటే, ఒక క్రమపద్ధతిలో, శాస్త్రవిచారణ ద్వారా జరగాలి. అందువల్ల దీనికి **ఆత్మజ్ఞానం** పదమే సరియైన పదం. అతీంద్రియశక్తి, జ్ఞానోదయం పదాలు సరిపోవు.

ఆత్మజ్ఞానం బుద్ధిలో జరిగే మార్పు అనగానే, వారు ఎదురు ప్రశ్నిస్తారు. మనస్సు చేరుకోలేదు, వాక్కు చేరుకోలేదని మీరే అంటారు కదా, అలాంటప్పుడు బుద్ధి ఎలా అర్థం చేసుకుంటుంది అంటారు వారు. దానికి మన జవాబు – మనస్సు అర్థం చేసుకోలేదు అంటే మనస్సు స్వంతంగా అర్థం చేసుకోలేదు; కాని శాస్త్ర అధ్యయనం చేసిన బుద్ధి, అది కూడా గురువు సహాయంతో మాత్రమే శాస్త్రాన్ని అధ్యయనం చేసిన బుద్ధి అర్థం చేసుకోగలదు.

**శాస్త్ర ఆచార్య సంస్కృత అంతఃకరణమ్ ఆత్మజ్ఞాన కారణమ్**

శాస్త్రాన్ని, గురువు ద్వారా నేర్చుకున్న బుద్ధి మాత్రమే ఆత్మజ్ఞానాన్ని పొందగలదని శంకరాచార్యులవారు భగవద్గీత భాష్యంలో రాస్తారు. అలాగని అది శంకరాచార్యులవారి స్వంతభావన కాదు. దానికి శాస్త్రప్రమాణమే ఉంది,

**దృశ్యతే తు అగ్రయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః** – కఠ

సూక్ష్మమైన మనస్సు ద్వారానే ఆత్మజ్ఞానం పొందగలము. మనస్సును ఎలా సూక్ష్మం చేసుకోగలము? గురువు ద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే చేసుకోగలము. శాస్త్ర అధ్యయనం చేస్తే నా స్వస్వరూపమేమిటో అర్థమవుతుంది. ఈ నా స్వస్వరూప జ్ఞానమే నాకు సంసారం నుంచి మోక్షం కలిగిస్తుంది.

ఎప్పుడైతే ఈ జ్ఞానం బుద్ధికి సంబంధించిన జ్ఞానం అన్నామో, అప్పుడే అది చాలా తర్కం, విచారణలతో కూడివుంటుంది. ఎక్కడైతే తర్కం, విచారణ ఉంటాయో, అక్కడే అనేక సందేహాలకు ఆస్కారం ఉంటుంది. అనుభవంతో కూడిన జ్ఞానం విషయంలో బుద్ధికి చోటులేదు, శాస్త్రానికి చోటులేదు, ఎలాగో జరిగిపోతుంది. కాని, అలా ఎలాగో జరిగిపోవటాన్ని శాస్త్రం ఒప్పుకోదు. మనకి చక్కని రాజమార్గం ఉంది. అది శాస్త్ర శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటం; అది కూడా గురువు ద్వారా.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా** – బ్రహ్మసూత్రాలు 1

బ్రహ్మజ్ఞానం పొందటానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలనే చక్కటి పద్ధతి ఉంది. దాని ద్వారా సంశయరహిత జ్ఞానాన్ని పొందుతాము. ఈ పద్ధతిలో బుద్ధిని ఉపయోగించాలి, శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి; తర్కాన్ని వాడాలి. తర్కం వాడితే సందేహాలు రావచ్చని చూశాము. వేదాంతం సందేహాలను స్వీకరిస్తుంది. ఆత్మజ్ఞానం పొందే సమయంలో అనేక సందేహాలు కలుగుతాయి. వాటన్నింటినీ తీర్చుకుంటూ వస్తుంది శాస్త్రం.

జ్ఞానంవల్ల మాత్రమే మోక్షం వస్తుంది అంటే కర్మ, భక్తి, ధ్యానంవల్ల మోక్షం రాదని అర్థం. వెంటనే మీ బుద్ధి ప్రశ్నిస్తుంది. కేవలం భక్తివల్లనే మోక్షం పొందిన మీరాబాయి సంగతి ఏమిటి అంటారు మీరు.

అలాగే, గురువు ద్వారానే జ్ఞానం పొందాలి అంటే రమణమహర్షి ఎలా పొందారు అంటారు మీరు. ఇలా సందేహాలతో కూడిన జ్ఞానం పదికాలాలు నిలవదు. సందేహాత్మక జ్ఞానం అజ్ఞానంతో సమానం. ఎందుకంటే, ఏ కాస్త అవకాశం వచ్చినా, ఈ జ్ఞానం వీగిపోతుంది. బలంగా నిలబడదు. మీ బుద్ధే మిమ్మల్ని నిలదీయవచ్చు లేదా ఇతరుల వాదన మిమ్మల్ని కుదిపివేయవచ్చు. అందువల్ల బుద్ధిని బలవంతంగా అణగద్రొక్కితే జ్ఞానం పొందలేరు.

భగవంతునిమీద భక్తి వెనుక భగవంతుని గురించిన సరియైన జ్ఞానం లేకపోతే, వీగిపోతుంది. ఎంతో ప్రగాఢమైన భక్తి ఉన్నవారు కూడా, వారికి జీవితంలో ఏదైనా గట్టి ఎదురుదెబ్బ తగిలితే, కృశించిపోతారు. వారికే కాదు, వారి చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా మంచివారికి తీరని అన్యాయం జరిగినా, దాన్ని తట్టుకోలేరు. భగవంతునిమీద భక్తిని ద్వేషంగా మార్చుకుంటారు. 'ఉన్నాడా, భగవంతుడు అసలు ఉన్నాడా? ఉంటే ఈ అన్యాయాన్ని ఎలా సహిస్తూ ఊరుకున్నాడు?' అని నిలదీస్తారు. భగవంతుని గురించిన సరియైన జ్ఞానం లేకపోతే ఇలా జరిగే ప్రమాదం ఉంది.

అలాగే ఆత్మజ్ఞానం కూడ మూఢజ్ఞానం కాదు. అది గుడ్డిగా నమ్మేది కాదు. అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానం అనేక ప్రక్రియల ద్వారా, ఒక క్రమపద్ధతిలో, అనేక ఉదాహరణలతో పొందే జ్ఞానం. అది లోతైన, స్పష్టమైన జ్ఞానం. ఆ లోతైన జ్ఞానం ఏర్పడితే ఎటునుంచి ఎవరేం ప్రశ్నించినా, ఈ జ్ఞానం వీగిపోదు. అలా చెక్కుచెదరకుండా, జ్ఞానం నిలబడటానికి తోడ్పడే పద్ధతిని **మననం** అంటారు.

మననం అంటే మీరు పొందిన జ్ఞానంతో, తక్కిన దార్శనికుల వాదనలను ఎదుర్కొని నిలబడటం. వారు మీరు వేదాంతంలో నేర్చుకున్న అనేక అంశాలకు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చుతారు. మీ జ్ఞానం నిస్సంశయజ్ఞానం అయితే, ఆ వాదనల తాకిడికి వీగిపోకుండా, స్థిరంగా నిలచివుంటుంది. ఈ పద్ధతిని **స్థూణ నిఖనన న్యాయం** అంటారు.

మీరు బట్టలు ఆరేయాలంటే రెండు గోడలకు మేకులు కొట్టి, వాటికి తాడు కడతారు. అవునా? కాని ఆ తాడు కట్టేముందు ఆ మేకులు గట్టిగా ఉన్నాయో లేదో పరీక్షించి చూసుకుంటారు. గట్టిగా లేకపోతే, ఆ బట్టల బరువుకు తాడు కూడా పడిపోతుంది. అందువల్ల మేకులు గట్టిగా లేకపోతే, మళ్ళీ ఇంకో రెండు సుత్తిదెబ్బలు వేస్తారు. ఎంతవరకూ వేస్తారంటే, ఆ మేకులు గట్టిగా ఉన్నాయని తేలేవరకూ.

అదే విధంగా, మీరు పొందిన జ్ఞానం కూడా గట్టిగా, సత్యంలాగా మీ బుద్ధిలో నెలకొని ఉందా, లేకపోతే కేవలం నమ్మకం మాత్రమేనా అనేది పరీక్షించుకోవాలి. ఇంకా ఎక్కడన్నా సందేహం ఉంటే, మరికొన్ని వాదోపవాదాల ద్వారా దాన్ని గట్టిపరచుకోవాలి. అంటే

మీ వాదాన్ని తక్కిన వాదనలతో కుదిపిచూసి, వాటికి లొంగని స్థిరజ్ఞానం మీది అని దృఢపరచుకోవాలి.

ఈ అధ్యాయం ముఖ్యంగా మనన ప్రధాన అధ్యాయం. అసలు బోధను మొదటి మూడు అధ్యాయాల్లోనూ చూశాము. అంటే అవి శ్రవణ ప్రధాన అధ్యాయాలు. నిదిధ్యాసనాన్ని కొంతమేరకు మూడవ అధ్యాయంలో చూశాము. శ్రవణంలో మీరు నేర్చుకున్న వేదాంత సారం ఇదీ –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

బ్రహ్మ మాత్రమే సత్యం, బ్రహ్మ దృష్ట్యా తక్కినవన్నీ మిథ్య. మిథ్యా జగత్తు సత్‌బ్రహ్మను ఏమీ చేయలేదు. అదృష్టవశాత్తూ, నేను ఆ సత్‌బ్రహ్మను. అందువల్ల వేదాంతసారం –

**అహం సత్యం జగన్మిథ్యా**

ప్రపంచంలో ఏం జరిగినా ప్రపంచం నన్ను ఏమీ చేయలేదు. అలాంటప్పుడు నన్ను సంసారం బాధించే అవకాశం ఎక్కడ? సంసారమే లేకపోతే, దానికి పరిష్కారం వెతుక్కునే ఆస్కారం ఎక్కడ? అందువల్ల ఈ ఆత్మజ్ఞానానికి గౌడపాదాచార్యులవారు ప్రత్యేకమైన పేరును ఇచ్చారు. **అస్పర్శయోగః.** ఇది ఒక కొత్త అంటరానితనం. ఈ అంటరానితనంలో బ్రహ్మనైన నేను జగత్తులో ఏం జరిగినా చలించను. చావు–పుట్టుకలు, పుణ్య–పాపాలు నన్ను ప్రభావితం చేయలేవు.

**అసంగోఽహమ్ అసంగోఽహమ్ అసంగోఽహం పునః పునః** – బ్రహ్మజ్ఞానావళీమాలా

ఆ విధంగా అస్పర్శయోగం అంటే అసంగత్వజ్ఞానం. నేను పారమార్థిక స్థాయికి చెందిన తురీయాన్ని; జగత్తు, నా మనశ్శరీరాలు వ్యావహారిక స్థాయికి చెందినవి; అందువల్ల జగత్తులో ఏం జరిగినా, పారమార్థిక స్థాయికి చెందిన నన్నేమీ చేయలేవు.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖమ్** – నిర్వాణషట్కమ్

ఈ జ్ఞానంలో నిలబడితే, తక్కిన దార్శనికుల వాదనలవల్ల మీరు చలించిపోరు.

ఈ అధ్యాయంలో జ్ఞానాన్ని బలపరచటంకోసం ముందు మూడు అధ్యాయాల్లోని అనేక విషయాలు మళ్ళీ చెప్పబడ్డాయి. అంతేకాక, మరికొన్ని ముఖ్యమైన పాఠాలు కూడా చొప్పించబడ్డాయి. ఆ విధంగా చూస్తే, ఈ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. పరమత పరీక్ష – కారికలు 1–46
2. అలాత దృష్టాంతం – కారికలు 47–56
3. సాధన – కారికలు 57–100

1. **పరమత పరీక్ష** – తక్కిన దార్శనికుల సిద్ధాంతాలను తీసుకుని వారి వాదనలను మన సిద్ధాంతంతో పోల్చిచూసి, వేదాంతాన్ని నిలబెట్టటం.

వారి సిద్ధాంతాలు మన నమ్మకాన్ని చెదరగొడతాయా? వారి వాదనల్లో ముఖ్యంగా సృష్టి ప్రకరణం గురించిన వారి వాదనలు చూడటం జరిగింది. వారి వాదనలలో బలం లేదనీ, **అజాతివాదము సత్యము** అనీ పదేపదే నిరూపించుకొచ్చారు గౌడపాదాచార్యులవారు. వేదాంతం ప్రకారం నిజం సృష్టి జరగలేదు. అంతకుముందూ, ఇప్పుడూ, ఇకముందు కూడా ఉండేది బ్రహ్మ మాత్రమే.

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**
**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

తాడును సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది పాము; పామును సరిగ్గా అర్థం చేసుకుంటే అది తాడు.

ఇక్కడ సృష్టిప్రక్రియ గురించి గౌడపాదాచార్యులవారు తీసుకున్న వాదనలు మూడు. అవి –

1. అసత్కార్య వాదము – న్యాయ, వైశేషిక దర్శనాలు
2. సత్కార్య వాదము – సాంఖ్య, యోగ దర్శనాలు
3. ఆత్మఖ్యాతి వాదము – బౌద్ధమత దర్శనం

ఈ దర్శనాలన్నింటిలోనూ, వారందరూ సమానంగా అడిగే ప్రశ్న ఒకటే. సృష్టి జరిగే ముందు, అది ముందే ఉందా? ఇంకో విధంగా చెప్పాలంటే జగత్తు సృష్టికి ముందు అవ్యక్తంలో ఉందా లేదా? మరో విధంగా చెప్పాలంటే ఉనికి ఉన్న జగత్తు పుట్టిందా, ఉనికి లేని జగత్తు పుట్టిందా? వీరి వాదనలను ఒకటొకటిగా చూద్దాము.

1. **అసత్కార్య వాదము** – ఉనికి లేని జగత్తు పుట్టింది అంటారు అసత్కార్య వాదులు. ఎందుకంటే ఉనికి ఉంటే అది మళ్ళీ కొత్తగా పుట్టనవసరం లేదు.

**ఖండన** – ఉనికి లేని వస్తువు కొత్తగా పుట్టలేదు. అసత్కార్యవాదనను రెండు విధాలుగా ఖండించవచ్చు.

ఎ) **సైన్స్‌పరంగా పుట్టదు** – సైన్స్‌పరంగా పదార్థం కొత్తగా పుట్టదు, నాశనమవదు. ఈ సూత్రం ప్రకారం ఉనికి లేని వస్తువు పుట్టలేదు.

బి) **వ్యాకరణపరంగా కుదరదు** – వ్యాకరణం ప్రకారం ఒక వాక్యంలో కర్త (సబ్జెక్ట్) + క్రియ (వర్బ్) ఉండాలి.

ఉదా. **కుండ** **పుట్టింది**
కర్త క్రియ

**ఉనికి లేని కుండ పుట్టింది.**

ఈ వాక్యాన్ని చెప్పలేము. ఎందుకంటే ఇక్కడ కర్త లేదు.

అంతేకాదు, శూన్యంనుంచి వస్తువులు పుడితే ఎంత బాగుంటుంది? కాని అది జరిగే పనికాదు.

అందువల్ల అసత్కార్య వాదన చెల్లదు.

2) **సత్కార్య వాదము** – ఉనికి ఉన్న వస్తువు పుట్టింది అంటారు సత్కార్యవాదులు.

**ఖండన** – ఉనికి ఉంటే కొత్తగా పుట్టనవసరం లేదు.

దీనికి సత్కార్యవాదులు 'సరే అయితే మా వాదనను కొంచెంగా మారుస్తాము,' అంటారు. 'అవ్యక్తంలో ఉన్న జగత్తు వ్యకమయింది అంతే. దాన్నే సృష్టి అంటున్నాము,' అంటారు.

దానికి కూడా వేదాంతం ఒప్పుకోదు. అవ్యక్తంలో ఉన్నది వ్యక్తమయింది అంటే అది మార్పు చెందుతుంది, వికారాలకు లోనవుతుంది అని అర్థం. అంటే మీరు సవికారం గురించి మాట్లాడుతున్నారు, మేము నిర్వికారబ్రహ్మ గురించి బోధిస్తున్నాము. నిర్వికార బ్రహ్మ, వికారాలకు లోనవదు.

3) **ఆత్మఖ్యాతి వాదము** – వీరు, చూసే నాకు భిన్నంగా బాహ్యప్రపంచం లేదు అంటారు. స్వప్నప్రపంచం ఎలా మిథ్యో, అలా జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అంటారు. బాహ్య ప్రపంచాన్ని కొట్టివేస్తున్నారు కాబట్టి వీరిని బాహ్యార్థ అభావ వాదినః అంటారు. అభావ అంటే ఉనికి లేకపోవటం. చూసే నేను సత్యం అంటారు కాని నేను క్షణిక విజ్ఞాన ప్రవాహాన్ని అంటారు. అందువల్ల వీరిని క్షణిక విజ్ఞాన వాదినః అనికూడా అంటారు. క్షణిక విజ్ఞానంయొక్క నిత్యప్రవాహం ఆత్మ అంటారు వారు.

**ఖండన** – గౌడపాదాచార్యులవారు వీరి వాదనను మూడు పదాలతో ఖండించారు. అవి– **చిత్తం న జాయతే** – 4.28

వీరి వాదన ప్రకారం 'క్షణిక విజ్ఞానమే ఆత్మ అంటున్నారు కదా! ఈ ప్రవాహం గురించి ఎవరు మాట్లాడుతున్నారో చెప్పండి,' అంటే వారికి జవాబు లేదు.

వీరి వాదనలోని లొసుగు ఏమిటి? వారేమంటారు? చైతన్యం ఒకటి వచ్చి, పోతుంది. చైతన్యం రెండు వచ్చి, పోతుంది. చైతన్యం మూడు వచ్చి, పోతుంది. ఇప్పుడు ఈ వచ్చిపోయే చైతన్యం గురించి చెప్పేదెవరు? ఒకటి చెబుతుందా అంటే, రెండవది వచ్చేసరికి మొదటిది

వెళ్ళిపోతుంది. పోనీ రెండవది చెబుతుందా అంటే మొదటిది వచ్చి వెళ్ళినట్టే రెండవ చైతన్యానికి తెలియదు. అందువల్ల ఒకదాని గురించి ఇంకొకటి చెప్పలేదు.

దీనికి సూత్రం – రాకపోకలు ఉన్న వస్తువు గురించి చెప్పేదానికి రాకపోకలు ఉండకూడదు. వారు కదిలే ఆలోచనా ప్రవాహాన్ని చైతన్యంగా పొరపాటు పడుతున్నారు. అందువల్ల వారు క్షణిక విజ్ఞానం అనేది క్షణిక వృత్తి గురించి మాత్రమే. క్షణిక వృత్తులు వస్తాయి, పోతాయి కాని చైతన్యం ఆ వచ్చిపోయే ఆలోచనలను సాక్షిగా చూస్తుంది. సాక్షికి రాకపోకలు లేవు. అందువల్ల సత్యం క్షణిక విజ్ఞానం కాదు. సత్యం చైతన్యం.

ఆ విధంగా అసత్కార్యవాదాన్ని అసలు స్వీకరించలేము; సత్కార్య వాదము సత్యం దాకా రాదు; ఆత్మఖ్యాతి వాదము కూడా సత్యం అనుకుంటున్నది ఆపేక్షిక సత్యమే కాని అంతిమసత్యం కాదు. అందువల్ల ఈ వాదనలేవీ అంతిమ సత్యాన్ని వివరించలేవు. **అజాతివాదము సత్యము.** ఈ విషయాన్ని శాస్త్రంనుంచి మాత్రమే అర్థం చేసుకోగలము; వేరే దర్శనాల ద్వారా కాదు.

మాక్స్ ప్లాంక్ అనే సైంటిస్ట్, అద్భుతంగా అన్నారు, 'సైన్స్ ప్రకృతియొక్క అంతిమ సత్యాన్ని నిరూపించలేదు. ఎందుకంటే, మనం పరిష్కరిద్దామనుకుంటున్న అంతుపట్టని విషయంలో మనం కూడా ఒక భాగం కాబట్టి.' సూదంటురాయిలా చూడగలిగే శక్తి ఉన్న కన్ను కూడా తనను తాను చూసుకోలేదు. బృహదారణ్యకోపనిషత్తులో ఇదే విషయం వస్తుంది. కాని విచారకరమైన విషయం ఏమిటంటే, మనం శాస్త్రం ఘోషిస్తే నమ్మము; సైంటిస్ట్ చెబితే నమ్ముతాము.

**విజ్ఞాతారమ్ అరే కేన విజానీయాత్** – బృహదారణ్యకమ్

ఒక వస్తువు గురించి తెలుసుకునే బుద్ధి, తనను గురించి తాను ఎలా తెలుసుకుంటుంది? మీ బుద్ధి తక్కిన వాదాల గురించి తెలుసుకోగలదు కాని, మీ గురించి తెలుసుకోవాలంటే శాస్త్రానికి రాకతప్పదు. మీ కన్నును చూసుకోవటానికి ఎలా దర్పణాన్ని వాడతారో, అలా మీ గురించి తెలుసుకోవటానికి శాస్త్రమనే దర్పణాన్ని వాడాలి.

పరమత పరీక్ష ఎలా అయిందో టూకీగా చూశాము ఇంతవరకూ.

### 2. అలాత దృష్టాంతం – కారికలు 47-56

వేదాంతసారాన్ని అలాత దృష్టాంతంలో వివరించారు గౌడపాదాచార్యులవారు. అలాతం అంటే కొరివి, కాగడా, దివిటీ. కొరివి అంటే ఒక పొడుగుకర్రకు ఒక చివర ఒక బట్టను లావుగా చుట్టి, దాన్ని నూనెలో ముంచి వెలిగిస్తారు. దాన్నించి వచ్చే కాంతి చాలా

ప్రకాశవంతంగా ఉంటుంది. నిజానికి ఈ దృష్టాంతం వాడారు కాబట్టే ఈ అధ్యాయానికి **అలాతశాంతి దృష్టాంతం** అనే పేరు వచ్చింది.

అలాతాన్ని తిప్పితే వచ్చే ఆకారాలని ఆభాస అంటారు. అలాతాన్ని బ్రహ్మతోనూ, ఆకారాలను ద్వైతప్రపంచంతోనూ పోల్చారు గౌడపాదాచార్యులవారు.

| **అలాతం** | **ఆభాస** | **బ్రహ్మ** | **జగత్తు** |
|---|---|---|---|
| ఏకం | అనేకం | ఏకం | అనేకం |
| స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం | స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం |
| కారణం | కార్యం | కారణం | కార్యం |
| స్వతంత్రం | పరతంత్రం | స్వతంత్రం | పరతంత్రం |

అలాతం స్పందించినప్పుడు ఆకారాలు అలాతం లోపలినుంచి రావు.
అలాతం స్పందించినప్పుడు ఆకారాలు బయటనుంచి రావు.
అలాతం శాంతించినప్పుడు ఆకారాలు బయటకు పోవు.
అలాతం శాంతించినప్పుడు ఆకారాలు అలాతం లోపలకు పోవు.
సంబంధం ఉండాలంటే రెండు వస్తువులు ఉండాలి, ఒకేస్థాయికి చెందివుండాలి.

అదే విధంగా ఉన్నదొకటే చైతన్యం అంటారు గౌడపాదాచార్యులవారు. చైతన్యంయొక్క మాయాశక్తివల్ల అది కదిలినట్టుగా అనిపిస్తుంది. మాయ కదిలినప్పుడు జగత్తు వచ్చినట్టుగా ఉంటుంది. మాయ శాంతించినప్పుడు జగత్తు ప్రళయంలోకి వెళ్ళినట్టు అనిపిస్తుంది. అందువల్ల నిజంగా జగత్తు రాలేదు.

అలాతంనుంచి ఆభాస వచ్చినట్టుగా ఉంది అన్నప్పుడు అలాతానికీ – ఆభాసకూ కారణ–కార్య సంబంధం ఉంది అన్నాము. కాని తరువాత ఉన్నదొకటే అలాతం అని నిరూపించినప్పుడు అలాతం కార్య–కారణ విలక్షణం అంటాము.

### నామద్వయం, వస్తు ఏకమ్

స్థూలబుద్ధి ఉన్న శిష్యునికి అర్థం అవటంకోసం, బ్రహ్మ కారణమనీ, జగత్తు కార్యమనీ ముందు చెబుతుంది శాస్త్రం. తరువాత, శిష్యుని బుద్ధి సూక్ష్మమయ్యాక, కారణ–కార్య సంబంధం అంటూ లేదనీ, బ్రహ్మ, జగత్తు ఒకటే చైతన్యానికి ఉన్న రెండు పేర్లనీ చెబుతుంది. అందువల్ల బ్రహ్మ కారణ కార్య విలక్షణం. ఆ బ్రహ్మను నేనే. అహం అస్పర్శః. ఇవీ ఈ కారికల సారాంశం.

ఈ నాలుగు దశలను టూకీగా చూస్తే,

1. ఆకారాలకు విడిగా ఉనికి లేదు కాబట్టి, ఆకారాలను ఖండిస్తాము
2. ఆకారాలను ఖండిస్తే, ద్వైతం లేదు
3. ద్వైతం లేకపోతే, కార్యకారణ సంబంధం లేదు
4. కార్యకారణ సంబంధం లేకపోతే, మిగిలేది అద్వైత అలాతం.

ఈ సూత్రాన్ని జగత్తుకూ, బ్రహ్మకూ అన్వయించి చూద్దాము.

1. జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి, జగత్తును ఖండిస్తాము
2. జగత్తును ఖండిస్తే, ద్వైతం లేదు
3. ద్వైతం లేకపోతే, కార్యకారణ సంబంధం లేదు
4. కార్యకారణ సంబంధం లేకపోతే, మిగిలేది అద్వైతతురీయం, చైతన్యం.

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్**

3. **సాధన – కారికలు 57–100**

సంసారానికి మూలకారణం అజ్ఞానం. అజ్ఞానంవల్ల అహంకారంతో మమేకం చెందుతాము. అది కామానికి దారితీస్తుంది. కామం అనేక కర్మలను చేయిస్తుంది. కర్మలు కర్మఫలాలను తెస్తాయి. వాటికోసం పునరపి జననం, పునరపి మరణం తప్పదు. ఇదే సంసారం. ఆ దశలను మళ్ళీ చూస్తే –

**అజ్ఞానం → అహంకారం → కామం → కర్మ → కర్మఫలం → సుఖదుఃఖాలు → పునరపి జననం పునరపి మరణం = సంసారం**

అజ్ఞానం ఒక్కటే కారణం కాదు. అజ్ఞానం పొరపాటుకి దారితీస్తుంది. పొరపాటు పోవాలంటే అజ్ఞానం పోవాలి. అజ్ఞానం పోవాలంటే ఆత్మజ్ఞానం పొందాలి. జ్ఞానం పొందితే చాలదు, జ్ఞాననిష్ఠలో నిలబడాలి. జాగ్రత్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతారు కాబట్టి రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవాలి.

ఆత్మజ్ఞానం పొందటానికి శాస్త్రానికి వెళితే శాస్త్రం మీరు ఏవైతే కోరుతున్నారో, అవి మీ స్వస్వరూపం అంటుంది. మీరు భద్రత కోరుకుంటే ఆ భద్రత మీలోనే దొరుకుతుంది అంటుంది; అంతేకాదు మీలో **మాత్రమే** దొరుకుతుంది అంటుంది. మీరు పూర్ణత్వం కోరుకుంటే మీరు పూర్ణస్వరూపులు అంటుంది; మీరు ఆనందం కోరుకుంటే మీరు ఆనందస్వరూపులు అంటుంది. అహం బ్రహ్మ అస్మి అని నేర్పిస్తుంది.

అహం అంటే నేను. ఈ నేను ఎవరు? నేను సాక్షి, అహంకారాల మేలుకలయికను. ఆ విషయం తెలియక మీరు మొదట్లో అహంకారంతో మమేకం చెందుతారు. అందువల్ల

మీరు మోక్షం పొందాలనుకుంటే, మీకు జ్ఞానయోగ్యత లేదు అనుకుని, జ్ఞానయోగ్యత పొందటానికి సాధన చేస్తారు. తర్వాత జ్ఞానం పొందుతారు. జ్ఞానం పొందితే చాలదు, జ్ఞాననిష్ఠలో నిలబడాలి; దానికి నిదిధ్యాసనం చేయాలని అర్థం చేసుకుని, అది కూడా చేస్తారు. అంటే మీ ప్రయాణం దశలు –

**జ్ఞాన అయోగ్యత → జ్ఞాన యోగ్యత → జ్ఞాని → జ్ఞాననిష్ఠ**

జ్ఞాననిష్ఠలో నిలబడ్డాక, మీరు ఇంక నేను ప్రయాణం చేశాను అనరు, నేను జ్ఞానిని అయ్యాను అనికూడా అనరు. నేను శుద్ధచైతన్యాన్ని, నన్ను నేను శుద్ధి చేసుకోనవసరం లేదని అర్థం చేసుకుంటారు. అలాగే సంసారం ఉందని నేను ఇన్నాళ్ళూ పొరపాటు పడ్డాను, లేనేలేని సంసారంనుంచి విముక్తి పొందాలని ప్రయత్నిస్తున్నాను అని తెలుసుకుంటారు. కాయిన్ గేమ్‌లో లేనేలేని నాణాన్ని పడగొట్టటానికి ప్రయత్నించినట్టుగా, లేనేలేని సంసారాన్ని పారద్రోలటానికి ప్రయత్నిస్తున్నారు.

వేదాంతం ఆ విధంగా సంసారబంధంనుంచి విడివడటానికి పరిష్కారం చూపించదు, సంసారం ఉంటేకదా, పరిష్కారం చూపించటానికి అంటుంది. మీరు ముందే ముక్తపురుషులు అంటుంది. కాని ఈ విషయం తెలియటానికి ముందు చూసిన సాధనలు చేస్తూ రావాలి. జ్ఞాన అయోగ్యతనుంచి జ్ఞానయోగ్యత పొంది, జ్ఞానం పొంది, జ్ఞాననిష్ఠలో నిలబడాలి.

ఈ సాధనలన్నీ సంసారాన్ని పారద్రోలటానికి కాదు, సంసారంలో ఉన్నాననే భ్రమను పారద్రోలటానికి.

దీనితో గౌడపాదాచార్యులవారు సాధనను ముగిస్తున్నారు. టూకీగా చెప్పాలంటే సంసారం లేదని తెలుసుకోవటానికి సాధన చేయాలి. మోక్షం అంటే సంసారంనుంచి విడివడటం కాదు, సంసారంలో లేనేలేను అనే జ్ఞానం బుద్ధిలో కలగటమే మోక్షం.

ఇందులో ముఖ్యమైన కారికలు – 2, 10, 28, 42, 56, 90.

దీనితో నాలుగవ అధ్యాయం అయిపోయింది. గౌడపాద కారికలు కూడా అయిపోయాయి.

**ఓం తత్సత్ సర్వం శ్రీకృష్ణార్పణమస్తు**

**కొన్ని నిర్వచనాలు**

| | | |
|---|---|---|
| 1. తురీయం | – | కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి<br>అవస్థాత్రయ అధిష్ఠాన తురీయ ఆత్మా అహమస్మి |
| 2. వేదాంతసారం | – | బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః |
| 3. మోక్షం | – | మోక్షం భవిష్యత్తులో వచ్చేది కాదు, ఒకకాలంలో వస్తే ఇంకొక కాలంలో పోతుంది. నేను నిత్య, ముక్త, శుద్ధతురీయాన్ని. ఈ జ్ఞానం పొందటమే మోక్షం. |
| 4. జ్ఞానం | – | గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే పొందాలి. కర్మవల్ల, ఉపాసనవల్ల, యోగాసనాలవల్ల జ్ఞానం రాదు. |
| 5. జగత్తు | – | జాగ్రత్ పురుషునికి జగత్తు సత్యం<br>పారమార్థిక స్థాయికి ఎదిగితే జగత్తు మిథ్య. అది స్వప్నం–2<br>ఉదాహరణ – రజ్జుసర్పభ్రాంతి, స్వప్నం, ఇంద్రజాలం, గంధర్వ పట్టణం |
| 6. అజాతి వాదము | – | నిజంగా జీవ జగత్తుల సృష్టి జరగలేదు |
| 7. మిథ్య | – | మిథ్య అంటే విచారణ చేయనంతవరకు ఉండేది. కాంతి వస్తే చీకటి నిలువలేదు. విచారణ చేస్తే మిథ్యకు ఉనికి లేదు. |
| 8. మాయ | – | జగత్ కారణం మాయ<br>జగత్తు మిథ్య కాబట్టి మాయ కూడా మిథ్యే<br>మిథ్య అంటే అసలు లేదని కాదు. అది వ్యావహారిక సత్యం. |
| 9. సంసారం | – | సృష్టే జరగనప్పుడు, జీవే పుట్టనప్పుడు, సంసారం ఎక్కడిది? సంసారం ఉందనుకుని పొరపాటు పడుతున్నాము |
| 10. మౌనవ్యాఖ్యానం | – | జగత్తు మిథ్య కాబట్టి అనిర్వచనీయం<br>బ్రహ్మ నిర్గుణం కాబట్టి అనిర్వచనీయం<br>నిర్గుణం స్థాయికి ఎదిగితే తురీయం, అద్వైతం, సాక్షి, సత్యం పదాలు కూడా వాడలేము. |

# అధ్యాయం - 4 అలాతశాంతి ప్రకరణం-ముఖ్యాంశాలు

**1. మంగళాశాసనము కారికలు 1, 2**

1.1 – ఆదిగురువు, ఐక్యజ్ఞానం ఉన్న పురుషోత్తమునికి నమస్కారములు.

1.2 – అస్పర్శయోగము, సర్వసత్త్వసుఖము, హితము, అవివాదము, అవిరుద్ధము, దేశితము అయిన ఆత్మవిద్యకు నమస్కారములు.

**2. అవివాదము వివరణ కారికలు 3–5**

| **దార్శనికుడు** | **పేరు** | **సిద్ధాంతము** | **ఖండన** |
|---|---|---|---|
| సాంఖ్య | సత్కార్యవాదము | ఉనికి ఉన్న కుండ పుట్టింది | ఉనికి ఉంటే కొత్తగా పుట్టనవసరము లేదు |
| న్యాయ/ వైశేషిక | అసత్కార్యవాదము | ఉనికి లేని కుండ పుట్టింది | ఉనికి లేని కుండ కొత్తగా పుట్టలేదు<br>ఎ) సైన్స్‌పరంగా పుట్టదు<br>బి) వ్యాకరణపరంగా కుదరదు |
| అద్వైతం | అజాతివాదము | అసలు సృష్టే జరగలేదు | పై ఇద్దరూ వారికి తెలియకుండానే అజాతివాదాన్ని సమర్థిస్తున్నారు |

ఈ దార్శనికులు సృష్టి జరిగిందని నిరూపించలేరు. **అజాతివాదము సత్యము.**

**3. వేదాంతసారము కారికలు 6–10**

| **పొరపాటు** | **ఖండన** | **లక్షణం** |
| --- | --- | --- |
| పరమాత్మ జీవాత్మ అయ్యాడు<br>జీవాత్మ మళ్ళీ పరమాత్మ అవ్వాలి | మళ్ళీ పరమాత్మ జీవాత్మ అవదని<br>ఏమిటి నమ్మకం | పరమాత్మ<br>నిర్వికారం |
| పరమాత్మనుంచి జీవాత్మ కిందికి పడ్డాడు.<br>సాధన చేసి ఆ లోకానికి వెళ్ళి పరమాత్మతో<br>ఐక్యం అవ్వాలి | సాధణ చేసి పైకి వెళితే, మళ్ళీ<br>కిందికి వస్తాడు | పరమాత్మ<br>సర్వవ్యాపకం |
| పై కారణాలవల్ల మోక్షం<br>భవిష్యత్తులో వస్తుంది | మోక్షానికి ఒక ఆది ఉంటే ఒక<br>అంతం కూడా ఉంటుంది. అది<br>అనిత్యం అవుతుంది | మోక్షం నిత్యం.<br>అజ్ఞానం తొలగటమే మోక్షం |

**4. సాంఖ్య మతఖండన కారికలు 11-13**

4.1 సాంఖ్యమత సిద్ధాంతము - (ఎ)

సిద్ధాంతం 1 కారణం = కార్యం

- ఈ రెండింటికీ మధ్య అవస్థాభేదం ఉంది తప్ప వస్తుభేదం లేదు.

సిద్ధాంతం 2 కారణం = ప్రకృతి = నిత్యం

సిద్ధాంతం 3 కార్యం = ప్రపంచం = అనిత్యం

4.1.1 ఖండన -

ఎ) కార్యనిత్యత్వ దోషం

కారణం = కార్యం అయితే కారణం = నిత్యం అయితే

కార్యం = నిత్యం అవాలి. కాని కార్యం = అనిత్యం అంటున్నారు

బి) కారణ అనిత్యత్వదోషం

కారణం = కార్యం అయితే, కార్యం = అనిత్యం అయితే

కారణం = అనిత్యం అవాలి కాని కారణం = నిత్యం అంటున్నారు.

4.2 సాంఖ్యమత సిద్ధాంతం - (బి)

ప్రకృతి = మూలకారణం; ప్రకృతి = నిత్యం

4.2.1 ఖండన - యుక్తివిరోధదోషం

కారణత్వం, అనాదిత్వం ఒక వస్తువుకు కుదరదు.

యత్ యత్ కారణం తత్ తత్ అనిత్యత్వమ్

4.3 సాంఖ్యమత సిద్ధాంతం - (సి)

ప్రకృతి = మూలకారణం; కాని ప్రకృతి = సాది

4.3.1 ఖండన - అనవస్థాదోషం

ప్రకృతి మూలకారణం అయినా కూడా అది ఒక కార్యం అవాలి.

ఆ మూలకార్యానికి మూలకారణం ఏది?

కారణాన్ని నిరూపించ లేకపోతే, కార్యం లేదు.

**సాంఖ్యులు సృష్టి జరిగిందని నిరూపించలేరు**

**అజాతివాదము సత్యము**

**5. ద్వైతవాద ఖండన – కారికలు 14–23**

కర్మ సిద్ధాంతంలో వాదనలు

**5.1 కర్మ మూలకారణం**

ఖండన – శరీరం లేకుండా కర్మ చేయటం కుదరదు. భగవంతుడు కర్మ ఇవ్వడు.

**5.2 శరీరం మూలకారణం**

ఖండన – కర్మవల్ల శరీరం వస్తుంది, భగవంతుడు స్వంతంగా శరీరాన్ని ఇవ్వడు.

**5.3 కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు**

ఖండన – కారణం ముందు రావాలి, కార్యం తరువాత కాలంలో రావాలి.

కార్యకారణాలు అన్యోన్యం అయితే కార్యంనుంచి కారణం రాలేదు. ఉదా – తండ్రీ, కొడుకులు.

**5.4 కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టాయి**

ఖండన – ఏకకాలంలో పుడితే కార్య–కారణ సంబంధం కుదరదు.

ఉదా – కవల పిల్లలు

**5.5 కారణ – కార్య ప్రవాహం / కర్మ – శరీరం ప్రవాహం**

కర్మ 1 → శరీరం 1 → కర్మ 2 → శరీరం 2 → కర్మ 3

ఖండన – కర్మ, శరీరాల్లో ఏది ముందు?

శరీరం లేనిదే కర్మ చేయలేరు; కర్మ లేనిదే శరీరం రాదు.

**5.6 కారణ – కార్య – ప్రవాహం అనాది / కర్మ – శరీరం – ప్రవాహం అనాది**

ఖండన **5.6.1** అనాది ఏ పదానికీ సరిపోదు.

కర్మ అనాది కాలేదు – కర్మ చేయటానికి శరీరం కావాలి.

శరీరం అనాది కాలేదు – శరీరానికి ఒక పుట్టినతేదీ ఉంటుంది. అది కర్మవల్ల పుడుతుంది.

ప్రవాహం అనాది కాలేదు – ప్రవాహం అనే వస్తువు లేదు.

**5.6.2 అనాదికి అంతం ఉందా?**

అంతం ఉంటే ఒకరోజు వచ్చిన మోక్షం ఇంకొకరోజు పోతుంది. అప్పుడు మోక్షం అనిత్యత్వం అవుతుంది.

**5.6.3 అనాదికి అంతం లేదా?**

అంతం లేకపోతే మోక్షం పొందలేదు. అది అనిర్మోక్షప్రసంగం అవుతుంది. కర్మ సిద్ధాంతంవల్ల సృష్టి జరిగిందని నిరూపించలేరు. **అజాతి వాదము సత్యము**

**అద్వైతవాద ఖండన**

అజాతి వాదము సత్యము అయితే మీరెందుకు సృష్టి గురించి చెబుతారు?

జవాబు - సృష్టిని పరిచయం చేసి దాన్ని కొట్టివేస్తాము. తాత్కాలికంగా మిథ్యాజాతి వాదము, కాని అజాతి వాదము సత్యము.

**6. కుండ దృష్టాంతంలో వాదనలు**

**6.1** ఘటాత్ ఘటః జాయతే వా - కుండనుంచి కుండ వచ్చిందా?

ఖండన - స్వతః న జాయతే - కుండ, కుండనుంచి రాలేదు

**6.2** పటాత్ ఘటః జాయతే వా - కుండ, బట్టనుంచి వచ్చిందా?

ఖండన - పరతః న జాయతే - కుండ, వేరే దాన్నుంచి రాలేదు.

**6.3** ఘటపటాత్ ఘటః జాయతే వా - కుండ, రెండింటి మిశ్రమంనుంచి వచ్చిందా?

ఖండన - ఉభయతః న జాయతే - అటువంటి మిశ్రమం లేనేలేదు.

**కుండ - మట్టి విశ్లేషణ**

వాదన - కుండ ఈ మూడింటినుంచీ రాలేదు, మట్టినుంచి వచ్చింది.

ఖండన - మట్టి కారణంగా ఉంటే మట్టి, కార్యం అయితే కుండ అనే నామం కొత్తగా వచ్చిందంతే. నామద్వయం, వస్తువు ఏకం. దీనివల్ల కుండ పుట్టలేదు.

**పుట్టుక గురించి వాదనలు**

**6.4** సత్ జాయతే వా - ఉనికి ఉన్న వస్తువు పుడుతుందా?

ఖండన - సత్ న జాయతే - ఉనికి ఉన్న వస్తువు కొత్తగా పుట్టనవసరం లేదు

**6.5** అసత్ జాయతే వా - ఉనికి లేని వస్తువు పుడుతుందా?

ఖండన - అసత్ న జాయతే - ఉనికి లేని వస్తువు కొత్తగా రాలేదు. కర్త లేకుండా కర్మ కుదరదు.

**6.6** సదసత్ జాయతే వా - మిశ్రమంనుంచి వస్తువు పుడుతుందా?

ఖండన - సదసత్ న జాయతే - భిన్నలక్షణాలు ఒక వస్తువులో ఉండవు.

ఉదా. వెలుతురు, చీకటి కలిసి ఉండవు.

ద్వైతవాదులు సృష్టి జరిగిందని నిరూపించలేరు. **అజాతివాదము సత్యము.**

**పూర్వపక్షి వాదనలు**

**6.7** అనాది శరీరమునుంచి కర్మ పుట్టింది.

**6.8** అనాది కర్మనుంచి శరీరం పుట్టింది

ఖండన – దీనికి ప్రమాణం లేదు. కారణం కార్యం అయితీరాలి.
అది లేని కారణము అది ఏదైనా సరే కుదరదు.

**6.9** రెండూ ఒకేసారి అకస్మాత్తుగా పుట్టాయి

ఖండన – కారణం లేకుండా ఏదీ పుట్టలేదు. అలా అకస్మాత్తుగా పుడితే మోక్షం పొందాక కూడా అకస్మాత్తుగా మళ్ళీ సంసారి అవుతాడు. అది అనిర్మోక్షప్రసంగం అవుతుంది. కారణాన్ని నిరూపించలేరు, కాబట్టి కార్యం లేదు అంటే సృష్టి లేదు. పూర్వపక్షులు సృష్టి జరిగిందని నిరూపించలేరు.

**అజాతి వాదము సత్యము**

**అయితే ఈ కనబడే జగత్తు ఏమిటి?**

**ఈ జగత్తు మన అజ్ఞానము తప్ప ఏమీ కాదు. ఇంతకుముందు ఉన్నదీ, ఇప్పుడు ఉన్నదీ, ఇకముందు ఉండబోయేదీ బ్రహ్మే. కార్య–కారణ విలక్షణ తురీయం బ్రహ్మ**

**7. బౌద్ధమత ఖండన – కారికలు 24–28**

01. సౌత్రాంతిక మతము – బాహ్యార్థ ప్రత్యక్ష వాదినః

02. వైభాషిక మతము – బాహ్యార్థ అనుమాన వాదినః

03. యోగాచార మతము – బాహ్యార్థ అభావ వాదినః

04. మాధ్యమిక మతము – సర్వార్థ అభావ వాదినః

**7.1 సౌత్రాంతిక మతము**

– బాహ్యప్రపంచం ఉంది

– అది చూసే నాకు భిన్నంగా ఉంది

– అది సత్యం

– దాన్ని ప్రత్యక్షప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు

**7.2 వైభాషిక మతము**

– బాహ్యప్రపంచం ఉంది

– అది చూసే నాకు భిన్నంగా ఉంది

– అది సత్యం

– దాన్ని అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు

సౌత్రాంతిక, వైభాషిక మతాలను కలిపి హీనయాన మతము అంటారు.

**7.3 యోగాచార మతము**

- చూసే నాకు భిన్నంగా బాహ్యప్రపంచం లేదు
- చూసే నేను ఉన్నాను
- నేను సత్యం
- నేను క్షణిక విజ్ఞాన ప్రవాహాన్ని

**7.4 మాధ్యమిక మతము**

- బాహ్యప్రపంచం లేదు
- చూసే నేను కూడా లేను
- అంతా శూన్యమే

**7.5 హీనయాన వాదన**

01. మనకు ఒక విషయం గురించిన జ్ఞానం కలిగితే, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉండాలి.

02. మనకు ఒక విషయం గురించిన భావోద్రేకం కలిగితే, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉండాలి.

**7.6 హీనయాన మతఖండన**

యోగాచారమతం చేసిన ఖండన ద్వారా గౌడపాదాచార్యులవారు ఖండన చేశారు.

1. నిజమే, తార్కికంగా చూస్తే ప్రతి ఒక్క జ్ఞానానికి, దానికి సంబంధించిన బాహ్యవస్తువు ఉండాలి.

2. కాని, స్వరూపలక్షణం చూస్తే, బాహ్యవస్తువు అంటూ లేదు. దానికి ఉదాహరణ-

**స్వప్నదృష్టాంతం**

స్వప్నంలో జ్ఞానము ఉంది, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉంది.

కాని స్వప్నంనుంచి లేస్తే జ్ఞానమూ లేదు, వస్తువూ లేదు. దాన్ని జ్ఞాన అధ్యాస, అర్థ అధ్యాస అంటారు.

అలాగే ఉన్నతస్థాయికి లేస్తే పదార్థమూ లేదు, పదమూ లేదు. ఆ విధంగా బాహ్యప్రపంచం మిథ్య.

**7.7 యోగాచార మతం**

- చూడబడే జగత్తు మిథ్య
- చూసే నేను సత్యం

– నేను విజ్ఞానాన్ని / చైతన్యాన్ని
– నేను క్షణిక విజ్ఞానప్రవాహాన్ని. ఉదా. జీవనది, అఖండజ్యోతి

### 7.8 యోగాచార మత ఖండన

అద్వైతం ప్రకారం నేను నిత్య, సత్యచైతన్యాన్ని.
సూత్రం – ఒకదాని రాకపోకల గురించి మాట్లాడాలంటే, చూసే వ్యక్తికి రాకపోకలు ఉండకూడదు. యోగాచారులు చెప్పే క్షణికవిజ్ఞానం క్షణికవృత్తి మాత్రమే. చైతన్యం నిత్యచైతన్యం.

### 8. వేదాంతసారం – కారికలు 29–46

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**
మాండూక్యసారం – **కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యం అహమస్మి**
అజాతివాదము – అజం అంటే దేశకాల అతీతము; బ్రహ్మ నిత్యనిర్వికారము.
బ్రహ్మ నిర్వికారం అయితే కారణం అవటానికి కుదరదు. అందువల్ల జగత్తు పుట్టలేదు.
జగత్తు – జాగ్రద్ ప్రపంచం + స్వప్నప్రపంచం – రెండూ మిథ్య

**స్వప్నప్రపంచ మిథ్యాత్వం**

ఎ) స్వప్నప్రపంచః మిథ్యా ఉచిత దేశకాల అభావాత్ దర్పణస్థ హస్తివతు – యుక్తిప్రమాణం
బి) స్వప్నంనుంచి లేస్తే స్వప్నం జరుగుతున్న చోట లేవము – అనుభవప్రమాణం
సి) స్వప్నంలో చూసిన రథాలు, గుర్రాలు, మార్గాలు మనస్సు సృష్టించినవే – శ్రుతిప్రమాణం
డి) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో స్నేహితునితో మాట్లాడివుంటే, అది నిజం కాదని తెలుస్తుంది.
ఇ) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో కానుక పొందితే, ఆ కానుక మాయమవుతుంది.
ఎఫ్) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో ఉన్న శరీరం వేరు, మంచంమీద పడుకున్న శరీరం వేరు అని తెలుస్తుంది.

**బాహ్యప్రపంచ మిథ్యాత్వం**

మిథ్య అంటే అసలు ఉనికి లేదు అని కాదు అర్థం. అది వ్యావహారిక సత్యం అవుతుంది.
ఎ) జాగ్రద్ ప్రపంచంవల్ల ప్రయోజనం ఉంది, అది నాకు భిన్నంగా ఉంది, నేను చూడకపోయినా ఉంది, స్పష్టత ఉంది. కాని అది సాపేక్షిక సత్యం మాత్రమే.
బి) జాగ్రద్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్
సి) జాగ్రద్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్నప్రపంచవత్

డి) జాగ్రద్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య కారణ-కార్య సంబంధం ఉంది. స్వప్నప్రపంచం మిథ్య కాబట్టి జాగ్రద్ ప్రపంచం కూడా మిథ్య.

ఇ) కారణ జాగ్రద్ ప్రపంచం మిథ్య, కాబట్టి దాన్నుంచి వచ్చిన కార్య, స్వప్నప్రపంచం కూడా మిథ్య.

ఎఫ్) జాగ్రద్ ప్రపంచం స్వాప్నికునికి మిథ్య; స్వప్నప్రపంచం జాగ్రద్ పురుషునికి మిథ్య; అందువల్ల రెండూ ఆపేక్షిక సత్యాలే.

**మిథ్య నిర్వచనం –**

జగత్ మిథ్య అంటే సృష్టి నిజంగా జరగలేదు. కార్యం లేకపోతే బ్రహ్మ కారణం కాదు. చూసే కుండ నిజానికి మట్టికుండ కాదు. అది కుండగా ఉన్న మట్టి. కనబడే జగత్తు నిజానికి జగత్తు కాదు. అది జగత్తుగా ప్రకటితమవుతున్న బ్రహ్మ.

సృష్టి జరిగిందీ అంటే మూలకారణం చూపించాలి. అది చూపించలేకపోతున్నారు.

**అందువల్ల అజాతివాదము సత్యము.**

**9. అజాతివాదము – విశ్లేషణ**

**9.1 కార్యపరంగా –** స్వప్నంనుంచి లేస్తే స్వప్నం మిథ్య; జాగ్రదావస్థనుంచి స్వప్నానికి వెళితే జాగ్రద్ ప్రపంచం మిథ్య. ఈ రెండు ప్రపంచాలూ మిథ్య – ఇది మిథ్యాసృష్టి వాదము.

**9.2 కారణపరంగా –** తురీయం బ్రహ్మ అద్వైతం, నిర్వికారం

నిర్వికారం బ్రహ్మ కారణం కాలేదు. కారణం కావాలంటే అది సవికారం అవ్వాలి.

బ్రహ్మ కాలాతీతం; కార్య-కారణాలు కాలంలో జరగాలి.

అందువల్ల నిజంగా సృష్టి జరుగలేదు – ఇది అజాతి వాదము.

**9.3 కార్యకారణ సంబంధం పరంగా –** జగత్తుకు-బ్రహ్మకు కార్యకారణ సంబంధం నాలుగు విధాలుగా లేదు.

ఎ) అసత్ వస్తువునుంచి అసత్ వస్తువు రాలేదు

బి) అసత్ వస్తువునుంచి సత్ వస్తువు రాలేదు

సి) సత్ వస్తువునుంచి సత్ వస్తువు రాలేదు

డి) సత్ వస్తువునుంచి అసత్ వస్తువు రాలేదు

**సత్ వస్తువునుంచి సత్ వస్తువు రాలేదు –** కార్యకారణ సంబంధం ఉండాలంటే రెండు భిన్నవస్తువులు, విడిగా ఉనికి ఉన్నవి ఉండాలి. కుండ మట్టినుంచి వచ్చినా, కుండకు విడిగా ఉనికి లేదు. అంటే మట్టి, కుండ రెండు పేర్లు కాని వస్తువు ఒకటే.

**అందువల్ల జగత్ మిథ్య, బ్రహ్మ సత్యం – ఇది అద్వైతం**

**10. అలాత దృష్టాంతం – కారికలు 47–56**

అలాతం – దివిటీ / కాగడా; అకారాలు – ఆభాస; కదలిక – స్పందనం

10.1 అలాతం స్పందనంవల్ల ఆభాస ఏర్పడుతుంది

| **అలాతం** | **ఆభాస** | **బ్రహ్మ** | **జగత్తు** |
|---|---|---|---|
| ఏకం | అనేకం | ఏకం | అనేకం |
| స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం | స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం |
| కారణం | కార్యం | కారణం | కార్యం |
| స్వతంత్రం | పరతంత్రం | స్వతంత్రం | పరతంత్రం |

10.2 అలాతం స్పందించినప్పుడు ఆకారాలు అలాతం లోపలినుంచి రావు.
అలాతం స్పందించినప్పుడు ఆకారాలు బయటనుంచి రావు.
అలాతం శాంతించినప్పుడు ఆకారాలు బయటకు పోవు.
అలాతం శాంతించినప్పుడు ఆకారాలు అలాతం లోపలకు పోవు.
ఇదే సూత్రం బ్రహ్మకు జగత్తుకు వర్తిస్తుంది.

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యం అహమస్మి**

సంబంధం ఉండాలంటే రెండు వస్తువులు ఉండాలి, ఒకేస్థాయికి చెందివుండాలి.

**అజాతివాదము సత్యం**

ఈ సత్యానికి లేస్తే సంసారం బంధించదు.

10.3 నాలుగు దశలు

1. ఆకారాలకు విడిగా ఉనికి లేదు కాబట్టి, ఆకారాలను ఖండిస్తాము
2. ఆకారాలను ఖండిస్తే, ద్వైతం లేదు
3. ద్వైతం లేకపోతే, కార్యకారణ సంబంధం లేదు
4. కార్యకారణ సంబంధం లేకపోతే, మిగిలేది అద్వైత అలాతం.

ఈ సూత్రాన్ని జగత్తుకూ, బ్రహ్మకూ అన్వయించి చూద్దాము.

1. జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి, జగత్తును ఖండిస్తాము
2. జగత్తును ఖండిస్తే, ద్వైతం లేదు
3. ద్వైతం లేకపోతే, కార్యకారణ సంబంధం లేదు
4. కార్యకారణ సంబంధం లేకపోతే, మిగిలేది అద్వైతతురీయం, చైతన్యం.

**కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్**

**11. వేదాంతసారం ఇంకొకసారి - కారికలు 57-74**

మిథ్యా జగత్తు పుట్టింది - మిథ్యా సృష్టివాదము

జగత్తు నిజంగా పుట్టలేదు - అజాతివాదము

**దృక్ దృశ్యవివేకం (63-67)**

సూత్రం 1 చైతన్యం - ఎప్పటికీ దృక్, ఎన్నటికీ దృశ్యం కాదు.

మనస్సు - జగత్తు పరంగా దృక్, చైతన్యపరంగా దృశ్యం

జగత్తు - దృశ్యం మాత్రమే, ఎన్నటికీ దృక్ కాదు

సూత్రం 2 దృక్ చూస్తేనే దృశ్యానికి ఉనికి ఉంది.

కాబట్టి దృక్ సత్యం, దృశ్యం మిథ్య

**యత్ దృశ్యం తత్ మిథ్యా ఘటవత్**

దశ 1 - మనస్సు - జగత్తు జంటను చూద్దాము

సూత్రం 1 ప్రకారం - మనస్సు దృక్, జగత్తు దృశ్యం

సూత్రం 2 ప్రకారం - మనస్సు సత్యం, జగత్తు మిథ్య

**ప్రపంచః మిథ్యా చిత్త దృశ్యత్వాత్ స్వప్నవత్**

దశ 2 - చైతన్యం -మనస్సు జంటను చూద్దాము

సూత్రం 1 ప్రకారం - చైతన్యం దృక్, మనస్సు దృశ్యం

సూత్రం 2 ప్రకారం - చైతన్యం సత్యం, మనస్సు మిథ్య

**చిత్తం మిథ్యా సాక్షి దృశ్యత్వాత్ స్వప్నవత్**

దశ 3 దశ 1 పరంగా - జగత్తు మిథ్య

దశ 2 పరంగా - మనస్సు మిథ్య

అందువల్ల చైతన్యం సత్యం; జగత్తు, మనస్సు మిథ్య

**సాక్షిః సత్యః అదృశ్యత్వాత్ వ్యతిరేకేన స్వప్నవత్**

**12. సంసారకారణం, సంసారనివృత్తి సాధనం - కారికలు 75-86**

**12.1 అజ్ఞానం → అహంకారం → కామం → కర్మ → కర్మఫలం → సుఖదుఃఖాలు → పునరపి జననం పునరపి మరణం = సంసారం**

1. అజ్ఞానం ఒక్కటే కారణం కాదు - కేవలం అజ్ఞానంవల్ల సమస్య లేదు. అజ్ఞానం పొరపాటుకి / అధ్యాసకు దారితీస్తుంది.
2. పొరపాటు ద్వైతప్రపంచాన్ని చూపిస్తుంది. దానివల్ల కూడా సమస్య లేదు.
3. పొరపాటు తీవ్రమైన మమకారానికి దారితీస్తుంది - **అభినివేశః**

అజ్ఞానజన్య అభూత అభినివేశః సంసారస్య కారణమ్
కారణ నాశే కార్యనాశః అజ్ఞాన నాశే సంసారనాశః
అజం, అనిద్రం, అస్వప్నం = తురీయం
స్థూల, స్వప్న, కారణ శరీరం కాదు = తురీయం శరీరత్రయ విలక్షణం
ఈ జ్ఞానం పొందితే మిథ్యాత్వ దర్శనం కలుగుతుంది.
అజ్ఞానం నాశనం అయి మోక్షం పొందుతారు.
జ్ఞానం పొందితే చాలదు, జ్ఞాననిష్ఠలో నిలబడాలి.
జ్ఞాననిష్ఠలో నిలబడకపోతే – మహాజ్ఞాని కూడా మహా అజ్ఞాని అవుతాడు.
జాగ్రత్ ప్రపంచంతో వ్యవహారం నడుపుతాడు కాబట్టి రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవాలి.

### 12.2 మోక్షం

1. నేను తురీయాన్ని అనే జ్ఞానం పొందాలి.
2. నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞ అనుకునే అధ్యాస పోవాలి

### 12.3 మోక్షఫలం

1. **జ్ఞానఫలం** – శాంతం, శివం, అద్వైతం తురీయం నేను అనే జ్ఞానం బుద్ధిలో కలుగుతుంది. దానివల్ల సర్వజ్ఞత్వప్రాప్తి, బ్రాహ్మణత్వప్రాప్తి, బ్రహ్మప్రాప్తి, పూర్ణత్వప్రాప్తి పొందుతాడు.
2. **జీవన్ముక్తి** – వినయం, శమం, దమం, విలువలు సహజంగా పెరుగుతాయి.

### 13. మాండూక్యోపనిషత్తు సారం కారికలు 87–89

| | | |
|---|---|---|
| లౌకికం | – జాగ్రదావస్థ | – అనుభవం, వస్తువు రెండూ ఉన్నాయి |
| శుద్ధం లౌకికం | – స్వప్నావస్థ | – అనుభవం ఉంది, వస్తువు నిజంగా లేదు |
| లోకోత్తరం | – సుషుప్తి అవస్థ | – అనుభవం లేదు, వస్తువు లేదు |

మూడు అనుభవాలు (త్రివిధం జ్ఞానమ్), మూడు వస్తువులు (త్రివిధం జ్ఞేయమ్) మిథ్య. ఇది తెలుసుకున్న జ్ఞాని సర్వాత్మక బ్రహ్మస్వరూపం పొందుతాడు.

### 14. సాధనలు – కారిక 90

1. హేయం – జగత్తు మిథ్య
2. జ్ఞేయం – తురీయం సత్యం
3. ఆప్యం – సాధన చతుష్టయ సంపత్తి, విలువలు, శ్రవణ, మనన, నిదిధ్యాసనలు.
4. పాక్యం – రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవాలి. వేయించిన గింజలాగ ఉండాలి. తురీయం సత్యం అని తెలుసుకున్నాక (జ్ఞేయాన్ని తెలుసుకున్నాక) హేయం, ఆప్యం, పాక్యాలను వదిలివేయాలి.

## 15. ఉపసంహారం - కారికలు 91-100

నేను కోరే శాంతి, భద్రత, పూర్ణత్వాలు నా స్వరూపం.
నేను అనాదిగా శాంతం, శివం, అద్వైతం.
నేను సాక్షి + అహంకారాల (ప్రమాతల) మేలుకలయికను. ప్రమాతగా -
**జ్ఞాన అయోగ్యత → జ్ఞాన యోగ్యత → జ్ఞాని → జ్ఞాననిష్ఠ** దశల్లో ప్రయాణిస్తాను. జ్ఞాననిష్ఠలో నిలబడ్డాక ప్రమాతను కాను. ప్రయాణం లేదు. అశుద్ధం లేదు. సంసారం లేదు. నేను నిత్య, ముక్త, శుద్ధ తురీయాన్ని.

### తురీయ వర్ణన

దుర్దర్శం, అతిగంభీరం, అజం, సామ్యం, విశారదం, అనానాత్వం (నానాత్వం లేనిది).
ఆ పారమార్థిక స్థాయికి ఎదిగాక సాక్షి, అద్వైతం, సత్యం, నిత్యం, చైతన్యం, శాశ్వతం పదాలు కూడా వాడలేము.
ఇవి వాడాలంటే వాటికి భిన్నంగా సాక్ష్యం, ద్వైతం, మిథ్య, అనిత్యం, జడం, అశాశ్వతం పదాలు ఉండాలి - అవి వ్యావహారికంలోనే చెల్లుతాయి.
పారమార్థిక స్థాయిలో ఉన్నదొకటే తురీయచైతన్యం - ఏకమేవాద్వితీయం
ఆ తురీయానికి నేను నమస్కారము చేస్తున్నాను - గౌడపాదాచార్యులు.
నమస్కారం చేస్తున్నాను అంటే తురీయజ్ఞానాన్ని నేను పొందాను -

**జ్ఞాన ఆర్జనమేవ నమస్కారః.**

బుద్ధ్వా నమస్కుర్మః - తురీయాన్ని నేనే అని తెలుసుకున్నాను. ఆత్మత్వేన బుద్ధ్వా నమస్కుర్మః
జ్ఞానాగ్నిలో నా మూడు వేషాలను, అవస్థలను ప్రపంచాలను ఆహుతులుగా వేస్తున్నాను.
జ్ఞానఫలం - **కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి**
**అవస్థాత్రయ సాక్షి తురీయ చైతన్యమ్ అహమస్మి**

# బంగారము - ఆభరణముల విశ్లేషణ

## దశ 1

| పదములు | పదార్థములు |
|---|---|
| గాజు |  |
| గొలుసు |  |
| ఉంగరము |  |

---

# బంగారము - ఆభరణముల విశ్లేషణ

## దశ 2

| పదములు | పదార్థములు |
|---|---|
| గాజు |  |
| గొలుసు |  |
| ఉంగరము |  |
| బంగారము | |

## బంగారము - ఆభరణముల విశ్లేషణ

## దశ 3

| పదములు | పదార్థములు |
|---|---|
| గాజు | బంగారము |
| గొలుసు | బంగారము |
| ఉంగరము | బంగారము |

**పదార్థాలను నిషేధించాము**

---

## బంగారము - ఆభరణముల విశ్లేషణ

## దశ 4

| పదములు | | పదార్థములు | |
|---|---|---|---|
| గాజు | × | × | |
| గొలుసు | × | × | |
| ఉంగరము | × | × | |
| బంగారము | ✓ | బంగారము | ✓ |

**ఇప్పుడు పదాలకు విలువ లేదు**

# బంగారము - ఆభరణముల విశ్లేషణ

## దశ 5

| **పదములు** | **పదార్థములు** |
|---|---|
| గాజు |  |
| గొలుసు |  |
| ఉంగరము |  |

**మిగిలేది ఒకటే - అధిష్ఠానమైన బంగారము**

# కుండ మట్టి - జీవన్ముక్తి

మనిషి ఏం చేసినా శాంతి, సుఖం, భద్రతకోసమే చేస్తూంటాడు. అవి వస్తువుల్లోనూ, పరిస్థితుల్లోనూ, మనుషుల్లోనూ, సంఘటనల్లోనూ ఉందనుకుంటాడు. తన స్వరూపమే శాంతి, సుఖం, భద్రత అని తెలుసుకోలేక, బాహ్యంగా పరుగులు తీస్తూంటాడు. కస్తూరిమృగం తనలో సువాసన పెట్టుకుని బయట ఎక్కడో ఉందని, వెతికి, వెతికి అలసి సొలసి చనిపోతుందిట. సరిగ్గా మనిషి కూడా అలానే చేస్తాడు. తనే ఆనందస్వరూపం అని గ్రహించడు.

కుండకు ఎవరో చెప్పారు. నీ గురించి నువ్వు తెలుసుకో! స్వరూపంగా నువ్వెవరో తెలుసుకో! స్వరూపతః నువ్వు మట్టివి. మట్టిని తెలుసుకుంటే, వెంపర్లాట, ఆరాటం పోయి జీవన్ముక్తి పొందుతావు అని చెప్పారు.

వెంటనే కుండ మూటాముల్లే సర్దుకుని స్వరూపంగా మట్టిని చూద్దామని చార్‌ధామ్ యాత్రకు బయలు దేరింది. యాత్ర అంతా పూర్తి అయింది కాని స్వరూపంగా మట్టి మాత్రం కనపించలేదు. యజ్ఞయాగాదులు చేసింది మట్టి జాడే తెలియలేదు. ధ్యానం చెయ్యాలన్నారెవరో! ధ్యానం లోనూ మట్టి కనపడలేదు.

కుండ మట్టిని వెతకాలి. ఎలా?

మట్టి ఎక్కడ ఉంది?

కుండ లోపల ఉందా?

కుండ బయట ఉందా?

కుండ మధ్యలో ఉందా?

అసలు కుండకు మట్టికి దూరం ఎంత?

కుండ అంతటా మట్టే. మట్టి తప్ప కుండే లేదు. కుండకు మట్టికి దూరం ఏమిటి? అవి రెండు వస్తువులైతే కదా! మట్టినే కుండ అంటున్నాం.

కుండగా పరిమితత్త్వం, అల్పత్వం, అశాశ్వతత్త్వం ఉన్నాయి.

అదే మట్టిగా అపరిమితత్త్వం, అనల్పత్వం, శాశ్వతత్త్వం. అదే జీవన్ముక్తి.

ఇప్పుడు కుండ ఏం చేయాలి? అంతటా వెతకాలా?

పూజలు చేయాలా? ధ్యానం చేయాలా?

నేనే మట్టిని అని తెలుసుకుంటే చాలు. కుండ తయారుకాక ముందూ మట్టే, కుండగానూ మట్టే, కుండ పగిలినా మట్టే. మట్టిగా దానిలో ఏ మార్పూ లేదు. దానికి పుట్టుకా లేదు, మరణం లేదు. అదే కుండయితే మరణం, పుట్టుక తప్పవు.

అదే మాదిరిగా జీవుడు తను స్వరూపతః బ్రహ్మను అని తెలుసుకుంటే, తనే ఆనంద స్వరూపమని తెలుసుకుంటాడు. అదే జీవన్ముక్తి. జీవుడు ఎప్పుడూ ముక్తుడే. ఆ విషయం తెలుసుకోవడమే తరువాయి. దీనినే శాస్త్రం ప్రాప్తస్య ప్రాప్తం అంటుంది. **మోక్షం సిద్ధవస్తువు, సాధ్యవస్తువు కాదు.**

## రాణిగారు – నెక్లెస్

**కంఠ చామీకర న్యాయం** – ఒక రాజ్యంలో రాణిగారు చాలా ఖరీదైన నెక్లెస్ విదేశాలనుంచి తెప్పించుకున్నారు. అకస్మాత్తుగా ఆ నెక్లెస్ కనిపించడం లేదు. రాణిగారికి చాలా ప్రీతికరమైన నెక్లెస్ మాయమయింది. దానిమీద మోజు తీరకుండానే పోయింది. దానితో రాణిగారు విపరీతమైన ఆవేదన చెందారు. సేవకులతో రాజప్రాసాదమంతా అడుగడుగునా గాలింపు చేయిస్తున్నారు.

ఎంతవెతికినా ప్రయోజనం కన్పించలేదు. మంత్రి ఏమైనా మార్గం చూపుతాడేమోనని పిలిపించారు. మంత్రిగారు అసలు విషయం వాకబు చేస్తే రాణిగారి నెక్లెస్ పోయిందని తెలిసింది. రాణిగారిని చూడగానే మంత్రిగారికి నెక్లెస్ జాడ తెలిసిపోయింది. వెంటనే మంత్రి అమ్మా మీ సేవకులను వెతకడం ఆపమనండి అన్నారు.

మంత్రి తెలివితేటలమీద అచంచలమైన విశ్వాసం ఉన్న రాణిగారు చప్పట్లు కొట్టి నెక్లెస్ గురించి వెతకడం ఆపింది.

"అమ్మా రాణిగారూ! మీ మెడను ఒకసారి తడుముకోండి," అన్నారు మంత్రి. అప్పుడు రాణిగారికి మెడ తడుముకోకుండానే నెక్లెస్ బరువు తెలిసింది. ఆమె తన మెడలోనే నెక్లెస్‌ను పెట్టుకుని, ఊరంతా వెతుకుతోంది. తనదగ్గరే వున్న నెక్లెస్ బయట ఎలా దొరుకుతుంది? విశ్వమంతా ఎంత వెతికినా దొరకదు. ఈ సమస్యకు పరిష్కారం – నెక్లెస్ పోయింది అనే అజ్ఞానం తొలిగి తన దగ్గరే, మెడలోనే ఉందని తెలిస్తే చాలు. **దీనినే కంఠచామీకర న్యాయం అంటారు.** ఇది తెలిస్తే ఇక ఎటువంటి ఆందోళన ఉండదు. కంఠచామీకరం అంటే నెక్లెస్ అని అర్థం.

సరిగ్గా ఇలాగే జీవుడు తనే స్వరూపతః బ్రహ్మనని తెలుసుకోలేక జన్మ జన్మలనుంచి బ్రహ్మను వెతుకుతూనే ఉన్నాడు. మన దగ్గరే **కోహినూర్ డైమండ్** ఉంది. దానిని అజ్ఞానంతో **పేపరు వెయిట్‌లా** వాడుతున్నాము.

**ప్రయోజనం:** నేనే శాంతి, సుఖం, ఆనందాలకు నెలవు అని తన పూర్ణత్వం దర్శించిన జ్ఞానికి ఎటువంటి వెలితి లేదు. అతను ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి, ఆత్యంతిక ఆనందం అనుభవిస్తాడు.

**– రాఘవ రావు**

# మనసా శిరసా వందనాలు

## ప్రస్థానత్రయ గ్రంథరాజాలు తేటతెనుగులో విరాజిల్లుతున్న వేళ

– శాస్త్రప్రమాణాన్ని మానవాళికి వైదిక జీవన విధానంగా స్వయంగా అందజేసిన
  **పరమాత్మకు** సదా వందనాలు

– అద్వైత వేదాంతాన్ని ప్రస్థానత్రయంగా మలచి విస్తరింపజేసిన
**ఆదిశంకరులవారికి** సహస్ర వందనాలు

– అహం బ్రహ్మ అస్మి స్వస్వరూప జ్ఞానాన్ని విశేషంగా బోధిస్తున్న అనన్య గురువు
**శ్రీ పరమార్థానంద స్వామీజీకి** శతకోటి వందనాలు

**– రాఘవరావు రాజ్యశ్రీ దంపతులు**

# అభినందన మందార మాలలు

– శాస్త్రాన్ని ప్రమాణంగా చేసుకుని బోధిస్తున్న గురుపరంపరకు
– సులభశైలిలో బోధిస్తున్న శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువు పరమార్థానంద స్వామీజీకి
– నిండుమనస్సుతో దీవిస్తున్న స్వామీజీలు, స్వామినీల అండదండలకు
– మా అద్వైత వేదాంత బోధకు బాటవేసిన ఎందరో మహనీయులకు
– గ్రంథాల ప్రచురణకు బ్రహ్మయజ్ఞం పేరిట చేయూతనందించిన దాతలకు
– గ్రంథాలను అంగరంగవైభవంగా తీర్చిదిద్దిన హితులు, సన్నిహితులు, మిత్రులకు
– ఆత్మవిద్యకు ఆర్ష విద్యా తరంగిణి ట్రస్టును స్థాపించిన మూలవిరాట్టులకు
– ఒక చిన్నమాట, ఒక ప్రోత్సాహం, ఒక మెప్పు, ఒక ప్రశంస, ఒక అభినందన ఎల్లవేళలా కురిపిస్తున్న పెద్దలకు, ఆత్మీయులకు, శ్రేయోభిలాషులకు
– స్వస్వరూపజ్ఞానం అందుకుని జీవన్ముక్తి చవిచూస్తున్న అందరికీ
  **ప్రస్థానత్రయ గ్రంథకుసుమాలు ఆర్ష విద్యా తరంగిణి నందనంలో విరబూసిన శుభసందర్భంలో–**

**అభినందన మందార మాలలు**

**– రాఘవరావు రాజ్యశ్రీ దంపతులు**

## ఆర్ష విద్యా తరంగిణి పుస్తక ప్రచురణలు

**ప్రకరణ గ్రంథాలు**

01. అద్వైతవేదాన్త పరిచయము
02. భజగోవిన్దమ్
03. దృగ్దృశ్య వివేకము

**శ్రుతి గ్రంథాలు**

01. ముండకోపనిషత్
02. కఠోపనిషత్
03. తైత్తిరీయోపనిషత్
04. ప్రశ్నోపనిషత్
05. ఈశావాస్యోపనిషత్
06. ఐతరేయోపనిషత్
07. ఛాందోగ్యోపనిషత్
08. కేనోపనిషత్
09. కైవల్యోపనిషత్
10. బృహదారణ్యకోపనిషత్
11. మాండూక్యోపనిషత్

**స్మృతి గ్రంథము**

01. శ్రీమద్భగవద్గీత మొదటి షట్కము
02. శ్రీమద్భగవద్గీత రెండవ షట్కము
03. శ్రీమద్భగవద్గీత మూడవ షట్కము

**న్యాయ గ్రంథము**

బ్రహ్మసూత్రములు – చతుస్సూత్రీ

**ఇతర గ్రంథము**

01. వేదాంత జీవన విధానము – 01